

ఒక ప్రత్యామ్నాయ చరిత్ర

# హిందువులు

వెండీ డోనిగర్

## ప్రముఖుల అభిప్రాయాలు

"సుప్రసిద్ధ సంస్కృత కావ్యాలు చెప్పిన కథనానికి ప్రత్యామ్నాయ కథనాన్ని" చెప్పాలనే పెద్ద లక్ష్యాన్ని డోనిగర్ తన ముందుంచుకున్నారు. తను స్వయంగా చెప్పినట్లు ఈ రచన "కేవలం బ్రాహ్మణులు, సంస్కృతం, భగవద్గీత గురించి కాదు." అదే విధంగా, "లెక్కలేనన్ని హిందూ ఆలయాలను ధ్వంసం చేసి లక్షలాది మంది భారతీయులను బలవంతంగా మతమార్పిడి చేసిన వంచకులైన ముస్లింల" గురించి కూడా కాదు. ఈ రోజున భారతదేశపు మతాల గురించి దేశ విదేశాలలో శక్తివంతమైన నిర్వచనాలు చెప్తున్న హిందూ జాతీయవాదుల రాజకీయ శాస్త్రం గురించి డోనిగర్‌కు తెలియదను కోలేము. ఇవన్నీ తెలిసిన ఆమె "వారు చెప్పే హిందూ చరిత్రకు ప్రత్యామ్నాయాన్ని" చెప్పదలచుకున్నారు.

ఆమె భక్తి సంప్రదాయం గురించి చాలా వివరంగా రాసారు. హిందూ మత భావనలో ఈ భక్తి సంప్రదాయం ఎంతో పారవశ్యతతో, సమభావనతో కూడినటువంటిది. రాచరిక కుటుంబాలు, సాహితీపరులైన వారి వారసులు కూడా భక్తి సంప్రదాయంలో ఉన్నప్పటికీ అదే సమయంలో దానిలో "జానపద, మౌఖిక ధోరణులు" కనిపిస్తాయి. స్త్రీలకు, నిమ్నవర్గాలకు, నిరక్షరాస్యులకూ చోటు ఉంటుంది. హిందువులలో తీవ్రవైఖరి గలవారికి ప్రధాన గ్రంథమైన రామాయణంలోని వానరులలో "మానవుల స్పృహ" ఏ విధంగా ప్రతిఫలించిందనే అన్వేషణ, రావణుని పట్ల సానుభూతి ఇందులో కనిపిస్తాయి. భారతీయ సంప్రదాయాలలో అనేక అపోహలకు గురైన తంత్ర శాస్త్రంలోని పౌరాణికతను, సంప్రదాయాలను సైతం ఆమె పరిశీలించారు.

**– పంకజ్ మిశ్రా, న్యూయార్క్ టైమ్స్**

భారతదేశపు సుదీర్ఘ చరిత్రలో డోనిగర్‌కు కన్పించిన అర్థవంతమైన కాల్పనిక ధోరణులు ఏమిటి? అందుకు సూచన ఈ పుస్తక ఉప శీర్షికగా పేర్కొన్న 'ప్రత్యామ్నాయ చరిత్ర' అనే మాటలోనే ఉంది. ప్రత్యామ్నాయ వైద్య విభాగం, ప్రత్యామ్నాయ రాజకీయాలు అన్న తరహాలో ఆ మాటకు అర్థం ఈ చరిత్రను కొన్ని సుస్థిర ప్రమాణాలకు లోబడి, సంప్రదాయిక దృష్టితో, ఆయా సామాజిక అంతరాలకు అనుగుణంగా ఇంతకాలం చెప్పిన పద్ధతిని తలకిందులు చేయటమన్నమాట. జీవితానికి, సమాజానికి అంచుల వెంట జీవించేవారి దృష్టితో భారతదేశపు చరిత్రను చెప్పటం ఇందులో చాలావరకు కన్పిస్తుంది. అటువంటివారు ప్రధానంగా స్త్రీలు, నిమ్నకులాలవారు, ఆదివాసీలు, అస్పృశ్యులంటూ పిలవబడిన దళితులు. వారితో పాటు రచయిత్రి సాధుసన్యాసులు, మాంత్రికులు, పరశువేదులు, కవులు, రకరకాల యోగులు, సంప్రదాయానికి భిన్నమైన బ్రాహ్మణులు, సంస్కర్తలు, స్థానిక సమాజాలలో భాగంగా మారిన వలస వ్యాపారులూ అధికారుల దృష్టితో విషయాన్ని పరిశీలించారు. తొలిదేశ పాశ్చాత్య ఓరియెంటలిస్టులతో సహా వక్రభాష్యాలు చెప్పిన విద్యావేత్తలు, అసాధారణమైన మైథునాచారాలు గల తాంత్రిక సంప్రదాయాలు, చివరగా

జంతువులు, ముఖ్యంగా అశ్వాలు (వాటితో పాటు శునకాలు, వానరులు, ఎలుగుబంట్లు, గోవులు కూడా) మనకు ఇందులో కనిపిస్తాయి. నిజానికి వేదకాలం నుంచి మొదలుకొని ముఖ్య గ్రంథాలన్నింటిలో ఇవి ఉన్నవే.

**– డేవిడ్ షుల్మన్, న్యూయార్క్ రివ్యూ ఆఫ్ బుక్స్**

కాలక్రమానుసారం చూసినట్లయితే, అయిదువేల సంవత్సరాల హిందూమత చరిత్రను డోనిగర్ మనను అందులో లీనమయే విధంగా రచించారు. హిందూ మతంపై ఇంగ్లీషులో ప్రామాణిక చరిత్ర రచనలు అనేకం ఉన్నాయి. కాని డోనిగర్ 'ప్రత్యామ్నాయ చరిత్ర' రచనకు పూనుకొన్నారు. 'ప్రత్యామ్నాయ' అనేమాట సమాజపు అంచులలో జీవించే స్త్రీలకు, నిమ్నకులాలకు, వారితోపాటు జంతు జాలానికి వర్తిస్తుంది. బ్రాహ్మణ సమాజానికి చెందినవారు తమ దృక్పథానికి అనుకూలంగా రాసిన చరిత్రలకు ఇది భిన్నమైంది. సంస్కృత సంప్రదాయాలనట్లుంచి, హిందూమతంలోని సంస్కృతేతర ప్రాంతీయ సంప్రదాయాలను కూడా ఆమె ఈ చిత్రీకరణలోకి తీసుకువచ్చారు. ఈ కారణాలవల్ల ఇదొక భిన్నమైన గ్రంథమవుతున్నది.

... డోనిగర్ రచన ఎంతో పరిశోధనతో కూడిన గంభీరమైన గ్రంథం. అయినప్పటికీ సాధారణ పాఠకులు కూడా దీనిని తేలికగా అర్థం చేసుకోగలరు. వర్తమాన కాలంలో హిందూ మతం పట్ల గాఢమైన ఆసక్తి కలవారెవరైనా సరే ఈ రచనను చదవాలి, ఆనందించాలి, వివేచించాలి, దానితో వాదించాలి కూడా.

**– ఎ.ఆర్. వెంకటాచలపతి, ద హిందూ**

నాలుగు వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు, పురాణాలు, ఆరణ్యకాలు, శాస్త్రాలతో పాటు రామాయణ మహాభారత ఇతిహాసాల కావ్య సంప్రదాయంతో డోనిగర్‌కు క్షుణ్ణమైన పరిజ్ఞానం ఉన్నట్లు ఈ రచన ద్వారా మనకు అర్థమవుతుంది. లిఖిత సంప్రదాయానికి, మౌఖిక సంప్రదాయానికి మధ్య నిరంతర సంబంధాలు, ఆదాన ప్రదానాలు ఉంటాయని వాదించిన ఆమె, హిందూ మతం తన అంతర్గత తిరుగుబాట్లు, ఇతర మతాల ఒత్తిడుల కారణంగా ఏ విధంగా పరివర్తన చెందుతూ వస్తున్నదో తెలియచెప్పారు. రామాయణం అనేక రూపాంతరాలకు గురై, చివరకు దానిని మొట్టమొదట రచించిన వాల్మీకి రామాయణ రూపంతో స్థిరపడింది. మారుతున్న చారిత్రక పరిస్థితులను స్వీకరిస్తూ దానిని పలువురు మళ్లీమళ్లీ రాసారు. మహాభారతం విషయంలోనూ అదే జరిగింది.

హిందూ దేవతలను డోనిగర్ 'కల్పనల' స్థాయికి తగ్గించినట్లు అతివాదులు ఆరోపిస్తున్నారు. కాని విభిన్నమైన నిర్వచనాలే హిందూ సంప్రదాయపు నిజమైన బలాలని ఈ గ్రంథం నిరూపిస్తుంది.

**– ప్రియంవద గోపాల్, ద గార్డియన్**

విజ్ఞాన సర్వస్వంగా తోచే వెండీ డోనిగర్ రచనలో మనం ఆనందాశ్చర్యాలతో లీనమై పోతాం. హిందూ సంస్కృతి బహుళత్వంతో కూడుకున్నదని, ఉదారమైనదని, భిన్నత్వాలను తనలో ఇముడ్చుకోగలదనేది ఆమె దృక్పథం. ఈ సుసంపన్నమైన రచన భిన్న వైఖరులు గల విద్యావేత్తల మధ్య చర్చకు అవకాశమిస్తుంది.

**– హోమీ కె. భాభా, హార్వర్డ్ యూనివర్సిటీ**

# హిందువులు

## ఒక ప్రత్యామ్నాయ చరిత్ర


**వెండీ డోనిగర్**

తెలుగు : **టంకశాల అశోక్**



**హైదరాబాద్ బుక్ ట్రస్టు**

| | | |
|---|---|---|
| **వెల** | : | **275/-** |
| ఆంగ్లమూలం | : | The Hindus : An Alternative History, Penguin 2009 © Wendy Doniger |
| ప్రథమ ముద్రణ | : | ఏప్రిల్ 2016 |
| అట్టమీద బొమ్మ | : | గణేష్ పైన్ వేసిన 'ఏకలవ్య' |
| ప్రతులకు, వివరాలకు | : | **హైదరాబాద్ బుక్ ట్రస్ట్,**<br>ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్,<br>హైదరాబాద్ – 500 006. ఫోన్ : 23521849<br>www.hyderabadbooktrust.blogspot.com |

---

| | | |
|---|---|---|
| ముద్రణ | : | అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్,<br>హైదరాబాద్ – 28 ఫోన్ : 23391364, 23304194<br>Email: anupamaprinters@yahoo.co.in |

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| ఉపోద్ఘాతం | : చందమామలోని రూపం మనిషి, కుందేలు కూడా | 7 |
| అధ్యాయం 1 | : పరిచయం : ఉన్న వెలుగులోనే పనిచేయటం | 21 |
| అధ్యాయం 2 | : భారత దేశంలో స్థల కాలాలు | 51 |
| అధ్యాయం 3 | : సింధూలోయ నాగరికత | 65 |
| అధ్యాయం 4 | : సింధూలోయ నాగరికత | 83 |
| అధ్యాయం 5 | : రుగ్వేదంలోని మనుషులు, జంతువులు, దేవతలు | 92 |
| అధ్యాయం 6 | : బ్రాహ్మణాలలో బలులు | 105 |
| అధ్యాయం 7 | : ఉపనిషత్తులలోని పరిత్యాగం | 118 |
| అధ్యాయం 8 | : హిందూమతంలో మూడు (లేక నాలుగా?) జీవిత లక్ష్యాలు | 133 |
| అధ్యాయం 9 | : రామాయణంలో స్త్రీలు, స్త్రీ రాక్షసులు | 140 |
| అధ్యాయం 11 | : మహాభారతంలో ధర్మం | 177 |
| అధ్యాయం 12 | : శాస్త్రాలలోని 'తప్పించుకునే మార్గాలు' | 190 |
| అధ్యాయం 13 | : దక్షిణ భారత దేశంలో 'భక్తి' | 197 |
| అధ్యాయం 14 | : తొలి పురాణాలలో స్త్రీ దేవతలు, పురుష దేవతలు | 226 |
| అధ్యాయం 15 | : తాంత్రిక పురాణాలు, తంత్రాలలో శాఖలు, శృంగారం | 235 |
| అధ్యాయం 16 | : ఢిల్లీ సల్తనేట్ పాలనలో మైత్రి, శత్రుత్వాలు | 265 |
| అధ్యాయం 17 | : అనంతర పురాణాలలో అవతారాలు, 'అనుకోని భక్తి' | 285 |
| అధ్యాయం 18 | : దక్షిణ దేశంలో, కశ్మీర్‌లోతాత్త్విక వివాదాలు | 297 |
| అధ్యాయం 19 | : మొఘలులు, బ్రిటిష్ పాలనలో పరిస్థితులు | 313 |
| అధ్యాయం 20 | : వర్తమానంలో గతం | 326 |
| అధ్యాయం 21 | : ముగింపు లేదా చరిత్ర దురుపయోగం | 328 |
| | కృతజ్ఞతలు | 331 |
| | కాలక్రమణిక | 333 |
| | ప్రత్యేక పద వివరణ | 338 |

# తెలుగు అనువాదానికి
# రచయిత్రి ప్రత్యేక ఉపోద్ఘాతం

'ద హిందూస్: ఏన్ ఆల్టర్నేటివ్ హిస్టరీ' రచన తెలుగులో వెలువడుతుండటం నాకు సంతోషాన్నీ, సంభ్రమాశ్చర్యాలను కూడా కలిగిస్తున్నది. అందుకు పలు కారణాలున్నాయి. నా రచనలు ఒక భారతీయ భాషలో వెలువడుతుండటం ఇది మొదటిసారి. నా రచనలలో ఈ విధంగా ఎక్కువమందికి అందుబాటులోకి రావాలని నేను కోరుకునేది ఏదైనా ఉంటే అది ఈ పుస్తకమే. పెంగ్విన్ సంస్థ ప్రచురించిన ఈ గ్రంథం కోర్టు వివాదంలో చిక్కుకోవటం వల్ల నాకిట్లా అనిపిస్తున్నది. ఈ రచనను 'స్పీకింగ్ టైగర్' సంస్థ సాహసించి తిరిగి ప్రచురించి అందుబాటులోకి తేవటం, ఇప్పుడు హైదరాబాద్ బుక్ ట్రస్ట్ పూనుకుని అదే సాహసంతో దీన్ని తెలుగులోకి అనువదించి మరింతమంది భారతీయ పాఠకులకు అందుబాటులోకి తేవటాన్ని బట్టి, భారతదేశంలో వాక్స్వాతంత్ర్యం పట్ల నాకు గొప్ప ఆశాభావం కలుగుతున్నది.

తెలుగు అనువాదం పట్ల నాకు మరొకందుకు కూడా సంతోషం కలుగుతున్నది. దక్షిణ భారతదేశం గురించి నేను రాయటం ఇదే మొదటిసారి. (కొన్ని సంకలనాలలో రాసిన వ్యాసాలలో దక్షిణ భారతదేశ ప్రస్తావనలు లేకపోలేదు. వాటిలో ఆ ప్రాంత భాషా రచనల అనువాదాలను స్వీకరించాను. ఉదాహరణకు ఇటీవల వెలువడిన 'నార్టన్ ఆంథాలజీ ఆఫ్ వరల్డ్ రెలిజియన్స్' లో హిందూమతం గురించిన సంపుటి కోసం రాసిన వ్యాసంలో తమిళ, కన్నడ, మలయాళ, తెలుగు మూలాల నుంచి కొన్ని భాగాలు తీసుకున్నాను. అది వేరే సంగతి.) హిందూ మతం గురించి వెలువడిన అనేక ప్రధాన గ్రంథాలు వదిలివేసిన కొన్ని వర్గాల వారి గొంతులను, ముఖ్యంగా స్త్రీలు, దళితులు, జంతుజాలాల స్వరాలను వినిపించేందుకు ఈ ప్రస్తుత రచనలో ప్రయత్నించాను. అదే విధంగా, నేను దక్షిణ భారతదేశంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించటం ఎట్టకేలకు ఈ విధంగా మొదలవుతున్నది. అందువల్ల, ఈ రచనను తెలుగు పాఠకులు కూడా చదవనుండటం నాకు మరింత ఆనందాన్ని కలిగిస్తున్నది.

– వెండీ డోనిగర్
షికాగో, డిసెంబర్ 25, 2015

## ఉపోద్ఘాతం

# చందమామలోని రూపం మనిషి, కుందేలు కూడా

### ప్రత్యామ్నాయ చరిత్ర

చందమామలో కనిపించే బొమ్మను కొందరు మనిషి అని, అదే సమయంలో కుందేలు కూడానని అంటారు. మరికొందరి ఆలోచనలో అది బాతుతోపాటు, కుందేలు కూడా. హిందువుల దృష్టి ఒకే అంశంపై రెండు విధాలుగా ఎట్లా ఉంటుందనే దానికి ఇది ఒక ఉపమానం. ఈ ద్వంద్వ దృష్టిని వివరించి చూపటమే ఈ రచన ఉద్దేశం.

హిందూ మతంపై ఇప్పటికే చాలా పుస్తకాలు ఉన్నందున పాఠకులు సహజంగానే ఇంకొక పుస్తకం ఎందుకు? వాటికి, దీనికి తేడా ఏమిటి? అనే ప్రశ్నలు వేస్తారు. కనుక, అదే విషయమై కొత్త పుస్తకం రాసే రచయిత అందుకు సమాధానమివ్వవలసి ఉంటుంది. ఇందులో ఉన్నది హిందూమత చరిత్రను సర్వే చేయటం కాదు. ఆ మతం గురించిన వాస్తవాలు, తారీఖులు దస్తావేజుల జాబితా కాదు. వర్తమాన కాలంలో హిందూమతపు స్వరూప స్వభావాలు ఏమిటన్నది కూడా నేను రాయటం లేదు. వీటిలో వేర్వేరు తరహాలకు చెందిన రచనలు ఇప్పటికే అనేకం ఉన్నాయి. వాటిలో కొన్ని చాలామంచివి కూడా. కాని వాటికి, ఈ పుస్తకానికి చాలా తేడాలున్నాయి.

ముందుగా, సుప్రసిద్ధ సంస్కృత గ్రంథాలు చెప్పిన కథనానికి ఇది భిన్నమైనది, ప్రత్యామ్నాయమైనది. ఆ గ్రంథాలు సమాజంలోని ప్రముఖ వర్గాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని వారి గురించి, వారు చెప్పింది రాయగా, ఈ రచనలో మీకు ఇతర వర్గాలవారు చెప్పినవి, వారి గురించిన కథనాలు కన్పిస్తాయి. అగ్రవర్ణ హిందూ పురుషులలోని అత్యధికుల దృష్టిలో వీరు ఇతర మతాలు, సంస్కృతులు, అణగారిన కులాలకు చెందినవారు. లేదా జంతుజాలాలు, స్త్రీలు అయినా కావచ్చు. హిందూ సంప్రదాయాలను రూపు దిద్దటంలో ఎటువంటి పాత్ర పోషించని ఈ వర్గాలవారంతా వాస్తవానికి హిందూ మతం కోసం ఏమేమి చేసారో చెప్పటం ఈ రచనలో కొంతవరకు నా ఉద్దేశం. హిందూ మతంలోని భిన్న అంతస్తుల నిర్మాణాన్ని తలకిందులు చేయాలని గాని, వాటిని అవాస్తవికంగా చిత్రీకరించాలనిగాని నేను అనుకోవటం లేదు. ఆ అంతస్తులు పటిష్టంగా, చెక్కు చెదరకుండా ఉంటూనే ఉన్నాయి. సంస్కృత గ్రంథాలను రచించి భద్రపరచే పురుష బ్రాహ్మణులే ఆ గ్రంథాలను వడబోసి తుదిరూపం ఇస్తారనేది వాస్తవం. ఆ వాస్తవాన్ని నిరాకరించటం కూడా నా ఉద్దేశం కాదు. కాని ఈ వర్గాలు విస్మరించిన

పాత్ర ధారులను, కథనాలను తెరపైకి లేవాలన్నది నా ఆలోచన. బ్రాహ్మణ సంస్కృత పండితులు నడిచిన మార్గానికి పక్కనే అద్భుతమైన మేధాశక్తి, సృజనాత్మకత గల ఆలోచనాపరులు ఇతర వర్గాలలోనూ ఉండేవారు. నేను వారిని వెలుగులోకి తేదలచు కున్నాను. వారంతా ఈ పురుష బ్రాహ్మణుల వడపోతలో కనిపించకుండా కొట్టుకు పోయారు. నిజానికి బ్రాహ్మణులలోనూ వేర్వేరు విధాలైన వారుండినందున వడపోతలు కూడా భిన్నంగా సాగాయి. వారిలో కొందరు రాజాస్థానాలకు చేరువగా ఉండగా, తక్కిన వారు కటిక పేదరికంలో జీవిస్తూ ఆహారం కోసం భిక్షాటన చేసేవారు.

పైగా, కావ్య రచన చేసే కులీనులైన పురుషులకు తమ వృత్తి సంబంధమైన సంస్కృత భాషలో ప్రావీణ్యం ఉండటంతో పాటు, మౌఖిక కథనాలు కూడా పరిచయమయేవి. సంస్కృతం తెలిసిన వారిలో అధికులకు, వాడుక భాష అయిన ప్రాకృతం కూడా వచ్చి ఉండాలి. అటువంటి స్థితిలో నేను ఈ రచనలలో రెండు పనులు చేయవలసి ఉంటుంది. సంస్కృత పాఠాలలో గల ప్రాకృత పాఠాలు ఏవి, వాటిలోని స్త్రీలు, నిమ్నవర్గాల వారు చెప్పిన విషయాలు ఏవి అన్నది గుర్తించటం మొదటి పని. సంస్కృతేతర కథనాలను, సమాచారాన్ని వీలైనంతవరకు ఈ రచనలో చేర్చటం రెండవపని. అయితే సంస్కృతమన్నది ఒక భాషా మాధ్యమమే తప్ప, ఆ భాషను ఉపయోగించటంలోనే ఏదో అర్థం ఇమిడి ఉందని భావించకూడదు. సంస్కృతం బ్రాహ్మణులకు, భగవద్గీతకు సంబంధించినది మాత్రమే కాదు. సంప్రదాయాలను రూపొందించి, స్థిరపరచజూసే శక్తులను ప్రతిఘటించే శక్తులు కొన్ని ఉంటాయి. ఆ ప్రతిఘటనా శక్తులు వేర్వేరు వర్గాల మధ్య సంబంధాల అభివృద్ధికి ప్రయత్నిస్తాయి. ఆ విధంగా వర్ణ సాంకర్యం ఏర్పడుతుంది. ఈ మార్పులను నిరోధించేందుకు బ్రాహ్మణులు ఎప్పుడూ విఫలయత్నాలు చేస్తూనేవచ్చారు. ఈ విషయాలపై దృష్టి కేంద్రీకరించేందుకు నేను ప్రయత్నిస్తాను.

రెండవ అంశం కొన్ని ముఖ్యమైన కార్యకలాపాలకు సంబంధించింది. ఆయా పాత్రధారులతో కూడిన ప్రత్యేక వర్గాల గురించిన పరిశీలనకు ఇది అదనం. నేను ముఖ్యమైన కార్యకలాపాలు అంటున్న వాటిలో అనేకం ఈ రోజున కూడా ముఖ్యమైనవే. తోటి మనుషుల పట్ల అహింస (ముఖ్యంగా మత సహనం), జంతువుల పట్ల అహింస (శాకాహారం అలవాటు, జంతుబలిపట్ల ఆక్షేపణ), సంసార జీవితానికి సన్యాసానికి మధ్య ఘర్షణాత్మక స్థితి, కామవాంఛలకు బానిస కావటం, లేదా వాటిని అదుపులో ఉంచుకోవటం వంటివి ఈ కార్యకలాపాల వర్గీకరణలోకి వస్తాయి. పోతే, ఒకరి శిరస్సులను మరొకరి శరీరాలకు అమర్చటం, నగరాలను వరదలు ముంచెత్తటం వంటి నిర్దిష్టమైన విషయాలు కూడా ఈ రచనలో కన్పించే చారిత్రక కథనంలో భాగమవుతాయి. వీటన్నింటి పరిస్థితి వేర్వేరు శతాబ్దాలలో ఏవిధంగా ఉండేదో చిత్రీకరించేందుకు ఈ పుస్తకంలోని వేర్వేరు అధ్యాయాలలో ప్రయత్నించాను నేను.

హిందూ మతంపై గల ఇతర రచనలకు, ఈ పుస్తకానికి గల తేడాలని చెప్పిన వాటిలో పైన వివరించినవి రెండు కాగా, మూడవది ఆ మతాన్ని పరిశీలించి వివరించే విధానం. ఏ విధంగానైతే హిందూ దేవతలను తమ పీఠాలపై ప్రతిష్టిస్తారో, అదే పద్ధతిలో హిందూ మతాన్ని చరిత్రలో భాగంగా ప్రతిష్టించి అర్థం చేసుకునేందుకు ఈ రచన ప్రయత్నిస్తుంది. ప్రతి ఆలోచన అంతకు ముందటి ఆలోచనలకు కలిగిన ప్రతిస్పందన అని చూపేందుకు, ఇందులోని అంశాలను ఒక చారిత్రక క్రమంలో చర్చించాను. ఆయా అంశాలు సమకాలీన ఘటనల స్ఫూర్తితో ఏ విధంగా రూపు తీసుకున్నాయో చూపేందుకు వీలైన చోటనల్లా ప్రయత్నించాను. చుట్టూ జరిగే వాటికి స్పందించే లక్షణం హిందూమతానికి ఉంది. అటువంటి మతం రాజకీయ, ఆర్థిక పరిస్థితులపట్లనే గాక, భారతదేశంలోని బౌద్ధం, ఇస్లాం మతాల పట్ల, విదేశీ సంస్కృతులకు చెందినవారు ఇక్కడకు వచ్చిన సందర్భాలలో వారిపట్లా ఏ విధంగా వ్యవహరించిందో కూడా వివరించే ప్రయత్నం చేసాను.

రాజులను దేవతలుగా, దేవతలను రాజులుగా చూపే హిందూమతం లౌకిక అధికారానికి, మతపరమైన అధికారానికి మధ్య స్పష్టమైన విభజన రేఖను గీసేందుకు అరుదుగా తప్ప ప్రయత్నించలేదు. ఇటీవలి సంవత్సరాలలో మత చరిత్రలు రాసిన పలువురు, ముఖ్యంగా దక్షిణాసియా ప్రాంత మతాల గురించి రాసినవారు, భారత ఉపఖండపు మత చరిత్ర పరిణామాలను ఆయా సందర్భాలకు అన్వయించి చిత్రీకరించారు. అదే పద్ధతిలో క్రీ.పూ. 50,000,000 నుంచి మొత్తం భారతదేశ చరిత్రను ఆయా సందర్భాలకు అన్వయిస్తూ రాసేందుకు ఈ పుస్తకంలో నేను ప్రయత్నించాను. అందువల్ల, వర్తమాన ఆలోచనలు ఒకదాని నుంచి ఒకటిగా ఏ విధంగా ఉద్భవిస్తూ వస్తాయో మనకు బోధపడుతుంది. ఈ క్రమాన్నంతా పరిశీలించకుండా కేవలం ఒక ప్రత్యేక ఘటనను, లేదా కావ్యాన్ని అధ్యయనం చేయటం వల్ల ఈ అవగాహన కలగదు.

ఇది హిందూమతం గురించిన సంప్రదాయక చరిత్రకాదు. కాని చారిత్రక మార్పులలో భాగంగా మారిన హిందువుల జీవితాలలో, కొన్ని ముఖ్యమైన అంశాలు ఏ విధంగా రూపు దిద్దుకుంటూ వచ్చాయో ఇది వివరిస్తుంది. అనేక కథనాలను ఒక వరుస క్రమంలో చెప్పటం ద్వారా హిందువుల చరిత్రను చిత్రీకరిస్తుంది.

ఈ రచనలో నేను పండిత వివాదాలలో చాలావాటి జోలికి వెళ్లలేదు. పోతే, మనకు తెలిసింది ఏ విధంగా తెలియవచ్చింది? మనం ఏ విషయాలను నమ్మేవాళ్ళం? ఇప్పుడు నమ్ముతున్నవాటిని ఎందువల్ల నమ్ముతున్నాం? కొన్ని ప్రశ్నలను రేకెత్తించిన పండితులెవరు? మనకు తెలిసిన సమాచారాన్ని చెప్పిన వారెవరు? ఆ సమాచారాన్ని ఇప్పుడు సవాలు చేస్తున్న వారెవరు? వారిని ప్రభావితం చేసిన రాజకీయ అంశాలేమిటి? అనే విషయాలను కూడా ఇక్కడ చెప్పుకోవలసి ఉంది. ఆ వాదనల వల్ల తెలిసేది ఆసక్తికరంగానే

ఉంటుంది గాని, నేను వాటి గురించి అప్పుడప్పుడు మాత్రమే ప్రస్తావించాను. మతం గురించి, చరిత్ర గురించి పలు అధ్యాయనాలు, సిద్ధాంతాలు ఇప్పటికే ఉన్న నేపథ్యంలో నేనీ రచన చేస్తున్నాను. కాని వాటి ప్రస్తావన ఇందులో రాదు. కొందరితో నాకు భిన్నాభిప్రాయాలున్నా వారితో ఎదురు వాదనలు చేయదలచుకోలేదు. ప్రతి అంశాన్ని, నాకు అత్యుత్తమమైనదని తోచిన విధంగా, ఒక విద్యావేత్తవలె వివరించేందుకు ప్రయత్నించాను. అందుకు సంబంధించిన వాదప్రతివాదాలు హిందూమత గ్రంథాలలో ఏ విధంగా ఉన్నాయో వాటిపైనే దృష్టిని కేంద్రీకరించాను తప్ప బయటి వాదనల వైపు వెళ్లలేదు.

ఆయా విషయాలపై నా ఆలోచనలను పేర్కొన్నప్పటికీ అనేక కీలకమైన ప్రశ్నలకు ఈ పుస్తకంలో సమాధానాలు లేవు. ఈ పుస్తకం వల్ల లభించగల స్ఫూర్తితో కొందరు పాఠకులు మూల పాఠాలను చదివి, నాతో ఏకీభవించాలో లేదో స్వయంగా నిర్ణయించుకో గలరని ఆశిస్తాను. ఆ మూల పాఠాలు, కావ్యాలు, ఇతర సమాచారపు వివరాలను ఉపయుక్త గ్రంథ సూచికలో చూడవచ్చు.

## సంస్కృతీకరణ, దేశీయీకరణ, స్థానిక భాషాంతరీకరణ

జానపదుల కథనాలు చాలా వరకు మౌఖిక రూపంలో, సంస్కృతంకాని స్థానిక భాషలలో ఉండేవి. వాటిని సంస్కృత కావ్యాలు మొదటినుంచి కూడా తమలో ఇముడ్చుకునేవి. సంస్కృతం పండిత భాష, బ్రాహ్మణ భాష అయినప్పటికీ వేదకాలంలో కూడా అది 'వంటింటి భాష' ఏమీ కాదు. అనగా సంస్కృతపండితులకు తమ భార్యాపిల్లలతో, సేవకులతో మాట్లాడేందుకు మామూలు స్థానిక భాష కూడా రావలసి ఉంటుంది. ఆ విధమైన ద్విభాషా పరిజ్ఞానం, ఇతరులతో స్థానిక భాషలో వ్యవహరించటం మూలంగా మౌఖిక సంప్రదాయాలు సంస్కృత కావ్యాలలో ప్రవేశించాయి. జార్జ్ బెర్నార్డ్‌షా నాటకం పిగ్మాలియన్‌లోని కల్నల్ పిక్కరింగ్ అనే పాత్ర 'వాడుక సంస్కృతా'న్ని కనుగొన్నట్లు రచయిత పేర్కొన్నాడు. బెర్నార్డ్‌షా ఆ మాటను హాస్య స్ఫూర్తితో అని ఉండవచ్చుగాని, ప్రాచీన కాలంలో అటువంటి పరిస్థితి నిజంగానే ఉండి ఉంటే ఆశ్చర్యపడవలసింది లేదు. అప్పుడు పలువురు పూజారులు, పండితులు సంస్కృతంలో మాట్లాడగలిగినా, సంస్కృతం ఒక్కటే మాట్లాడేవారు కాదు. సంస్కృతానికి, మౌఖిక సంప్రదాయాలకు మధ్యగల పరస్పర సంబంధాల మూలంగా నిమ్న తరగతుల వారి పదజాలం, ఆలోచనలు బ్రాహ్మణ ప్రపంచంలోకి ప్రవేశించేవి. అదే పద్ధతిలో వారి పదజాలం, ఆలోచనలు నిమ్నతరగతుల ప్రపంచంలోకి వెళ్లేవి.

ఆ కాలంలో ప్రాకృతభాష సహజమైన రీతిలో ముందుపుట్టి, శిష్టులు ఉపయోగించే సంస్కృతం ఆ తర్వాత రూపొంది ఉండాలి. కాని దక్షిణాసియా పండితులు సాధారణంగా సంస్కృతమే తొలి భాష అని, ఇతర భాషలు దానినుంచి ఆవిర్భవించాయని భావిస్తారు.

మొదట లిఖిత రూపం తీసుకున్నది, ప్రాచ్య లిఖిత పత్ర భాండాగారాలకు చేరింది, పరిరక్షింపబడింది సంస్కృతం కావటం, ఇతర భాషల విషయంలో ఆ పని తర్వాత జరగటం ఈ నమ్మకానికి కారణం కావచ్చు. ఈ స్థితి వల్లనే సంస్కృతాన్ని అతి ప్రాచీన భాష అంటున్నాము మనం. కాని, ఆధిపత్య వర్గాల భాష అయిన సంస్కృతం ఒక చిన్న వర్గం నుంచి రూపు తీసుకుని వ్యవహారణలోకి వచ్చింది. అది ఎక్కువ మందికి అర్థం కాకపోవటమే తొలి దశలో ఆ భాషకు బలమైంది. ఆ బలం శిష్ట వర్గానికి కూడా బలంగా మారింది.

వైదికమైన సామాజిక విలువలు, పండగలూ ఉత్సవాలూ రీతి రివాజుల తీర్లు, సంస్కృత అభ్యాసం వంటివి సాధారణ ప్రజల స్థాయిలో గల సంప్రదాయాలలోకి ఏ విధంగా ప్రవేశిస్తాయో వర్ణించటానికి సామాజిక శాస్త్రవేత్త ఎం.ఎన్. శ్రీనివాస్ 1952లో 'సంస్కృతీకరణ' అనే పదాన్ని సృష్టించాడు. వైదిక ఆచారాలు సామాన్యుల ప్రపంచంలోకి ఈ విధంగా వ్యాపించటం కొంతవరకు, సామాజిక నిచ్చెన మెట్లెక్కి పైకి వెళ్ల దలచినవారి ద్వారా జరుగుతుంది. బ్రాహ్మణుల అలవాట్లను, ఆహార నియమాలను, జంతువుల పట్ల అహింసనూ పాటించే వారి ద్వారా జరుగుతుంటుంది. ఈ కోణం నుంచి చూసినపుడు భారతీయ సమాజం ఒక శాశ్వతమైన పాములూ – నిచ్చెనల క్రీడ వలె కనిపిస్తుంది. ఆ క్రీడలోకి వీరు అపవిత్రులుగా ప్రవేశించి, మెట్లవెంట గల సమస్యలను కొన్ని తరాలపాటు దాటుతూ, బ్రాహ్మణీయ పవిత్రత అనే లక్ష్యం వైపు పురోగమిస్తారు. భిల్లులు, గోండుల వంటి గిరిజన తెగలవారైతే ఒక కులం గుర్తింపును, తద్వారా హిందువులుగా గుర్తింపును పొందేందుకు సంస్కృతీకరణ చెందుతారు.

సంస్కృతీకరణకు విరుద్ధ మార్గంలో మౌఖికీరణ, లేదా సామాన్యీకరణ, దేశీయీకరణ, లౌకికీకరణ అనే మరొక క్రమం కూడా జరుగుతుంది. సంస్కృతీకరణ అన్నది కిందినుంచి పైకి వెళ్లటం అయితే, ఈ రెండవది పై నుంచి క్రిందికి వచ్చేక్రమం అన్నమాట. స్థూలంగా ఇవన్నీ ఒక్కటే. సంస్కృతీకరణ ఎంత ముఖ్యమో ఈ విరుద్ధ క్రమం కూడా అంతే ముఖ్యమైంది. ఈ క్రమంలో సంస్కృత సంప్రదాయాలు సామాన్యుల సంప్రదాయాలను స్వీకరించటం ఒకవైపు సామాన్యుల సంప్రదాయాలను మార్చటం మరొకవైపు ఏక కాలంలో జరుగుతుంది. పైన పేర్కొన్న వేర్వేరు పదాలలో మనం దేశీయీకరణ అనే దాన్ని ఎంచుకుని దానినే ఉపయోగిద్దాం. సంస్కృతీకరణ, దేశీయీకరణ అనే రెండు క్రమాల మధ్య పరస్పర ప్రభావాలుంటాయి. అదే పద్ధతిలో దేవతల పేర్లు అటు ఇటు మారుతుంటాయి. స్థానిక దేవతలకు బ్రాహ్మణ నామాలు, బ్రాహ్మణ దేవతలకు స్థానికమైన పేర్లు రావచ్చు. ఉదాహరణకు మురుకన్ అనే స్థానిక దేవుడు బ్రాహ్మణ గుర్తింపుతో బ్రాహ్మణుల దృష్టిలో స్కంధుడవుతాడు. స్కంధుడు సామాన్య ప్రజల దృష్టిలో మురుకన్‌లో భాగమవుతాడు. ఇది బ్రాహ్మణ దేవతల దేశీయీకరణ క్రమం.

'లిఖిత' అనే మాటకు అర్థం 'సంస్కృతంలో లిఖించిన' అనే కానక్కరలేదు. అదే విధంగా మౌఖిక కావ్యాలు స్థానిక భాషలోనే ఉండాలని కూడా లేదు. ఉదాహరణకు రుగ్వేదం సంస్కృత భాషలో కొన్ని వందల సంవత్సరాల పాటు మౌఖిక రూపంలోనే ఉంది. మరొకవైపు, ప్రాచీన కాలానికి సంబంధించి స్థానిక భాషలు మాటలకే పరిమితమని చెప్పలేము. ప్రజలు మాట్లాడటం, రాయటం రెండూ సంస్కృతంలో, స్థానిక భాషలలో కూడా చేసేవారు. అయితే సంస్కృతంలో మాట్లాడటం కన్న రాయటం ఎక్కువ.

సంస్కృతానికి, స్థానిక భాషలకు మధ్య తేడా మౌలికంగా భౌగోళికమైంది. సంస్కృతంలో ప్రాంతీయ సంస్కృతాలు కూడా ఉండినప్పటికీ, స్థానిక భాషలకు మాత్రం తమ ప్రాంతాలను బట్టి పేర్లు వచ్చేవి. ఉదాహరణకు బెంగాల్‌లో బెంగాలీ, ఒరిస్సాలో ఒరియా పద్ధతిలో. సంస్కృతలిపి ఎక్కడ రూపుతీసుకున్నదో తెలియదు. దేవతలు నివసించే నగరపు లిపి అని చెప్తూ దానిని 'దేవనాగరి' అంటున్నారు. ప్రజలు ఒకసారి సంస్కృత సాహిత్య కావ్యాల నుంచి పక్కకు జరిగిన తర్వాత, స్థానిక భాషలలో రాసేందుకు వారికి ఎన్ని అవకాశాలైనా అందుబాటులోకి వచ్చాయి. అయితే కొందరు స్థానిక భాషలతో పాటు సంస్కృత రచనలను కూడా కొనసాగించారు.

సంస్కృతం, స్థానిక భాషల మధ్య క్రమానుగతంగా, అనధికారికంగా సాగుతుండిన పరస్పర సాంకర్యాలు, క్రీస్తు శకం రెండవ సహస్రాబ్ది మధ్యకాలానికి నాటకీయంగా మారసాగాయి. స్థానిక భాషలకు రాజుల నుంచి అధికారికంగా, పాలనాపరంగా, రాజకీయంగా, కళా సాహిత్యాల పరంగా ప్రోత్సాహం లభించటం మొదలైంది. అంతవరకు గొప్పవారి గొప్ప భాషగా చలామణి అయిన సంస్కృత స్థానంలోకి స్థానిక భాషలు ప్రవేశించసాగాయి. సంస్కృతాన్ని పరిపుష్టం చేస్తూ దానికి అనుబంధంగా ఉండిన స్థానిక భాషలు, సాహిత్య భాషలుగా సంస్కృతంతో పోటీ పడటం మొదలైంది. ఈ పరిణామాన్ని భాషా ప్రాంతీయీకరణ అన్నారు. అది సంస్కృతాన్ని దేశీయీకరించటానికి, సంస్కృతానికి – స్థానిక భాషలకు మధ్య పరస్పర ఆదాన ప్రదానాలకు, సాంకర్యానికి భిన్నమైనది. అంతవరకు జరిగిన చారిత్రక క్రమంలో ఏమి రాయాలి, ఎట్లా రాయాలి, ఏ రాజకీయాలు రాయాలన్నది మరెవరో నిర్దేశిస్తే ఆ ప్రకారం స్థానిక భాషలలో రాసేవారు. కాని క్రమంగా అవన్నీ కూడా స్థానికమైపోయాయి.

ఇపుడు విభజన అన్నది లిఖిత కావ్యాలు, మౌఖిక పాఠాల మధ్యనే తప్ప సంస్కృతానికి, స్థానిక భాషలకు మధ్యకాదు. పరిస్థితి అంతగా మారిపోయింది. ఇందులో గమనించదగ్గ మరొక విశేషమేమంటే, ఈ సరికి సంస్కృత కావ్యాలు అనేకం దేశీయీకరణ చెందాయి. రెండవ వైపునుంచి స్థానిక భాషా కావ్యాలు సంస్కృత విలువలను, సంప్రదాయాలను, వ్యాకరణాలూ నిఘంటువులను అనుకరిస్తూ సంస్కృతీకరణకు లోనయ్యాయి. ఈ క్రమంలో కొంత చెడు, కొంత మంచి జరిగాయి. బ్రాహ్మణుల స్త్రీ ద్వేషం, ఉన్నత వర్గ ధోరణులు

సంస్కృత కావ్యాలనుంచి స్థానిక భాషా కావ్యాలలోకి ప్రవేశించటమన్నది చెడు కాగా, స్థానిక కావ్యాలతో పాటు కొన్ని సంస్కృత రచనలలో ఇందుకు విరుద్ధమైన విలువలు చేరటమనే మంచి కూడా జరిగింది.

## ఎంపిక విధానం

మహా సంపద్వంతమైన హిందూ సంస్కృతి నుంచి కొన్ని అంశాలను ఎంపిక చేసుకుని రాయటం తేలిక కాదు. అందువల్ల ఆయా కాలాల గురించి సవివరమైన చరిత్రలు రాయటానికి బదులు, ఈ పరిశీలనలోకి వచ్చే చారిత్రక దశలకు సంబంధించిన ఒకటి రెండు ముఖ్యమైన ఉదంతాలను తీసుకుని, అవి ఆ దశలకు ఏ విధంగా ప్రాతినిధ్యం వహిస్తాయో చెప్పేందుకు నేను ప్రయత్నించాను.

ఇప్పటికే పలువురు అనువదించిన సంస్కృత కావ్య భాగాలను నేను తిరిగి అనువదించిన సందర్భాల్లో, లోగడ ఇతరులు ఉపేక్షించిన కావ్యాల నుంచి కొన్ని భాగాలను కూడా ఉదాహరిస్తూ, రెండింటి మధ్య సమతులనం సాధించేందుకు ప్రయత్నించాను. హిందూమతంపై సర్వేచేస్తూ వెలువడిన పుస్తకాలలో ప్రస్తావించని ఉదంతాలను కూడా ప్రతి అధ్యాయంలో ఎన్నో కొన్నింటిని పేర్కొన్నాను. అవి గొప్ప విషయాలు కాదుగాని, చిరకాలం కిందట ప్రజల మతపరమైన జీవితాలు ఏ విధంగా ఉండేవో ఆ ఉదంతాలు కళ్లకు కడతాయి. అదే విధంగా హిందువులకు బౌద్ధులు, జైనులు, సిక్కులు, ముస్లిముల వంటి ఇతర మతాలవారితో సంబంధాలు (స్నేహాలు, శత్రుత్వాలు కూడా) ఎట్లుండేవో చూపే అంశాలు కొన్ని ఇందులో చేర్చాను. అయితే వాటి గురించి ప్రత్యేకంగా ఏమీ రాయలేదు.

పలువురికి ఆమోదయోగ్యమయ్యే కొన్ని మౌలిక చారిత్రక ఘటనలను, దృక్పథాలను ఆధారంగా చేసుకుంటూ మనం ఇతర అంశాలవైపు దృష్టి సారించవచ్చు. ప్రత్యామ్నాయ జన సమూహాల గురించి, వారి సమాజాల గురించిన కథనాల కోసం అన్వేషించేందుకు మనం సామాజిక చరిత్రల నుంచి సాహితీ కావ్యాల దిశగా ప్రయాణించవచ్చు. పరిశీలనాంశాలను ఆ పద్ధతిలో ఎంపిక చేసుకోవటం కూడా ఈ రచనకు ప్రత్యామ్నాయ చరిత్ర లక్షణాలను కల్పిస్తుంది. అపుడు ఇతర చరిత్రకారులు తమ అంశాలను తాము ఎంచుకుని, నా చరిత్రకు తమ ప్రత్యామ్నాయ చరిత్రలు రాయవచ్చు. వారిలో ఎవరైనా ఇందుకు పూర్తి భిన్నమైన రచన కూడా చేయవచ్చు. ఇది హిందువుల గురించిన పలు చరిత్రలలో ఒకటి తప్ప, ఒకే ఒక చరిత్ర కాదు.

## విషయాలు, వైవిధ్యతలు

హిందూ మతం గురించిన ప్రధానమైన విషయాలన్నీ కొందరు ముఖ్య పాత్రధారులను, వారి కార్యకలాపాలను కేంద్రం చేసుకుని ఉంటాయి. ఆ పాత్రధారులకు, ఆయా కార్యకలాపాలకు మధ్య అనేక విధాలైన సంబంధాలు కనిపిస్తాయి. సంస్కృత కావ్యాలు సాధారణంగా స్త్రీలను, వేట మృగాలను పురుషుల వ్యసనాలకు ముఖ్య

ఆకర్షణలుగా చూపుతాయి. ఆ వ్యసనాలను పురికొల్పే కోర్కెలను గుర్రాలతో పోల్చుతాయి. జంతువులు తరచుగా స్త్రీలకు, నిమ్న తరగతుల వారికి ఉపమానాలవుతాయి. కామ వాంఛలకు, సన్యాస భావనలకు మధ్య ఏర్పడే ఘర్షణాత్మక స్థితిలో స్త్రీల గురించిన ఆలోచనలు, మోహినికి, మాతృమూర్తికి మధ్య అస్పష్ట భావనలుగా మారి సంచరిస్తుంటాయి. హింస అన్నది చాలావరకు జంతువుల పట్ల హింసగా వ్యక్తమవుతుంది. హింస, సహనశీలతలు ఇతర మతాల పట్ల చూపే వైఖరిలోనే గాక, అగ్రకులాలు – నిమ్న కులాలు, స్త్రీ–పురుషులు, మనుషులు–మృగాలకు సంబంధించిన విషయాలలో కూడా కన్పిస్తుంటాయి.

ప్రతి చారిత్రక దశలో వేర్వేరు మతాల మధ్య, కులాలమధ్య, అదే విధంగా ఆయా కులమతాలలో అంతర్గతంగా సంబంధాలు సహనపూరితంగా ఎట్లా ఉండేవో, హింసాత్మకంగా ఎట్లుండేవో నేను ఈ రచనలో పాఠకుల దృష్టికి తేదలిచాను. ఈ రెండు విధాలైన వైఖరులకు కూడా కారణాలు అప్పటి చారిత్రక పరిస్థితులు.

**(అ) హింస**

చరిత్ర పట్లా, ఈ రచనలోని స్త్రీలు, నిమ్న వర్గాలవారు, నిమ్న కులాలవారు, జంతుగణాల వంటి పాత్రధారుల పట్లా నా ఆలోచనలు ఏమిటో పరిచయభాగం (1వ అధ్యాయం)లో వివరిస్తాను. ఇక్కడ (అ) హింస గురించి మాత్రం కొంత చెప్తాను.

'అహింస' అనే పదాన్ని తొలుత మనుషుల మధ్య సంబంధాలకుగాక, మనుషులు–జంతువులకు మధ్య సంబంధాలకు వర్తింపజేసారు. అహింసకు అర్థం 'గాయపరిచే, లేదా చంపే కోరిక లేకపోవటం'. అంతవరకే తప్ప, దయాగుణంతో, ఉదారంగా ఉండటమనే భావన అందులో లేదు. కనుక 'అహింస' కన్న 'హింసించక పోవటం' అనే పదం సరైన అర్థాన్నిస్తుందనుకుంటాను. హింసించకపోవటం అనే భావనలో ఇతరుల పట్ల ఆలోచనా పరంగా, భౌతికంగా ఆర్ద్రత అనే లక్షణం కనిపిస్తుంది.

అహింసకు మూలాలు వైదిక క్రతువు అయిన జంతుబలిలో ఉన్నాయనుకుంటాను. ఆ క్రతువు గురించి చెప్పినదాని ప్రకారం పూజారులు జంతువులను "శాంతింప" జేస్తారు తప్ప గాయపరచటం, చంపటం చేయరు. అనగా అహింసకు అర్థం హాని చేయకుండానే హాని చేయటమవుతుంది. ఆ విధంగా అహింస అనే దృక్పథంలో మొదటినుంచే తార్కిక వాదన కన్పిస్తుంది. క్రీస్తు పూర్వం 1200 సంవత్సర ప్రాంతానికి చెందిన తొలి సంస్కృత గ్రంథమైన రుగ్వేదం, 'అహింస'ను ప్రధానంగా యజ్ఞకర్త, తన సంతానానికి గాని, తన పశువులకుగాని హాని, హింస కలగకుండా నిరోధించటం అనే అర్థంలో పేర్కొన్నది. ఈ విధమైన పదజాలాన్ని, దాని అర్థాలను సరిగా గ్రహించటమే సమస్యకాగా, ఇక్కడ మరొక సమస్య కూడా ఉంది. 'అహింస' అనే భావనకు మూలమైన క్రియావాచకం 'హాని'.

అందులో అస్పష్టత ఉంది. దానికి అర్థం 'దాడి చేయటం, కొట్టడం, చంపటం' ఏదైనా కావచ్చు. ఆ విధంగా ఆవుల పట్ల అహింస అనగా వాటిని కొట్టకపోవటం, చంపకపోవటం అవుతుంది. మరొక స్థాయిలో ఆలోచిస్తే అహింస అన్నది రాజకీయంగా కాని, సామాజికంగా కాని ఒక సిద్ధాంతమేమీ కాదు. మరొక జీవిని చంపటం లేదా బాధించటం అనే కార్యంపట్ల కలిగే భావోద్వేగం మాత్రమే. ఇటువంటి భావోద్వేగం ప్రాచీన కావ్యాలనుంచి మొదలుకొని ఏ విధంగా ఉందన్నది మనం ముందుముందు చూద్దాం.

జంతువులను చంపటం, బలివ్వటం చేయవచ్చునా లేదా వాటి మాంసం తినవచ్చునా అనే వాదనలు ఒకోసారి వేర్వేరు మతాలవారి మధ్య హింసకు మూలమయ్యాయి. అవి తరచు వాగ్యుద్ధాలు కాగా, ఒకోసారి భౌతిక దాడులుగా మారాయి. మహా భారతంలో అర్జునుడు ఒక సందర్భంలో మాట్లాడుతూ, యుద్ధంలో జరిగే హింసను సమర్థించిన తీరును గమనించండి: 'ప్రాణులు ప్రాణులపై ఆధారపడి జీవిస్తాయి. బలమైన ప్రాణులు బలహీన ప్రాణులపై. ఎలుకలను ముంగిసలు, ఆ ముంగిసలను పిల్లులు, పిల్లులను శు నకాలు, శునకాలను క్రూర మృగాలు భక్షించటం మనకు తెలుసు. చివరకు తాపసులు కూడా ఇతర ప్రాణులను చంపకుండా జీవించలేరు' అన్నాడాయన. అనగా, జంతు ప్రపంచంలో విరివిగా ఉన్న హింసను ఉదాహరిస్తూ మనుషుల హింసను సమర్థించట మన్నమాట. అదే సమయంలో అహింస అనే భావన, మనిషికి జంతుహింసకన్న పై స్థాయికి వెళ్లాలనే కోరిక ఉన్నట్లు సూచిస్తుంది. శాకాహారమన్నది భారతదేశంలో ఆదర్శం మాత్రమే గాక ఒక సామాజిక వాస్తవం. ప్రాణులు జీవించేందుకు ఇతర ప్రాణులను చంపక తప్పదనే అర్జునుని వాదనను శాకాహార సంప్రదాయం సవాలు చేస్తున్నది. ఆహారం కోసం చంపటం అవసరమనే ఆహార సంబంధమైన హింసా వలయాన్ని శాకాహారం భంగపరుస్తున్నది.

కనీసం మనుషుల విషయంలో చరిత్రలోని అనేక నాగరికతలవలె హిందూ నాగరికత కూడా హింస వల్ల చాలా నష్టపోయింది. అటువంటి స్థితిలో ఆ సమస్యకు అహింస అంతిమ పరిష్కారమైంది. ఇదే క్రమంలో హిందువులకు అది సాంస్కృతిక ఆదర్శంగా మారింది. హింసలేని వ్యవస్థను సాధించటం అసాధ్యం గనుక అహింస మరింత వాంఛనీయమైంది. హింస అనే సాంస్కృతిక వాస్తవానికి పోటీగా అహింసను పెంపొందించే ప్రయత్నాలు మొదటి నుంచి జరుగుతూ వచ్చాయి. ప్రాచీన భారతదేశంలో సాగిన హింసను విశ్లేషిస్తే అందులో ఇతర దేశాలలో జరిగిన హింసతో పోలికలు కన్పించటమే గాక కొన్ని ప్రత్యేకతలు కూడా ఉన్నట్లు అర్థమవుతుంది. అవి అక్కడి దేశకాల పరిస్థితులకు సంబంధించినవి. మొత్తం మీద హింస అన్నది రాజుల మధ్య యుద్ధాల రూపంలో రాజకీయాలలో, జంతుబలులు, యోగుల స్వీయహింస, నిప్పులపై నడక, వీపులను కొక్కేలకు

గుచ్చి వేలాడటం వంటి పద్ధతులుగా మతాచారాలలో ఉంది. చిన్న నేరాలకు కూడా మనుషులను శూలాలతో గుచ్చటం, వాడి కొయ్యలపైకి విసరటం, అంగచ్ఛేదన వంటి చర్యలుగా శిక్షాస్మృతిలో కన్పిస్తుంది. ఎడారి వాసులు ఒయాసిస్సులకోసం కలలుగనేట్లు, హిందూ ఋషులు కూడా హింసలేని సమాజంకోసం స్వప్నించేవారు.

అహింసా సిద్ధాంతాన్ని మనం ఈ నేపథ్యమంతటినుంచి పరిశీలించవలసి ఉంటుంది. హిందూ మత చరిత్రలో ఇతరులతో సృజనాత్మకమైన రీతిలో వ్యవహరించి వారిని తమలో కలుపుకొన్న దశలున్నాయి, అసహనంతో వారిపై హింసకు పాల్పడిన సందర్భాలూ ఉన్నాయి. అందుకు గాని, ఇందుకుగాని అప్పటి చారిత్రక పరిస్థితులు ఏమిటన్నది ఒకోసారి గమనించవచ్చు. కాని ఒకోసారి అందుకు వీలులేదు. హింసపట్ల ఇతరుల వైఖరిలో ఎంత అస్పష్టత ఉందో, బహుశా అంతే అస్పష్టత హిందువుల వైఖరిలోనూ ఉందనుకుంటాను. అయితే ఈ అంశంపై వారిలో కనిపించేంత విస్తృతమైన, లోతైన చర్చ బహుశా మరెక్కడా కన్పించదు.

## చందమామలో మనిషి /కుందేలు

ఇటువంటి పలు వైరుధ్యాలను నేను పరస్పర ఘర్షణగా కాక ద్వంద్వాలుగా చూపేందుకు ప్రయత్నించాను. ఎందుకంటే ద్వంద్వ దృష్టి, ద్వంద్వ స్థితి భారతీయ ఆలోచనా విధానంలో ఉంది. అది కేవలం భారతదేశానికి ప్రత్యేకమైంది కాకపోవచ్చునన్నది వేరే విషయం. దానినట్లుంచి, ఈ విషయమై ఎ.కె. రామానుజన్ తన తండ్రి గురించి అన్న మాటలను గమనించండి. " నాకు (నా తరం వారికి) ఆయన మేధస్సులో ఏకకాలంలో ఖగోళశాస్త్రం, జ్యోతిషశాస్త్రం రెండింటికీ చోటుండటం ఇబ్బందికరంగా తోచేది. తనలో ఒక నిర్దిష్టత కోసం చూసాను నేను. కాని ఆయన ఆ విషయాన్ని లెక్కచేసినట్లుగాని, కనీసం అందుగురించి ఆలోచించినట్లు గాని కన్పించలేదు... 'మెదడులో రెండు కవాటాలు ఉంటాయని నీకు తెలియదా?' అన్నారాయన. కాని రెండు సాంస్కృతిక కవాటాల మధ్య అనుసంధానంతో చాలా ఆసక్తికరమైన పరిణామాలు కొన్ని చోటు చేసుకుంటాయి. వాటిని మనం బ్రాహ్మణ– బ్రాహ్మణేతర, లిఖిత – మౌఖిక, స్త్రీ – పురుష అని ఏమైనా అనవచ్చు. మధ్యమ యుగాలకు చెందిన ఒక హిందూ తాత్త్విక గ్రంథం, ఒక వాదనకు గల రెండు పార్శ్వాలను కూడా గ్రహించగల శక్తి ఉన్నవాడే గొప్ప గురువు కాగలడని నిర్వచించింది. భారతీయులు నీలం, ఆకుపచ్చ సిల్కు దారాలు పడుగు పేకలుగా నెమలికంఠం వస్త్రం నేయటం కాకతాళీయమనలేము. ఆ వస్త్రం ఒక వైపు నుంచి నీలంగా, మరొక వైపు నుంచి పచ్చగా, ఎదుటి నుంచి రెండు రంగులూ కలగలసి కనిపిస్తుంది. ఇది భారత దేశపు ప్రత్యేకత. ఇది కూడా ద్వంద్వ కవాటపు స్థితివంటిదే.

ఈ ద్వంద్వ దృష్టికి మరొక ఉపమానం చంద్రునిలో కన్పించే నల్లని భాగం. చాలామంది పాశ్చాత్యులు దానిని మనిషి ముఖమని, కొన్ని సంస్కృతుల వారు స్త్రీ లేదా

లేడిని పోలిన జంతువని, లేదా దున్న లేదా కప్ప వగైరాలని భావిస్తారు. కాని హిందువులలో అత్యధికులకు, అదే విధంగా చైనా, జపాన్, అజ్టెక్ వాసులకు అది కుందేలు. 1930లలో కొందరు భారతీయులకు అది గాంధీ బొమ్మగా తోచింది. బౌద్ధులైతే ఆ గుర్తును కుందేలుగా చెప్తూ, అక్కడ కుందేలు ఏ విధంగా వచ్చిందో వర్ణన కూడా చేశారు. అది ఈ విధంగా ఉంది.

## చంద్రునిలో కుందేలు

భవిష్యత్తులో బుద్ధుడు కానున్న వ్యక్తి ఒకసారి కుందేలుగా జన్మించాడు. అట్లా జన్మించి, భిక్షకులు ఆహారం కోసం జంతువులను వధించకుండా ఉండటానికి తన శరీర మాంసాన్ని ఇవ్వగలనని ప్రకటించాడు. ఆయనను పరీక్షించేందుకు ఇంద్రుడు బ్రాహ్మణుడి రూపంలో వచ్చాడు. అపుడా కుందేలు ఆ బ్రాహ్మణుడికి ఆహారం అయ్యేందుకు మంటలోకి దూకి కాలటానికి సిద్ధపడింది. అప్పుడు ఇంద్రుడు తన మంత్రశక్తితో మంటను సృష్టిస్తాడు. ఆ వెంటనే కుందేలు, తన శరీరంపైగల క్రిమికీటకాలు కూడా చనిపోకుండా ఉండేందుకు వంటిని మూడుసార్లు దులుపుకొని, ఆ వెనుక ఆ మంటలోకి ఉరుకుతుంది. కాని మంట మంచువలె చల్లబడిపోతుంది. అప్పుడు ఇంద్రుడు తన నిజరూపాన్ని వెల్లడిచేసి, కుందేలు సుగుణం అందరికీ తెలిసేందుకు దాని రూపాన్ని చంద్రునిపై ముద్రించాడు.

కుందేలు ఆ విధంగా తనను తాను హింసించుకుని, మరొకరు వేరొకరిపై హింసకు పాల్పడకుండా ఆపజూడటమనే డొంకతిరుగుడు తర్కం మనకు తరచు ఎదురవుతుంటుంది. చంద్రునిలో కుందేలు తరహా ఆలోచనలు హిందూమతం, బౌద్ధం మధ్య ఒకే రీతిన అనేకం ఉన్నాయి.

చంద్రునిలో హిందువులు చెప్పే కుందేలును, పాశ్చాత్యులు నమ్మే మనిషిని కూడా చూసి వాటి మధ్యగల భిన్నమైన దృక్పథాలను గమనించటమంటే, హిందూమత చరిత్రను ఏ విధంగా పరిశీలించాలో అర్థం చేసుకోవటమన్నమాట. హిందువులు తమ ధర్మశాస్త్రాలను మత సంప్రదాయంలో భాగంగా కాని, లేదా ఇతర శాస్త్రాలను అధ్యయనం చేసే పద్ధతిలోనే దీనిని కూడా అధ్యయనం చేయటంకాని, లేదా ఈ రెండు దృక్కోణాల నుంచికూడా గాని పరిశీలించవచ్చు. హిందూమతం గురించి కొన్ని విషయాలను హిందువులు మాత్రమే అర్థం చేసుకోగలరు. అవి స్థానికమైన, వ్యక్తిగతమైన వాస్తవాంశాలు కావచ్చు, ఆచారాలు కావచ్చు, వాటి విలువలైనా కావచ్చు. ఇవేవీ గాక అందరికీ తెలిసిన ఇతర మతాంశాలైనా అయి ఉండవచ్చు.

ఈ రోజుల్లో హిందూమతం గురించి అధ్యయనం చేసే హిందూయేతర విద్యా వేత్తలలో ఎక్కువమంది, హిందువులను నొప్పించని విధంగా ఆ పని చేయజూస్తున్నారు. కాని హిందూమతాన్ని ఒక విద్యావేత్త దృష్టినుంచి అధ్యయనం చేయడమంటే మార్క్స్,

ఫ్రాయిడ్, ఫౌకాల్ట్, ఎడ్వర్డ్ సయీద్‌ల వలె ఒక అంశాన్ని టెలిస్కోపిక్ దృష్టితో చూడటమే. స్వయంగా హిందువులు చేసే సూక్ష్మ పరిశీలనకు అది అనుబంధమవుతుంది. ఆయా అంశాలను చుట్టి ఉండే సమయసందర్భాల వివరణ, హిందువుల సూక్ష్మ పరిశీలనలో జరగని విధంగా ఇతరుల టెలిస్కోపిక్ అధ్యయనంలో కన్పించే అవకాశముంటుంది. పాక్షిక ధోరణలు ఎప్పుడూ ఉంటాయి. కాని ఏ కోణం గురించి అయినా సరే ఒక పద్ధతి ప్రకారం అధ్యయనం జరిగినప్పుడు హిందువుల పాక్షిక ధోరణలు, ఇతరుల పాక్షిక ధోరణులు ఒకదానినొకటి నకారాత్మకం చేసుకుంటాయని ఆశించాలి. క్రీస్తు పూర్వం 430 వ సంవత్సరకాలానికి చెందిన గ్రీకు చరిత్రకారుడు హెరొడోటస్ చెప్పిన ప్రకారం, ప్రాచీన కాలంలో పర్షియన్లు ముఖ్య విషయాలనుగురించి మొదట బాగా తాగిన స్థితిలో, మరునాడు మామూలు స్థితిలో చర్చించేవారు. లేదా ఆ విషయాన్ని బట్టి మొదట మామూలుగా, ఆ తర్వాత మద్యం సేవించి చర్చించేవారు. అదే విధంగా హిందూ మతాన్ని మనం మొదట హిందువుల దృక్కోణం నుంచి, ఆ వెనుక విద్యావేత్తల దృక్కోణం నుంచి చూడాలి. ఈ పరిశీలనలో హిందువులకు, ఇతరులకు వేర్వేరు విధాలైన విలువైన అంతర్ దృష్టి ఏర్పడవచ్చు. కాని ఆ భిన్నమైన అవగాహనల వల్ల వాటికి కలిగే పరస్పర నష్టమేమీలేదు. జంతుశాస్త్రం చదివేందుకు మనం ఏనుగులం కానక్కరలేదు. కాని జంతుశాస్త్రజ్ఞులు ఏనుగుల గురించి రాసినందువల్ల వాటికి కలిగే హాని లేదు.

మొదట ప్రస్తావించిన ఉపమానానికి తిరిగివెళితే, చంద్రునిలోని మచ్చ కుందేలనే అభిప్రాయం మనకు ఒకసారి ఏర్పడితే ఇక అందులో మనిషి ఊహించటం కష్టం. అయినప్పటికీ ఆ రెండు చిత్రాలనూ చూసేందుకు మనం ప్రయత్నించాలి. ఉదాహరణకు సతీసహగమనాన్ని తీసుకుంటే, అది మంచి సంప్రదాయమని (అనగా చందమామలో కుందేలని) కొందరు హిందువులు ఎందువల్ల భావిస్తారు, అదే సమయంలో కొందరు ఎందుకోసం తీవ్రంగా వ్యతిరేకిస్తారో మనం అర్థం చేసుకోవాలి. మరొకవైపు అమెరికన్లు అది చెడు సంప్రదాయమనే అభిప్రాయాన్ని (అనగా చంద్రునిలో మనిషి చూడటాన్ని) మార్చుకోనక్కరలేదు. అంతిమంగా, హిందూమతాన్ని అర్థం చేసుకునేందుకు చంద్రునిలో కుందేలును, మనిషిని కూడా చూసేదృష్టికి హిందువులు కాని వారు అలవాటుపడాలి.

**ఆమ్లెట్ తయారు చేయలేరు....**

తమలో గల వైవిధ్యత విషయమై హిందువులలో ఇప్పుడు భిన్నాభిప్రాయాలున్నాయి. ఆ స్థితి కొందరికి గర్వకారణంగా తోచగా కొందరికి ఆందోళనను కలిగిస్తుంది. ఆందోళనకు గురయ్యేది ముఖ్యంగా హిందూ జాతీయ వాదులు లేదా హిందూ మతవాదులు. వారిని ఫండమెంటలిస్టులు, హిందూత్వవాదులని కూడా పిలుస్తున్నారు. వారు ముస్లిములకు, క్రైస్తవులకు, 'తప్పుదారి పట్టిన' హిందువులకు వ్యతిరేకం. వారికి రాజకీయంగా బిజెపి,

సాంస్కృతికంగా ఆర్ఎస్ఎస్ ఉన్నాయి. అవిగాక హిందూ హ్యూమన్ రైట్స్, విశ్వహిందూ పరిషత్, ఎబివిపి మొదలైన ఇతర సంస్థలు కూడా ఉన్నాయి. నేను వాటినన్నింటిని హిందుత్వ వర్గం లేదా మతవాద హిందువులని వ్యవహరిస్తాను. హిందూ చరిత్ర గురించి ఈ సంస్థలు చెప్పే కథనానికి కూడా ఈ పుస్తకం ప్రత్యామ్నాయమవుతుంది.

ఈ సంస్థలలో నా వ్యక్తిగత సంబంధాల గురించి ఇక్కడ మొదటనే చెప్పటం మంచిది. అందువల్ల విషయానికి ఇంకా స్పష్టత వస్తుంది. 2003 నవంబర్ 12న లండన్‌లో విలియం డాల్రింపుల్ అధ్యక్షతన జరిగిన ఒక కార్యక్రమంలో నేను ఉపన్యసిస్తుండగా ఒక వ్యక్తి నాపైకి కోడిగుడ్డు విసిరాడు. కాని అది గురి తప్పింది. (అన్ని విధాలుగా కూడా). అక్కడ చేరిన సుమారు రెండు వందలమందిలో ఒకరు మరునాడు ఒక మెయిల్ సైట్‌లో, వాల్మీకి రామాయణం నుంచి నేను ఉటంకించిన ఒక భాగాన్ని ప్రస్తావించాడు. లక్ష్మణుడు తనను కోరుకుంటున్నాడంటూ సీత నిందించిందన్నది ఆ భాగం. ఆ విషయమై మెయిల్‌లో ఈ విధంగా రాసాడా వ్యక్తి:

> మా అతి పవిత్ర గ్రంథాలలో ఒక దాని గురించి ఆమె ప్రసంగ పాఠంలో కామ సంబంధమైన అంశాలను ప్రముఖం చేసి మాట్లాడటం నాకు అభ్యంతరకరంగా తోచింది. సీతను కోరుకున్నది రావణుడేగాక ఆమె మరది లక్ష్మణుడు కూడానని ఆ ప్రసంగంలో ఉంది. అదే విధంగా మా ఇతర శాస్త్రాల నుంచి నేనెప్పుడూ వినని జంటల ప్రస్తావన తీసుకువచ్చి, రసవత్తరమైన కామవాంఛల కథనాన్ని అల్లేందుకు ప్రయత్నం జరిగింది. ఇట్లా వక్రీకరించటం కోసం శాస్త్రాలు, సంప్రదాయాలు అందుబాటులో లేనట్లయితే ఈ తెలివిమీరిన "మేధావు"లైన పాశ్చాత్యులు తమ జీవితాలు గడిచేందుకు మరేమి చేసి ఉండేవారో?

ఇదే ధోరణిలో మరికొంత రాసిన తర్వాత ఆ వ్యక్తి ఈ మాటలు కూడా అన్నాడు:

> ఆమె స్నేహితులు, తనను మెచ్చేవారు చప్పట్లు చరిచారు. వారిలో ముస్లిములు కూడా ఉన్నారు. ఆ ప్రసంగానికి ముందు వరండాలో కలిసిన ఒక ముస్లింను ఆ ప్రసంగాల పరంపరలో మిగిలినవి విన్నావా అని, మతం మార్చుకునేందుకు తను సిద్ధమా అని అడిగాను. అందుకాయన, ఇదే విధమైన ఒక కార్యక్రమంలో ఒకరు (తను వివేకానందుడననట్లు ఆ గొడవలో అస్పష్టంగా వినిపించింది) తన వస్త్రాలను తొలగించి, తను హిందువో లేక ముస్లిమో చెప్పగలరా అంటూ సదస్యులను ప్రశ్నించినట్లు పేర్కొన్నాడు.

ఆ మెయిల్‌ను రాసిన వ్యక్తి రాజకీయ ఆలోచనలు ఏమిటో, ముఖ్యంగా ఒక ముస్లింతో తన సంభాషణను ప్రస్తావించటాన్ని బట్టి అర్థమవుతున్నది. ఆ ముస్లిం వ్యక్తి వివేకానందుని ప్రసక్తి తెచ్చినందుకు కృతజ్ఞతలు కూడా చెప్పాలి. (అయితే ఆ పని చేసింది

వివేకానందుడు కాక కబీర్ అని నా అనుమానం) ఆ లండన్ సభలో నా ప్రసంగానికి సమర్ధనగా (అదే విధంగా కోడిగుడ్డు విసిరిన ఉదంతం గురించి) నేను ఏమి మాట్లాడానో, అదే ఈ పుస్తకానికి కూడా వర్తిస్తుంది. నేను మాట్లాడింది ఈ విధంగా ఉంది:

(నా ప్రసంగంలో ఉదాహరించిన) సంస్కృత కావ్యాలు శృంగార జీవితానికి సంబంధించి ఎటువంటి అరమరికలు లేని కాలంలో రాసినవి. నేను నిర్దిష్టంగా ఆ భాగాలను మాత్రమే ప్రస్తావించాను.... విచిత్రమేమంటే నేను ఆ కావ్యాలను ప్రశంసించాను తప్ప ఖండించలేదు. వాటిని నేను అనువదించిన తీరును బట్టి, హిందూ సంప్రదాయానికి బయటివారు కూడా ఆ విషయాలు తెలుసుకుని, హిందూ కావ్యాలలోని సౌందర్యాన్ని, సంక్లిష్టతను, వివేకాన్ని గుర్తించి కొనియాడుతున్నారు. ఇంతకు ముందు వారి దృష్టిలో హిందూమతం అంటే కులవ్యవస్థ, అస్పృశ్యులను హీనంగా చూడటం మినహా మరేమీ కాదు.

హిందూ శాస్త్రాల వైవిధ్యతను గురించి కూడా నేను పేర్కొనవలసింది. ఒక హిందువు “ఎప్పుడూ వినని” కావ్య భాగాన్ని నేను ఉదాహరించాననే ఆరోపణ గురించి నా సమాధానం ఇది: ‘అవును! సరిగా ఆ పని చేయటమే నా ఉద్దేశం. తన సంప్రదాయంలోని ఏ అంశానికైతే ఆయన అభ్యంతరం చెప్పాడో దానిని ఇతర హిందువులు పలువురు ఆమోదిస్తున్నారు. అదెట్లున్నా, అవి చారిత్రకంగా ఆయా రచనలలో భాగమై ఉన్నాయి. నాపై కోడిగుడ్డు విసిరిన వ్యక్తి ప్రాతినిధ్యం వహించే వర్గం నిరాకరించే విషయాలు హిందూమతంలో ఎన్నెన్ని ఉన్నాయో చూపదలచుకోవటం కూడా ఈ రచన ఇంత సుదీర్ఘం కావటానికి  ఒక కారణం. అందువల్ల హిందువులలో నేను గత యాభైయేళ్లుగా ప్రేమించి ఇప్పటికీ ప్రేమిస్తున్న వైవిధ్యతను, బహుళత్వాన్ని, లౌకిక జ్ఞానాన్ని, భోగాసక్తిని ఉగ్గడించి తలకెత్తుకోవటం చేస్తూనే ఉంటాను.

## అధ్యాయం 1

### పరిచయం

# ఉన్న వెలుగులోనే పనిచేయటం

### తాళం చెవికోసం వెతుకులాట

*నస్రుద్దీన్ నేలమీద దేనికోసమో వెతుకుతుండటం ఎవరో చూశారు. "ఏం పోగొట్టుకున్నావయ్యా, ముల్లా?" అని అడిగాడా వ్యక్తి. "నా తాళం చెవి" అని జవాబిచ్చాడు నస్రుద్దీన్. తర్వాత వాళ్ళిద్దరూ మోకాళ్లమీద కూర్చుని వెతకసాగారు. కొంతసేపటికి ఆ మనిషి , "ఇంతకూ సరిగా ఎక్కడ పోయిందది?" అని అడిగాడు. "మా ఇంట్లోనే". "మరి ఇక్కడెందుకు వెతుకుతున్నావు?". "మా ఇంట్లో కన్న ఇక్కడే ఎక్కువ వెలుతురుం"దన్నది ముల్లా సమాధానం.*

ఇద్రీస్ షా (1924-96), 13వ శతాబ్దానికి చెందిన
ముల్లా నస్రుద్దీన్ గురించి రాసింది

హిందువుల చరిత్రను తెలుసుకునే తాళపు చెవుల (ఒకటి కాదు అనేకం) కోసం వెతికేవారికి ఈ సూఫీ నీతి కథ ఒక హెచ్చరిక వంటిది కావాలి. మన తాళం చెవుల కోసం, మన అవగాహనల కోసం, మన నివాసాలకు బయట, మన సంస్కృతులకు బయట, మనకు ఇప్పటికే తెలిసిన శాస్త్రాలూ సమాచారాల పరిధిని దాటి అన్వేషించాలని ఆ కథ చెప్తున్నది. ఫోటో తీసేందుకు తగినంత వెలుతురులేదని ఫోటోగ్రాఫర్లు అంటుంటారు. ఆ పరిభాష హిందూ గ్రంథాలకు కూడా వర్తిస్తుంది. కాని ఇటీవలి సంవత్సరాలలో సంస్కృతంలో, ఇతర భారతీయ భాషలలోగల రచనలకు చరిత్రకారులు మంచి అనువాదాలనే తీసుకువచ్చారు. వాటిపై నిశితమైన వ్యాఖ్యానాలు కూడా వెలువడ్డాయి. ఆ గ్రంథాలు, సమాచారాలలో లోగడ ఇతరుల దృష్టికి రానివి సైతం ఉన్నాయి. అందువల్ల, ఈ విద్యావేత్తలు వెలుగులోకి తెచ్చిన విషయాలపై దృష్టిని కేంద్రీకరించి గత అనేక వందల సంవత్సరాల చరిత్రను అవగాహన చేసుకునేందుకు నేను ప్రయత్నించాను.

నా పుస్తకం హిందూ మతం గురించి కాలక్రమానుసారం, చరిత్రానుసారం చెప్తూనే, హిందువులలోని ప్రధాన వర్గాలపైగాక ఉపేక్షకు గురైన ప్రజలపై దృష్టిని కేంద్రీకరిస్తుంది. ఇందులో నేను చెప్పదలచుకున్న విషయాలు ఈ విధంగా ఉన్నాయి : (1) హిందువుల సుదీర్ఘ చరిత్ర సంపద్వంతం కావటంలో స్త్రీలు, నిమ్న కులాలు, ఇతర మతాల పాత్ర

కూడా ఉంది, (2) తరతరాలుగా గణనీయమైన సంఖ్యలో హిందువుల మధ్య పలువురు దేవతలను పూజించటం, పునర్జన్మ, కర్మ సిద్ధాంతంవంటి సామాన్య లక్షణాలు ఉన్నప్పటికీ, వాటిలో ఏ ఒక్కటి కూడా మొత్తం హిందువులందరికీ ఉన్న లక్షణం కాదు. నిజానికి అటువంటి సామాన్య లక్షణాల కన్నా ఏదో ఒక వర్గానికి ప్రత్యేకమైనవే చాలా ఎక్కువ, (3) హిందూ మతపు గొప్పతనమన్నది ఈ రోజున కొందరు హిందువులు చెప్పుకునేందుకు సిగ్గుపడే, నిజంకాదని నిరాకరించే విపరీత లక్షణాలు, విలక్షణతలలోనే ఉంది. ఆ మతపు జవసత్వాలు, అది సామాజిక వాస్తవికతలకు దగ్గరగా ఉండటం, అరమరికలు లేని ధోరణే ఆ మతపు గొప్పతనం, (4) హిందూమతంలోని వేర్వేరు శాఖలు, ఉపశాఖల మధ్యగల వైరాల చరిత్ర, వర్తమాన రాజకీయ, మత సంబంధాలలో మనకు కన్పించే హింసకు నేపథ్యం లేదా పునాది వంటిది.

చరిత్ర, వైవిధ్యం అన్న వాటిని నేనిపుడు ఒకటొకటిగా వివరిస్తాను.

## చరిత్ర: అందుబాటులో గల వెలుతురు

భారతదేశం గురించి అధ్యయనం చేసిన తొలితరం యూరోపియన్ పరిశోధకులు, ప్రతిదీ కాలావధిలేనిది, శాశ్వతమైనది, మార్పులేనిదన్నది భారతీయుల నమ్మకమని అభిప్రాయపడ్డారు. వేదాల గురించిన భారతీయుల భావనలు వారికి ఇందుకు అనువుగా ఉపయోగపడ్డాయి. దానితో, హిందువులు గుర్తించే 'మార్పు' అనే గుణాన్ని వారు పరిగణనలోకి తీసుకోలేదు. అందుకు విలువ ఇవ్వలేదు. హిందువుల వైఖరిని పాశ్చాత్యులిపుడు ఓరియెంటలిజం లేదా ప్రాక్ ప్రపంచపు ధోరణి అని అంటున్నారు. ఎడ్వర్డ్ సయీద్ 1978లో ఆ పదబంధాన్ని సృష్టించి అదే పేరుతో ఒక పుస్తకం కూడా రాసాడు. ఆ అంశాన్ని బ్రిటిష్ రాజ్ గురించి చర్చించినపుడు మళ్లీ విచారించవచ్చుగాని, ప్రస్తుతానికి అందుకు నిర్వచనం చెప్పాలంటే, అది యూరోపియన్లకు భారతదేశంతో ఉండిన ప్రేమ–ద్వేష భావనల కలయిక అన్నమాట. ఆ భావనలకు గల కారణాల్లో సమంజసమైనవి, అసమంజసమైనవి కూడా ఉన్నాయి. ఆ దేశం, అక్కడి సమాజం భిన్నంగా, విచిత్రంగా ఉంటుందని, శృంగారోద్దీపన కలిగిస్తుందని, ఆధ్యాత్మికమైనదని ఎప్పుడూ మారదని రకరకాల ఆలోచనలు ఉండేవి వారికి, ఈ ఓరియెంటలిస్టులలో కొందరు భారతీయులు కూడా ఉన్నారు. వారివలెనే యూరోపియన్లకు కూడా ఈ అభిప్రాయాలు కొందరు హిందువుల నుంచే కలిగాయి. వీరంతా హిందూ మతాన్ని కాలావధిలేనిదిగా పరిగణిస్తారు. అయితే ఆ మతం సుమారు క్రీస్తు పూర్వం 10,000 సంవత్సరాల నాటిదన్నది కొందరి అంచనా కాగా, బ్రిటిష్ పండితులు అంతకన్నా ముందటిదన్నారు. భారతదేశానికి సంబంధించిన ఆయా అంశాలు "శాశ్వతమైనవి, మార్పులేని" వనే భావనగల ఓరియెంటలిస్ట్ భాషా శాస్త్రవేత్తలు, వేలాది సంవత్సరాల పాటు నిలిచి ఉండే కొన్ని దృక్పథాలు ప్రాచీన కాలంలో ఉన్నట్లు కనుగొన్నారు. కాని ఆ దృక్పథాలలో తదనంతర కాలంలో వచ్చిన

ముఖ్యమైన మార్పులను గాని, హిందూమతంలో ఆ లక్షణాలతో నిమిత్తం లేని అనేక ఇతర పార్శ్వాలను గాని పరిగణనలోకి తీసుకోలేదు.

హిందూమతపు కేంద్ర భావనలనుకునే కర్మ, ధర్మం, సంసారం వంటి దృక్పథాలు భారతదేశ చరిత్రలోని ఆయా దశలలో, కొన్ని నిర్దిష్టమైన పరిస్థితులలో రూపు తీసుకున్నాయి. అవి తర్వాత కొనసాగాయిగాని, మార్పులకులోనయ్యాయి. అవి ఇప్పటికీ కేంద్ర భావనలే అయినా వాటి ఇదమిత్థమైన అర్థాలేమిటి, అంతకన్నా ముఖ్యంగా వాటిని నమ్మేవారు ఏం చేయాలి అన్నది వేర్వేరు చారిత్రక దశలలో మారుతూ వచ్చాయి. తిరిగి ప్రతి దశలోనూ అవి స్త్రీ – పురుషులకు వేర్వేరుగా, ఒక కులం నుంచి మరొక కులానికి భిన్నంగా కన్పిస్తాయి. ఎప్పటికపుడు కొత్త ఆలోచనలు కలిగి పాతవాటిని పక్కకు తోయటం, లేదా వాటిని సవరించటం హిందూమతంలో చాలానే జరుగుతుంటుంది.

ఈ విషయం హిందువులలో కొందరికి బాగా తెలుసు. ఎప్పుడూ తెలుసు. కొన్ని విషయాలు 'అపూర్వ' మైన విధంగా, అప్పటికప్పుడు కొత్తగా జరిగినట్లు హిందూశాస్త్రాలు, కావ్యాలు పేర్కొంటాయి. తాము స్థానిక రాజవంశాలు, స్థానిక దేవతలు, రాజకుటుంబాలకు చెందకపోయినా ఆ స్థాయి కోసం సాహసంతో ప్రయత్నించేవారి గురించి కూడా ఆ కావ్యాలలో మనకు కన్పిస్తుంది. హిందువుల కాలిక స్పృహ ప్రగాఢమైంది. మార్పును తీసుకురావటంలో కాలం నిర్వహించే పాత్ర, గతంలో సంభవించిన వాటి ఫలితాలు వర్తమానంలో లభిస్తాయనే నమ్మకం వంటివి మహాభారత ఇతిహాసంలో విరివిగా కన్పిస్తాయి. కాని చరిత్ర పట్ల హిందువుల దృష్టికి, పాశ్చాత్యుల దృష్టికి తేడా ఉంది. బౌద్ధం చెప్పే బుద్ధి వికాసానికి, యూరోపియన్ బుద్ధివికాసానికి ఎంత తేడా ఉందో అంత. యూరప్‌లో వలెనే భారతదేశంలో కూడా మనుషులు ఏదో ఒక చారిత్రక సమయంలో గ్రంథ రచన చేసారు. వాటిని కనుగొనేందుకు మనం చేసే ప్రయత్నాలు సఫలం కావటం పలు విధాలుగా ఉంటుంది. ఆ రచనలు వ్యాఖ్యానాలు, నిర్వచనాలు, అనువాదాల ద్వారా అభివృద్ధి చెంది వ్యాపిస్తూ పోతాయి.

జూడాయిజం, క్రైస్తవం, ఇస్లాం వంటి కొన్ని ఇతర మతాలవలె హిందూ మతాన్ని కాలక్రమానుసారం రాయటం తేలికకాదు. ఈ ఇతర మతాలు నిర్దిష్టమైన చారిత్రక ఘటనలను ప్రస్తావిస్తాయి. అందుకు భిన్నంగా అనేక హిందూ గ్రంథాలలో కనిపించే ఘటనలకు తేదీలను ఒక శతాబ్ది పరిధిలో కూడా నిర్ధారించలేము. అనగా, అవి ఏ శతాబ్దంలో ఎప్పుడు జరిగాయో కూడా చెప్పలేకపోవటమన్నమాట. అయితే, హిందూమతంతో పాటు అదే కాలంలో, అదే భూభాగంలో ప్రవర్ధమానమైన బౌద్ధమత చరిత్రకారులు, ఆ రికార్డులను బట్టి ఆ చరిత్ర తేదీలను చాలావరకు నిర్ధారించగలుగుతున్నారు. ఆ కాల నిర్ధారణలు హిందూమత చరిత్రకారులకు కూడా ఆధారమవుతున్నాయి. ప్రాచీన భారత చరిత్రను రాసేవారికి విదేశీ యాత్రికుల అప్పటి రచనలు కూడా ఉపయోగపడు తున్నాయి. వాటిలోని అభిప్రాయాలు ప్రతి సందర్భంలో సరైనవి కాకపోయినా తేదీలు మాత్రం నమ్మదగినవే.

సంవత్సరాలు, తేదీలన్నవి చాలావరకు రాచరికపు పాలనలతో నిమిత్తం గలవి. ఆయా శాసనాలు, యుద్ధాలు, మత సంస్థలకు దాన ధర్మాల వంటి వాటి తేదీల నమోదు అవసరమని ఆ రికార్డులు రాసేవారు భావించారు. రాజు ఎవరనిగాక నాగళ్లు ఎవరికున్నాయో తెలుసుకొండని డి.డి. కొశాంబీ చరిత్రకారులను కోరిన దరిమిలా మనం చరిత్ర అంటే రాజులేనని భావించటం లేదిపుడు. అయినా రాజులకు తమస్థానం తమ కుంటుంది. కాకపోతే మనం ఒకప్పటివలె వారి గురించి మాత్రమే తెలుసువాలనుకోవటం లేదు. సాంస్కృతిక చరిత్రలో కీలక సమయాలన్నవి అలెగ్జాండర్ భారత భూభాగంపై ఎప్పుడు కాలుమోపాడు, గుప్తులు సామ్రాజ్యాన్ని ఏ కాలంలో నిర్మించారు అనే మహత్తర రాచరిక పరిణామాలపై ఆధారపడి ఉండవు. ఎంతో సుసంపన్నమైన, నవీనమైన సాంస్కృతిక పరిణామాలు ఏదో ఒక సామ్రాజ్యం వర్థిల్లుతున్నప్పుడు గాక, రెండు వంశాల పాలనకు మధ్య కాలంలో కూడా చోటు చేసుకోవచ్చు. శాసనాలు, నాణేల వంటివి విజేతలైన రాజుల గురించి ఎక్కువ చెప్పినా, ప్రజల గురించి తెలియజేసే ఇతర ఆధారాలు కూడా వాటిలో కొన్ని ఉన్నాయి.

మనం ఆయా ఘటనల తేదీలను నిర్దిష్టంగా తేల్చుకోలేకపోయినా సమారుగా ఒక అభిప్రాయానికి రావచ్చు. కాని వాటిని తర్వాత స్పష్టమైన సమాచారం లభించినప్పుడు మార్చుకోవలసి ఉంటుంది. పైగా ఆయా కాలాల ప్రకారం దశలను నిర్ణయించినప్పుడు, ఆ దశలలో జరిగిన ఘటనలంటూ పొరపాటు నిర్ధారణలు చేసే ప్రమాదం ఉంటుంది. భాషా శాస్త్రజ్ఞుల తరహాలో నిర్ధారించటం చరిత్రకారులకు వీలుపడదు. ఉదాహరణకు, కొన్ని ఉపనిషత్తులలో బ్రాహ్మణాలను ఉదహరించినందున ఉపనిషత్తులన్నీ బ్రాహ్మణాల నుంచి ఉద్భవించినవేనని భాషా శాస్త్రవేత్తలు భావిస్తారు. కాని బ్రాహ్మణాల అనంతర కాలంలో ఉపనిషత్తుల రచన జరిగినందున, అప్పటికొత్త పరిస్థితుల ప్రభావం ఉపనిషత్తులపై కనీసం పాక్షికంగానైనా ఏ మేరకు ఉందనే ప్రశ్న చరిత్రకారులు వేయాలి. అటువంటిదేమీ లేనట్లయితే ఉపనిషత్తులను రచించవలసిన అవసరమేమున్నది? ఉపనిషత్తులలో కన్పించి బ్రాహ్మణాలలో లేని విషయాలమాటేమిటి? అవి గ్రీకుల నుంచి వచ్చి ఉంటాయని, ప్లేటోను గుర్తు చేస్తాయని, క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దినాటి యూరోపియన్ ఆక్సియాల్ యుగ ప్రభావం కావచ్చునని, సింధూ నాగరికత ప్రభావం మాటేమిటని పలు ఊహాగానాలు మనకు వినిపిస్తుంటాయి. అయితే, ఈ ప్రభావాల గురించి అవుననేందుకు గాని కాదనేందుకుగాని మనకు ఖచ్చితమైన సమాచారం లేనందున, ఆధారాలకోసం గ్రీసువైపు చూడటానికి ముందు ఉపనిషత్తుల కాలంలో భారతదేశంలోని అంతర్గత పరిస్థితులేమిటో తెలుసుకోవటం అవసరం. కొత్త రాజకీయ వ్యవస్థలు, పన్నుల విధింపులు, దైనందిన జీవితంలో మార్పులు ఏమిటో పరిశీలించాలి.

బయటినుంచి వచ్చే ఆలోచనలు ఇక్కడ పాదుకోవాలన్నా, ఇక్కడి సంస్కృతిలో అందుకు స్పందించే లక్షణాలుండాలి. ఉదాహరణకు పునర్జన్మ అనే ఆలోచన గ్రీసు నుంచి భారతదేశానికి వచ్చిందనుకున్నా, లేక ఆ రెండు చోట్లకు మెసొపొటేమియా నుంచి దిగుమతి అయిందనుకున్నా (ఈ ఊహలు నిజంకాకపోవచ్చు. కాని అసంభవం కూడా కాదు), భారతీయులు ఈ ఆలోచనను స్వీకరించి పురుషులమధ్య ప్రేమ అనే మరొక గ్రీకు ఆలోచనను ఎందుకు తిరస్కరించారన్నది మనం వివరించవలసి ఉంటుంది. అదే విధంగా ఉపనిషత్తులలో, ప్లేటో రచనలలో కూడా పునర్జన్మ గురించిన చర్చ ఉన్నప్పటికీ రెండు చర్చల మధ్యగల తేడా ఏమిటో తెలియాలి.

భాషాశాస్త్రం, చరిత్ర అనే రెండింటికి మనం వ్యక్తిత్వం అనే మూడవ అంశాన్ని కూడా జోడించవలసి ఉంటుంది. ఏది ఒరిజినల్ అనేది తేల్చటం ఎప్పుడూ చిక్కు ప్రశ్నే. వ్యక్తిగత ప్రతిభను కొలవలేకపోవటం అందుకొక కారణం. ఆలోచనలు శూన్యం నుంచి ఉద్భవించవు. అదే విధంగా వాటిని అంతకుముందుండిన ఆలోచనల సారాంశం మాత్రమే అని కూడా అనలేము. వ్యక్తులకు స్వంత ఆలోచనలుంటాయి. అవి ఒకోసారి అదే సమయంలో అదేచోట నివసించే వారి ఆలోచనలకు భిన్నంగా ఉంటాయి. నిమ్న వర్గాల వారికి ఉపేక్షకు గురైన ఇతరులకు గల ఆలోచనలు ఏమిటని అన్వేషించే ముందు మనం ఈ మాట గుర్తుంచుకోవాలి. వారు ఒకోసారి ఒక బృందంగా కన్న వ్యక్తులుగా ఎక్కువ సాధిస్తారు. వ్యక్తులను సమకాలీన ఆలోచనలనుంచి ఉద్భవించిన వారని మాత్రమే అనలేము. షేక్స్పియర్ కేవలం ఎలిజబెత్ యుగపు రచయిత కాదు.

భారత దేశ చరిత్రలో కొందరు వ్యక్తులు తమ సమకాలీన భావ ధోరణులకు భిన్నంగా సహనశీలతను లేదా హింసను అటో ఇటో మలుపు తిప్పిన సందర్భాలున్నాయి. ఉదాహరణకు అశోకుడు, అక్బర్ చక్రవర్తులు తమ కాలపు ధర్మంహింస అయినప్పటికీ మత సహిష్ణుతకు అనుకూలంగా సరికొత్త కార్యక్రమాలు ఆరంభించారు. భిన్నమైన, వ్యక్తిగతమైన, ఒరిజినల్ ఆలోచనలు గలవారే రుగ్వేదంలోని 'నసదీయ' (అప్పుడేమీ లేదు) మంత్రాన్ని, జైమినీయ బ్రాహ్మణంలోని దీర్ఘ జిహ్వ అనే వ్యభిచారిణి కథను, ఉపనిషత్తుల లోని రైక్వా కథను రచించారు. బళ్ల కింద నివసించే రైక్వావంటివారు మొత్తం ప్రపంచ సాహిత్య చరిత్రలోనే కనిపించే తొలి నిరాశ్రయ జీవులలో ఒకరు. ప్రాచీన కాలంలో ఇటువంటి సృజనాత్మక సాహిత్యాన్ని సృష్టించినవారు సంస్కృతంలో మాత్రమే రాయలేదు. అది మౌఖిక సాహిత్యంలో, ఒకోసారి స్త్రీలు, నిమ్నవర్గాల కథనాలలో, సంస్కృత సాహిత్యంలో కన్పించే స్థానిక సంప్రదాయాలలో కూడా ఉంటుంది. లిఖిత సంప్రదాయం ఉన్నవారిలో లేనివారిలో కూడ ఒరిజినల్ ఆలోచనలు అరుదైనవే. సమకాలీన ధోరణులకు భిన్నమైన వైఖరి తీసుకున్న ప్రముఖుల విషయానికి వస్తే, అశోకుడు, అక్బర్, గాంధీ వంటివారు ఒకవైపు, ఔరంగజేబు, బ్రిగేడియర్ జనరల్, రెజినాల్డ్ డయ్యర్, ఎం.ఎస్.

గోల్వాల్కర్ తదితరులు మరొకవైపు హిందూమతంలో గణనీయమైన మార్పులను తీసుకువచ్చారు.

అప్పటికే గల ఒక సంప్రదాయం కొనసాగటం, మరింత వృద్ధి చెందటంలో ఆశ్చర్యం లేదు గాని, కొత్తవి రావటం, నిలబడటం మాత్రం సులభంగా అర్థం కావు. ఒకానొక రాజు, లేదా రాజకీయ ధోరణి, లేదా వాతావరణ మార్పు వల్ల అశ్వమేధయాగ సంప్రదాయం మొదలై కొనసాగిందనిగాని, లేదా ఒక దేవతా పూజ కొనసాగిందని గాని మనకు అనిపించవచ్చు. కొన్ని ఆలోచనలు ఎందుకు బలపడి విస్తరిస్తాయో, కొన్నిటి విషయంలో అట్లా ఎందువల్ల జరగదో ఒకోసారి చరిత్ర వివరించి చెప్పగలదు. కొన్ని ఆలోచనలు ఆయా కాలాలలో ప్రజలకు ముఖ్యమని తోచినపుడు, ప్రజలకు అవసరమైన వాటితో సదరు ఆలోచనలకు సంబంధం ఉన్నప్పుడు అవి సమాజంలో పాదుకొంటాయి. ఉపనిషత్తుల సామాజిక సందర్భాన్ని, ప్రాపంచిక విషయాల గురించి వాటిలో తిరిగి రాయటాన్ని అర్థం చేసుకున్నట్లయితే, రైక్వాకథ మొదట ఎవరి మనసులోకి వచ్చిందన్నది ఎట్లున్నా, ఆ కథను తమ కావ్యాల్లో చేర్చేందుకు బ్రాహ్మణులు ఎందుకు ఇష్టపడ్డారనేది తెలుస్తుంది. ఆ కథ తమ సామాజిక వ్యవస్థను సవాలు చేసేది అయినప్పటికీ వారు దానిని ఉపనిషత్తులలో చేర్చటం గమనించదగ్గది.

## కల్పన, చరిత్ర, సంకేతాత్మకత

శాస్త్రాలు, కావ్యాల చరిత్రను అర్థం చేసుకోవటంతో పాటు, చారిత్రక ఘటనల రికార్డులకు, ఊహా ప్రపంచాల చిత్రీకరణకు, ఒకోసారి ఆ రెండింటిని కలిపే సంకేతాత్మకతకు మధ్యగల సంబంధాలను కూడా మనం గ్రహించాలి. భౌతికమైన అంశాలను మొదట చూడాలంటే లింగమన్నది కేవలం లింగం కావచ్చు. లేదా లింగంతో పాటు చుట్ట కూడా కావచ్చు. అనేక సంస్కృత రచనలు, ప్రాచీన శిల్పాలు (క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దికి చెందిన గుడిమల్ల లింగం వంటివి) లింగాన్ని స్తంభించిన శిశ్నంగా వర్ణిస్తాయి. ముఖ్యంగా శివుని లింగమంటాయి. కశ్మీర్‌లో పదకొండవ శతాబ్దిలో నివసించిన క్షేమేంద్రుడనే బ్రాహ్మణుడు రచించిన క్రీడామాలిక, మానవ లింగం గురించి ఈ విధంగా ప్రస్తావించింది. "లింగపూజ చేసే సాకుతో ఇంటికి గడియపెట్టుకున్న ఆ భామ తన అంగాన్ని చర్మంతో చేసిన లింగంతో రుద్దుకుంది." ఇందులో లింగమన్న మొదటి మాట శివలింగం కాగా, రెండవది చర్మంతో చేసిన బొమ్మ అయి ఉండాలి లేదా పురుషుని శరీరానికి బిగించిన నమూనా అయినా కావాలి. ఫ్రాయిడ్ వలె పలువురు హిందువులు కూడా దీర్ఘంగా, గుండ్రంగా ఉండే అనేక ఇతర వస్తువులలో లింగాన్ని చూస్తారు. స్వయంభూలింగాలవలె. ఈ విధమైన భౌతికార్థంలో లింగం గురించి కులాలు, భాషల వ్యత్యాసం లేకుండా భారతదేశమంతటా తెలుసు.

కాని కొన్ని కావ్యాలు లింగాన్ని శృంగారంతో నిమిత్తం లేని ఒక కాంతి స్తంభంగా, భగవంతుని నైరూప్య చిహ్నంగా పరిగణిస్తాయి. మరికొందరి దృష్టిలో రాతి లింగాలలో శృంగార సాంకేతికత ఉన్నప్పటికీ అవి స్వచ్ఛమైన యోగి తత్త్వానికి ప్రతీకలు. అయితే ఈ భిన్నత్వంలో ఆశ్చర్యంలేదు. శిలువ విషయమై క్రైస్తవులలోనూ భిన్న భావనలున్నాయి. హిందువులలో లింగాన్ని భగవంతుని నైరూప్య చిహ్నంగా భావించేవారు, అందుకు శారీరకమైన నిర్వచనాలు చెప్పటాన్ని ఆక్షేపిస్తారు. గుడిమల్ల లింగాన్ని 21వ శతాబ్ద ఆరంభంలో చూసిన కొందరు, ఆ లింగాకారం ముందు వైపు నగ్నంగా చెక్కి ఉన్న పురుషుని నడుం చుట్టూ ఒక వస్త్రం కప్పి ఉండటాన్ని గమనించారు. అదే వస్త్రం లింగం చుట్టూ ఉంటుంది. కాని లింగం ఊర్ధ్వ భాగాన్ని యథాతథంగా నగ్నంగా వదలివేశారు. హిందూ సంప్రదాయం ఒక కాలిని బ్రేకుపై, మరొక కాలిని ఆక్సిలరేటర్‌పై ఉంచి వాహనాన్ని నడుపుతుందనేందుకు ఇది మంచి ఉదాహరణ. చంద్రునిలో కుందేలు, మనిషి కూడా కనిపించినట్లు, మనం ఒక విషయానికి గల అక్షరార్థాన్ని, సంకేతాత్మకతను కూడా గమనించటం అవసరం.

చరిత్రను అర్థం చేసుకోవటంలో కల్పనను, కల్పనను అర్థం చేసుకోవటంలో చరిత్రను ఏ విధంగా ఉపయోగించుకుంటామనే విషయమై మనం జాగ్రత్తగా ఉండాలి. ఒక విషయం నిజం కాదనేందుకు బలమైన ఆధారాలున్నప్పటికీ కొందరు అది నిజమని చాలాకాలం వరకు నమ్మినపుడు, దానిని 'కల్పన' అనే అర్థంలో తీసుకుంటాను నేను. తెరముందు కన్పించేది చూడు తప్ప తెరవెనుక ఉన్న మనిషిని పట్టించుకోకు అనటం వంటిదిది. ఒకరాజు ఎనిమిది వేలమంది జైనులను సంహరించాడనే కల్పనను మనం చదివినపుడు అసలు అటువంటి రచనను ఎందుకు చేసారు, అదే కథనాన్ని పదే పదే ఎందువల్ల చెప్తూ పోయారో అర్థం చేసుకునేందుకు మనం చరిత్రను చూడాలి. అనగా, ఆ కాలంలో హిందువులు, జైనులకు మధ్యగల ఉద్రిక్తతలకు కారణాలేమిటో తెలుసుకోవటమన్నమాట. ఆ కారణం రాజాశ్రయం కోసం పోటీపడటం వంటిది కావచ్చు. అయితే, అటువంటి కాల్పనిక రచనకు వెనుక గల చరిత్ర నిర్మాణానికి ఈ కల్పనను ఉపయోగించుకోలేము. ఒక హిందూ పాలకుడు జైనులను నిజంగానే నరమేధం కావించాడు అనేందుకు  ఆ కథ సాక్ష్యమనలేము.

మరొక ఉదాహరణను చెప్పాలంటే, రామాయణంలో రాక్షసుల గురించి రాయటంలో మరొక ఉద్దేశం, దుష్ట శక్తులు మనను నాశనం చేయగల రూపాలు తీసుకోగలవని ఒక ఊహా చిత్రాన్ని గీయటం కూడా కావచ్చు. కొన్ని విధాలైన మనుషులకు రాక్షసులు ఉపమానాలు అయి ఉండాలి. కాని అయోధ్యనుంచి వచ్చిన వారు గిరిజనులు, ద్రవిడుల వంటి భారతదేశపు మానవ సమూహాలను జయించిన ఉదంతం రామాయణంలో ఒక్కటి కూడా లేదు. అదే విధంగా లంకకు వారధి నిర్మాణం వాస్తవంగా జరిగిందనలేము.

అటువంటి కల్పనలలో మనకు కనిపించేది ఆ కాలపు మానవుల భావనల చరిత్రే తప్ప వాస్తవ ఘటనలు కాదు.

ఆలోచనలు, భావనల చరిత్ర నిజమైన చరిత్రకు ఆధారం కాకపోయినా విలువైనదే. ఎందుకంటే కల్పనలు, వాటిలోని ఆలోచనలూ, భవిష్య చరిత్రపై ప్రభావం చూపగలవు. జైనుల మారణహోమాన్ని గురించిన ఆ కథను చదివనవారు ఆ కారణంగా జైనులపట్ల, హిందువుల పట్ల ఆ తర్వాత భిన్నంగా వ్యవహరించి ఉంటారు. చరిత్రలో ఏమి జరిగిందో మనకు తెలిసినదానికన్నా తెలియనిదే ఎక్కువ. కాని ఆ ఘటనల గురించి నలుగురూ చెప్పే కథనాలు మనకు తెలుసు. గారిసన్ కెల్లర్ రాసిన ఒక నవవలలోని ఒక పాత్ర అన్నట్లు, ప్రశ్నలకు "జవాబులు లేవు, కథలు మాత్రమే ఉన్నాయి". కథలు మాత్రమే ఉండటమన్నది మన విషయంలోనే కాదు. తరుచు ఆ కాలపు ప్రజలకు, తర్వాత కాలాల ప్రజలకు తెలిసింది కూడా అంతే. అనగా, తదనంతర పరిణామాలకు, చర్యలకు అవి ప్రేరణ అయి ఉండవచ్చు నన్నమాట. వాస్తవ ఘటనలు, భావనలు సంకేతాలను సృష్టిస్తాయి. ఒకోసారి ఒకే సందర్భంలో వాస్తవాలు, సంకేతాలు కూడా కథనంలో ఉండవచ్చు.

కల్పనలను "చరిత్రను కమ్ముకున్న పొగ" అన్నారు. నా ఉద్దేశం కల్పనల పొగను చారిత్రక ఘటనలనే అగ్నితో సమతులనం చేయటం ఒక్కటేకాదు. కల్పనలన్నవి చారిత్రక ఘటనలకు స్పందనలుగా మాత్రమే ఉండిపోక ఆ ఘటనలను అవి ముందుకు ఎట్లా తోసుకుపోగలవో నేను చూపదలచుకున్నాను. అనగా కల్పనల పొగ కూడా అగ్నిగా మారటమన్నమాట. బ్రిటిష్‌వారు తూటాలకు జంతువుల కొవ్వును పూయటం నిజమైనా కాకపోయినా, భారత సైనికులు ఆ మాట నమ్మటం ఒక విప్లవానికి దారితీసింది. మనం ఏమి చేస్తామో అటువంటి వ్యక్తులమే గాక, ఏమి ఊహిస్తామో ఆ తరహా వ్యక్తులం కూడా.

## వైవిధ్యత

క్రీస్తు పూర్వం సుమారు 1200 నాటి వేదాల నుంచి అమెరికన్ విమానాశ్రయాలలో కన్పించే హరే క్రిష్ణ భక్తులవరకు గల మతం గురించి, మతాల గురించి చెప్పేది, హిందూ మతం ఎక్కడ ముగిసి ఎక్కడి నుంచి బౌద్ధం ఆరంభమవుతుందో వివరించేది ఒక నిర్దిష్టమైన భావన అంటూ ఏమైనా ఉందా? ఒక ఏకీకృత మత రూపంలో హిందూ మతం అనేదేమీ లేదన్న అభిప్రాయం ఒకటుంది. అదే విధంగా మనం హిందువులని పిలిచే వారందరిది ఒకే వర్గీకరణ కాదని, వారు తమను తాము భారతీయులు, బెంగాలీ వైష్ణవులు, శైవులు అంటూ పలు విధాలుగా పిలుచుకుంటారని మరొక అభిప్రాయం ఉంది. ఈ రెండింటికి మధ్య తేడా చూస్తూనే కొన్ని ప్రశ్నలు వేసుకోవటం అవసరం. ఆ ప్రశ్నలివి: (1) హిందూమతం అనేది ఉందా? (2) దానికి హిందూ మతమన్న పేరే సరైనదవుతుందా? (3) హిందువులు తమను తాము ఆ పేరుతో వ్యవహరించుకోకున్నా ఇతరులు ఆ పని చేయవచ్చునా? ఈ ప్రశ్నలకు పరస్పర సంబంధం ఉంది. అదే సమయంలో అవి వేర్వేరు ప్రశ్నలు. హిందూ మతమన్న దానిని, ఆ పేరునూ ఒక్కొక్కటిగా పరిశీలిద్దాము.

**హిందువులు, హిందూమతం అంటూ అసలున్నాయా?**

వేటిని ఉద్దేశించి అయితే మనం హిందువులు, హిందూ మతం అంటున్నామో వాటినట్లా పిలవటంపై చాలా అభ్యంతరాలున్నాయి.

ఇతర మతాలతో సంఘర్షణ స్థితివంటిది ఏర్పడేవరకు హిందువులు తమను తాము ఒక నిర్దిష్టమైన మతానికి చెందిన వారిగా భావించుకోలేదు. పదిహేడవ శతాబ్దివరకు కూడా అనేకమంది భారతీయ రాజులు తమను ఒక దేవునితోనో, ఇతర పాలకులకన్న అధికులమని సూచించే విధంగానో, తమ వ్యక్తిగత లక్షణాలతోనో, తమ ప్రజలతోనో గుర్తించుకునే బిరుదులను స్వీకరించారు తప్ప, కేవలం హిందువులతో కాదు. ఎవరిమతం ఏదైనా సంస్కృతులు సంప్రదాయాలు, విశ్వాసాలు అన్ని మత వర్గాలవి ఇంచుమించు ఒకే విధంగా ఉండేవి. తమను తాము కేవలం తమ మత విశ్వాసాలు, సంప్రదాయాలను బట్టి గుర్తించుకున్నవారు చాలా తక్కువ. వారి గుర్తింపులు తమ ప్రాంతాలు, భాష, కులం, వృత్తి, జాతి ప్రకారం ఏర్పడేవి. ఆయా వర్గాలను బ్రిటిష్ పాలకులు వారి మతాలను బట్టి గుర్తించటం, అక్కడి విదేశీయులు వేర్వేరు మతస్తులను వేర్వేరు తత్వాలు కలవారిగా వర్గీకరించటం మొదలు పెట్టిన తర్వాతనే పలువురు భారతీయులు ఆ పద్ధతిని అనుసరించసాగారు. లోగడనుంచి గల తమ ఆలోచనల వైవిధ్యతను మరచిపోయి, తమది ఏ వర్గీకరణ అంటూ తమను తాము ప్రశ్నించుకోవటం మొదలు పెట్టారు. ఒక రాజు తనను తాను 'హిందూపతి' గా చెప్పుకోవటం పదిహేడవ శతాబ్ది తర్వాతనే కన్పిస్తుంది.

వాస్తవానికి భారతదేశంలో అధికులు నేటికి కూడా తమ గుర్తింపును మతపరంగా కాక కులం, జాతి వంటి ఇతర విధాలుగా చెప్పుకుంటారు. హిందువులు తమనుతాము ఒకే వర్గంగా కాక, వేర్వేరు వర్ణాలుగా గుర్తించుకున్నారు. వారిలో వాస్తవంగానే ఒక విస్తృతమైన వైవిధ్యత ఉంది. పలు శాస్త్రాలు, అలిఖిత సంప్రదాయాలు, మూలాలు ఏమిటో తెలియని స్థానిక మతాల నుంచి మొదలుకొని క్రీస్తు పూర్వం 1000 సంవత్సరాలకన్న ముందే ఆరంభమైన సంస్కృత గ్రంథాలవరకు, ఇప్పటికీ రచిస్తున్నవాటి వరకు, ఎన్నింటినో ఆధారం చేసుకుని ఈ వైవిధ్యత ఏర్పడింది. అంతకన్నా ముఖ్యంగా, ఒకే శాస్త్రాన్ని ఇన్ని వందల సంవత్సరాలుగా వేర్వేరు కులాలవారు, స్త్రీ-పురుషులు, వ్యక్తులు తమ అవసరాలకు, కోర్కెలకు అనుగుణంగా ఏ విధంగా చదివి నిర్వచనాలు చెప్పుకున్నారనే దానిపై కూడా ఈ వైవిధ్యత ఆధారపడింది. ఒకవైపు వేర్వేరు శాస్త్రాలకు, ఒకే శాస్త్రానికి చెందిన వేర్వేరు నిర్వచనాలకు, మరొక వైపు భిన్న సంప్రదాయాలకు మధ్య సమతులనం ఏర్పడింది. ఈ పరిస్థితులు హిందువుల వైవిధ్యతను మరింత పెంచాయి. కనుక వారికి ఒకే గుర్తింపు అన్నది ఏర్పడలేదు.

"వారంతా" కలిసి దేనిని నమ్ముతారో, ఏమి చేస్తారో తెలియకపోవటం వల్ల కూడా హిందూ మతాన్ని ఏకీకృత వ్యవస్థగా భావించలేమన్నది మరొక వాదన. హిందూ సంప్రదాయానికి ఎవరో ఒక వ్యవస్థాపకుడు, వ్యవస్థాపక సంస్థ అంటూ లేదు. ఫలానా సంప్రదాయాన్నే అనుసరించాలని నిర్దేశించేవారు లేరు. ఏది హిందూ భావన ఏది కాదో నిర్ణయించేవారుగాని, లక్ష్మణ రేఖలను గీసి అమలుపరచేవారు గాని లేరు. శాకాహారం, అహింస, కులం వంటి ప్రధానాంశాలన్నీ చర్చకు గురయ్యేవే తప్ప మూఢ నమ్మకాలు కాదు. ఒక హిందూ మత గ్రంథమంటూ లేదు. భగవద్గీత వంటివి "హిందువులందరికీ" శిరోధార్యం కాదు. కనీసం యూరో– అమెరికన్లు వాటిని ప్రశంసించే వరకు ఆ స్థితి లేదు. హిందువులలోని వేర్వేరు వర్గాలకు ముఖ్యమైన వేరే గ్రంథాలు కొన్ని ఉన్నాయి గాని, అవి ఇతర వర్గాలకు ముఖ్యం కాదు. ఇదీ ఈ వాదన సారాంశం.

ఈ వాదనకు గల ఒక సమాధానం, క్రైస్తవం, బౌద్ధం, ఇస్లాంవంటి ఇతర మతాలవలెనే హిందూమతంలో కూడా అనేక భిన్న విశ్వాసాలు, సంప్రదాయాలు, జాతులవారు చేరి ఉన్నారన్నది. మతాలు ఎప్పుడూ గందరగోళంగానే ఉంటాయి. కాని హిందూ మతానికి వేర్వేరు గ్రంథాలు, సంప్రదాయాలు ఉన్నా వాటి మధ్య పరస్పర సంబంధం ఉంటుందనే వారు, గందరగోళం మాట ఎట్లున్నా వీటన్నింటిని హిందూ మతం పరిధిలోకి తీసుకురావాలని చెప్తున్నారు. అనంతర కాలానికి చెందిన శాస్త్రాలు, సంప్రదాయాలు తరచు రుగ్వేదం సహా తొలి దశ గ్రంథాలను ఉదాహరిస్తాయి గనుక, ఇదంతా ఒకే సంప్రదాయమని మనం అనవచ్చు. వేదాల తర్వాత అనేక హిందూ గ్రంథాల రచన జరిగినా, సంప్రదాయాలున్నా వాటికి వేదాలు కాదుగదా ఏ సంస్కృత శాస్త్రంతో కూడా సంబంధంలేదు.

మనం ఇప్పుడు హిందువులని వ్యవహరించే కొందరు, గత రెండు వేల సంవత్సరాల కాలంలో తాము కోరుకున్నప్పుడు బౌద్ధులతో ముస్లిములతో పోల్చుకుని తామొక మతం వారమని చెప్పుకునేవారు. (ఒకోసారి బౌద్ధంలోనో, ఇస్లాంలోనో ఒక ఉపశాఖగా చెప్పుకున్నవారు కూడా ఉన్నారు). వారు తాము వేద మానవులమని లేదా వేద పరిరక్షకులైన బ్రాహ్మణులను ఆరాధించేవారమని, లేదా బౌద్ధులకు భిన్నంగా వర్ణాశ్రమ ధర్మాలను పాటించే వారమని ప్రకటించుకునేవారు. ఇదేదీకానపుడు దస్యులకు, మ్లేచ్ఛులకు భిన్నంగా ఆర్యులమనే వారు. క్రీస్తు పూర్వం ఏడవ శతాబ్దానికి చెందిన బ్రాహ్మణాలు, మ్లేచ్ఛులను అర్థంకాని భాష మాట్లాడేవారిగా అభివర్ణిస్తాయి. అదే కాలానికి చెందిన ఒక ధార్మిక గ్రంథం చెప్పేదానిని బట్టి వారు ఆవు మాంసం తింటారు. అనగా ఆర్యులు ఆ పని చేయరని అర్థం. ధర్మశాస్త్ర కర్త అయిన మనువు క్రీస్తుయుగపు తొలి శతాబ్దాలలో మ్లేచ్ఛ, ఆర్య పదాలను భాషలుగా గుర్తించాడు. ఆర్య పద ప్రయోగానికి సంబంధించి ఆయనది

సరైన మాటే. ఒక జాతి అయిన దస్యులను మాత్రం ఆయన భాషా వర్గంగా పేర్కొనక పోవటం గమనించదగ్గది. చాతుర్వర్ణాలకు వెలుపలి వారు దస్యులు. వారు మ్లేచ్ఛ, ఆర్య భాషలలో ఏది మాట్లాడినా దస్యులే. మను శాస్త్రంపై వ్యాఖ్యానం రాసిన మేధాతిథి, మ్లేచ్ఛ అనే పదానికి బదులు బర్బర పదాన్ని ఉపయోగించాడు. ఇది గ్రీకు 'బర్బరోయి', లేదా బార్బేరియన్ అనే ఇంగ్లీషు పదానికి సమానం. ఇందులో గమనించవలసింది ఏమంటే వీరెవరూ ఆ జాతి వారి మతం గురించిగాని, సంప్రదాయాల గురించి గాని ఏమీ రాయలేదు.

'హిందూ' అనే గుర్తింపులో మత విశ్వాసాలు, ఆచారాలు ముఖ్యమైనవి. ఈ మాటను మనం గుర్తించినట్లే హిందువులు కూడా గుర్తిస్తారు. తమ కులం గురించి హిందువులు ప్రముఖంగా చెప్పుకోవటం తెలిసిందే. కులాన్ని మతం నియంత్రిస్తుంది. బ్రిటిష్ అధికారులు భారత దేశంలో "ముస్లిం, క్రైస్తవ, యూదు మతాలకు చెందనివన్నీ" హిందూ సంబంధమైనవని నిర్వచించారు. తర్వాత 1955లో సుప్రీంకోర్టు ఈ విషయాన్ని మరొక కోణం నుంచి చూస్తూ "బౌద్ధ, జైన, సిక్కు మతస్థులందరూ" హిందువు అనే పరిధిలోకి వస్తారని హిందూ వివాహ చట్టంపై తీర్పులో స్పష్టం చేసింది. ఇది ఆ మూడు మతాల వారిలో అధికులు నిరసించే విషయం. సుప్రీంకోర్టు మరొక అడుగు ముందుకు వెళ్లి ముస్లిములు, క్రైస్తవులు, పార్శీలు, యూదులు కాని వారంతా హిందువులేనని, అదే విధంగా వీరశైవం, లింగాయత్, బ్రహ్మో, ప్రార్థన, ఆర్య సమాజ్ వంటి ఇతర మత రూపాలలో గలవారు కూడా హిందూమతంలో భాగమని ప్రకటించింది. వేర్వేరు మతాలవారికి వేర్వేరు వివాహ నిబంధనలు ఉన్నందున ఈ స్పష్టీకరణ అవసరమైంది. బ్రాహ్మణులకు ముందునుంచి గల వర్ణ సాంకర్య భయం, వివాహ చట్టంలోని బ్రిటిష్ చట్టాల వారసత్వం కారణంగా మరింత పెరగటంతో ఈ అవసరం ఏర్పడింది.

తమ మతం ఏమిటో నిర్వచించలేని, లేదా నిర్వచించనివారి మతమే హిందూ మతమన్నారు కొందరు. హిందూ మతానికి నిర్దిష్టమైన నిర్వచనం లేని స్థితిలో ఏమి చేయాలన్నది తోచక వారీవిధంగా మాట్లాడతారనిపిస్తుంది నాకు. సర్వేపల్లి రాధాక్రిష్ణన్ హిందూ మతం ఏమని విశ్వసిస్తుందో చెప్తూ అన్న మాటలను గమనించండి: "సత్యం బహుముఖీనమైనది. వేర్వేరు దృక్కోణాలలో సత్యం యొక్క వేర్వేరు పార్శ్వాలుంటాయి. సత్యాన్ని ఎవరూ పూర్తిగా నిర్వచించలేరు" అని హిందూమతం భావిస్తుందని పేర్కొన్నాడు. తమ మతమేమిటో నిర్వచించలేని వారి మతమే హిందూ మతం అన్న మాటలకు రాధాక్రిష్ణన్ ప్రకటనతో బలం చేకూరుతున్నది. దీనిని బట్టి, దేవుడొక్కడే అనే వారంతా హిందువులు అవుతారు. రాధాక్రిష్ణన్ కన్న ముందు తీవ్ర జాతీయవాది బాలగంగాధర్ తిలక్, మోక్షానికి సాధనాలు భిన్నమైనవని, పూజించేందుకు పలువురు దేవతలుండటమే హిందూ మతపు ప్రత్యేకత అని చెప్పటం కూడా ఇటువంటి దృక్పథానికే అద్దం పడుతుంది. హిందూ

మతం గురించిన ఈ తరహా రెండు అస్పష్ట నిర్వచనాలనే సుప్రీంకోర్టు 1966లో తిరిగి 1995 లో కోడిఫై చేసి మరొక మారు ధృవీకరించింది.

తమ దేవాలయాలు హిందూ ప్రార్థనా స్థలాల నియంత్రణ చట్టం పరిధిలోకి రావని స్వామి నారాయణ (1780–1830) అనుచరులైన సత్సంగీలు వాదించటంతో ఆ కేసు 1966లో సుప్రీంకోర్టు ముందుకు వచ్చింది. తాము హిందువులము కామని, హిందువుల సంప్రదాయ దేవతలలో ఎవరినీ తాము పూజించమని, అధిదేవతగా ప్రకటించుకున్న స్వామి నారాయణ్‌ను మాత్రమే పూజిస్తామని చెప్పారు వారు. కాని హిందూ మతానికి గల అనేక యూరోపియన్ నిర్వచనాలను, పైన పేర్కొన్న రాధాక్రిష్ణన్ అభిప్రాయాన్ని ఉదాహరించిన సుప్రీంకోర్టు వారి వాదనను కొట్టివేసింది. ఇందులో ఆసక్తికరమైన విషయమేమంటే, హిందూ దేవాలయాలలో హరిజనులకు ప్రవేశం కల్పించే 1948 నాటి బాంబే చట్టాన్ని సత్సంగీలు సవాలు చేశారు. తాము హిందువులు కానందున ఆ చట్టం తమ దేవాలయాలకు వర్తించదన్నారు. దానిని బట్టి కొందరు హిందువులు ఇతర హిందువులను తమ దేవాలయాల నుంచి దూరంగా ఉంచాలనుకున్న ప్రయత్నం, హిందూ మతపు సహనగుణం గురించి, అందరికీ అవకాశమివ్వటం గురించి సుప్రీంకోర్టు చట్టబద్ధమైన తీర్పు ఇవ్వటానికి దారితీసిందన్న మాట.

## 'జెన్' చిత్రం

'హిందూమతం' అనే పదం పట్ల వచ్చిన అభ్యంతరాలకు సమాధానంగా కొందరు విద్యావేత్తలు, ఆ మతానికి ముఖ్యమనే కొన్ని లక్షణాలను గుర్తించేందుకు ప్రయత్నించారు. అయితే అవి ముఖ్యమైనవేగాని తప్పనిసరికాదు. ఏ హిందువు కూడా వాటినన్నింటినీ నమ్మటం గాని, ఆచరించటం గాని చేయడు. కాని ప్రతి హిందువు వాటిలో ఎన్నో కొన్నింటికి బద్ధుడవుతాడు. ఇది ఇతర మతాలవారు చేయనిది. ఆ లక్షణాలను వేర్వేరు పండితులు వేర్వేరు విధాలుగా పేర్కొన్నారు. సుప్రీంకోర్టు కూడా ఎవరినీ నొప్పించని లక్షణాలతో ఒక జాబితాను సూచించింది. మనం మరికొంత నిర్దిష్టంగా రాసేందుకు ప్రయత్నిద్దాము. అవి వేదాల పట్ల విశ్వాసం (బౌద్ధం, జైనం అందులో చేరవు), కర్మ (ఇది బౌద్ధ, జైనాలను మినహాయించదు), ధర్మం (మతం, చట్టం, న్యాయం), మేరు పర్వతాన్ని కేంద్రంగా చేసుకున్న విశ్వసందర్శన, ఒకరు లేదా పలువురు దేవతల పట్ల భక్తి, పళ్లు – పూవులతో పూజ, ఒక ఆదర్శంగా శాకాహారం (భారతీయులలో 25–40 శాతం మంది మాత్రమే శాకాహారులు), అహింస, జంతుబలి, వీటిలో చివరి రెండు పరస్పర విరుద్ధమైనవి అయినా హిందువులైనవారు జంతుబలి ఇస్తూనే ఇతర మనుషుల పట్ల అహింసను పాటించవచ్చునన్న మాట. లేదా మనుషుల పట్ల, జంతువుల పట్ల కూడా అహింసాపరులు కావచ్చు.

వీటిలో కొన్ని బౌద్ధులు, జైనులతో పోలినవి కాగా, కొన్ని చాలావరకు సంస్కృత కావ్యాలకు పరిమితమైనవి. మరికొన్ని సర్వసాధారణమైన పూజలు, ఆచారాలకు సంబంధించినటువంటివి. కాని, యావన్మంది హిందువులకు కేంద్రకంకాగల అంశమేదీ లేనందున, కేంద్ర స్థానంలో శూన్యం ఉన్నందున ఆ స్థితిని జెన్ చిత్రంతో పోల్చవచ్చు. అటువంటి చిత్రంలో ఒకరికి కేంద్రమైంది మరొకరికి కైవారం, ఒకరికి కైవారమైంది ఇంకొకరికి కేంద్రమవుతుంది. హిందువులలో కొందరిని పక్కకు నెట్టివేసి ఉపేక్షించారంటే అర్థం వారికి ఉత్పత్తి సాధనాలు, ఆస్తులు ఏమీ లేకుండా చేసి దోచుకున్నారని. కాని ఆ మతంలో అదే సమయంలో అనేక కేంద్రాలున్నాయి. బ్రాహ్మణులకు తమ కేంద్రం తమకున్నది గాని అది వారి చిత్రం. అదిగాక ఇతర కేంద్రాలున్నాయి. అవి ప్రత్యామ్నాయ కేంద్రాలు.

హిందూ మత లక్షణాలని పైన మనం చెప్పుకున్నటువంటివి కాలమాన పరిస్థితులను బట్టి మారుతుంటాయి. అది వ్యక్తులపై కూడా ఆధారపడి ఉంటుంది. వ్యక్తులు మారుతారు, అందుకు అనుగుణంగా పరిస్థితులు, ఆ లక్షణాలూ మారుతాయి. అన్నీ నిత్య చలన శీలమైనవి. ఆ లక్షణాలు పలు సముదాయాలుగా ఉంటాయి. కనుక, హిందూ మతం గురించి ఏదో ఒక నిర్వచనాన్ని వారు అధికారికమైందిగా స్వీకరించరు. అందులో అన్ని నిర్వచనాలకు స్థానం ఉంటుంది. బ్రాహ్మణులను కేంద్రంగా చేసుకునే వర్ణాశ్రమ ధర్మాల గురించి మాట్లాడటం బాగానే ఉంటుంది. కాని ఇటువంటి ధర్మాలు గల కేంద్ర స్థానం విషయమై మనం ఏమి మాట్లాడినప్పటికీ అది జెన్ చిత్రంలోని కేంద్రం వలె శూన్యమైందే. ఆ ధర్మాన్ని ఆ కేంద్రాన్ని అంగీకరించే హిందువులను, తిరస్కరించే వారిని కూడా మనం అందులో భాగంగా ఊహించి మాట్లాడతాము. పరిత్యజించటం, భక్తి, త్యాగనిరతి వంటి నిజమైన హిందూ లక్షణాలు కేంద్రానికి బయటి కైవార వలయంలో లేదా దాని అంచుల వెంట ఉంటాయి. వాటిని బ్రాహ్మణులు ఊహించే హిందూ మత కేంద్ర స్థానం తనలో ఇముడ్చుకోలేదు.

## హిందువులకు, హిందూ మతానికి మరేవైనా పేర్లు?

హిందువులకు, హిందూ మతానికి పెట్టదగ్గ పేర్లు మరేవైనా ఉన్నాయనుకుంటే అవేమిటి? ఈ పేర్లను హిందువులనే వారు కూడా స్వయంగా ఎల్లప్పుడూ ఉపయోగించ లేదని, ఆ పేర్లు భౌగోళికమైనవనే అభ్యంతరాలున్నాయి. ఈ రెండు అభ్యంతరాల గురించి వివరంగా పరిశీలిద్దాం.

మనం హిందువులనే వారిలో చాలామంది తమనుతాము వేరే పేర్లతో పిలుచుకుంటారు. ఉదాహరణకు గోల్కొండ వ్యాపారులు, ఆర్యులవంటి వారు. పైగా 'హిందూ' పదం స్థానికమైనదికాదు. సింధూనదికి ఇటువైపు భారత ఉపఖండపు వాయవ్య

ప్రాంతంలో ఉన్నవారందరిని హిందువులని వ్యవహరించటం క్రీస్తు పూర్వం అయిదవ శతాబ్దంలో హెరొడోటస్, క్రీస్తు పూర్వం నాల్గవ శతాబ్దంలో పర్షియన్లు, క్రీస్తు శకం ఎనిమిదవ శతాబ్దంలో అరబ్బుల నుంచి కనిపిస్తుంది. ఆ నదిని ఇప్పటికీ స్థానికంగా సింధూనది అని, యూరప్‌లో ఇండస్ అని వ్యవహరిస్తారు. సింధూనదీ ప్రాంతంలో గల భూభాగాన్ని పర్షియన్లు హిందూస్థాన్ అని పిలిచారు. ఆ విధంగా ఈ పేర్లు బయటివారు పెట్టినవే తప్ప స్థానికమైనవికావు. తర్వాత పదహారవ శతాబ్దంలో మొఘల్ చక్రవర్తి బాబర్ తన స్మృతులలో, హిందూస్థాన్ ప్రజలు ఎక్కువమంది నాస్తికులని (ఇస్లాంను అనుసరించరన్నది ఉద్దేశం), వారిని హిందువులంటారని, హిందువులలో అధికులకు పునర్జన్మ విశ్వాసాలున్నా యని రాసాడు. బాబర్ హిందువుల గురించి చెప్పేందుకు పునర్జన్మ విశ్వాసాన్ని గుర్తుగా తీసుకోవటం, ఆ విశ్వాసం అందరికీ లేదనటం, ఆ విధంగా వారిలో వైవిధ్యతలున్నట్లు సూచించటం గమనించదగ్గది. అదే సమయంలో 'హిందూ' అనే పదం గత కొన్ని శతాబ్దాలుగా భారతదేశంలో ఉపయోగంలో ఉంది. ఇప్పుడు అక్కడి ప్రజలలో అధికులు తమనుతాము హిందువులమని చెప్పుకుంటారు. ఒక సంస్కృతికి ఒక దృక్పథం ఉన్నప్పటికీ అందుకు ఒక పదమంటూ మొదట లేకపోవటం, అటువంటి పదాన్ని తర్వాత ఇతర సంస్కృతుల నుంచి స్వీకరించటం ఇతరత్రా కూడా జరుగుతుంటుంది.

'హిందూ' పదానికి సింధూ నది రూపంలో భౌగోళికమైన ప్రాతిపదిక ఉండట మన్నది నిజం. అయితే ఆ పదానికేగాక హిందువులు, హిందూమతం అనే దృక్పథానికి కూడా చరిత్రలో భౌగోళికమైన మూలాలు ఉండటం గమనించదగ్గది. క్రీస్తు శకం ఒకటవ శతాబ్దానికి చెందిన మనువు రాసిన ధర్మశాస్త్రంలో హిందూ అనే పదం లేదు. కాని ఆ ధర్మం ఎవరికి వర్తిస్తుందో చెప్పేందుకు భౌగోళికమైన వర్ణనలు చేసాడు. ఆ భాగం ఈ విధంగా ఉంది :

> తూర్పు సముద్రం నుంచి పశ్చిమ సముద్రం వరకు, రెండు పర్వత శ్రేణుల (హిమాలయాలు, వింధ్యాచలం) మధ్యగల భూభాగాన్ని జ్ఞానులు ఆర్యావర్తమని వ్యవహరిస్తారు. అక్కడ కృష్ణ జింకలు తిరుగాడుతుంటాయి. అది జంతు బలులకు తగిన భూమి. దానికి బయటిది బర్బరుల దేశం. ద్విజులు (ఉన్నత వర్గాల వారు, ముఖ్యంగా బ్రాహ్మణులు) ఈ భూభాగాలలో స్థిర నివాసం ఏర్పరచుకునేందుకు సకల ప్రయత్నాలు చేయాలి.

ఈ భూభాగాలని మనువు అన్న ఆర్యావర్తమని భావించాలి. ఆ ప్రాంతాన్నే భారత దేశంగా నిర్వచించినప్పటినుంచి కాలం చాలా మారిపోయింది. హిందువులంతా ఇండియాలోనే నివసించాలనే భావన ఒకప్పుడు బలంగా ఉండినా వాస్తవంలో అట్లా జరగలేదు. ప్రపంచంలోని అతి ప్రాచీన వాణిజ్య సంస్కృతులలో హిందువులది కూడా

ఒకటి. వారు ఇతర దేశాలతో వాణిజ్యం నెరపుతూ అక్కడ స్థిరపడటం ప్రాచీన కాలం నుంచి ఉంది. అగ్రవర్ణాలవారు ఆర్యావర్తంలో నివసించాలన్నది మనువు ఆశాభావం మాత్రమే. కానివారు మొదట ఆగ్నేయాసియా భూభాగాలకు, ఆఫ్రికా తూర్పు తీర ప్రాంతాలకు, పశ్చిమాసియాకు వ్యాపించారు. తర్వాత బ్రిటిష్ వలస దేశాలలోనూ స్థిరపడ్డారు.

హిందువులంతా ఇండియాలో నివసించాలన్నది జరగనట్లే, ఇండియాలో నివసిస్తూ వచ్చినవారంతా హిందువులు కారన్నది కూడా నిజం. సింధూలోయ నాగరికతకు, వేదాలకు ముందటి వేల సంవత్సరాల సంస్కృతుల కాలంలోగాని, ఉత్తర భారతంలో నివాసాలు ఏర్పడిన తర్వాత యావద్భారత దేశానికి సంబంధించిగాని, బౌద్ధమత వ్యాప్తి తర్వాత గాని ఇది ఎప్పుడూ నిజంకాదు. ఇక వర్తమానానికి వస్తే, 15 శాతం మంది ప్రజలు ముస్లిములే. భారతీయ సంస్కృతిలో వారి సంస్కృతి అంతకు మించి కనిపిస్తుంది.

ప్రాచీన కాలం నుంచి వర్తమానం వరకు పరిస్థితి ఇది కాగా, హిందూ జాతీయ వాదులు సింధూ, హిందూ పదాల భౌగోళికతను ఉపయోగించుకుని హిందూమతాన్ని ఇండియాతో సమానార్థకం చేయజూసారు. ఆ విధంగా ముస్లిములకు, క్రైస్తవులకు ఇండియాలో నివసించి బాగుపడే అవకాశం లేకుండా చేసేందుకు ప్రయత్నించారు. ఈ విధమైన భావనను వ్యక్తపరచేందుకు 1922 లో వి.డి. సావర్కర్ 'హిందూత్వ' అనే మాటకు రూపునిచ్చాడు. కాని 'హిందూయిజం' అనే పదాన్ని ఉపయోగించేవారంతా హిందూ జాతీయ వాదుల వెంట ఉన్నట్లు భావించలేము. అట్లా భావించిన పక్షంలో ఈ పుస్తకంలో చేయదలచిన మేధోపరమైన చర్చ, రాజకీయ చర్చగా మారుతుంది. మనం ఆ పని చేయనవసరం లేదు.

పేరులో ఏముంది? కావాలంటే మనం ప్రిన్స్ అనే గ్రంథ రచయిత అన్నట్లు 'గతంలో హిందూ మతంగా పిలవబడిన మతం' అని అంటే అనవచ్చు. కాని 'హిందూమతం' అనే మాట పై ఎన్ని విమర్శలు వచ్చినప్పటికీ, దానికి మరేదైనా పేరు పెట్టినా, దానిని సంప్రదాయక అర్థంలో ఒక మతంగా వర్గీకరించటం సాధ్యమయేది కాదు. అందువల్ల అదే పేరును కొనసాగించటమే ఉపయోగకరంగా ఉంటుంది. కొత్త అయోమయాలుండవు. పైగా, హిందువులు తమ సంస్కృతికి మరో పేరు పెట్టుకోవాలని మనం అనలేము. అందరూ గుర్తించే పేరు అదే. ఏది ఏమైనా, హిందూ మతమన్నది నిజంగా ఉన్నా లేకపోయినా హిందువులు మాత్రం తప్పక ఉన్నారు.

## ప్రత్యామ్నాయ హిందూ మతాల చరిత్రకు మూలాధారాలు

వేర్వేరు హిందూ సమూహాలవారు వేర్వేరు తరహాల హిందూ మత జీవితాలను జీవించారు. ఆ మతంలోని వేర్వేరు పార్శ్వాలను, లక్షణాలను తమవిగా భావించారు. కొందరు అంతకు భిన్నమైన లక్షణాలను స్వీకరించారు. పరిశోధకులు కూడా హిందూ

ఏనుగను వేర్వేరు శరీర భాగాలు తడిమి భిన్నమైన అర్థాలు చెప్పారు.  ఆ అర్థాలపై వారి రాజకీయ అభిప్రాయాల ప్రభావాలు కూడా ఉన్నాయి.

హిందూ మతంలో స్త్రీలు, పురుషులు, ఇతర వర్గాలతోపాటు బ్రాహ్మణుల ఆలోచనలున్నాయి. స్థానికంతోపాటుగా దేశవ్యాప్త సంప్రదాయాలు, మౌఖిక, లిఖిత ఆధారాలు, స్థానికభాషలవి, సంస్కృతంలోవి, గ్రంథరూపంలో గలవి ఉన్నాయి. ఆ మత చరిత్రకు ఇవన్నీ ఆధారాలు. అయితే ఇవి దేనికదిగా ఉండిపోక పరస్పర ప్రభావాలు చూపించుకున్నాయి. ఉదాహరణకు స్త్రీలు – పురుషులు, స్థానిక–అఖిల భారత, మౌఖిక – లిఖిత అంశాల మధ్య ఆ విధమైన పరస్పర ప్రభావాలున్నాయి. దేనికది గిరిగీసినట్లుగా ఉండిపోలేదు. ఒకోసారి ఒకే వ్యక్తిలో రెండు విధాలైన లక్షణాలు కన్పించేవి. బ్రాహ్మణులకు జానపద సంప్రదాయాలూ తెలియటం అటువంటిదే. మరొక వైపు నుంచి ఆలోచిస్తే, నిష్ఠాపరులైన బ్రాహ్మణులు మను ధర్మశాస్త్రాన్ని, ఉదారవాది అయిన వ్యాపారి కామసూత్రను చదివారని  చెప్పలేము. అదే వ్యక్తులు పగలు పండితులతో కూర్చుని ధర్మశాస్త్రాలను, రాత్రి ప్రియురాలితో పాటు కామ సూత్రను చదివి ఉండవచ్చు కూడా. దీనంతటి అర్థం ఏ వర్గానికి చెందిన ఎవరు కూడా (అరుదుగా తప్ప) తమ పరిధికి పరిమితం కాక అటు ఒక కాలు ఇటు ఒక కాలుగా జీవిస్తూనే వచ్చారు.

ఉన్నత వర్గాల వారి లిఖిత సంప్రదాయాలకు భారతదేశపు వాతావరణం ఒక ముప్పుగా పరిణమించింది. తేమతో కూడిన ఉష్ణోగ్రతలు, చెదల కారణంగా లిఖిత ప్రతులు ఒకటి రెండు శతాబ్దాలలో దెబ్బతినేవి. జంతు చర్మాలతో చేసే లేఖన సామాగ్రిపై మతపరమైన నిషేధం ఉండగా తాళ పత్రాలకు పటుత్వం తక్కువ, మన్నిక కూడా తక్కువైనందున ఆ పాఠాలను మళ్లీ మళ్లీ కొత్త ప్రతులు రాయవలసి వచ్చేది. సంపన్నులు మాత్రమే అట్లా రాయించగలరు. లేఖకుడు అగ్రవర్ణానికి చెందిన పురుషుడై ఉండేవాడు.

భారతదేశపు చరిత్ర పొడవునా మౌఖిక, లిఖిత సంప్రదాయాల మధ్య పరస్పర సంబంధాలు కనిపిస్తాయి. లిఖిత కావ్యాలను మౌఖికంగా ఆలపించి వ్యాప్తి చెందించటం, మౌఖిక గాథలకు లిఖిత రూపమివ్వటం రెండూ జరిగేవి. మౌఖిక గాథలు వినిపించేవారు అంతా నిరక్షరాస్యులని చెప్పలేము. వారిలో అక్షరాస్యులు కూడా ఉండేవారు. లిఖిత, మౌఖిక సంప్రదాయాలకు మధ్యగల సంబంధాలకు వేదాలు, మహాభారతం ప్రముఖ ఉదాహరణలు. రుగ్వేదం వందల సంవత్సరాల పాటు మౌఖిక సంప్రదాయంగానే ఉండిపోయింది. ఆ సంప్రదాయికులు అందులోని ప్రతి శబ్దాన్ని కంఠస్థం చేసేవారు. దాని పఠన రీతిలోనూ ఎటువంటి వ్యత్యాసం ఉండేది కాదు. పాఠమూ మారేది కాదు. ఇందుకు భిన్నంగా, మార్పులు లేక స్థిరం రూపంలో ఉండగలదని భావించే మహాభారతం లిఖిత కావ్యం అయి కూడా తరచు మార్పులకు లోనైంది. ఈ రోజున వందలాది మహాభారతాలున్నాయి. లిఖితంగా, మౌఖిక రూపంలో లెక్కలేనన్ని ఉన్నాయి.

ఇది కొంత సంక్లిష్టతను సృష్టిస్తుందనుకుంటే సంస్కృతానికి, ఇతర భారతీయ భాషలకు మధ్యగల సంబంధాలు ఈ సంక్లిష్టతను మరింత పెంచుతాయి. ఉత్తర భారతదేశంలోని అత్యధిక భాషలకు వాటి వ్యాకరణం, ఒక మేరకు పదజాలంతో సహా సంస్కృతం ఒక నమూనాగా ఉంది. తెలుగు, కన్నడం, మలయాళం వంటి దక్షిణాది ద్రవిడ భాషలకు తమిళం కూడా అటువంటిదే. ఈ విధంగా ఉత్తరాదిన సంస్కృతం, దక్షిణాన తమిళం ప్రధానమనే తేడా ఉన్నప్పటికీ అంతమాత్రాన సంస్కృతాన్ని ఉత్తర ప్రాంతంతో, తమిళాన్ని దక్షిణ ప్రాంతంతో సమానం చేసి మాట్లాడలేము. ఉదాహరణకు దక్షిణ దేశపు భక్తి సంప్రదాయం సంస్కృతంలోనూ ప్రవేశించింది. రెండు ప్రాంతాల సంప్రదాయాలు, సాహిత్యాలు ఇటు అటు ప్రయాణించి పరస్పర ప్రభావాలు చూపుకున్నాయి.

లిఖిత, మౌఖిక మూలాధారాల మధ్య కూడా ఇదే విధమైన ఆదాన ప్రదానాలు కనిపిస్తాయి. యూరో – అమెరికన్ పరిశోధనలలో హిందూ మత అధ్యయనం చాలా వరకు లిఖిత గ్రంథాలను ఆధారం చేసుకుని జరిగింది. మనం ఓరియెంటలిజం అనేదాని లక్షణాలలో అది ఒకటి. దాని మూలంగా ఏర్పడిన వైఖరులతో, యూరోపియన్ తొలితరపు పరిశోధకులు వలస పాలనా క్రమంలో భాగస్వాములయారు. భారతదేశంలోని వాస్తవిక సంప్రదాయాలను తక్కువ చేసి చూపటం కోసం, తమ సామ్రాజ్యవాద చర్యలు సరైనవని గొప్పవని చూపేందుకు బ్రిటిష్ అధికారులు భారతదేశానికి చెందిన లిఖిత శాస్త్రాలను మాత్రం ఉదాహరించేవారు. ఆయా శాస్త్రాలు, కావ్యాల ధోరణి బ్రాహ్మణులను కేంద్రం చేసుకుని సాగేది. సంస్కృతానికి, లిఖిత సంప్రదాయానికి ప్రాధాన్యత లభించేది. ఇటీవలి కాలంలో పరిశోధకులు ప్రజల సంప్రదాయాలకు, ఉత్సవాలకు, పురావస్తు శాస్త్రానికి, కళా చరిత్రకు, శిలా శాసనాలు, విదేశీ యాత్రికుల కథనాలు, జాతుల చరిత్ర వంటి వాటికి ప్రాముఖ్యత ఇవ్వటం ఆరంభించారు. అప్పటి ప్రజల సజీవమైన మతం ఏమిటో కొత్త కోణాలు వారి దృష్టికి వచ్చాయి. ఆ జీవితం గురించి వారికి ఆయా శాస్త్రాలలో, కావ్యాలలో కనిపించింది భిన్నంగా ఉంది. ఇవిగాక నాణేలు కూడా వాటి కథను అవి చెప్పసాగాయి.

చరిత్ర శకలాలను కావ్య ఆధారాలు, కావ్యేతర ఆధారాలు వేర్వేరు విధాలుగా మన దృష్టికి తీసుకువస్తాయి. చరిత్ర విషయంలో మనం ఎవరినీ విశ్వసించలేము. లిఖిత పాఠాలు చెప్పేది ఒకటి కాగా చిత్రాలు, శిల్పాలు, పురావస్తు ఆధారాలు మరొక దృశ్యాన్ని చూపుతాయి. కావ్యాలలో రాసినట్లు దేవతలు పెద్ద భవనాలలో కూర్చుని ఆ భవనాలతో సహా లోకమంతటా విహరించటమనేది జరగలేదు. ఉపనిషత్తులలో గార్గి, మహా భారతంలో ద్రౌపది పద్ధతిలో అప్పటి స్త్రీలు నిజంగా మాట్లాడేవారేమో మనకు తెలియదు. సింధూ

నాగరికత తవ్వకాలనుంచి లభించిన ముద్రిక పై కనిపించిన చిత్రాన్ని అందరూ ఒకప్పుడు పశుపతి నాథుడంటూ నిర్వచించారు గాని, అది ఒక సాధారణమైన దక్షిణాసియా పురుషుడు ఎవరిదైనా కావచ్చు. అంగవస్త్రాన్ని ముడివేసుకుని పద్మాసనం పోలికలో కూర్చొనటం దక్షిణాసియాలో సర్వసాధారణం. లిఖిత కావ్యాలు కాని ఆధారాలలో గల అంశాలు, ఒకోసారి ఆ కావ్యాలను పరిశీలించేవారికి కొత్త ఆలోచనలను కలిగించవచ్చు.

లిఖిత పాఠాల వల్ల అనేక ఉపయోగాలున్నాయి. అన్నింటికన్నా ముందు, ఆ కాలపు వృద్ధ బ్రాహ్మణులకు చెప్పలేనన్ని గొప్ప కథలు తెలుసు. రెండవది, అన్ని కావ్యాలు బ్రాహ్మణులు రాసినవే కావు. బ్రాహ్మణులు రాసిన కావ్యాలలో భాగంగాను, ఇతరత్రానూ అసాధారణమైన కథనాలు అనేకం ఇతర వర్గాల వారి నుండి కూడా వచ్చాయి. దక్షిణా సాహిత్య సృష్టిలో వీరి పాత్ర కూడా గణనీయమైనదే. వ్యాసుడు, వాల్మీకి, సూతుని వంటివారు ఇందుకు ఉదాహరణలు. మూడవది, బ్రాహ్మణులు రాసినట్లు చెప్పేవి కొన్ని పూర్తిగా వారు రచించినవి కాదు. బ్రాహ్మణులంతా గొప్ప పండితులుగాని, ఉన్నతమైన సంస్కృతీ సంప్రదాయాలు కలవారు గాని కారు. ఆ రచనలలో నిమ్న వర్గాలవారు, స్త్రీలు చెప్పే కథనాలు తరచు భాగమవుతుండేవి. కొత్తగా చేరుతుండేవి. నాల్గవది, ఆయా కావ్యాలూ కథనాలూ ఘటనలు వాస్తవంగా జరిగినా కూడా. ఉపనిషత్తులలో చరిత్ర, ఊహాత్మకత రెండూ కనిపిస్తాయి. అయిదవది, ఆ కాలపు వస్తు సంస్కృతి గురించిన సమాచారం ఆ కావ్యాలలో కోకొల్లలుగా లభిస్తుంది. మనకు నాగలి పురావస్తు తవ్వకాలలో లభించక పోయినా అందు గురించిన ప్రస్తావన కావ్యాలలో ఉండవచ్చు. స్త్రీల రచనల దృష్టికి రాకున్నా పురుషులు రాసిన వాటిలో వారి ప్రస్తావనలు, వర్ణనలు, వారి జీవితాల పట్ల సానుభూతితో కూడిన వ్యాఖ్యలు కనిపించవచ్చు. ప్రాచీన సంస్కృత గ్రంథాలలోని వ్యక్తుల పాత్ర చిత్రణలు ఈ కారణాల మూలంగా ఎంతో విస్తృత రూపం తీసుకుని మన ముందుకు వస్తాయి.

నేను స్వయంగా ఆలోచనల రీత్యా, శిక్షణను బట్టి కూడా లిఖిత గ్రంథాల పట్ల మొగ్గు చూపే వ్యక్తిని. పురావస్తు శాస్త్రజ్ఞురాలిని కాదు, చరిత్రకారిణిని కాను. సంస్కృతాన్ని అధ్యయనం చేసాను. సంస్కృతంతో పాటు ఉర్దూ, తమిళం కాక లాటిన్, గ్రీక్ చదివిన తరానికి చెందిన ఓరియెంటలిస్టును. అయితే ఆ స్థితి నుంచి నెమ్మదిగా బయటపడు తున్నాను. నేను ఎప్పుడూ ఏదీ నేలనుంచి తవ్వి తీయటంగాని, ఒక శిల్పం ఏ కాలానిదో నిర్ధారించటంగాని చేయలేదు. వయసులో ఉన్నపుడంతా సంస్కృతాన్ని అధ్యయనం చేసి, ప్రాచీన భారతదేశం గురించి బాగా తెలిసినందున, ఈ పుస్తక రచనలో కూడా ఒక మానవికాస శాస్త్రజ్ఞునికన్నా ఎక్కువగా ఆ కాలం గురించి పరిశీలించాను. వర్తమానంతో వ్యవహరించే సమయంలో కూడా, గతంతో నిమిత్తం గల అంశాలపై దృష్టి పెట్టాను.

బ్యాక్ వీల్ డ్రైవ్ వలె ఆ గతకాలపు అంశాలే ఈ రచనను ముందుకు నడిపిస్తాయి. చాలావరకు ఇవే కారణాల వల్ల నా మొగ్గు లిఖిత గ్రంథాలవైపు, ఇంకా చెప్పాలంటే సంస్కృత సంప్రదాయాల వైపు ఉంది. మౌఖికమైన, స్థానికమైన ఆ కాలపు సాహిత్యంపై మొగ్గు తక్కువ. లిఖిత శాస్త్రాలను ఆధారం చేసుకునే పరిశోధనల అవాంఛనీయ ప్రభావం గురించి నేను ఏమి చెప్పినప్పటికీ, ఆ శాస్త్రాలు, కావ్యాలలో గల విలువైన సమాచారాన్ని ఈ పుస్తకంలో ప్రశంసించక మానలేదు. కొన్ని విధాలైన సమాచారానికి స్త్రీలు, నిమ్న తరగతులవారు, అప్పటి వాస్తవ జీవితాలు ఏ విధంగా ఉన్నదీ తెలుసుకోవటం అవసరమని ఈ రోజుల్లో కొందరు భావిస్తున్నారు. కాని అటువంటి సమాచారం కోసం కూడా నేను లిఖిత సంస్కృత రచనలపైనే ఆధారపడ్డాను.

## స్త్రీలు

ప్రాచీన భారతీయ గ్రంథాలనుంచి స్త్రీలను పరిహరించారని, విజేతలైన పురుషులే వాటి రచయితలైనందున ఆ రచనలలో వారి జాడలు కన్పించవని అంటారు. కాని ప్రాచీన గ్రంథరచనలో వారి సహకారం చాలా ఉంది. ప్రాచీన సమకాలీనానికి చెందిన అనేక కథనాల గురించి కావ్య రచయితలకు తెలియజేసింది వారే. ఈ విషయాన్ని ఆయా రచనలలో పేర్కొన్నారు. వారు మరెన్నో కథనాలకు ప్రేరణ అయ్యారు కూడా. వారిలో కొందరు చదువను, రాయను నేర్చి స్థానిక భాషలకు, సంస్కృతానికి మధ్య కీలకమైన సంబంధాలకు దోహదం చేసారు. స్త్రీలు వేదాలను అధ్యయనం చేయటంపై నిషేధం ఉండినా, వైదికాచారాలను నిర్వహించే వారి పత్నులు ఆ క్రతువుల వద్ద ఉండటం అవసరమైనందున ఆ స్త్రీలు వేద మంత్రాలను వినటం, పఠించటం జరుగుతుండేది. వారికి ఇతర సంస్కృత గ్రంథాలు కూడా అందుబాటులో ఉండేవి కావచ్చు. తర్వాత క్రీస్తు శకం రెండు లేదా మూడవ శతాబ్దం నాటిదైన కామసూత్ర, వారికవి అందుబాటులో ఉండినట్లు చెప్పటమేగాక, కొన్నిసార్లు వారు వాటిని స్వయంగా రచింపజేసే వారని ప్రకటించింది.

సంస్కృత నాటకాలలో సాధారణంగా స్త్రీలు ప్రాకృత భాషలను, పురుషులు సంస్కృతాన్ని మాత్రమే ఉపయోగిస్తారు. కాని వారు మధ్యలో అనువాదకులు లేకుండా పరస్పరం మాట్లాడుకుని అర్థం చేసుకోవాలంటే స్త్రీలకు సంస్కృతం, పురుషులకు ప్రాకృతం తెలిసి ఉండాలి. పైగా ఆ నాటకాలలోని స్త్రీలు కొందరు సంస్కృతం మాట్లాడటం, రాయటం, పురుషులు ప్రాకృతంలో మాట్లాడటాన్ని చూడవచ్చు. ఆ విధంగా సంప్రదాయ మన్నది భంగపడుతుంది. భారతీయ తర్కశాస్త్రంలోని ఒక వాదనను అనుసరించి, జరగటం సంభవమైన దానినే నిషేధించగలం. స్త్రీలు వేదాలను పఠించరాదని శాస్త్రాలు పదే పదే ఘోషించటమంటే, వారు ఆ పని చేయగల సమర్థులని, బహుశా పండితులు గమనించ

నపుడు ఆ పని చేసేవారని భావించటం పొరపాటు కాదు. స్త్రీలను సామూహికంగా అణచివేయటమన్నది ఇతర చోట్ల వలె భారతదేశంలోనూ జరిగేది. కాని కొందరు స్త్రీలు ఆంక్షలున్నప్పటికీ వ్యక్తిగతంగా విజయాలు సాధించి గుర్తింపు తెచ్చుకోవటం ఉండేది.

పురుషులు రాసిన శాస్త్రాలు, కావ్యాలలో స్త్రీలు చెప్పిన విషయాలు ఏవైనా ఉండి ఉంటాయని మనం అన్వేషించవచ్చు. అనగా వారిని ప్రచ్ఛన్న రచయితలు లేదా ఆ మేరకు సహాయ రచయితలుగా గుర్తించ చూడటమన్నమాట. సంస్కృత రచనలలో స్త్రీలు కర్మవంటి మౌలిక విషయాలపై తమ అభిప్రాయాలను వ్యక్తపరచటం కనిపిస్తుంది. అది కూడా పురుషులకన్నా చాలా భిన్నమైన విధంగా. వారు తమ కథనాలను తాము రూపొందించినపుడు ఈ విషయాలపై వారి భావనలు మరింత ప్రస్ఫుటంగా తోస్తాయి. మహాభారతంలో స్త్రీల పరిస్థితి కొంత విచిత్రంగా కనిపిస్తుంది. వారి మాటలు మనకు నేరుగా వినిపించవు. కాని తమ అభిప్రాయాలేమీటో తెలుస్తాయి. కొందరు ప్రత్యక్షంగా కన్పించరు. కాని వారి ప్రభావాలు ప్రత్యక్షంగా ఉన్న పాత్రలపై కనిపిస్తాయి. భర్తలకు తగిన సమర్ధత లేనందున వ్యభిచరించే స్త్రీలకు కామసూత్ర గ్రంథం తగిన సూచనలు చేయటంలో ఆ స్త్రీలు తమ భర్తల వల్ల ఎదుర్కొనే సమస్యలను వర్ణిస్తుంది. అవి ఆ స్త్రీలు స్వయంగా వెల్లడించే అభిప్రాయాలే. వాటిని బలమైన ఫెమినిజానికి బీజప్రాయ స్థితి అనవచ్చు. అటువంటి రచనలు పాక్షిక దృష్టితో కూడినవే కావచ్చు. కాని వారి ఆలోచనలంటూ తెలుస్తాయి. తర్వాత కాలంలో వారు తమ పేర్లతో రచనలు చేసే వరకు వారి గురించి తెలుసుకునేందుకు ఇదొక ఆధారంగా ఉంటుంది.

పురుషుల రచనలలో స్త్రీల ఆలోచనలను వెతికి తీయటంలో కొన్ని సమస్యలున్నాయి. వాటిని మనం గుర్తించాలి. వారి అభిప్రాయాల పేరిట పురుషులు తమ అభిప్రాయాలు చెప్పవచ్చు. వారి గురించి పొరపాటుగా చిత్రీకరించవచ్చు, లేని మనోభావాలను పేర్కొనవచ్చు. కామసూత్ర రచయిత అయిన పురుషునికి వారిపట్ల సానుభూతి ఉందిగాని నిజమైన సహానుభూతి లేదు. తన ఉద్దేశం వారిని పురుషుల ఆనందం కోసం ఉపయోగించుకోవటమే. బ్రాహ్మణుడైన రచయిత ఏ అంశంపై రాసినప్పటికీ తన మస్తిష్కంలోకి స్త్రీల ఆలోచనలు కూడా ప్రవేశిస్తుండి ఉంటాయి. అంతిమంగా ఆ కావ్యంలోని ఆలోచనలలో ఏవి పురుషులలో, ఏవి స్త్రీలవో తెలిసే అవకాశం లేదు. అయినప్పటికీ జాగ్రత్తగా పరిశీలించి స్త్రీల ఆలోచనా ధోరణులు ఏవిధంగా ప్రతిఫలించి ముందుకు సాగి ఉంటాయో గ్రహించేందుకు ప్రయత్నించవచ్చు. అప్పుడు ఆ రచనలు చెప్పదలచుకోని విషయాలను కూడా పసికట్టేందుకు అవకాశముంటుంది. పైగా ఆ కాలం గురించి తెలుసుకునేందుకు మనకు గల ఆధారాలు శాస్త్రాలు, కావ్యాలు మాత్రమే కాదు. స్త్రీలు సాధించినవి మనకు కళారూపాలలో, పురావస్తు జాలంలో దృష్టికి వస్తాయి. హిందూ చరిత్రలోని వేర్వేరు అంశాలలో స్త్రీల గురించిగల ప్రస్తావనలను బట్టి వారి పరిస్థితిని

అర్థం చేసుకునే ప్రయత్నం మనం చేయవచ్చు. వారు స్వయంగా చేసిన రచనలు సైతం అరుదుగానైనా వెలుగులోకి వస్తాయి.

## శునకాలను వండేవారి నుంచి దళితుల వరకు

క్రతువులు, కర్మకాండల నిర్వహణకు అవసరమైన మంత్ర పఠనంతో కూడిన సంస్కృతం పూర్తిగా బ్రాహ్మణులకు తెలిసి ఉండవచ్చు. కాని ఆ కార్యక్రమాలలో పాల్గొనే గృహస్తులు కూడా కొన్ని పదాలను, వాక్యాలను ఉచ్చరించేవారు. స్వగృహాలలో కొన్ని కర్మకాండలు తామే జరిపేవారు. బలులను ఇచ్చేవారు బ్రాహ్మణులే కావలసిన అవసరం లేదు. తాము కూడా ద్విజులే అయిన క్షత్రియులు, వైశ్యులు కూడా ఆ పని చేయవచ్చు. చాతుర్వర్ణ వ్యవస్థలో అందరికన్న కిందివారైన శూద్రులు ఈ విధమైన మత సంబంధ కార్యాలలో పాల్గొనే వీలులేదు. అయితే శూద్రులను దూరంగా ఉంచినంత మాత్రాన అటువంటివన్నీ బ్రాహ్మణీయ కార్యాలు కానక్కరలేదు.

గిరిజనులతో సహా నిమ్న తరగతులను ఉద్దేశించి అనేందుకు అనేక రకాల పేర్లున్నాయి. వారి వారి వృత్తులను బట్టి సంస్కృత రచనలలో చండాల, చమార, పుల్కస, అపసాద, అంత్యజ, శ్వ–పాకస (కుక్కలను వండేవారు) మొదలైన పేర్లు కనిపిస్తాయి. శ్వ–పాకసులు కుక్కలను మాత్రమే వండుకుంటారని కాదు. వారు ఏదైనా తినేవారు, అన్నీ తినేవారు. హిందు మతంలో ఆహారాన్ని బట్టి గుర్తింపు ఉంటుంది. అనంతర కాలంలో బ్రిటిష్ అధికారులు వారిని అస్పృశ్యులు, నేరస్థ జాతులు, షెడ్యూల్డు కులాలు, పారియాలు (ఇది తమిళ పదం అయినా ఇంగ్లీషులోకి ప్రవేశించింది), అణగారిన జాతులు, వెలివేసిన కులాలు అని రకరకాల పేర్లతో వ్యవహరించారు. గాంధీ హరిజనులనగా, స్వయంగా ఆ కులాలవారు 1930ల నుంచి దళిత అనే మరాఠీ పదాన్ని ఉపయోగంలోకి తెచ్చారు. ఆ పదానికి అర్థం పీడితులు లేదా విభాజితులు అని. బ్రిటిష్ వారి అణగారిన (డిప్రెస్డ్) అనే మాటకు వారు చేసుకున్న అనువాదమది. స్వయంగా దళితుడైన బి.ఆర్. అంబేద్కర్ 1950లలో వారిని బౌద్ధులుగా మార్చేందుకు ప్రయత్నించి కొంతవరకు సఫలమయ్యాడు. వలసపాలన ముగిసిన తర్వాత కొందరు పరిశోధకులు దళితులతోపాటు ఇతర నిమ్న కులాలవారిని సబ్ – ఆల్టర్న్ తరగతిగా వ్యవహరించటం మొదలుపెట్టారు. భౌగోళికంగా, సిద్ధాంతపరంగా ఆదివాసులు అనే పేరు కూడా ఉంది. వారు కొన్ని ప్రాంతాలలో నిషాదుల పేరిట నిమ్నకులంగా ఉన్నారు. వారిలో అత్యధికులు కులవ్యవస్థలో భాగం కాదు.

దళితులు, ఆదివాసీలు, శూద్రులు వేరువేరైనా అనేక సంస్కృత కావ్యాలు ఆ విషయమై అయోమయాన్ని కలిగిస్తాయి. వీరికి అగ్రకులాలతో సంబంధాలు వేర్వేరు విధాలుగా ఉంటాయి. బ్రిటిష్ అధికారులు ఒక దశలో వీరందరిని కలిపి వెనుకబడిన కులాలన్నారు గాని, తర్వాత దళితులు, బిసిలు వేర్వేరు గుర్తింపులు పొందారు. ఒకోసారి

ఈ రెండు వర్గాల మధ్య ఘర్షణ స్థితి ఏర్పడుతుంటుంది. బిసిలను ఒబిసిలని, శూద్ర తరగతులని వ్యవహరించటం కూడా ఉంది. కాని వాస్తవంలో బిసిలు, ఒబిసిలు తమను తాము దళితులనుంచే గాక శూద్రుల నుంచి కూడా వేరుగా భావించుకుంటారు. అగ్రవర్ణాలవారు వీరందరిని చిన్నచూపు చూస్తారు. అయితే వారి దృష్టి వీరి పట్ల నిర్దిష్టంగా ఏ విధంగా ఉంటుంది, అందుకు వీరి స్పందనలేమిటన్నది ఆయా కులాలను బట్టి కనిపిస్తుంది. ద్విజులు అనే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను మినహాయించి ఈ తక్కిన వర్గాలన్నింటికి కలిపి పారియాలనే తమిళ పదాన్ని ఉపయోగించటం ఉచితంగా ఉంటుందని నా అభిప్రాయం. పైన చెప్పినట్లు ఇది తమిళ పదం. డప్పులు, ఢంకాలు మోగించే కులం. తర్వాత ఆ పదం ఇంగ్లీషులో భాగమైంది. 20వ శతాబ్దపు చరిత్ర వరకు మనం పారియాలు అనే మాట ఉపయోగించి తర్వాత దళితులనవచ్చు.

పేరు ఏది పెట్టినా ఈ వర్గాలు హిందువుల చరిత్రలో ముఖ్యమైన పాత్ర వహించారన్నది గుర్తించవలసిన విషయం. నిమ్నవర్గాల గురించి అధ్యయనం చేయాలనే ఉద్యమం (సబ్ ఆల్టర్న్ మూవ్‌మెంట్) మొదలుకావటంతో దళితుల విషయాలు చాలా వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా ఆధునిక దశలో బ్రిటిష్ పాలనా కాలం నుంచి జరిగిందిది. ప్రాచీన కాలంలో దళితుల గురించి మరింత సమాచారాన్నివ్వటం ద్వారా ఆ ఉద్యమానికి దోహం చేయాలన్నది ఈ రచన ఉద్దేశం. నిమ్న కులాలను హీనంగా పరిగణించటం పట్ల నిరసనలు చాలా ముందునుంచీ ఉన్నాయి. అట్లా నిరసించిన వారు సాధారణంగా కుల సమాజం నుంచి నిష్క్రమించి, కులప్రసక్తి లేని ప్రత్యామ్నాయ సమాజాలను ఏర్పరచుకునేవారు. హిందూ వ్యవస్థలో నిజమైన సంస్కరణలన్నవి 19వ శతాబ్దం వరకు జరగలేదు. అప్పుడు కూడా అవి పరిమితంగానే కనిపిస్తాయి. నేను స్త్రీల గురించి రాసింది చాలా మేరకు పారియాలకు వర్తిస్తుంది. అదే విధంగా పారియాల గురించి రాసింది స్త్రీలకు. ఇతరుల అభిప్రాయాలంటూ బ్రహ్మణులు తమ ఆలోచనలను రాసింది పురుషులకు, నిమ్న వర్గాలకు, స్త్రీలకు వర్తిస్తుంది. ఇందులోని విశేషమేమంటే, అదే కారణం వల్ల ఈ వివిధ వర్గాల భావనలు ఏదో ఒక మేరకు, ఏదో ఒక రూపంలో అగ్రవర్ణాల సాహిత్యంలో "వాసనలీనుతుంటుంది". మొత్తం సాహిత్యంలో కాదుగాని కొంతలో. అందులో కొంత సానుభూతి కూడా కన్పిస్తుంది. ఈ సానుకూల వైఖరి అన్నది ఒక ఆరంభం. అది తర్వాత కాలంలో సంస్కరణలకు దారితీసింది. ఆ రచనలు ఒక ఊహా ప్రపంచాన్ని రూపొందించి, అందులో మనుషులు స్త్రీలకు, పారియాలకు తగు గౌరవం ఇచ్చినట్లు చిత్రిస్తాయి.

బ్రాహ్మణులు గొప్ప సాహిత్యాన్ని సృష్టించిన మాట నిజం. అయితే వారాపని శూన్యంలో చేయలేదు. వారికి భారతదేశంలోని ప్రతి ఒక్కరి మేధస్సుపై అధికారం గాని,

నియంత్రణగాని లేదు. వారు ఒకవైపు దేశపాలకులు, రాజకీయ పాత్రధారుల (సాధారణంగా బ్రాహ్మణులు, రాజులు, ఒక మేరకు వర్తకులు) నుంచి, మరొక వైపు నిరక్షరాస్య తరగతుల నుంచి ఆలోచనలను స్వీకరించేవారు. సంస్కృత రచనలలో మౌఖిక, జానపద సంప్రదాయాలు, బౌద్ధం, జైనం వంటి హిందూయేతర మతాల సంప్రదాయాలు కూడా ఉంటాయి. కనుక, ఆ రచనలలో మనకు కుక్కలను వండుకునే జాతుల స్వరాలు కూడా వినిపిస్తాయి. అవి ఒకోసారి అక్షర రూపంలో కనిపించకపోవచ్చు. అయినా మనం ప్రయత్నించినట్లయితే, ఆ సంజ్ఞలను గ్రహించగలం.

ప్రాచీన కాలానికి సంబంధించి, ఎవరు ఏ దేవాలయానికి దానాలు చేసారో శాసనాలను బట్టి తెలుసుకోవచ్చుగాని, ఎవరికి నాగళ్లున్నదీ చెప్పలేము. భారతీయ సంస్కృతి నిర్మాణంలో నిమ్న వర్గాల పాత్రను బ్రాహ్మణులు చాలావరకు కనిపించకుండా చేసారని, ఒకోసారి అసలు వారి ఉనికి తెలియకుండాచేసారని కొందరు వాదిస్తారు. కుక్క చర్మంతో చేసిన సంచిలో పోసిన పాలు అపవిత్రమైనట్లు, నిమ్నకులాలవారు చదివినందువల్ల పవిత్ర గ్రంథాలు అపవిత్రమవుతాయని సంస్కృత గ్రంథాలలో ఉన్నమాట నిజం. కాని ఈ మాట బహుశా వేదాలవంటి కొన్ని గ్రంథాలకు మినహా సంస్కృత రచనలన్నింటికి వర్తించదు. అశ్వ శిరస్సులు గల అశ్వినీ దేవతలకు వేదాలు బోధించినందుకు ఒక రుషి శిక్షకు గురైన ఉదంతాన్ని గమనించినపుడు, నిమ్నవర్గాలకు సంస్కృత కావ్య బోధనపట్ల గల నిషేధాన్ని ఎక్కువమంది పాటించినా, కనీసం కొందరు ఉల్లంఘించే వారని అర్థమవుతుంది. అశ్వినీ దేవతలు వ్యవసాయిక కుటుంబాలు, పశుపోషణా తరగతులతో సంబంధాలు కలవారు. పరిశోధించినట్లయితే మనకు స్త్రీలతో పాటు అనేక కులాల స్వరాలు వినిపిస్తాయి. దానితోపాటు మౌఖిక, జానపద సంప్రదాయాలను కూడా తరచి చూసినట్లయితే ఈ వర్గాల ప్రత్యామ్నాయ చరిత్రను మరింత ఆత్మ విశ్వాసంతో రాయగలం.

## జంతువులు : శక్తికి అశ్వాలు, అపవిత్రతకు శునకాలు, స్వచ్ఛతకు గోవులు

హిందూ ఊహా ప్రపంచంలో అశ్వాలు, శునకాలు, గోవులే కాక మర్కటాలు, సర్పాలు, ఏనుగులు, పులులు, సింహాలు, పిల్లులు, నారాయణ పక్షులవంటివి కూడా ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ఆ పాత్ర సజీవమైన జంతువులుగానేకాక, వేర్వేరు వర్గాల ప్రజల పట్ల మనుషుల వైఖరి మారుతుండటంలోనూ వీటి ప్రస్తావన వస్తుంది. యోగాసనాలకు, శృంగార భంగిమలకు, వేదాంత సంబంధమైన ఆలోచనా సంప్రదాయాలకు జంతువుల పేర్లు కనిపిస్తాయి. దేవతలు జంతువుల రూపంలో అవతారాలెత్తటం, జంతువులను వాహనాలుగా ఉపయోగించటం సర్వసాధారణమైన విషయం. మనుషులకు కూడా ఆయా జంతువులను చూసినపుడు దేవతల అవతారాలు గుర్తుకు వస్తుంటాయి.

ఒకోసారి ఆ దేవతలకు ఆయా జంతు లక్షణాలుంటాయి. దేవతల స్వభావం, ప్రపంచ స్వభావం ఏమిటి, మనుషులు తమను గురించి తామేమనుకుంటారు అనే ఆలోచనలను వారు ఆయా జంతువులకు ఉన్నట్లుగా చిత్రీకరిస్తారు. అయితే అవే జంతువుల గురించి ఇతర సంస్కృతుల వారు తమ భావనలతో పోల్చినపుడు, హిందువులు చేసే చిత్రీకరణ వారికి పొరపాటుగా తోస్తుంది.

మనుషుల వస్తు సంస్కృతిలో ఏ జంతువులు, ఏ కాలంలో, ఏ ప్రాంతంలో కనిపించాయో తెలిసినట్లయితే ఆయా సంస్కృతుల భౌగోళికత గురించి, అవి ఏ కాలంలో ఉండేవన్న విషయమై మనం ఒకోసారి అంచనాకు రాగలం. మొత్తం మీద జంతువులు మనకు కావ్యాలలో హింసను నియంత్రించే పాత్ర ధారులుగా, వేర్వేరు సామాజిక వర్గాలకు చిహ్నాలుగా కనిపిస్తాయి. సజీవ జంతువులకు, మనుషుల స్వభావాల రూపంలో ఉండే జంతువులకు మధ్య సన్నిహిత సంబంధం ఉన్నట్లు దీనిని బట్టి అర్థమవుతుంది. హిందూ మతాన్ని అర్థం చేసుకునేందుకు ఈ రెండింటిని కూడా మనం అవగాహన చేసుకోవాలి.

హిందూ మతంలో ముఖ్యంగా అశ్వాలు, శునకాలు, గోవుల పాత్ర ఆసక్తికరంగా ఉంటుంది. పురాణాలూ, కావ్యాలూ, అశ్వాలను శక్తికి, క్షత్రియులకు ముఖ్యంగా విదేశీ పాలకులకు చిహ్నంగా పరిగణిస్తాయి. అదే విధంగా శునకాలను అపవిత్రతకు, నిమ్న తరగతులకు, గోవులను స్వచ్ఛతకు, బ్రాహ్మణులకు చిహ్నాలుగా చిత్రీకరిస్తాయి. అశ్వాలు భారత దేశానికి చెందిన జంతువు కాకపోవటమే గాక ఇక్కడ బాగా ఎదగవు గనుక వాటిని బయటినుంచి దిగుమతి చేసుకోవాలి. సాధారణంగా పశ్చిమాసియా, మధ్య ఆసియా ప్రాంతాలనుంచి. అందుకు కారణం వాతావరణం, తగిన మేత. ఆ కారణాలు ఇప్పటికే ఉన్నాయి. ఇక్కడి నేలలు వర్షాలలో చిత్తడిగా ఉండి వేసవిలో ఎండబారి పగులుతుంటాయి. మేతకు అనువైన గడ్డి లభించేకాలం సెప్టెంబర్ నుంచి మే వరకు ఉంటుంది. ఆ కాలంలోనూ శ్రేష్ఠమైనదిగాని, తగినంతగాని లభించదు.

ఇదే విధమైన వివిధ కారణాల వల్ల గుర్రాలు భారతదేశానికి ఎప్పుడూ బయటి దేశాల జంతువులే. వాటిని ఎల్లప్పుడూ దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి అన్నది దేశ చరిత్ర నిర్మాణంలో భాగమైపోయింది. అవి విలువైన జంతువులు కావటంతో రాజులు వ్యక్తిగత వినియోగానికి లేదా సైన్యంలో ఉపయోగించేవారు. వాటి చరిత్ర ఇతర దేశాల నుంచి దండయాత్రలు జరిపి ఆక్రమించుకున్నవారి చరిత్ర అనదగ్గట్లుగా మారింది. క్షత్రియుల శక్తికి, వైభవానికి గుర్రాలు సంకేతప్రాయమయాయి. వాటిని కేంద్రం చేసుకుని తరచు వివాదాలు తలెత్తుతుండేవి. ఒకానొక గుర్రపుతోక రంగేమిటన్న ప్రశ్నపై పాముల తల్లికి, పక్షుల తల్లికి మధ్య పందెం నడిచినట్లు మహా భారతంలో ఒక కథ ఉంది. మూడు వేల సంవత్సరాల క్రితం ఆర్యుల గుర్రాలు ఇటు మేస్తూ, నడుస్తూ నింపాదిగా

వచ్చాయా లేక పరుగులు తీస్తూనా? సింధూ లోయ ప్రాంతంలో ప్రవేశించాయా లేక పంజాబ్‌లోనా? అనే ప్రశ్నపై వర్తమాన చరిత్ర కారులమధ్య వేడైన చర్చలు జరిగాయి. హిందూ మతంలో, కళలలో కూడా అశ్వాలకు ప్రముఖ స్థానం ఉండటాన్ని చూడవచ్చు. పోతే, కోర్కెలను గుర్రాలతో పోల్చుతూ వాటిని ఆధ్యాత్మిక ఆలోచనలతో, యోగావంటి దైహిక క్రమ శిక్షణా కార్యక్రమాలతో నియంత్రించాలని కూడా అన్నారు.

గోవు పవిత్రతను కాపాడాలన్నది బ్రాహ్మణుల పట్టుదల. హిందూ మత చరిత్రలో మనుషుల ఆహారపు అలవాట్ల ప్రశ్నపై చర్చ జరిగినపుడు ఆవు విషయమై తీవ్ర వాదోపవాదాలు జరగుతుంటాయి. వేదకాలంలో మనుషులు గుర్రాలు మినహా తక్కిన యజ్ఞ జంతువుల మాంసాన్ని, ఎద్దు మాంసాన్ని ఆహారంగా స్వీకరించేవారు. అపుడపుడు ఆవు మాంసాన్ని కూడా తీసుకున్నప్పటికీ త్వరలోనే అత్యధికులకు అది పాడి పశువుగా, అహింసకు, ఉదారభావానికి చిహ్నంగా మారింది. ఆడ గుర్రాలు, ఆడ ఒంటెలు, గేదెలు, మేకల వలె ఆవు కూడా దానిని వధించనక్కరలేకుండానే తన పాడితో మనుషులను పోషించగలదు. అందువల్ల అతి ప్రాచీన కావ్యాల కాలం నుంచి ఇప్పటి వరకు ఆవు పట్ల గల మన్నన తీవ్రమైన శాకాహార చర్చలకు మూలమవుతూ వస్తున్నది.

ఈ జంతు సముదాయపు మరొక చివరన శునకాలున్నాయి. కులదృష్టి గల హిందువులకు నిమ్న కులాలవారు, కులవ్యవస్థకు బయటి పంచములూ కుక్కలతో సమానం. సంప్రదాయ యూదులకు, ముస్లిములకు పందులు ఎంత అపవిత్రమైనవో సవర్ణ హిందువులకు కుక్కలు అంత అపవిత్రమైనవి. నిమ్న కులాల వారిని సంస్కృత కావ్య కర్తలు ఒకోసారి 'కుక్కలను వండుకునేవా' రని సంబోధిస్తారు. కుక్కలకు, ఆదివాసీలకు కూడా సంబంధం ఉంది. పశువులు కాసేవారిని, చర్మకారులను, పాకీ పనివారిని తరచు పందులు, కుక్కలని వ్యవహరిస్తుంటారు. చాణక్యుని అర్థశాస్త్రంలో శునకాలు గూఢచర్యానికి పాల్పడగలవనే అనుమానం వ్యక్తపరచారు. కుక్కలు, మైనా పక్షులు ఉండగా రహస్యాలు చర్చించరాదని రాజులను చాణుక్యుడు హెచ్చరిస్తాడు. మైనా మాట్లాడగలదు. కాని కుక్కలు? మరొక వైపు చూస్తే, కులవ్యవస్థను వ్యతిరేకించే రచనలు వాటిని అపవిత్రమైనవిగా పరిగణించవు. కుక్కలు మొరగకపోవడమంటే ఆ మౌనానికే ఒక అర్థముంటుంది. నిమ్న వర్గాల వాణికి అది మంచి ఉపమానం. ఒకోసారి వారు మౌనం వహించినపుడే తమ వాణి వినిపిస్తుంది.

ప్రత్యామ్నాయ హిందూమతంలో వైవిధ్యతలు ఉండగా, ఈ జంతువుల గురించిన భావనలు మారుతుండటమన్నది ఆ వైవిధ్యతలలో భాగమనాలి.

## బహుళత్వం, సహనం

అనేకమంది దేవతలు గల అనేక శాఖలుండటం వల్ల హిందూ మతానికి నిర్వచనం చెప్పటం కష్టం కావచ్చుగాని, ఒక సంస్కృతిగా అది ఆ మతపు మహత్తర లక్షణమనాలి.

అసంఖ్యాకులైన దేవతలు గల హిందూమతంలో బహుళత్వం, వైవిధ్యం లోతుగా వేళ్లూనుకుని ఉన్నాయి. వేర్వేరు విశ్వాసాలు, ఆచారాల మధ్య ఇనుప తెరలేవీ లేక వాటిమధ్య పరస్పర ప్రభావాలు, ఇచ్చిపుచ్చుకోవటాలు ఎంతైనా కనిపిస్తాయి. అనేక ప్రధానమైన విషయాలపై హిందూ సంప్రదాయాలమధ్య చరిత్ర పొడవునా చాలా భిన్నత్వం ఉంది. ప్రతి అంశం గురించిన వాదనలు ఏమిటో మనం గమనించవచ్చు. ఒకోసారి ముఖ్యమైన ప్రశ్నలపై అనేక వాదనలుంటాయి. శాస్త్రాలలోనూ అందుకు ఇదమిత్థమైన సమాధానాలు గాక, వేర్వేరు అభిప్రాయాల గురించి మీమాంసలు కనిపిస్తాయి.

భారతదేశంలో ఎల్లప్పుడూ ఉంటూ వచ్చిన బహుళత్వాలలో, ఒక వ్యక్తిలో ఉండే అంతర్గత బహుళత్వం, లేదా వ్యక్తిగత స్థాయి బహుళత్వం ఒకటి. వారికి ఒక సందర్భంలో ఒక ఆలోచన, మరొక సందర్భంలో మరొకటి ఉండవచ్చు. ఆ విధంగా ప్రేరణ పొందవచ్చు. ఈ విధమైన వ్యక్తిగతస్థాయి వైవిధ్యానికి మను ధర్మశాస్త్రం ఒక ఉదాహరణ. అందులోని ఒకే అధ్యాయంలో మనం మాంసాహారానికి వ్యతిరేకంగా, తిరిగి అనుకూలంగా వాదించటాన్ని చూడవచ్చు. పూజా పునస్కారాల విషయంలో కూడా హిందువైన వ్యక్తి వేర్వేరు సందర్భాలలో, వేర్వేరు అవసరాల కోసం, వేర్వేరు పండగలనాడు, తన కుటుంబ సభ్యులతో కలసి గాని, వ్యక్తిగత ఇష్టాన్ని బట్టిగాని వేర్వేరు దేవతలను పూజించవచ్చు. ఒకోసారి కొత్త కోడలు తన భర్తకు భిన్నమైన దేవతను, సంప్రదాయాన్ని తనతో పుట్టినింటి నుంచి తీసుకురావచ్చు.

సంస్కృత పదాలకు, నిర్మాణానికి ద్వంద్వార్థాలు, రీతులు ఉన్నాయి. అనేక పదాలకు భిన్నార్థాలున్నాయి. ప్రతి పదానికి అందులోనే అసలు అర్థం, వ్యతిరేకార్థం, ఒక దేవతపేరు, ఒక శృంగార భంగిమ ఉన్నాయనేవారు. దీని ఆధారంగా కవులు ద్వర్థి కావ్యాలను రాయగలిగారు. పదాల విరుపు ఏ విధంగా ఉంటుంది, ఏ అర్థాన్ని ఎంపిక చేసుకుంటారనే దానిని బట్టి నానార్థాలు స్ఫురించే లఘు పద్య రచనలు కూడా సాగాయి. ఉపమాలంకరాలతో నిండి ఉండే ఈ విధమైన కవిత్వం, బహుళత్వం పట్ల హిందువుల దృక్పథానికి ఉపమానం అనవచ్చు.

వేర్వేరు మతాలలోని తమకు నచ్చిన అంశాలను ఎంపిక చేసుకుని అనుసరించే పద్ధతిలో జాగ్రత్తలు తగినన్ని ఉంటాయి. అటువంటి జాగ్రత్తలు తీసుకుంటూనే ఉదాహరణకు ఒక హిందువు సూఫీ దర్గాలో ఆరాధనలు చేసే వీలుంటుంది. హిందూ మతంలోని భిన్నమైన శాఖల మధ్యవలెనే, హిందూ మతానికి ఇతర మతాలకు మధ్య కూడా పరస్పర ప్రభావాలు, ఆదాన ప్రదానాల వంటివి ఉంటాయి. మతాలు, సంప్రదాయాల చర్చ మతంలో అంతర్గతంగా జరుగుతుంది. ఇతర మతాలతోనూ అందుకు అవకాశముంటుంది. ఆ విధంగా హిందూ మతం మొదట బౌద్ధ, జైనాలతో, తర్వాత యూదు మతం, క్రైస్తవంతో,

ఆ వెనుక ఇస్లాం, సిక్కు మతాలతో, గిరిజన మతాలు, జొరాష్ట్రియన్ మతంతో చర్చలు, సంవాదాలు సాగించింది. ఈ చర్యలు ఒకోసారి ఉద్దేశపూర్వకంగా, ఒకోసారి అనుద్దేశ పూర్వకంగా జరిగాయి. వాటి పర్యవసానంగా ఆ మతాలను ప్రశంసించి వాటినుంచి నేర్చుకున్నది, వ్యతిరేకించి హింసవరకు వెళ్లిందీ ఉంది. వ్యతిరేకించిన సందర్భాలలోనూ నేర్చుకున్నారు. ఉదాహరణకు బుద్ధుడు విష్ణువు అవతారమన్న కథపట్ల సానుకూలత, వ్యతిరేకత రెండూ కనిపిస్తాయి.

కొన్ని కథలను హిందువులు, జైనులు, బౌద్ధులు ఎవరి పద్ధతిలో వారు వేర్వేరుగా చెప్పారు. తొలి దశలో వీరందరి మధ్య ఆలోచనల పరస్పర స్వీకరణ ఎంత స్వేచ్ఛగా జరుగుతుండేదంటే, ఒకానొక కథ లేదా సంప్రదాయం మొదట ఎవరిదో చెప్పటం అసాధ్యం. ఇంకా చెప్పాలంటే ఒకే కథను హిందువులు వేర్వేరు శతాబ్దాలలో వేర్వేరుగా చెప్పారు. ఒకోసారి హిందువుల కథకు, బౌద్ధుల కథకు మధ్య కన్న ఈ వేర్వేరు హిందూ కథనాల మధ్య తేడాలు ఎక్కువగా ఉండేవి. ఆయా చారిత్రక సందర్భాలను బట్టి అట్లా జరిగేది. వాటిలోని భాషా వ్యత్యాసాలు, లేదా రాజుల పేర్ల ప్రస్తావన వంటి వివరాలను బట్టి ఏ కథ ముందుదో, ఏది తర్వాతదో చెప్పే అవకాశం ఉంటుంది. కాని కథ ఆవిర్భావమెక్కడ, ఎప్పుడు ఎవరికీ తెలియదు. బౌద్ధులు, జైనులు, హిందువులు ఒకే విధమైన మత చిహ్నాలను ఉపయోగించిన సందర్భాలు అనేకం. ఈ రోజుకు కూడా హిందువులు, క్రైస్తవులు, లేదా హిందువులు, ముస్లిములు ఒకోసారి ఒకే విధంగా ఉండే రూపాన్ని భిన్నమైన పేర్లతో ఆరాధిస్తారు. ఉదాహరణకు సత్యాపీర్ అనే ముస్లిం పీర్ (పవిత్రుడైన వ్యక్తి) కు పద్దెనిమిదవ శతాబ్ది నాటికే విష్ణువు అవతారాలలో ఒకరైన సత్యనారాయణతో అబేధ్యం చెప్పారు.

సుప్రసిద్ధ కవి కబీర్ హిందూ, ఇస్లాం మతాలు రెండింటిని తిరస్కరించాడు. కాని గొప్ప సూఫీ బాబాలు పలువురివలె ఆయన కూడా ఆ రెండు మతాల శిథిలాల నుంచి తనదైన మత ప్రపంచం ఒకటి సృష్టించుకున్నాడు. వీరందరి దర్గాల వద్ద చాలామంది హిందువులు ఇప్పటికీ ప్రార్థనలు జరుపుతుంటారు. ఒక సంప్రదాయానికి చెందిన పూజా స్థలంపై మరొక సంప్రదాయపు పూజాస్థల నిర్మాణం ఆ విధంగా రెండు సంప్రదాయాల మధ్య పరస్పర గౌరవాలకు గుర్తుకావటంతోపాటు, ఆ చర్యలు మరొక స్థితిలో ఆక్రమణలు కూడా అయ్యాయి. పరస్పర గౌరవాలుండేవి గనుక ఒకరి ప్రభావం ఒకరిపై పడగలదేమోనని ఆందోళనలు తలెత్తేవికావు.

హిందువులలో అధికులు అభిప్రాయాలకన్న ప్రవర్తనకు విలువ ఇచ్చేవారు. ఈ విధంగా మంచిని ఇతరులనుంచి స్వీకరించే లక్షణాలు మరింత బలపడ్డాయి. నియమాలు అనేక విధాలుగా ఉండినప్పటికీ ఏది చేయదగినది, ఏది కాదన్న ప్రశ్నపై అన్ని వర్గాలకు

ఒక స్పష్టత ఉండేది. కొన్ని చర్యలైతే అసలెవరూ చేయగూడనివి. భారతదేశంలో మనుషులను చంపటమన్నది – జంతు బలి చేశారు లేక చేయలేదని, కలియగూడని స్త్రీలతో కలిసారని, వేదాలను అనుసరించలేదని, సరైనవి కాని గ్రంథాలను ఉపయోగించారని జరిగింది తప్ప, భగవంతుడు అట్లాకాదు ఇట్లా ఉంటాడన్నందుకు ఎవరినీ ఎవరూ చంపలేదు. దేవతలు తమ పద్ధతిలోనే గాక ఇతరుల విశ్వాసాల ప్రకారం కూడా ఉంటారని ప్రతిమతం అంగీకరించింది. ఇతరుల దేవతలను తాము పూజించక పోవచ్చు. కాని ఇతరులకు వారి దేవతలుంటారని గుర్తించింది.

అందువల్ల హిందువులను సర్వమత సమభావనలు కలవారని పరిగణించవచ్చు. అయితే పరిత్యాగులు, కొందరు ఏకేశ్వరోపాసకులు, కొన్ని భక్తి ఉద్యమాల వారికి సంప్రదాయ ధోరణి ఎక్కువ. బ్రాహ్మణులను, వేదాలను, ఉన్నతవర్గాలూ కులాలనే విలువలనూ ధిక్కరించేవారిని పాషండులని, పాఖండులని పిలుస్తారు. ఆ విధంగా మత ధిక్కారమనే హిందూ దృక్పథాన్ని హిందువులలోనే కొందరికి వర్తిపజేస్తారు. బౌద్ధులకు, జైనులకు అంతకన్న ఎక్కువగా వర్తింపజేసిన చారిత్రక సందర్భాలు కూడా ఉన్నాయి.

## సంకరత్వం, బహుళత్వం

ఒక అభిప్రాయం ప్రకారం మనుషులంతా ఒకేఒక గ్రూపుకు చెందుతారు. కాని వ్యక్తులు ఒకే సమయంలో వేర్వేరు గ్రూపులకు చెందవచ్చుననే అభిప్రాయాలు అనేకం ఉన్నాయి. భారతదేశంలో హిందువులు, ముస్లిముల వలె సంఘర్షణాత్మక పరిస్థితులకు లోనయేవారికి ఈ రెండవ అభిప్రాయం అనువుగా ఉంటుంది.

మనుషులను సంకరత్వం, బహుళత్వం అనే మరొక దృష్టితో చూసే పద్ధతి కూడా ఉంది. బహుళత్వంలో, వేర్వేరు అంశాలను ఒకచోట చేర్చి కలిపినా, ఆయా అంశాల స్వతంత్ర లక్షణాలు అదే పద్ధతిలో ఉండిపోతాయి తప్ప అదృశ్యం కావు. ఇటువంటి బహుళత్వ కోణం నుంచి హిందూ మతాన్ని పరిశీలించినపుడు అందులో కొన్ని ముస్లిం లక్షణాలున్నట్లు ముస్లిములకు, బౌద్ధ లక్షణాలున్నట్లు బౌద్ధులకు తోస్తుంది. అదే విధంగా ఇతర మతాలవారికి ఇందుకు భిన్నంగా సంకరత్వంలో భిన్న లక్షణాలు కలగలసిపోతాయి. సంకరత్వాన్ని, బహుళత్వాన్ని వ్యక్తులకు, సామాజిక వర్గాలకు కూడ వర్తింపచేయవచ్చు.

సాంకర్యం, బహుళత్వం, లేదా ఏకరూపత అనే వాటిలో ఒక సమస్య ఉంది. వేర్వేరు అంశాలు ఒక దానితో ఒకటి కలవటానికి ముందు స్వచ్ఛంగా ఉండేవని, పరస్పరం కలిసిన తర్వాత వాటిలో కొత్త మార్పు ఏదో రావటం లేదా రాకపోవటం వంటిది జరుగుతుందని భావించటం సరైనదేనా? మనిషికి సంబంధించిన ఏ పరిస్థితిలోనూ స్వచ్ఛ స్థితి అనేది చాలా అరుదుగా తప్ప ఉండదు. ఒకవేళ మనుషులు చరిత్రలో భాగం కావటానికి ముందు అటువంటి స్థితి ఉండినా, ఆ తర్వాత మాత్రం పరిస్థితి మారుతుంది. క్రీస్తు

పూర్వం 2000 సంవత్సరం కన్నా చాలా ముందే సింధూలోయ నాగరికత భిన్న సంస్కృతుల సమ్మేళనంగా ఉండేది. ఆ దశలో వైదిక సంస్కృతి కూడా అంతే. తదనంతర కాలంలో ఈ రెండు సమ్మేళనాలు మరికొన్ని సంస్కృతులతో సమ్మేళనం చెందాయి. సాంకర్యమన్నది పరస్పర వ్యతిరేకతలను లక్ష్యపెట్టదు. వాస్తవాలు నిరంతరం మార్పుకు గురవుతాయి తప్ప దేనికదిగా గిరిగీసినట్లు ఉండిపోవని సాంకర్యమనే దృక్పథం గుర్తిస్తుంది. ఉదాహరణకు 'ఆంగ్లో – ఇండియన్' శబ్దాన్ని తీసుకుంటే అందులో బహుళత్వాన్ని, సాంకర్యాన్ని కూడా గమనించవచ్చు. ఆంగ్లేయులు వేరు, భారతీయులు వేరు. కాని ఆంగ్లో – ఇండియన్ కావటంలో వారి మధ్య వ్యతిరేకత లేదు. అతనొక కొత్త జాతి అవుతాడు.

సాంకర్యం పట్ల సంప్రదాయకంగా చాలావరకు ప్రతికూల భావనలున్నాయి. ఆ భావనను మనమిపుడు ప్రగతి నిరోధకమైందిగా పరిగణిస్తాము. కాని గతంలో పరిస్థితి అది కాదు. ఆ భావనను ప్రతిఫలిస్తూ హిందూ సంప్రదాయంలో 'వర్ణ సాంకర్యం' అనే మాట ఒకటుంది. భారతదేశంలో సామాజిక సాంకర్యం గురించి పార్శీలు సానుకూల కథనం ఒకటి చెప్తారు. తాము భారతదేశానికి మొదట చేరినప్పుడు అప్పటి రాజు వారికి నిండుగా పాలున్న గ్లాసు ఒకటి పంపాడు. దాని భావం నగరంలో మరెవరికీ చోటులేదని. అందుకు సమాధానంగా పార్శీల నాయకుడు ఆ పాలలో పంచదార కలిపి తిప్పి పంపాడు. ఆయన చెప్పదలుచుకున్నది తాము నగరంలో అరబ్బులు, హిందువులతో పాలు – పంచదార వలె కలిసిపోగలమని, తమ వల్ల పాలు మరింత తీపి అవుతాయి తప్ప గ్లాసునుంచి పాలు ఒలికిపోవని సూచించటం. సామాజిక సమైక్యతలు, సహజీవనాల గురించి ఈ కథలో గల అర్థానికి వేరే వివరణలు అక్కరలేదు. కాని వాస్తవానికి పార్శీలు హిందూ ముస్లిములలో ఎవరితోనూ కలిసిపోలేదు. తమ ప్రత్యేక గుర్తింపుతో కొనసాగారు. 1947 లో భారత, పాకిస్థాన్‌లు విడిపోయినపుడు జరిగిన కలహాలలో ఇద్దరి మధ్య చిక్కుకుపోయారు. భిన్న సంస్కృతుల సమ్మేళనానికి ఇదే సరైన ఉదాహరణ అనిపిస్తుంది నాకు. అందులోని వేర్వేరు అంశాలు స్వంత ఉనికిని కోల్పోకుండానే పరస్పరం కలిసి ఉంటాయి.

సాంకర్యం, బహుళత్వం అనే దృక్పథాలకు పరిమితులు ఉన్నప్పటికీ, జాగ్రత్తగా ఉపయోగించినట్లయితే ప్రయోజనకరమవుతాయి. రెండింటి మధ్య కొంత తేడా ఉన్నప్పటికీ అవి మౌలికంగా ఒకటే. ఎందుకంటే, సాంకర్య స్థితిలోనూ ఆయా అంశాల అస్తిత్వం పూర్తిగా సమసిపోదు. మనం వీటిలో ఏ పదాన్ని ఉపయోగించినా అది హిందూ మతానికి సరిపోగలదన్నది నా అభిప్రాయం. నేనొకసారి వేరే సందర్భంలో హిందూ పురాణాలను, ఎల్లప్పుడూ రెండు చివరల మధ్య కదులుతూ ఒక ముగింపు అంటూ లేని గడియారం పెండ్యులంతో పోల్చాను. హిందూ మతం "తనలోని భిన్నాంశాలను పూర్తిగా మార్చివేసి ఒకే అంశంగా మార్చేందుకు నిరాకరిస్తుంది. ఈ సువిశాల విశ్వంలో అంతులేని

వైవిధ్యతలున్నాయని, ఏక కాలంలో అనేకం సంభవిస్తుంటాయని, ఒకదానినొకటి నిరాకరించకుండానే అన్నీ సంభవించవచ్చునని... ఎటువంటి ఆంక్షలు లేని వైవిధ్యతలు, వైరుధ్యాలు నైతికంగా, తాత్త్వికంగా కూడా అవసరమని" భావిస్తుందని రాసాను.

పెండ్యులం ఊగుదలలోని రెండు చివరలను గుర్తించటమంటే, హిందూ చరిత్రలో పాత్రధారి అయిన వ్యక్తి తనను తాను హిందూ, ముస్లిం సంప్రదాయాలు లేదా వాటితో పాటు ఇతర సంప్రదాయాల సాంకర్యంగా పరిగణించుకోవచ్చు. లేదా కొన్ని విషయాలలో పూర్తి హిందువుగా, కొన్నింటిలో పూర్తి ముస్లిముగానూ కావచ్చు. చరిత్రపొడవునా అనేకులు ఇదే విధంగా భావించుకున్నారు. ఏది ఏమైనా ఈ విధమైన సాంకర్య పరిణామాల మధ్య స్వచ్ఛమైన హిందువు, స్వచ్ఛమైన ముస్లిం అనే వర్గాలుండవు. సాంకర్యం చెందినవారు కొన్ని సందర్భాలలో దేవాలయంలో, మరికొన్ని సందర్భాలలో సూఫీ దర్గాలో, లేదా మరొక సంప్రదాయానికి చెందిన ప్రార్థనాలయంలో ప్రార్థనలు జరపవచ్చు. ఆధ్యాత్మిక మార్గదర్శనం కోసం ఉపనిషత్తులను, ఖురాన్‌ను కూడా చదవవచ్చు. రెండు మతాల పండగలను జరుపుకోవచ్చు.

అందువల్ల హిందువుల చరిత్ర పొడవునా అనేక అంశాలు వాటి విరుద్ధాంశాలతో కలిసి ఉంటూ వచ్చాయని, ఆ స్థితిని గుర్తించాలని నేను చెప్పదలచుకున్నాను. చరిత్రను పరిశీలించటంలో ఈ విధమైన సమన్వయ సాధనకు మనం ప్రయత్నించినప్పుడు, వేర్వేరు ఆలోచనలకు రెండు ధృవాలున్నట్లు గుర్తించవలసి ఉంటుంది. అదే సమయంలో, ఆ రెండింటిలో ఏ ధృవం కూడా స్థిరమైనది కాదు. బౌద్ధానికి క్షమాపణలతో ఒక మాట అనాలంటే, ఇందులో మధ్యేమార్గమన్నది లేదు. అట్లా కాదనుకుంటే తక్కిన మార్గాలతో పాటు మాధ్యేమార్గం కూడా సహజీవనం చేయవలసి ఉంటుంది.

## అధ్యాయం 2

# భారత దేశంలో స్థల కాలాలు

## క్రీపూ. 5 కోట్లనుంచి 50,000 సంవత్సరాల వరకు

### భారతదేశపు ఆవిర్భావం

*గంగానది విష్ణువు పాదాలనుంచి ఆరంభమై, శివుని జటాజూటం ద్వారా ప్రవహిస్తున్నప్పటికీ అది అనాది కాలం నుంచి గల ప్రవాహమేమీ కాదు. మతం చెప్పేదానినుంచి ముందుకు వెళ్లి పరిశోధనలు జరిపే భూభౌతిక శాస్త్రం చెప్పేదానిని బట్టి, ఒకానొక కాలంలో ఆనదిగాని, దానికి నీటినందించే హిమాలయాలుగాని ఉనికిలో లేవు. హిందూస్థాన్‌లోని ఇప్పటి పవిత్ర క్షేత్రాల మీదుగా సముద్రం విస్తరించి ఉండేది. పర్వతాలు పైకెగసి, వాటి అవశేషాలతో సముద్రం నిండిపోగా, దేవతలు ఆ పర్వతాలపై, అవశేషాలపై ఆసీనులై నదిని సృష్టించారు. మనం అనాదికాలం నాటిదని భావించే భారతదేశం ఆ విధంగా ఉనికిలోకి వచ్చింది.*

– ఇ.ఎం. ఫార్‌స్టర్, ఎ ప్యాసేజ్ టు ఇండియా (1924)

### సమయం

**మూలాలు:** ఆఫ్రికా నుంచి బయటి ప్రపంచంలోకి

సుమారు అయిదుకోట్ల సంవత్సరాల క్రితం ఒక త్రికోణాకారపు భూభాగం ఆఫ్రికా ఆగ్నేయ తీరానికి కొంత దూరంలో గల మడగాస్కర్ నుంచి విడిపోయి, హిందూ మహా సముద్రం మీదుగా ప్రయాణించి మధ్య ఆసియా భూభాగాన్ని ఢీకొంది. అట్లా ఢీకొనటం మహా బలంగా జరగటంతో రెండు భూభాగాల మధ్య అంచుల వెంటగల ప్రాంతం అయిదు మైళ్ల మేర ఆకాశంలోకి లేచింది. అట్లా లేచిన ప్రాంతం హిమాలయ పర్వతశ్రేణులుగా మారింది. రెండు భూభాగాలు ఆ విధంగా కలిసిపోగా హిమాలయాలకు దక్షిణానగల భాగం భారత ఉపఖండంగా మారింది. భూఫలకాల కదలికలపై పరిశోధనలు చేసేవారు చెప్పేవిషయమిది. వారిని కాదనేందుకు నేనెవరిని? ఈ విధంగా భూభాగమే కాదు, తర్వాత చాలా కాలానికి మనుషులు కూడా ఆఫ్రికానుంచి ఇండియాకు తరలివచ్చారు. భారతదేశానికి ప్రతి సంవత్సరం వర్షాలను తీసుకువచ్చే రుతుపవనాలు, సుమారు క్రీ.పూ. 50,000 సంవత్సరాల క్రితం తొలి మానవులను కూడా తూర్పు ఆఫ్రికానుంచి భారత దేశానికి తీసుకొచ్చాయి. ఆ విధంగా భారత భూభాగం మనుషులు కూడా మరొకచోటి నుంచి ఇక్కడకు వచ్చినవారే. "అనాదికాల" మన్నదాని వాస్తవాలు ఇవి. ప్రాచీన ఆర్యులన్నవారి మూలాలు కూడా బహుశా ఆఫ్రికాలోనే ఉండేవి.

చరిత్రకన్న పూర్వకాలానికి సంబంధించిన ఈ ఉదంతం, హిందూ మతం కూడా వేల సంవత్సరాలుగా బయటి మనుషులను, ఆలోచనలను తనలో భాగం చేసుకుంటూ వచ్చిందనేందుకు ఉపమానం వంటిదవుతుంది. ఆ కాలం గురించి హిందువులు చెప్పే విషయాలు, అప్పటి పాత్రధారులు, స్థల కాలాలకు సంబంధించిన కథనాలు ఈ అధ్యాయంలో నేను చర్చించే ప్రధానాంశాలు. అపుడు మహా జల విలయం సంభవించిదనే విశ్వాసం స్థలానికి (భూఖండాలమునక), కాలానికి (వేర్వేరు యుగాల సంధికాలంలో వరదలు) కూడా సంబంధించినటువంటిది. ఈ ఊహాగానాలపైనే ఆధారపడి తక్కిన చరిత్ర కల్పన అంతా సాగింది. ఇక్కడ మనం మొదట భారతదేశపు నదులు, పర్వతాల గురించి క్లుప్తంగా చెప్పుకుందాము. దేశ చరిత్రకు, అందులోని పాత్రధారులకు అవే ఆధారాలు. ఉదాహరణకు హిందూ మత విశ్వాసాల ప్రకారం గంగానది శివుని భార్యకాగా, హిమాలయాలు తనకు కుమార్తెనిచ్చి వివాహం చేసిన మామ.

## గోండ్వానాల్యాండ్, లెమూరియా

ఆఫ్రికా, న్యూ వరల్డ్‌ల చిత్ర పటాలు 1620లో అందుబాటులోకి వచ్చినపుడు, పశ్చిమాఫ్రికా సముద్ర తీరం, దక్షిణ అమెరికా తూర్పు తీరం ఒకదానికొకటి అతికినట్లు సరిపోయాయని మొదట గుర్తించినవాడు ఫ్రాన్సిస్ బేకన్. 19వ శతాబ్దపు శాస్త్రజ్ఞులు అంటార్కిటికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, మడగాస్కర్, దక్షిణ అమెరికా, అరేబియా, భారత భూభాగాలు ఒకప్పుడు ఒకే పెద్ద భూఖండంగా కలిసి ఉండేవని ఊహించారు. ఆ భూఖండానికి ఆస్ట్రియాకు చెందిన భూభౌతిక శాస్త్రవేత్త ఒకరు గోండ్వానా, లేదా గోండ్వానాల్యాండ్ అని పేరు పెట్టాడు. మధ్య భారతంలోని గోండ్వానా ప్రాంతం నుంచి ఈ పేరు వచ్చింది. ఆ మాటకు అర్థం గోండుల అడవి. గోండు గిరిజనులు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలోని కొన్ని భాగాలలో నివసిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని భారీ రాతికొండలు (ఇపుడు తెలంగాణ) సుప్రసిద్ధి చెందినవి. అవి భూగ్రహంపైనే అన్నింటికన్న ప్రాచీనమైనవి. శాస్త్రజ్ఞుల అంచనాల ప్రకారం భూఫలకాల కదలిక సుమారు 16 కోట్ల 70 లక్షల సంవత్సరాల క్రితం మొదలుకాగా గోండ్వానా తూర్పు భాగం ఆఫ్రికానుంచి విడిపోయి, దాదాపు 12 కోట్ల ఏళ్ల కిందట ఉత్తరం వైపు కదిలింది. అది తిరిగి రెండు ముక్కలు కాగా వాటిలో ఒకటి మడగాస్కర్, రెండవది దక్కన్ పీఠభూమి అయ్యాయి. దక్కన్ పీఠభూమి మధ్య ఆసియాను ఢీకొంది. ఆస్ట్రేలియన్ ఇండాలజిస్టులు, వాస్తవానికి దక్కన్ తమ దేశంలో భాగమని హాస్యానికి అంటుంటారు.

భారతదేశపు చరిత్ర ఎక్కడ ఏ విధంగా ఆరంభమైందనే అన్వేషణ ఈ చరిత్ర రచనకు మొదటి నుంచి సమస్యగానే ఉంది. గోండ్వానాల్యాండ్ కథ ఆ అన్వేషణను

ఊహా ప్రపంచపు అంచుల వరకు తీసుకు వెళుతుంది. అసలు ఈ ఊహాగానాలు ఏ విధంగా మొదలయ్యాయన్న దానిపై నేను పరిశోధన చేస్తున్నాను. 19వ శతాబ్దపు పరిశోధనలు, 21వ శతాబ్దపు రాజకీయాలు కూడా ఈ ఆరంభ మూలాలపై విపరీతమైన ఆసక్తిని చూపాయి. 19వ శతాబ్ది పరిశోధకులు తొలి రచన, తొలి శిథిలాలు, తొలి భాష ఏవి అంటూ జరిపిన పరిశోధనలలో రాజకీయాలు కూడా చోటుచేసుకున్నాయి. "ఆ పని మేము మొదట చేసాం", "అది మాది" తరహా వాదనలు వారినుంచి వినిపించాయి. వలసపాలనలు సాగుతుండిన కాలంలో మరికొందరు శాస్త్రవేత్తలు ఒకప్పుడు మహా భూఖండం ఒకటి ఉండేదని అంగీకరిస్తూనే, అది మరొక రీతిలో విచ్ఛిన్నమైందని అన్నారు. ఆ పరిణామం ఆస్ట్రేలియా/ఆఫ్రికా నుంచి ఒక భూభాగం వేరుపడటం వల్ల గాక, హిందూ మహా సముద్ర జలాలు గోండ్వానా పైకి రావటంతో కొన్ని ప్రాంతాలు అట్లాంటిక్ వలెనే నీటి మునిగిపోయాయాని అభిప్రాయపడ్డారు. ఆస్ట్రేలియా నుంచి దక్షిణ భారత దేశం మీదుగా మడగాస్కర్ వరకు గల భూభాగం ఆ విధంగా హిందూ మహా సముద్రం కింద మునిగిపోయిందన్నది వారి వాదన.

ఒక భూభౌతిక శాస్త్రజ్ఞుడు గోండ్వానాల్యాండ్‌కు 1864 లో లెమూరియా అనే కొత్తపేరు పెట్టాడు. లెమూర్ తెగ మనుషులు 19వ శతాబ్దంలో మడగాస్కర్‌తో పాటు ఆ పరిసర దీవులలో మాత్రమే కన్పించారని, వారి అవశేషాలు పాకిస్థాన్ నుంచి మలేషియా వరకు లభించాయని, అయితే సజీవంగా కాని, అవశేషాల రూపంలోగాని వారి ఆనవాళ్లు ఆఫ్రికా, పశ్చిమాసియాలలో లేవని వివరించాడాయన. మడగాస్కర్‌తో పాకిస్థాన్, మలేషియాలకు భౌగోళిక సంబంధం ఉండగా ఆఫ్రికా, పశ్చిమాసియాలతో ఉండేది కాదనేందుకు ఇది రుజువని ఆయన సూత్రీకరించాడు. ఏ జంతువులు ఎక్కడ సంచరించాయన్నది మానవ సంబంధానికి కూడా సరిహద్దులను నిర్ణయిస్తుంది. ఈ విధమైన సరిహద్దులపై అనేక ఊహాగానాలు సాగాయి. ఎర్నెస్ట్ హెకెల్ అనే జర్మన్ జీవశాస్త్రజ్ఞుడు 1876లో హిస్టరీ ఆఫ్ క్రియేషన్ అనే గ్రంథాన్ని ప్రచురిస్తూ, లెమూరియాలోనే మానవజాతి పురుడుపోసుకుందన్నాడు. ఆయన డార్విన్ వాదాన్ని అనుసరించే శాస్త్రవేత్త. 1885లో ఒక బ్రిటిష్ చరిత్రకారుడు, ద్రావిడుల పూర్వీకులు లెమూరియానుంచి భారతదేశానికి వలస వస్తూ ఆ భాషలను కూడా తీసుకువచ్చారని వాదించాడు. 1886 లో కౌమార దశలో గల ఒక పిల్లవాడు కొన్ని మాటలను ప్రసారం చేస్తూ, అవి ఇంకా జీవించి ఉన్న లెమూరియన్లవని, వారు కాలిఫోర్నియాలోని మౌంట్ షాస్టా కింద సొరంగాల్లో నివసిస్తున్నారని ప్రకటించాడు. మేడం బ్లావాటిస్కీ 1888లో ద సీక్రెట్ డాక్ట్రిన్ అనే పుస్తకంలో, భారతదేశపు బాబాలు కొందరు తనకు లెమూరియా గురించిన రహస్య గ్రంథం ఒకటి చూపారని రాసింది.

వలసపాలకులు ప్రచారం చేసిన ఈ కట్టుకథను తమిళులు 1890 లలో అందిపుచ్చుకున్నారు. లెమూరియా అన్నది తమ పూర్వీకుల భూమి అని, అక్కడి నుంచి తాము భారతదేశానికి తరలివచ్చామని, ప్రస్తుతపు కన్యాకుమారి లెమూరియా నుంచి పోయిందిపోగా మిగిలిన భూభాగమని భావించసాగారు. లెమూరియా నీటమునిగినపుడు తమిళులు మెసొపొటేమియా, ఈజిప్టు, చైనా ఉత్తర – దక్షిణ అమెరికాలు, ఐరోపా, సింధూలోయ ప్రాతాలకు వెళ్లి అక్కడి సంస్కృతులకు ఆద్యులయారని కూడా వారు చెప్పుకోసాగారు.

ఈ అధ్యాయానికి మొదట పేర్కొన్న ఫార్‌స్టర్ మాటలు, హిమాలయ పర్వతాలు సముద్రం నుంచి ఉద్భవించినట్లు పేర్కొన్నాయి. కాని మరికొంత ముందుకు వెళ్లి లెమూరియా కథనాన్ని ప్రస్తావిస్తూ, ఆ భూఖండం మొదట హిందూ మహా సముద్రంలో మునిగిపోయిన తర్వాత కొంత కాలానికి గోండ్వానాలాండ్ పైకి ఎగిసినట్లు చెప్తుంది. చరిత్ర పూర్వపు తొలిదశ ఆ విధంగా మరింత వెనుకకు వెళుతుంది. ఫార్‌స్టర్ ఇంకా ఏమి రాసాడో గమనించండి. "వాస్తవానికి భారతదేశం మరింత ప్రాచీనమైనది. చరిత్ర పూర్వ యుగపు కాలాన సముద్రంలో భారత ద్వీపకల్పపు దక్షిణ భాగం అప్పటికే ఉంది. భూమి అంటూ ఎప్పటి నుంచి ఉన్నదో ద్రవిడ భూభాగంలోని పీఠ ప్రాంతాలు కూడా అప్పటినుంచే ఉన్నాయి. ఆ భూభాగాన్ని ఆఫ్రికాతో కలిపే ప్రాంతాలు సముద్ర గర్భంలో మునిగాయి. మరొక వైపు అదే సముద్రంలోంచి ఉత్తర దిశగా హిమాలయాలు ఆవిర్భవించాయి", అన్నాడాయన. ఇదే కథనానికి సంబంధించిన మూడవ కోణం ఒకటి తన రచనలో ఉంది. అది సంభవామి యుగేయుగే వంటి పరిణామం. దక్షిణ భారతదేశం మళ్లీ మళ్లీ జలమయంకాగలదన్నది ఆ కథనంలోని జోస్యం. "హిమాలయ భారతం ఆకాశం వైపు ఎగియగా, ముందు నుంచీ గల (దక్షిణ) భారతదేశం కిందకు కుంగింది. రానున్న కాలంలో ఇక్కడ సముద్రం తిరిగి ప్రవేశించి, ఇంతకాలం సూర్యరశ్మి సోకిన శిలాఖండాలు ఒండ్రు మట్టితో కప్పుకుని పోవచ్చు" నన్నాడాయన.

మొత్తానికి ఆదిమ కాలమన్నది ఈ విధంగా ఆరంభమైంది. లేదా కాకపోవచ్చు కూడా. ఒక నవలా రచయితగా ఫార్‌స్టర్‌కు ఏమైనా రాసే స్వేచ్ఛ ఉంది. భూ ఫలకాల సిద్ధాంతకర్తలది కూడా నిజానికి ఊహాగానమే. అయితే, వారి ఊహలకు కొన్ని ఆధారాలున్నాయి.

భారత ఉపఖండం ఆఫ్రికానుంచి విడివడి ఆసియాతో చేరిందనే ఊహ నిజమైనా కాకపోయినా, గోండ్వానాల్యాండ్ కథ చెప్పే దానిని బట్టి వేదకాలపు మనుషులు కొన్ని శతాబ్దాల పాటు గంగానదీ లోయ వెంట సంచరించారు. దానితో, అప్పటికే వేర్వేరు సంస్కృతుల వారి మిశ్రమంగా ఉండిన ఆ ప్రాంతంలో మరొక సంస్కృతి వచ్చి చేరింది.

లక్షలాది సంవత్సరాలు సాగుతుండిన ఈ సాంకర్యాలు హిందూమతంలోని వైవిధ్యతలకు మూలమయ్యాయి. ఆఫ్రికా, సమర్ఖండ్, ఇంగ్లాండ్ వంటి భిన్న ప్రాంతాలకు చెందినవారు తమ నాగరికతలకు చెందిన ఎంతో కొంత భాగాన్ని పశ్చిమాన పంజాబ్‌నుంచి దక్షిణ భారతం వరకు గల సంస్కృతులలో వారసత్వంగా మిగిల్చారు.

## మహా జలప్రళయం

హిందూ మతం తన జన్మభూమిలో ఎంతగా వేళ్లూనిందంటే, దాని భౌగోళికతను కొంత అర్థం చేసుకోకుండా ఆ మతం గురించి తెలుసుకోలేము. ముఖ్యంగా ఆ భౌగోళికతకు గల ప్రధాన లక్షణాలను గమనించాలి. భారతదేశ స్థల కాలాలకు సంబంధించిన కథనంలో కేంద్రం అనదగ్గ అంశం అక్కడ ప్రాచీన కాలంలో సంభవించిన జల విలయం. ఈ కథనం మనకు పలు రూపాలలో పదే పదే వినవస్తుంటుంది. ఆ జల విలయానికి ముందు అక్కడ ఒక గొప్ప ప్రాచీన సంస్కృతి ఉండేదని, లేదా మహా వైభవోపేతమైన మందిరం ఒకటి ఉండేదని కొన్ని కథలు చెప్తాయి. దేశమంతటా వ్యాప్తిలోగల ఈ కథనాన్ని ఆధారం చేసుకుంటూ అటువంటి జలప్రళయం గురించి మరిన్ని కథలు చెప్పే క్రమంలో అనేక ప్రదేశాల పేర్లు ముందుకు వస్తుంటాయి. తమ గతం ఎంతో గొప్పగా ఉండేదంటూ సగర్వంగా చెప్పుకోవటం నేటికీ కనిపిస్తుంది.

పెను వరదలు సంభవించటం సహజం గనుక లెమూరియా, లేదా ద్రవిడ భూమి జల ప్రళయంలో మునిగిపోయిందన్న కట్టు కథ దాని నుంచి పుట్టుకు వచ్చిందనుకోవాలి. అయితే సింధూ లోయ పట్టణాలు క్రీ.పూ. 2,000 ప్రాంతంలో సింధూ వరదలవల్ల, క్రీ.పూ. 800 ప్రాంతంలో హస్తినాపురం గంగానది వరదల కింద జలమయం అయ్యాయని చెప్పేందుకు పురావస్తు ఆధారాలున్నాయి. గుజరాత్ పశ్చిమ భాగాన గల శ్రీకృష్ణుని ద్వారక అరేబియా సముద్రం వల్ల మునిగిపోయినట్లు మహాభారతంలో ఉంది. ఇది క్రీ.పూ. 950, లేదా 3,102, లేదా 1,400 నాటి ఘటన అని వేర్వేరు కథనాలు చెప్తున్నాయి. మహా భారతానికి గల ఒక అనుబంధ కథనం అసలు ద్వారకా నగరం మొదట సముద్ర గర్భంలోంచి ఆవిర్భవించినట్లు పేర్కొంటుంది. శ్రీకృష్ణుడు తన నగరాన్ని నిర్మించుకో దలచినపుడు అందుకోసం సముద్రాన్ని 36 మైళ్ల దూరం వెనుకకు వెళ్లవలసిందిగా కోరాడట. అందుకు సముద్రం అంగీకరించింది. సముద్రం ఆ విధంగా ప్రకృతికి విరుద్ధమైన రీతిలో ఉపసంహరించుకున్నందున, చివరకు తన భూభాగాన్ని తాను ఆక్రమించటం న్యాయమేననాలి.

తర్వాత కాలపు కావ్యాలలో మరొక విధమైన కథనాలున్నాయి. శ్రీకృష్ణుడు ఒక రాజుకు కలలో కన్పించి, తనకు జగన్నాథుని రూపంలో పూరీ వద్ద ఒక ఆల నిర్మించ

వలసిందిగా చెప్తాడు. కాని ఆ నిర్మాణాన్ని సముద్రం ప్రతిసారి ఊడ్చివేస్తుంటుంది. సముద్రాన్ని కబీర్ నిలువరిస్తాడు. అప్పుడు సముద్రం బ్రాహ్మణుని రూపంలో వచ్చి, దేవాలయాన్ని పడగొట్టేందుకు అనుమతి కోరుతుంది. అందుకు తిరస్కరించిన కబీర్, పూరీ క్షేత్రానికి బదులు ద్వారకలోని ఆలయ ధ్వంసానికి అనుమతిస్తాడు. అదే ప్రకారం జరుగుతుంది. కొన్ని కథనాల ప్రకారం ద్వారకలోని శ్రీకృష్ణుని ఆలయం అసలు ముంపు బారిన పడలేదు. సముద్రానికి ఆ పని సాధ్యం కాకపోవటంతో, అన్ని పాపాలను కడిగివేయగల ఆ దేవాలయం నేటికీ నిలిచి ఉంది. విలయాలు సంభవించిన ప్రతిసారి ఏదో ఒకటి మిగిలి ఉండినట్లన్న మాట. భారతదేశపు పశ్చిమ తీరాన గల ద్వారక వద్ద సూర్యుడు ప్రతి రోజు అస్తమిస్తాడు. మరణించిన వారికి ఆ నగరం పవిత్రమైన స్వర్గారోహణ కేంద్రమని భావించటం అందువల్లనే కావచ్చు. పోతే, ద్వారకా నగరం మొత్తంగా నీట మునిగినట్లు మహా భారతం చెప్తుండగా, తర్వాతి కథనాలు ఆ ప్రదేశం ఇంకా అక్కడనే ఉన్నట్లు పేర్కొంటున్నాయి. ద్వారక గుజరాత్ ప్రాంతంలో ఉన్నమాట నిజమేనంటూ పురావస్తు శాస్త్రజ్ఞులు, సముద్రంలోకి మునిగి అన్వేషిస్తున్న డైవర్లు నివేదికలను ఇస్తున్నారు.

లెమూరియా, గోండ్వానా కథనాల ఛాయలు మనకు ఇక్కడ కూడా కనిపిస్తాయి. లెమూరియా సముద్రంలో మునిగిందన్నట్లుగానే కొన్ని కథనాలు ద్వారక సముద్రంలో మునిగినట్లు చెప్తున్నాయి. గోండ్వానా సముద్రం నుంచి పైకి తేలిందనే పద్ధతిలో అదే ద్వారక గురించి కొన్ని కథనాలు ఆ పట్టణం సముద్రం నుంచి బయటపడి గుజరాత్‌తో కలిసిపోయిందంటున్నాయి. దీని వెంట మరికొన్ని కథలు కూడా ఉన్నాయి. వాటిలో ఒకదాని ప్రకారం, నగర చక్రవర్తి అశ్వమేధయాగం చేస్తుండగా ఆ అశ్వం కనిపించకుండా పోవటంతో దానిని కనుగొనేందుకు ఆయన కుమారులు అరవై వేలమంది భూమిని తవ్వటంతో సముద్రం (సాగరం) ఏర్పడింది. కొన్ని కథల్లో ఆ అశ్వాన్ని దేవతల రాజైన ఇంద్రుడు దొంగిలించినట్లుగా ఉంది. దానినట్లుంచితే, ఆ యువరాజులందరిని ఒక ముని శపించి బూడిదగా మార్చుతాడు. సాగరుని మునిమనుమడైన భగీరథుడు, అపుడు స్వర్గంలో పాలపుంతవలె ఉండిన గంగానదిని నేలకు దిగివచ్చి తన తాతల చితా భస్మాల మీదుగా ప్రవహించేందుకు ఒప్పిస్తాడు. ఆ విధంగా సగర కుమారులు పవిత్రులై స్వర్గప్రాప్తి పొందుతారు.

గంగానది స్వర్గం నుంచి నేరుగా కిందకు ప్రవహించటం వల్ల ఆ వేగానికి భూమి విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఉన్నందున, ఆ నదిని ముందు తన జటా జూటంలోకి వదలాలని, అపుడది పాయలుగా భూమి పైకి ప్రవహిస్తుందని కూడా భగీరథుడు శివుడిని ఒప్పిస్తాడు. సగరుడు యాగాశ్వాన్ని బలిచ్చినపుడు సముద్రాలు పొంగి భూతలాన్నంతా నీట ముంచెత్తాయన్నది మరొక కథనం. అపుడు దేవతలు పరశురాముడిని మధ్యలో

జోక్యం చేసుకోవలసిందిగా కోరుతారు. పరశురాముడు వరుణ దేవుడిని ప్రార్థించటంతో తను యజ్ఞపాత్రను దూరంగా విసరివేస్తాడు. అపుడు సముద్ర జలాలు వెనుకకు తగ్గి శూర్పరక రాజ్యం పశ్చిమ ప్రాంతంలో ఏర్పడుతుంది. మరొక కథను బట్టి పరశురాముడిని భూలోకం నుంచి బహిష్కరించగా తనకు నివాసం కోసం స్థలం అవసరమవుతుంది. అపుడు వరుణుడు ఆయనకు తన గొడ్డలిని సముద్రంలోకి తన శక్తిమేర విసరమని సలహా ఇస్తాడు. పరశురాముడు అదే పని చేయగా గొడ్డలి పడిన వరకు నీరు వెనకకు పోతుంది. ఆ స్థలం గోకర్ణమైంది. కేరళ ఆ విధంగా ఏర్పడుతుంది.

నగరాలు, ప్రదేశాలు, భూఖండాల మునక గురించి ఇతర కథలు కూడా ఉన్నాయి. తమిళ సాహిత్యాన్ని సృష్టించిన మొదటి రెండు జనసభలు జరిగిన నగరాలు సముద్రపు తాకిడికి విధ్వంసమయామన్నది వాటిలో ఒక కథ. కాలికట్ తీరంలో ఆ నగరాలలోని పై భాగాలు, దేవాలయాల భాగాలు 17వ శతాబ్దంలో కూడా నీటిపైన కన్పిస్తుండేవని చెప్తారు. మహా బలిపురం తీరాన ఏడు పగోడాలు కొన్ని వందల సంవత్సరాల పాటు నీటమునిగిపోయాయని, 2004 డిసెంబర్ 26న సునామీ ప్రభావంతో సముద్రపు నీరు సుమారు అయిదు వందల మీటర్లు వెనుకకు తగ్గగా వరుసగా పెద్ద పెద్ద రాళ్లు, వాటి వెనుక ఒక దేవాలయ శిథిలాలు స్థానికులకు కన్పించినట్లు ఫ్రంట్‌లైన్ పత్రిక రాసింది. అలలు తగ్గటంతో ఆ శిథిలాలు, రాళ్లు తిరిగి నీటమునిగాయి. కాని అక్కడ దేవాలయం ఉండే అవకాశం లేదని పురావస్తు శాస్త్రవేత్తలు కొట్టివేశారు. హిందూ దేవాలయాల మునక గురించిన ఊహాగానాలు ఎప్పటినుంచో ఉన్నవే గనుక మనకు ఆ శాస్త్రవేత్తల అభిప్రాయం పట్లనే నమ్మకం కలుగుతుంది.

ఈ వరద కథలన్నింటి వెనుక బహుశా మరొక మహా వరద ఉందంతం ఉండి ఉంటుంది. ఆ ప్రస్తావన మొదట క్రీ.పూ. 800 ప్రాంతపు శతపథ బ్రాహ్మణంలో కనిపిస్తుంది. మహా భారతంలోని మహా వరదల కాలం కూడా సుమారు అదే. జెనెసిస్ గ్రంథంలోని నోవాస్ ఆర్క్, గిల్గమేష్ వర్ణించిన సుమేరియన్ నగరం షురుప్పక్ మునక కూడా ఈ ఉదంతంతో నిమిత్తం కలదేనన్న భావన ఉంది. వాస్తవానికి ప్రపంచ పురాణ కథలు అనేకంలో వరద కథలున్నాయి. పశ్చిమాసియా, ఆస్ట్రేలియా, సౌత్ సీస్, స్కాండినేవియా, ఉత్తర, దక్షిణ అమెరికాలు, చైనా, గ్రీస్ వంటి దేశాలన్నిటా, అక్కడ వరదలు తరచు సంభవించేవి గనుక వరద కథలు కూడా విరివిగా ఉన్నాయి. వర్షాకాల జలాలతో నీరు లభించే ప్రాంతాలలో మరింతగా కనిపిస్తాయి. ఇందులో విశేషమేమంటే వరద కారణాలను ఒక సంస్కృతిలో ఒక విధంగా చెప్పగా, మరొక సంస్కృతిలో వేరేవిధంగా చెప్తారు. కొన్నింటిలో అసలేమీ కన్పించవు. అదే విధంగా వరదల వల్ల కొన్నిచోట్ల చాలామంది బయటపడతారు. ఎవరూ జీవించి ఉండకపోతే ఆ కథను చెప్పేందుకు ఎవరూ మిగలని మాట నిజమే గాని, సృష్టికర్త తన పునఃసృష్టిని శూన్యం

నుంచి సైతం ఆరంభించగలడు. ఈ కథనాలలో కొందరు ఏదో ఒక పడవలో చేరి వరదల నుంచి బయటపడతారు. కొందరు మరేవో పద్ధతులలో.

హిందూ సంస్కృతిలోని బ్రాహ్మణాలలో మొట్టమొదటిది మానవుడైన మనుకు ఒక చిన్న చేప ఎదురవుతుంది. తనను తిన జూస్తున్న ఒక పెద్ద చేప బారి నుంచి రక్షించవలసిందిగా కోరుతుంది. ప్రాణులను ఆహారంగా చేసుకోవటం పట్ల ఆందోళన వ్యక్తం కావటానికి సంబంధించి ఇది తొలి కథనమనాలి. అది కూడా ఒక జంతువును మరొక జంతువు భక్షించటం. మను చేసిన సహాయానికి ప్రతిగా ఆ చిన్న చేప ఆయనను త్వరలో రానున్న పెను వరదల నుంచి కాపాడగలనని మాట ఇస్తుంది. ఆ చేపను మను అది ఇక నాశనం కానంత స్థాయికి ఎదిగే వరకు కాపాడతాడు. అపుడు ఆ చేప సూచనల ప్రకారం ఒక ఓడను నిర్మిస్తాడు. ఆ ఓడను చేప ఒక పర్వతం వద్దకు లాగుకుని పోతుంది. వరదలు తగ్గిన తర్వాత మను ఆ ప్రవాహం వెంటపడిపోతాడు. " ఆ వరదలలో తక్కిన ప్రాణులన్నీ వినాశనం చెందగా, మను ఒక్కడే సజీవుడై ఉంటా"డంటూ ఆ కథ ముగుస్తుంది. మానవుని దయకు బదులుగా వారికి సహాయం చేసే జంతువుల (ఆండ్రోక్లిస్ అండ్ లయన్ కథ అటువంటిదే) కథలలో రెండు నీతి సూత్రాలున్నాయి. ఒక సత్కార్యానికి బదులుగా మేలు కలుగుతుందన్నది ఒకటి కాగా, జంతువుల పట్ల దయ చూపాలనేది రెండవది (బహుశా వాటిని తినకూడదని కూడా కావచ్చు).

ఈ విధమైన వరదల కథనంలోకి కొన్ని శతాబ్దాల తర్వాత మరొక కోణం వచ్చి చేరింది. అది చాలా ముఖ్యమైంది, సంక్లిష్టమైంది అయినందున అదేమిటో తెలుసుకోవటం అవసరం. కాలమన్నది రుజువుగా ముందుకు సాగటమేగాక, అది ఒక చక్రం వలె (కాలచక్రం) భ్రమిస్తుంటుందన్నదే ఆ కొత్త కోణం. యుగాలు నాలుగు. వాటికి జూదపు పాచికలకు గల నాలుగు ముఖాల పేర్లు పెట్టారు. ఒక యుగం నుంచి మరొక యుగానికి జీవన ప్రమాణాలు క్షీణిస్తాయి. ఆ యుగాల కాల ప్రమాణం కూడా తగ్గుతూ పోతుంది. మొదటిది కృత యుగం, లేదా సత్యయుగం. గ్రీసు సంప్రదాయంలోనూ నాలుగు యుగాలున్నాయి. వాటిలో మొదటిది గోల్డెన్ ఏజ్. కృతయుగం అన్నింటిలో ఉత్తమమైంది. అపుడు మనుషులు సుగుణ శీలురు, జీవితాలను ఆనందమయంగా గడుపుతారు. దీర్ఘకాలం జీవిస్తారు. తర్వాతది త్రేతాయుగం. ఈ కాలంలో పరిస్థితులు అంత గొప్పగా ఉండవు. ఆ వెనుక ద్వాపర యుగంలో పతనావస్థ మొదలవుతుంది. చివరిదైన కలియుగంలో మనుషులు సత్ప్రవర్తన కలవారు కారు. ఆయుర్దాయం తక్కువ. భారతదేశంపై అనాగరిక మూకలు దాడి చేస్తాయి. మొదటి మూడు యుగాలకు, కలియుగానికి ఒక ముఖ్యమైన తేడా ఉంది.మొదటివి ఊహాగానం కాగా కలియుగం మనం ప్రస్తుతం జీవిస్తున్న వాస్తవకాలం. ఈ నాలుగు యుగాలను కృతయుగంలో నాలుగు పాదాలా నడిచే ధర్మదేవత, లేదా

గోమాతతో పోల్చుతారు. ధర్మదేవత ఒక్కొక్క యుగం గడిచేకొద్దీ ఒక కాలును కోల్పోతూ కలియుగంలో ఒకే ఒక పాదంపై నిలిచి ఊగిసలాడుతుంటుంది.

భారతదేశంలో, గ్రీసులో కూడా కాలమన్నది ఒక ప్రవాహం వలె ముందుకు సాగుతుంటుంది. కనుక యుగాలన్నవి ముగిసిపోతాయి. అదే సమయంలో, గ్రీసుకు భిన్నంగా భారతదేశంలో కాలం ఒక చక్రం వలె తిరుగుతుంది. కలియుగం తర్వాత తిరిగి కృతయుగం ఆవిష్కారమవుతుంది. కలియుగాంతంలో అగ్ని, జలం విజృంభించి ఆ యుగాన్ని అంతం చేసిన తర్వాత సృష్టిలో తిరిగి జల ప్రవాహం కొత్తగా ఆరంభమవుతుంది. దాని నుంచి పునఃసృష్టి జరుగుతుంది. హిందూ సంప్రదాయంలోని ఆత్మలు, పునర్జన్మ అనే భావనలను పోలి విశ్వానికి కూడా పునఃసృష్టి ఉంటుంది. ఆరంభానికి ముందు అంతం జరుగుతుంది.

తిరిగి వరదల కథకు వెళితే, కలియుగాంతంలో ప్రళయం సంభవించినపుడు మనును చేప కాపాడుతుంది. ఆ కథలోని భాగాన్ని గమనించండి:

## చేప మరియు వరద

ప్రళయం సంభవించినపుడు తాను సకల చరాచర ప్రాణకోటిని రక్షించగలననే వరాన్ని సృష్టికర్త అయిన బ్రహ్మ నుంచి మనువు పొందుతాడు. ఒక రోజు తనకు చిన్న చేప పిల్ల ఒకటి కన్పించగా దానిని రక్షిస్తాడు. అది చాలా పెద్దగా పెరగగా చూసి భయపడతాడుగాని, అది శ్రీ మహావిష్ణువై ఉంటుందని గుర్తిస్తాడు. అపుడాచేప 'భళా! నువ్వు నన్ను గుర్తించావు. త్వరలోనే ఈ భూమియావత్తు జలమయం కానుంది. జీవకోటినంతా కాపాడటం కోసం దేవతలు నీకొక పడవను సిద్ధం చేశారు. జీవులందరినీ ఇందులో తీసుకునిరా. మీరు ప్రళయాన్ని తట్టుకుని జీవించి ఉంటారు. తర్వాత కృతయుగారంభంలో నీవే రాజువవుతావు. కలియుగాంతంలో సముద్రపు అడుగున జీవించే ఒక అశ్వం తన నోటిని తెరుస్తుంది. దానినుంచి విషాగ్నులు వెలువడుతాయి. అది నరకలోకపు అగ్ని. ఆ అగ్ని యావత్ సృష్టిని, దేవతలను, గ్రహ సముదాయాన్ని కూడా దగ్ధం చేస్తుంది. అపుడు ప్రళయ మేఘాలు ఏడు భూమిని ముంచెత్తి ఒక మహా సముద్రాన్ని సృష్టిస్తాయి. మిగిలేది నువ్వు, సూర్యచంద్రులు, పలువురు దేవతలు, గొప్పవైన మత గ్రంథాలు, విజ్ఞాన శాస్త్రాలు మాత్రమే." అంతిమంగా ఇదే జరిగింది. ఆ మత్స్యం వచ్చి మనును కాపాడింది.

ఈ కథలో మను తనను తానేగాక ప్రాణులన్నింటిని రక్షిస్తాడు. పడవను తాను గాక దేవతలు తయారు చేస్తారు. అదెట్లున్నా, వరదల తర్వాత జరిగేదేమిటో ఇందులోనూ వివరంగా ఉంది. అది భవిష్యత్తు గురించి మరింత నమ్మకాన్ని కలిగిస్తుంది. పాత సృష్టినుంచి కొత్త సృష్టి ఆరంభమవుతుంది. జల విలయం అనివార్యమని, కాని దాని నుంచి మనను

మనం కాపాడుకోవచ్చు కూడానన్నది ఇందులోని నీతి. ప్రపంచానికి ఈ స్థితి ఎదురవుతుంది. అయినా ప్రపంచం నిలిచే ఉంటుంది.

ఇందులో గమనించదగినదేమంటే, ఈ కథ ఇప్పుడు కాల చక్రంలో భాగమై పోయింది. కథలో అగ్ని, నీరు రెండూ ఉన్నాయి. నీరు ప్రాణికోటిని కాపాడే అంశమే తప్ప సమస్య కానట్లు తోస్తుంది. మనను వినాశనం చేయగల అశ్వాగ్నిని ఆ నీరు ఆర్పి వేస్తుంది. ఆ ఆడ గుర్రం సముద్ర గర్భంలో సంచరిస్తుంది గనుక దాని అగ్నిని నీరు నియంత్రించటం, అగ్ని నీటిని నియంత్రించటం రెండూ ఏక కాలంలో జరుగుతాయి. ఇంతకూ ఈ అగ్నికి మూలమేమిటన్న ప్రశ్నపై పలు కథనాలున్నాయి. వాటిలో ఒక దానిని బట్టి, ఒకవైపు కామాగ్ని, మరొకవైపు కామవాంఛలను నియంత్రించే తపస్సుల అగ్ని రెండూ కలిసి ఈ అగ్నికి మూలమవుతున్నాయి. లేదా యజ్ఞం నుంచి తనను నిషేధించినందున శివునికి కలిగిన ఆగ్రహాన్ని అందుకు ఆధారభూతమన్నారు.

ఈ కథలోని గుర్రం ఆడ గుర్రం కావటం గమనించదగ్గది. పురుషునిలో అంతర్గతంగా ఉండే నియంత్రిత మోహం ఎప్పుడైనా ప్రజ్వలించి వినాశకర మార్గాలను అనుసరించవచ్చు. అటువంటి మోహాగ్నిపై గల అంతర్గత నియంత్రణను భంగపరచగల పరిస్థితులకు ఆడ గుర్రం ఒక సంకేతం వంటిది. ఈ అగ్నికి, దానిపై నియంత్రణకు ఉండే సమతులనం కలియుగాంతంలో భంగపడుతుంది. అపుడు ఆ గుర్రం సముద్రంలోంచి బయటకు పరుగుతీసి ప్రపంచాన్ని అగ్నితో రగిలింపజేస్తుంది. గుర్రం వెలుపలికి పోయిన తర్వాత సముద్రంపై నియంత్రణ ఉండదు. కనుక అపుడా జలాలు పొంగి, అప్పటికే బూడిదగా మారిన విశ్వాన్ని పొర్లితడుపుతాయి. పునఃసృష్టి వరకు ఇక అదంతా స్తబ్దంగా ఉండిపోతుంది. ఆ దశ చివరన, సగరుని కుమారులవలె ఈ ప్రపంచపు భస్మరాశులు తిరిగి ప్రాణం పోసుకుంటాయి. గత ప్రపంచం నుంచి కొన్ని ప్రాణులను పరిరక్షించిన మత్స్యం (విష్ణువు అనేక అవతారాలలో మత్స్యావతారం ఒకటన్నది విశ్వాసం), ఆ ప్రాణులున్న పడవను ఒక పర్వతం వద్దకు తీసుకుని పోతుంది. ప్రపంచపు పునః సృష్టి అనంతరం ఆ ప్రాణులు అందులో భాగమవుతాయి. ఆ పర్వతం ఇదేనంటూ భారతదేశంలో పలు పర్వతాలను పేర్కొంటారు.

లెమూరియాను, ద్వారకను కనుగొనేందుకు ఇటీవలి కాలంలో జరిగిన తవ్వకాలు, హిందూ మహాసముద్రపు దక్షిణాగ్రాన గల కెర్గ్యూలెన్ పీఠభూమి వద్ద 1998-99లో సాగిన సముద్ర గర్భ పరిశోధనలు కూడా, హిందూ మహాసముద్రం అడుగున ఒక భూఖండం మనిగి ఉన్నదనే ఊహాగానాలకు తిరిగి ఊతమిచ్చాయి. తవ్వకాలు జరిపినవారికి హిందూ మహా సముద్రం మధ్యన ఒక పెద్ద పీఠభూమి దృష్టికి వచ్చింది. కాని వారికి అంతకన్నా ఆశ్చర్యాన్ని కలిగించిన విశేషం, ఆ పీఠభూమి అగ్రభాగాలలో అగ్ని పర్వతపు భారీ పేలుళ్లు, వేడి పదార్థాలు పైకి ఎగతన్నటం వంటివి జరిగి ఉంటాయనే ఆధారాలు కన్పించటం. అది సముద్ర గర్భంలోని ఆడగుర్రపు అగ్ని పర్వత కార్యకలాపమై ఉంటుందా?

# స్థలం

## చిత్రపటాలు

భారతదేశంలో కలిసిపోయిన ఇతర భూభాగాలు అక్కడి ప్రత్యేక వాతావరణ పరిస్థితులు, జీవజాలం, అంతిమంగా సంస్కృతితో సహజీవనం చేయకతప్పదు. ఆ నేల, అక్కడి పరిస్థితులూ ఆ దేశానికి వచ్చిన ఎవరినైనాసరే మార్చివేశాయి. బ్రిటిష్ వారిని, అంతకు ముందు మొఘలులను, అంతకన్నా ముందు వేదకాలపు ప్రజలను, ఆఫ్రికా వాసులను భారతదేశం యథాతథంగా స్వీకరించి ఉండిపోలేదు.

ప్రాచీన భారతదేశపు విశ్వ దృష్టిలో భూమి బల్లపరుపుగా ఉండేది. ఒక వలయంగా ఏర్పడిన ఏడు ఖండాలుండేవి. మధ్యన గల ఖండం చుట్టూ ఉప్పునీరు, సుమారు గుండ్రంగా కనిపించే తక్కిన ఖండాల చుట్టూ తీపి పాకం, మద్యం, నేయి, పాలు, పెరుగు, మంచినీరు ఉండేవి. మధ్యనగల ప్రధానమైన ఖండమే జంబూ ద్వీపం. దానికి మధ్యభాగంలో మేరు పర్వతం ఉంటుంది. దానినుంచి నాలుగు వేపుల నాలుగు ఉపఖండాలు తామర రేకుల వలె విస్తరించి ఉంటాయి. వాటిలో దక్షిణ దిశగా కలది భారత వర్షము. ఇండియాకు ఇది ప్రాచీన సంస్కృత నామం. తామరపూవును మనం అడ్డంగా కత్తిరించినట్లయితే భారతదేశం ఒక గద్దవలె కన్పిస్తుంది. ఉత్తరాన పర్వతాలు, తక్కిన మూడువైపుల ఉప్పు సముద్రాలు ఉంటాయి. నాగజాతి నివసించే ఆ భూమి అడుగున కూడా నీరుంటుంది.

చంద్రునిలో కుందేలు, మనిషి వలె, కాల్పనిక ప్రపంచం, వాస్తవ చరిత్రవలె ఇక్కడ హిందువుల ప్రాచీన కాలపు విశ్వదృష్టి, ఆధునిక ప్రపంచపు చిత్ర పటాలు కలగలిసిపోయి ఉంటాయి. చిత్ర పటాలలో కన్పించేదానికి, వాస్తవమైన భూభాగాలకు మధ్య స్థూలమైన పోలికలుంటాయి. వాటిని ఆధారం చేసుకుంటూ కల్పనలు, రాజకీయ కథనాలు రూపుతీసుకుంటుంటాయి. మన కథాక్రమంలో మొదట జలప్రళయాలు, వరదలు దర్శనమిచ్చాయి. ఇపుడు భూఖండాలు, నీరు అంటూ కొత్త ఉదంతం ముందుకొస్తున్నది. ఇది రాజకీయంగా ఉపయోగపడగల విషయం. ఇందులో రాజకీయ చిత్ర పటం కూడా ఉంది. కశ్మీర్‌ను హద్దు చేసుకుంటూ అనేక దేశాలున్నాయి. వరదలు అనే కల్పన భూ భౌతిక శాస్త్ర పరిశోధనకు ఉపయోగపడినట్లు, జంబూద్వీప చిత్రం ర్యాండ్ మెక్‌నల్లీ ఆధునిక ప్రపంచ చిత్రపటానికి అదే విధంగా ఉపయోగపడుతుంది.

## భూఖండం: పర్వతాలు, నదులు, వర్షరుతువు

హిమాలయ పర్వతాలను అధిగమించ వీలుకాని అవరోధమని పలువురు భావించారు. భారతదేశం ఎప్పుడూ ఏ విధంగానూ మారదంటూ చెప్పే కథలో ఇదొక భాగం. కాని ఇది నిజం కాదు. హిమాలయాలు సమున్నతమైనవి కావటం, ఎవరూ

వాటిమీదుగా యదాలాపంగా నడిచి దాటకపోవటం నిజమే గాని, దాని అర్థం మనుషులు ఆ పర్వతాలను అధిగమించలేదని కాదు. అలెగ్జాండర్ బహుశా ఖైబర్ కనుమల ప్రాంతం నుంచి ఆ విధంగా దాటివచ్చాడు. తన వెంట గుర్రాలు, గాడిదలు, ఒంటెలు వగైరా కూడా వచ్చాయి. కలియుగంలో ఆటవికులు, అనాగరికులు బయటినుంచి భారతదేశంలోకి చొరబడి రాగలరన్న కాల్పనిక కథ గురించి మనం పైన చెప్పుకున్నాము. అదొక పీడకల వలె భారతీయులను వెన్నాడుతూనే ఉంది. అలెగ్జాండర్ దండయాత్ర వంటి చారిత్రక వాస్తవాలు ఈ పీడకలను మరింత భయంకరంగా మార్చి ఉంటే ఆశ్చర్యమక్కరలేదు. భారతీయుల అంతర్గత విశ్వాసాలపై ఇతర విశ్వాసాల ప్రభావం ఎట్లా ఉంటూవచ్చిందో ఆ దేశపు భౌగోళిక సరిహద్దుల మీదుగా విదేశీయులు అదే విధంగా చొరబడి వస్తుండేవారు. చైనానుంచి చీని చీనాంబరాలు మధ్య ఆసియా మీదుగా భారతదేశానికి రవాణా అయ్యేవి. ప్రాచీన ప్రపంచకాలంలో మెసొపొటేమియా, క్రీట్, రోమ్, అరేబియాలకు చెందిన వర్తకులు కొంత అటు ఇటుగా భారతదేశపు ఏదో ఒక తీరానికి చేరుతుండేవారు.

ఉత్తర, దక్షిణ భారత దేశాల మధ్య హద్దువలె గల వింధ్య పర్వతాల విషయం కూడా ఇటువంటిదే. కాని ఆ పర్వత శ్రేణి గురించి గల కథలు అవి మనుషుల రాకపోకలను ఏ విధంగా నిరోధించాయని గాక, వాటిని వారు ఎట్లా అధిగమించారో చెప్తాయి. వింధ్య పర్వతాలు మరింత పైకెదుగుతూ సూర్యుడు సైతం వాటి చుట్టూ తిరిగి వెళ్లవలసిన పరిస్థితి రాగా (సూర్యుడు మేరు పర్వతాన్ని చుట్టిపోయినట్లు), మహా ముని ఆగస్త్యుడు తాను దక్షిణానికి వెళ్లదలచానని కనుక భూమిలోకి కొంత కుంగిపోవాలని ఆ పర్వత శ్రేణిని కోరాడు. తను తిరిగి వచ్చే వరకు అదే విధంగా ఉండిపోవాలన్నాడు. ఆయన సంస్కృత భాషను, వేదాలను ద్రవిడ భూమికి తీసుకువెళ్లదలచాడు. కాని ఆయన ఎప్పటికీ తిరిగిరాక దక్షిణ దేశంలో తమిళభాషను ఆరంభించాడు. వింధ్య పర్వతాలు తిరిగి పైకెదగక అదే ఎత్తులో ఉండిపోయాయి. దానితో వాటి మీదుగా రాకపోకలు సులువయ్యాయి.

దక్షిణాసియాలో చరిత్ర నదులతో పాటు ప్రవహిస్తుంది. భారత ఉపఖండపు ఉత్తర ప్రాంతాన్ని మూడు పెద్ద నదీ వ్యవస్థలు విభజిస్తాయి. వాటిలో మొదటిది పాకిస్థాన్‌లోని సింధూనది. దానికి ఝీలం, చినాబ్, రావీ, బియాస్, సట్లెజ్ ఉపనదులున్నాయి. పంజాబ్ (అయిదు నీటి ప్రవాహాలు)కు ఆ పేరు వచ్చింది వాటినుంచే. రెండవది గంగా, యమునలతో కూడిన దొవాబ్. మూడవది బంగ్లాదేశ్‌లోని బ్రహ్మపుత్ర. ఈ మూడింటి జన్మస్థానం కూడా టిబెట్‌లోని నైరుతి ప్రాంతం. వాటి వేర్వేరు జన్మస్థానాలు ఒకదానికొకటి సమీపంలోనే ఉంటాయి. బహుశా అవన్నీ ఒకప్పుడు ఒకే హిమానీ సరస్సునుంచి ఉద్భవించి ఉంటాయి. ఆఫ్రికానుంచి ఒక భూఖండం వచ్చి ఆసియాను ఢీకొన్నప్పుడు ఆ జలాలు చెల్లాచెదరై ఆ మూడు నదులకు వేర్వేరు జన్మస్థానాలుగా మారి ఉండవచ్చు. సింధూనది 1800 మైళ్ల దూరం ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తుంది. వింధ్య పర్వత శ్రేణులవలెనే

ఉత్తర, దక్షిణ భారతాలను విభజించే నర్మదానదిని ఆలవాలం చేసుకుని అనేక కథలు, విశ్వాసాలు వ్యాపించాయి. వాటి విస్తృతిని గంగానదితో పోల్చవచ్చు.

భారతదేశంలో వాతావరణానికి, సంస్కృతికి సంబంధం ఏమిటి? ఒక వైపు సస్యశ్యామలమైన భూములూ– బీడుపడిన నేలలూ, అనావృష్టి– వరదలూ, మృష్టాన్న భోజనాలు, ఆకలి బాధ పక్కపక్కనే కనిపిస్తాయి. మరొకవైపు హిందూ తర్క శాస్త్రజ్ఞులు మొదటిసారిగా, వేర్వేరు వైరుధ్యాలు కలిసి ఉంటాయని ప్రతిపాదించారు. ఈ రెండు స్థితులు భారత సంస్కృతిని ప్రభావితం చేస్తున్నాయా? వాతావరణంలోని ఈ విధమైన అనిశ్చిత స్థితి ఇతర దేశాలలోనూ ఉంటుంది. కాని సువిశాల భారతదేశంలో అది చాలా ఎక్కువ. దాని ప్రభావం రైతులతో పాటు సాధారణ ప్రజల మానసికతపై అనునిత్యం కనిపిస్తుంది. విధిరాత, దేవతల నిలకడలేనితనం, అందులో ఇమిడి ఉన్న హింసలను ప్రతిఫలించే ఆలోచనలు హిందువులలో అనేకం ఉన్నాయి.

## ముగింపు : అయోమయం

భారతదేశపు భూభౌతికత మనకు హిందూమతం గురించి ఏం చెప్తుంది? తమిళ ఆధారాల నుంచి ఎ.కె. రామానుజన్ చెప్పిన ఒక కథ మనకీ ప్రశ్నకు సమాధానాన్ని సూచిస్తుంది. అది ఈ విధంగా ఉంది:

**బ్రాహ్మణుని శిరస్సు, పారియా శరీరం**

> మారియమ్మ అనే ముని పత్నికి ఆమె భర్త మరణశిక్ష విధిస్తాడు. ఆ శిక్షను అనుభవించే సమయంలో ఆమె సానుభూతి కోసం ఎల్లమ్మ అనే పారియా స్త్రీని ఆలింగనం చేసుకుంటుంది. శిక్ష అమలులో వారిద్దరి తలలూ ఖండనకు గురవుతాయి. తర్వాత ఆ ముని కరుణించి వారిని క్షమించి, తన తపశ్శక్తితో వారి తలలను శరీరాలకు అతికిస్తాడు. కాని పొరపాటున ఒకరి తల ఒకరికి చేరుతుంది. బ్రాహ్మణ శిరస్సు, పారియా శరీరం గల మారియమ్మకు మేకలు, కోళ్లను బలిస్తారు. కాని దున్నపోతులను కాదు – మరొక వైపు పారియా శిరస్సు, బ్రాహ్మణ శరీరం గల ఎల్లమ్మకు దున్నపోతులను మాత్రమే బలిస్తారు.

రెండు వేర్వేరు భౌగోళిక ప్రాంతాలు, భాషా సంప్రదాయాల సమ్మేళనం మనకు మారియమ్మ కథలో కన్పిస్తుంది. మారియమ్మను ఉత్తర భారతదేశపు సంస్కృత సాహిత్యంలో రేణుక అని పిలుస్తారు. దక్షిణ భారతపు తమిళ మౌఖిక జానపద కథలలో దక్షిణ ప్రాంతానికి చెందిన ఇద్దరు దేవతల ఆవిర్భావం ఏ విధంగా జరిగిందో ఆ కథ చెప్తుంది. ఈ విధంగా భిన్నాంశాలను మేళవించటం పుక్కిటి పురాణాలలో, చరిత్రలో కూడా విరివిగా కన్పిస్తుంది. శరీరానికి శిరస్సును అతికించటంవలె, ఆఫ్రికాలోని ఒక భూఖండం కదలివచ్చి ఆసియాకు సంధానమవుతుంది. స్త్రీలు, నిమ్నకులాల వారి ఆలోచనలు పురుష బ్రాహ్మణుల

మేధస్సులలో ప్రవేశిస్తుంటాయి. హిందూ మతంలో ఇటువంటి మేల కలయికలకు పై కథ ఒక ఉపమానం వంటిది.

సమాజంలోని భిన్న సంస్కృతుల ఈ విధమైన కలయిక హిందూ మత చరిత్రకు చాలా మౌలికమైన స్థితి. ఈ కలయికను నిరోధించేందుకు బ్రాహ్మణులు ప్రతిసారి ప్రయత్నిస్తూ కూడా విఫలమయారు. హేతుబద్ధమైన ఆలోచనలను కోర్కెలు ప్రభావితం చేయగలవన్న భయంతో వారు, తపోనిష్ఠల ద్వారా ఆ కోర్కెలను నియంత్రించే ప్రయత్నం చేసారు గాని అందులోనూ విఫలమయ్యారు. ఈ క్రమంలో వర్గ సంకరం, వర్ణ సంకరం జరుగుతుందన్నది వారి అసలు భయం. ఇదంతా కలియుగంలో జరుగుతుందన్నది అంచనా. ఈ విధమైన సాంకర్యాలు అస్వచ్ఛతకు నిదర్శనమని వారి భావన. అయితే ఇది హిందూ మతానికి పరిమితమైంది కాదు. బ్రిటన్‌కు చెందిన మానవ వికాస శాస్త్రవేత్త మేరీ డగ్లస్, ఇటువంటి వర్గ సాంకర్యాలను ప్రపంచవ్యాప్తంగా అపరిశుభ్రమైనవని, ప్రమాదకరమైనవని భావిస్తారని రాసింది. బ్రాహ్మణ శిరస్సుతో పారియా శరీరం, పారియా శిరస్సుతో బ్రాహ్మణ శరీరమన్నవి భరించలేని, సహించలేని విపరీత స్థితి అని బ్రాహ్మణుల భావన. కాని బ్రాహ్మణేతరులు, హిందూ మత పరిశోధకుల దృక్కోణం నుంచి ఈ సాంకర్యం ఒక సుసంపన్నమైన సంస్కృతి. హిందూ మతాన్ని సాంస్కృతికంగా ఉచ్ఛస్థాయిలో నిలిపేది ఇదే.

ఆ విధమైన సాంకర్యం విపరీతమైనది కాదు, తప్పుకాదు. ఒకవేళ తప్పయినా అందువల్ల మేలే జరిగింది. ఇపుడు హిందూ మతానికి ఇరువురు దేవతలున్నారు. ఎవరి శిరస్సు వారికి చేరటం కన్న ఇది చాలా ఆసక్తికరమైంది కూడా. ఉభయులూ ఎవరికి వారు ఆసక్తిని కలిగించే దేవతలే. ఇటువంటి సందర్భాలలో అడగవలసిన ప్రశ్న ఇటువంటి కథ ఎక్కడినుంచి పుట్టుకువచ్చిందని కాదు. అట్లా శిరస్సులు ఎందుకు తారుమారయ్యాయి, అది జరిగిన తర్వాత అదే విధంగా ఎందుకు కొనసాగనిచ్చారని. హిందూమతాన్ని నానాజాతి సంకరం వంటిదన్నా, లేక ఏ సాంకర్యమూ లేని ఏక రూపం అన్నా రెండూ పొరపాటవుతాయి. అంతకన్నా ఆ మతానికి గల వేర్వేరు రూపాలు, ఆధారాలు, భిన్న సంప్రదాయాల సమ్మేళనాలు అన్నింటినీ ఏక కాలంలో గుర్తించి ఆమోదించటం సరైనదవుతుంది. ఇది కొంత చిక్కులమారిగా తోచినా, ఇదే సహేతుకమైనది, ఎక్కువ ఉపయోగకరమైనది. బ్రాహ్మణ శిరస్సును పారియా శరీరానికి, లేదా పారియా శిరస్సును బ్రాహ్మణ శరీరానికి సంధానించటం భారతదేశ చరిత్ర పొడవునా జరుగుతూనే ఉంది. ఇటువంటి భిన్నమైన సమ్మేళనాల గురించి రాయటమే ఈ పుస్తకం ఉద్దేశం.

అధ్యాయం 3

# సింధూలోయ నాగరికత

## క్రీపూ. 50,000 నుంచి 1,500 వరకు

**కాల క్రమణిక (అన్నీ క్రీపూ. సంవత్సరాలు)**

| | | |
|---|---|---|
| సుమారు 50,000 | : | శిలాయుగ నాగరికత ఆవిర్భావం |
| సుమారు 30,000 | : | భీమ్‌బెట్కా గుహా చిత్రాలు |
| సుమారు 6,500 | : | వ్యవసాయ ఆరంభదశ |
| సుమారు 3,000 | : | సంచార పశుపోషక జాతుల ఉనికి |
| సుమారు 2,500 | : | సింధూ నది వెంట నగర సమాజాలు |
| సుమారు 2,200 – 2,000 | : | హరప్పా ఉచ్ఛస్థితి |
| సుమారు 2,000–1,500 | : | సింధూ నాగరికత క్షీణ దశ |

సింధూ నాగరికత నుంచి లభించిన 'పశుపతి' ముద్రిక (420 వ ముద్రిక) అందరికీ పరిచితమైనదే. కాని అది ఏమిటన్న ప్రశ్నపై చాలా వివాదం ఉంది. ఆ తవ్వకాల నుంచి అనేక ముద్రికలు బయటపడ్డాయి. కాని, వాటికి సంబంధించిన పద వివరణలు ఏవీ లేనందున వాటికి నిర్వచనం చెప్పటం పెద్ద సవాలు అయింది. సింధూ నాగరికత లక్షణాలు హిందూ మతంలో తదనంతర కాలంలో ఏమైనా మిగిలి ఉన్నాయేమో శోధించటం మరొక సవాలుగా మారింది. ఆ నాగరికత వేదాల కన్నా ప్రాచీనమైనది. దానికి చెందిన వస్తురూప అవశేషాలు కొన్ని, ముఖ్యులైన హిందూ దేవతల తొలిరూపాలు అయి ఉండవచ్చు. మలి రూపాలు ఏమిటో తర్వాత చాలా కాలానికి బయటపడవచ్చు.

### తొలి చరిత్ర : భీమ్ బెట్కా గుహా చిత్రాలు

ఇపుడు మనం హిందూ మతం అంటున్న దానికి మూలాలు చాలా వరకు దక్షిణాసియా సంస్కృతులలో, గ్రంథరచన కన్నా చాలా కాలం ముందే ఉండి ఉంటాయి. ఈ గ్రంథాలనైతే మనం కొంత ఆత్మ విశ్వాసంతో అధ్యయనం చేసి వాటిలో ఏమున్నదో చెప్పగలం. కాని అంతకు ముందటి సంస్కృతుల గురించి కాదు. ప్రాచీన శిలాయుగానికి సంబంధించి క్రీ.పూ. సుమారు 30,000 సంవత్సరాల కాలం నాటి గుహాచిత్రాలు కొన్ని భోపాల్ సమీపాన వింధ్య పర్వతాలలో వెలుగులోకి వచ్చాయి. అవి చెప్పుకోదగ్గ చిత్రాలు. వాటిలో దుప్పులు, అడవి పందులు, ఏనుగులు, చిరుతపులులు, పులులు, ఖడ్గ మృగాలు, చేపలు, కప్పలు, బల్లులు, కుందేళ్లు, పక్షులు కనిపిస్తాయి. ఒక చిత్రంలో ఒక మనిషి

కుక్కకు తాడువంటిది ఏదో కట్టి తీసుకువెళుతున్నట్లు ఉంటుంది. ఆ జంతువులన్నీ బహుశా ఆ కాలంలో ఆ ప్రాంతంలో ఉండి ఉంటాయి. ఒకదానిలో సగం మనిషి, సగం ఎద్దు అయిన చిత్రం ఉండటం విశేషం. ఆ బొమ్మలలో లేని జంతువులు సైతం ఆ కాలంలో ఉండి ఉండవచ్చు. ఉదాహరణకు మనకు వాటిలో పాములు కన్పించవు. అంతమాత్రాన ఆ కాలంలో అవి లేవనలేము. బొమ్మలలో గల చాలా జంతువులకు కొమ్ములున్నాయి. ఒక చిత్రంలో ఒక ఒంటి కొమ్ము జంతువు చుట్టూ మనుషులు నృత్యం చేస్తుంటారు. ఇదే జంతువు సింధూ నాగరికతలోనూ కన్పిస్తుంది. ఈ రెంటికి మధ్య సంబంధమేమిటన్నది చిత్ర కళా చరిత్రను రాసేవారికి కూడా సవాలు వంటిదే.

## సింధూలోయ వస్తు సంస్కృతి

భారతదేశంలో ఇతర ప్రాచీన జనావాసాలు, సంస్కృతులు కొన్ని ఉండేవి. క్రీ.పూ. 6000 ప్రాంతానికి చెందిన బలూచిస్థాన్ అటువంటి ప్రాంతాలలో ఒకటి. అది పశ్చిమాన ప్రస్తుత పాకిస్థాన్‌లో ఉంది. కాని, బలూచిస్థాన్‌కు దక్షిణాన సుమారు 150 మైళ్ల దూరంలో గల సింధూ లోయలో పెద్ద నగరాలు నిర్మాణం కావటంతో, క్రీ.పూ. సుమారు 2,300 నుంచి మొట్టమొదటి పట్టణ సంస్కృతి రూపుదిద్దుకొంది. ఈ ప్రాంతం కూడా ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది. హరప్పా నాగరికత అనే మరొక పేరు గల సింధూ నాగరికత ప్రాంతాలలో హరప్పా, మొహెంజోదారో అనే రెండు గొప్ప నగరాలుండేవి. వాటిలో హరప్పా పేరిట గుర్తింపు పొందిందే హరప్పా నాగరికత. ఈ నాగరికతలనుంచి వస్తు రూపపు ఆధారాలు గణనీయమైన సంఖ్యలో లభించాయి. వాటిలో, వాటి అర్థమేమిటో బోధపడని చిత్రాలు అనేకం ఉన్నాయి. అవి అర్థమైన పక్షంలో హిందూ మతపు మూలాలు ఏమిటో మనకు తెలిసే అవకాశం ఉంది.

నవీన శిలాయుగ నాగరికతలు వర్ధిల్లిన నైల్, టైగ్రిస్ – యూఫరేట్స్ నదీలోయల వలెనే సింధూలోయ నాగరికత కూడా పాక్షికంగా వర్షాభావ ప్రాంతం. పాక్షికం అనటం ఎందుకంటే ఒకవైపు అడవులనదగ్గవి తక్కువైనందున అక్కడ స్థిరపడి వ్యవసాయాలు చేయాలంటే ఇనుప పనిముట్లతో చెట్లను నరకవలసిన అవసరం ఎక్కువుండదు. మరొకవైపు, నదుల వరదల వల్ల పేరుకునే ఒండ్రుమట్టి మిగులు ధాన్యం పండేందుకు ఉపయోగపడుతుంది. ఆ విధంగా నాగరికతలు అభివృద్ధి చెందుతాయి. నదీ మార్గంలో వాణిజ్య పరమైన రవాణాకు వీలుంటుంది.

సింధూ నాగరికతను కనుగొనటానికి సంబంధించిన ఒక కథనాన్ని గమనించండి. అలెగ్జాండర్ కన్నింగ్ హామ్ అనే బ్రిటిష్ జనరల్ ఒకరు (ఆయన తర్వాత ఉత్తర భారతదేశపు పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్‌గా నియమితుడయాడు) 1856లో హరప్పాను సందర్శించాడు. అక్కడ విలియం బ్రంటన్ అనే బ్రిటిష్ ఇంజనీరు, ముల్తాన్ – లాహోర్

రైలు మార్గం నిర్మాణం కోసం పట్టాల వెంట పోసేందుకు హరప్పాలో అప్పటికే గల ఇటుకలను సేకరిస్తున్నాడు. (అవి సింధూ నాగరికతకు చెందినవని కూడా గుర్తించారు). ఆ చోటును కన్నింగ్ హామ్ గమనించాడు గాని ఇటుకల విషయమై ఏమీ చేయలేదు. రైలు మార్గ నిర్మాణం యధావిధిగా పూర్తయి, క్రీ.పూ. సుమారు మూడు వేల సంవత్సరాల నాటి ఇటుకలు గల దాదాపు వందమైళ్ల ప్రాంతం మీదుగా రైళ్లు నడుస్తూనే పోయాయి. 1917 తర్వాత భారతీయ పురాతత్త్వ శాస్త్రవేత్త ఒకరికి మొహెంజోదారో వద్ద ప్రాచీన కాలానికి చెందిన కత్తి ఒకటి దొరికింది. అక్కడ తవ్వకాలు సాగించటంతో హరప్పాను పోలిన వస్తువులు కనిపించసాగాయి. దానితో ఆ నాగరికతను గుర్తించారు. హరప్పా వద్ద లభించిన వస్తు సంపదలో చెక్కిన శిలలు, ముద్రికలుగా పై కప్పులుగా ఉపయోగించిన ఇతర రాళ్లు ఉన్నాయి.

సింధూలోయ నాగరికత 7,50,000 కు పైగా చదరపు మైళ్ల ప్రాంతంలో వెయ్యికి మించిన ప్రదేశాలలో విస్తరించింది. ఆ ప్రాంతంలో నలభై వేల మంది ప్రజలు నివసించేవారు. రెండు పెద్ద నగరాలైన హరప్పా, మొహెంజోదారోలమధ్య దూరం నాలుగు వందల మైళ్లు. హరప్పా రావీ ఉపనదిపై ఉత్తరాన ఉండగా, మొహెంజోదారో సింధ్‌లోని లర్కానా లోయలో ఉంది. సింధూ నాగరికత మొహెంజోదారో కన్న ఇంకా దిగువకు, అరేబియా సముద్ర తీర ప్రాంతంలో గల డెల్టాలోని లోథల్ వరకు విస్తరించి ఉంది. ఈ నాగరికతా పరిధిలోని నగరాలన్నీ ఒకే విధంగా ఉండటం గమనార్హం. అవి వెయ్యేళ్లపాటు సుస్థిరంగా కూడా ఉన్నాయి. చివరకు వచ్చేసరికి క్రమంగా క్షీణించసాగాయి. ఆ నగరాలకు క్రేట్, సుమేర్, ఇతర మెసొపొటేమియా నగరాలతో, బహుశా ఈజిప్టుతో కూడా వాణిజ్య సంబంధాలుండేవి. అరేబియా ద్వీపకల్పంలోని ఒమాన్‌లో హరప్పా నాగరికతకు చెందిన ప్రదేశాలు, మెసొపొటేమియాలో సింధూ నాగరికత ముద్రికలు కన్పించాయి. ఇరాన్‌తో ప్రత్యక్ష సంబంధాలుండేవి. సింధూ నాగరికత చరమ దశకు చెందిన ఒక ముద్రిక పురావస్తు శాస్త్రజ్ఞులకు ఇరాన్‌లో లభించింది. దానిపై ఒకవైపు సింధూ నాగరికత ముద్ర, రెండవ వైపు ఇరానియన్ ముద్ర ఉన్నాయి. సింధూ నాగరికతపై మధ్య ఆసియా ప్రభావాలు ఉండినట్లు దానిని బట్టి అర్థమవుతుంది. సింధూలోయ నాగరికత అంతమైన తర్వాత కూడా ఆ ప్రాంతానికి మధ్య ఆసియాతో వాణిజ్య సంబంధాలు కొనసాగాయి. హిందువులు ఇతర దేశాలతో సంబంధాలు కొనసాగించటమేగాక అక్కడ నివాసాలు కూడా ఏర్పరచుకోవటం క్రీ.పూ. 2,000 కన్న చాలా ముందే ఆరంభమైనట్లు దీనిని బట్టి భావించవచ్చు.

పాచికలతో జూదమాడటం మధ్య ఆసియాలో, సింధూ నాగరికతలో కూడా ఆరంభమైనట్లు పురావస్తు శాస్త్రం చెప్తున్నది. భారత పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్‌గా 1902 నుంచి 1931 వరకు పనిచేసిన సర్ జాన్ హ్యూబర్ట్ మార్షల్, ఒకటి నుంచి ఆరు

చుక్కల వరకు గల పాచికలను అనేకం మొహెంజోదారోలో కనుగొన్నాడు. తర్వాత హరప్పాలో, ఇతర చోట్ల కూడా ఇతర విధాలైన పాచికలు లభించాయి. వాటిలో కొన్ని రకరకాల రాళ్లతో చేసినవి. క్రీ.పూ. 1200 నుంచి భారతీయ సంస్కృతిలో జూదానికి ఉ ండిన ప్రాముఖ్యతను బట్టి ఈ ఆధారాలు ముఖ్యమవుతున్నాయి.

సింధూ నాగరికత ప్రజల వద్ద బంగారం, రాగి, సీసం వంటివి ఉండగా కంచు, వెండి, తగరం దిగుమతి చేసుకునే వారు. కాని ఇనుము వారి ఉపయోగంలో లేదు. ఆయుధాలు రాగి, కంచుతో తయారయేవి. గోధుమ, బార్లీ ధాన్యం నిల్వ కోసం భారీ ఏర్పాట్లుండేవి. స్వంత ఇళ్లకు బయట ఉండే మురుగునీటి పారుదల వ్యవస్థలు ఆధునిక ప్రపంచంలో అనేక దేశాలలో కన్పించేవాటికన్నా మెరుగైనవి. ఈ మాట వర్తమాన భారతదేశంలోని అనేక ప్రాంతాలకు కూడా వర్తిస్తుంది. అత్యధిక నిర్మాణాలు కాల్చిన లేదా ఎండలో ఆరబెట్టిన ఇటుకలతో జరిగేవి. సింధూ నాగరికతా ప్రాంతమంతటా అవి ఒకే పరిమాణంలో ఉండటం విశేషం. తూకం కోసం ఉపయోగించే రాళ్లు కూడా అంతటా సరిగా ఒకే విధంగా ఉండేవి. కాలి బాటలను దారులుగా మార్చటంగాక, సరైన కొలతలు, పద్ధతులతో మార్గ నిర్మాణాలు జరిగేవి. సందులకన్న వీధులు రెట్టింపు వెడల్పుతో, అవెన్యూలు అంతకన్నా రెట్టింపు వెడల్పుతో నిర్మించేవారు. 18వ శతాబ్దంలో జైపూర్‌ను మహారాజా జైసింగ్ నిర్మించిన పద్ధతిలో అప్పుడు కూడా తూర్పు– పడమరలు, ఉత్తర – దక్షిణాల పద్ధతిలో దారులను కారిడార్లగా వేసేవారు.

వందలాది మైళ్ల మేర వందలాది సంవత్సరాలపాటు ఈ నిర్మాణ పద్ధతులు ఒకే విధంగా కొనసాగాయంటే అంత ప్రాచీన కాలంలోనూ ఎంతటి ప్రణాళికా బద్ధత, దానిపై ఎటువంటి నియంత్రణ ఉండేవో ఊహించవచ్చు. దీనిని బట్టి కొందరు పరిశోధకులు అపుడు నియంతృత్వం ఉండేదేమోనన్న సందేహం వ్యక్తపరిచారు. సంపన్నులకు స్వంత భవనాలు, మురుగునీటి పారుదల వ్యవస్థలు ఉండగా పేదలు మురికివాడలలో నివసించి ఉంటారని కొందరు అభిప్రాయపడ్డారు. ఇళ్లు చిన్నగా, ఒకే పోలికతో ఉండటం, ప్రభుత్వ భవనాలు మాత్రం భారీవి కావటాన్ని బట్టి, అప్పటి ప్రభుత్వాలకు అంతా ఒకే తీరున ఉండటంపై మితిమీరిన దృష్టి ఉండేది కావచ్చునన్న వారు కూడా ఉన్నారు. పోతే, నగరాలలోని వేర్వేరు వృత్తులవారు వేర్వేరు ప్రాంతాలలో నివసించి పనులు చేసే వారనేందుకు ఆధారాలున్నాయి. ఇది ఆదిమ కుల వ్యవస్థ ఉనికికి సూచన కావచ్చు. ఒక అధికార వ్యవస్థ, ప్రణాళికాబద్ధమైన నగర నిర్మాణాల జాడలు కనిపిస్తుండటంతో కొందరు పరిశోధకులు అదంతా నగర సంస్కృతికి, సుఖజీవనానికి, క్రమ పద్ధతికి రుజువని అన్నారు. అప్పటి ముద్రికలు, బొమ్మలు, పిల్లల ఆటబొమ్మలు చిన్నవిగా ఉండటాన్ని బట్టి వారిది సున్నితమైన సంస్కృతి అని, కళలు అందమైనవని కూడా మనం భావించవచ్చు.

## చిత్రాలు, చిహ్నాలు: ముద్రికలు, లిపి

సింధూలోయ నాగరికత తన గొంతువిప్పి అనేక విషయాలు చెప్తున్నది. మనమే అది వినక బధిరులంగా ఉండిపోయాము. అయితే మనకు వాటి మాటలు వినిపించక పోయినా చిత్రాలు కనిపిస్తాయి.

ఈ నాగరికత వ్యాపించినంతమేర కనిపించే ముద్రికలలో అత్యధికం సింధూలిపి, దానితోపాటు కొన్ని చిహ్నాలు ముద్రించి కనిపిస్తాయి. లేదా వాటిపై కొన్ని చిత్రాలు, డిజైన్లు ఉంటాయి. లిపితో కూడుకున్న ముద్రికలు రెండు వేలకు పైగా ఉండగా, వాటిపై రకరకాల లిపి చిహ్నాలు మొత్త నాలుగు వందల వరకు కనిపిస్తాయి. ఆ చిహ్నాలలోనివి అక్షరాలో, లేక ఒక్కొక్క చిహ్నం ఒక పదాన్ని సూచిస్తుందో తెలియదు. వాటిని విశ్లేషించినట్లు పలువురు ప్రకటించారుగాని అవి ఊహాగానాలు మాత్రమే. వాటి రహస్యాన్ని నిజంగా కనుగొన్నవారు ఎవరూలేరు. ఆయా ముద్రికలపై గల అంశాలు చాలా క్లుప్తమైనవి అయినందున వాటిని కంప్యూటర్లు విశ్లేషించలేవు. ప్రతి ముద్రికపై భిన్నమైన చిహ్నాలున్న కారణంగా వాటిని ఒక క్రమంలో చేర్చి చూడటం కూడా సాధ్యపడటం లేదు. ఒకోసారి ఒకే చిత్రం వేర్వేరు ముద్రికలపై కన్పించవచ్చు. కాని వాటితోపాటు గల లిపి చిహ్నాలు భిన్నంగా ఉన్నాయి. కనుక ఆ చిత్రానికి, లిపికి మధ్య సంబంధాన్ని కనుగొని అర్థం చెప్పుకోవటం వీలుకాకుండా ఉంది. అది ఇండో యూరోపియన్ భాష అని, ద్రవిడమని, ముండా లేక ఆస్ట్రో – ఆసియాటిక్ భాష అని (భూ ఫలకాల కదలిక చరిత్రను బట్టి) రకరకాల అభిప్రాయాలుండగా, కొందరు అసలది ఏ భాషా కాదన్నారు.

ఆ ముద్రికలు ఆస్తుల యాజమాన్యాలకు గుర్తులైనా కావచ్చు. భూమి పట్టాల పద్ధతిలో వర్తకులు తమ సామాగ్రిపై గుర్తువేసే ముద్రికలు అయి ఉండవచ్చు. కాదంటే అది అప్పటి షార్ట్‌హ్యాండ్ కావచ్చు. అయితే ఆ చిత్రాలు, చిహ్నాలు స్పష్టమైనవి అయినందున, మాటలు లేనందున ఎవరి నిర్వచనాలు వారు చెప్తున్నారు. ఈ అస్పష్టత, ఎవరి దృష్టి వారిది కావటమన్నది కూడా చంద్రుని పై ఉన్నది కుందేలా లేక మనిషా అనే ఊహ వంటిదే.

ముద్రికలపైని చిత్రాలను బట్టి మనం అప్పటి జంతుజాలం, వృక్షజాలం గురించి మాత్రం తెలుసుకోవచ్చు. అవి చాలా వరకు వ్యవసాయానికి సంబంధించిన విత్తనాలు, పండ్లు, మొలకలు, ధాన్యపు మొక్కలు, పప్పులు, వృక్షాలు, వ్యవసాయ పరికరాలు (నాగళ్లు, దంపుడు పనిముట్లు, పారలు, పంటకోత పనిముట్లు మొదలైనవి). అవిగాక సూర్యచంద్ర నక్షత్ర సంబంధమైన గుర్తులు కూడా ఉన్నాయి. ఈ చిహ్నాలను, పురావస్తు పరిజ్ఞానం ద్వారా దృష్టికి వచ్చే ఇతర ఆధారాలను గమనించినపుడు సింధూలోయ ప్రాంతంలో శీతాకాలంలో బార్లీ, గోధుమ, వసంత రుతువులో శనగలు, బఠాణీల వంటివి

ఇతర పప్పు ధాన్యాలు, వేసవిలో, వర్షాకాలంలో చిరుధాన్యాలు, కర్బూజా, పుచ్చ, ఖర్జూర, పీచు మొక్కలు పెంచేవారని తెలుస్తుంది. బహుశా వరిసాగు కూడా చేసి ఉంటారు. నూలు వడకటం, వస్త్రాల నేత, బహుశా ప్రపంచంలోనే మొదటిసారిగా రంగుల అద్దకం, మొదటిసారిగా చక్రాలబండి ఉపయోగం వంటివి కూడా ఆ నాగరికతలో ఉండేవి. వారు మాంసం, చేపలు తినేవారు.

## సింధూ నదీలోయ జంతువులు

అడవి జంతువులు, పెంపకం జంతువులు రెండూ సింధూ నాగరికతలో మనకు కనిపిస్తాయి. వాటి చిత్రాలను ముద్రికలపై, శిల్పాలపై, చిత్రాలపై, కుండలపై, పిల్లల బొమ్మలపై చూడవచ్చు. ఆ సరికి దాదాపు ఎడారిగా మారిన ఆ ప్రాంతంలో పెద్ద పులులు, ఏనుగులు, ఖడ్గమృగాలు, గేదెలు, దున్నలు, జింకలు, మొసళ్లు నివసించేవి. నదుల తీరంలో ఎత్తయిన తుంగగడ్డి, అడవులుండేవి. ఇదే నాగరికతకు చెందిన తదనంతర కాలపు ప్రదేశమైన ఒక చోట మహా రాష్ట్రలో ఖడ్గమృగం, దున్నపోతు, ఏనుగు వంటివి చక్రాల బళ్లకు కట్టి కనిపిస్తాయి. అది బహుశా హరప్పాతో సంబంధం కలదై ఉంటుంది. తాబేళ్లు, కుందేళ్లు, కోతులు, పక్షుల బొమ్మలు అపుడు చేసేవారు. ఉడత, లేదా ముంగిసను పోలిన 2.9 అంగుళాల పొడవైన మట్టి బొమ్మలూ ఉన్నాయి.

ఇవెట్లున్నా పెంపకం జంతువుల చిత్రాలు, మట్టి బొమ్మలు, సజీవ జంతువుల అవశేషాలు సింధూ నాగరికత గురించి ఎక్కువగా చెప్తాయి. వేదకాలపు ప్రజల వంటి తదనంతర సంస్కృతుల వారితో సింధూ నాగరికతకు సంబంధం ఉందో లేదో కూడా దానిని బట్టి ఒక అంచనాకు రావచ్చు. సింధూ నాగరికత కన్నా వేల సంవత్సరాల ముందు దక్షిణాసియా వాసులు వేటాడిన జంతువులలో కొన్నిటిని తర్వాత కాలంలో పెంచి పోషించేవారు. కొన్ని సందర్భాలలో వేటాడే వారు కూడా. సింధూ నాగరికతకు ముందు కాలంలోనూ వ్యవసాయం కోసం దున్నలను పోలిన జంతువులను, బరువైన పనులకు ఏనుగులను ఉపయోగించేవారు. మధ్య ఆసియా పశ్చిమ ప్రాంతాలలో ఏనుగులు స్థానిక జంతువులు కాదు. వాటిని దిగుమతి చేసుకునేవారని భావించాలి.

సింధూ నాగరికతలో కుక్కలను పెంచేవారు. వాటి పెంపకం బహుశా భీమ్ బెట్కా కాలానికే ఆరంభమై ఉంటుంది. సింధూ తవ్వకాల తొలి దశలోనే పాల్గొన్న మార్షల్, ఈ అంశంపై చాలా వ్యాఖ్యానించాడు. అది కొంత గమనించండి:

> ఎవరైనా సరే ఊహించగల విధంగా కుక్కలన్నవి సర్వసాధారణ జంతువులుగా ఉన్నాయి. ఆ బొమ్మలలో ఒకటి మినహా తక్కినవన్నీ పిల్లలు చేసినట్లు కనిపిస్తాయి. అది పెంపకం జంతువేగాక కాపలాకు కూడా ఉపయోగపడేదని కొన్నింటి మెడకు గల పట్టీలను బట్టి చెప్పవచ్చు. వాటికి తాడును కట్టి ఒక గుంజకు బిగించేవారు.

దానిని బట్టి అవి ఒకోసారి క్రూరంగా ప్రవర్తించేవని, కనుక స్వేచ్ఛగా వదిలేవారు కారని అనుకోవాలి. బాగా తయారు చేసిన ఒక కుక్క బొమ్మ మాత్రం ప్రస్తుత కాలపు బ్రిటిష్ శునక జాతుల్లో ఒక దానిని పోలి ఉంది.

ఒక బొమ్మలో కుక్క నాలుక బయటకు వేలాడుతుంటుందని మార్షల్ పేర్కొన్నాడు. మట్టి బొమ్మలలో ఇటువంటిది అరుదు. సింధూ నాగరికతలో చూపిన చిన్న కుక్క బొమ్మల్లో ఊరకుక్కలు కూడా ఉన్నాయి. ఆశ్చర్యకరంగా డేక్షుండ్ జాతివి సైతం కనిపిస్తాయి.

సింధూ ప్రజలు ఒంటెలు, గొర్రెలు, పందులు, మేకలు, కోళ్లను పెంచేవారు. కోళ్ల పెంపకం బహుశా అదే మొదలుకావచ్చు. ప్రపంచ సంస్కృతికి ఇది ఒక ముఖ్యమైన ఆధారమనాలి. పిల్లులు మాత్రం లేవు. లేదా వాటిని చిత్రించదలచుకోలేదని భావించాలి. ముద్రికలపై, మట్టి పాత్రలపై చిత్రాలు, బొమ్మలలో ఎక్కువగా మగ జంతువులు కనిపిస్తాయి. అందులోనూ తరచుగా ఎద్దులు. పొట్టి కొమ్ములవి కూడా ఉన్నాయి వాటిలో. ఎద్దులు, వాటర్ బఫెలో, పొట్టేళ్లు, ఇతర కొమ్ముల జంతువులకు ప్రాముఖ్యత ఇచ్చేవారు. ఒక చోటనైతే పులికి కూడా కొమ్ములు చిత్రించారు.

ఆడ జంతువుల పట్ల వారికి ఆసక్తి లేనట్లు తోస్తుంది. ఆవు బొమ్మ అసలు లేకపోవటం గమనించదగ్గది. ఒకవేళ ఆవు పవిత్రమైనదని భావించినప్పటికీ దాని బొమ్మలు మట్టిలోగాని, రాతితో చెక్కిగాని కనిపించవని మార్షల్ పేర్కొన్నాడు. ఆవులు లేనిదే ఎద్దులుండవు గనుక ఆవులు ఉండేవనాలి. పైగా అందుకు ఇతర ఆధారాలున్నాయి. సింధూ నాగరికత కళాకారులు ఆవులను సాంస్కృతిక చిహ్నాలుగా భావించేవారు కాదని చిత్రకళా చరిత్ర గురించిన రికార్డులు మనకు చెప్తున్నాయి. అటువంటి స్థితిలో, వాటిని అప్పటివారు పవిత్రమైనవిగా భావించేవారనేందుకు ఆధారాలేమిటి? పవిత్రమనే దానికి ఆచరణాత్మకమైన అర్థమేమిటో తెలియకుండానే పురావస్తు శాస్త్రవేత్తలు తరచూ ఆ పదాన్ని ఎందుకు ఉపయోగిస్తుంటారు? ఈ ప్రశ్నను మనం తర్వాత చర్చిద్దాము.

సంభోగ శక్తికి పేరుపడిన ఎద్దులు, ఖడ్గమృగాలు, ఏనుగులు, పులులు, సంతాన శక్తికి సర్పాలు, మొసళ్ల వంటి జంతుజాలం చిత్రాలు ముద్రికలపై కనిపిస్తాయి. వీటిలో మొసళ్ల గురించి మనకు తెలియదు.

## ఒంటికొమ్ము జంతువులు

బాగా అభివృద్ధి చెందిన హరప్పా నాగరికత కేంద్రాలనుంచి మొత్తం 1,755 ముద్రికలు, నిర్మాణాల పైకప్పులు లభించగా, వాటిలో 1,156 వస్తువులపైన కనిపించే సింధూలోయ జంతువు ఒకటుంది. అది జంతుశాస్త్ర దృష్టికి ఎక్కడా రాలేదు. దానిది ఎద్దు శరీరం, జీబ్రాతల కాగా, తలనుంచి ఒక కొమ్ము వంపులు తిరుగుతూ మొదట ముందుకు, తర్వాత పైకి పోతుంది. ఈ జంతువు ఏమై ఉంటుంది? దానికి రెండు

కొమ్ములు ఉన్నప్పటికీ ఒక పక్క నుంచి చూడటం వల్ల ఒక కొమ్మువలె కనిపిస్తున్నట్లా? లేక, ముక్కుపై కొమ్ము ఉండే ఒక జాతి జింక వంటిదా? కొమ్మున్న గుర్రమా? కళాకారుడు విచిత్రంగా తీర్చిదిద్దిన ఖడ్గమృగమా? లేక కేవలం ఊహాగానమా? సింధూ నాగరికతలోని కొన్ని ఇతర జంతువులవలె దీనికి కూడా ప్రతి చిత్రంలో ముందువైపున మేత బుట్ట ఒకటి ఉంటుంది. ఆ బుట్ట లేదా తొట్టికి మతపరంగాకాని లేదా సాంస్కృతికంగా కాని ప్రాముఖ్యత ఏదైనా ఉండవచ్చునని కొందరి ఊహ. ఒక ముద్రికపైన ఆ ఒంటికొమ్ము జంతువును, దాని ఎదుట మేత తొట్టి ఉండగా ఊరేగింపుగా తీసుకు వెళుతున్న చిత్రం కనిపిస్తుంది. ఆహార లేదా పాన పాత్రలు క్రైస్తవ మతంలో పవిత్రం కావటం వంటిది కావచ్చునిది. పరిశోధకులు దానిని దృష్టిలో ఉంచుకుని ఈ తొట్టిని కూడా పవిత్రమైనదని అంటుండవచ్చు.

సింధూలోయ ఒంటికొమ్ము జంతువు మనను అయోమయానికి గురిచేస్తుంది. సింధూ నాగరికత కళలలో కన్పించే జంతువులు మతపరమైన చిహ్నాలా? అక్కడి జంతువుల బొమ్మలు, పిల్లల ఆట బొమ్మలు, వాటికి చక్రాలుండటం నిజమైనా, పరిశోధకులు వాటికి మతపరమైన అర్థాలు చెప్పక మానటం లేదు. ఈ అభిప్రాయాన్ని బలపరచేందుకు కొన్ని అవశేషాలను కూడా చూపుతున్నారు. 1929 నాటి ఒక తవ్వకంలో, ఇరవై మానవ కపాలాలు ఒకే మూటగా కట్టినట్లుండి ఒక భారీ పూజా పాత్రలో బయటపడ్డాయి. బలి ఇచ్చిన జంతువుల అస్తికలు కూడా వాటివెంట ఉన్నాయి. మనుషుల తలలను నరికి ఒక పవిత్రమైన వృక్షానికి నివేదనగా ఇచ్చి ఉంటారనేందుకు అది సాక్ష్యమని ఆ తవ్వకాలు జరిపిన పరిశోధకుడు నిర్వచనం చెప్పాడు. ఇటువంటివే మరికొన్ని చిత్రాలు కనిపిస్తాయి. హరప్పాలో మృతదేహాలను పాతిపెట్టే భారీ పాత్రలపై ఒక కుక్క, పొడవైన అలలవంటి జుట్టుతో ఒక మనిషిని బెదిరిస్తూ ఉంటుంది. అది యమునికి చెందిన శునకమన్నది నిర్వచనం. రెండు నాగుపాములకు ఎదుటగల ఇద్దరు వ్యక్తులు భక్తులన్నది మరొక నిర్వచనం. ఆ ఇద్దరు, ఆ దృశ్యంలో ఒక చోట కూర్చుని ఉన్న ఒక మూర్తికి కొద్దిగా వంగి ప్రణామం చేస్తున్నారు. అదే చిత్రంలో ఒక వ్యక్తి రెండు పెంపకం పులులను పట్టి వెనుకకు లాగుతుంటాడు. సగం ఎద్దు, సగం మనిషి రూపంలో గల ఒక విచిత్ర రూపం, ఒక కొమ్ముల పులిపై దాడి చేస్తుంటుంది. ఇవన్నీ సింధూలోయ సంస్కృతిలోని అనుదిన దృశ్యాలు కావు. ఇటువంటి చిత్రాలు, మట్టి బొమ్మలు, శిల్పాలు మొదలైనవి ఆ కాలపు పూజలు, క్రతువులు, విశ్వాసాలు, ఆచారాలకు, ఊహలకు, మతానికి అద్దం పడుతుండవచ్చు. కాని వాటికి అర్థమంటూ చెప్పగలదేమీ మనకు అందుబాటులో లేదు.

తక్కిన ముద్రికలు కూడా ఏదో విషయం చెప్పదలచుకున్నట్లు కనిపిస్తాయి. కాని అదేమిటో మనకు బోధపడదు. ఒక ముద్రికపై గల దృశ్యంలో కనిపించే వ్యక్తి 'మూడు

కొమ్ముల దేవత' అన్నారు. కాని తను మూడు కొమ్ముల టోపీ పెట్టుకున్న పురుషుడో, స్త్రీయో అయినా కావచ్చు. ఆ వ్యక్తి ఒక వృక్షంలోంచి బయటకు వెలువడుతుండగా, వృక్షం బయట మరొకరు విధేయతగా నిల్చుని చేతులు పైకెత్తి ఉంటాడు. వెనుక ఎద్దు, వారికి కింది భాగంలో ఏడుగురు బాలికలు ఉంటారు. ఇదే తరహాలో వేర్వేరు దృశ్యాలు కనిపించే ముద్రికలు హరప్పా, మొహెంజోదారో, చన్హుజోదారో, కాళీబంగన్ వద్ద బయటపడ్డాయి. ఒక ముద్రికపై నగ్నంగా ఉన్న ఒక వ్యక్తి కొమ్ముల టోపీతో రావిచెట్టు కొమ్మల మధ్య ఉంటాడు. పక్కవైపు నుంచి కన్పించే మరో వ్యక్తి చెట్టు మొదలు వద్ద వంగి ప్రణామం చేస్తుంటాడు. తన వెనుక ఒక పెద్ద మేక ఉంటుంది. ఇంకొక ముద్రికలో ఒక వ్యక్తి కూర్చొని ఉండగా తన ఎడమ వైపున కొన్ని జంతువులు, కుడివైపున ఒక పులి కనిపిస్తాయి. ఆ పులి చెట్టు కొమ్మలలో గల ఒక మనిషి వైపు తలెత్తి చూస్తుంటుంది. అక్కడ ఏదో జరుగుతున్నది. కాని ఏమిటది? ఏదైనా జానపద కథా? లేక ఉత్సవమా?

## లింగ భేదాలు సూచించే బొమ్మలు

### పశుపతి

మొహెంజోదారో అండ్ ద ఇండస్ సివిలిజేషన్ పేరుతో మార్షల్ 1931 లో మూడు సంపుటాల గ్రంథం ఒకటి రాసాడు. అందులో 'మతం' అనే శీర్షికతో గల ఒక సుదీర్ఘమైన అధ్యాయంలోని అయిదు పేజీలను ఆయన 420 వ ముద్రికకు ప్రత్యేకించాడు. మొహెంజోదారోలో ఒక దేవుడు కనిపిస్తాడని, తనను వెంటనే శివుని తొలిరూపంగా గుర్తించవచ్చునని రాసాడాయన. తన శరీరపు అధోభాగం నగ్నంగా ఉండి శిశ్నంపైకి లేచినట్లు కనిపిస్తుందని పేర్కొన్నాడు. కాని ఆ మాట నిశ్చయంగానూ చెప్పలేక, నడుముకు చుట్టుకున్న వస్త్రం వంటి దానికి అది చివరి భాగం అయి ఉండవచ్చునని కూడా అభిప్రాయపడ్డాడు. ఆ చిత్రం శివుని దై ఉంటుదన్న మార్షల్ సూచనను తర్వాత అనేక తరాల పరిశోధకులు స్వీకరించారు. ఇందుకు చాలాప్రాముఖ్యత ఉంది. ఒక వేళ అది నిజమే అయితే హిందూ మతంలోని ఒక ప్రధానమైన పార్శ్వానికి మూలాలు వేదాలకన్న ముందునుంచి ఉన్నట్లవుతుంది.

సుమారు ఒక అంగుళం ఎత్తు మాత్రమే గల ఆ చిన్న ముద్రికపై చాలా చర్చ జరిగింది. శివుని లింగం లేదా నడుముకు చుట్టుకున్న వస్త్రపు చివరి భాగం అయిన ఆ మిల్లీమీటర్ చిత్రభాగంపై చారిత్రకంగా చాలానే రభస జరిగింది. పెద్ద ముక్కుతో పద్మాసనంలో కూర్చుని, ఊర్ధ్వలింగంతో గల ఆ పురుషుని చుట్టూ జంతువులు చేరి ఉంటాయని వర్ణించారొకరు. సింధూ నాగరికత ప్రదేశాల వద్ద నునుపు చేసిన నిలువైన, దీర్ఘచతురస్రమైన రాళ్లు అనేకం కనిపిస్తాయి. అవి చాలా వరకు చిన్నవే అయినా కొన్ని రెండడుగుల ఎత్తువరకున్నాయి. వాటిని బహుశా ధాన్యం నూర్పిడికి ఉపయోగించేవారు

కావచ్చు. కాని కొందరు పరిశోధకులు వాటిని శివుని ఊర్ధ్వలింగం, తన పత్ని యోనిగా భావించారు. లింగపూజపై వేద సంస్కృతిలోగల విమర్శలు, ఈ సింధూ సంస్కృతి గురించినవేని కొందరు పరిశోధకుల భావన. దానినొక పూజా విధానమని కూడా అన్నారు. ఈ రకరకాల అభిప్రాయాలు మనను అయోమయానికి గురిచేస్తాయి. సింధూ సంస్కృతిలో ఒక పూజా విధానం ఉండేదని, వేద కాలపు వారికి ఆ విషయం తెలుసునని, ఇంద్రియ శక్తిగల ఇంద్రుడిని స్వయంగా పూజించే తాము వారిని తమలో విలీనం చేసుకునే బదులు ఆక్షేపించేవారని గమనించి ఆశ్చర్యం కలుగుతుంది.

ఆ చిత్రాన్ని మార్షల్ శివునిగా భావించటానికి అయిదు కారణాలున్నాయి. అవి, (1) సింధూ నాగరికత ముద్రికపై గల వ్యక్తి ఎక్కువ ఎత్తులేని పీఠం పై కూర్చుని ఉంటాడు. కాళ్లు రెండు ముడుచుకుని, మోకాళ్లు పక్కలకు ఉంటాయి. రెండు పాదాలు పొత్తి కడుపు వద్ద చేరి ఉంటాయి. దక్షిణాసియా వాసులు అట్లా కూర్చోవటం సాధారణమే అయినా దానిని యోగ భంగిమ అన్నారు. శివుడు యోగుల దేవుడు, (2) శివుని జటాజూటంపై నెలవంక, చేతిలో త్రిశూలం ఉంటుంది. వాటిని గుర్తుచేస్తూ సింధూ ముద్రిక చిత్రంలోని వ్యక్తికి గేదె కొమ్ములుంటాయి. బహుశా ఆ ముఖం కూడా గేదె ముఖరూపం అయి ఉంటుంది. (3) ఇదే దృశ్యాన్ని చూపే మరొక రెండు ముద్రికలపై గల వ్యక్తికి ముందు వైపునగల ముఖంతో పాటు రెండు ప్రక్కల ఇంకొక రెండు ముఖాలుంటాయి. ఒకోసారి అయిదు ముఖాలుంటాయి గనుక శివుడిని పంచ ముఖుడంటారు. (4) సింధూ ముద్రికలోని వ్యక్తికి చుట్టూ ఏనుగు, ఖడ్గమృగం, నీటి గేదె, తన పీఠానికి కిందివైపు జింకలు లేదా మేకలవంటి చిన్న కొమ్ముల జంతువులు ఉంటాయి. శరీరంపై పులి చర్మం ఉంటుంది. శివుడిని పశుపతి నాథుడనటం తెలిసిందే. తన శరీరంపై ఆయన ఒకోసారి పులి చర్మం, ఒకోసారి ఏనుగు చర్మం ధరించి ఉంటాడు. (5) సింధూలోయ ముద్రపైన, మనకు సాధారణంగా తెలిసిన రూపంలోగల శివునికి కూడా ఊర్ధ్వలింగం ఉంటుంది.

పరిశోధకులలో అధికుల అభిప్రాయం నేటికీ అదే. నేను కూడా 1973 లో అదే విధంగా అభిప్రాయపడ్డాను. ఇదిగాక అనేక ఇతర ఊహాగానాలు కూడా ఉన్నాయి. పాఠకులు వాటిని సీరియస్‌గా తీసుకోకపోయినా, పరిశోధకుల ఊహాగానాలు ఏవిధంగా సాగుతాయో గమనించవచ్చు. అవి ఇంచుమించు కాలక్రమానుసారం ఈ విధంగా ఉన్నాయి:

(1) ఆ బొమ్మ దేవునిది గాక దేవతది. ఊర్ధ్వలింగమని భావించేది ఆ దేవత నడుము చుట్టూగల వస్త్రం, (2) తర్వాత కాలపు దుర్గాదేవి వధించిన మహిషమది. దుర్గాదేవి పులిపైన లేదా సింహంపైన సవారీ చేస్తుంటుంది, (3) అది ఇంద్రుని చిత్రం, (4) వేదకాలపు రుద్రుడు. తను శివుడిని పోలినవాడే. రుద్రుని చుట్టూ కూడా జంతువులుంటాయి. ప్రకృతి

శక్తుల అవతారాలైన ఆ జంతువులు ఇంద్రుడిని, రుద్రుడిని కొలుస్తుంటాయి, (5) అగ్ని దేవుడు. అగ్నికి మూడు రూపాలుంటాయి. ఆ ముద్రికలోని అక్షరాల వంటివాటి అర్థం “మూడు విధాలుగా జ్వలిస్తున్న' అని నిర్వచనం చెప్పారు, (6) తను అనిల్ అనే పేరు గల పాలకుడు. ముద్రికలో ఏమేమి జంతులున్నాయో అవి తమ చిహ్నాలుగా గల తెగలను ఆయన పాలించాడు, (7) కూర్చుని ఉన్న ఎద్దు, (8) రుష్య శృంగుడనే పేరుగల రుషి. తన నుదుటి నుంచి ఒక కొమ్ము పెరుగుతుంటుంది. తన తల్లి తెల్లటి పాదాలు గల దుప్పి. రుష్య శృంగుడు హిందూ, బౌద్ధ మతాల తొలికాలపు కథల్లో కనిపిస్తాడు, (9) ఎద్దును కేంద్రంగా చేసుకునే ఒక పూజా విధానంలో అదొక భాగం. ఎద్దు సింధూ నాగరికతలో ఇతర రూపాలలో కూడా కనిపించటాన్ని బట్టి ఈ ఊహకు కొంత బలం చేకూరుతున్నది, (10) ఒక యోగ ముద్ర. దానికి శివునితో సంబంధం ఉందా లేదా అన్నది తెలియదు.

వాస్తవానికి ఈ ముద్రికలోని చిత్రానికి, తదనంతర కాలంలో హిందూ మతంలో కన్పించే శివుని రూపానికి పోలికలున్నాయి. సింధూలోయ ప్రజలు భగవంతుని లింగం, లేదా కొమ్ములున్న దేవుడు అనే సంకేతాలను సృష్టించారనాలి లేదా రెండింటినీ సృష్టించినట్లు చెప్పవచ్చు. అయినప్పటికీ దాని అర్థం సింధూ నాగరికత చిత్రాల నుంచి హిందూ దేవతల చిత్రాలు రూపు తీసుకొన్నాయని కాదు. ఆ నాగరికతా కాలపు స్త్రీల చిత్రాలను పరిశీలించే ముందు మనమీ విషయం గుర్తుంచుకోవాలి.

## మాతృకలు, మాతృ దేవతలు

సింధూ నాగరికతకు చెందిన వేర్వేరు వస్తువులపై స్త్రీల చిత్రాలు విరివిగా కనిపించటాన్ని బట్టి వారికపుడు చాలా విలువ ఉండేదని భావించాలి. ముద్రికలపై గలవి పురుషులు, జంతువుల చిత్రాలు అయినప్పటికీ మట్టి బొమ్మలలో స్త్రీలవి చాలా ఉన్నాయి. కొన్నింటికి నడుము చుట్టూ వెడల్పయిన వస్త్రం, కంఠహారం, అందంగా తీర్చిదిద్దిన పెద్దదైన శిరోవేష్టి ఉంటాయి. కళ్లు పెద్దవి, ముందుకు పొడుచుకు వచ్చినట్లుంటాయి. చెవులు కూడా పెద్దవి, నడుముకు పట్కా వంటిది ఉంటుంది. ఒకోసారి కటి వస్త్రాన్ని కింది దాకా కాకుండా మధ్యవరకు ధరించి ఉంటారు. కొందరు గర్భవతులు. కొందరు వక్ష స్థలంపై, లేదా నడుముపై చిన్న ముద్దల వంటివేవో పట్టుకుని ఉంటారు. అవి వారి పిల్లలు కావచ్చు. ఇది వారి సంతానాపేక్షకు గుర్తు కావచ్చు కుడా. అదే విధంగా ఒక మత విశ్వాసమో, సామాజిక విశ్వాసమో కావచ్చు.

కాని ఇందులో ఏదో విశ్వాసాన్ని ఊహించటం ఎందుకు? వారు సంతాన సృష్టికి సంకేతాలెందుకు కావాలి? ఒకవేళ అటువంటి సంకేతాలని భావించినా దానిని ఒక

ఉత్సవంగా ఆచారంగా పరిగణించటం ఎందుకు? ఈ సూత్రీకరణను కూడా నేను సుమారు పాతికేళ్ల ఆమోదించినట్లు చెప్పాలి. సింధూ నాగరికతలో మాతృత్వాన్ని కొలిచే సంప్రదాయం ఒకటి బయల్పడిందని అపుడు రాసాను నేను. కాని అటువంటి ప్రతీ చిత్రం చిహ్నప్రాయమైనది కాదు. ప్రతి స్త్రీ దేవత కాదు.

పరిశోధకులు పశుపతికి, సింహంపై ఆసీనురాలై ఉన్న దేవతకు మధ్య సంబంధం ఉన్నట్లు భావించారు. కొందరు ఆ ముద్రికలపైగల పులులను తదనంతరం కాలపు హిందూ దేవతలకు లేదా ప్రాచీనకాలపు ఈజిప్టు, ఏజియన్, ఆసియా మైనర్, పశ్చిమాసియాలకు చెందిన దేవతలకు సంబంధించినవిగా భావించారు. ఆ దేవతలంతా సింహాలు, చిరుతపులులు, పులులతో దాంపత్యం చేసేవారన్నది నమ్మకం. సింధూ నాగరికతలో కన్పించిన స్త్రీలు దేవతలనే భావన కారణంగా, అనంతర కాలానికి చెందిన వైదిక దేవతలు యక్షిణులు, అప్సరసలు కూడా సింధూ నాగరికతకు చెందిన వారేనన్న వాదన ముందుకు వచ్చింది. వీరు వృక్షాలు, నీటి వనరులతో సంబంధం గల ద్వితీయశ్రేణి దేవతలు.

స్త్రీల బొమ్మలు, వృషభం, కొమ్ములు గల దేవతా, పవిత్రమనుకునే రావిచెట్టు వంటివి సంతాన సంప్రదాయాలు, విశ్వాసాలతో ముడిబడి ఉండటం ఆసక్తికరంగా తోస్తుంది. ఒక ముద్రికపై గల చిత్రంలో ఒక వ్యక్తి ఒక రావి చెట్టు మధ్యలో నుంచి వెలుపలికి రావటం గురించి చెప్పుకున్నాము. భారత దేశ శిల్ప కళలో అనంతర కాలంలో విరివిగా కన్పించే రావి, మర్రిచెట్లకు ఇది తొలి రూపం అవునో, కాదో చెప్పలేము. అయితే ఒక సమాధిలో స్త్రీ పురుషులిద్దరి అస్తి పంజరాలు కన్పించటాన్ని, సతీ సహగమన సంప్రదాయానికి తొలి రూపం అయి ఉండవచ్చుననే నిర్వచనం మాత్రం విషయాన్ని చాలా దూరం తీసుకుపోవటమవుతుంది. బహుశా వారెపుడు మరణించి ఉంటే అప్పుడు పక్కపక్కనే సమాధి చేసి ఉంటారు.

మంచి శరీర సౌష్ఠవంగల కొందరు స్త్రీల విగ్రహాలు శిరస్సులు లేకుండా ఉండటం ఆసక్తికరమైన విషయం. ఇదే పద్ధతిలో కొన్నిచోట్ల స్త్రీల అస్తి పంజరాలు పాదాలు లేకుండా ఉంటాయి. పోతే, స్త్రీల బొమ్మలు తదనంతర కాలంలో కన్న ఈ కాలంలో ఎక్కువ కనిపించటాన్ని బట్టి సమాజంలో వారి పాత్ర ఎక్కువని, వారు తమ స్థానాన్ని చాటుకునే వారని భావించాలి.

మొహెంజొదారోలో కన్పించిన వాటిలో ఒక యువతి కాంస్యపు బొమ్మ ఒకటి ఉంది. పది సెంటిమీటర్ల ఎత్తుగల ఆ బొమ్మలో ఆ యువతి నృత్య భంగిమలో ఉంటుంది. సింధూ నాగరికత సమాజంలో స్త్రీలు తమను తాము చాటుకుని తమ స్థానాన్ని నిలబెట్టుకొనే వారేమోనన్న ఆలోచనను ఈ బొమ్మ బలపరుస్తుంది. ఆ యువతి పూర్తి నగ్నంగా ఉండటం విశేషం. దానితో మార్షల్ ఆమెది యవ్వనంలో ఉన్నవారు బిడియపడనపుడు

ఎట్లా వ్యవహరిస్తారో అటువంటి తీరని అభివర్ణించాడు. జాన్ కీ వర్ణన అయితే అద్భుతంగా సాగుతుంది. దానిని గమనించండి:

> ఒక మందపాటి కంఠహారం, గాజులను మినహాయిస్తే పూర్తి నగ్నంగా ఉన్న ఈ  బొమ్మ పెద్ద వక్షోజాలు, వెడల్పయిన కటిభాగంతో భారతదేశంలో సాధారణంగా కన్పించే శృంగార స్త్రీ చిహ్నం కాదు.  పల్చటి శరీరం గల ఆ సుందరి తన యవ్వనాన్ని ఎటువంటి సంకోచాలు లేక ప్రదర్శిస్తున్నది. యాదాలాప ధోరణిలో నిల్చుని ఉన్న తను ఒక చేయిని పక్కకు పైకెత్తి హస్తాన్ని నడుముపై ఆనించుకుంది. రెండవ చేతిని కిందికి జారవిడిచి, కొద్దిగా పైకి లేచి ఉన్న మోకాలును దానితో తాకుతుంటుంది. సన్నగా ఉన్న కాళ్లు రెండు కాస్త విడివిడిగా దూరం చేసి ఉంటాయి. రెండు పాదాలు కూడా ఇపుడా బొమ్మకు (ఎందువల్లనో గాని) లేవు. తల, తనను కోరుకుంటున్న వ్యక్తిని సవాలు చేస్తున్నట్లుగా కొద్దిగా వెనుకకు విసిరినట్లుంటుంది. కొప్పు ఒక పక్కకు ముడివేసి కన్పిస్తుంది. అందరూ తనను ప్రశంసించాలన్నది ఆ యువతి కోరిక అనటంలో సందేహం లేదు. తనను నాలుగు వేల సంవత్సరాల తర్వాత కూడా అందరూ నిజంగానే ప్రశంసిస్తున్నట్లు తెలిస్తే ఆ యువతి ఆనందిస్తుందని చెప్పాలి.

ఆ యువతి శరీరానికి ప్రొటో - ఆస్ట్రలాయిడ్ లక్షణాలున్నట్లు కొందరు భావించారు. సింధూ లోయలో లభించిన అస్థి పంజరాలకు కూడా అవే లక్షణాలుండటం గమనించదగ్గది.

## సింధూ నాగరికత మతమన్నది కేవలం కల్పనా?

ముద్రికలు, బొమ్మలు చిన్నవికాగా, పెద్ద పరిమాణంలోగల పురావస్తు అవశేషాలు కూడా అస్పష్టంగానే తోస్తాయి. ఉదాహరణకు మొహెంజోదారోలోని సుమారు నలభై అడుగుల పొడవు, ఇరవై అడుగుల వెడల్పు, ఎనిమిది అడుగుల లోతుగల జలాశయాన్ని గమనించండి. అది ఈత కొలను, లేదా స్నాన ఘట్టం లేదా మంచినీటి కొలను ఏదైనా కావచ్చు. అందులోకి దిగేందుకు ప్రతి చివరన మెట్లు, చుట్టూ స్తంభాల వరుసతో చిన్న చిన్న గదులున్నాయి. మతంతో సంబంధం గల స్నానాలు ఏవో జరిగే మహా స్నాన ఘట్టమని దాని గురించి కొందరు ఊహించారు. కాని, సింధూ నాగరికత ప్రజలు స్నానాలంటే ఇష్టపడే వారని దానిని బట్టి అనిపిస్తుంది. పరిశుభ్రంగా ఉండటం దైవత్వమనే సామెత నిజమే గాని రెండింటి మధ్య నిజంగా సంబంధం ఉందనలేము. కనుక ఆ కొలనుకు అప్పటి మతంతో నిమిత్తం ఉందని నిర్ధారణగా చెప్పలేము. అప్పటి నాగరికతలో భాగంగా మురుగునీటి పారుదల వ్యవస్థకు చాలా ప్రాముఖ్యత నిచ్చేవారు. అది కూడా పరిశుభ్రతలో భాగమే. అటువంటప్పుడు స్నానాలు మాత్రం మతంతో నిమిత్తం కలవి

ఎందుకు కావాలి? (ఆ భూగర్భ మురుగు పారుదల నిర్మాణాలను ఎవరైనా భూగర్భ పవిత్ర నిర్మాణాలని అనదలచుకుంటే అది వేరు.) అయితే ఇందుకు సమాధానాన్ని తేలికగా చెప్పవచ్చు. భారత ఉపఖండంలోని దేవాలయాలలో క్రీ.శ. తొలి శతాబ్దాల కాలం నుంచి ఇదే విధమైన పెద్ద పెద్ద కొలనులుండేవి. వాటిని పవిత్ర స్నానాలకోసం ఉపయోగించేవారు. నీటితో శుద్ధి అనేది హిందూ మతంలోని ఒక ముఖ్యమైన సంప్రదాయం. ఆ సంప్రదాయాన్ని దేవాలయాలలోని విశాలమైన కొలనులు ప్రతిఫలిస్తాయి. అప్పటి నుంచి నాలుగు వేల సంవత్సరాలు గడిచిన తర్వాత ఇప్పుడు ప్రతి ముఖ్యమైన దేవాలయంలో ఒక కొలను ఉంటుంది. అందువల్ల సింధూ నాగరిక కొలను కూడా మతంతో నిమిత్తం కలదేనన్నది వాదన. అదే విధంగా మొహెంజోదారో లోని పూజారుల గురుకులం వంటిది, అప్పుడు పూజారుల వ్యవస్థ విస్తృతంగా ఉండేదనే అభిప్రాయాన్ని కలిగించింది. పైన పేర్కొన్న నిర్మాణం పెద్దదన్నమాట నిజమేగాని అది ఒక వసతి గృహమో, హోటలో, ఆస్పత్రో లేక వ్యభిచార గృహమో ఎందుకు కాకూడదు?

ముద్రికలపైన, ఇతర వస్తువులపైన కనిపించే కళాకృతులను బట్టి అప్పటి కళాకారులు గొప్ప ఊహాశక్తి గలవారని చెప్పవచ్చు. అయితే అది పౌరాణిక సంబంధమైనది కావచ్చు. అందులో నిజంగా మత సంప్రదాయాలు లేకపోవచ్చు. అది కేవలం అలంకరణ కోసం ఉద్దేశించినవి కావచ్చు లేదా ఏవో కథనాలు లేదా సంకేతాలు అయినా కావచ్చు. కాని వాటిలో వ్యవస్థీకృతమైన మత చిహ్నాలు ఉన్నాయనగలమా? సింధూలోయ నగరాలలో మత సంబంధమైన భవనాలు లేదా స్మశాన వాటికలని స్పష్టంగా గుర్తించదగినవేమీ లేవు. పూర్వీకులతో నిమిత్తం గల సంప్రదాయక ఆచారాలు, భారీ విగ్రహాలు, ప్రత్యేకంగా అలంకరించిన నిర్మాణాలు కూడా తవ్వకాలలో బయల్పడలేదు. ఇటువంటి స్థితిలో విషయమేమిటన్నది స్పష్టమే. ఒకవేళ అప్పుడు దేవాలయాలన్నవి ఉండి ఉంటే వాటిని గుర్తించటం కష్టం. మతపరమైన ఆరాధనలకు నగరాలు కేంద్రమై ఉండకపోవచ్చు.

అయితే ఇందులో ఒక మెలిక ఉంది. మొహెంజోదారో వద్ద గొప్ప దేవాలయంగాని, ప్రార్థనా స్థలంగాని బయల్పడని మాట నిజమే అయినా, స్నాన ఘట్టానికి తూర్పున అటువంటి ప్రదేశం ఉండి ఉంటుందనే ఊహలున్నాయి. కాని, ఆ ప్రదేశంలో బౌద్ధ స్తూపం ఒకటి ఉన్న కారణంగా అక్కడ తవ్వకాలకు అనుమతి లభించటం లేదు. బౌద్ధ స్తూపం ఉందంటే దానికింద మరొక మతం ఉండి ఉంటుందని భావించవచ్చు కూడా. ఎందుకంటే హిందూ, ఇస్లాం వంటి ఇతర మతాలవలె బౌద్ధంలో కూడా వేరే మత నిర్మాణాలపై తమ స్వంత నిర్మాణాలు జరిపే సంప్రదాయం ఉంది. పోతే, సింధూ నాగరికతలో అన్నీ క్రమబద్ధంగా ఉన్న స్థితిలో అధికారంలో ఉన్నవారు మత విశ్వాసాలను క్రమబద్ధీకరించకుండా ఉంటారా అని ఎవరైనా వాదించచ్చు. కాని అప్పటి ప్రజల జీవితంలో

మతం పాత్ర ఏమై ఉంటుందనే ఊహాగానాలు కొన్ని శతాబ్దాల తర్వాత కాలపు హిందూ సంప్రదాయాల దృష్టితో చేయటమన్నది అసంబద్ధమైన విషయం.

సింధూ నాగరికత ముద్రికలపైన, టెర్రకొట బొమ్మల రూపంలో కన్పించే చిత్రాలు దైవ సంబంధమైనవని, ఆ కాలంలో ప్రకృతి ఆరాధన, భూత పూజ, సంతానోత్పత్తి సంబంధమైన ఆచారాలు, మాతృ దేవతారాధన వంటివి ప్రబలంగా సాగేవన్న నమ్మకం ఉంది. ఆ నాగరికతలో మత సంబంధమైన ఉన్నత వర్గాలు ఉండేవన్న భావన ఈ నమ్మకానికి దోహదం చేస్తున్నది. అయితే, మనకు తెలిసిన తరహా మతం ఏదీ అప్పుడు ఉండకపోవచ్చు కూడా. రాజ్య వ్యవస్థకు ఒక మతం ఉండటం, దానిని ఒక విశ్వాసంగా ప్రజలపై రుద్దటం అనే కోణం నుంచి అసలు మతమన్నదే లేదేమో. అదే నిజమైతే అది మొట్టమొదటి లౌకిక వ్యవస్థ అవుతుంది. అప్పటి ప్రజలు తర్వాత కాలపు యోగులకు తొలి రూపాలు కాకుండా, నాస్తికులకు తొలి రూపాలు అయి ఉంటారా? ఈ ఆలోచన ఎందుకంటే, అనంతర కాలపు హిందూ మతంలో మనకు చార్వాకులు, లోకాయతుల వంటివారు తారసపడతారు. మనం గతంలోకి తొంగిచూసి అప్పటి విషయాలకు మతపరమైన అర్థాలు చెప్పజూస్తే, అదే గతం నుంచి అందుకు వ్యతిరేకమైన అర్థాలు చెప్పగల అవకాశం కూడా ఉంటుందిమరి. సింధూ నాగరికత ముద్రికలపై గల భాషను గుర్తించలేకపోవటానికి అది అసలు భాషే కాకపోవటం కారణమన్న వాదన ఒకటుంది. అవి ఆయా వస్తువులు, సరకులు, ఆస్తుల యాజమాన్యాన్ని గుర్తించే చిహ్నాలని ఆ వాదన చెప్తుంది. అదే పద్ధతిలో, ఇతర చిహ్నాలు కూడా మత సంబంధమైనవి కావని, కేవలం కళాత్మకమైన సృష్టి అని మనం అనేందుకు అవకాశముంది.

### సింధూ నాగరికత పతనం

సింధూ నాగరికత ఏ విధంగా ముగిసిపోయిందో ఎవరికీ తెలియదు. అది ఒక వెలుగు వెలిగి దానంతట అదే పతనమై పోయి ఉండవచ్చు. లేదా అందుకు కరువు కాటకాలు కారణం అయి ఉండవచ్చు. సింధూ నదీ ప్రవాహపు గతి మారటం, లేక పెను భూకంపం వంటివి అందుకు దారితీసాయేమో తెలియదు. అడవులను పెద్ద ఎత్తున నరకటం వల్ల పర్యావరణం క్షీణించిందేమో. ఏవైనా వ్యాధుల వల్ల సామూహిక మరణాలు సంభవించి ఉండవచ్చు. లేదా ఇతరుల దండయాత్రలో వారు మారణ కాండకు గురి అయ్యారేమో. అస్తి పంజరాలు పడి ఉన్న తీరునుబట్టి కొందరు అటువంటి నిర్వచనాలు చెప్పారు. ఇవేవీగాక భారీ వరదలతో ఆ నాగరికత అంతమైందేమో. పైన పేర్కొన్న వాటిలో ఏది కారణమైనప్పటికీ, అంతిమంగా అదంతా వరదలు తెచ్చిన మట్టి పొరల కింద కప్పుకు పోయింది. నేల మట్టాలు పెరగగా, నీటి మట్టాలు పది మీటర్ల వరకు పైకి లేచాయి. ఆ విధంగా పూడుకుపోయిన నగరాలపై మళ్లీ జీవితం ఆరంభమైంది. కొత్త మనుషులు

పశువులను మేపారు. పంటలు సాగుచేశారు. ఊహాగానాలతో కథలు అల్లారు. ఒక మహా నాగరికత మాత్రం మరుగున పడిపోయింది. కాని నిజంగా మరుగున పడిందా?

సింధూ నాగరికతను వరదలే నాశనం చేసాయనుకుంటే, క్రీ.పూ. సుమారు 800 కాలం నాటి శతపథ బ్రాహ్మణంలో వర్ణించిన మహా వరదలకు ప్రేరణ అవే అయినా కావచ్చు. అవే వరదల ప్రస్తావనలు హిందూ పురాణాలలో నేటికీ కనిపిస్తాయి. సింధూ నాగరికతను విధ్వంసం చేసిన వరదలకు ఇవి ఆధారాలు కాకున్నా అందు గురించిన జ్ఞాపకాలే ఇవన్నీ అని అనటం వినేందుకు బాగానే ఉంటుంది. కాని ఆ పురాణ కథలలోని ఊహాగానాల ప్రేరణతోనే పరిశోధకులు వరదలంటూ సిద్ధాంతాలు రాస్తుండవచ్చు కూడా.

## కాలక్రమంలో వచ్చిన పరివర్తనలు

సింధూ నాగరికత గురించిన పరిశోధనలలో, గతాన్ని వర్తమాన దృష్టితో చూసి చేసే వాదనలు అనేకం ఉన్నాయి. ఆ విధంగావారు ఒంటికొమ్ము జంతువుకూ, ఒక రుషికి తల్లి అయిన దుప్పికి మధ్య, ముద్రికపైగల పశుపతికీ శివునికి మధ్య, వేర్వేరు స్త్రీల చిత్రాలకూ హిందూ దేవతలకు మధ్య, అప్పటి 'స్నాన ఘట్టం' అనుకునే దానికీ తర్వాత కాలపు హిందూ దేవాలయాలలోని తటాకాలకు మధ్య, బహుశా చదరంగం వంటి ఏదో క్రీడలో పాచికలవలె వాడి ఉండిన వస్తువులకూ శివలింగానికి మధ్య పోలికలు చూస్తున్నారు. ఒక దేవునికి మూలాలు ఎక్కడో శోధించాలనే తపన గలవారు శివుని ప్రస్తుత రూపానికి సింధూ నగారికత నాటి పశుపతి ముద్రికను మధ్య సంబంధాన్ని ఊహిస్తున్నారు. శివుని గురించి, దేవతా పూజల గురించి వేదాలలో ప్రస్తావన లేనందున ఆ మూలాలను వేదంతో నిమిత్తం లేని, లేదా వేదాలకన్న ముందటి ఆధారాలో అన్వేషించాలనే ప్రయత్నం కొందరిది. సింధూ నాగరికత నాటి పశుపతి ముద్రికపట్ల వారికి అమితాసక్తి ఏర్పడటానికి అది ఒక కారణం.

అనంతరకాలపు హిందూమతంలోని అంశాలను బట్టి సింధూ నాగరికతను విశ్లేషించ చూడటంలో తగినంత ఆకర్షణ ఉంది. అనంతరకాలపు హిందూ మతంలోని వివిధాంశాలను అర్థం చేసుకునేందుకు వీలుగా పలు గ్రంథాలున్నాయి. కాని సింధూ నాగరికత అంశాల గురించి గ్రంథాల మాట అట్లుంచి లిఖిత పూర్వకమైనవి ఏవీలేవు. అయినా పరిశోధకులు, పజిల్ పుస్తకాలను పిల్లలు చదివే పద్ధతిలో ఆ నాగరికతను అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. ఈ అడవి (సింధూ నాగరికత)లో ఎన్ని జింకలు (హిందూ మతం) దాగి ఉండవచ్చు? పద్ధతిలో నేను మాత్రం ఈ అధ్యాయంలో, ఈ రచన పొడవునా కూడా అటువంటి దృష్టితో విషయాలను చూడకుండా ఉండేందుకు జాగ్రతపడ్డాను. రావిచెట్లు, కొమ్ములు, వృషభాలు, లింగాలు, నిండైన వక్ష స్థలంగల స్త్రీలది అనంతరకాలపు హిందూమతంలో కూడా ముఖ్యమైన పాత్రే. అందుకు కారణం

ఈ రావిచెట్లు మొదలైనవాటికి సింధూ నాగరికత కాలంలో ఉండిన ప్రాముఖ్యతలో కొంత ఆ తర్వాత కూడా కొనసాగటం కావచ్చు. ఇవే చిహ్నాలు అనేక ఇతర నాగరికతలలో కూడా కన్పిస్తాయి. కాని అది యాదృచ్ఛికమై ఉంటుందనుకోవటం కన్న, సింధూ నాగరికత నుంచి హిందూ మతానికి ఒక కొనసాగింపుగా వచ్చి ఉంటాయనే వివరణ బలంగా తోస్తుంది. ఇతర నాగరికతలతో గాని, సింధూ నాగరికతతో గాని సంబంధం లేకుండా హిందూ మతంలో ఈ చిహ్నాలు స్వతంత్రంగా ఆవిర్భవించి ఉంటాయనే భావన కన్న కూడా, అవి సింధూ వారసత్వమన్న ఆలోచనలోనే కొందరిది తగినంత తర్కం కనిపిస్తుంది.

గతం గురించి ఆలోచించటం అవసరమే గాని, దానికి అనంతర కాలంతో సంబంధం ఉంటుందని ఖచ్చితంగా చెప్పలేము. ఒక అంశానికి వర్తమానంలో ఉండే అర్థం, గతంలో ఉండిన అర్థానికన్నా భిన్నమైనదికావచ్చు. కనుక ఇప్పటి దృష్టితో గతాన్ని చూడటం సరికాదు. ఓరియెంటలిస్ట్‌లు భారతదేశం, అక్కడి సంస్కృతీ సమాజాలు నిరంతరమైనవి, అవిచ్ఛిన్న ప్రవాహం వంటివని భావిస్తారు. బ్రాహ్మణులు రచించిన గ్రంథాలు అప్పటి సమాజాన్ని వర్ణించాయని అభిప్రాయపడతారు. కాని అది నిజం కాదు. అదే విధంగా వలస పాలనా కాలంలో, వర్తమానంలో మనం చూసే గ్రామీణ, కుల వ్యవస్థలను బట్టి ఒకప్పటి చరిత్రను కూడా అర్థం చేసుకోవచ్చుననేది మరొక పొరపాటు అభిప్రాయం.

గతకాలపు లక్షణాలు కొన్ని తదనంతర కాలంలో కన్పించినపుడు వాటిని ఉపేక్షించకుండా, ప్రస్తుత అర్థాన్ని గతానికి యథాతథంగా ఆపాదించకుండా, గత కాలంలో అందుకు అర్థాలు ఏమై ఉంటాయో పరిశోధించాలి. వాటికి అనంతర కాలపు నాగరికతలతో, శిల్పాలతో, కళలతో నిజంగా నిమిత్తం ఏమైనా ఉందేమో జాగ్రత్తగా విశ్లేషించాలి.

విశేషమేమంటే సింధూ నాగరికతలోని కొన్ని అంశాలకు తదనంతర కాలపు హిందూమతంతో బలమైన పోలికలున్నాయి. హరప్పా సంస్కృతి చివరి దశ క్షీణించిన తర్వాత అప్పటి మనుషులు కొందరు ఆ సంస్కృతిని గంగా-యమునా పరీవాహక ప్రాంతంలోకి తమతోపాటు తీసుకువెళ్లి ఉంటారు. క్రీ.పూ. మూడవ సహస్రాబ్ది కాలం నాటి సమాజాల పురావస్తు అవశేషాలలో రాతితో, కంచుతో చేసిన వస్తువులున్నాయి. వారు అవిమాత్రమే ఉపయోగించేవారు. తర్వాత సుమారు రెండువేల సంవత్సరాలకు గంగానదీ మైదాన ప్రాంత ప్రజలు, దక్షిణ దేశ వాసులు ఇనుమును ఉపయోగించటం మొదలు పెట్టారు. కాని ఈ చివరి రెండు సమాజాల అవశేషాలకు మొదటి సమాజపు అవశేషాలతో సంబంధాలు కనిపిస్తాయి. క్రీ.పూ. 1500 నుంచి 1000 ప్రాంతంలో నగరీకరణ క్రమం సింధూ లోయ ప్రాంతం నుంచి గంగా మైదానంలోని ఆధునిక అలహాబాద్‌కు సమీపాన గల కౌశాంబికి, ఆ పరిసర గ్రామాలకు విస్తరించింది. కాని

నిర్ణీత ప్రమాణంగల ఇటుకలు, ప్రణాళికాబద్ధమైన కొలతలతో నిర్మించిన నగర విభాగాలు, ముద్రికలు, మురికినీటి పారుదల వ్యవస్థల వంటివి కౌశాంబి ప్రాంతంలో కన్పించవు. అదే విధంగా, పరిపాలనా నిర్వహణలోని మెలకువలు హరప్పా అనంతర సమాజాలలో లేకుండాపోయాయి. భారతదేశం వంటి విస్తారమైన సమాజాన్ని ఏ విధంగా పరిపాలించాలో కొన్ని శతాబ్దాల పాటు ఎవరికీ బోధపడినట్లులేదు. కాని సింధూలోయ నాగరికత లక్షణాలు కొన్నింటిని కొందరు దక్షిణ, తూర్పు ప్రాంతాలవైపు వ్యాపింపజేశారు. సింధూలోయ నగరాలు విధ్వంసమైన తర్వాత చాలా కాలానికి కూడా ఆ లక్షణాలు మనకు ఈ కొత్త ప్రాంతాలలో కనిపిస్తాయి. సింధూ సంస్కృతి ఆ ప్రాంతానికే పరిమితమై వెలిగి ఆరిపోలేదు. ఒక జ్యోతి మరికొన్ని జ్యోతులను వెలిగించిన విధంగా వ్యాపించి ముగిసింది.

ఈ కొనసాగింపు వివిధాంశాలలో కనిపిస్తుంది. రావి ఆకులు, చెట్టు ఒక అలంకరణ చిత్రంగా తదనంతర మతాలలో దర్శనమిస్తాయి. సింధూ నాగరికతలోని శంఖువులు నేడు కూడా హిందూ మతంలో కన్పిస్తాయి. వస్తువులేగాక కళా రీతులలోనూ పోలికలున్నాయి. ఉదాహరణకు జంతువుల బొమ్మలు అప్పుడు, ఆ తర్వాత కూడా బలంగా, పుష్టిగా, అందమైన శైలిలో ఉంటాయి. అశోక స్తంభాలపై కన్పించే అశ్వ చిత్రాలు అందుకొక ఉదాహరణ. ఈ వివిధ చిహ్నాలతో పాటు రాతి లింగాలు, నిండైన విగ్రహాలుగల స్త్రీల వంటి రూపాలు కూడా క్రమంగా వేదకాలపు సమాజ సంస్కృతిలో భాగమై ఉంటాయి.

## అధ్యాయం 4

# సింధూలోయ నాగరికత

## క్రీపూ. 2,000 నుంచి 1,500 వరకు

### కాల క్రమణిక (అన్ని సంవత్సరాలూ క్రీపూ. కాలానివి)

| | | |
|---|---|---|
| సుమారు 4,000 –3000 | : | ఇండో–యూరోపియన్ భాష భిన్న భాషలుగా వేరుపడటం |
| సుమారు 2100–2000 | : | తేలికపాటి చక్రపుటాకుల రథాల తయారీ |
| సుమారు 2000–1500 | : | సింధూ నాగరికత క్షీణత |
| సుమారు 1900 | : | సరస్వతీ నది ఎండిపోవటం |
| సుమారు 1700–1500 | : | పంజాబ్ ప్రాంతంలోని సంచార సామాజికుల రుగ్వేద రచన. వాయవ్య భారతానికి అశ్వాల రాక |
| సుమారు 1350 | : | హిట్టైట్ శిలాఫలకాల్లో అశ్వాలు, దేవతల ప్రస్తావన |
| సుమారు 900 | : | వేదకాలపు మనుషులు గంగాలోయ ప్రాంతానికి తరలి వెళ్లటం |

### విష్ణువు, బ్రహ్మల పరస్పర సృష్టి

*ముల్లోకాలలో చీకటి అలముకుని ఉన్నప్పుడు శ్రీ మహావిష్ణువు సముద్ర మధ్యంలో శయనించి ఉన్నాడు. తన నాభినుంచి ఒక కమలం ఉద్భవించింది. అప్పుడు బ్రహ్మ తన వద్దకు వచ్చి, నువ్వెవరివో తెలియజేయ మన్నాడు. అందుకు విష్ణువు, "నేను విష్ణువును. ఈ విశ్వానికి సృష్టికర్తను. నీతో సహా సకల లోకాలు నాలోనే నిక్షిప్తమై ఉన్నాయి. నువ్వెవరు?" అన్నాడు. దానికి సమాధానంగా బ్రహ్మ, "నేనే సృష్టికర్తను. స్వయంభువును. సర్వస్వం నాలోనే ఉంది" అని చెప్పాడు. అప్పుడు విష్ణువు బ్రహ్మ శరీరంలోకి ప్రవేశించి, ముల్లోకాలూ ఆయన ఉదరంలో ఉన్నట్లు గమనించాడు. అందుకు విస్మయం చెందిన విష్ణువు, బ్రహ్మనోటినుంచి వెలుపలికి వచ్చి, "నా వలెనే నీవు కూడా నా ఉదరంలోకి ప్రవేశించి లోకాలన్నింటిని చూడవచ్చు" నన్నాడు. అదే ప్రకారం చేసిన బ్రహ్మలోకాలన్నింటిని చూశాడు. కాని అప్పుడు విష్ణువు అన్ని మార్గాలను మూసివేయటంతో విష్ణువు బొడ్డులోంచి బయటకు వచ్చిన బ్రహ్మ, తామరపూవుపై ఆసీనుడయ్యాడు.*

– కూర్మ పురాణం (క్రీ.శ. 500–800)

## సమస్య: మాటలులేని వస్తువులు, వస్తువులు లేని మాటలు

క్రీ.పూ. సుమారు 1500తో ఆరంభించి రుగ్వేదం, ఇతర వేదాలను రచించిన వారికి, సింధూలోయ ప్రాంతంలో నివసించిన ప్రజలకు మధ్య సంబంధం ఏమిటి? ఆ నాగరికత ముగిసిన వెనుక సింధూ ప్రజలు ఎక్కడ నివసించారు? విష్ణు, బ్రహ్మల కథ మనకు హిందూమతంలోని వైదిక పార్శ్వానికి, వైదికేతర పార్శ్వానికి మధ్య గల సంబంధానికి ఒక ఉపమానంగా పనిచేస్తుంది. చంద్రునిలో మనిషి, కుందేలు అన్నది ద్వంద్వ స్థితి, ఒక స్త్రీ శరీరానికి మరొక స్త్రీ తల అన్నది పరస్పర విలీనత కాగా, బ్రహ్మ, విష్ణువులది కూడా కలయికేగాని ఇరువురిలో ఎవరిదీ ప్రాథమ్యం కాదు.

హిందూమతంలో మొదటి నుంచి కూడా వైదిక పార్శ్వంతో పాటు వైదికేతర పార్శ్వం కూడా ఒకటుంది. అది తర్వాత కాలంలో సంస్కృత పరిష్వంగం నుంచి బయటపడే వరకు దాని గురించి మనకు తెలియదు. హిందువుల చరిత్ర సంస్కృత గ్రంథాల ద్వారా తెలుస్తుంది. కాని రుగ్వేదంతో ఆరంభించి ఆ గ్రంథాలలో వైదికేతరమైన అంశాలు కూడా ఉన్నాయి.

క్రీ.పూ. 2000–1500 ప్రాంతంలో వాయవ్య భారతదేశంలోని సింధూ నాగరికత క్షీణిస్తుండగా, వైదిక సంస్కృతి రూపుదిద్దుకోసాగింది. ఒక విధంగా ఈ రెండూ కూడా హిందూ మతానికి పూర్వ దశలు అనవచ్చు. సింధూ నాగరికత కాలం నుంచి లభించిన వస్తువులు, అంశాలు అప్పటి ప్రజల గురించి మనకు సమాచారాన్ని తెలియజెప్తాయిగాని, అప్పటి నగరాలు నశించిపోయిన తర్వాత వారు ఎక్కడకు వెళ్లి ఉంటారనే సూచనలు వాటిలో లేవు. అప్పటి మాటలు, లేదా రచనలు అనదగ్గవి ఏవైనా ఉండి ఉంటే అవి మిగిలిలేవు. వేదకాలానిది ఇందుకు విరుద్ధమైన స్థితి. అప్పటి రచనలున్నాయి. ఆ కాలపు వస్తు సంభారాల గురించిన ప్రస్తావనలున్నాయి. కాని, కొద్దిపాటి పాత్రలు, పూజా వేదికల వంటివి మినహా ఆయా వస్తు సంభారాల ఆధారాలు మాత్రం లేవు. వారి నిత్య జీవిత మేమిటో, వారు ఎక్కడి నుంచి వచ్చారో తెలియదు. అదట్లుంచి, ఆ ప్రజల గురించి చెప్పుకునే ముందు వారి భాష గురించి, రుగ్వేదం చెప్పినవారి పూర్వ చరిత్ర గురించి మాట్లాడుకోవాలి.

## ఇండో - యూరోప్

పంతొమ్మిదవ శతాబ్దానికి చెందిన జర్మన్, బ్రిటిష్ భాషా శాస్త్రవేత్తలు అంతకు ముందు రెండు శతాబ్దాల కాలపు ఆధారాలు కొన్నింటిని బట్టి, వేదకాలపు సంస్కృతం అతి ప్రాచీన భాషా కుటుంబాలలో ఒకటని చెప్పజూసారు. అప్పటి గ్రీకు, లాటిన్, హిట్టైట్, సెల్టిక్, నార్స్–జర్మనిక్‌తోపాటు ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, స్పానిష్, ఇంగ్లీష్ వంటివన్నీ అదే కుటుంబంలో భాగమన్నారు. క్రీ.పూ. నాల్గవ సహస్రాబ్దిలో ఒకే ప్రాంతంలో

ఇండో–యూరోపియన్ భాష ఒకటి ఉండేదని, తర్వాత కాలంలో దానినుంచి ఈ భాషలన్ని ఉద్భవించాయని వారి అభిప్రాయం. అప్పుడు లేఖనం ఉండేది కాదుకాని, క్రీ.పూ. 14వ శతాబ్దికి చెందిన అనటోలియన్ మౌఖిక ప్రవచనం ఒక దానిలో ఇంద్ర, మిత్ర, వరుణ, అశ్వినుల వంటి వైదిక దేవతల ప్రస్తావన ఉంది. ఈ వేర్వేరు భాషలలో ఒకే మాటకు గల శబ్ద సామ్యాలను భాషా శాస్త్రజ్ఞులు గుర్తించారు.

ఇండియా నుంచి ఐర్లాండ్ వరకు గల ప్రజలు ఇండో–యూరోపియన్ భాషలలోని ఏదో ఒక రూపాన్ని ఉపయోగించటాన్ని మనం ఏ విధంగా అర్థం చేసుకోవాలి? ఈ భాషలన్నింటికి మాతృక ఒకటేనన్నది శాస్త్రవేత్తల నిశ్చితాభిప్రాయం. అది చైనీస్, సెమిటిక్‌తోపాటు ద్రవిడ భాషా కుటుంబానికి భిన్నమైంది. భారతదేశంలో 76 శాతం మంది ఇండో – యూరోపియన్ భాషలను, 22 శాతం మంది ద్రవిడ భాషలను, 2 శాతం మంది ఆస్ట్రో– ఆసియాటిక్, టిబెటో – జర్మన్, గిరిజన భాషలను మాట్లాడతారు.

ఇండో–యూరోపియన్ అన్నది భాషా కుటుంబమే గాని, ఇండో–యూరోపియన్లు అనే మనుషులులేరు. ఆ భాషలు మాట్లాడేవారున్నారు. కనుక వారిని ఇండో–యూరోపియన్లని పిలిచారు. పైగా భాషా సామ్యతలతోపాటు కొన్ని ఇతర అంశాల ఆధారంగా ఇండో–యూరోపియన్ సంస్కృతి అనదగినది కూడా నిపుణులు గుర్తించారు. ఉదాహరణకు ఆయా భాషలలోని పుక్కిటిపురాణాలనదగ్గ కథలలో సామ్యాలున్నాయి. వీరందరికి పశు గణాల కోసం దాడులు, పశువుల వ్యాపారం వంటి సంప్రదాయాలుండేవి.

## వేదకాలపు మనుషుల తొలి నివాసమెక్కడ?

వేదకాలపు మనుషులు వేదాల రచనకు ముందు ఎక్కడ నివసించేవారో మనకు స్పష్టంగా తెలియదు. కాని నాలుగు విధాలైన ఊహాగానాలున్నాయి. వాటిలో ఆర్యులు ఇండో–యూరోప్ నుంచి దండయాత్రగా వచ్చారన్నది ఒకటి, కాకసస్ ప్రాంతం నుంచి కాకేషియన్లు తరలివచ్చారన్నది రెండు, ఇండియాకే చెందినవారన్నది మూడు కాగా, సింధూలోయ వారన్నది నాల్గవ ఊహాగానం. వీటినిపుడు కొంత వివరంగా చూద్దాం.

మొదటి ఊహ ప్రకారం నీలిరంగు జుట్టుగల ఉత్తర ప్రాంతాల వారు రథాలపై దండయాత్రగా వచ్చి ఇండియాలోని నలుపు దేహాల వారిని ఓడించారు. బాలగంగాధర తిలక్ 1903లో ద ఆర్కిటిక్ హోం ఇన్ వేదాస్ అనే రచనలో, ఆర్యులు వేదాలను ఉత్తర ధృవ ప్రాంతంలో రచించారని, అక్కడి నుంచి దక్షిణానికి వస్తూ మార్గమధ్యంలో రెండుగా చీలి కొందరు యూరప్‌కు, కొందరు ఇండియాకు వెళ్లారని రాసాడు. వేదకాలపు మనుషుల దండయాత్ర భావన ఇప్పటికీ ఉంది. ఆగ్నేయ రష్యాలోని కాకసస్ ప్రాంతంలో గల ఉరల్ పర్వత శ్రేణుల దక్షిణ భాగం నుంచి, బహుశా నల్ల సముద్రపు ఉత్తర తీరాన, లేదా సీ ఆఫ్ అజోల్ ప్రాంతం నుంచి ఇండో–యూరోపియన్ భాషలు ఇతర చోట్లకు విస్తరించి

ఉంటాయన్నది అంచనా. బహుశా ఇండో–యూరోపియన్లు గుర్రాలను అక్కడ మచ్చిక చేసి ఉంటారు. హిందూమత చరిత్రలో గుర్రాలకు ప్రముఖస్థానం ఉండటం తెలిసిందే. ఈ కారణాలవల్ల ఇండో–యూరోపియన్లను కాకేషియన్లని కూడా వ్యవహరిస్తున్నారు. వారి మాతృ భూమి అయిన ఈ ప్రాంతానికి ఇటీవల ఒకరు యూరోస్థాన్ అని పేరు పెట్టారు. లేదా దీనినే ఇండో–యూరోప్ అని కూడా అనవచ్చు.

వీరిలో కొందరు కాస్పియన్ సముద్రపు తూర్పు దిశనుంచి అఫ్ఘానిస్థాన్ మీదుగా, క్రీ.పూ. రెండవ సహస్రాబ్ది మధ్యకాలానికి ముందే పంజాబ్ ప్రాంతానికి చేరి ఉంటారన్నది ఊహ. వేర్వేరు ప్రజలు ఒకే కుటుంబంలోని వేర్వేరు భాషలు మాట్లాడేవారంటే అర్థం వారంతా ఒకే జాతి అని కాదు. నిజానికి ఇందులో భ్రాతృత్వం తప్ప జాతి దృష్టిలేదు. కాని తర్వాత ఓరియెంటలిస్టులు దీనికి జాతిరంగు ఇవ్వబూనారు.

వేదాలను కూర్చినవారు పురావస్తు అవశేషాలేవీ మిగల్చనందున, అదే సమయంలో వేదాలను కూర్చింది వారేనని మనకు నిర్ధారణగా తెలుసుగనుక, వేదాల రచయితలను, వారి సమాజాన్ని మనమిక్కడ వైదిక ప్రజలని అందాము. పోతే ఇండో–యూరోపియన్ల దాడి సిద్ధాంతానికి పొడిగింపుగా, సింధూ నాగరికతా నగరాల విధ్వంసానికి కారణం వారేనన్న సిద్ధాంతం కూడా ముందుకు వచ్చింది. దాడి అంటే జయించటమని అయినప్పుడు, ఇండియాలో వారు జయించింది ఎవరిని? సింధూ నగరాల చుట్టూ రక్షణగా భారీ కుడ్యాలుండేవి. వేదాలలో ఆటవికుల కోట గోడల కూల్చివేత ప్రస్తావనలను బయటివారి దాడి సిద్ధాంతకర్తలు ఈ సందర్భంగా ఉదహరిస్తుంటారు. సింధూలోయలో సామూహిక మరణాలు, అస్థిపంజరాలు, రుగ్వేదంలో దస్యులు నల్లని దేహచ్ఛాయ కలవారనే ప్రస్తావనను కూడా వారు పేర్కొంటారు. వాస్తవానికి ఆ పదం శరీరపు రంగు కన్న ఎక్కువగా దుర్మార్గ లక్షణాల గురించి ప్రస్తావిస్తుంటుంది. వేదంలోని ఒక మంత్రం సింధూ ప్రజలను చట్టి ముక్కులు గలవారిగా వర్ణించాన్ని కూడా ఈ వాదనలో భాగంలో పేర్కొంటున్నారు. మొత్తంమీద ఈ వివిధాంశాలన్నింటిని ఒక చోట చేర్చి చూసినప్పుడు మనకు ఒక వైపున శ్వేతవర్ణంలో వైదిక ప్రజలు, మరొకవైపు సింధూ నాగరికతకు చెందిన నల్లని శరీరవర్ణం గలవారు కన్పిస్తారు. శ్వేత వర్ణీయులు సింధూ ప్రజలను మారణకాండకు గురి చేయటం కన్పిస్తుంది.

కాని ఈ సిద్ధాంతకర్తలు చెప్పే విధంగా ఈ రెండింటికి మధ్య సంబంధం ఉందనటానికి కారణం కన్పించదు. వైదిక ప్రజలకు, సింధూ ప్రజలకు వేరే శత్రువులు కూడా ఉన్నారు. అదే విధంగా సింధూ నగరాలను ఎవరో విధ్వంసం చేశారనేందుకు ఎటువంటి ఆధారం కన్పించదు. ఈ మొదటి ఊహాగానంలో ఉన్నట్లుగా బయటివారు ఒక భారీ పటాలం వలె దాడికి రావటంగాక, చిన్న చిన్న బృందాలుగా తరలి

వచ్చారనేందుకు అవకాశం ఉంది. ఈ విధంగా మొదటి సిద్ధాంతానికి సవాళ్లు ఎదురు కావటంతో ఇతర సిద్ధాంతాలు ముందుకొచ్చాయి.

రెండవ ఊహను అనుసరించి, ఒకానొకప్పుడు ఉత్తర ప్రాంతాల కాకేషియన్ ప్రజలు తమ కుటుంబాలు, వ్యవసాయ పద్ధతులతోపాటు భారతదేశానికి వచ్చి, అక్కడ అప్పటికే నివసిస్తుండిన ప్రజలతో కలిసిపోయి స్థిరపడ్డారు. వీరు దాడిచేయటంగాక, వలస రావటంతో పాటు తమ ఇండో–యూరోపియన్ భాషను కూడా తీసుకువచ్చారు. ఈ సిద్ధాంత కర్తలు కూడా భాషా సామ్యాలను, అంత్య క్రియల పద్ధతులను, మట్టి పాత్రలు మొదలైనవాటిని పురావస్తు ఆధారాలుగా చూపుతారు.

మూడవ ఊహాగానం ప్రకారం ఇండో–యూరోపియన్ ప్రజలు అనాదిగా పంజాబ్ ప్రాంతంలో నివసిస్తున్నారు. వారు ఋగ్వేదాన్ని కూర్చింది అక్కడనే మరొక సిద్ధాంతాన్ని బట్టి ఇండో–యూరోపియన్లు పంజాబ్ ప్రాంతం నుంచి ఇరాన్ వెళ్లి అవేస్తా కావ్యాన్ని రచించి, అనటోలియా తరలిపోయి హిట్టైట్ లిపిని, గ్రీస్, ఇటలీలలో స్థానిక భాషల నుంచి గ్రీస్, ఇటాలియన్ భాషలను అభివృద్ధి పరచారు. చివరకు బ్రిటన్ వెళ్లారు. ఇదే విధమైన మరొక సిద్ధాంతం ప్రపంచంలోని భాషలన్నీ సంస్కృతం నుంచి ఆవిష్కారమై నవేనని వాదిస్తుంది. అనగా ఎవరో బయటినుంచి వస్తూ నాగరికతలను, భాషా సాహిత్యాలను తీసుకు వచ్చారనే జాత్యహంకార సిద్ధాంతీకరణకు ఇది ఎదురు సిద్ధాంతమన్నమాట. ఇది ఒక విధంగా సరైనదే. ఎందుకంటే సింధూ ప్రజలు నగరాలను నిర్మించి, వేదాలను రచిస్తున్న కాలంలో బ్రిటన్ వాసులు ఇంకా ఆటవికులే. ఒక సిద్ధాంతంగా ఇందులో తార్కికత ఉంది. కాని భాషాపరమైన, పురావస్తు పరమైన ఆధారాలను పరిశీలించినపుడు, ఆర్యుల దండయాత్ర అన్నది ఎంత ఊహాగానమో సింధూ ప్రజలు బయటకు వెళ్లారనటం కూడా అంతే ఊహాగానమైనట్లు తేలుతుంది.

సింధూ నాగరికత ప్రజలు వేదాలను ఎప్పుడో ప్రాచీన కాలంలో రచించారన్నది నాల్గవ ఊహాగానం. దానిని బట్టి హరప్పా, మొహెంజోదారో నగరవాసులు అందరూ గాని, తగినంతమందిగాని ఇండో–యూరోపియన్ భాష మాట్లాడేవారన్నమాట. నగరాలను నిర్మించిన వారే వేద రచన కూడా చేశారు. సింధూ నాగరికతా క్షేత్రంలోనే వైదిక యుగం కూడా ఆవిర్భవించింది. ఈ సిద్ధాంతాన్ని బలపరచేందుకు కొన్ని ఆధారాలున్నాయి. రెండు నాగరికతల కాలాలకు మధ్య ఒక కొనసాగింపు ఉండటం, రెండింటి భూభాగాలు ఒక మేరకు ఒకటే కావటమన్నవి ఆ ఆధారాలలో కొన్ని. అవిగాక రెండింటి సంస్కృతుల మధ్య కొన్ని పోలికలున్నాయి. దీనికి కొన్ని తేడాలతో మరొక సిద్ధాంతం కూడా ఉంది గాని అందులో కూడా ప్రధానాంశం బయటివారు వలసరావటం. వారు వచ్చే సమయానికి సింధూ ప్రాంతంలో ద్రవిడులున్నారని ఈ సిద్ధాంతం చెప్తుంది. సింధూ నాగరికతలో అనంతర కాలపు హిందూ మతానికి బీజాలున్నాయని, ఋగ్వేదంలో గల మతం అదేనని

కూడా ఈ సిద్ధాంత కర్తలంటారు. సరస్వతీ నదీ తీరాన సింధూ వాసుల నివాసాలుండటం, రుగ్వేదంలో ఆ నది ప్రస్తావన కారణంగా దానిని కొన్నిసార్లు సరస్వతీ నాగరికత లేదా సింధూ–సరస్వతీ నాగరికత అని కూడా పిలుస్తారు. అయితే ఇరువురి మధ్య ఒకమేరకు సాంస్కృతిక ఆదాన ప్రదానాలు ఉండేవని మనం అంగీకరించినా, సింధూ నగర నిర్మాతలు, వేద రచయితలు ఒకరే కాగల అవకాశం లేదు. ఈ నాల్గవ ఊహను కొట్టివేసే ఆధారాలు చాలా బలమైనవి. సింధూ నాగరికత అవశేషాలను రుగ్వేద అంశాలతో పోల్చి చెప్పటం కష్టమైన విషయం. సింధూ నాగరికతకు చెందిన ప్రదేశాలు, వస్తువుల ప్రస్తావన ఏదీ రుగ్వేదంలో కన్పించదు. వేదంలో గల ప్రస్తావనలేవీ ఆ నాగరికతకు సరిపోలవు.

వ్యవసాయ సంబంధితమైన నాగళ్లు, పొలం చాళ్లు, ధాన్యం నూర్పిడి స్థలం, బియ్యం వంటి అనేక పదాలు రుగ్వేదంలోకి స్థానిక భాషలనుంచి రావటం గమనించదగ్గది. దానినిబట్టి వైదిక ప్రజల రాకకు ముందే అక్కడగల ప్రజల నుంచి వారు వ్యవసాయం నేర్చుకున్నారనుకోవాలి. వైదిక కాలంలోనూ ఆ ప్రాంతంలో పలు భాషలు ఉపయోగంలో ఉండేవి. కాని వైదిక ప్రజలు భవన నిర్మాణ శాస్త్రం, ఇటుకలు, సున్నం, లేఖనం వంటివి ఎట్లా మరిచి పోగలిగారు? అందుకు సమాధానం చాలా తేలిక. వారికవి అసలెప్పుడూ లేవు. అందువల్ల సింధూ ప్రజలు రుగ్వేద రచయితలు కావటం దాదాపు అసాధ్యమనాలి. ఈ వాదనను తోసిపుచ్చే చివరి ఆధారం జంతువులు, ముఖ్యంగా గుర్రాలు.

## జంతువులు

ఒకోసారి జంతువులు బలమైన ఆధారాలవుతాయి. వాటిని బట్టి చూసినపుడు సింధూ నాగరికత, వేదనాగరికత పూర్తిగా భిన్నమైనవని అర్థమవుతుంది. దాని అర్థం తర్వాత కాలంలో ఆ రెండింటి మధ్య పరస్పర సంబంధాలు ఏర్పడలేదని కాదు. రుగ్వేదంలో చీమలు, జింకలు, అడవి పందులు, నక్కలు, సింహాలు, కోతులు, కుందేళ్లు, ఎలుకలు మొదలైన పలు జంతువులు, కీటకాల ప్రస్తావన ఉంది. ఇక సింధూ నాగరికతను గమనిస్తే అందులో సింహాలు అనదగ్గవి స్పష్టంగా లేవు. సింహమో, పులో సరిగా తెలియని ఒక బొమ్మ మాత్రం ఉంది. వేద ప్రజలకు ఏనుగు గురించి తెలుసుగాని దానినొక వింతగా పరిగణించారు. తొండాన్ని చేయిగా భావిస్తూ 'మృగహస్తి' అనే కొత్త పదం ఒకటి తయారు చేసారు దానికోసం. హరప్పా ముద్రికల పై కన్పించే పెద్ద పులులు, ఖడ్గ మృగాల మాట వేద ప్రజల వద్ద లేనేలేదు. ఒంటి కొమ్ము జంతువుల ప్రస్తావన కూడా కన్పించదు. దీనిని బట్టి వేద ప్రజలు మొదట సింధూ లోయకు ఉత్తర ప్రాంతాలలో నివసించే వారనే అభిప్రాయం కలుగుతుంది.

సింధూ నాగరికతలో, వేద నాగరికతలో కూడా జంతువులకు కేంద్ర స్థానం ఉంది. సింధూ ప్రజలకు వృషభం, వేద ప్రజలకు గోవు ప్రధానమైనవి. గుర్రాల గురించి

సింధూ ప్రజలకు తెలియకపోగా వైదిక ప్రజలకు అవి బాగా తెలియటమే గాక ఆ కాలంలో అవి మాట్లాడేవి కూడా. రెండు తలల అశ్వినీ దేవతలు ఇందుకు ఉదాహరణ. ఈ రెండు సంస్కృతులలో గుర్రాలు ఉండేవా అన్నది మనం మొదట చూసి, వాటిలో ఆ జంతువుల ప్రాముఖ్యత ఏమిటో తర్వాత ఆలోచించాలి.

ఇండో-యూరోపియన్ భాషలు మాట్లాడే సంస్కృతులు ఉన్న చోటనల్లా గుర్రాల ఉనికి కనిపిస్తుంది. దీని అర్థం గుర్రాల ప్రస్తావన లేని ఇండో-యూరోపియన్ నాగరికతలు లేనే లేవని కాదు. అదే విధంగా గుర్రాలు ఉన్న ప్రాంతాలవారంతా ఇండో-యూరోపియన్ భాషలు మాట్లాడతారని కూడా కాదు. కాని గుర్రాలకు కేంద్రస్థానం గల చైనా, ఈజిప్టువంటి ప్రాచీన సంస్కృతులలో ఇండో-యూరోపియన్ సంస్కృతి కూడా ఒక భాగంగా ఉండేది. గుర్రానికి పూర్వావతారం అనదగ్గ డాన్ హార్స్ లేదా ఇయోహిపస్ నాలుగు నుంచి ఆరు కోట్ల సంవత్సరాల క్రితం యూరప్‌లో, ఉత్తర అమెరికాలో అంతటా ఉండేది. అది ఇప్పటి గుర్రం కన్న చాలా చిన్నది. దానిని అనేక చోట్ల మచ్చిక చేశారు. మధ్య ఆసియాలో కూడా అంతే.

ఈ ఆధారాలను బట్టి ఇండో- యూరోపియన్ ప్రజలు భారతదేశానికి కాలి నడకన గాక గుర్రాలపై వచ్చి ఉండాలి. ఈ మాట అనేందుకు పురావస్తు ఆధారాలు కూడా ఉన్నాయి. భారత ఉప ఖండంలో తగినన్ని గుర్రాల ఉనికి సింధూ నాగరికత క్షీణించిన తర్వాత క్రీ.పూ. రెండవ సహస్రాబ్ది కాలంలోనే కనిపిస్తుంది. వీటి వ్యాప్తి నర్మద, మహారాష్ట్రల వరకు ఉండేది. సింధూ నాగరికతలో అతి స్వల్పంగా తప్ప ఇదేమీ లేకపోవటాన్ని బట్టి ఆ ప్రజలు ఇండో-యూరోపియన్లు కారని చెప్పాలి. అక్కడొక గుర్రం ఇక్కడొకటి ఉన్నా అవి మధ్య ఆసియా లేదా పశ్చిమాసియా నుంచి గతి తప్పి ఇటు వచ్చినవై ఉండాలి. లేదా దిగుమతి చేసుకున్నవి కావచ్చు.

గుర్రాలవలెనే మాట్లాడే గుర్రాలు కూడా ఇండో-యురోపియన్లవే. గుర్రాలకు, వాటిపై సవారీ చేసేవారికి మధ్య సాన్నిహిత్యం గురించిన కథలు మధ్య ఆసియాకు చెందిన టర్కిష్ జాతులవారిలోనూ ఉన్నాయి. ఋగ్వేదంలో గుర్రాల గురించిన వర్ణనలు చాలా కనిపిస్తాయి. ఆ ప్రజలకు గుర్రాలపై చాలా మోజుండేది. మొత్తంమీద ఈ రెండు నాగరికతల భిన్నత్వానికి గుర్రాలు ఒక కీలకమైన అంశమవుతున్నాయి.

## ప్రత్యామ్నాయ సమాధానం

సింధూ నాగరికత, వేదాలు రెండూ ఆ ఇద్దరు ప్రజల ఉమ్మడి సృష్టి కాగల అవకాశం లేదు. కాని అనంతర కాలపు హిందూ మతం వారి ఉమ్మడి సృష్టి అయి ఉంటుంది. ఆ మతంలో వారిద్దరి భాషలు, సంస్కృతులు, వేద పద సముదాయం, సింధూ చిత్రాలు, వాటితో పాటు ఇతర సంస్కృతులకు చెందిన అంశాలు అనంతర కాలపు హిందూ

మతంలో కన్పిస్తాయి. కొన్ని ప్రాంతాలలో ఇవి దేనికది ప్రత్యేకంగా, కొన్ని ప్రాంతాలలో పరస్పరం కలగలసి ఉన్నాయి. వేద ప్రజల రాకకుముందే భారతదేశంలో ఉండిన ఆలోచనలు, వారి రాక తర్వాత కూడా వైదిక ప్రపంచానికి వెలుపల ఉండినవి కాలక్రమంలో వైదిక సాహిత్యంలోకి, అనంతర కాలపు సంస్కృత సాహిత్యంలోకి ప్రవేశించి ఉంటాయి. అట్లా ప్రవేశించినవాటిలో సింధూ నాగరికతకు చెందినవేగాక భారతదేశపు ఆదివాసీలవి, ముండా భాషలు, ద్రవిడభాషల వారివి ఉన్నాయి. ఈ ప్రభావం రుగ్వేదం పై కూడా కనిపిస్తుంది. హరప్పా వాసులు కొందరు దక్షిణ దేశానికి వలసపోగా, అక్కడి హిందూ మతంపై కూడా ఆ నాగరికత ప్రభావం చూపి ఉంటుంది.

ఈ విధంగా వేర్వేరు ప్రజలు, ప్రాంతాలు, నాగరికతల కలయికకు ఇటుకల ఉపయోగం ఒక మంచి ఉదాహరణ. రుగ్వేదాన్ని కూర్చిన వారికి ఇటుకల గురించి తెలియదు. వారి క్రతువులకు అవసరమైంది చిన్న చిన్న మట్టి వేదికలే గాని, ఇటుకలతో నిర్మించిన పెద్దవి కాదు. తర్వాత క్రీ.పూ. 600 ప్రాంతంలో వారు గంగా పరీవాహక ప్రాంతాలకు తరలి వెళ్లినపుడు అటువంటి పెద్ద వేదికలను నిర్మించసాగారు.

భారతదేశంలో తమ తొలిదశ జీవితం గురించి వేదకాలపు ప్రజలు చాలానే చెప్పగా, దానిని వారి వారసులు చివరి కాలం వరకు మౌఖిక సంప్రదాయంగా కొనసాగించారు. కాని మహా భారత కాలం నుంచి మొదలుకొని హిందువులు రాసిన దానిలో గాని, మాట్లాడినదానిలో చేసినదానిలోగాని వేదాలనుంచి వచ్చింది తక్కువ. గ్రంథరచనలకు, సంప్రదాయాలకు పరస్పర సంబంధం ఉండటం, ఇది శతాబ్దాల పాటు కొనసాగటం, వెనుతిరిగి చూస్తే ఇది వేదకాలం వరకూ కన్పించటం వల్ల పరిశోధకులు, వేదాలే అన్నింటికి మూలమని, కాలక్రమంలో ఇతర అంశాలు వాటికి వచ్చి చేరాయని భావించారు. మౌఖిక కావ్య సంప్రదాయాన్ని అనుసరించటం వరకు ఇది నిజం. కాని ఆయా రచనలలోని ఆలోచనల విషయంలో పరిస్థితి అదికాదు. అప్పటికే ఉండిన సింధూలోయ నాగరికత, బహుశా ఇతర నాగరికతల ప్రపంచంలోకి వేదాలు కొత్తగా ప్రవేశించాయి.

హిందూ మతంలోకి వైదికేతర ప్రపంచంనుంచి కొత్త ఆలోచనలు, కథనాలు, సంప్రదాయాలు ప్రవేశించాయి. సంస్కృత సాహిత్యంలో కూడా ఇంతే జరిగింది. విశేషమేమంటే ఈ బయటి సంప్రదాయాలు వైదిక ప్రపంచం నుంచి సంస్కృత సాహిత్యం నుంచి పదే పదే బయటకు వెళ్లి ప్రాంతీయ సంప్రదాయాలలో పునరుజ్జీవనం పొందిన ఉదాహరణలు అనేకం ఉన్నాయి. వైదికేతర సంస్కృతిలో అనేక పాయలున్నాయి. వాటిలో కనీసం అయిదింటిని గుర్తించవచ్చు. అవి, (1) భారత దేశంలో సింధూ నాగరికత కన్న ముందు కాలపు శిలాయుగపు సంస్కృతులు, (2) ఆదివాసీ సంస్కృతులు. ఇవి సింధూ నాగరికత కన్న ముందు నుంచి ఉన్నాయి. అవి బహుశా ఆ నాగరికతలో భాగం అయినా కావచ్చు. వాటిలో అనేకం హిందూ మతంలో ఎప్పుడూ విలీనం కాలేదు. (3) సింధూ

నాగరికత, (4) సింధూ నాగరికత కన్నా ముందు, సమకాలీనంలో, అనంతర కాలంలో ఉండిన జనపద సంప్రదాయాలు, (5) వైదిక సంస్కృతి, (6) తమిళ, ఇతర ద్రవిడ భాషలవారి సంస్కృతులు. ఈ చివరి వర్గానికి చెందినవారు సింధూ నాగరికతలో భాగం అయి ఉండవచ్చు, కాకపోవచ్చు కూడా.

ఇతర సంస్కృతులవలె హిందూ మతం కూడా మౌలికంగా ఒక శల్యంవంటిదే. వాటివలెనే ఇది కూడా ఇతర సంస్కృతులనుంచి భిన్నాంశాలను స్వీకరిస్తూ రూపుదిద్దుకున్నది. ఇది ఆలోచనలకు, వస్తుపరమైన అంశాలకు కూడా వర్తిస్తుంది. ఇందులో కాపీరైట్ అనదగ్గది లేదు.

విష్ణువు, బ్రహ్మ ఇరువురూ 'నీవు నాలో ఉన్నా' వని ఒకరితో ఒకరన్నట్లు, హిందూ మతంలోని వైదిక, వైదికేతర పార్శ్వాల మధ్య పరస్పర సంబంధాలున్నాయి. ఈ సంబంధాలకు కూర్మ పురాణ కథ ఒక మంచి ఉపమానం. విష్ణువు, బ్రహ్మలిద్దరు చెప్పిందీ నిజమే. వారు ఒకరి ఉదరంలో ఒకరు సర్వలోకాలను సందర్శించారు. ఇరువురూ తామే సృష్టికర్తలమన్నారు. అదే సమయంలో ఇరువురిలోనూ అవతలి సృష్టికర్త కూడా ఉన్నాడు. ఆ కథ రెండు విలయాలకు మధ్య కాలానికి సంబంధించింది. సృష్టి విలయమన్నవి ఒక దానివెంట ఒకటిగా సాగుతూనే ఉంటాయి. వైదిక, వైదికేతర సంస్కృతుల మధ్య కూడా ఇదే విధంగా సృష్టి, విలయాలను హిందూ మత చరిత్ర పొడవునా చూడవచ్చు. అందులోని ఉద్రిక్తలకు, ఘర్షణాత్మక స్థితులకు, అసాధారణమైన వైవిధ్యతలకు కారణం కూడా ఇదే.

## అధ్యాయం 5

# రుగ్వేదంలోని మనుషులు, జంతువులు, దేవతలు

## క్రీపూ. 1500 నుంచి 1000 వరకు

**కాల క్రమణిక (అన్ని సంవత్సరాలూ క్రీపూ. కాలానివి)**

| | | |
|---|---|---|
| సుమారు 1700 –1500 | : | పంజాబ్ ప్రాంతపు సంచార సమాజాల ద్వారా రుగ్వేద రచన |
| సుమారు 1200–900 | : | వేద ప్రజల ద్వారా యజుర్, సామ, అథర్వవేద రచన |

### భిన్న వ్యాపకాలు

మా ఆలోచనలు మమ్ములను భిన్నమైన వ్యాపకాలవైపు నడుపుతాయి, మనుషులను విభజిస్తాయి,
వడ్రంగి విరిగిన సామాగ్రి కోసం వెతుకుతాడు,
వైద్యుడు చిట్లిన ఎముక కోసం,
బ్రాహ్మణ పూజారికి సోమరసం సిద్ధం చేసే మనిషి కావాలి.

నేను కవిని, నాతండ్రి వైద్యుడు
నా తల్లి విసుర్రాళ్లతో పని చేస్తుంది.
భిన్నమైన ఆలోచనలతో మేమంతా సంపదలను అన్వేషిస్తాము,
అందుకోసం పశువులవలె శ్రమిస్తాము.

రుగ్వేదం (9.112) (క్రీ.పూ. 1500 ప్రాంతం)

ఈ అధ్యాయంలో మనం పంజాబ్‌లో క్రీ.పూ. 1500 ప్రాంతంలో నివసించి వేదాలను కూర్పు చేసిన ప్రజల గురించి చూద్దాము. అందులో భాగంగా వేదకాలంలో పశువులను, అశ్వాలను బలివ్వటంలోని హింస, సామాజిక హింసకు అదొక వ్యక్తీకరణ కావటం, ఆ హింసను సమర్ధించటం, బలుల కోసం ఇతరుల పశువులను, గుర్రాలను దొంగిలించటం వంటి చర్యలను మనం గమనించవచ్చు. తర్వాత బ్రాహ్మణులు, క్షత్రియుల మధ్యగల ఉద్రిక్తతలను, దస్యుల ప్రత్యేక స్థితిని చూడవచ్చు. వీరుగాక ఇతర నిమ్న జాతులవారున్నారు. చివరగా స్త్రీల పరిస్థితిని పరిశీలించవలసి ఉంటుంది. సోమరసపానం

ఉన్నత శ్రేణి దేవతలకు, బ్రాహ్మణులకు విలాసం అయినప్పటికీ, మరొకవైపు అతి సురాపానంగా మారిన వారిపట్ల చిన్నచూపు ఉండేది.

వేదకాలపు అసంఖ్యాక దేవతలనూ, ఈ సృష్టి ఏ విధంగా సాగిందన్న ప్రశ్నపై ఇదమిత్థత అంటూ లేక సాగిన ఆలోచనలను మనం ప్రస్తుత అధ్యాయంలో చూస్తాము. బ్రాహ్మణులకు, క్షత్రియులకు గల దైవాంశలు, బ్రాహ్మణుల దేవత అయిన అగ్ని, రాజ వంశీకుల దేవతలైన వరుణుడు, ఇంద్రుడి ప్రస్తావనలు ఇందులో వస్తాయి. చివరగా మరణాలు, పునర్జన్మల చర్చతో ఈ అధ్యాయం ముగుస్తుంది. ఈ అంశాలకు సంబంధించి కూడా మనకు ఒకవైపు రకరకాల ఊహాగానాలు కనిపిస్తాయి. ఇవే అంశాలపై తర్వాతి శతాబ్దాలలో హిందువులలో ఆందోళనలు, ఉద్రిక్తతలు ఏర్పడటాన్ని మనం గమనించవచ్చు.

## మౌఖిక సంప్రదాయంగా కొనసాగిన రుగ్వేదం

రుగ్వేదాన్ని కూర్పు చేసిన వారు పంజాబ్‌లోని సప్త సింధూ ప్రాంతంలో నివసించేవారు. సింధూనది, దాని అయిదు ఉపనదులు, సరస్వతి కలిసి సప్తసింధు అయ్యాయి. పైన చెప్పినట్లు వారి నగర నిర్మాణ అవశేషాలు ఏవీలేవు. మట్టితో నిర్మించిన చిన్న వేదికలు తప్ప ఇటుకల ఉపయోగం కన్పించదు. చివరకు సున్నం అనే మాటను కూడా వారు అంతకుముందు నుంచే అక్కడ గల ప్రజలనుంచి అరువు తెచ్చుకోవలసి వచ్చింది. వారి నివాసాలు కలప, ఆకులతో నిర్మించుకున్నవై ఉండాలి. పురావస్తు అవశేషాలలో ఇవి కూడా లేనందున ఇది ఊహాగానం మాత్రమే.

ఆ ప్రజలు సంస్కృతపు ప్రాచీన రూపంలో కవితలు లేదా మంత్రాలు రాసారు. అటువంటి సంకలనాలలో అన్నింటికన్నా మొదటిది రుగ్వేదం. అందులో అప్పటి సామాజిక, వస్తుపరమైన ప్రపంచం ఎటువంటిదో ప్రతిఫలిస్తుంది. రుగ్వేదంలో 1,028 మంత్రాలున్నాయి. వాటిని పది మండలాలుగా విభజించారు. సామవేదం, యజుర్వేదం, అథర్వణవేదం పేరిట మరొక మూడు వేదాల రచన కూడా అపుడు జరిగింది. వీటిలో సామవేదం ఆలాపనలకు, యజుర్వేదం యజ్ఞయాగాదులకు, అథర్వణవేదం ప్రాపంచిక విషయాలకు సంబంధించినటువంటివి. భారతదేశానికి లిపి, లేఖనా సంప్రదాయం ఏర్పడిన తర్వాత కూడా కొన్నివందల ఏళ్లపాటు రుగ్వేదం మౌఖిక సంప్రదాయంగానే కొనసాగింది. దానికి లిఖిత రూపం ఇచ్చేందుకు అప్పటివారు నిరాకరించారు. మంత్రాలను కంఠోపాఠం చేసిన పూజారులు అన్ని విధాలైన క్రతువులను సామవేదమంత్రాల పఠనం ద్వారానే జరిపేవారు. వేదాలను లిఖిత పాఠం నుంచి చదివేవారు నరకానికి పోతారన్నది మహాభారతం. అనగా అప్పటికి లిఖిత రూపాలు వాడకంలోకి వచ్చినట్లు భావించాలి. వేదాలను నాస్తికులు, పారియాలు, స్త్రీలు అభ్యసించరాదని నిషేధించారు. అవి శక్తివంతమైనవి అయినందున అనర్హుల పాలు కారాదన్నారు. గురువు వద్ద వేదాలను

అభ్యసించే శిష్యులు సైతం మాంసాహారం స్వీకరించిన తర్వాత, రక్తాన్ని లేదా శవాన్ని చూసిన మీదట, సంభోగానంతరం లేదా ఏదైనా లేఖనా కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నప్పుడు వేదాలను పఠించరాదని ప్రకటించారు.

ఆ విధమైన నియమాలతో వేదాలను కంఠోపాఠం చేస్తూ తండ్రి నుంచి కుమారునికి, శాఖల మధ్య, గోత్రాలమధ్య, కుటుంబాల మధ్య ఒక పరంపరగా కొనసాగించారు. అందుకే వాటిని శృతులని కూడా అన్నారు. అనగా పఠించగా ఇతరులు వినేవి అన్నమాట. తొలిదశలో ఇది పురుషులైన బ్రాహ్మణులకు పరిమితమై ఉండేది. తర్వాత కాలంలో బహుశా ఇతర వర్గాలవారు కూడా వేదాలను బోధించి ఉంటారు. మంత్ర రచన చేసిన వారిలో మొదటినుంచి స్త్రీలతో సహా భిన్నతరగతులవారు ఉండి ఉండవచ్చు కూడా. కొన్నింటిని స్త్రీలు రచించినవిగా పేర్కొనటం కనిపిస్తుంది.

వేదాలు మౌఖిక సంప్రదాయం కావటం వల్ల క్రమంగా అందులో పొరపాట్లు దొర్లవచ్చుననే అభిప్రాయం కలుగుతుంది గాని అది సరికాదు. వేదాలు భగవంతుడు బోధించినవి, అపౌరుషేయాలు, పవిత్రమైనవి అయినందున వాటి పఠనంలో చిన్నపాటి పొరపాటు కూడా దొర్లేందుకు అవకాశమిచ్చేవారు కాదు. తరచు పలువురు కలిసి ఉచ్ఛ స్వరంతో వేదపఠనం చేయటం వల్ల ఎవరూ ఎక్కడా పొరపాట్లు ఉచ్ఛరించే అవకాశం ఉండేది కాదు.

భారతదేశంలో వేర్వేరు భాషలు మాట్లాడేవారు కూడా, అప్పటి అధికార భాష అయిన సంస్కృతాన్ని నేర్చుకునేవారు. అదే సమయంలో ద్రవిడ భాషా పదాలు, ఆస్ట్రో–ఆసియాటిక్ కుటుంబానికి చెందిన ముండా భాషల పదాలు సంస్కృతంలో ప్రవేశించసాగాయి. అశ్వమేధయాగ సంప్రదాయంలో గుర్రానికి నాలుగు వేర్వేరు పదాలు వాడటాన్ని బట్టి ఆ సంప్రదాయం బహు భాషా స్థితిని గుర్తించిందనాలి.

వేద మంత్రాలకు శక్తి ఉందని, అది వాస్తవ స్థితిగతులపై ప్రభావాన్ని చూపుతుందని అప్పటివారు విశ్వసించేవారు. ఆ విధంగా మంత్రాలు భిన్న సందర్భాలకు సంబంధించి కనిపిస్తాయి. రాజులు పట్టాభిషేకాలు, వివాహాలు, అంత్యక్రియలు, శిశువుకు దంతాల పుట్టుక, రోగ చికిత్స వంటి పలు సందర్భాలలో అందుకు తగిన మంత్ర పఠనం ఉంటుంది. ఈ క్రతువులలో జంతుబలులకు కూడా అవకాశం ఉంది.

## మూడు విధాలైన సంబంధాలు

హిందూ మత చరిత్రలో మనుషులకు, దేవతలకు మధ్య మూడు విధాలైన సంబంధాలు అప్పటి మనుషుల వైఖరిలో ప్రతిఫలించేవి. అవే వైఖరులు మనకు వేర్వేరు శతాబ్దాల కాలంలో కనిపిస్తాయి. వాటిలో మొదటిదానిని వైదిక సంబంధమనవచ్చు. అందులో సురులు, అసురులకు మధ్య వైరం ఉంటుంది. సురులు తమతోపాటు ఆకాశంలో నివసించే అసురులకు, భూమిపై నివసించే అసురులకు (రాక్షసులు) వ్యతిరేకంగా

మానవులతో సఖ్యత చేస్తారు. వాస్తవానికి అసురులు దేవతలకు అన్నలవుతారు. వేదాలలో ఇప్పటికీ అగ్ని, వరుణుడి వంటి వైదిక దేవతలను అసురులనే వ్యవహరించటాన్ని చూడవచ్చు. నైతికతలు అటు ఇటు మారుతుంటాయి. సురులలో, అసురులలో కూడా సన్మార్గులు, దుర్మార్గులు ఉంటారు. అసురులకన్న సురులే ఎక్కువ అసత్యాలు చెప్పినట్లు కనిపిస్తుంది. నైతికతన్నది ఎవరికీ ప్రత్యేకం కానందున, ఎవరి శక్తియుక్తులను వారు ప్రయోగిస్తుంటారు. మానవులు ఇచ్చే బలుల కోసం ఇరువురి మధ్య పోటీ ఉంటుంది. అయితే మనుషులు బలులు ఇవ్వటం దేవతల కోసం అయినందున, అసురులను వ్యతిరేకిస్తారు. ప్రతి ఉదంతంలోనూ అంతిమంగా అసురులు ఓడిపోతారు. కనుక మనుషులు దేవతల పక్షం తీసుకుంటారు.

వైదిక దేవతలు మితాహారులు. వారు యజ్ఞకుండంలో వేసే వెన్నను, బలి పశువులను మాత్రమే ఆహారంగా స్వీకరించటం, సోమరసాన్ని సేవించటం చేస్తారు. అటువంటి నైవేద్యాలలో అసురులకు భాగం ఉండదు గనుక వారు యాగాలను భంగపరచేందుకు ప్రయత్నిస్తారు. అందువల్ల దేవతలకు ఆహారం లభించక వారు బలహీనపడతారు. అపుడు వారిని జయించటం అసురులకు తేలికవుతుంది. సురాసుర యుద్ధంతో నిజానికి మనుషులకు సంబంధంలేదు. కాని వారి నైవేద్యంపై, బలులపై ఆహారం కోసం ఆధారపడే దేవతలు అందుకు బదులుగా మనుషులను రాక్షసుల నుంచి కాపాడుతారు. వారట్లా కాపాడటానికి బదులుగా మనుషులు బలుల రూపంలో దేవతలకు ఆహారం సమకూర్చుతారు. ఉపనిషత్తుల కాలానికి కూడా సురాసురుల బలాబాలు సమానమైనవే. వేదాలతో ఆరంభించి హిందూమత చరిత్ర పొడవునా అసురులు, రాక్షసులు తరచుగా సమాజంలోని నిమ్నవర్గాలకు ఉపమానాలుగా కన్పిస్తుంటారు. మొదటవారు వైదిక సమాజానికి శత్రువులు. తర్వాత, దేవతలకు బలులు ఇవ్వదగిన వారిగా బ్రాహ్మణులు గుర్తించిన వర్గాలనుంచి ఈ నిమ్నవర్గాలను వెలివేశారు. సురులకు, మనుషులకు మధ్యగల ఈ మొదటి తరహా సంబంధం భారతదేశపు చరిత్రలో నేటికీ కనిపిస్తుంది. కనీసం ఒక మేరకు. మరొక రెండు విధాలైన సంబంధాలు ఈ మొదట సంబంధాన్ని కొంత పరిమితం చేశాయి.

రెండవ సంబంధం మహా భారత కాలంతో ఆరంభమై పురాణ కాలం వరకు కొనసాగింది. వేదకాలంలో అసురులకు వ్యతిరేకంగా దేవతలు, మనుషులు ఒక కూటమిగా ఏర్పడగా ఆ పరిస్థితి ఈ రెండవ సంబంధంలో మారింది. యజ్ఞాలు, బలుల వల్ల లభించే శక్తి ఈ సరికి ఒక మేరకు తపస్సు, ధ్యానంవల్ల లభించటం ఇందుకు కారణం. యాగాలుచేసి బలులు ఇచ్చేందుకు అర్హతలేని అసురులు, రాక్షసులు ఇపుడా పని చేసి స్వయంగా శక్తి సంపాదిస్తారు. ఆ శక్తితో దేవతలను భయపెడతారు. మనుషులలోనూ కొందరు అదే విధంగా శక్తిని సాధించి తాము కూడా దేవతలను భయపెడతారు. అట్లా భయపెట్టేంత భక్తి, తపశ్శక్తిని సాధించిన అసురులను, మనుషులను కూడా అదుపు

చేయటం దేవతలకు అవసరమవుతుంది. ఇటువంటి మనుషులు సాధారణంగా బ్రాహ్మణేతరులు. మనుషుల సంప్రదాయిక తరహా యాగాలు తమను మించిపోగలవన్న అసూయ, జంకు దేవతలలో ఏర్పడుతుంది. ఉదాహరణకు నూరు అశ్వమేధ యాగాలు చేసిన ఇంద్రుడు, అంతుకు మించి చేయగలరనుకునే వారి అశ్వాలను దొంగిలిస్తుంటాడు. సగర చక్రవర్తి ఉదంతం ఇందుకొక ఉదాహరణ. అనగా, మనుషులకు గుణగణాలు ఎక్కువ కావడమంటే దేవతలను బెదిరించడమన్న మాట. అపుడు దేవతలు వారికి హాని చేయజూస్తారు. రెండవ సబంధపు స్వభావమిది. ఇక మూడవ తరహా సంబంధంలో పరిస్థితి మళ్లీ మారింది. ఇపుడు కీలక పాత్ర భక్తిది. దేవతలపై మనుషులు ఆధారపడటమనే వైదిక దృక్పథం ఇందులో మరొక రూపానికి మారింది. ఇపుడు దేవతలు తమ భక్తులను వారు మనుషులైనా, అసురులైనా, రాక్షసులైనా సరే కాపాడుతారు. భారతదేశంలోని స్థానిక గుడులను ఆలవాలం చేసుకుని ప్రస్తుతం వ్యాప్తిలో గల కథలు చాలా వరకు ఈ మూడవ సంబంధాన్ని ఆధారం చేసుకుని చెప్పేవే.

## పశుగణాలు, అశ్వాలు

వేదకాలపు ప్రజలు బలుల తర్వాత దేవతలను సర్వసాధారణంగా ఆరోగ్యం, జీవితం, పోరాటాలలో విజయం, సంపదలను కోరుకునేవారు. సంపదలన్నవి ప్రధానంగా అశ్వాలు, గోవుల రూపంలో ఉండేవి. వారు సంచార జాతుల వారైనందున తమ పశుగణాలకు పచ్చిక మైదానాలు అవసరమయాయి. మొదట పశుపాలకులుగా ఉండినవారు తర్వాత వ్యవసాయదారులు కూడా అయ్యారు. తమ సంపదలను పశుగణాల పరిమాణాన్ని బట్టి లెక్కవేసేవారు. దేవతలకు ఆ పశువుల బలి, వాటి మాంసాన్ని ఆహారంగా స్వీకరించటం ఒక సంప్రదాయంగా ఉండేది. ఇంద్రుడు ఇరవై ఎద్దులు లేదా వంద దున్నపోతులు, గేదెలను తిని చెరువుల కొద్దీ సోమరసాన్ని తాగేవాడు. ఆవులను మాత్రం పాలకోసం ఉంచేవాడు. ఒక మంత్రం గోవులను వధించరాదని పేర్కొనగా మరొక మంత్రం వివాహ సందర్భాలలో వధించవచ్చునని అనుమతించింది. ఇతర మంత్రాలలో మరికొంత వైవిధ్యత కనిపిస్తుంది. కొందరు ఏ విధంగా గోవులవధను నిలిపివేసి వాటి పాలను మాత్రమే తాగేవారో చెప్పే కథ ఒక దాని ప్రస్తావన పృథు అనే రాజును ఉదాహరిస్తూ ఋగ్వేదంలో ఉంది. ఆ కథ తర్వాతి గ్రంథాలలో వివరంగా ఉంది.

## భూమి నుంచి పాలు పిండిన పృథువు

వేనుడనే రాజు చాలా దుర్మార్గుడు కావటంతో మునులు అతనిని సంహరించారు. ఆ రాజుకు వారసులు లేనందున వారతని కుడి తొడను చీల్చగా దాని నుంచి కురూపి అయిన ఒక పొట్టి మనిషి వెలికివచ్చాడు. తను నల్లగా ఉండి, తర్వాత కాలపు నిషాదులకు, ఆటవికులకు పూర్వీకుడయ్యాడు. తర్వాత ఆ మునులు

వేనరాజు కుడి చేతిని చీల్చగా దాని నుంచి పృథువు జన్మించాడు. తర్వాత భూమి తన ఆహారాన్నంతా ఉపసంహరించు కుంటుండటంతో కరువు ఏర్పడింది. అపుడు పృథువు తన విల్లమ్ములను తీసుకుని, తన ప్రజలకు ఆహారమివ్వవలసిందిగా వత్తిడి చేసేందుకు భూమిని వెంటాడాడు. అపుడు భూమి గోరూపం తీసుకుని ప్రాణభిక్ష కోరుతుంది. ప్రజలకు అవసరమైన పాలను తన నుంచి పిండుకునేందుకు అంగీకరిస్తుంది. ఆ విధంగా లోకంలో సన్మార్గులైన చంద్రవంశ రాజులు పృథువు వారసులుగా పాలిస్తారు.

తాము పృథువు వారసులమని చెప్పుకునే రాజులకు ఆధారభూతమైన ఈ కథ మనకు వేల సంవత్సరాలుగా పలు రూపాలలో కనిపిస్తుంది. మనుషులు జంతువుల వేట నుంచి వాటి పరిరక్షణకు, పెంపకానికి, వాటి ద్వారా పాడికి వ్యవసాయకులుగా, పశు గణాల పెంపకందారులుగా పరివర్తన చెందటానికి ఈ కథ ప్రాతినిథ్యం వహిస్తుంది. భూమి అనే గోవు నుంచి వారు పాలనేగాక అవసరమైనవి ఏవైనా సరే పిండుకునేవారు. అది కామధేనువు. ఆ విధంగా అప్పటి వైదిక ప్రపంచపు ఆర్థిక, సంప్రదాయక, సంకేత ప్రాయమైన ప్రంపచానికంతా గోవు కేంద్ర బిందువుగా ఉండేదని భావించాలి.

ఇందుకు భిన్నంగా గుర్రాలు యుద్ధ రథాలకు పూన్చేందుకు, విశాలమైన మైదానాలలో పశుపాలనకు ఉపయోగపడేవి. వాటిని యాగాలలో బలివ్వటం మినహా ఆహారం కోసం ఉపయోగించేవారు కాదు. గుర్రాల మేతకోసం వేదకాలపు మనుషులు తరుచు కొత్త గడ్డి భూములను వెతుకుతూ పోయేవారు. ఇతర పశువులకు భిన్నంగా గుర్రాలు గడ్డిని వేళ్లతో సహా పీకి వేసి మొదలంటా తింటాయి. అక్కడ గడ్డి తిరిగి మొలిచేందుకు కొన్నేళ్లు అవసరం. కనుక వారు కొత్త చోట్లకు తరలిపోవటం, కొత్త భూములు ఆక్రమించుకోవటం జరిగేది. గుర్రాలను యాగాలలో బలి ఇచ్చినపుడు ఇతర పశువులకువలె వాటిని నరికి చంపటంగాక ఊపిరాడకుండా చేసేవారు. ఆ తర్వాతనే శరీరాన్ని ఖండాలుగా నరికి కొన్ని భాగాలను అగ్నికి ఆహుతిచ్చేవారు. వాటి మాంసాన్ని ఆహారంగా తీసుకునేవారుకాదు. ఈ దృష్టిని బట్టి అప్పటివారికి గుర్రాలతో గల అనుంధం, వాటిపట్ల గల 'అహింసా' భావన ఎటువంటివో గ్రహించవచ్చు.

## వేదకాలపు ప్రజలు

ఈ అధ్యాయపు ఆరంభంలో ఉదహరించిన మంత్రంలో కనిపించిన విధంగా, రుగ్వేదం మనకు అప్పటి కుటుంబ జీవితం, దైనందిన కార్యకలాపాలు, వృత్తులు, పూజా సామాగ్రి వైవిధ్యత గురించి అనేక విషయాలు తెలియజేస్తుంది. వేర్వేరు వృత్తులు ఒక కులవ్యవస్థగా రూపొందటం అప్పటికింకా జరగలేదు. ఒకే కుటుంబంలోని సభ్యులు

భిన్నమైన పనులు చేయటం అందుకు రుజువు. రుగ్వేదంలో వడ్రంగి, కంసాలి, కుమ్మరి, చర్మకారులు, చాపల అల్లికలవారు, నేతగాళ్ల వంటి వృత్తుల ప్రస్తావన ఉంది. వేదకాలం ముగిసేసరికి మాత్రం వర్ణ వ్యవస్థ రూపు దిద్దుకుంది.

వైదిక ప్రజలు మొదట రెండే వర్ణాలను గుర్తించారు. ఒకటి, ఆర్యులైన తాము, రెండు, తాము జయించిన దస్యులు. వారిని దాసులు, పాణీలని కూడా అన్నారు. దస్యులన్నవారు తొలుతగా వలసవచ్చిన వైదిక ప్రజలలో ఇంకా మిగిలి ఉన్నవారు కావచ్చు. లేదా సంస్కృతేతర భాషలవారు లేదా వైదిక ప్రజలకన్న భిన్నమైన మతంగల ఇండో–ఇరానియన్లు అయి ఉండవచ్చు. ఇండో – ఇరానియన్ గ్రంథమైన అవేస్తాలో 'వేరే మనుషులు' అని చెప్పటానికి దహ, దహ్యు అనే పదాలున్నాయి. వేదాలలోని తొలి భాగాలు దస్యులు సంపదల (పశుగణాలు) పట్ల అసూయను వ్యక్తపరుస్తాయి. కాని తర్వాతి కాలంలో బానిసలు లేదా తమ కుటుంబాలకు బయటపనిచేసేవారికి దాస పదాన్ని వర్తింపజేసారు. వేదాల తదనంతర భాగాలలో 'దాసీ పుత్రు' లైన బ్రాహ్మణుల ప్రస్తావన కనిపిస్తుంది. అనగా వర్ణాంతర వివాహాలు కాకపోయినా శృంగార సంబంధాలు ఉండటమే గాక, వాటిని ఆమోదించారు కూడా నన్నమాట. వేద ప్రజలు తమ రాకకు ముందునుంచే భారతదేశంలో నివసిస్తుండిన వారి (దస్యులు) నుంచి వస్తుపరమైన సంస్కృతిని తగినంత స్వీకరించినట్లు పైన చెప్పుకున్నాము. అథర్వణ వేదంలో ప్రస్తావనలు గల కొన్ని పూజా పద్ధతులు, సంప్రదాయాలు దస్యులనుంచి, ఆటవికులైన నిషాదుల నుంచి వచ్చి ఉంటాయి.

ఆర్యులు, దస్యుల కన్న ముఖ్యమైన సామాజిక విభజన నాలుగు విధాలుగా ఉండేది. రుగ్వేదంలోని పురుష సూక్తంలోగల ఒక మంత్రం పురుషుని విభజన గురించి చెప్తుంది. యాగాన్ని నిర్వహిస్తున్న దేవతలు పురుషుడిని బలి పశువుగా బంధించారని అందులో ఉంది. ఆ విధంగా బలి ఇచ్చిన పురుషుని వేర్వేరు శరీర భాగాలనుంచి నాలుగు సామాజిక వర్ణాలు (చాతుర్వర్ణ వ్యవస్థ) రూపొందాయి. నోటినుంచి బ్రాహ్మణులు, బాహువుల నుంచి క్షత్రియులు, తొడల నుంచి రైతులు, వైశ్యులు వంటి సామాన్యులు, పాదాల నుంచి శూద్రులు వెలువడ్డారు. వాస్తవానికి తొలుత వైశ్యులు అనే మూడవ వర్ణంలోనే వైదిక సమాజంలోని తక్కిన అందరూ కలిసి ఉండేవారు. కాని తర్వాత శూద్రులంటూ నాల్గవ వర్ణాన్ని చేర్చారు. శూద్రులనే వారు తొలి దశ వైదిక వ్యవస్థకు, అందులోని మూడు వర్ణాలకు బయటివారు అయి ఉండాలి. వారిని అప్పటికే భారతదేశంలో నివసిస్తుండిన వారుగా భావించవచ్చునేమో. మలి దశ వేద వ్యవస్థ ఏర్పడే సరికి వారు శూద్రుల పేరిట నాల్గవ వర్ణంగా మారి ఉంటారు. లేదా ఏ వ్యవస్థలోనైనా దానికి వెలుపల ఉండేవారు కొందరు ఎప్పుడూ ఉంటారు గనుక అటువంటి వర్గం శూద్రులుగా గుర్తింపు పొంది

ఉండవచ్చు. కాని అంతిమార్థంలో వ్యవస్థ చాతుర్వర్ణాల పద్ధతిలో కాకుండా ద్విజులు అనబడే మొదటి మూడు వర్ణాలు ఒక వర్గంగా, శూద్రులంతా ఒక వర్గంగా మారి పనిచేసింది.

పవిత్రమైన మంత్రాలు లేదా వేదాల వంటివి నోటివెంట వెలువడుతాయి. కనుక, వాటిని నేర్చిన బ్రాహ్మణులది అగ్రస్థానమైంది. పూజారులు వారినుంచే వచ్చారు. పురుష సూక్తం రాజులను పూజారులకన్నా కింది స్థానంలో ఉంచింది. బ్రాహ్మణుల అగ్రస్థానానికి హిందూ సాహిత్యమంతటా సవాళ్లు కనిపిస్తాయి. క్షత్రియులు బ్రాహ్మణులతో సమానులు కారని కొన్ని రచనలు వాదించగా, వారు అంతకన్న ఉన్నతులని మరికొన్ని రచనలు ఎదురు వాదనలు చేసాయి. బౌద్ధ సాహిత్యం కూడా రాజులకే అగ్రస్థానమిచ్చింది. పురుష సూక్తం బ్రాహ్మణులు తమను తాము అగ్రస్థాయి వారిగా చూపుకునేందుకు తర్వాత కాలంలో చేసిన రచన అనే అభిప్రాయముంది. భిన్నమైన పనులు, వృత్తుల గురించిన వేదమంత్రంలో (పైన ఈ అధ్యాయం మొదట పేర్కొన్నది) ఇటువంటి వర్ణపరమైన విభజన లేకపోవటం గమనార్హం.

### వెలుపలి మనుషులు

దస్యులు, శూద్రులని వేదాలు పేర్కొన్న తరగతులలో నిమ్నస్థాయి సామాజిక తరగతులవారు మాత్రమేగాక, కొన్ని విధాలైన మతాచారాలను పాటించేవారు కూడా ఉండి ఉంటారు. ఉదాహరణకు వ్రత్యులు. వారు ఏదో వ్రతం తీసుకుని సన్యాసులుగా ఎడ్లబళ్లలో సంచరిస్తూ, తమను తాము కొరడాలతో కొట్టుకునేవారు. వారిని శుద్ధి కార్యక్రమం ద్వారా వైదిక వ్యవస్థలోకి తీసుకుని వచ్చేందుకు బ్రాహ్మణులు ప్రయత్నించేవారు. ఆ విధంగా వ్రత్యులు ఒకోసారి 'లోపలి' వారు, ఒకోసారి 'బయటి'వారు కావటాన్ని గమనించవచ్చు. ఈ తరగతివారు తమ విశ్వాసాలు, ఆచారాలు కొన్నింటిని వైదిక మతంలోకి తీసుకువచ్చి ఉంటారు కూడా.

మరొకవైపు మతం నుంచి బయటకు వెళ్లినవారి గురించిన వర్ణనలు కూడా ఒక మంత్రంలో ఉన్నాయి. దానిని గమనించండి:

## దీర్ఘ కేశి అయిన యోగి

దీర్ఘకేశాలలో అగ్ని, మాదక ద్రవ్యం, ఆకాశం, భూమి దాగి ఉంటాయి... వాయువునే వస్త్రాలుగా ధరించే (నగ్నంగా అని అర్థం) ఈ యోగులు చింపి పాతవైన మురికి కాషాయాంబరాలను ధరిస్తారు. "యోగిత్వం ఒక వెర్రిగా మారిన మేము గాలిపై స్వారీ చేస్తాము. మానవులకు మా శరీరాలు మాత్రం కన్పిస్తాయి".... దీర్ఘ కేశాలు పానపాత్ర నుంచి (సోమరసాన్ని) తాగుతాయి. మాదక ద్రవ్యాన్ని రుద్రునితో పాటు సేకరిస్తాయి (10.136)".

చిరిగిన మురికిపాతలు ధరించడమంటేవారు నిరుపేదలైనా అయి ఉండాలి, లేదా వస్త్రధారణవంటి విషయాలలో సామాజిక పద్ధతులనుంచి ఉద్దేశపూర్వకంగానైనా దూరమై ఉండాలి. వారు కాషాయ వస్త్రాలు ధరించటం యోగులుగా మారిన తొలిదశ నాటి స్థితి కావచ్చు. తర్వాత కాలంలో యోగులు, విరాగులు, సన్యసించినవారు. ఇంకా ఇదే విధమైన ఇతర శ్రేణులవారు కూడా కాషాయధారులయ్యారు. రుద్రుడు విషాన్ని, ఔషధాలను మాత్రమేగాక, మతి స్థిమితం తప్పే మాదకద్రవ్యాలను కూడా నియంత్రించే శక్తి కలవాడు. రుద్రుని ఉనికి నాగరిక సమాజానికి బయట ఉండేది. తనను వైదిక బలుల నుంచి దూరంగా ఉంచేవారు. రుద్రుడు ఎపుడేమి చేసేదీ ఎవరూ చెప్పజాలని ప్రమాదకారి. జ్వరాన్ని తెప్పించగలడు, అందుకు చికిత్స కూడా చేయగలడు. "ఒక ఉగ్రమైన జంతువు వలె దాడికి తలపడతాడు" (2.33). రుద్రుడు వేటగాడు. హింసకు, క్రౌర్యానికి, దైవ సమాజంలోని అపవిత్రతకు ప్రతినిధి. ఆ ప్రపంచపుటంచుల వెంట జీవిస్తాడని రుగ్వేదం చెప్తుంది.

తమ వర్ణం కారణంగా, మతాచారాల పరంగానేగాక, వివిధ వ్యసనాల వల్ల సంఘవిద్రోహకరంగా ప్రవర్తించేవారు కూడా సమాజానికి దూరంకావటం గురించి రుగ్వేదంలో ఉంది. అటువంటి ప్రవర్తనకు మద్యం, క్రోధం, జూదం, నిర్లక్ష్యం కారణాలని ఒక మంత్రం చెప్తున్నది. శృంగారం, వేటల ప్రస్తావన భారతదేశ చరిత్ర పొడవునా ఉంది. జూదం వల్ల సాధారణ కుటుంబాలనుంచి రాజ్యాల వరకు కుప్పకూలిన సందర్భాలున్నాయి. మహా భారతంలో యుధిష్ఠురుని కథ అటువంటిదే.

స్త్రీలను వస్తువులుగా పరిగణించటం వేదాలలో కనిపిస్తుంది. అప్పటి పురుషులకు అన్నింటికన్న విలువైన ఆస్తులు పశువులు, భార్య. ఆమె తెరల వెనుక ఉండాలి. తనను జూదంలో పణంగా ఒడ్డుతుండేవారు. ఒకోసారి మంత్ర రచనలో స్త్రీల పాత్ర ఉన్నట్లు కనిపిస్తుంది. వారి పట్ల కొంత సానుభూతిని చూపే మంత్రాలలో బహుశా తమ ప్రమేయం ఉండి ఉండవచ్చు. సవతులను అశక్తులుగా మార్చటం, గర్భస్థ శిశువుల పరిరక్షణ, కన్యలు తగిన భర్తల కోసం వైదిక క్రతువులు ఆచరించటం వంటివి ఈ మంత్రాలలో కనిపిస్తాయి. వాటిలో ఒక దానిని ఇంద్రుడి భార్య ఇంద్రాణికి అంకితమిచ్చారు. కొన్ని మంత్రాలలో వివాహిత స్త్రీలకు గల ప్రియుల ప్రస్తావనలున్నాయి. రుగ్వేదం ఆ పద్ధతిని తీవ్రంగా ఖండించింది. అయితే, సోదరులనేవారు భర్త సోదరులు కావచ్చుకూడా. పురుషులకు తమ వదినలతో కొన్ని సంప్రదాయక సంబంధాలు ఉండటం కనిపిస్తుంది. అవి శృంగార సంబంధమైనవని చెప్పలేకపోయినా కొంత ఉద్వేగాన్ని కలిగిస్తాయి.

భర్తల మరణానంతరం స్త్రీలు సజీవంగా ఉండటమే గాక క్షేమంగా జీవించాలని వారిని కోరే మంత్రాలు వేదంలో ఉన్నాయి. అయితే వారు భర్త శవం పక్కన సంకేత ప్రాయంగా పడుకుని తిరిగి లేచే పద్ధతి ఉండినట్లు అథర్వ వేదంలో, ఇతరత్రా గల

మంత్రాలను బట్టి తోస్తుంది. కాని తర్వాత కాలంలో ఈ సంకేత ప్రాయ చర్యను సతీసహగమనానికి మద్దతుగా ఉదాహరించటం చేసారు. స్త్రీ–పురుష సంబంధాలలో పరస్పర వ్యామోహం, ఆకర్షించే ప్రయత్నాలు, వివాహ సంబంధాలు, వివాహేతర సంబంధాలు, వైమనస్యాలతో దూరం కావటం వంటి అంశాలపై మంత్రాలున్నాయి. అవి ఒకోసారి సంభాషణల రూపంలో కన్పిస్తాయి. దీనంతటిలో మానవ స్త్రీ –పురుషులే గాక దేవతా స్త్రీ, పురుషులు కూడా పాత్రధారులవుతారు. ఒక కథనంలో ఇంద్రుని ప్రసక్తి ఉంటుంది. స్త్రీ పాత్రధారి అపల అనే మానవ మాత్రురాలు. వివాహేతర సంబంధాలు భూమిపైన, దేవతలకూ మానవమాత్రులకు మధ్యనే గాక దేవలోకంలోనూ ఉంటాయి. రామాయణ కథనం ప్రకారం, ఇంద్రుడు ఒక భూలోకపు స్త్రీతో శృంగారం జరిపిన తర్వాతనే భూమిపైన అతిరిక్త సంబంధాలంటూ ఏర్పడ్డాయి.

రుగ్వేదంలోని స్త్రీలంతా తమ భర్తలనుబట్టి లేదా తండ్రుల వంటి ఇతర పురుషులను బట్టి గుర్తింపు పొందిన వారేమీ కాదు. వచ, నిరుత్తి, ఉషస్సు, నిశ, జల, పృథ్వి వంటివి ఇందుకు ఉదాహరణలు. ఇంద్రుడి భార్య ఇంద్రాణి అయినట్లు తన భార్య అయిన శచీదేవి పేరుతో ఆయన శచీపతి కావటం ఒక ఆసక్తికరమైన విషయం. శచి అనే పదానికి శక్తి అనే అర్థముంది. తర్వాత కాలంలో మరికొందరు దేవతా స్త్రీలు కూడా శక్తి పాత్ర వహించారు. కాని, వైదిక మతానికి ప్రధానమైనదయిన బలుల క్రతువులో వచో దేవికి మినహా మరెవరికీ స్థానం లేదు.

వేదకాలపు సృష్టికర్తలైన దేవతలు అత్యధికులు పురుషులే. ఒక వేదమంత్రం అతిథి ద్వారా విశ్వసృష్టిని ఊహిస్తుంది. అదితి, దక్షుడు అనే బాలునికి జన్మనిస్తుంది. దక్షుడు అదితికి జన్మనిస్తాడు. తిరిగి ఆమె చిరంజీవులైన దేవతలకు మాతృత్వం వహిస్తుంది. ఇందులో విష్ణువు – బ్రహ్మలవలెనే అదితి – దక్షుల పరస్పర సృష్టి ఒక ఆసక్తికరమైన కోణం.

## ముక్కోటి దేవతలు

రుగ్వేదంలో పలువురు దేవతలు కన్పిస్తారు. అదే సమయంలో, తర్వాత ఉపనిషత్తులలోని ఏకేశ్వర భావనకు బీజాలు కూడా ఈ వేదంలో ఉన్నాయి. సకల ప్రాణులు ఒకే అంశం నుంచి ఉద్భవించాయన్నది అందులోని భావన. దేవతలు ఎందరున్నా మూలం ఒకటేనన్న ఈ సూత్రీకరణ సహిష్ణుతను బోధించే దృష్టి. మనం ఎందరు దేవతలను నమ్మినా ఒక సమయంలో ఒకరినే ఆరాధిస్తూ తననే శక్తివంతునిగా భావించటం నుంచి సహిష్ణుతా భావం ఏర్పడుతుంది. వేదమంత్రం ఒకటి ఇంద్రుడు, మిత్రుడు, వరుణుడు, అగ్ని, యముడంటూ ఎన్ని పేర్లున్నా అందరూ ఒకరేనని చెప్తుంది. ఒక దేవుడిని ఆరాధించేందుకు ఒక మంత్రంలో ఏ పదాలు వాడుతారో, మరొక దేవుడి కోసం సరిగా అవే పదాలు ఉపయోగించే మంత్రం మరొకటి ఉంటుంది. ప్రతివ్యక్తి వేర్వేరు దేవతల

కోసం అనేక విధాలైన మంత్రాలను కూడా పఠించవచ్చు. అటువంటి వారిని ఆక్షేపించే వ్యక్తులపై వేదంలో విమర్శలున్నాయి. దేవతలను నిరుపయోగమని భావించే వారిని విమర్శించే వారిపై విమర్శలున్నాయి. అనగా నాస్తికులను విమర్శలు విమర్శించే వారిపై విమర్శలు అన్నమాట. అదే విధంగా, తప్పుడు దేవుళ్లను ఆరాధిస్తున్నారంటూ పరులను ఆక్షేపించేవారిపై కూడా విమర్శలున్నాయి. దీనిని బట్టి, మత సంప్రదాయాలతో విభేదించేవారిని, భిన్నాచారాలు గలవారిని చివరకు నాస్తికులను కూడా వేదాలు సమర్థించాయని భావించాలి.

ఒక వేదమంత్రం ఈ విధంగా ముగుస్తుంది: "సృష్టి ఏ విధంగా ఏర్పడింది? సృష్టి అనంతరమే దేవతలు ఉనికిలోకి వచ్చారు. అటువంటి స్థితిలో సృష్టికి మూల భూతమేదో ఎవరికి తెలుసు? బహుశా అది తనను తానే సృష్టించుకుని ఉంటుంది. లేదా కాకపోవచ్చు. పైన స్వర్గం నుంచి చూసేవాడికే అది తెలుసు. లేక తనకు కూడా తెలియదేమో (10:129)". ఈ మంత్రంలో గొప్ప వినయభావం, చివరకు ఏది నిజమైతే దానిని ఆమోదించగల దృష్టి కనిపిస్తాయి. ఇవే లక్షణాలు మరొక మంత్రంలోనూ ఉన్నాయి. వేదాలలో సహిష్ణుత, వైవిధ్యత పట్ల ఆమోదం స్పష్టంగా ఉన్నాయి.

అనంతర కాలపు హిందూ మతంలో గొప్ప దేవతలైన విష్ణువు, శివుడు (రుద్రుని రూపంలో) రుగ్వేదంలో అంతగా కన్పించరు. అందుకు భిన్నంగా అప్పటి ప్రధాన దేవతలు అగ్ని, సోమ, ఇంద్ర, వరుణులు అనంతర కాలంలో తమ ప్రాముఖ్యతను కోల్పోతారు. వారు ప్రకృతి శక్తులకు సంకేతాలుగా మిగిలారు. కాని దేవతలలో ఎక్కువమందికి సాధారణ మానవుల లక్షణాలను ఆపాదించారు. మనుషుల వలెనే వారికి కూడా వివాహాలు, వివాహేతర సంబంధాలు, కీర్తి ప్రతిష్టలు, పొగడ్తలు కావాలి. అదే విధంగా ఆయా దేవతలను సామాజిక వర్గాలతో గుర్తించారు. అగ్ని బ్రాహ్మణ దేవత, వరుణుడు బ్రాహ్మణత్వ అధిపతి, ఇంద్రుడు క్షత్రియుడు, అశ్వినీ దేవతలు వైశ్యులు. వేదాలలో శూద్ర దేవతలు లేరు.

రుగ్వేదంలో అగ్ని దేవత, సోమ పానాల ప్రసక్తి అన్నిటికన్న ఎక్కువగా ఉంటుంది. వేద సంప్రదాయాలకు, బలులకు ఈ రెండూ అవసరం. క్షత్రియుడైన ఇంద్రుడు పాలించటమేగాక వర్షాలను కురిపిస్తాడు. అగ్నిని అసురులు దొంగిలించినపుడు తనను విముక్తుడిని చేసి వెనుకకు తీసుకువచ్చేది ఇంద్రుడే. ఒక గుహలో బంధించిన గోవులను విడిపించినందుకు ఇంద్రుడిపై ప్రశంసలున్నాయి. తన అతిపెద్ద విజయం వృత్రాసురవధ. దస్యుడైన వృత్రుడు నదికి అడ్డు కట్టవేసి కరువుకు కారకుడవుతాడు. ఇంద్రుడు, వృత్రుడు ఇరువురూ సోమరసం తాగేవారే. కాని తాగిన తర్వాత ఇంద్రుడు నిలవగలిగినంతగా వృత్తుడు నిలవలేడు. అటువంటి స్థితిలో ఇంద్రుడు వృత్రుడిని సంహరించి, తను ఆపివేసిన నీటిని, గుహలో బంధించిన గోవులను విడుదల చేస్తాడు. ఆ విధంగా వైదిక ప్రజల శత్రువులను ఓడిస్తాడు.

బ్రాహ్మణుల ఆధిపత్యానికి పురుష సూక్తంవలె, పైన పేర్కొన్న కథ క్షత్రియ ఆధిపత్యానికి పునాదివంటిది. పోతే, వరుణుడు పూజారి, రాజు కూడా. తన ప్రధానపాత్ర ఆకాశంలోనే తప్ప భూమిపైకాదు. రుగ్వేదకాలానికి తన బాధ్యత భూమిపై నివసించే మానవుల ప్రవర్తనను గమనించటంగా మారింది. అదే విధంగా పవిత్ర నిబంధనలను ఉల్లఘించే వారిని శిక్షించటం కూడా ఆయన బాధ్యతే. అటువంటి పరిస్థితివల్ల మనుషులు వరుణుడిని తమ దోషమేమిటో తెలియపరచవలసిందిగా, వాటినుంచి విముక్తం చేయవలసిందిగా వేడుకుంటున్నట్లు ఒక మంత్రంలో చూడవచ్చు. ఒక యజమానికి బానిస సేవలు చేసిన విధంగా తాను కూడా వరుణునికి సేవలు చేసి ఆ దోషం నుంచి విముక్తి పొందగలనని కూడా ఆ వ్యక్తి అభ్యర్థిస్తాడు.

## మరణం

వేద మంత్రాలను కూర్చిన వారు సృష్టి క్రమం గురించి వలెనే, మరణం గురించి కూడా అనేక ఊహాగానాలు చేశారు. అందులో వైవిధ్యతతో పాటు వైరుధ్యాలు కూడా ఉన్నాయి. మరణం విషయమై వారు పలు విధాలైన ప్రశ్నలను సైతం లేవనెత్తారు. సామాజిక వర్ణాలలోని ఒక నిర్దిష్టమైన విధానానికి వ్యవస్థకు భిన్నంగా మరణం, నిద్ర రెండూ అయోమయమైనవన్నది వారి అభిప్రాయం. మరణాన్ని వీలైనంత మేర దూరంగా ఉంచాలి. మరణాన్ని శాశ్వతంగా ఆపలేముగాని అకాల మృత్యువు బారిన పడకూడదు. పిల్లలు తల్లిదండ్రులకన్నా ముందు చనిపోకూడదు అని మంత్రాలు సూచిస్తున్నాయి. అయితే యుద్ధాలు, బలుల గురించి ఎంతో రాసే రుగ్వేదం, మృత్యువు గురించి ఎక్కువ చర్చించకపోవటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. చెప్పిన మాటలు మాత్రం సంతోషించ దగ్గవేననాలి. మనిషి చిరంజీవి కావటమన్న మాటకు రుషుల అర్థం మరణమన్నదే లేకపోవటమని కాదు. దేవతలు సైతం మరణంలేనివారు కాదు. వారికి గలది దీర్ఘాయుష్షు మాత్రమే. (డెబ్బయి నుంచి వంద సంవత్సరాల వరకు) అయితే వారికి వార్ధక్యం ఉండదు.

మరణానంతరం పుణ్యాత్ములకు స్వర్గ సుఖాలు లభిస్తాయని వేదం చెప్తుంది. ఆ సుఖాలన్నవి భూమిపై లభించేవాటికే మెరుగైన రూపాలు. మృష్టాన్న భోజన పానీయాలు, అందగత్తెల పొందు (ఇది పురుషుల ఊహాగానం) వంటివి. మరొక వైపు, దుష్టశక్తులను, రాక్షసులను పడతోసేందుకు లోతైన కూపాలుంటాయి. పాపాలు చేసే మనుషులను ఆ కూపంలోకి పంపుతారనే ప్రస్తావన మాత్రం లేదు. మరణం అనే సమస్యకు వేర్వేరు మంత్రాలలో వేర్వేరు పరిష్కారాలు కనిపిస్తాయి. కాని అవేవీ నిజమైన పరిష్కారాలు కావు. ఒకరేమి చెప్తున్నారో మిగిలిన వారికి తెలుసు. మరణించినవారు శిక్షలు అనుభవించేందుకు

నరకానికి, సుఖపడేందుకు స్వర్గానికి వెళతారనే కొన్ని అంశాలపై మాత్రం అందరి మధ్య ఏకీభావం ఉంది.

## పునర్జన్మ

రుగ్వేదం చనిపోయిన వారికన్న జీవించి ఉన్నవారి పట్ల ఎక్కువ శ్రద్ధ చూపుతుంది. మరణించినవారి కోసం దుఃఖించే వారిని ఉద్దేశించి చెప్పే మంత్రాలలో ఇది కనిపిస్తుంది. మంత్రాలలో మృత శరీరాలను సంబోధించి చెప్పేవి కూడా ఉన్నాయి. “అన్నిలోపాలను ఇంతటితో వదలివేసి నీ ఆశ్రయానికి తిరిగిపో. ఒక గొప్ప శరీరంతో ఏకమవ్వు” (10.14.8). అని హితోపదేశం చేస్తుందొక మంత్రం. మృతుడి శరీరాన్ని పూర్తిగా కాల్చవద్దని, బాగా ఉడికించిన తర్వాత దానిని జాగ్రత్త పరచి పితృ దేవతల వద్దకు పంపాలంటుంది మరొక మంత్రం. ఇదే వేదంలోని ఇంకొక మంత్రం మృతుడిని ఉద్దేశించి, “నీ నేత్రాలు సూర్యుని వద్దకు, జీవన శ్వాస అనంతవాయువుల్లోకి చేరుగాక. నీ స్వభావాన్ని బట్టి ఆకాశానికి గాని భూమిలోకి గాని ప్రవేశించు. నీ కర్మ ఆ విధంగా రాసి పెడితే నీటిలో నిమజ్జనంకా. నీ అంగాలతో మొక్కలలో వేరుగా మారిపో” అని చెప్తుంది. పురుష సూత్రం ఇందుకు భిన్నంగా, “చంద్రుడు తన మెదడు నుంచి, సూర్యుడు తన కంటి నుంచి ఆవిర్భవించా”రంటుంది. మృతుడి ఆత్మను ఏదైనా శరీరంలో చేరేందుకు అనుమతించాలని అగ్నిని కోరుతుంది.

చనిపోయిన మనిషికి ఏమవుతుందన్న చర్చ పూర్తిస్థాయిలో ఉపనిషత్తుల కాలం వరకు మొదలు కాలేదు. అపుడా చర్చ తాత్త్వికంగా సాగింది. వేదాలలోని కర్మకాండలు, కథలు, సంప్రదాయాలు చర్చకు వచ్చాయి. భారతీయ తత్త్వశాస్త్రం బాగా వికసించిన తర్వాత ఈ చర్చ పూర్తి స్థాయికి ఎదిగింది. అయితే ఆత్మల ప్రయాణం, పునర్జన్మల గురించి వేదమంత్రాలలో అస్పష్ట సూచనలు కొన్ని కనిపిస్తాయి. “నీ అంగాలతో మొక్కలలో వేరుగా మారిపో” అనటం అటువంటిదే. తనను తిరిగి జన్మను పొంది తనవారసులతో చేరనివ్వండి అన్నది కూడా అదే మంత్రంలోని మరొక భాగం. ఇటువంటి సూచనలను తీసుకుని ఉపనిషత్తులు పునర్జన్మపై చాలా చర్చచేశాయి. మృతుడి దేహాన్ని పూర్తిగా దహించవద్దని, బాగా ఉడికించిన తర్వాత భద్రపరచి తన పితృ దేవతల వద్దకు పంపాలన్న మాటలోని భావాన్ని కూడా ఇదే ఉద్దేశానికి ముడిపెట్టి చూడవచ్చు. ఉపనిషత్తులు చెప్పేదాని ప్రకారం, మరణించిన మానవులు వర్షం రూపంలో భూమి పైకి తిరిగి వస్తారు. మరణించిన వారికి ఏమవుతుందనే ప్రశ్నపై ఒక మంత్రంలో భిన్నాభిప్రాయాలు కనిపిస్తాయి. అందులో సత్కర్మలు, స్వర్గం ప్రస్తావనలున్నాయి. ఏది ఏమైనా ఇవన్నీ తొలి దశనాటి అస్పష్టమైన ఆలోచనలు. వాటికి బ్రాహ్మణాలు, ఉపనిషత్తులలోనే సరైన రూపురేఖలు ఏర్పడ్డాయి.

**అధ్యాయం 6**

# బ్రాహ్మణాలలో బలులు

## క్రీపూ. 800 నుంచి 500 వరకు

కాలక్రమణిక (అన్నీ క్రీ.పూ. సంవత్సరాలు)

| | |
|---|---|
| 1100 – 1000 | : వేదాలలో దొవాబ్ ప్రస్తావన. ఇది గంగా, యమునా నదుల మధ్య ప్రాంతం |
| సుమారు 1000 | : వత్సరాజ్యంలో కౌశాంబీ నగర స్థాపన |
| సుమారు 950 | : మహాభారత యుద్ధకాలమని అంచనా |
| సుమారు 900 | : కాశీ (వారణాసి, బనారస్) నగర స్థాపన |
| సుమారు 800 – 600 | : బ్రాహ్మణాల రచన |

### మనుషులు, పశుగణాలు

*ఆరంభంలో, ఇప్పుడు మనుషుల చర్మం ఏదో అది పశువుల చర్మంగా ఉండేది. ఇప్పుడు పశువుల చర్మం ఏదో అది మనుషుల చర్మంగా ఉండేది. పశువులు వేడిని, వర్షాలను, ఈగలను, దోమలను తట్టుకోలేకపోయేవి. దానితో అవి మనుషుల వద్దకు వెళ్ళి, మా చర్మం మీరు తీసుకుని మీది మాకివ్వండి అని కోరాయి. అందువల్ల జరిగే దేమిటని అడిగారు మనుషులు. మీరు మమ్ములను ఆహారంగా తీసుకోవచ్చు, మా చర్మాలు మీకు వస్త్రాలుగా ఉపయోగపడతాయి అన్నాయి పశువులు. దానితో వారు తమ చర్మాలను పరస్పరం మార్చుకున్నారు. అందువల్ల, బలిని ఇచ్చే వ్యక్తి ఎర్రని చర్మాన్ని ధరించినట్లయితే పశువులు తనను మరో లోకంలో భక్షించబోవు. లేనట్లయితే భక్షిస్తాయి.*

*–జైమినీయ బ్రాహ్మణం (క్రీ.పూ. 600 ప్రాంతం)*

మనుషులకు, పశువులకు జంతువులకు మధ్య పరస్పర సంబంధాలు ఏమిటి? మరో లోకంలో పడే శిక్షణలేమిటన్నవి బ్రాహ్మణాలలోని ప్రధానాంశాలు. జాపపద కథల రూపంలో వీటిలో అనేక కొత్త ఆలోచనలు కనిపిస్తాయి. వాటి గురించి రుగ్వేదంలో సూచనా మాత్రపు ప్రస్తావన మాత్రమే ఉంది. అయితే, ఇతర ఆలోచనలు కొన్ని వైదికేతర మైన భారతీయ సంస్కృతి నుంచి వచ్చి ఉంటాయి.

## గంగానదీ తీర నగరాలు

ఏ విషయాలలోనైతే రుగ్వేదం దేవతల సహాయాన్ని కోరిందో, వాటిని వేదమంత్రాలు పరిష్కరించగలవనే విశ్వాసాన్ని బ్రాహ్మణులు వ్యక్తపరచటం గమనించదగ్గది. రుగ్వేదంలో, నేను నైవేద్యమివ్వగల దేవుడెవరంటూ ఒక ప్రశ్న ఉంది. బ్రాహ్మణాల రచయితలకు అది ఇబ్బందికరంగా మారి ఒక దేవుడిని సృష్టించారు.తన పేరే 'ఎవరు' (సంస్కృతంలో 'కా').

ఎవరు దేవుడనే ప్రశ్న కాస్తా అందుకు జవాబుచెప్పే స్థితికి ఎందుకు మారింది? గ్రంథరచయితల జీవిత పరిస్థితులు వేదకాలంతో పోల్చినప్పుడు గణనీయంగా మారటం ఇందుకు ఒక కారణం. హిందూమత చరిత్రలో నగరీకరణ రెండవ దశలోకి ప్రవేశించినప్పుడు భౌగోళికంగా, సామాజికంగా భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. బ్రాహ్మణాల రచన ఆ కాలంలో జరిగింది. మనం బ్రాహ్మణాల రూపంలో గల మత గ్రంథాల గురించి చర్చించే ముందు వాటిని కూర్పు చేసివారి వస్తుపరమైన జీవన స్థితిగతులు ఏమిటో గమనించాలి.

క్రీ.పూ. 1100 నుంచి 1000 సంవత్సరాల కాలంలో వేదపాఠాలు గంగా, యమునల మధ్య దొవాబ్ ప్రాంతం గురించి ప్రస్తావించనారంభించాయి. ప్రస్తుతపు ఢిల్లీకి తూర్పున హస్తినాపుర నిర్మాణం జరిగింది అప్పుడే. మహాభారత కథాస్థానం కూడా ప్రధానంగా అదే. తర్వాత క్రీ.పూ. 900 ప్రాంతంలో అక్కడికి దిగువన గంగా లోయ మధ్య, పశ్చిమ ప్రాంతాలలో రాజ్యాలు, రాజహర్మ్యాలు అవతరించాయి. ఈ క్రమం కొన్ని వందల సంవత్సరాలపాటు సాగి ఉంటుంది. కాని రాజులనేవారు వాస్తవానికి నామ మాత్రులు. వారి రాజ్యాలు అతి చిన్నవి. కోసల (లేక విదేహ) రాజ్య రాజధాని అయిన కాశీ నగరం ఆ నగరాలలో ఒకటి. క్రీ.పూ. 1300–1000 మధ్య నిర్మించిన వత్స రాజ్యపు రాజధాని కౌశాంబి మరొకటి. ఈ నగరాల స్థాపన అనంతరం కొన్ని వందల సంవత్సరాలకు బ్రాహ్మణాల రచన జరిగి ఉండాలి. ఎందుకంటే వేదాల భాషకు, వీటి భాషకు చాలా తేడా కనిస్తుంది. బ్రాహ్మణులు ఆయా వేదమంత్రాలను పేర్కొని, వాటి రచన ఏ పరిస్థితులలో జరిగిందో చెప్తూ, వాటికి వివరణలు ఇస్తారు. భాష మాత్రమే గాక వేదాలతో పోల్చినప్పుడు బ్రాహ్మణాల స్వభావమూ మారింది. క్రీ.పూ. 1000 నుంచి 500 మధ్య వైదిక సంప్రదాయాలను వివరిస్తూ పలు వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. 600 ప్రాంతానికల్లా వేర్వేరు వైదిక శాఖలు ఏర్పడి స్థిరపడిపోయాయి.

క్రీ.పూ. ఒకటవ సహస్రాబ్ది కాలంలో వైదిక ప్రజలు స్థిరపడిపోయి చేపట్టిన అనేక నిర్మాణాలు చిరకాలం నిలిచాయి. వారు ఉత్తర భారతదేశంలో తూర్పు దిశగా సాగిపోతూ

నదీ వాణిజ్యాన్ని, అడవులను, ఖనిజ సంపదలను తమ అధీనంలోకి తీసుకున్నారు. మొదట పంజాబ్ నుంచి తూర్పు మగధ వరకు, తర్వాత వెనుదిరిగి పశ్చిమాన గుజరాత్ వరకు చేరారు. ప్రధానమైన పంట గోధుమ నుంచి వరికి మారింది. ఇందులో మిగులు చాలా ఉండేది. క్రమంగా నగర సమాజాలు పెరిగాయి. వారు ఒకచోటి నుంచి మరొక చోటికి తరలి వెళ్ళాటానికి ఇనుము కోసం సాగించిన అన్వేషణ ఒక కారణం. క్రీ.పూ. 800 ప్రాంతం నుంచి ఇనుము వినియోగంలోకి వచ్చింది.

## వర్ణ సంఘర్షణలు

గంగానదీ లోయలో అందుబాటులోకి వచ్చిన మిగులు సంపదలు సరికొత్త సామాజిక, ఆర్థికశక్తిని సృష్టించాయి. ఈ క్రమంలో వ్యవసాయం, ఇతర పనులకు కూలీల అవసరం కూడా బాగా పెరిగింది. ఒకవైపు మూడు ఉన్నత తరగతులకు మధ్య, మరొక వైపు ఆ ముగ్గురికి సేవక తరగతికి మధ్య అంతరాలు ఎక్కువయాయి. రాజులు, రాజరికాలు పెరగటమంటే బలులు, క్రతువులు పెరగటమన్నమాట. వాటికోసం మరిన్ని సంపదలు అవసరమయాయి. వీటన్నింటి ప్రభావాలతో విద్య, సాహిత్యం, నైపుణ్యాలు, వివిధ కార్య కలాపాలు పెరిగాయి. క్రతువులు, విద్యలతోపాటు మంత్రాలకు వ్యాకరణ వృద్ధి, పదాలకు అర్థాలు, వాటి వివిధ రూపాలను కనుగొనటం వంటివి జరిగాయి. క్రతువుల విధానాలతో పూజారి వ్యవస్థ, పూజారులయేందుకు కావలసిన అర్హతలేమిటనే ప్రశ్నలు విస్తరించాయి.

ఆసక్తికరమేమంటే, ఎవరు నిజమైన బ్రాహ్మణుడన్న నిర్వచనాలు తన పుట్టుకతో నిమిత్తం లేకుండా సాగాయి. "ఒక బ్రాహ్మణుడి తల్లిదండ్రుల గురించిన విచారణలు ఎందుకు చేస్తున్నావు? నీకు ఎవరిలోనైతే విజ్ఞానం కనిపిస్తుందో అదే అతని తండ్రి తాత"లని ఆకాలపు రచనలు స్పష్టం చేశాయి. వర్ణాలు, వారసత్వాలను ఇతర గ్రంథాలు కూడా ప్రశ్నించాయి. ఒక మంత్రంలోని కథను గమనించండి.

## రుషులు, ఒక బానిస స్త్రీ కుమారుడు

సరస్వతీ నదీతీరాన ఒక బలిని ఆచరిస్తున్న రుషులు, ఇలూష కుమారుడు కవశను తాను బానిస స్త్రీ సంతానమంటూ సోమరస మివ్వకుండా పారదోలుతారు. "అసలు తను మనతో పాటు ఎట్లా చేరగలిగాడు; తనను దప్పికతో మరణించనివ్వండి. కాని సరస్వతీనదీ జలాలను సేవించేందుకు వీలులేదంటారు. ఆ ఎడారిలో తను ఒంటరిగా తపిస్తూ వేదమంత్ర మొకటి రచిస్తాడు. అప్పుడు తన వద్దకు సరస్వతీ నది వచ్చి అతని చుట్టూ జలాలను ముంచెత్తుతుంది. అది గమనించిన రుషులు, "తను దేవతలకు తెలుసు. తనను వెనుకకు పిలుద్దా"మంటారు.

ఈ కథలో, అగ్రవర్ణాలకు బయటి వ్యక్తిని వైదిక పూజారి వ్యవస్థలో అంతర్భాగం చేసుకోవటం కనిపిస్తుంది. పూజారులు కవశను దాసీ పుత్రుడన్నారు. కాని తన తండ్రి

ఇలూష బహుశా బ్రాహ్మణుడై ఉంటాడు. బ్రాహ్మణాలలో శూద్రులు, వైశ్యుల పాత్ర క్రమంగా పెరుగుతుండటాన్ని చూడవచ్చు. అవి ముఖ్యమైన పాత్రలు కూడా. మిగులు సంపదలు రాజులను, పరిపాలనా యంత్రాంగాన్ని పోషించాయి. సంపదలను సృష్టించే వారిపై భారం పెరిగింది. మొత్తం పంటలో ఒక భాగం (మనువు చెప్పిన దానినిబట్టి ఆరవవంతు) పన్నుల రూపంలో పోయేది. బలి అన్నది తొలుత యజ్ఞాలకు సంబంధించినది కాగా, ఇప్పుడు పన్నులను కూడా బలి అన్నారు. ఆ భారాన్ని భరించలేని కొందరు రాజుకు వ్యతిరేకంగా మారినట్లు ఒకానొక బ్రాహ్మణంలోని ఉదంతం చెప్తుంది.

## ప్రజలను భుజించిన రాజు

> "ఒక జింక బార్లీని తిన్నట్లయితే, అంతమాత్రాల రైతు ఆ జంతువును పోషించినట్లు భావించడు. నిమ్నవర్ణాలకు చెందిన స్త్రీ ఒక గొప్పవాడి ఉంపుడుకత్తెగా మారితే, ఆ కారణంగా తను సంపన్నుడిని కాగలనని ఆమె భర్త ఆశించలేదు". బార్లీ పంట అన్నది ప్రజలు. జింక అన్నది రాజు అధికారం. ప్రజలు ఆ అధికారానికి ఆహారం. అనగా రాజ్యాధికారం చేతిలోగలవారు ప్రజలను భుజిస్తారు. కనుక రాజు జంతువులను పోషించడు. ప్రజలకు చెందిన స్త్రీ కుమారుడిని రాజుగా చేయరు.

ప్రాచీన కాలానికి చెందిన రచనలలో అత్యధికానికి వలె ఈ కథనం కూడా బ్రాహ్మణుల ద్వారానే లోకంలోకి వస్తుంది. అట్లా రాజులను విమర్శించటంలో వారి ప్రయోజనాలు కూడా ఉండి ఉంటాయి. అదే సమయంలో, సాధారణ ప్రజల నిరసనను కూడా అందులో చూడవచ్చు. వారు బ్రాహ్మణులు కానందున స్వయంగా రాయలేరు. ఈ కథనం రాజు దుర్మార్గం గురించి చెప్పటంతోపాటు, ప్రజలు వర్ణ విభజనలను అధిగమించ లేరని ప్రకటిస్తుంది. నిమ్నవర్ణాలకు చెందిన మనిషి తన భార్యను అగ్రవర్ణాల వారి ప్రియురాలిగా మారనివ్వరాదు. సాధారణ వర్ణాలకు (వైశ్యుడు) చెందిన వ్యక్తి రాజు కాలేడు.

రాజులకు గల రాజకీయాధికారంతోపాటు సైన్యాలు, పన్ను వసూళ్ళ యంత్రాంగం ఉండేవి. వ్యయ భారాల కారణంగా లోగడ పూజారులకు బలులు, క్రతువుల కోసం ఇచ్చిన సంపదలు కూడా ఖర్చుయేవి. అందువల్ల రాజులకు, పూజారులకు మధ్య వైమనస్యాలు తలెత్తేవి. హిందూమత చరిత్రలో ఈ విధమైన వైమనస్యాలది కూడా ఒక ముఖ్యపాత్ర. దానిని 'సంప్రదాయంలో అంతస్సంఘర్షణ' అన్నారు.

## రాజులు, పూజారులు

వైదిక ప్రజలు పంజాబ్ నుంచి గంగాలోయకు తరలివెళ్ళటం ఇతర సమస్యలకు దారితీసింది. దాని ప్రభావం హిందూమత చరిత్ర పొడవునా కనిపిస్తుంది. ఇక్కడ గడ్డి

మైదానాలు తగ్గటంవల్ల గుర్రాలకు మేత సరిగా లభించక ప్రతి ఒక్కరూ ఒక గుర్రాన్ని పెంచుకునే అవకాశం లేకపోయింది. గుర్రం ధనికులకు, రాజులకు స్వంతమైంది.

రాజులకు, పూజారులకు మధ్య ఘర్షణాత్మకత స్థితి తలెత్తటాన్ని తెలియజేసే ఉదంతాలు ఈ కాలంలో ఉన్నాయి. అశ్విక బలం ఎక్కువగా గల రాజులు యుద్ధాలలో గెలుస్తుండేవారు. రాజులు తప్పు చేయకుండా నియంత్రించటం కోసం పూజారులే రథ సారథులయే సంప్రదాయం కూడా ఉండేది. ఇందుకు సంబంధించిన కథలో ఇక్ష్వాకు రాజైన త్రియారుణకు వృషుడు రాజపురోహితుడు. ఒక రోజు వారు రథంపై వేగంగా వెళుతుండగా ఒక బ్రాహ్మణ బాలుడు దాని చక్రం కిందపడి చనిపోతాడు. ఆ సమయంలో రాజు గుర్రాలను వేగంగా అదిలిస్తుండగా, సారథి అయిన పూజారి కళ్ళేలను లాగజూస్తాడు. కాని ఆ వేగంలో సాధ్యంకాదు. కళ్ళేలు చేతిలో ఉన్న సారథే ఆ నేరం చేశాడని రాజు నిందించగా, గుర్రాలను వేగంగా అదిలించిన రాజుది దోషమని పురోహితుడు ఆరోపిస్తాడు. ఇరువులూ ఇక్ష్వాకుల పెద్దల వద్దకు వెళ్ళగా, వారు సారథిదే నేరమని తీర్పు చెప్తారు. అప్పుడు పూజారి తన మంత్రశక్తితో ఆ బాలుడిని పునరుజ్జీవింపజేస్తాడు.

కాని వృషుని ఆగ్రహం తగ్గక తన తండ్రి జానునితో జరిగింది చెప్తాడు. ఇక్ష్వాకులు తనకు వ్యతిరేకంగా అన్యాయపు తీర్పు చెప్పారంటాడు. అప్పుడు ఇక్ష్వాకుల అగ్ని వేడిని కోల్పోతుంది. ఉదయం మంటపై ఉంచిన ఆహారం సాయంత్రం వరకు కూడా ఉడకదు. దానితో వారు, తాము ఒక బ్రాహ్మణుడిపట్ల అపచారం చేశామని భావించి అతడిని వెనుకకు రప్పిస్తారు. ఆయన త్రియారుణ రాజు భార్య పచ్చిమాంసం తినే పిశాచి అని కనుగొని, అగ్నిపై తను కూర్చున్నందువల్లనే అందులోని వేడిపోయిందంటాడు. వృషుడు ఒక మంత్రాన్ని చదవటంతో ఆమె దగ్ధమైపోయి, అగ్నికి వేడి తిరిగి వస్తుంది.

ఈ చారిత్రక దశలో క్షత్రియులు, బ్రాహ్మణుల పాత్ర, పరస్పర సంబంధాలు, ఆధిపత్య భావనలు, ఘర్షణల స్థితిని ఈ కథ నుంచి గ్రహించవచ్చు. బ్రాహ్మణులపట్ల అపచారం జరిగినప్పుడు అగ్ని ఆరిపోయినట్లు చూపే కథనాలు వేరే కూడా ఉన్నాయి. అదేవిధంగా, బ్రాహ్మణులు ఆగ్రహించినప్పుడు ఆడ రాక్షసులను (అసురి) నాశనం చేసే ఉదంతాలు కూడా కనిపిస్తాయి. బ్రాహ్మణుల పట్ల రాజులతో సహా ఎవరైనా సరే అపచారం చేయరాదన్నది ఇందులోని నీతి.

## జంతువులు

రుగ్వేద కాలంలో ఒక సాధారణ క్రతువుగా ఉండిన అశ్వబలి ఈసరికి ఒక సంక్లిష్టమైన, వ్యయప్రయాసలతో కూడిన బలి సంప్రదాయంగా మారినట్లు బ్రాహ్మణాలు చెప్తున్నాయి. అశ్వమేధ యాగానికి రాజకీయ సంకేతం చాలా ఉంది. ఆ అశ్వం ఒక సంవత్సరంపాటు స్వేచ్ఛగా సంచరించిన ప్రాంతాలన్నీ ఆ రాజుకే చెందుతాయి.

యజ్ఞ యాగాదులలో దుష్టశక్తులను దూరంగా ఉంచటంలో శునకాల పాత్ర కూడా ఉంది. గడ్డిని మాత్రమే (శాకాహారం) తినే అశ్వం గౌరవనీయమైన జంతువు కాగా, అపవిత్రమైన వాటిని (మాంసం సహా) తినే శునకాలు హీనమైనవి, నిమ్నవర్ణాలకు సంకేత ప్రాయాలు అయాయి. శునకాలతో సాన్నిహిత్యంగల ఇంద్రుడు, యముడు రుద్రుని వంటి వైదిక దేవతల ప్రాధాన్యత తగ్గటం కూడా ఈ స్థితికి కారణం కావచ్చు.

గోవులు ప్రమాదకరమైనవి కావు గాని, హిందూ మతంలో వాటివల్ల ఉత్పన్నమైన సమస్యలు అనేకం ఉన్నాయి. కాని అది పరోక్షంగా. బలి ఇచ్చేవారు గోవులవద్ద నగ్నంగా ఎంతమాత్రం నిల్చోరాదని బ్రాహ్మణాలు సూచించాయి. పశువులు మనిషి చర్మాన్ని తీసుకుని తమ చర్మాన్ని మనిషికి ఇవ్వగోరటం గురించిన కథను ఈ అధ్యాయంలో పైన చూశాము. ఒకవేళ బలిని ఇచ్చే మనిషి తన వద్ద నగ్నంగా నిల్చున్నట్లయితే, తన ఒకప్పటి చర్మాన్ని తిరిగి ఇచ్చివేయవలసిందిగా కోరగలడన్న భయంతో గోవులు పారిపోగలవని బ్రాహ్మణాల్లో ఉంది.

పోతే, శాకాహారం, అహింస గురించిన ఒక కథను గమనించండి. దాని ప్రకారం వరుణుని కుమారుడైన భృగువు తనకు తన తండ్రికన్నా, దేవతలకన్నా ఇతర బ్రాహ్మణుల కన్నా ఎక్కువగా తెలుసుననుకుంటాడు. అందుకు వరుణుడు, “నా కుమారునికి ఏమీ తెలియదు. తనకొక పాఠం నేర్పా”లని భావిస్తాడు. అప్పుడా తండ్రి భృగువు నుంచి ఊపిరిని తీసివేయటంతో ఆయన మరో లోకానికి వెళతాడు. అక్కడ ఒక మనిషి మరొక మనిషిని ముక్కలుగా చేసి తినటం, ఒక మనిషి మరొకరిని యథాతథంగా తింటుండగా అతను బాధతో కేకలు వేయడం, ఒక మనిషి మరొకరిని తింటుండగా అతను నిశ్శబ్దంగా ఆర్త నాదాలు చేయటం వంటి దృశ్యాలను గమనిస్తాడు. తర్వాత అక్కడి నుంచి తిరిగి వచ్చిన భృగువు తను చూసింది తండ్రికి చెప్తాడు. దానిపై వరుణుడు వివరణలు ఇస్తూ, నిజమైన జ్ఞానంలేక నైవేద్యాలు పెట్టనివారు వంట చెరుకుగా వాడేందుకు చెట్లను నరుకుతారని, లేదా బాధతో అరిచే జంతువులను తమకు ఆహారంగా వండుకుంటారని, లేదా మౌనంగా రోదించే వరి, బార్లీ వంటి ధాన్యాలను వండి తింటారని చెప్తాడు. ఆ చెట్లు, జంతువులు, వరి, బార్లీ మరో లోకంలో మనుషులుగా మారి ఈ మనుషులను తింటాయంటాడు. ఆ పరిస్థితిని నివారించేందుకు ఏమి చేయాలని భృగువు ప్రశ్నించగా, పవిత్రాగ్నిపై కర్రలను వేసి నైవేద్యాలు ఇవ్వాలని చెప్తాడు తండ్రి. ఈ పాఠం జంతువుల గురించి మాత్రమేగాక చెట్లు, వరి, బార్లీ గురించి కూడా చెప్తుంది. వాటికి కూడా అంతే ప్రాముఖ్యత ఉంది. మరో లోకంలో తాము తినబడటమన్నది పాపాలకు శిక్ష వంటిది కాదు. ఈ ప్రపంచంలో తాము తింటారు గనుక మరో లోకంలో తినబడతారు. అంతే. ఇదే మాట ఇతర బ్రాహ్మణాలలో కూడా ఉంది.

అయితే మనుషులు జంతువులను, వరి బార్లీని తినటం మానివేయాలని అవెక్కడా చెప్పలేదు. ఈ సమస్యకు పరిష్కారం దేవునికి నైవేద్యమిచ్చి ఆ తర్వాత తాము స్వీకరించటం. నైవేద్యం కనీసం మానసికంగానైనా ఇవ్వాలి. ఆ పనిచేయకుండా ఆహారాన్ని స్వీకరించటం అపవిత్రమైన పని అవుతుంది. సమస్య అప్పుడు తలెత్తుతుంది. ఆయా పాఠాలలో జంతువులను సక్రమమైన పద్ధతిలో తినాలని ఉంది తప్ప అసలు తినకూడదని కాదు. బ్రాహ్మణాలలో 'అహింస' అన్నమాట మౌలికంగా 'క్షేమం', 'భద్రత' అనే అర్థంలో ఉంది. అదే సమయంలో, తర్వాతి కాలపు భావనలు కూడా అందులో సూచనా మాత్రంగా కని పిస్తాయి. జంతువులకు హాని కలిగించరాదనటం, అసలు జంతు మాంస భక్షణ ఇబ్బందిగా తోచటం కూడా ఉంది. వధించనక్కరలేకుండా ఆహారాన్నిచ్చే గోవు, ప్రాణాలు కోల్పోని యాగాశ్వం వంటి ప్రస్తావనలు రుగ్వేదంలో ఉండటం ఇందుకు సూచనలు. మనుషులను జంతువులు మరో లోకంలో తినకూడదంటే చేయవలసింది వాటిని సరైన పద్ధతిలో తినటం కాదని, అసలు తినటమే మానివేయాలని జైన, బౌద్ధ మతాలు, తర్వాత కాలంలో హిందూ మతం కూడా నిర్దేశించాయి. భృగువు కథలో అహింస, శాకాహారాల ప్రస్తావన లేదు గాని, అనంతర కాలంలలో ఆ సిద్ధాంతాలు రూపుతీసుకోవటంలో దాని ప్రభావం ఉండి ఉండవచ్చు.

దేవతలు అతిథులుగా ఉండే యాగాలలో అవు మాంసం సహా మాంస భక్షణను శాస్త్రాలు అనుమతిస్తున్నాయి. అతిథులు వచ్చినప్పుడు ఎద్దును, లేదా ఆవును వధించాలని బ్రాహ్మణాలు చెప్తున్నాయి. మిత్రునికి, వరుణునికి ఆవును బలివ్వాలని, మరుత్తులకు వట్టి పోయిన ఆవును బలివ్వాలని, అశ్వాలను బలిచ్చినప్పుడు వాటితోపాటు ఇరవై ఒక్క వట్టి పోయిన ఆవులను కూడా బలివ్వాలని బ్రాహ్మణాలు అనుమతించాయి. క్రీ.పూ. అయిదు లేదా ఆరవ శతాబ్దంలో జీవించిన ప్రసిద్ధ వైయ్యాకరణుడుపాణిని, 'గోఘ్న' (ఆవును వధించినవాడు) అనే మాటకు 'ఎవరికోసమైతే ఆవును వధించారో ఆ వ్యక్తి' అనే అర్థం కూడా చెప్పాడు.

అందుకు విరుద్ధంగా మరొక బ్రాహ్మణం ఎద్దు, ఆవుమాంస భక్షణం తగదని హెచ్చరించింది. ఆ మాట అంటూనే, రుచిగా ఉన్నంతవరకు ఆవు, ఎద్దు మాంసం తింటూనే ఉండగలనని యాజ్ఞవల్క్యుడు చెప్పినట్లు కూడా పేర్కొంది. అయితే ఈ వైఖరులు, అలవాట్లు రకరకాలుగా మారాయి. అందుకు తాత్త్విక బోధనలు, పరిస్థితులు, ఆ జంతువుల పెంపకాలు కారణమయ్యాయి. అగ్రవర్ణాల వారు ఎద్దు, ఆవు మాంసాలు తినటం తగ్గిపోయింది. నిరసనలు పెరగసాగాయి. ఈ ధోరణి మనకు ఉపనిషత్తులలో అస్పష్టంగా, మహాభారతంలో స్పష్టంగా కనిపిస్తుంది.

## బలిపశువులుగా మనుషులు

ఈ కాలపు రచనలు మనుషులను దేవుడి చేతిలో కీలుబొమ్మలుగా పరిగణించాయి. వేదాలు, బ్రాహ్మణులు మనుషులను గాక అయిదు జంతువులను బలికి తగిన వాటిగా పేర్కొంటాయి. అవి ఎద్దు, గుర్రం, మేక, గొర్రె, గాడిద. వీటిని పశువులని కూడా అన్నారు. ఒకోసారి గాడిదకు బదులు మనిషి పేరు కన్పిస్తుంది. ప్రాచీన భారతంలో మనుషులను బలిచ్చేవారా? వేదాలకు పూర్వం తెలియదు గాని, వేదకాలానికి అది లేదు. అంతకుముందు కూడా కొన్ని సూచనలైతే ఉన్నాయి గాని అంత స్పష్టమైనవి కావు. అయినప్పటికీ గమనార్హ మేమంటే వేదాలలో మానవ బలి ప్రస్తావన ఉండటమేగాక, అది ఎలా జరపాలన్న వర్ణనలు ఉన్నాయి. పూజారులు వైదిక సంప్రదాయం ప్రకారం ఇటుకలతో నిర్మించిన వేదిక వద్ద అగ్ని వెలిగించినప్పుడు, అందులో స్వర్ణంతో చేసిన పంచ పశువుల బొమ్మలను ఉంచేవారు. ఆ అయిదింటిలో మనిషి ఒకరు. అటువంటి వేదికలకు సమీపంలో పలు ఇతర జంతువుల ఎముకలతోపాటు (గుర్రాలు, తాబేళ్ళు, పందులు, ఏనుగులు, ఆవులు వగైరా) మానవ కపాలాలు, ఇతర అస్తికలు పురావస్తు శాస్త్రజ్ఞులకు లభించటాన్నిబట్టి ఒకప్పుడు మనుషులను నిజంగానే బలి ఇచ్చి ఉంటారనే ఆ అభిప్రాయం కలుగుతుంది. బంగారు బొమ్మకు బదులు నిజమైన మనిషిని బలి ఇచ్చేవారు కావచ్చు.

అదెట్లున్నా, మనుషులు కూడా ఇతర జంతువులవలె దేవుని పశు గణాలలో భాగం కనుక, వారిని కూడా బలివ్వవచ్చునని చెప్పటం ఇక్కడ గమనించదగ్గ విషయం. అదే సమయంలో ఒక బ్రాహ్మణంలో ఇందుకు సంబంధించి ఆసక్తికరమైన కథనం ఒకటి ఈ విధంగా ఉంది :

## మనుషులు బలి పశువులు కాకుండా పోయిన తీరు

> తొలిదశలో దేవతలు తమ బలి పశువులుగా మానవులను ఉపయోగించేవారు. తనను ఉపయోగించిన తర్వాత మనిషిలోని బలి విలువ తన నుంచి నిష్క్రమించి అశ్వంలో ప్రవేశించింది. అశ్వాన్ని ఉపయోగించిన తర్వాత ఎద్దులో, తర్వాత గొర్రెలో, ఆ తర్వాత మేకలో ప్రవేశించింది. మేకను కూడా బలిచ్చిన తర్వాత భూమిలో ప్రవేశించింది. అప్పుడు దేవతలు ఆ విలువ కోసం భూమిని తవ్వగా అది బియ్యంలో, బార్లీలో కన్పించింది. అందుకే మనుషులకు ఇప్పటికీ భూమిని తవ్వటంవల్ల బియ్యం, బార్లీ లభిస్తాయి. ఆయా జంతువుల మాంసం వల్ల లభించేంత శక్తి వీటిలోనూ లభిస్తుంది. అందువల్ల మాంసానికి బదులు ఈ ధాన్యాల నైవేద్యంవల్ల అంతే పరిపూర్ణత సిద్ధిస్తుంది.

బలి విలువ మనిషి నుంచి ఈ విధంగా ధాన్యం వరకు ప్రయాణించటమనే కథనం, బృహదారణ్యక ఉపనిషత్తులోని మరొక ఆసక్తికరమైన కథనానికి ప్రాతిపదికవలె

పనిచేస్తుంది. అందులో తండ్రి అయిన దేవుడు తన కుమార్తెపై అత్యాచారం జరుపుతాడు. అప్పుడామె ఆవుగా మారి పారిపోగా తాను ఎద్దు అయి, ఆడ గుర్రం కాగా మగ గుర్రమై, ఆడ గాడిద కాగా మగ గాడిద అయి, మేక కాగా గొర్రె అయి అదే పనిచేస్తాడు. ఈ రెండు కథలలోనూ మొదటి బాధితుడు మనిషి కాగా తక్కినవి బలిపశువులు. బలులు మనిషితో ఆరంభించి జంతువులకు, మొక్కలకు ఎట్లా మారుతూ పోయాయనే దానికి ఈ కథలు చారిత్రకమైన వివరణ కాకపోవచ్చును. జంతువులకు బదులు మొక్కలు, మనుషులకు బదులు జంతువులు ఏవిధంగా బలికోసం ఉపయోగపడ్డాయో చెప్పే సంకేతాత్మకమైన కథలు మాత్రమే కావచ్చు.

## స్త్రీలు

అశ్వమేధయాగపు రెండవ దశలో స్త్రీలది ముఖ్యమైన పాత్ర. రాజకీయాధిపత్యం, మత సంప్రదాయ పునరుద్ధరణతోపాటు సంతానప్రాప్తి అన్నది ఈ దశలోని లక్ష్యం. ఆ దశలో రాజు పట్టపురాణి, అందరికన్నా ప్రియమైన రాణి, తను నిరాకరించిన రాణి, మరొక రాణి యాగాశ్వంతో సంభోగ ప్రక్రియను నటిస్తారు. ఇంకొక స్త్రీ, నాలుగువందల మంది పరిచారికలు వారికి సహకరిస్తారు. ఆ అశ్వం రాజుకు, భగవంతునికి ప్రాతినిధ్యం వహించగా, రాజు పరిపాలించే, గర్భానికి కారకుడయే భూమికి రాణి ప్రతినిధి అవుతుంది. ఆ సంప్రదాయంవల్ల పంటలు బాగా పండుతాయని, రాజుకు ఉత్తమమైన సంతానం కలుగుతుందన్నది నమ్మకం. అశ్వయాగపు ఈ రెండవదశకు ముందే ఆ గుర్రాన్ని వధించటమో, ఊపిరాడకుండా చేయటమో జరిగేది. అశ్వంతో సంభోగించినట్లు రాణి నటించేదన్న సూచనలు ఋగ్వేదంలోనూ ఉన్నాయి.

స్త్రీలలో అసురులైన వారు రాణుల రూపంలో యాగాలను, యజ్ఞకర్తలను నాశనం చేసే స్థితి ఉండగా, భార్యల నుంచి కూడా అదే ప్రమాదం ఉండేది. వారు సత్ప్రవర్తనకు దూరం కాగల అవకాశాలు కనిపించేవి. ఇందుకు దేవతలు సైతం మినహాయింపు కారు. ఉదాహరణకు ఇంద్రుని ఉదంతాన్ని గమనించండి. తనవలెనే తన కుమారుడు కుత్స ఔరవుడు కూడా తండ్రి తొడల నుంచి జన్మిస్తాడు. ఇంద్రుడు ఆయనను తన రథసారథిగా నియమిస్తాడు. ఒకసారి ఔరవుడు శచీదేవితో (ఇంద్రుని భార్య) సన్నిహితంగా ఉండగా ఇంద్రుడు చూసి, ఈ పని ఎట్లా చేయగలిగావని భార్యను ప్రశ్నిస్తాడు. అందుకామె, మీ ఇద్దరిలో ఎవరు ఎవరైందీ నేను పోల్చుకోలేకపోయానంటుంది. ఆ మీదట ఇంద్రుడు తేడా తెలియటం కోసం ఔరవుడిని బట్టతలవాడిగా మార్చుతాడు. కాని ఔరవుడు తలకు పాగా చుట్టుకుని తిరిగి శచి వద్దకు వెళతాడు.

గంగానదీ లోయ ప్రాంతంలో సంపదలు పెరిగినకొద్దీ వారసత్వాలు, వివాహిత స్త్రీల పాతివ్రత్యాలు రెండూ సమస్యగా మారసాగాయి. ఋగ్వేదంలో స్త్రీలపట్ల ఉండిన

ఉదాసీనత ఈసరికి సమసిపోయింది. శృంగార స్వేచ్ఛలకు అడ్డుకట్టలు పడ్డాయి. నగరీకరణ జరిగినకొద్దీ కొందరు స్త్రీలకు ఆస్తి హక్కులతోపాటు శృంగారపరంగా మరింత స్వేచ్ఛ లభించింది. కాని ఇదే స్వేచ్ఛ మూలంగా భయాలు పెరిగి ఇతరులు తమ కుమార్తెలకు చిన్న వయసులోనే వివాహాలు జరపటం, వివాహితులకు ఆచార సంప్రదాయాలలో ఉండిన స్థాయిని తగ్గించటం వంటివి చేయసాగారు. స్త్రీలు క్రమంగా స్వేచ్ఛ కోల్పోవటానికి ఊర్వశి కథ ఒక దృష్టాంతం. రుగ్వేదంలో ఆమె ఒక అప్సరస. ఆమె పురూరవ చక్రవర్తికి కుమారుడిని కని తర్వాత అతనికి శాశ్వతంగా దూరమవుతుంది. వెళ్ళిపోయే ముందు స్త్రీలతో స్నేహాలంటూ ఉండవని, వారి మనస్సులు నక్కలను పోలినవని సలహా ఇస్తుంది. పురూరవుడు తమ మొదటి ఒప్పందానికి భిన్నంగా ప్రవర్తించి, తనకు ఇష్టంలేకపోయినా రోజుకు మూడుసార్లు సంభోగం జరిపేవాడని ఫిర్యాదు చేస్తుంది. రక్షించవలసిన నీవే నీ శక్తిని నాకు వ్యతిరేకంగా ఉపయోగించావని అంటుంది. కాని ఇదే కథ శతపథ బ్రాహ్మణంలో వచ్చినప్పుడు ఊర్వశి తానే రోజుకు మూడుసార్లు సంభోగాన్ని కోరుతుంది. అయితే తనకు కోరిక లేనప్పుడు దగ్గరకు రావద్దని మాత్రం అంటుంది. ఇందులో అర్థమయేదేమిటి? రుగ్వేదంలో ఆమె కోరికకన్నా పురూరవుని కోరికకు ప్రాధాన్యత లభించగా, శతపథ బ్రాహ్మణంలో ఊర్వశి భావన ప్రధానంగా మారింది. లేదా కనీసం పురూరవుని కోరికతో సమానస్థానం లభించింది. రెండవకథలో స్త్రీకి సంతృప్తిలేదనే అంతరార్థం కూడా ఉంది. అది హిందూ పురాణాలలో ఒక సమస్యగా మారి నిరంతరం కనిపిస్తుంది. రుగ్వేదంలోని ఊర్వశి, పురూరవుడు తన హామీకి విరుద్ధంగా ఆమెకు నగ్నంగా కనిపించటంతో ఆయనను విడిచి వెళ్ళేందుకు సిద్ధపడుతుంది. తను వెళ్ళిపోయిన తర్వాత ఆమె కోసం పురూరవుడు విరహంలో కుమిలిపోతుంటాడు. తనను స్వర్గంలో తిరిగి కలుసుకోగలనని ఆశిస్తాడు. బ్రాహ్మణాల కథ ప్రకారం ఆమెకు పురూరవునిపట్ల అమితమైన ప్రేమ కలగటంతో తనతో ఉండిపోయి, గంధర్వునిగా మారటం ఎట్లాగో ఆయనకు నేర్పుతుంది.

## మరణం

బలులవల్ల మరణం పట్ల కలిగే భయాన్ని పోగొట్టటం అవసరమని వేదాలు భావించాయి గాని అప్పుడది ప్రధాన విషయం కాదు. కాని బ్రాహ్మణాల కాలంలో అది ముఖ్యంగా మారింది. మనుషులు మరణానంతరం వెళ్ళే మరో లోకం గురించి వేదాలు చెప్పగా, బ్రాహ్మణాలు ఆ నమ్మకాన్ని ఇంకా బాగా తీర్చిదిద్దాయి. ప్రాణత్యాగం వల్ల మనుషులు చిరంజీవులవుతారు. మరొక జన్మ లభిస్తుంది. బ్రాహ్మణాల రచయితలు మనుషులలో వార్ధక్యం గురించి, మరణం గురించి ఉన్న భయాలను పోగొట్టేందుకు అనేక సూత్రీకరణలను ముందుకు తెచ్చారు. పునర్జన్మల సిద్ధాంతం అటువంటిదే. ఒకసారి మరణించినా తిరిగి జన్మించటమే తప్ప ఎవరికీ శాశ్వత నిర్మూలన అన్నది ఉండదు.

శరీరంపోయినా ఆత్మలు జీవించి ఉంటాయి. మరొక శరీరంలో ప్రవేశిస్తాయి. ఈ పునర్జన్మల క్రమాన్ని ఉపనిషత్తులు బాగా వివరించాయి.

బ్రాహ్మణాలలో జానపద కథలు అనేకం ఉన్నాయి. ప్రత్యామ్నాయ చరిత్రలను, బ్రాహ్మణేతరుల అభిప్రాయాలను స్వీకరించటానికి ఇదొక ఉదాహరణ. తర్వాత పందొమ్మిదవ శతాబ్దిలో జానపద సాహిత్యకారులు గ్రామాలలో జానపద కథలు కొన్ని సేకరించారు. వాటికి, బ్రాహ్మణాలలోని జానపద కథలకు మౌలికంగా తేడాలు కన్పించవు. బ్రాహ్మణాలలోని తక్కిన భాగాలకు వాడిన సంస్కృతం కన్నా ఈ కథలలో కన్పించే సంస్కృతం సరళంగా, సూటిగా ఉంటుంది కూడా. సంప్రదాయకమైన సాహిత్యంలో జానపదాలను చేర్చటమన్నది బ్రాహ్మణాలు చేసిన విప్లవాత్మకమైన చర్య అనాలి.

ఇంతకూ ఆ రసవిహీనమైన సంస్కృత గ్రంథాలలో ఈ జానపద కథలకు పనేమిటి? ఇందుకు బ్రాహ్మణాలే రకరకాల వివరణలిచ్చాయి. రుగ్వేదంలో మినహాయించిన వివరాలను తెలియజెప్పటమని, ఒక రుషి ఒక మంత్రాన్ని ఏ పరిస్థితులలో రాశాడో పేర్కొనటమని, ఒక బలిని ఒకానొక పద్ధతిలో ఎందుకిచ్చారో వివరించటమని బ్రాహ్మణాలు ఆ జానపద కథల గురించి అన్నాయి. ఒకోసారి అవసరార్థం ఆ కథలను వక్రీకరించటమూ ఉంది. ఇవన్నీ ఎట్లున్నా, అప్పటి వైదికేతరమైన సామాన్యుల ప్రపంచం ఏవిధంగా ఉండేదీ మనకు ఆ కథలను బట్టి కొంత తెలుస్తుంది. అయితే ఆ కథలను చేర్చటంలోని నిజమైన ఉద్దేశాలేమిటో మనకు తెలియదు.

## దుష్టశక్తుల బలం

దేవతల శత్రువులు (ఆకాశంలోని అసురులు, భూమిపైని రాక్షసులు) యాగాలను భంగపరచేందుకు, ఆ ప్రదేశంలోకి చొరబడి వచ్చేందుకు, బయటినుంచే అపవిత్ర పరచేందుకు ప్రయత్నిస్తుంటారు. వీటిని నిరోధించేందుకు పూజారులు, లేదా రుషులు చాలా శ్రమపడతారు. కాని ఈ సమయానికి పరిస్థితులు మారాయి. దేవతలు, మనుషులు కలిసి దుష్టశక్తులపై యుద్ధంచేయటంగాక దేవతలు మనుషులపైన, దుష్టశక్తులపైన కూడా యుద్ధం ప్రకటిస్తారు. అసురులు రాక్షసుల వలె మారుతారు.

చెడు అన్నది దేవతలలోనే ఉత్పన్నమై అసురులకు, మనుషులకు వ్యాపిస్తుంది. ఇంకా చెప్పాలంటే చెడు ప్రజాపతి నుంచే ఆరంభమవుతుంది. ఆయన సృష్టి కార్యానికి పూనుకొని తానే చెడుకు లోనవుతాడు. ఒక కథ చెప్పే దాని ప్రకారం, ఒక బ్రాహ్మణుడు తనలోని చెడును సంపదలుగా మార్చి వాటిని గోవులు, నిద్ర, ఛాయలలో నిక్షిప్తం చేస్తాడు. ఆ విధంగా తన చెడును వదల్చుకుంటాడు. మరొక కథలో దేవతలు చెడును మోహం, కల్మషం, పాపం అనే రూపాలలో సృష్టించి వాటిని మనుషులకు బదిలీ చేస్తారు. ఆ విధంగా మానవులు దేవతలకు బలి పశువులవుతారు. ఒక కథలో ఇంద్రుడు వృత్రాసురుడనే

బ్రాహ్మణుడిని (బ్రాహ్మణాలు, ఆ తర్వాతి రచనలు కూడా వృత్రుడు దస్యు బ్రాహ్మణుడు అయినప్పటికీ బ్రాహ్మణునిగానే పరిగణిస్తాయి. అందులో దస్యు లేదా అసుర ప్రస్తావన ఉండదు.) సంహరించినప్పుడు ఆ దోషం తను మితిమీరి సేవించిన సోమరసంతోపాటు బయటకు వెలువడుతుంది. ముక్కులోంచి వచ్చింది సింహంగా, చెవుల నుంచి వచ్చింది నక్కగా, శరీరంలోని కింది భాగాలను నుంచి వెలువడింది పులులు, ఇతర క్రూర జంతు వులుగా మారుతుంది. అనగా, దేవుని నేరం మనుషులకు క్రూర జంతువులుగా దాపు రిస్తుందన్న మాట. దేవుడు మాత్రం క్షేమంగా ఉంటాడు. అదే ఇంద్రుడు మరొక బ్రాహ్మణుడి ప్రాణాలు తీసినప్పుడు ఆ పాపాన్ని మూడు భాగాలుగా ఇతరులకు పంపిణీచేసి, దానిని స్వీకరించినవారికి పరిహారాలిచ్చినట్లు మరొక కథ చెప్తుంది. ఉదాహరణకు, ఒక మూడవ వంతు పాపాన్ని తీసుకున్న చెట్లతో ఇంద్రుడు, వాటిని ఎవరైనా నరికినట్లయితే మరిన్ని కొమ్మలు పుట్టుకు రాగలవని వరమిస్తాడు.

ఇంద్రుడు పాపిగా ఉన్నంతకాలం భూమిపై సస్య సంపదల పెరుగుదల సరిగా ఉండదు. అందువల్ల తన పాపంలో కొంత భాగాన్ని స్వీకరించటం భూమికి, చెట్లకు, స్త్రీలకే మంచిది. వారి ఫలయోగ్యత పెరుగుతుంది. మొత్తానికి పెద్దవారు తమ దోషాలను మామూలు వారికి ఏవిధంగా రకరకాల ఉపాయాలతో బదిలీ చేస్తారో ఈ కథలు చెప్తాయి. భూమిపై కనిపించే చెడు అన్నది సాధారణంగా సురులు, అసురుల మధ్య జరిగే ఘర్షణ నుంచి ఉత్పన్నమై భూమిపైకి, మనుషుల మధ్య బదిలీ అవుతుంది. ఈ సందర్భంలో ఒక కథను గమనించండి.

> దేవతలు, అసురులు, మనుషులు, చెడు సురులు, అసురులు ఘర్షణ పడుతున్నారు. దేవతలు ఒక పదునైన పిడుగును సృష్టించారు. ఆ పిడుగే మనిషి (పురుషుడు). దానిని వారు అసురులపై ప్రయోగించగా వారు చెల్లాచెదరయారు. కాని తర్వాత ఆ పిడుగు దేవతలపైకే తిరిగింది. అది చూసి భయపడిన దేవతలు దానిని మూడు ముక్కలు చేశారు. కాని వేదమంత్రాల రూపంలో దైవ లక్షణాలు మనుషులలో ప్రవేశించినట్లు కనుగొంటారు. అప్పుడు, ఒకవేళ మానవుడు ఈ మంచి లక్షణాలతో జీవించినట్లయితే బలులు, సత్కార్యాలు, తపశ్శక్తితో మనలను అనుసరించగలడు. దీనిని నిరోధించేందుకు మనం ఏదైనా చేయాలంటారు. అని తనలో చెడును ప్రవేశపెడతారు. నిద్ర, అజాగ్రత్త, ఆగ్రహం, ఆకలి, జూద వ్యసనం, స్త్రీ వ్యామోహం అన్నవి ఆ లక్షణాలు. ఇహ లోకంలో పురుషుడిని బాధించేవి, పీడించేవి ఇవే. ఈ విషయం తెలిసిన మనిషికి దేవతలు హాని కలిగించరు. కాని ఇది తెలిసిన మనిషికి హాని కలిగించ జూసే మరొక మనిషిని మాత్రం నాశనం చేస్తారు.

ఈ కథలో దేవతలు తాము స్వయంగా పరిష్కరించుకోలేని అవలక్షణాలను మనిషికి కలిగిస్తారు. ఆ పని ఉద్దేశ్యపూర్వకంగా చేస్తారు. మనుషులు స్వర్గానికి వెళ్ళలేకుండా

చేయటం వారి ఉద్దేశం. దేవతలకు, మనుషులకు మధ్య సంబంధాలు లోగడకన్నా ఈ విధంగా మారటం, తర్వాత కాలంలోనూ కొనసాగింది.

ఈ విధమైన మార్పు ఈ దశలో ఎందువల్ల కలిగినట్లు? వేర్వేరు రాజ్యాల మధ్య విభేదాల పెరుగుదల, సంపదలూ అధికారం కోసం ఇనుమడించిన స్పర్థలు, గంగా లోయ ప్రాంతంపై ఆధిపత్యం కోసం పాకులాటల మూలంగా, చెడును ఏవిధంగా ఎదుర్కొనాలనే ప్రశ్నలు తలెత్తి, కథలలోకి కూడా ఇటువంటి దృక్కోణాలు వచ్చి చేరి ఉంటాయి. రెండు అగ్రవర్ణాల అధికారం పెగటం, దాని దుర్వినియోగాన్నిబట్టి చూసినప్పుడు, దేవతలను కూడా నైతికంగా తటస్థులుగా కాక, బలవంతులు, స్వార్థపరులైన రాజులు, బ్రాహ్మణుల వలె చూసి ఉండవచ్చు.

## అధ్యాయం 7

# ఉపనిషత్తులలోని పరిత్యాగం

## క్రీపూ. 600 నుంచి 200

కాలక్రమణిక (అన్ని సంవత్సరాలు క్రీ.పూ. కాలానివి)

| | |
|---|---|
| సుమారు 600–500 | : అరణ్యకాల రచన |
| సుమారు 500 | : శ్రౌత సూత్రాల రచన |
| సుమారు 500–400 | : తొలి ఉపనిషత్తుల (బృహదారణ్యక, ఛాందోగ్య, కౌశితకి) రచన |
| సుమారు 500 | : పాటలీపుత్ర నగర స్థాపన. దక్షిణ ప్రాంతాలకు వైదిక ప్రజల పయనం |
| సుమారు 483 లేదా 410 | : బుద్ధుని మరణం |
| సుమారు 400–1200 | : అనంతర ఉపనిషత్తుల (కఠ, శ్వేతశ్వతర, ముండక) కూర్పు |
| సుమారు 300 | : గృహ్య సూత్రాల రచన |

### సత్యకాముని తల్లి

*ఒకప్పుడు సత్యకామ జాబాల, తన తల్లి అయిన జాబాలను, 'అమ్మా, నేను వేద విద్యార్థిగా జీవించదలిచాను. నా పురుష పూర్వీకుల గోత్రమేమిటి?' అని ప్రశ్నించాడు. అందుకామె, '...నీ పురుష పూర్వీకుల గోత్రమేమిటో నాకు తెలియదు. నేను చిన్నదానిగా ఉండి పనిచేస్తుండినప్పుడు చాలా తిరిగాను. నిన్ను కన్నాను. నా పేరు జాబాల. నీ పేరు సత్యకామ. కనుక, నిన్ను నీవు సత్యకామ జాబాలిగా ఎందుకు చెప్పుకోవు?' అన్నది. అప్పుడా బాలుడు, హారిద్రుమత కుమారుడు గౌతముని వద్దకు వెళ్ళి తన వద్ద విద్య నభ్య సించగలనని కోరుతాడు. తన గోత్రమేమిటని గౌతముడు అడగగా, తన తల్లి అన్నదే ఆయనకు చెప్తాడు. అందుకు గౌతముడు, 'బ్రాహ్మణుడు కానివాడు ఆ మాట అనలేదు. నువ్వు సత్యం నుంచి వైదొలగలేదు. నేను నీకు విద్యను నేర్పుతాను' అని హామీ ఇస్తాడు.*

ఛాందోగ్యోపనిషత్తు (క్రీ.పూ. 600 ప్రాంతం)

### ఉపనిషత్తుల సామాజిక, రాజకీయ ప్రపంచం

ఆ కాలంలో గంగానది తూర్పు ప్రాంతంలో (క్రీ.పూ. 7 నుంచి 5వ శతాబ్దాలు) పలు రాజ్యాలుండేవి. వాటిలో రాజగృహ రాజధానిగా కల మగధ రాజ్యం, కాశీనగరం

రాజధానిగా కల కోసల – విదేహ రాజ్యం ప్రధానమైనవి. ముఖ్యంగా లోహాలు, వస్త్రాలు, ఉప్పు, మట్టి పాత్రలు, అశ్వాల వ్యాపారం బాగా సాగుతుండేది. వేదకాలం తర్వాత ఏర్పడిన ద్రవ్య ఆధారిత ఆర్థిక వ్యవస్థ కారణంగా కర్మ సిద్ధాంతం లోగలకన్న బలపడింది. వ్యాపారాలు జరిగేచోట మనుషులు ఇళ్ళ నుంచి బయటకు వెళతారు, కొత్త వ్యాపార తరగతులు ఏర్పడతాయి, కొత్త ఆలోచనలు వ్యాపిస్తాయి. అదే జరిగింది. వేదాలన్నవి ఒక నిర్దిష్ట మత గ్రంథం కావు. ఒకవేళ అటువంటి గ్రంథం ఏదైనా ఉండినా దానిని అమలుపరచే కేంద్రీకృత మతాధికార వ్యవస్థ కూడా అప్పుడు లేదు.

అప్పటి రాజవంశాల ప్రోత్సాహంతో వ్యాపారం వృద్ధిచెందింది. కాని ఒక బ్రాహ్మణ రచన వారిని క్షుద్ర క్షత్రియులని, శూద్రులని నిందించింది. వారు బ్రాహ్మణులను గౌర వించరని, వేదాచారాలను పాటించరని రకరకాల విమర్శలు చేస్తూ, తమ ధనాన్నంతా వ్యాపారంపై వెచ్చిస్తారన్నది. అప్పుడు రెండే తరగతులుండేవి. ఒకటి పాలకుల తరగతి, రెండవది బానిసలు, కూలీల తరగతి. ఇది బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని దెబ్బతీసేది. మహావీరుడు, గౌతమ బుద్ధుడు ఇరువురు కూడా ఇటువంటి పాలకుల వంశాలలో జన్మించిన వారు కావటం గమనించదగ్గది. ఆ రాజ్య వ్యవస్థలలో తగినంత వ్యక్తిగత స్వేచ్ఛ ఉండేది. ఎవరు ఏ వృత్తినైనా చేపట్టవచ్చు. ఈ పరిస్థితుల మధ్య బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల మధ్య విభజన రేఖలు బలపడసాగాయి. అంతేగాక పారియాల రూపంలో ఒక పంచమ వర్గం స్పష్టంగా రూపు తీసుకోసాగింది.

ఆ విధంగా సమాజంలో బృహత్తరమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఆలోచనలు ఉపనిషత్తులలో ప్రతిఫలించటం విశేషం కాదు గాని, వాటిని బ్రాహ్మణులు వాటిలోకి చేరనివ్వటమన్నది గమనించదగ్గది. అధికారంలోకి కొత్తవర్గాలు రావటంతో వత్తిడి ఏర్పడినందున, అవి బ్రాహ్మణ సంప్రదాయాలకు విరుద్ధమైన ఆలోచనలు అయినప్పటికీ, వాటికి ఉపనిషత్తులలో చోటు లభించింది. ఉపనిషత్తులు వేదాలలో భాగమన్న విషయాన్ని బట్టి కూడా ఆ బ్రాహ్మణేతర ఆలోచనలు ఉపనిషత్తులలోకి రాకుండా ఆగలేదు.

## ఉపనిషత్తులలో ఏముంది?

వేదవేదాంగాలన్నింటిని కలిపి శ్రుతి సాహిత్యమన్నారు. అనగా ఒకరి నుంచి ఒకరు వినేవి. ఆ సాహిత్యపరంపరలో ఉపనిషత్తులు చివరివి అయినందున వేదాంతాలని వ్యవహరించారు. ఇవి భగవంతుడి నుంచి ప్రత్యక్షంగా వచ్చినవి గనుక వాటినెవరూ మార్చేందుకు వీలులేదు. తక్కిన హిందూ సాహిత్యాన్ని స్మృతులన్నారు. అవి మనుషులు రచించినవి. వాటిలో తప్పులు దొర్లవచ్చు. వాటిని అవసరమైనప్పుడు దిద్దే అవకాశం ఉంటుంది. వేదాలకు బ్రాహ్మణులవలె, బ్రాహ్మణులకు ఉపనిషత్తులు భాష్యాల వంటివి.

ఉపనిషత్తులు వైదిక సంప్రదాయాలలోని వేర్వేరు శాఖలకు, కుటుంబ గోత్రాలకు సంబంధించినవి. అదే సమయంలో వాటి ఆలోచనలు, కథల మధ్య అనేక సామ్యాలు కనిపిస్తాయి.

బ్రాహ్మణాలకు, ఉపనిషత్తులకు మధ్య వారధి వంటివి అరణ్యకాలు. ఆ రెండింటిలోని పలు అంశాలు కూడా అరణ్యకాలలో కనిపిస్తాయి. వాటిలో తాత్త్విక విచారణ, విశ్వ సందర్శన ఉపనిషత్తులకన్నా తక్కువ. ఆచారాలు, సంప్రదాయాలు ఎక్కువగా ఉంటాయి. బ్రాహ్మణాలలోని సంస్కృత భాషకు, ఉపనిషత్తుల సంస్కృతానికి తేడా ఉంది. భాషలో, వ్యాకరణంలో, పదజాలంలో, శైలిలో కూడా. ఇది ఎక్కువ సరళమైంది. ఉత్తర భారతంలోని పట్టణాలు, గ్రామాలలో ప్రజలు ప్రాకృత భాషలు మాట్లాడేవారు. ఇంచుమించు ఉపనిషత్తుల కాలంవాడే అయిన బుద్ధుడు ఎక్కువమంది ప్రజలకు చేరేందుకు మాగధీ భాషలో బోధించాడు. తన బోధనలను శిష్యులు పాళీ భాషలో నిక్షిప్తం చేశారు. ఉపనిషత్తులలోని సంస్కృతం సరళంగా మారటం ఈ ప్రభావాల వల్లనే కావచ్చు. పోతే, కుటుంబీకులకు, పరిత్యాజకులకు మధ్య భిన్నత్వాలు, ఉద్రిక్తతలు ఈ దశలోనే మొదలయ్యాయి. వీటి ప్రభావం అనంతర కాలపు హిందూమత చరిత్రపై గణనీయంగా ఉంది.

## కర్మ, మరణం, పునర్జన్మ

కర్మ, పరిత్యాగం అనే విప్లవాత్మకమైన ఆలోచనలు ఎక్కడి నుంచి వచ్చాయి? ఇందుకు మూలాలు వైదిక, వైదికేతర ఆధారాలలో ఉన్నాయి. మొదట వేదాలను పరిశీలిస్తే, చనిపోయిన మనిషి శరీరం పంచభూతాలను చేరుతుందని రుగ్వేదంలో ఉంది. కాని మరణాన్ని వివరించటానికి ఇది ఆరంభమే తప్ప అంతం కాదన్నది ఉపనిషత్తుల అభిప్రాయం. యాజ్ఞవల్క్యుడు ఒక శిష్యుని ప్రశ్నకు సమాధానమిస్తూ, శరీరాంగాలన్నీ పోయిన తర్వాత మిగిలేది ఆత్మ అని, అది బ్రహ్మతో సమానమని అన్నాడు. అదేవిధంగా, మంచి కర్మలు చేసినవాడు మంచి మనిషి, చెడు కర్మలు చేసినవాడు చెడ్డమనిషి అవుతాడని చెప్పాడు.

'కర్మ' అనే మాటకు మౌలికార్థం చర్య, లేదా పని. రెండవ అర్థం సంప్రదాయికమైన ఆచారం. అది ముఖ్యంగా వైదికమైనది. రుగ్వేదంలో ఉద్దేశించింది ఈ రెండవది. ఉపనిషత్తులలో కన్పించే మూడవ అర్థం 'మంచిదైనా, చెడుదైనా నైతిక ప్రేరణతో చేసే పని'. నాల్గవ అర్థం, 'ఇదే జీవితంలోగాని, తర్వాత జన్మలో గాని ప్రభావం చూపగల చర్య' అన్నది. దీనినే తిరగవేసి అయిదవ అర్థాన్ని చెప్పారు. అది, గత జన్మ కర్మఫలాన్ని ఈ జన్మలో అనుభవించటం. చివరిదైన ఆరవ అర్థం కర్మఫలాన్ని ఇతరులకు బదిలీ చేయగలగటం. ఈ బదిలీ ఉద్దేశపూర్వకంగా జరగవచ్చు, అనుద్దేశపూర్వంగానైనా. అయితే ఈ కర్మ సిద్ధాంతాన్ని ఆ కాలంలో అందరూ ఆమోదించలేదు. అందుకు భిన్నమైన అభిప్రాయాలు కూడా ప్రచారంలో ఉండేవి. వాటిని నమ్మేవారు కూడా.

ఆత్మల పరకాయ ప్రవేశం ద్వారా పునర్జన్మలన్న చర్చ, ఒక ఉపనిషత్తులో ఒక గురువు తన శిష్యుడిని, ' ఎందరు వెళ్ళినప్పటికీ పరలోకం నిండిపోకుండా ఉండటానికి కారణం ఏమిటో తెలుసా?' అని ప్రశ్నించటంతో ఆరంభమవుతుంది. ఎందుకంటే 'ఆ లోకం ఎప్పుడూ పూర్తిగా నిండదు.' భూమి జనంతో కిక్కిరిసిపోవటమన్న భయం నుంచి చాతుర్యుగాల కథ పుట్టుకువచ్చి ఉంటుంది. త్రేతాయుగంలో ప్రజలు సుదీర్ఘ కాలం జీవించటంవల్ల జనసంఖ్య పెరిగిపోయింది. జనసంఖ్య తగ్గేందుకే మహాభారత యుద్ధం జరిగిందనే ఆలోచన ఉంది. జనసంఖ్య పెరిగి హరప్పాలో మురికివాడలు ఏర్పడ్డాయన్నది ఒక విశ్లేషణ. గంగాలోయ నగరాలలోనూ ఇదే జరగవచ్చుననే భయాలు ఏర్పడి ఉంటాయా? కాశీ నగరంలో మురికివాడలుండేవా?

వరిసాగు గంగాలోయ ప్రాంతానికి విస్తరించటంతో నగరాలకు ధాన్యాన్ని సరఫరా చేయగల మిగులు ధాన్యం అందుబాటులోకి వచ్చింది. దానితో మరొక విడతగా నగరాల నిర్మాణం, విస్తరణ జరిగాయి. జనసాంద్రత ఎన్నడూ లేనంతగా పెరిగింది. ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశం ఇండియా అని హెరొడోటస్ క్రీ.పూ. అయిదవ శతాబ్దంలోనే రాసాడు. ఈ పరిస్థితులు మనుషుల జీవితాలపై వత్తిడిని సృష్టించి ఉండాలి. వారంతా లోగడ ఈ వత్తిడులు లేక స్వేచ్ఛగా ఆరుబయళ్ళలో, అడవులలో జీవించినవారు. అటువంటి జీవితాలను తిరిగి కోరుకోవటం అరణ్యకాల పేరిట చేసిన రచనలో ప్రతిఫలించిందనాలి. ఆ వత్తిడులు సామూహికంగానే గాక వ్యక్తిగతంగా కూడా ఉండి ఉండాలి. ఈ సమస్యలకు మరణం, ఆత్మల ప్రయాణం, పునర్జన్మ అన్నవి పరిష్కారాలుగా తోచి ఉండవచ్చు. మత పరమైన అనుభవాలను కూడా బ్రాహ్మణాలకన్న తర్వాత కాలపు ఉపనిషత్తులు ఎక్కువ వ్యక్తిగతమైన వాటిగా మార్చాయి.

ఈ పరిస్థితులలో మరణాలు, పునర్జన్మలు ఏవిధంగా జరుగుతాయనే క్రమాన్ని వర్ణించే కథలు బృహదారణ్యకోపనిషత్తులో, చాందోగ్యోపనిషత్తులో, కౌశీతకి ఉపనిషత్తులో కనిపిస్తాయి. ఉదాహరణకు, కొంత భిన్నంగా కన్పించే కౌశీతకి ఉపనిషత్తులోని వర్ణన ఈ విధంగా ఉంది.

## తుది పరీక్ష

మానవులు ఈ లోకం నుంచి నిష్క్రమించినప్పుడు చంద్రుని పైకి వెళతారు. చంద్రుని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేని వారు వర్షంగా మారి భూమిపైకి కురుస్తారు. అక్కడ తమ తమ కర్మానుసారం పురుగు, క్రిమి, చేప, పక్షి, సింహం, అడవిపంది, ఖడ్గమృగం, పెద్దపులి, మనిషి లేదా మరేదో జీవిగా జన్మిస్తారు. చంద్రుని ప్రశ్నలకు సరైన సమాధానా లిచ్చిన వారు స్వర్గానికి చేరుతారు. దేవతల మార్గంలో ప్రయాణించి అగ్నిలోకి, చివరగా బ్రహ్మ వద్దకు వెళతారు. ఆ ప్రయాణ క్రమంలో

తమ సత్కర్మలను, దుష్కర్మలను కూడా జారవిడుస్తారు. అవి వారి బంధువులను ఆశ్రయిస్తాయి. సత్కర్మలు వారికి నచ్చేవారిపైన, దుష్కర్మలు నచ్చనివారిపైన. ఆ విధంగా సకల కర్మలనుంచి ముక్తుడైన మనిషికి అప్పటికే బ్రహ్మ గురించిన పరిజ్ఞానం ఉన్నందున ఆ బ్రహ్మలో లీనమవుతాడు.

ఈ పరీక్షకు ఆ వ్యక్తి జీవించి ఉండగా ఏవిధమైన పూజలు చేశాడు, నివసించింది గ్రామంలోనా లేక అడవిలోనా అన్న వాటితో నిమిత్తంలేదు. చివరిలో జరిగే పరీక్షను బట్టి అంతా నిర్ణయమవుతుంది. పరీక్షలో ఉత్తీర్ణుడైన తర్వాత బ్రహ్మలో విలీనమయే సమయం లోనే మంచి చెడుల ప్రసక్తి వస్తుంది. అయితే, దీనిపై వేర్వేరు ఉపనిషత్తులలో భిన్నమైన కథనాలున్నాయి. అవి ఆయా రచయితల సమకాలీన పరిస్థితులను, మనోభావాలను ప్రతిఫలిస్తాయనాలి.

మనుషులు కుటుంబ జీవితాలు గడపటం, సంతానం అనే విషయాలు వేద కాలంలో వలెనే ఉపనిషత్తుల కాలానికి కూడా కొనసాగాయి. అయితే అందుకు సంబంధించి ఉప నిషత్తులలో ఎక్కువ వివరాలు లేవు. అవి వందల సంవత్సరాలుగా అందరికీ తెలిసినవేనన్న భావన అందుకు కారణం కావచ్చు. అదెట్లున్నా ప్రేమలు, కుటుంబం, వ్యామోహాలు, లాభనష్టాలు చుట్టూ తిరుగుతూ సంపారం పట్ల భావనలు బలంగానే కనిపిస్తాయి.

మరణించిన వారి ప్రయాణం ఏవిధంగా సాగుతుందనే విషయమై బృహదారణ్యకోప నిషత్తు రెండు మార్గాలను పేర్కొంది. సత్యాన్ని ఆరాధించినవారు, ఆత్మకు బ్రహ్మకు అబేధ్యాన్ని గుర్తించివారు అగ్నిలో ప్రవేశించి దేవతలలో లీనంకాగా, బలులను, కానుకలను ఇవ్వటం వంటివి చేసినవారు పొగలో కలసిపోతారని. ఈ అగ్ని, పొగ చితి మంటలకు సంబంధించినవి. ఈ రెండు మార్గాలను వివరించే క్రమంలో బృహదారణ్యక ఉపనిషత్తు సంతానోత్పత్తి గురించిన చేసిన వర్ణనలో తగినంత ఉద్రేకం కూడా కనిపిస్తుంది. సంతానో త్పత్తి గురించి చేసిన వర్ణనలో తగినంత ఉద్రేకం కూడా కనిపిస్తుంది. సంతానోత్పత్తి అన్నది పురుషుని అగ్నిలో జరిగే నైవేద్యమని, శిశువు పుట్టుక స్త్రీ అగ్నిలో జరిగే నైవేద్య మని అంటాయి. స్త్రీ జననాంగాలను యాగాగ్నిగా, సమిధలుగా వర్ణిస్తాయి. పొత్తి కడుపు కింద జుట్టు పొగ కాగా, యోని అన్నది అగ్ని. సంభోగ క్రియ నిప్పులు, రవ్వలు. సంభోగ క్రియ పరాకాష్టకు చేరటం కలలంటూలేని గాఢమైన నిద్రతో పోల్చదగినది. స్త్రీ సంతాన వతి కాగల నెలసరి దశలో ఉన్నప్పుడు దివ్యమైన, శుభప్రదమైన వ్యక్తి అవుతుంది. ఆమె సంతానవతి కావటం ఎంత ముఖ్యమైనదంటే, ఒకవేళ ఆ సమయంలో ఆమె శృంగారానికి అంగీకరించినట్లయితే తనకు కానుకలిచ్చి మచ్చిక చేసుకోవాలని, లేదా కర్రతోనో, పిడికిళ్ళ తోనో కొట్టి దారికి తెచ్చుకోవాలని ఉపనిషత్తులు సలహా ఇచ్చాయి. శృంగారానికి ఒకే లక్ష్యం సంతానోత్పత్తి అని ధర్మశాస్త్రాలు వాదించగా, ఉపనిషత్తులలోని ఒక మంత్రం,

పురుషుడు తన భార్య తనను ప్రేమించాలంటే సౌమ్యంగా వ్యవహరించాలని, ఒకవేళ ఆమె గర్భవతి కాదలచుకోనట్లయితే అందుకు తగిన పద్ధతులను అనుసరించాలని చెప్తుంది.

భార్యకు వేరే ప్రియులు ఉన్నప్పుడు ఏమి చేయాలన్న ప్రశ్నపై ఆసక్తికరమైన కథనం ఒకటి అదే బృహదారణ్యకోపనిషత్తులో చూడవచ్చు. అటువంటి సందర్భాలలో సాధారణంగా భార్యలను శిక్షిస్తారు. కాని ఇందులో ఆమెను మినహాయించి ఆ ప్రియుడిపై చర్యలుంటాయి. అది కూడా ఆ ప్రియుడు ఈ భర్తకు ఇష్టంలేని మనిషి అయితేనే. అదే విధంగా చర్యలన్నవి అతనిని నపుంసకుడిగా మార్చటం వరకే తప్ప భౌతికదాడుల వంటివి ఉండవు. నపుంసకునిగా ఎట్లా మార్చాలో ఆ మంత్రం వర్ణిస్తుంది. దాని ప్రకారం, ఒక పచ్చికుండలో అగ్ని రగిలించటం, పడుకునే తుంగ చాపను తిరగవేయటం, తుంగ గడ్డి కొసలకు నెయ్యి పూయటం, ఒక మంత్రం పఠిస్తూ ఆ గడ్డి ముక్కలను అగ్నిలో వేయటం వంటివి ఉంటాయి. స్త్రీని శిక్షించటమన్నది అనంతర కాలపు హిందూమతంలో కన్పించే పద్ధతి. అంతకు ముందటి కాలంలో పురుషుల ఆలోచనలు కేవలం వైదికమైనవి. అవి, కుటుంబం, స్త్రీలు, సంతానం, కుమారులు, వంశం కొనసాగుదల మాత్రమే. వారి దృష్టిలో, యజ్ఞకుండంలో నేతిని వేయటం ఎటువంటిదో స్త్రీ గర్భంలోకి వీర్యాన్ని ప్రవేశపెట్టటం కూడా అటువంటిదే. ఇష్టంలేని ప్రియుడు చేసే నేరం మరొకరి భార్య యజ్ఞకుండంలో హవిస్సుని వేయటమే.

కాని ఆ తర్వాత కాలపు మాండూక్యోపనిషత్తు దీనినంతా కొట్టివేసి, మనిషి పదే పదే మరణించటం సరికాదన్నది. పునర్జన్మ అన్నది కూడా మనిషిని తిరిగి బంధీ చేయటమే నని, కావలసింది ఈ బంధనాలన్నింటిని తెంచుకునే మోక్షమని భావించింది. మోక్షానికి అర్థం కూడా అదేనన్నది. కాని మొత్తంమీద మోక్షమంటే ఏమిటన్న సరైన నిర్వచనం కనిపించదు. ఆత్మ బ్రహ్మలో లీనంకావటం సరే. కాని బ్రహ్మమంటే ఏమిటి? ఇది కాదు, అది కాదు (నేతి, నేతి – న ఇతి, ఇతి) అనటమే కనిపిస్తుంది. అదేవిధంగా మనిషి దేని నుంచి మోక్షం పొందనున్నాడు? మరణం నుంచి విముక్తి పొందటమే మోక్షం అన్నారు మొదట. ఆ నిర్వచనానికి వైదిక సంప్రదాయమైన బలులలో మూలాలున్నాయి. బలయే వారికి ఏదో ఒక ప్రోత్సాహం ఉండటం అవసరం. ఈ పదం ఉపనిషత్తులలో అనేక అర్థాలలో కనిపిస్తుంది. దేహం నుంచి మోక్షం, సంసారం నుంచి మోక్షం, చావు పుట్టుకల వలయం నుంచి మోక్షం వగైరాలు.

మనుషులు తిరిగి జన్మించినప్పుడు ధనవంతులు లేదా పేదవారు, ఆరోగ్యవంతులు లేదా వ్యాధి పీడితులు కావటమన్నది వారి క్రితం జన్మల కర్మలపై ఆధారపడి ఉంటుందనే దానికి మూలాలు స్వర్గ నరకాలు, బహుమతి శిక్ష అనే వైదిక ఆలోచనల్లో ఉన్నాయి. వ్యక్తి ఆత్మను ప్రపంచపు ఆత్మ అనే బ్రహ్మతో లీనం చేయటం కూడా ఇటువంటి వైదిక

ఆలోచనే. దాని ప్రకారం మనిషి కన్ను సూర్యునితో చేరటం వగైరాల గురించి పైన చెప్పు కున్నాము.

ఉపనిషత్తులను కూర్చిన రుషులు వేదాల్లోని అంశాలను చర్చిస్తూ చాలా దూరం వెళ్ళారు. ఒకోసారి వాటితో విభేదించారు కూడా. ఒక రచయిత వేదంలోగల ఉపస్థితి రాహిత్యం నుంచి ఉపస్థితి ఏర్పడటం అనే వాక్యాన్ని పేర్కొంటూ, అదెట్లా సాధ్యమని ప్రశ్నిస్తాడు. సృష్టి ఆరంభంలో ఉన్నది ఈ ప్రపంచమేనని కూడా అంటాడు (ఛాందోగ్య). మనిషి ఆత్మకు బ్రహ్మతో అవినాభావం చెప్పడమంటే కార్యాచరణకు పూనుకొమ్మని చెప్పడమేనని ఒక ఉపనిషత్తు వ్యాఖ్యానించింది. అనగా మనుషులు తమ జీవితాలను మార్చుకోవడమన్నమాట. ఆ పని చాలామంది చేయలేదు. అయితే నిమ్నవర్గాలకు క్రమంగా ధనం, సమయం, విద్య అందుబాటులోకి రావటంతో వారిలో కొందరు వైదిక ప్రపంచం నుంచి పూర్తిగా బయటపడ్డారు. బ్రాహ్మణులతో ఎప్పుడూ సమానం కాలేకపోయిన వారికి, కాకుండా నిరోధింపబడినవారికి, గతంలో అటువంటి ఆలోచనలు అయినా లేనివారికి, ఉపనిషత్తులలోని కొన్ని అంశాలు ఆకర్షణీయంగా తోచాయి.

ఉపనిషత్తుల కాలానికి కొందరు పరిత్యాగులు ఉండేవారు. వారు వైదిక సంప్రదాయాల పరిధిలోనే వ్యవహరించేవారు. అటువంటి వారు బుద్ధునికన్నా ముందు నుంచి ఉండినట్లు బౌద్ధ గ్రంథాలు పేర్కొన్నాయి. బుద్ధుడు ఒక వ్యాధిగ్రస్తుడిని, ఒక వృద్ధుడిని, ఒకరి మృతదేహాన్ని, ఒక సన్యాసిని చూసినట్లు తన కథలో ఉంది. సన్యాసి అన్న వ్యక్తి వైదిక పరిత్యాగి అయి ఉండాలి. రుగ్వేదంలో ప్రస్తావించిన వ్రత్యులు, దీర్ఘ కేశుడైన పరిత్యాగి కూడా బహుశా సమాజానికి దూరంగా ఉండిన ఇటువంటి వైదిక తరగతుల వారై ఉంటారు. క్రీ.పూ. ఆరు, లేదా అయిదవ శతాబ్దం నాటికి పరిత్యాగ సంప్రదాయాలు ఏర్పడినట్లు ఉపనిషత్తులు కూడా పేర్కొన్నాయి. ఆ సంప్రదాయాలు వైదిక సంప్రదాయాల పరిధిలోనే ఉండేవి. కాని బ్రాహ్మణులలో కాదు.

వేదాలు పేర్కొన్న స్వర్గాన్ని కొందరు తిరస్కరించారు. కాని హిందూమత పరిధిలోనే కొనసాగి మోక్షం కోసం ప్రయత్నించారు. మరికొందరు మాత్రం బ్రాహ్మణులు తామిచ్చిన స్వర్గం, మోక్షం అనే రెండు హామీలలో దేనిని కూడా నిలబెట్టుకోరన్న అపనమ్మకంతో వైదిక ప్రపంచం నుంచి నిష్క్రమించి బౌద్ధులుగా, జైనులుగా మారారు. ఆ విధంగా నిష్క్రమణకు ఇంకా సిద్ధపడని బ్రాహ్మణేతరులలో కొందరు అప్పటి పూజారుల తీరును భరించలేక సన్యాసం, ధ్యానం వైపు మళ్ళి ఉండవచ్చు.

## బ్రాహ్మణేతర రహస్యాలు

ఉపనిషత్తులు తమ కొత్త ఆలోచనలలో కొన్ని క్షత్రియుల నుంచి వచ్చినట్లు పేర్కొన్నాయి. మోక్షానికి రెండు మార్గాలున్నట్లు శ్వేతకేతు అనే బ్రాహ్మణ యువకునికి

బోధించింది పాంచాల రాజ్యానికి చెందిన జైవళి ప్రవాహణ అనే రాజు. గార్గి అనే బ్రాహ్మణుడు కాశీ రాజైన అజాతశత్రును తనకు గురుత్వం వహించవలసిందిగా కోరుతాడు. అందుకు ఆ రాజు, బ్రాహ్మణుడు క్షత్రియునికి శిష్యుడు కావటం వారి పాత్రలు తారు మారు కావటం కాదా అని అడుగుతాడు. అయినా చివరకు ఆ బాధ్యత స్వీకరించినట్లు బృహదారణ్యకోపనిషత్తు చెప్తుంది. ఇటువంటి తారుమారును బట్టి, బ్రాహ్మణుల కాలంలో గురువులు బ్రాహ్మణులు అయినందున, ఉపనిషత్తుల కాలంవచ్చేసరికి బ్రాహ్మ ణేతరులు అందుకు ఈ విధంగా స్పందించారని భావించాలి. ఉపనిషత్తులలో కొత్త ఆలోచనలు వచ్చి చేరింది బ్రాహ్మణేతర వర్గాలకు చెందిన క్షత్రియుల నుంచి మాత్రమే కాదు. ఛాందోగ్యోపనిషత్తులోని ఈ కింది కథను చూడండి.

## బండి కింది మనిషి రైక్వా

జనశ్రుతి అనే రాజుకు దాన ధర్మాలంటే, ముఖ్యంగా అన్నదానమంటే, చాలా ఇష్టం. "ప్రతిచోట మనుషులు నేనిచ్చే ఆహారాన్ని తీసుకోవాలి" అనుకునేవాడాయన. ఒక రాత్రి కొన్ని అడవి కొంగలు పై నుంచి ఎగిరి వెళుతుండగా వాటిలో ఒకటి, "చూడు, జనశ్రుతి కాంతి ఆకాశంలో ఎట్లా నిండిపోయిందో !" అంటుంది. అందుకు మరొక కొంగ, 'జనశ్రుతి గురించి మాట్లాడటమెందుకు?' అంటూ రైక్వా గురించి చెప్తుంది. అందరు చేసిన మంచి పనుల ప్రతిష్టను తనపరం చేసుకునే నేర్పు రైక్వాకు ఉందని అంటుంది. కొంగలు చెప్పుకున్న ఈ మాటలు విన్న రాజు తన అధికారిని పిలిచి రైక్వా కోసం వెతక మంటాడు కాని రైక్వా కనిపించటంలేదని ఆ అధికారి వచ్చి చెప్పటంతో, బ్రాహ్మణేతరుల కోసం ఎక్కడైతే వెతుకుతావో అక్కడ వెతకమంటాడు. అప్పుడతనికి ఒక బండి కింద కూర్చుని తన పుళ్ళను గీరుకుంటున్న రైక్వా కనిపిస్తాడు. రాజు తన కోసం వందలాది ఆవులను, బంగారాన్ని స్వయంగా తీసుకువెళ్ళి, తను ఏ దేవతను ఆరాధించేదీ తెలప వలసిందిగా కోరుతాడు. కాని ఆ కానుకలను రైక్వా తిరస్కరిస్తూ, "వాటిని తీసుకుపో శూద్రుడా!" అంటాడు. అప్పుడు రాజు ఆ కానుకలతోపాటు తన కుమార్తెను కూడా ఇచ్చి పెళ్ళి చేయగలనంటాడు. ఆ మీదట రైక్వా అంగీకరిస్తాడు.

జనశ్రుతి రాజు, సంపన్నుడు. రైక్వా ఇల్లయినా లేని పేదవాడు. బ్రాహ్మణులు ఇష్టపడే ఆవులు, బంగారాన్ని తను కోరుకోడు. స్త్రీలను మాత్రం ఇష్టపడతాడు. తను జనశ్రుతిని శూద్రుడనటం సాహసంతో కూడుకున్న పని. ఇతరుల సత్కర్మల ఫలితాన్ని తాను పొందగల నేర్పు రైక్వాకు ఉంది. కర్మ ఫలాలు ఒకరి నుంచి మరొకరికి బదిలీ కావటమన్న దానికి ఈ కథ ఒక ఉదాహరణ. అయితే, రైక్వా పేదవాడు అయినందున ఇతరులు విడిచిపుచ్చిన పదార్థాలను ఏరుకునేవాడనే రెండవ అర్థం కూడా ఇందులో

ఉంది. ఆ విధంగా ఇతరులు విడిచిన వాటిని ఏరుకుని జీవించే వ్యక్తి, వారి సత్కర్మల ఫలితాలను కూడా తాను పొందుతాడు. తర్వాత కాలంలో మహాభారతంలో ఒక ముంగిస యుధిష్ఠిరునితో, గీరటం, శుభ్రపరచటం వంటివి ఎంత ముఖ్యమైనవో చెప్పడం గమనించ దగ్గది. జనశ్రుతి జంతువులు, పక్షుల భాషను అర్థం చేసుకోగలడు. తను ఆధ్యాత్మికంగా సాధించిన శక్తులకు అది గుర్తు. కాని తన రహస్య శక్తితో రైక్వా అంతకు మించినవాడయాడు.

రైక్వా కథ తర్వాత మనకు సత్యకామ జాబాలి కనిపిస్తాడు. తన తండ్రి ఎవరైనదీ తెలియదు. అటువంటి వ్యక్తిని ఒక ప్రాచీన హిందూ గ్రంథం అధ్యాత్మిక గురువుగా గుర్తించటం విశేషం. బ్రాహ్మణుడైనవాడు మాత్రమే వేదాభ్యాసం చేయాలని ఆ గ్రంథం చెప్తూనే, బ్రాహ్మణత్వానికి అర్హత పుట్టుకగాక సత్యమని స్పష్టం చేస్తుంది. 'ఒక బ్రాహ్మణుని తలిదండ్రులెవరో ఎందుకు తెలుసుకుంటున్నావు? ఎవరిలో జ్ఞానముంటే అదే అతని తండ్రి, తాత కూడా' అనే మాట ఒక బ్రాహ్మణంలో ఉండటాన్ని మనంపైన చూశాము. సత్యకామునికి వేదాభ్యాసం కోసం తన తండ్రివైపు వంశ వివరాలు తెలియవలసి ఉంటుంది. కాని, ఆయనకు తానేమైనదీ తనకు తెలిస్తే చాలునని ఛాందోగ్యోపనిషత్తు ప్రకటిస్తుంది. చివరకు సత్యకాముని గురువు మాత్రం తనను వంద బక్క చిక్కిన ఆవులను కాయవలసిందంటూ పంపుతాడు. సత్యకాముని ఆలనలో అవి బాగా వృద్ధి చెంది వేయి అవుతాయి. కొన్ని సంవత్సరాల తర్వాత ఎద్దు, అగ్ని, బాతు మొదలైనవి తనతో మాట్లాడుతాయి. బ్రహ్మ గురించిన నాలుగు పాదాల గురించి అవి తనకు బోధిస్తాయి. సత్యకాముడు ఆవులను వృద్ధిచేయటం వైశ్య లక్షణం. కాని వేర్వేరు జంతువులతో సంభాషించగలగటం మతపరంగా అసాధారణమైన ప్రతిభకు గుర్తు. సమాజంలోని ఏ తరగతి వారిలోనైనా అది అరుదైనదే.

## శ్రమణులు, బ్రాహ్మణులు

కర్మ సిద్ధాంతానికి మూలాలు వేదాలలో బలంగానే ఉన్నట్లు కనిపిస్తుంది. కాని ఆత్మను బ్రహ్మతో గుర్తించటం, ఆత్మలపరకాయ ప్రవేశం, పరిత్యాగం ద్వారా మోక్షం వంటి ఆలోచనలకు వేదాలతో ఎక్కువ సంబంధం ఉన్నట్లు తోచదు. ఆ కాలంనాటికి సన్యాసులు, యోగుల ఉద్యమాలు అనేకం ఉనికిలోకి వచ్చాయి. అవి వైదికేతరమైనవి. ఒకదాని నుంచి మరొకటిగా ఉద్భవించినవి కావచ్చు, స్థానిక ఆలోచనల నుంచి రూపు తీసుకున్నవి, వేదాలను తిరస్కరించినవైనా కావచ్చు. ఈ ఉద్యమాలు ఉపనిషత్తులపై ప్రభావాన్ని చూపి ఉండవచ్చు. కర్మ సిద్ధాంతంలోని పలు లక్షణాలు జైనమతం నుంచి వచ్చి, అక్కడి నుంచి బౌద్ధానికి, హిందూమతానికి ప్రయాణించినట్లు కనిపిస్తుంది. చిన్న క్రిములకు కూడా హానిచేయరాదన్న జైనుల శాకాహారపు ప్రభావం హిందూమతంపై గణనీయంగా ఉంది. ప్రధాన స్రవంతి నుంచి విడిపోయిన వర్గాలు బలులనే గాక, వేదాలు అపౌరుషేయాలన్న ప్రతిపాదనను తిరస్కరించాయి. బ్రాహ్మణవాద ప్రవచనాలను, వారికి

దైవదత్తమైన అధికారముందనే వాదనను కూడా కొట్టివేశాయి. ఆత్మల ఉనికిని, దేవతలను బౌద్ధం అంగీకరించలేదు. బ్రాహ్మణ్యం పుట్టుకవల్ల రాదని కొన్ని ఉపనిషత్తుల వలెనే అభిప్రాయపడింది. ఇవన్నీ హిందూమతంలోని ప్రధానమైన అంశాలు.

ఇదే కాలంలో వేర్వేరు మేధో సంప్రదాయాల మధ్య హోరాహోరీ వాద ప్రతివాదాలు సాగుతుండేవి. తర్వాత కాలంలో ఇవి మీమాంస, న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, వేదాంత అనే ఆరు ప్రధానమైన తత్త్వశాస్త్రాలుగా రూపొందాయి. అజీవికులు కర్మ సిద్ధాంతం లోని ముఖ్యభాగమైన చిత్త స్వాతంత్ర్యాన్ని, లోకాయతుల పునర్జన్మను నిరాకరించారు. భౌతికంగా అనుభవంలోకి వచ్చింది మాత్రమే నిజమైన జ్ఞానమని కూడా అన్నారు లోకాయతులు. అయితే వీరి గురించి మనకు తెలిసిన దానిలో అధికభాగం వారి ప్రత్యర్థులు చెప్పినటువంటిదే. అది వారికి న్యాయం చేసేదిగా లేదు. చివరకు క్రీ.శ. రెండవ శతాబ్దం నాటి కామసూత్ర కూడా భౌతికవాదం గురించి కొన్ని సాధారణమైన మాటలు మాత్రమే చెప్పింది. అవి ఈ విధంగా ఉన్నాయి: మతపరమైన కార్యకలాపాల ఫలితాలు మరొక లోకంలో లభిస్తాయనటం అనుమానస్పదం గనుక ప్రజలు అటువంటి కార్యకాలపాల వైపు వెళ్ళరాదు. తమ చేతిలో గలది మరొకరిచేత బెట్టేవారు అవివేకులు గాక మరేమిటి? అనుమానాస్పదమైన బంగారు నాణెంకన్నా నిశ్చితంగా లభించే రాగి నాణెం మేలు." దానినట్లుంచితే, క్రీ.పూ. అయిదవ శతాబ్ది కాలంలో భౌతికవాదులు, నాస్తికులు, ఇతర తిరుగుబాటు ఉద్యమాల వారు అనేకులు కనిపిస్తారు.

పరిత్యాగులను ఒకోసారి శ్రమణులు (శ్రమచేసేవారు, దేశాటకులు, యోగులు) అనేవారు. వారు బ్రాహ్మణలకు (బ్రాహ్మణులకు సంస్కృత నామం) భిన్నమైనవారు. 'శ్రమణ' అనే మాట మొదట హిందూ సంప్రదాయంలోని వారికి, దానికి బయటి యోగులు, తపస్వులకు వర్తించేది. అదే విధంగా అజీవికులకు, నాస్తికులకు, లోకాయతులకు, చార్వాకులకు కూడా. కాని బృహదారణ్యకోపనిషత్తు శ్రమణులను చోరులు, గర్భస్రావ వాదులు, చండాలురు, పుల్కసులు (పారియాలకు చెందిన రెండు వర్గాలు), సన్యాసులతో చేర్చింది. చివరకు శ్రమణులన్న మాటకు హీనులు, జిత్తులమారి మనుషులు, నగ్నంగా తిరిగేవారినే అర్థం వచ్చింది. శ్రమణులు, బ్రాహ్మణులు పాము, ముంగిసలవలె కలహించుకునే వారని గ్రంథాలలో పేర్కొన్నారు. వైదికేతర శ్రమణులు, బౌద్ధులు, జైనులు జంతు బలి సంప్రదాయాన్ని పూర్తిగా తిరస్కరించి అడవులలో తపస్సు, ధ్యానాల పద్ధతిపట్ల మొగ్గు చూపారు. బలి సంప్రదాయాలు బ్రాహ్మణులకు జీవనాధారమైనవి. వైదిక సంప్రదాయం లోనే కొనసాగుతుండిన శ్రమణులు వేదాలను, బలులను నామమాత్రంగా సమర్థించినా కుటుంబ జీవితాన్ని మాత్రం అంగీకరించలేదు వారిపట్ల బ్రాహ్మణులకు మరింత వ్యతిరేకత ఉండేది. వారిని అంతర్గత ద్రోహులుగా పరిగణించేవారు. ఉపనిషత్

రచయితలకు అవసరమైన సమాచారానికి శ్రమణులు, బ్రాహ్మణులు కూడా ఆధారమై ఉండాలి. శ్రమణుల నుంచి తమకు సవాళ్ళు ఎదురు కావటంతో బ్రాహ్మణులు, అగ్రవర్ణాలవారు పరిత్యాగ సంప్రదాయాలను వారి నుంచి చాలావరకు తమ సంప్రదాయంలో భాగం చేసుకున్నారు.

ఉపనిషత్తులలో బ్రాహ్మణ, శ్రమణ లక్షణాలతోపాటు ఆదివాసులు ఇతర స్థానికుల సంప్రదాయాలు కూడా మిళితమయాయి. పునర్జన్మ, ఆత్మల పరకాయ ప్రవేశం, ఆత్మలు జంతువుల నుంచి మనుషులలోకి ప్రవేశించటం వంటి నమ్మకాలు ఆదివాసుల నుంచి వచ్చినవని భావించే పరిశోధకులు కొందరున్నారు. సింధూ నాగరికత వారసుల నుంచి వచ్చినవి కూడా కొన్ని ఉండి ఉంటాయి. అయితే ఏవి ఆ వారసులవి, ఏవి ఆదివాసులవి అన్న తేడాను చూసేందుకు కొందరు ప్రయత్నిస్తారు.

## స్త్రీలు, ఇతర నిమ్నస్థాయి మనుషులు

బృహదారణ్యకోపనిషత్తులో ఇద్దరు భార్యలు గల ఒక బ్రాహ్మణుడి కథ ఉంది. వారిని తమ వర్ణాన్ని బట్టి గాక మేధాశక్తిని బట్టి గుర్తించటం కనిపిస్తుంది. ఆ కథను చూడండి.

## వేదాంతి అయిన భార్య, ప్రాపంచిక భార్య

యాజ్ఞవల్క్యునికి మైత్రేయి, కాత్యాయని అనే ఇద్దరు భార్యలుండేవారు. వారిలో మైత్రేయి వేదాంత చర్చలలో పాల్గొనేది కాగా, కాత్యాయనికి స్త్రీలకు సంబంధించిన సాధారణ విషయాలు మాత్రమే తెలుసు. ఒక రోజు యాజ్ఞవల్క్యుడు సన్యసించి ఇంటి నుంచి వెళ్ళిపోనుండగా, "మైత్రేయి, నేనిక్కడి నుంచి వెళ్ళిపోబోతున్నాను. కనుక నీకు కాత్యాయనికి మధ్య ఒక అవగాహనను కుదుర్చుతాను రా"మంటాడు. అందుకు మైత్రేయి, "నన్ను చిరంజీవిని చేయలేనిది ఏదైనా నాకు లభించి కూడా ఉపయోగమేమిటి. మీకు తెలిసిన జ్ఞానమంతా నాకు బోధించండి" అంటుంది. ఆ మీదట యాజ్ఞవల్క్యుడు, "నాకు నీ పట్ల ఎప్పుడూ ప్రేమాభిమానాలున్నాయి. ఇప్పుడవి మరింత పెరిగాయి. నీకు అన్ని విషయాలు చెప్తాను రా"మంటాడు.

తర్వాత, ఒక వ్యక్తి తన గురించి తాను అర్థంచేసుకునే సూత్రాలను బోధించి వెళ్ళిపోతాడు. కాత్యాయని అసలు రంగంలో కనిపించదు. కాని తర్వాత స్కంధ పురాణంలో తన ప్రసక్తి వస్తుంది. మైత్రేయి పట్ల అసూయ చెందిన ఆమె పార్వతీ దేవిని ప్రార్థించి, మైత్రేయికి సమానురాలయే శక్తిని పొందుతుంది. అప్పుడు వారిద్దరు సమానులని యాజ్ఞ వల్క్యుడు కూడా గుర్తిస్తాడు. స్త్రీలలో కొందరు వేదాంత చర్చలలో పాల్గొనటం మనకు కనిపిస్తుంది. కాని వారెవరూ రచయితలు కాలేదు. ఉపనిషత్ స్త్రీలలో అందరికన్నా సమర్థురాలైన గార్గి, యాజ్ఞవల్క్యుడిని గట్టిగా సమర్థించింది.

ఆ కాలపు స్త్రీలకు బౌద్ధం వంటి ఇతర అవకాశాలు కూడా ఉండేవి. బౌద్ధం వల్ల వారికి సామాజిక భద్రత లభించటంతోపాటు, పునర్జన్మ నుంచి ముక్తి, వంటిల్లు – భర్తల నుంచి విమోచన కలిగేది. కాని బౌద్ధం వారిని మగ సన్యాసులతో సమానంగా పరిగణించేది కాదు. స్త్రీలను చేర్చుకోరాదని బుద్ధుడు స్వయంగా చెప్పి, ఆ పనిచేసినట్లయితే అయిదు వందల సంవత్సరాల లోపే తమ మతం భారతదేశంలో క్షీణించగలదని హెచ్చరించాడనే నమ్మకం ఒకటి ప్రచారంలో ఉంది. ఆ హెచ్చరిక నిజమైంది కూడా.

ఇదే కాలంలో శ్రౌత సూత్రాలు, గృహ్యా సూత్రాల వంటి ఇతర సంస్కృత రచనలు కూడా జరిగాయి. వీటిలో మొదటివి క్రీ.పూ. 500 ప్రాంతానివి. అవి వేద సంప్రదాయాలను వివరిస్తాయి. వాటిని బ్రాహ్మణులు మాత్రమే పాటించేవారు. రెండోవి గృహసంబంధమైన, జీవిత సంబంధమైన సంప్రదాయాలు. క్రీ.పూ. 300 ప్రాంతానికి చెందిన వాటిని బ్రాహ్మణేతరులు కూడా అనుసరించేవారు. శ్రౌత సూత్రాల ప్రకారం కొన్ని కార్యక్రమాలలో యాగకర్త భార్య కూడా పాల్గొనాలి, మాట్లాడాలి. కాని వేదమంత్రాలు చదవకూడదు. గృహ్యా సూత్ర కార్యక్రమాలలో మాత్రం భార్యల పాత్ర ఎక్కువగా ఉండేది. ఉపనిషత్కాలంలో స్త్రీలు క్రియాశీలంగా ఉండేవారనేందుకు ఇదొక ఉదాహరణ.

## జంతువులు

నిమ్నస్థాయి ప్రజలకు జంతువులతో తరచు సంబంధం ఉండేది. రైక్వా, సత్య కామ వంటి వారికి  కొంగలు, ఎద్దులు, ఆవులతో గల సంబంధం ఇందుకు ఉదాహరణ. ఒక ఉపనిషత్కథలో శునకాలు అగ్రవర్ణానికి మారినట్లు వ్యంగ్యమైన ప్రస్తావన ఉంది. ఆ భాగం ఇది.

### శునక గీతం

కొన్ని శునకాలు ఒక వేద పురోహితుడిని, "అయ్యా మేము ఆకలితో ఉన్నాం. ఏదైనా గానంచేసి మా ఆహారాన్ని సంపాదించుకోదలచుకున్నా"మని అడుగుతాయి. ఆయన వాటిని మరునాడు ఉదయం రమ్మంటాడు. అవి అదే విధంగా మారు రూపాలలో వచ్చి, పురోహితులు ఒకరి వెంట ఒకరు (మందిరంలోకి) ప్రవేశించినట్లే అవి కూడా ప్రవేశించి కూర్చుని ఆలాపనను ఆరంభిస్తాయి. ' ఓం! ఆహారం స్వీకరిద్దాం! ఓం! పానీయం స్వీక రిద్దాం! ఓం! దేవతలు ఆహారాన్ని తీసుకురాగలరు గాక! ఓ ఆహార దేవతా, ఆహారాన్ని తీసుకుని రా! తీసుకురా! తీసుకురా! (ఛాందోగ్యోపనిషత్తు)"

శునకాలను ఈ విధంగా బ్రాహ్మణుల రూపంలో చూపటమన్నది ఆశ్చర్యకరమైన సాహసం. పోతే, అశ్వాలు ఉపనిషత్తులలో ప్రముఖంగా కనిపిస్తాయి. అది క్షత్రియుల ప్రాముఖ్యతకు గుర్తు. మొట్టమొదటిదైన బృహదారణ్యకోపనిషత్తులో మొట్టమొదటి వాక్యాన్ని

ఒక అశ్వమే చెప్తుంది. "యాగాశ్వపు శిరస్సు ఉషస్సు వంటిది. దానికన్ను సూర్యుడు. ఊపిర్లు వాయువు. దాని పెద్ద నోరు అందరిలో ఉండే అగ్ని... అశ్వం ఆవలించినప్పుడు (ఆకాశంలో) మెరుపులు మెరుస్తాయి. ఒళ్ళు కదిలించినప్పుడు ఉరుముతుంది. మూత్రించినప్పుడు వర్షం కురుస్తుంది. అది సకిలించటమే మాట" అని కనిపిస్తుంది ఆ వాక్యంలో. అశ్వాల ప్రస్తావన వేద సాహిత్యంలో ఇంకా పలు విధాలుగా కూడా ఉంది. వాటిలో కొన్నింటిని పైన ఇతర అధ్యాయాలలోనూ పేర్కొనటం తెలిసిందే.

మరణానంతరం కొందరు అగ్రవర్ణంలో జన్మించాలని, కొందరు అసలు పునర్జన్మ ఉండరాదని కోరుకోగా, కొందరు హీనమైన స్థాయిలో పునర్జన్మించటమనే ప్రస్తావనలు కనిపిస్తాయి. వాటిలో శునక రూపం ఒకటి. దుష్కర్మలు చేసినవారు శునక గర్భంలో ప్రవేశిస్తారు. ఇటువంటి జాబితాలో ఆవులు, అశ్వాల వంటి "మంచి" జంతువులు లేక పోవటం గమనించదగ్గది. జంతువులపట్ల అహింస తొలిదశ ఉపనిషత్తులలో తక్కువైనా, పునర్జన్మతో నిమిత్తంగల భారతీయ సంప్రదాయాలు అనేకం, పరిత్యాగులు కాగోరేవారు మాంసాహారాన్ని వద్దించాలని చెప్తాయి. జంతుబలుల నుంచి మనుషులు తర్వాత కాలంలో దూరం కావటానికి బీజాలు బ్రాహ్మణాలలో, ఉపనిషత్తులలో కనిస్తాయి. వేదాలలో ఇంద్రుడు దున్నలను, ఎద్దులను ఆహారంగా స్వీకరించగా, ఇప్పుడు దేవతలు సోమరసాన్ని వాసన మాత్రమే చూస్తారని ఛాందోగ్యోపనిషత్తు పేర్కొన్నది. అదేవిధంగా రాజులు కాలుతున్న యాగాశ్వపు కొవ్వును మాత్రమే వాసన చూస్తారు. వేదాలలో వరి, బార్లీ నైవేద్యాల ప్రసక్తి ఉంది.

క్రమంగా హిందూమతంలోని అనేక శాఖలు జంతుబలులను నిషేధించాయి. వాటికి అహింస అనే పేరు పెట్టాయిగాని, బౌద్ధం, జైనం పలువురు ప్రముఖులపై ప్రభావం చూపినందువల్ల ఎదురైన సవాలు కూడా అందుకు కొంత కారణం కావచ్చు. ఈ రెండు మతాలకు జీవజాలం పట్ల గల ప్రేమ అట్లుండగా, హిందూ సంప్రదాయాల నుంచి భిన్నంగా ఉండదలచుకోవటం, బలుల కారణంగా ఉండే పురోహితుల ప్రమేయాన్ని నిరోధించదలచటం కూడా ఆ మతాల అహింసా విధానాలకు కారణమై ఉండవచ్చు.

పోతే, జంతువులను వధించటం, హింసించటం, బలివ్వటం, ఆహారంగా తీసుకోవటం, పూజించటం వంటి చర్యలకు గల తేడాను మనం గుర్తించాలి. అహింస, శాంతియుత విధానం, భూతప్రేమ, శాకాహారం వంటి వాటి అర్థాలు అందరికీ ఒకటే కాదు. అశ్వయాగం చేయటం, మాంసాహారం తీసుకోకపోవటం ఒకే సమానమైన విశిష్ఠత లంటాడు మనువు. పలువురు జంతువులను వధించరు. మాంసాహారులు అశ్వ యాగంలో అశ్వాన్ని బలిస్తారుగాని దాని మాంసం తినరు. మాంసాహారులు జంతువులను వధించక పోయినా వారి కోసం మరెవరో వధించవలసి ఉంటుందనే తర్కం, శాకాహార ఆలోచనలను పెంచింది. కొద్ది శతాబ్దాలు గడిచేసరికి, వేదకాలంలో హింసతో, అధికారంతో ముడిబడిన

వ్యవస్థ, అహింస దిశగా మారింది. ప్రతి మనిషి, ప్రతి జంతువు మరణించక తప్పదు. ప్రతి మనిషి, ప్రతి జంతువు ఆహారం తీసుకోక తప్పదు. ఆహారం తీసుకోవట మంటే ఏ జంతువుదో, మొక్కదో ప్రాణంతీయక తప్పదు. ఈ పరిస్థితులలో జీవించటమెట్లా, జీవించేందుకు ప్రాణంతీయట మెట్లా అన్నవి ప్రశ్నలయాయి. హిందూమతానికి అన్ని కాలాలలోనూ ఇదొక చర్చనీయాంశమైంది.

## వ్యసనం, పరిత్యాగం

గృహస్థులు పాటించే మతధర్మంతోపాటు పరిత్యాగాన్ని ఒక ఉద్యమంగా ప్రజలు ఆమోదించటానికి కారణముంది. దేనిపట్ల ఎవరికైనా అత్యాసక్తి కలిగి వ్యసనంగా మారటం, దానిని వదల దలచుకున్నా వదలలేకపోవటం వల్ల హిందూ సమాజం ఎప్పుడూ ఆందోళన చెందుతుండేది. పరిత్యాగం, సన్యాసం వంటి ధోరణులను హిందూమతం ఆదరించటానికి అదొక కారణం. ఉదాహరణకు కామసుఖాల విలువను గుర్తిస్తూనే అవి ఒక పరిమితిని దాటరాదన్నారు. ఆ కోర్కెలను నియంత్రించుకునే పద్ధతుల గురించి మాట్లాడారు. పరి త్యాగాలు అనేకం అహింసాత్మకం కాగా, కొన్ని హింసాత్మకంగా కూడా ఉండేవి. కోర్కెలను గుర్రాలతో పోల్చేవారు. రాజులకు కోర్కెలు, గుర్రాలు రెండూ ముఖ్యమే. కాని వారిని నియంత్రించవలసిన బ్రాహ్మణులు తమ కోర్కెలను నియంత్రించుకోవటం, పరిత్యాగ భావనలను పెంపొందించుకోవటం అవసరమని భావించారు. కొందరు పరిత్యాగులు కోర్కెలు, వ్యవసనాల బారిన పడకుండా ఉండటం కోసం సమాజానికి వెలుపలనో, కొంత దూరంగానో ఉండేందుకు ప్రయత్నించేవారు. జూదం మొదలైన వ్యవసనాల కారణంగా రాజ్యాలతో సహా సర్వస్వం కోల్పోయిన వారిని, వేట అనే వ్యసనానికి లోనై ప్రమాదకర పరిస్థితులలో చిక్కుకున్న వారిని ఉదాహరణలుగా చూపటం ఉండేది. ఆహారం కోసం అవసరం లేకపోయినా వేటాడటం, ధనం అవసరం లేకున్నా జూదమాడటం, సంతానం అక్కరలేకున్నా శృంగారాన్ని కోరటం వ్యసనాలన్నారు. కాని పేదలకు నిరంతరం ఆహారం అవసరం గనుక చిన్న చిన్న జంతువుల వేట వ్యసనం కాబోదు.

కామానికి, శృంగారానికి భారతదేశ చరిత్ర పొడవునా కేంద్రస్థానం ఉంది. ఒక వైపు సన్యాసానికి ప్రాముఖ్యత ఇస్తూనే మరొకవైపు సంతానోత్పత్తిని కొనసాగిస్తూ పోయారు. హిందువులకు ప్రాపంచిక విషయాలు, విలువలపట్ల లోగడ పరిశోధకులు భావించిన దానికన్నా ఎక్కువ ఆసక్తి ఉండేదని ఇటీవలి ఆధారాలు సూచించాయి. మొత్తంమీద ఐహిక సుఖాలకు, నియంత్రణలకు, ఆముష్మిక ఆలోచనలకు మధ్య ఒక సమతులనం కన్పించేది. హిందువులలో వ్యామోహాలకు, కళలకు సంబంధించిన సంప్రదాయాలకు, వివిధ హిందూ శాఖలు తీసుకునే స్వచ్ఛ వైఖరులకు మధ్య ఉద్రిక్తత వంటి పరిస్థితులుండేవి. యోగులు, పరిత్యాగులు స్త్రీలపట్ల భయాన్ని, వ్యతిరేకతను కలిగించి చూడగా, ప్రాపంచికులైన

హిందువులు స్త్రీలను తమ శిల్పాలు, కవితలలో, నిజజీవితంలో ఆరాధించేవారు. తర్వాతి దశలో మోక్ష సాధన కోసం పలు మార్పులు చేస్తూ, శృంగారానికి, బ్రహ్మచర్యానికి మధ్య గల సంఘర్షణ బాధ్యతను పురుషుల నుంచి పూర్తిగా తొలగించి అది స్త్రీల బాధ్యతన్నారు. మాతృత్వానికి ప్రాధాన్యతనిచ్చే పురుషులకు వారు తల్లులు, భార్యలు కాగా, బ్రహ్మచర్యం, సన్యాసం పాటించదలచిన వారికి స్త్రీలను సంతృప్తి అంటూలేని సమ్మోహనవతులుగా చూపి భయపెట్టారు.

ఈ రెండు విధాలైన ఆలోచనలకు మధ్యగల భిన్నత్వాల మూలంగా హిందూమతంలో తాత్త్విక కోణం నుంచి, ఆచరణాత్మక కోణం నుంచి అనేక చర్చలు సాగాయి. బ్రాహ్మణులలో గల ఒక కథలోని వృషుడు అనే రాజు ఒకవైపు అమితమైన శృంగారాన్ని, మరొకవైపు పరిత్యాగాన్ని చూపుతుంటాడు. హిందువులు చేసేపని అదే. వారికి భగవంతుడు ఒకవైపు సగుణుడు, మరొకవైపు నిర్గుణుడు కూడా.

అయితే మనం ఈ భిన్నత్వాలను, లేదా ద్వంద్వాన్ని హందూమతాన్ని అర్థం చేసుకునేందుకు మార్గదర్శనం చేసేవిగా తీసుకోవాలి. హిందువులు తమ భావనలను ఒకోసారి పరస్పర విరుద్ధాలుగా చిత్రీకరించారంటే అర్థం వారి జీవితాలు ఆ విధంగా ఉండేవని, అవి వారి అనుభవాలని కాదు. అదేవిధంగా, పరిత్యాగమన్నది సంప్రదాయిక వైదిక వ్యవస్థను సవాలు చేసినట్లు తోచినా, అదే పరిత్యాగ భావనను హిందూమతం తనలో భాగం చేసుకుంది. హిందువుల దృష్టిలో ఈ వైవిధ్యతలన్నీ అదే మతంలో భాగాలు. కుటుంబీకులు స్వయంగా సన్యసించేందుకు సిద్ధపడకున్నా సన్యాసుల దీవెనలు పొందేందుకు వారిని ఆదరించి గౌరవిస్తారు. కుటుంబీకులను దీవించి తమ అవసరాలు పొందటం సన్యాసులకు సంతృప్తిని కలిగిస్తుంది. అనగా రెండు ధోరణుల మధ్య ఉద్రిక్తతల వంటివి ఉన్నా అవి శాంతియుతంగానే ఉంటాయి, సహజీవనం చేస్తాయి. నిజమైన ఘర్షణ అంటూ లేదు. అనేక వందల సంవత్సరాలుగా పరిస్థితి ఇదే. నిమ్న వర్ణాల వారు కూడా ఈ విధమైన వ్యత్యాసాలను ఉపేక్షించారు. లేదా రెండింటి మధ్య ఏదో ఘర్షణ ఉన్నట్లు భావించలేదు. వైదిక హిందూమతం కూడా వారిని గౌరవించి తగు స్థానం చూపింది.

మోక్ష మార్గీయులు పునర్జన్మవాదులను చిన్నచూపు చూడలేదు. భిన్నత్వాలన్నవి రెండు మార్గాలుగా సాగటం, కలవటం , చీలటం, తిరిగి కలవటం వంటివి హిందూ మతంలో సర్వసాధారణమైన విషయాలు. ప్రజలు ఒక మార్గం నుంచి మరొక మార్గానికి తేలికగా ఎప్పుడు కోరుకుంటే అప్పుడు మారగలరు. వైదికమైన తపశ్శక్తి, ఉపనిషత్తుల లోని తపశ్శక్తి పరస్పర విరుద్ధాలైనట్లు తోస్తుంది. కాని ఆ రెండు ఆధ్యాత్మిక శక్తులు, వాటితోపాటు కామశక్తి అంతిమంగా మానవ శక్తిలో భాగమైనవే. అవి వేర్వేరు మార్గాలలో వ్యక్తీకృతమయాయి.

## అధ్యాయం 8

# హిందూమతంలో మూడు (లేక నాలుగా?) జీవిత లక్ష్యాలు

### కాలక్రమణిక

| | | |
|---|---|---|
| క్రీ.పూ. 300–100 | : | ధర్మసూత్ర రచన |
| సుమారు క్రీ.శ. 100 | : | మనుధర్మశాస్త్ర రచన |
| సుమారు క్రీ.శ. 200 | : | కౌటిల్యుని అర్థశాస్త్ర రచన |
| సుమారు క్రీ.శ. 300 | : | వాత్స్యాయన మల్లనాగ కామసూత్ర రచన |

### మూడు లక్ష్యాలు

*ఎవరు కూడా కేవలం భావప్రాప్తి కోసం శృంగారం జరపరు. కేవలం ఆనందం కోసం సంపదలను పోగుచేసుకోరు. కేవలం సంపదల కోసం ధర్మాన్ని ఆచరించరు. కేవలం ధర్మం కోసం హింసకు పాల్పడరు.*

–అశ్వఘోష, బుద్ధచరిత (క్రీ.శ. మొదటి శతాబ్ది ప్రాంతం)

కవి అశ్వఘోషుడు వర్ణించిన ఆదర్శ హిందూ ప్రపంచంలో ధర్మం, సంపదలు, శృంగారం అన్నవి మూడు లక్ష్యాలు కాగా, వాటిని ఎవరు కూడా పైన చెప్పిన విధంగా అనుసరించరు. ఈ మూడింటి మధ్య సంక్లిష్టమైన సంబంధాలున్నాయి. ఆ విషయాలు ఈ అధ్యాయంలో చర్చకు వస్తాయి. ఇది ఒక నిర్దిష్టమైన చారిత్రక దశకు సంబంధించినది కాదు. ఈ పుస్తకంలోని ప్రధాన పాత్రధారులైన స్త్రీలు, నిమ్న వర్ణాలు, శునకాలు, అశ్వాల గురించినది కూడా కాదు. అయితే హిందూమత ఆచరణను, దాని చారిత్రక అభివృద్ధిని కలిపి ఉంచే కొన్ని సూత్రాల ప్రస్తావన ఇందులో వస్తుంది. పునర్జన్మకు, పరిత్యాగానికి మధ్య, పరిత్యాగంతో కూడిన సాధారణ ధర్మానికి, నిర్దిష్టమైన ధర్మానికి మధ్య ఒకోసారి ఘర్షణ స్థితి ఏర్పడుతుంది. నిర్దిష్టమైన ధర్మం అనే దానిలో యుద్ధహింస, జంతుబలుల హింస చేరి ఉంటాయి. సూత్రాలు అని పైన అన్నదానిలో ఇవన్నీ ఉన్నాయి.

ఉపనిషత్తులు ఒక దృక్పథాన్ని రూపొందించి మోక్షమనే భావనను అందులో భాగంగా మార్చనారంభించాయి. ఆ దృక్పథం ఆయా అంశాలను వేర్వేరు విధాలుగా వర్గీకరించింది. అయితే మోక్ష భావన ఆ వర్గీకరణల పద్ధతిని సవాలు చేసింది.

ఆ వర్గీకరణలలో మూడేసి ముఖ్యాంశాలు కలిసి ఒక ముక్కాలిపీట వలె ఉండేవి. ఉదాహరణకు అశ్వఘోషుడు చెప్పిన ధర్మం, సంపదలు, శృంగారం అనే మూడు కలిసి

ఒక విస్తృత దృక్పథం అయిన పద్ధతిలోనన్నమాట. అయితే ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఒకటి, రెండు అంకెల తర్వాత మూడు అన్నది కేవలం మూడు కాదు. సంస్కృతంలో ఒకటి, రెండు, అనేకం అనే లెక్క ఉంది. మూడు అన్నది అనేకం కూడా అవుతుంది. అది మూడు నుంచి మొదలుకొని ఎన్నయినా కావచ్చు.

అథర్వ వేదంలో, ఛాందోగ్యోపనిషత్తులో ఈ ముక్కాలిపీట దృక్పథం ఒకటుంది. అది 'త్రిగుణాలు' అన్నది. సత్త్వం, రజస్సు, తమస్సు అన్నవి ఆ మూడు గుణాలు. త్రిమూర్తులు, త్రివర్ణాలు (తెలుపు, ఎరుపు, నలుపు లేదా స్పష్టత, క్రియాశీలత, నిష్క్రియాపరత), దేవతలు, మానవులు, జంతువృక్ష జాలాలు అనే మూడు విధాలైన ప్రాణులు ఇటు వంటి వర్గీకరణలే. త్రిలోకాలు, త్రిదోషాలు, ఇంకా అనేకం ఇదేవిధంగా ఉన్నాయి. కాని మూడన్నది అనేకం కూడా అవుతుందని పైన సూచించినట్లు ఒకోసారి మూడుతో మరొకటి చేరి నాలుగు కూడా అవుతుండేవి. కాని ఆ విధంగా నాల్గవ దానిని చేర్చటానికి వ్యతిరేకత కూడా వస్తుండేది. అయినప్పటికీ కొన్ని నాలుగుగా మారాయి. ఉదాహరణకు మోక్షంతో కలిసిన చతుర్విధ పురుషార్థాలు. మొదట ధర్మార్థ కామాలుగా అది ముక్కాలిపీట దృక్పథమే.

ఇందులోని మాటలకు నానార్థాలున్నాయి. ఉదాహరణకు ధర్మానికి అర్థం విధి బాధ్యతలు, మతం, మతపరమైన మేలిమి లక్షణం, నైతికత, సామాజికమైన సంప్రదాయ పరమైన బాధ్యతలు, న్యాయశాస్త్రం వంటివి కావడమన్నమాట. అదేవిధంగా అర్థమన్నది ధనం, రాజకీయాధికారం, విషయ సాఫల్యత, లక్ష్యం, లాభం అవుతుంది. కామం అనే పదానికి అనంతం, కోరిక, సంగీతంతోపాటు మంచి ఆహారం, సుగంధాలు, చిత్రాల వంటి పట్ల కాంక్ష అనేవి కూడా అర్థాలవుతాయి. జీవితం సంపూర్ణం అయేందుకు ధర్మార్థ కామాలనే ఈ మూడు లక్ష్యాల సాధనకు మనిషికి హక్కు ఉంటుంది. ఇంకా చెప్పాలంటే వాటిని సాధించటం తన బాధ్యత కూడా. ఈ మూడు లక్ష్యాలకు సంబంధించి సంస్కృతంలో గ్రంథాలున్నాయి. వాటిలో పేరు పొందినవి ధర్మానికి మనుధర్మశాస్త్రం, అర్థానికి కౌటిల్యుని అర్థశాస్త్రం, కామానికి వాత్స్యాయనుని కామసూత్ర. వీటిలో, కుటుంబ యజమానిని కేంద్ర చేసుకునే ధర్మం అనే దృక్పథానికి ఆ విధమైన ధర్మాచరణకు భిన్నమైన మోక్షం అనే దృక్పథానికి మధ్య ఘర్షణ వంటి స్థితి ఉండేది.

ధర్మానికి సంబంధించిన తొలి రచనలు క్రీ.పూ. మూడవ శతాబ్ది నుంచి ఒకటవ శతాబ్దికి మధ్యకాలం నాటి 'ధర్మసూత్రాలు'. ఆ వెంటనే ధర్మశాస్త్రాల రచన జరిగింది. వాటిలో ప్రముఖమైంది మనుధర్మశాస్త్రం. దానిని సంస్కృతంలో 'మావన ధర్మశాస్త్ర', లేదా 'మనుస్మృతి' అన్నారు. దాని రచన క్రీ.శ. 100 ప్రాంతంలో జరిగి ఉండాలి. అందులో మానసిక శాస్త్రం, శరీరం, శృంగారం, మనుషులకు జంతువులకు మధ్య సంబంధాలు,

సంపదల పట్ల దృష్టి, రాజకీయాలు, న్యాయశాస్త్రం, వర్ణాలు, అపవిత్రత, శుద్ధి, సన్యాసం వంటి అనేకానేక అంశాలున్నాయి. ఆ శాస్త్ర రచయిత అయిన మను ఒక రాజు.

అర్థశాస్త్ర రచయితగా చెప్పే కౌటిల్యుడు క్రీ.పూ. నాలుగో శతాబ్దికి చెందిన మౌర్య చక్రవర్తి చంద్రగుప్తుని మంత్రి. అది మౌలికంగా రాజకీయ రచన. అందులో రాజుకు వచ్చే సలహాలు అనేకం ఉన్నాయి. మానసికశాస్త్ర చర్చ కూడా కన్పిస్తుంది. కౌటిల్యుడిని మాకియవెల్లితో పోల్చుతారు గాని తన ముందు మాకియవెల్లి మదర్ థెరెసా వలె కన్పిస్తాడు. కామసూత్ర రచన క్రీ.శ. రెండు, లేదా మూడవ శతాబ్దంలో జరిగి ఉంటుంది. మనువు ఒక ఊహ కాగా, వాత్స్యాయన మల్లనాగ నిజమైన మనిషి. కాని తన గురించి మనకేమీ తెలియదు.

మనుధర్మశాస్త్రం, అర్థశాస్త్రంలో ఒకదాని ఉటంకింపులు మరొక దానిలో కనిపిస్తాయి. రాజు, పరిపాలన, నేరస్మృతి, పౌరస్మృతి అంశాలు ఆ విధంగా అర్థశాస్త్రం నుంచి మనుధర్మ శాస్త్రంలో చేరాయి. అర్థశాస్త్ర రచనా కాలంలో కొన్ని బౌద్ధ గ్రంథాల రచన కూడా జరిగినందున పన్నుల విధింపు, బౌద్ధస్తూపాలకూ దేవాలయాలకూ దాన ధర్మాల వంటి ఆలోచనలు బౌద్ధ గ్రంథాల నుంచి వచ్చి ఉంటాయి. ఆ విధంగా ఈ మూడు విధాలైన గ్రంథాల మధ్య ఆ దాన ప్రదానాలున్నట్లు చెప్పవచ్చు. మతం విషయమై మాత్రం భిన్నమైన ఆలోచనలుండేవి. మనువు వేద సంప్రదాయాలను వివరించి దేవాలయాల గురించి ప్రస్తావించలేదు. అర్థశాస్త్రం, కామసూత్ర దేవాలయాలు, పండగల గురించి రాసి వేద సంప్రదాయాల జోలికి పోలేదు. సంచారులైన సన్యాసులను, హిందూ, బౌద్ధమతాలకు చెందిన పరివ్రాజకులను మనుశాస్త్రం వెలివేసిన వారిగా పరిగణించగా, కౌటిల్యుడు, వాత్స్యాయనుడు మాత్రం వారిని గూఢచారులుగా ఉపయోగించుకోవాలని రాజుకు సలహా ఇస్తారు. ఈ తరగతి వారితోపాటు వేశ్యలు సమాజంలోని అన్ని తరగతుల వారి మధ్య తిరుగుతుంటారు. నటుల విషయం కూడా అంతే. అందువల్ల సంచారులు, వేశ్యలు గూఢచర్యం బాగా చేయగలరు.

అశ్వఘోషుడు బ్రాహ్మణునిగా జన్మించి బౌద్ధంలోకి మారాడు. ధర్మార్థ కామాల్లో దేని ప్రాధాన్యత ఏమిటన్న ప్రశ్నపై మనువు, కౌటిల్యుడు, వాత్స్యాయనుడు, అశ్వఘోషుడు భిన్నాభిప్రాయాలను వ్యక్తపరచారు. అయితే ఈ మూడింటి మధ్య పరస్పర సంబంధం ఉందని, కనుక సమతుల్యతను పాటించాలని చెప్పే కథ ఒకటుంది. కామసూత్రంపై వ్యాఖ్యానించిన పదమూడవ శతాబ్ది రచయిత ఒకరు ఆ కథ చెప్పాడు. అది ఈ విధంగా ఉంది.

## పురూరవుడు, మూడు జీవిత పరమార్థాలు

పురూరవుడు ఇంద్రుడిని చూసేందుకు భూమి నుంచి స్వర్గానికి వెళ్ళినప్పుడు, అక్కడ ధర్మాన్ని, ఇతరులను (అర్థకామాలు) కూడా కలిశాడు. కాని ధర్మం చుట్టు ప్రదక్షిణలు చేసి తక్కినవారిని ఉపేక్షించాడు. వారది సహించలేక పురూరవుడిని శపించారు. కామం శపించినందున తను భార్యకు దూరమై విరహవేదనను అనుభవిస్తాడు. అర్థం శపించి నందున దురాశాపరుడై సమాజంలోని నాలుగు తరగతుల వారిని ధనం కోసం పీడిస్తాడు. దానితో బ్రాహ్మణులు యజ్ఞయాగాదులకు సొమ్ములేక పోవడంతో ఆగ్రహించి తమ వద్దగల దర్భలను ఆయుధాలుగా మార్చి రాజును వధిస్తారు.

మానవుని మూడు లక్ష్యాలకు కొందరు మోక్షాన్ని కూడా చేర్చారు. కాని పైన పేర్కొన్న గ్రంథాలు మోక్షం గురించి చర్చించలేదు. అది రచయితలకు పట్టించుకోదగినదిగా కన్పించి ఉండలేదనాలి. లేదా, మోక్షమన్నది మరో లోకానికి సంబంధించినది అయినందున వారు ఉపేక్షించి ఉండవచ్చు. కాని మోక్ష భావన ముఖ్యమైనది అయినందున ఇతరులు దానిని ఉపేక్షించలేకపోయారు.

సంసారానికి, పరిత్యాగానికి మధ్య తలెత్తిన వైరుధ్యాలను పరిష్కరించేందుకు హిందూ మతం అనేక మార్గాలను కనుగొంది. ఆ విధంగా వచ్చి చేరిందే మోక్ష భావన. పరిత్యాగం, సన్యాసమన్నవి ఒకసారి ఆచరించనక్కరలేదని, ఒకటి తర్వాత ఒకటిగా అదే క్రమంలో చేయవచ్చునని మొదట చెప్పారు. మూడు లక్ష్యాలు నాలుగుగా మారినప్పుడు వాటిని నాలుగు ఆశ్రమ ధర్మాలన్నారు. ఈ నాలుగింటి ప్రస్తావన మొదటి ధర్మసూత్రాలలో కని పిస్తుంది. కాని వాటిని నాలుగు ఆశ్రమాలని గాక, అవి మనిషి ఎంచుకోదగ్గ మార్గాలని, వాటిని జీవితంలోని ఏ దశలోనైనా ఎంచుకోవచ్చునని అన్నారు. వాటిలో పేర్కొన్నవి బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం. కాని మనువు కాలానికి అవి ఒక వరుస క్రమంలోకి మారాయి. అప్పటి నుంచి అదే దృష్టి స్థిరపడిపోయింది.

వైరుధ్యాల పరిష్కారానికి మోక్షసాధన, అందుకోసం సన్యాసం ఒక మార్గం కాగా మరొక నాలుగు మార్గాలను కూడా ప్రతిపాదించారు. గృహస్థులు, పరిత్యాగులు ఒకరి కొకరు అవసరం. గృహస్థులు పరిత్యాగులను పోషించాలి. అందుకు బదులుగా వీరు వారిని దీవించాలి. మనిషి చిరంజీవి కావటమన్నది తన పిల్లల ద్వారానైనా జరగవచ్చు, లేదా సన్యసించటం ద్వారానైనా. సన్యసించిన వ్యక్తి పవిత్రత, జ్ఞానం తిరిగి సమాజానికి లభించాలి. ఇది రెండవ పరిష్కారమార్గం. మూడవది రాజమార్గం. దాని ప్రకారం గృహస్తులు కొంతకాలమో, కొన్ని విధాలుగానో సన్యసిస్తారు. వానప్రస్థం కూడా రాజీమార్గం వంటిదే. నాల్గవ పరిష్కారంలో ఒక వ్యక్తి తన ఇహలోక ధర్మాలను నియమబద్ధంగా ఆచరించి

నట్లయితే అది మోక్షమవుతుందన్నారు. భగవద్గీతలో కృష్ణుడు అర్జునునితో, ఒక వీరునిగా నీ కర్మను నీవు సరిగా నిర్వర్తించు. అప్పుడది మోక్షమవుతుందంటాడు. బౌద్ధ గురువు నాగార్జునుడు, పునర్జన్మ అన్నది జన్మరాహిత్యానికి (నిర్వాణ) విరుద్ధమైనది కాదన్నాడు. ఈ నిర్వచనాన్ని చాలామంది సంతోషంగా స్వీకరించారు. మోక్షం సిద్ధించాలంటే పుత్ర సంతానం అవసరమని కొందరన్నారు. తాంత్రికులలో కొందరు ఈ వాదనను ముందుకు తీసుకుపోయి, మోక్షమార్గానికి కోర్కెలు తీర్చుకోవటానికి మధ్య తేడా లేదన్నారు. ఇక చివరిది అయిన అయిదవ పరిష్కారంలో కొందరు సంసార జీవితం కన్నా సన్యాసం ముఖ్యమనగా, మరికొందరు దానిని తారుమారు చేసి చెప్పారు. మనిషి సుఖమయ జీవితానికి వేర్వేరు ప్రత్యామ్నాయాలు ఉండాలన్న ఆలోచనతో ఇటువంటి అవకాశాలను చూపటం హిందూ ఆలోచనా ధారలో సర్వసాధారణంగా కనిపిస్తూనే ఉంటుంది. జీవితంలోని తక్కిన మూడు ఆశ్రమాలు ఒక మంచి గృహస్తు ఆశ్రమానికి మించినవేమీ కాదంటుంది మహా భారతం. ఇక శాస్త్రాలైతే వాటిని తెలిసిన వారికి, విన్న వారికి మోక్షం లభిస్తుందని హామీ నిస్తాయి.

## సన్యాసం, హింస, సాధారణ ధర్మం

మూడు జీవిత లక్ష్యాలలో ధర్మానికి దానిస్థాయినిబట్టి, ఆ విషయమై జరిగిన రచనలను బట్టి గల ప్రాధాన్యత ఎటువంటిదో మనం చూశాము. ధర్మమన్నది సంక్లిష్టమైన భావన కూడా. సన్యాసానికి, హింసకు మధ్య ఘర్షణకు అది కేంద్రస్థానం కావటం అందుకొక కారణం.

సార్వజనీన హిందూ ధర్మమన్నది అందరినీ తన పరిధిలోకి తెచ్చే, ఏకత్రిత రూపం గల, నిర్మాణగతమైన అంతరాలు లేని మతం. అది అందరికీ ఒకే రీతిన వర్తిస్తుంది. దీనిని సనాతన ధర్మమని, సాధారణ ధర్మమని కూడా అన్నారు. మొత్తం నాలుగు వర్ణాల వారికి సంబంధించి అందులో సాధారణ నైతిక నియమాలున్నాయి. అయితే ఆ నియమాలకు వేర్వేరు గ్రంథాలు వేర్వేరు అర్థాలు చెప్పాయి. మను ధర్మశాస్త్రం ఒకే గ్రంథమై కూడా వేర్వేరు చోట్ల వేర్వేరు అర్థాలను పేర్కొంది. ఒకచోట, "అహింస, సత్యం, దొంగతనం చేయకపోవటం, శుద్ధీకరణ, ఇంద్రియ నిగ్రహం నాలుగు వర్ణాల వారికి ధర్మ"మని, మరొక చోట, "అహింస, ఇంద్రియ నిగ్రహం, వేద పఠనం, అంతరాగ్ని, జ్ఞానం, గురు శుశ్రూష"లవల్ల చాలా మేలు కలగుతుందని పేర్కొంటుంది. కాని మూడు అగ్రవర్ణాల వారికి చతురాశ్రమాలలో పాటించదగినవిగా చెప్పిన పది అంశాలలో ఇంద్రియ నిగ్రహం తప్ప అహింస కన్పించదు. ఆ పది అంశాలు సత్యం, దొంగతనం చేయకపోవటం, శు ద్ధీకరణ, ఇంద్రియ నిగ్రహం, వివేకం, అధ్యయనం, ఓరిమి, క్షమ, ఆత్మనిగ్రహం, క్రోధ రాహిత్యం. వేద సంప్రదాయాలలో ఔదార్యం ఒక ప్రాథమిక సుగుణం అయినప్పటికీ,

మనువు జాబితాలలో ఇదెక్కడా కన్పించకపోవటం గమనించదగ్గది. ఈ జాబితాలన్నింటి వెనుక గలది ఒక అస్పష్టమైన సామాజిక నీతి మాత్రమే.

మనువు చెప్పిన నైతిక నియమావళి ఎంత అస్పష్టమైనదంటే, అది ఎవరికీ కష్టంగా తోచదు. అదే సమయంలో ప్రతి వ్యక్తి తను జన్మించిన వర్ణం, జాతి (కులం)ని బట్టి ఒక నిర్ణీత మార్గంలో వ్యవహరించాలని నిర్దేశించారు. ఆ మార్గం అతని 'స్వధర్మం' అయింది. తను జీవితంలో ఏ దశలో ఉన్నదీ, స్త్రీయా పురుషుడా అనే దానిని బట్టి మరిన్ని పరిమితులు ఏర్పడ్డాయి. అయితే ఈ సాధారణ నిబంధనలు స్త్రీలకోసం ఉద్దేశించినవి కావు. వారి ఏకైక స్వధర్మం భర్తకు విధేయులుగా ఉండటం, ఒకే ఒక సంస్కారకర్మ వివాహం. స్వధర్మాన్ని ఒకోసారి ఆ వ్యక్తి సహజసిద్ధమైన విధి బాధ్యత అని కూడా అన్నారు.

మనువు కర్మ గురించి రాస్తూ ఈ సూత్రీకరణలు ఏ విధంగా వచ్చిందీ వివరించాడు. తన దృష్టిలో కర్మ అన్నది ఒక నిర్దేశితమైన పని బాధ్యత:

## వ్యక్తిగత కర్మలకు మూలం

సృష్టి ఆరంభంలో సృష్టికర్త వ్యక్తిగతమైన పేర్లను, కర్మలను, అన్ని అంశాలకు సంబంధించిన పరిస్థితులను వేదవాక్కులకు అనుగుణంగా రూపొందించాడు. కర్మలను గుర్తించేందుకు మంచిని, చెడును విడతీసాడు. ప్రాణులకు సుఖదుఃఖాలనే అనుభవాలను జంటగా కల్పించాడు. భగవంతుడు ఏ జీవిని ఏ కర్మకు అనుబంధం చేసాడో తర్వాత ప్రతి జన్మలో అదే కర్మను ఆచరిస్తూ పోయాడు. అది మేలుచేస్తుందా కీడా, సున్నితమైనదా క్రూరమైనదా, ఒప్పొ తప్పొ, సత్యమా అసత్యమా అనే ప్రశ్నలలో నిమిత్తం లేకుండా ప్రతి ప్రాణికి సృష్టికర్త ఆరంభంలో ఏ పనినైతే అప్పగించాడో అది తనకు తానే అతనిలో ప్రవేశిస్తూ పోయింది. ఏ విధంగానైతే రుతువులు మారినప్పుడల్లా కొత్త రుతువు తన లక్షణాలను తనంతట తాను సంతరించుకుంటుందో, అదే పద్ధతిలో ప్రాణులు తమకు అప్పగించిన కర్మలను తమంతటతామే నిర్వర్తిస్తుంటాయి (1.21-30).

సృష్టి ఆరంభంనుంచే ఈ కర్మ వలయం ఏర్పడినట్లు స్పష్టమైన రీతిలో పేర్కొన్నారు. నువ్వేమిటో ఆ విధంగానే ఉండాలి, నీ లక్షణాలను మార్చుకోలేవని అన్నారు. మనిషి రాజవుతాడా, సేవకుడా అన్నది తన వర్ణంకన్నా కులంపై ఆధారపడి ఉంటుంది. వారికి ఆయా కర్మలను ఏవిధంగా అప్పగించారు? ఆ విషయం మనువుకెట్లా తెలుసు? ఇందుకు సమాధానం చాలా తేలిక. ఈ ప్రపంచ సృష్టికి తాను ప్రత్యక్ష సాక్షినని, ఆ కార్యక్రమంలో పాల్గొన్నాను కూడానని ఆయన స్వయంగా ప్రకటించుకున్నాడు.

సహజ సిద్ధ లక్షణాలలో ఆ ప్రాణి తీరుతెన్నులు కూడా ఉంటాయి. దానిని 'స్వభావ' మన్నారు. ఆ విధంగా క్రూరత్వం పులికి, సాధుత్వం పావురానికి సహజ స్వభావాలు. అదే పద్ధతిలో చిన్న జంతువులను చంపితినటం పులి కర్మ. ఇది ప్రాణిలో అంతర్భాగమైన

స్వధర్మం కూడా. ఆ విధంగా, ఏమి చేయాలన్న విషయమై ప్రాణికి స్వంత నిర్ణయాలు తక్కువ. కాకపోతే, ఆ కర్మ ఎంతగా చేయాలన్న స్వాతంత్ర్యం మాత్రం ఉంటుంది.

ఈ పరిస్థితుల మధ్య మనకొక చిక్కు ప్రశ్న ఎదురవుతుంది. ఒకవేళ మన స్వధర్మం సైనికుడు, లేదా కసాయి కావటమైతే, అహింసకు ఉన్నత స్థానమిచ్చే సార్వజనీన ధర్మానికి ఆ స్వధర్మంతో ఎట్లా పొసగుతుంది? హిందూమతం స్వధర్మ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చి ధర్మంలోని బహుళత్వాన్ని, సామాజిక అంతరాలను ధృవీకరించింది. అదే సమయంలో, సాధారణ ధర్మాన్ని కూడా స్వీకరిస్తూ అన్ని ధర్మాల మధ్య ఐక్యతను సైతం ఆమోదించింది. అంతిమంగా సాధారణ ధర్మంకన్నా స్వధర్మానిదిపై చేయి అయింది. ఈ రెండు సూత్రీకరణల మధ్య వైరుధ్యం మాత్రం అట్లాగే మిగిలిపోయింది. ఇందుకు సమాధానాలు తేలికకాదు.

**అధ్యాయం 9**

# రామాయణంలో స్త్రీలు, స్త్రీ రాక్షసులు

## క్రీపూ. 400 నుంచి క్రీశ. 200

**కాలక్రమణిక**

| | | |
|---|---|---|
| సుమారు క్రీ.పూ. 300 – క్రీ.శ. 300 | : | మహాభారత రచన |
| క్రీ. పూ. 200 | : | రామాయణ రచన |
| క్రీ. పూ. 327–325 | : | భారతదేశ వాయవ్య ప్రాంతంలో అలెగ్జాండర్ దండయాత్ర |
| సుమారు క్రీ.పూ. 324 | : | చంద్రగుప్తుని ద్వారా మౌర్య వంశస్థాపన |
| సుమారు క్రీ.పూ. 265–232 | : | అశోకుని పాలన |
| సుమారు క్రీ.పూ. 250 | : | పాటలీపుత్రలో మూడవ బౌద్ధ సమ్మేళనం |
| సుమారు క్రీ.పూ. 185 | : | మౌర్యవంశపు అంతం, పుష్యమిత్రుని ద్వారా శుంగవంశస్థాపన |
| క్రీ.పూ. 73 | : | శుంగవంశపు అంతం |
| సుమారు క్రీ.పూ. 150 | : | బార్హుత్, సాంచీ స్తూపాల నిర్మాణం |
| సుమారు క్రీ.పూ. 166 –క్రీ.శ. 78 | : | భారతదేశంలోకి గ్రీకులు, సిథియన్లు, బ్యాక్ట్రియన్లు, పార్థియన్ల ప్రవేశం |

### కవి, వేటగాడు, క్రౌంచపక్షి

*రాముని కథ తెలిసిన తర్వాత కవి వాల్మీకి ఒక నదిలో స్నానమాచరించేందుకు వెళ్లాడు. నది ఒడ్డున రెండు క్రౌంచపక్షులు మైథునం జరుపుతూ మధురంగా శబ్దాలు చేస్తున్నాయి. నిషాదుడొకరు వాటిలో మగపక్షిని బాణంతో నేలకూల్చాడు. ఆడపక్షి తన జతగాడిని రక్తమోడుతూ, బాధతో కొట్టుకుంటుండగా చూసి వేదనా పూరితమైన ధ్వనులు చేస్తుంది. నిషాదుని చర్యను గమనించిన వాల్మీకిని ఆర్ద్రత ముప్పిరిగొంటుంది. అపుడాయన, "ఎంతో మధురంగా పాడుతున్న క్రౌంచపక్షిని ఈ విధంగా నిష్కారణంగా ప్రాణాలు తీయటం ధర్మంకా"దనుకుంటాడు. ఆడపక్షి రోదనను విన్న ఆయన, "నిషాదా, ఈ పక్షిజంటలోని మగపక్షిని తన కోరిక పరాకాష్ట స్థితిలో ఉండగా ప్రాణం తీసిన నీకు ఎప్పటికీ మనశ్శాంతి ఉండబో" దంటాడు. అప్పుడు వాల్మీకికి తను ఆ మాటలు తనకు తెలియకుండానే*

సహజనమైన రీతిలో ఒక కవిత రూపంలో చెప్పినట్లు స్ఫురిస్తుంది. ఆ కవితను ఆయన శ్లోకమన్నాడు. ఆ మాట శోక భావనతో అన్నందున అవి శ్లోకమైంది.
– రామాయణం (క్రీ.పూ. 400 – క్రీ.శ. 200) (1.2.81.1–17)

రామాయణంలోని ఈ విశేషమైన భాగం ప్రమాదకరమైన శృంగారం, ధర్మోల్లంఘన, భూతదయ, గిరిజనులపట్ల వైఖరి, పశుపక్ష్యాదుల మోహాలు మానవ సంస్కృతి పై ప్రభావం చూపటం వంటి అంశాల చుట్టూ పరిభ్రమిస్తుంది. ఈ పుస్తకంలోని ప్రస్తుత అధ్యాయానికి ఇవే కేంద్ర బిందువులు. అదే సమయంలో రాముడు–సీతల కథ, మనుషులుగా మారే దేవతల గురించి, పాతివ్రత్యాన్ని కోల్పోయినట్లు నిందలకు గురయ్యే స్త్రీల గురించి కొత్త ప్రశ్నలను రేకెత్తిస్తుంది. బ్రాహ్మణాలు అపుడు కొంతకాలం పాటు నెలకొన్న రాజకీయ సుస్థిరతను, ఉపనిషత్తులు ఆ సుస్థిరత పట్ల స్పందనలను చిత్రీకరించాయి. ఇదే కాలంలో క్రీ.పూ. 300 నుంచి క్రీ.శ. 300 ప్రాంతంలో రామాయణ, మహాభారతాల రచన జరిగింది. ఈ పురాణాల కాలంలో భారత దేశంలో మొట్టమొదటి సామ్రాజ్య నిర్మాణం, దాని విచ్ఛిత్తి కూడా జరిగింది. తదనంతరం రాజకీయ శూన్యం ఏర్పడింది.

## క్రీ.పూ. 400 నుంచి క్రీ.శ. 200 వరకు ఉత్తర భారతం

మనం విశ్లేషించి చదవదగ్గ మొట్టమొదటి లేఖనాలు ఈ కాలానివే. అవి అశోకుని శిలాశాసనాలు. అవిగాక ఇతర స్తూపాలు, నాణేలు కూడా ఆ కాలం నుంచి మనకు లభిస్తున్నాయి. సంస్కృత గ్రంథాల నుంచి మనకు తెలిసే విషయాలకు ఈ ఆధారాలు అదనమైనవి. అదే విధంగా గ్రీసు, తదితర దేశాల నుంచి వచ్చిన సందర్శకుల కథనాలున్నాయి. గ్రామీణులలోని టెర్రకోట నగరాల్లో ధనవంతులు, బలవంతుల కోసం తయారు చేసిన నునుపైన బొమ్మలు, శిలా స్తంభాలు కూడా కళల రూపంలో తమకథను తాము చెప్తాయి. వ్యవసాయ కార్యకలాపాలు అటవీ ప్రాంతాలలోకి విస్తరించటంతో అక్కడి ప్రజల జీవితాలు ఏ విధంగా పరివర్తనకు గురయ్యాయో ఈ ఆధారాలను బట్టి మనం తెలుసుకోవచ్చు. అదే కాలంలో కళాకారులు, వృత్తి పనులలో నైపుణ్యం గలవారు కొన్ని దశలలో నిర్దిష్టమైన సామాజిక వర్గాలుగా రూపొందారు. సంపదల పంపిణీలో అసమానతలవల్ల సామాజిక అంతరాలు పెరిగాయి. మరొకవైపు కొత్త ఆదాయమార్గాలు అందుబాటులోకి రావటంతో బానిసలు, భూమిలేని వ్యవసాయ కూలీలు, వేటపై ఆధారపడేవారు, మత్స్యకార స్త్రీ పురుషులు, పశువుల పెంపకందార్లు, రైతులు, గ్రామపెద్దలు, వృత్తిపనులవారు, వ్యాపారుల సామాజిక స్థాయి పెరిగింది. అప్పటికేగల బ్రాహ్మణ, క్షత్రియ వర్గాల ఆధిపత్య పోరుకు అదనంగా, నిమ్నవర్గాల వారు ఆర్థిక, రాజకీయ శక్తిని సంపాదించటంతో వారికి, అగ్రవర్ణాల వారికి మధ్య కూడా కొత్తగా ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి.

హైందవ, బౌద్ధ మతాల మధ్య పలు సామ్యాలు ఆ కాలంలో కన్పించాయి. విష్ణువు, బుద్ధుడు ఇద్దరి శిరస్సులపై అవే సర్పాలు పడగలు విప్పి ఉండటం, రెండు మతాల ఆలయాలలోనూ వృక్షాల చుట్టూ శరీర సౌష్టవం గల స్త్రీల చిత్రాలు, ఇరు మతాల వారూ లక్ష్మీదేవిని చిత్రీకరించటం వంటివి ఇందుకొక తార్కాణం. హిందూ దేవాలయాల నిర్మాణంలో బౌద్ధ స్తూప లక్షణాలు కనిపిస్తాయి. బౌద్ధ స్తూపంలో మధ్యలో ఒక మూర్తి విగ్రహం ఉండి చుట్టూ ప్రదక్షిణకు స్థలం ఉన్నట్లు, హిందూ దేవాలయాలలోనూ ఏర్పాట్లు చేసారు. బౌద్ధ, జైనాలకు హిందూమతంతో వైరం ఉన్నందున ఆ రెండు మతాల మధ్య కొంత మైత్రీభావం, పరస్పర ఆదాన ప్రదానాలు కనిపించేవి. అదే సమయంలో బౌద్ధ, జైనాలు శక్తివంతమై, ఆధిపత్యసాధనకు రాజాశ్రయం కోసం పోటీపడేవి. ప్రజలను ఆకర్షించటంలోనూ ఆ పోటీ ఉండేది. ఈ రెండు వైదికేతర మతాల బోధనలు హిందూ మతాన్ని సవాలు చేస్తుండేవి. అటువంటి అంశాలలో, పశుపక్ష్యాదులపట్ల ఏ విధంగా వ్యవహరించాలనేది ఒకటి. దానితో, ధర్మం అనే మాటకు అర్థమేమిటనే ఆత్మసంశోధన జరుగుతుండేది. శివుడు, విష్ణువూ శైవం, వైష్ణవం అనే రెండు హిందూమత సంప్రదాయాల దేవతలుగా బలంగా ముందుకు రావటంతో ఆ ప్రభావం జంతుబలులపై కన్పించింది. ఈ రెండు సంప్రదాయాలకు వైదికాచారాలతో ఎక్కువ పనిలేకపోయింది.

## మౌర్యుల ప్రాబల్యం

ఉపనిషత్తుల కాలంలో ప్రాముఖ్యత పొందిన మగధ రాజధాని రాజగృహ, కోసల రాజధాని కాశీ ఈ కాలంలోనూ గొప్ప అధికార కేంద్రాలుగా కొనసాగాయి. అవిగాక ఇపుడు వత్స రాజ్య రాజధాని కౌశాంబి కూడా అటువంటి కొత్త కేంద్రంగా ఆవిర్భవించింది. అధికారం రాజవంశాల ఆధీనంలో ఉండేది. ఆయా నగరాలను స్థాపించిన వారు మరేవో ప్రాంతాలకు చెందిన గొప్ప వంశాల వారని, కాని ఏవో కారణాల వల్ల ఇటు తరలి వచ్చారనే కథలు వ్యాప్తిలో ఉండేవి. క్షత్రియులు అరణ్య, అజ్ఞాత వాసాలు చేసిన అనంతరం అధికారాన్ని స్వీకరించే ఉదంతాలు రామాయణ, మహాభారతాలలోనూ కనిపిస్తాయి. ఇటువంటివే కథలు కొన్ని అంతకు ముందు కూడా ఉన్నాయి. రాజులు శాపం కారణంగా నిమ్న వర్గాలతో కలిసి నివసించిన సందర్భాలు కూడా కనిపిస్తాయి. కాని నిజానికి, పట్టాభిషేకానికి ముందు రాజు కొంత కాలం పాటు సామాన్యులతో కలిసి ఉండటమనే సంప్రదాయమది. దానిని పురాణ కథలుగా మార్చి, శాపం వల్ల రాజు ఆ విధంగా జీవించాడని చెప్పారు.

నదీ మార్గ వాణిజ్యాన్ని, అడవులను, గనులను నియంత్రించిన మగధ రాజధాని పాటలీపుత్రను క్రీ.పూ. 321లో ప్రపంచంలోకెల్లా అతిపెద్ద నగరంగా పేర్కొన్నారు. అపుడు దాని జనసంఖ్య లక్షన్నర నుంచి మూడు లక్షల వరకు ఉండేది. భారతదేశపు మొదటి సామ్రాజ్యమైన మౌర్య రాజ్యానికి అది రాజధాని. అలెగ్జాండర్ క్రీ.పూ. 327లో

హిమాలయాలను, అయిదు పంజాబ్ నదులను దాటి భారతదేశంలో ప్రవేశించాడు. కాని తన సైన్యం అంతకన్న ముందుకు వెళ్లేందుకు సిద్ధపడకపోవటంతో మరుసటి సంవత్సరం బాబిలోన్‌కు తిరిగి వెళ్లాడు. అయితే తనపై తిరుగుబాటును రెచ్చగొట్టిన కారణంగా పలువురు బ్రాహ్మణులను ఆయన వధించినట్లు చెప్తారు. అలెగ్జాండర్ ప్రపంచ చరిత్రలో గొప్ప చక్రవర్తి అయినా, భారత దేశంలో అటువంటి స్థానం పొందినట్లు తోచదు.

ఇండో-గ్రీకులు కొందరు గాంధారతో పాటు కొంతవరకు ఇతర ప్రాంతాలలో స్థిరపడి ఉండిపోయారు. వారితో పాటు రోమన్, గ్రీకు వాణిజ్యాలు వచ్చాయి. చైనా నుంచి లక్కను దిగుమతి చేసుకుని, దక్షిణ భారతదేశం నుంచి ఏనుగు దంతాలను పాంపీకి ఎగుమతి చేసేవారు. గాంధార ప్రాంత వర్తక కేంద్రాల్లో రాతితో చేసిన చిత్ర సామగ్రి, బంగారు నాణేలు, ఆభరణాలు, వజ్రాలు, గాజు పాత్రలు, బొమ్మలు లభించేవి. ఆగ్నేయాసియా, చైనాలతో చిత్రాలు, రాతప్రతులు, ఆచార సంప్రదాయ సంబంధమైన వస్తు సామాగ్రి వాణిజ్యం సాగుతుండేది. అదే విధంగా గ్రీసు దేశానికి ఇక్కడి నుంచి దిగంబర తత్త్వవేత్తల ఆలోచనల దిగుమతి జరిగేది. మత సంబంధమైన ప్రధానాంశాలపై భౌతికవాదులు, అజీవికులు, తపస్యులు, జైనులు, బౌద్ధులు బహిరంగ వాదోపవాదాలు జరిపేవారు.

ఇన్నిన్ని సాంస్కృతిక సంప్రదాయాలు, పరిస్థితుల మధ్య మౌర్య సామ్రాజ్యం రూపు దిద్దుకుని స్థిరపడింది. ఒక క్షురకుని కుమారుడైన మహా పద్మనందుడు (తను ఒక వేశ్యను వివాహమాడినట్లు గ్రీకు కథనాలు చెప్తాయి) నందవంశ స్థాపకుడయాడు. అది కొద్ది కాలమే నిలిచినా చరిత్రలో ప్రముఖస్థానాన్ని ఆక్రమించింది. అప్పటి అనేక క్షత్రియేతర వంశాలలో అది మొదటిది. మహా పద్మనందుడు క్షత్రియులపై యుద్ధాలు జరిపాడు. తననుంచి క్రీ.పూ. 321లో రాజ్యాన్ని హస్తగతం చేసుకున్న చంద్రగుప్త మౌర్యుడు మహా సామ్రాజ్య నిర్మాణానికి సమకట్టాడు. మౌర్యులు మోరియా (నెమలి), శాక్య (బుద్ధుని వంశం) వంశాలకు చెందిన క్షత్రియులని బౌద్ధ గ్రంథాలు పేర్కొనగా, బ్రాహ్మణ గ్రంథాలు వారిని వైశ్యులని, శూద్రులని, మత విశ్వాసాలు లేనివారని అభివర్ణించాయి. కౌటిల్యుడనే మారుపేరు గల చాణక్యుడనే బ్రాహ్మణుడు చంద్రగుప్తునికి ముఖ్య సచివుడని, సామ్రాజ్య స్థాపనలో తనకు తోడ్పడ్డాడని చెప్పే కథ ఒకటుంది. అర్థశాస్త్ర రచయిత చాణక్యుడని అంటారు. అయితే ఒకవేళ ఆయన దాని రచనను ఆరంభించి ఉన్నా, కొన్ని వందల సంవత్సరాల తర్వాత గాని అది పూర్తి కాలేదు. అందులో మౌర్య పరిపాలనకు సంబంధించిన విధానాలు కనిపిస్తాయి. స్వరాజ్యంలో, పర రాజ్యాలలో గూఢచారులను విరివిగా ఉపయోగించటం వాటిలో ఒకటి. గూఢచార వ్యవస్థ గురించి అశోక చక్రవర్తి కూడా ప్రస్తావించాడు.

ఒకసారి తీవ్రమైన కరువుల వల్ల ప్రజలు చనిపోతుండగా ఆ పరిస్థితులను చక్కదిద్ద లేని చంద్రగుప్తుడు ఒక జైన సన్యాసి సలహా మేరకు రాజ్య పరిత్యాగం చేసి, శ్రవణ

బెళగోళ వద్ద ఉపవాస దీక్ష చేస్తూ చనిపోయినట్లు జైన మత కథనాలు చెప్తున్నాయి. తన స్థానంలో బిందుసారుడు క్రీ.పూ. 297 లో రాజయ్యాడు. అతని తర్వాత 265లో అధికారానికి వచ్చిన అశోకుడు 232 వరకు పాలించాడు. రాజ్యాన్ని మరింత విస్తరింప జేశాడు.

అశోకుని పరిపాలనా విశేషాలను తదుపరి అధ్యాయానికి వాయిదావేసి, ఇదే కాలంలో తదనంతర చరిత్ర ఏమిటో చూద్దాము. క్రీ.పూ. 183లో మౌర్య వంశపు చివరి రాజును, తన సేనాధిపతి అయిన పుష్యమిత్రుడనే బ్రాహ్మణుడు హత్య చేసి శుంగవంశాన్ని స్థాపించాడు. పుష్యమిత్రుడు బౌద్ధులను వేధించి, వైదిక బ్రాహ్మణులను ఆదరించి, వివిధ వైదికాచారాలను ప్రోత్సహించినట్లు బౌద్ధ గ్రంథాలు పేర్కొన్నాయి. తను స్వయంగా కౌశాంబిలో నరబలి ఇచ్చినట్లు కూడా రాసాయి. మొత్తానికి పుష్యమిత్రుడు క్షత్రియులను కూలదోసి తిరిగి వైదిక రాజ్యాన్ని నెలకొల్పాడు. ఆయన స్వయంగా పూజారిగా కూడా వ్యవహరించాడనే కథనాలున్నాయి. అది నిజమైతే, ఉపనిషత్తులలోని క్షత్రియ మునులను పోలిన వ్యవస్థను పుష్యమిత్రుడు పునరుద్ధరించాడన్న మాట. అయితే తర్వాత కాలానికి చెందిన ఒక గ్రంథం మాత్రం శుంగులను నిమ్న వర్గాలకు చెందిన వారిగా పేర్కొన్నది. తను క్రీ.పూ. 185 – 151 మధ్య సుమారు పాతికేళ్ల పాటు పాలించాడు. ఆ విధంగా మారుతుండిన రాజకీయ, ఆర్థిక, మతపరమైన పరిస్థితుల మధ్య బ్రాహ్మణులు ఇతర వర్ణాలకన్న ఎక్కువగా ఒక సంఘటిత వర్గంగా కొనసాగారు. తాము విద్యావంతులు కావటం, భూములకు వారసత్వ యజమానులుగా కొనసాగుతుండటం అందుకు కారణాలు. అనేక హిందూ రాజ్యాలు పతనమైనా ఆ రాజ్యాలలో భాగంగా ఉండిన బ్రాహ్మణుల ఉనికి, స్థాయి మాత్రం కొనసాగాయి.

పుష్యమిత్రుని వేధింపులు ఉండినా బౌద్ధులు తమకు అనుయాయుల నుంచి, అభిమానుల నుంచి, భూస్వాములు, ఉన్నతాధికారులు, వృత్తి పనులవారు, వర్తకుల నుంచి లభిస్తుండిన ఆర్థిక వనరులతో మనుగడ సాగించారు. రాజకీయంగా పరిస్థితులు అస్థిరంగా ఉండినా ఈ వర్గాలకు బౌద్ధమత కేంద్రాలలో భద్రతా భావం, ఆదరణ లభించేవి. కళింగ రాజ్యంలో ఖారవేలుడనే జైన రాజు తన ఆత్మకథతో కూడిన ఒక సుదీర్ఘ శిలాశాసనాన్ని వేయించాడు. అందులో ఆయన తాను ఒక జైన సన్యాసుల మఠాన్ని ఆదరించినట్లు, జైన గ్రంథాలను సంకలనం చేయించినట్లు, ఇతర మతాలను కూడా ఆదరించి వారి ఆలయాలను పునరుద్ధరించినట్లు పేర్కొన్నాడు. వేశ్యలు, నిమ్నవర్గాలకు చెందినవారితో సహా స్త్రీలు కూడా జైన, బౌద్ధాలను ఆదరించి అనుసరించారు. స్త్రీలు ఈ మతాలకు విరాళాలు ఇవ్వటం, సన్యసించటాన్ని సమాజం గుర్తించటంతో, ఆ ప్రభావం హిందూ మతంలో స్త్రీల పాత్రపైన, వైదికమైన బలుల స్థానంలో ముందుకొచ్చిన హిందూ సంప్రదాయాలపైన కనిపించింది.

రాజ్యాలు, రాజ్యకాంక్ష, యుద్ధాలు, అధికారం కోసం రాజకుటుంబాలలోనే కుట్రలు, హత్యలు ఒక సంప్రదాయంగా ఈ కాలంలో మారాయి. చరిత్రకారుడు వాల్టర్ రూబెన్ ఎత్తి చూపినట్లు, మగధరాజు బింబిసారుడిని అతని కుమారుడు అజాతశత్రు హత్య చేసాడు. తర్వాత వరసగా మరొక నలుగురు రాజులు హత్యకు గురయ్యారు. దీనితో విసుగెత్తిన ప్రజలు ఆ వంశం స్థానంలో శిశునాగుడిని రాజుగా ఎన్నుకున్నారు. శిశునాగ వంశపు చివరి రాజును తన రాణి ప్రియుడైన క్షురకుడు ఒకరు హత్యచేసి రాజయ్యాడు. అతనే తొలినందుడు. చివరి నందుడిని కౌటిల్య అనే బ్రాహ్మణుడు హతమార్చగా, చివరి మౌర్య రాజుకు పుష్యమిత్రుడనే బ్రాహ్మణుని చేతిలో అదే పరిస్థితి ఎదురైంది. క్రీ.పూ. 500 నుంచి 530 మధ్యకాలం వాయవ్య భారత చరిత్రలో కీలకమైంది. అధికారం కోసం హత్యలు సరైనవేనన్న వైఖరి ఒకటి ఆ కాలంలో రూపుతీసుకుంది. భారతీయ నాగరికత పెంపొందటానికి, బౌద్ధ సాహిత్యాభివృద్ధికి, వైష్ణవ, శైవ పురాణాలు, సంప్రదాయాలు, నైతికతల అభివృద్ధికి ఈ కాలాన్ని మౌలికమైనదిగా భావించవచ్చు. మనం రామాయణ కథను ఇటువంటి కల్లోలమైన, చారిత్రక నేపథ్యంలో పరిశీలించాలి.

## రామాయణ, మహాభారతాల పరివ్యాప్తి

ఒక కథగా రామాయణం క్రీ.పూ. 750 ప్రాంతంలో ఆరంభమై ఉంటుంది. కాని అది మనకు ప్రస్తుతం తెలిసిన రూపానికి క్రీ.పూ. 200 నుంచి క్రీ.శ. 200 సంవత్సరాల మధ్యకాలంలో వచ్చి ఉండాలి. ఆ ప్రకారం రామాయణ ప్రపంచమన్నది ఉపనిషత్తుల కాలంలో ఆరంభమై శాస్త్రాల కాలం వరకు కొనసాగిందనాలి. విదేహరాజు జనకుడు, తదితర పాత్రలు ఉపనిషత్తులలో, రామాయణంలో కూడా కనిపిస్తాయి.

శ్రుతులు అనబడే అపౌరుషేయ వైదిక గ్రంథాల నుంచి, స్మృతులు అనబడే మానవ సంప్రదాయాలకు చరిత్ర పరివర్తన చెందటానికి రామాయణ, మహాభారతాలు గుర్తులుగా నిలుస్తాయి. ఆ రచనలు జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు కూడా వాటిలోని పాత్రలన్నీ హిందువులకు తెలుసు. ఈ రెండు కావ్యాల రచన కూడా బహుశా యుద్ధాలకు మధ్య విరామ సమయాలలో, క్షత్రియులు, వారి ఇతర అనుచరుల సమక్షంలో జరిగి ఉంటుంది. వాటిని మొదట గానం చేసినవారు సూతులు (రథసారథులు) అనే కులస్తులు. ప్రతి రథసారథి ఒక యుద్ధవీరునితో రణక్షేత్రంలోకి అతనికి సారధిగా, అంగరక్షకునిగా వెళ్లేవాడు. తర్వాత రాత్రి యుద్ధ వీరులు గాయాలకు చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకునే సమయంలో, చితిమంటల చుట్టూ చేరి ఆ వీరుల పోరాటాన్ని కథనాలుగా గానం చేసేవారు. వారు ఆ వీరులకు ఆ విధంగా ప్రశంసకులు, విమర్శకులు, సలహాదారులు కూడా అయ్యేవారు. కాని వారిస్థాయి మాత్రం తక్కువదే. అందువల్లనే మహా భారతంలో కర్ణుడు సూతపుత్రుడని తెలియటంతో తక్కిన రాజులు ఆయనను చిన్నచూపు చూసారు.

తర్వాత కాలంలో కవి గాయకులు అవే కథలను గ్రామాలలో, ఉత్సవ సందర్భాలలో గానం చేయసాగారు. వారిది కూడా సామాజికంగా నిమ్నస్థితే. మరొకవైపు బ్రాహ్మణ గాయకులు, భట్రాజుల వంటివారు, రాజుల కర్మకాండల సమయంలో వారిని స్తుతించేవారు. సాయంత్రాలలో ఆస్థాన గాయకులు యుద్ధంలో ఆ యోధుల పరాక్రమాన్ని కీర్తిస్తూ గానం చేసేవారు. బలులు, యజ్ఞాలు, కర్మకాండలకు మధ్య విరామాల సమయంలో సూతులు గానంచేసేవారని మహాభారతం పేర్కొంది. ఆ సమయాలలో ఒకవైపు బ్రాహ్మణులు, మరొకవైపు భిన్న తరగతులకు చెందిన స్త్రీ, పురుషులు ఉండేవారు. భాష సరళమైనది, సూత్రబద్ధంగా సాగేది కావటం, గానంలో పునశ్చరణలు ఉండటాన్ని బట్టి ఆ పాఠాలు మౌఖిక రూపంలో ప్రచారమయేవని భావించాలి. మరికొంత కాలం గడచిన వెనుక బ్రాహ్మణులు వాటిని గానం చేస్తూ మెరుగులు దిద్ది ఉండాలి. వారి గానం క్రతువులు, బలుల సమయాలలో, తీర్థయాత్రా క్షేత్రాలలో, ఆ మార్గ మధ్యాలలో జరుగుతుండేది. అదే బ్రాహ్మణులు వాటికి క్రమంగా లిఖిత రూపం ఇచ్చారు. రామాయణ, భారతాలు రెండింటినీ తొలుతనుంచి బ్రాహ్మణులే కూర్పు చేసారన్నది కొందరు పరిశోధకుల అభిప్రాయం. కాని అది వాస్తవంకాదని, నిమ్నవర్గాలవారే ఇందుకు కారకులని, బ్రాహ్మణులు తర్వాత కాలంలో రంగంలోకి వచ్చారని సంస్కృత సాహిత్యమే చెప్తున్నది. సంస్కృత సాహిత్యం కోసం నిమ్న వర్ణాలవారు చేసింది తగినంత ఉందనేందుకు ఇదొక తార్కాణం.

ఈ ఇతిహాసాలు రెండూ కూడా మౌఖిక కావ్యాలుగా ఆరంభమైనందున చెప్పుకోదగినంత జానపద సాహిత్యం, ఇతర అంశాలు సంస్కృత కావ్యాలలోకి ప్రవేశించాయి. జానపద అంశాల కారణంగా ఆ కావ్యాలు తేలికగా ప్రజలలోకి వెళ్లాయి. ఆ క్రమంలో వాటిలోని వివిధాంశాలకు నాటకీయ లక్షణాలు వచ్చి ఉంటాయి. ఆ కావ్యాలను అనంతర కాలంలో గ్రంథస్తం చేసి గ్రంథాలయాలలో భద్రపరచారు. వాటికి సుమారు రెండు వందల సంవత్సరాలకొకసారి కొత్త ప్రతులు తయారు చేసేవారు. ఈ సంప్రదాయం హిందువులకు బౌద్ధ, జైనాల నుంచి సంక్రమించింది.

## రామాయణం

సుమారు ఇరవైవేల శ్లోకాలుగల వాల్మీకి సంస్కృత రామాయణంలో, ఈ కథ మౌలిక స్వరూపం ఈ కింది విధంగా ఉంది:

### రాముడు, సీత, రావణుడు

లంకకు రాక్షస రాజైన రావణుడు బ్రాహ్మణుడు. శివభక్తుడు. తనను సురాసురులు గాని, రాక్షసులుగాని, జంతుజాలంగాని సంహరించలేకుండా బ్రహ్మనుంచి వరం పొందుతాడు. కాని మనుషులు తనకన్న హీనులనే భావనతో వారి ప్రస్తావన చేయడు. దానితో విష్ణువు, రావణ సంహారం కోసం మానవ రూపంలో రామునిగా

అవతరిస్తాడు. నాగటిచాలులో జన్మించిన సీత ఆయన భార్య అవుతుంది. రాముని తండ్రి దశరథుడు తనకు బదులు భరతుడిని రాజుచేయగా, రాముడు సీతను, తమ్ముడు లక్ష్మణుడిని వెంట తీసుకుని అడవులకు వెళతాడు. రావణుడు సీతను అపహరించి లంకకు తీసుకువెళ్లి కొన్ని సంవత్సరాలపాటు అక్కడ బంధించి ఉంచుతాడు. రాముడు వానరులు, భల్లూకాల సైన్యంతో, ముఖ్యంగా హనుమంతుని సహాయంతో, లంకకు వారధిని నిర్మించిపోయి రావణుడిని సంహరిస్తాడు. సీతను వెనకకు తీసుకువస్తాడు. కాని, పరపురుషుని బందీగా ఉన్నందున తన పాతివ్రత్యం కాకున్నా ప్రతిష్ట దెబ్బతిన్నదనే చర్చ తలెత్తటంతో ఆమెను అగ్నిపరీక్షకు గురిచేస్తాడు. తర్వాత అడవికి వెళ్లిపోవలసిందిగా బహిష్కరిస్తాడు. అక్కడ ఆమె మగ కవలలకు జన్మనిస్తుంది. వారు పెద్దవారైన తర్వాత తండ్రి వద్దకు వస్తారు. సీత కూడా కొద్ది కాలంకోసం వచ్చి ఆ వెనుక శాశ్వతంగా భూగర్భంలోకి ప్రవేశిస్తుంది. రాముడు చిరకాలం పాటు పాలిస్తాడు. తన పాలనలో శాంతి, న్యాయం పరిఢవిల్లాయి.

రాముని తమ్ముళ్లు స్వంత సోదరులు కారు, సవతి సోదరులు కూడా కారు. దశరథునికి సంతానం లేనందున విష్ణువు అంశతో కూడిన ఒక పానీయాన్ని పొంది దానిని తన రాణులకు పంచుతాడు. సగాన్ని పట్టపురాణి కౌసల్యకు ఇవ్వగా ఆమె రాముడికి జన్మనిస్తుంది. తక్కినదానిలో మూడుభాగాలు స్వీకరించిన సుమిత్ర లక్ష్మణ, శతృఘ్నులను, ఒక భాగం తీసుకున్న కైకేయి భరతుడిని కంటారు.

మౌర్య వంశానంతరం విదేహ వంటి రాజ్యాలు శక్తివంతంగా ఉండగా రచించిన రామాయణం, రామరాజ్య దార్శనికతతో రాజరికాన్ని సమర్థిస్తుంది. ఈ ప్రస్తావన రామాయణంలో రెండుసార్లు కనిపిస్తుంది. కావ్యంలో మొత్తం ఏడు కాండలుండగా ఆరవ కాండం చివర ఒకసారి, ఏడవ కాండం చివర మరొకసారి. సీత తన అగ్ని పరీక్ష అనంతరం రామునితో చేరినపుడు ఆరవకాండం ముగుస్తుంది. అందులో, "విగత భర్తృకలు ఎవరూ కష్టాలకు లోనుకావటం లేదు. విషసర్పాలు, వ్యాధుల నుంచి ఎటువంటి ప్రమాదం లేదు. ప్రజలు వెయ్యేళ్లు జీవించారు" అని ఉంది. ఏడవ కాండం సీత శాశ్వతంగా భూమిలో విలీనం కావటంతో ముగుస్తుంది. ఆ సందర్భంలో ఈ విధంగా ఉంది:

> ధర్మస్థాపన కోసం కృషి చేస్తూ రాముడు దివ్యంగా పరిపాలిస్తుండగా దీర్ఘకాలం గడిచిపోయింది. భల్లూకాలు, వానరాలు, రాక్షసులు రాముని నియంత్రణలో ఉండగా, తను అనునిత్యం రాజుల మధ్య సఖ్యతను సాధించేవాడు. వరుణదేవుడు సకాలంలో వర్షించటంతో ఆహారం సమృద్ధిగా లభించేది. ఆకాశం నిర్మలంగా ఉండేది. నగరంలో, రాజ్యంలో ప్రజలు సంతోషంగా, ఆరోగ్యంగా జీవించేవారు. ఎవరూ అకాలమృత్యువు బారిన పడలేదు. ఏ ప్రాణి కూడా అనారోగ్యానికి గురి కాలేదు. రాముని పాలనలో ధర్మోల్లంఘన ససేమిరా జరిగేదికాదు.

రామరాజ్యమన్న భావన భారతదేశ రాజకీయాలలో తదనంతర కాలమంతా కనిపిస్తూనే ఉంటుంది. కాని అదే రాముని సమకాలీన రాజకీయాలలో రాజ్యాలు, వాటిని కుట్రల ద్వారా కాజేయటాలవంటివి కైకేయి – భరతుని ఉదంతంలో ప్రతిఫలిస్తాయి. రాముడు భల్లూకాలను, వానరాలను, రాక్షసులను నియంత్రించేవాడనటంలో, రాజుల మధ్య అనునిత్యం సఖ్యతను సాధించేవాడు, లేదా సామరస్యతను నెలకొల్పేవాడనటంలో కనిపించేది కూడా ఇదే.

రాముడు మానవ రూపంలో ఉన్నందున వివిధ ప్రతికూల పరిస్థితులకు గురవుతుంటాడు. భగవంతునిగా తనకు అతీత శక్తులు ఉన్నప్పటికీ సవతి తల్లి కైకేయి, రావణుని సోదరి శూర్పణఖ, చివరకు తన పత్ని సీతల కారణంగా ఆయనకు సమస్యలు ఎదురవుతాయి. సీత పరిపూర్ణమైన స్త్రీ. ఆ తేడాను చూపేందుకు రామాయణంలో ఆమెకు భిన్నమైన ఇతర స్త్రీలు, స్త్రీ రాక్షసులు ఉంటారు. కైకేయి అటువంటి వారిలో ఒకరు. భరతునికి పట్టాభిషేకం చేయవలసిందిగా దశరథునిపై వత్తిడి తెచ్చేందుకు ఆమె కోపగృహంలో చేరి, మురికి వస్త్రాలు ధరించి, నేలపై పడుకుని, భర్తను కన్నెత్తి చూసేందుకు కూడా నిరాకరిస్తుంది. తన సౌందర్యానికి వశుడైన దశరథుడు నిస్సహాయునిగా మిగులుతాడు. కౌసల్యకు కైకేయి విరుద్ధమైన స్వభావం గల స్త్రీ. కైకేయి వద్ద దుర్బుద్ధులు గల మందర అనే గూని సేవకురాలుంటుంది. సీత తన కష్టాలకు కైకేయిని గాక మందరను నిందిస్తుంది.

సీత ఎప్పుడూ మరణించదు. కాని నాలుగుసార్లు అదృశ్యమవుతుంది. రావణుడు అపహరించినపుడు మొదటిసారి, రాముడినుంచి దూరమైనప్పుడు తక్కిన మూడుసార్లు. ఆ మూడుసార్లలో ఒకమారు అగ్నిలోకి, ఒక మారు అరణ్యంలోకి, ఒకమారు భూమిలోకి ప్రవేశిస్తుంది. ఈ మూడుసార్లు కూడా తనను భర్త రాముడు బహిష్కరించినందువల్ల. ఆమెను రావణుడు ఎప్పుడో కొన్ని సంవత్సరాల క్రితం అపహరించటం అందుకు కారణం.

రావణ సంహారం జరిగిన వెంటనే రాముడు సీతను అందరి ముందుకు రపిస్తాడు. అపుడేమి జరిగిందో చూడండి:

## సీత అగ్నిప్రవేశం

రాముడు ఆమెతో ఈ విధంగా అన్నాడు: 'నీ ప్రవర్తన గురించి సందేహాలు తలెత్తాయి. అందువల్ల నీకు తోచిన చోటికి వెళ్లు. నాకు నీతో ఏ సంబంధం లేదు. కేవలం తను విరహబాధననుభవించాడనే కారణంపై ఏ సత్కుటుంబీకుడైనా, మరొక పురుషుని ఇంట నివసించిన స్త్రీని తిరిగి స్వీకరిస్తాడా? రావణుని ఒడిలో గడిపి పతనమైన నిన్ను నేనెలా స్వీకరించగలను? ఓ సీతా, లక్ష్మణుడిని, లేదా భరతుడిని, లేదా సుగ్రీవుడిని, లేదా విభీషణుడిని, లేదా నిన్ను సంతోషపెట్టగల

మరెవరినైనా ఎంచుకో. నీ అందమైన శరీరాన్ని చూసిన రావణుడు నువ్వు తన ఇంటిలోనే నివసిస్తుండగా తనను తాను ఎక్కువకాలం నిగ్రహించుకోగలిగి ఉండడు." రాముని ఈ మాటలకు సీత సమాధానం ఈ విధంగా ఉంది: "కొందరి ప్రవర్తన కారణంగా మీరు స్త్రీలందరిని అనుమానిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా నన్ను తాకి ఉన్నా, అది బలవంతంగా మాత్రమే." ఆమె తర్వాత లక్ష్మణుడివైపు తిరిగి, "నా కోసం చితిపేర్చు. ఈ విపత్తుకు అదే పరిష్కారం. అసత్యపు నిందలతో నాశనమొందిన తర్వాత నేనిక జీవించలేను". చితి మంటలు అంటుకున్న వెనుక సీత ఆ అగ్నిముందు నిలిచి, "రాముని పట్ల లగ్నమైన నా మనస్సు ఎప్పుడూ చలించని రీతిన ఈ అగ్ని కూడా చలించకుండుగాక. సర్వసాక్షిభూతమైన నీవు నన్ను కాపాడుము" అంటూ అగ్నిలో ప్రవేశిస్తుంది. అపుడు దేవతలు రామునికి తాను ఎవరైనదీ గుర్తు చేస్తారు. ఆ వెంటనే అగ్ని దేవుడు సీతను తన ఒడిలోనుంచి పైకెత్తి రాముని ఒడిలో ఉంచుతూ, "ఇదిగో నీ సీత. ఆమెలో ఎటువంటి మాలిన్యం లేదు. తనను ఆకర్షించేందుకు, బెదిరించేందుకు రావణుడు ఎంత ప్రయత్నించినా ఆమె తన గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. ఆమెను దండించరాదు. ఇది నీకు నా ఆజ్ఞ" అంటాడు. అందుకు రాముడు, "సీత రావణుడి పడక గదులలో చాలాకాలం పాటు నివసించినందున ఆమె అందరి ముందు పవిత్రాగ్నిలో ప్రవేశించవలసి వచ్చింది. నేను ఆ విధంగా తనను పవిత్రురాలిని చేయనట్లయితే సజ్జనులు నా గురించి "ఆ రాముడు దశరథ తనయుడు, తప్పకుండా కామాతురుడే, బాల్య లక్షణాలు కలవాడే"నని అనేవారు. కాని ఆమె నా పట్ల ఎన్నడూ సచ్ఛీలత గల స్త్రీ అని నాకు తెలుసు" నన్నాడు. అప్పుడు రాముడు తాను ప్రేమించిన భార్యతో ఒకటై సంతోషాన్ని అనుభవించాడు (6.103–6).

ఇందులో 'దశరథ తనయుడు తప్పకుండా కామాతురుడే" నన్నమాట కీలకమైంది. దశరథుని గురించి లోకుల అభిప్రాయమేమిటో రామునికి తెలుసు. రామునిపై రాజ్య బహిష్కారవార్త తెలిసినపుడు లక్ష్మణుడు, "రాజు వక్రబుద్ధి, ముదుసలి. కామానికి వ్యసనపరుడు. కోర్కెలతో ఇదంతా చేస్తున్నా"డని వ్యాఖ్యానించాడు. రాముడు కూడా ఇంచుమించు అదే మాటలన్నాడు: "తను వృద్ధుడు. తను పూర్తిగా కైకేయి వశవర్తుడు అయినందున నేను లేని సమయంలో ఏమైనా చేయగలడు. రాజుకు మతి తప్పింది. అర్థాని(ధనం) కన్నా, ధర్మానికన్నా ఎక్కువ శక్తివంతమైనందనుకుంటాను. ఒక అందమైన స్త్రీ కోసం ఎవరైనా, నా తండ్రి వంటి మూర్ఖుడైనా, నా వంటి సుపుత్రుడిని వదలుకుంటాడా? (2.47. 8–10)" అన్నవి రాముని మాటలు

ఆ విధంగా రాముడు కామం, అర్థం కన్నా ధర్మం ప్రధానమనే సంప్రదాయిక వైఖరిని ముందుకు తెస్తాడు. దానిని తలకిందులు చేసాడంటూ తండ్రిని నిందిస్తాడు.

కాని తన విషయానికి వచ్చేసరికి సీతను రాజకీయ పావుగా ఉపయోగించి, కామం కన్న అర్థం, ధర్మం ప్రధానమని చెప్పజూస్తాడు. అపవిత్రురాలన్న అప్రతిష్టవల్ల ప్రజలు తనపై తిరగబడితే రాజకీయంగా ప్రమాదం ఏర్పడగలదని భావిస్తాడు. దశరథుడు తనను బహిష్కరించినట్లు తాను సీతను బహిష్కరిస్తాడు. ఇక్కడ గమనించదగ్గది ఒకటుంది. "రాముడు సీతను తన ఆలింగనంలోకి తీసుకుని, మధురమైన సారాయిని, పలురకాల మాంసాలను, ఫలాలను అందించాడు... ఒక దేవుని వలె సీతతో అనునిత్యం ఆనందించాడు" అంటూ ఒక దీర్ఘమైన కావ్యభాగంలో వర్ణించిన వెంటనే సీతను రెండవసారి బహిష్కరిస్తాడు. అది కామాతురత నుంచి ఉత్పన్నమైన స్పందన. రావణుడు తననెప్పుడూ తాకలేదని, తాకాడుగాని అది తన ఇష్టానికి వ్యతిరేకంగా అని, తను మనస్సులో రామునికి బద్ధురాలై ఉన్నందున భౌతిక సంబంధం లెక్కించదగినది కాదని కొంత అస్పష్టంగా మాట్లాడుతుంది సీత. రాముని మాటలలోనూ అదే విధమైన అస్పష్టతల కారణంగా ఆ ఇద్దరి వైఖరుల మధ్య ఘర్షణ వంటి స్థితి తలెత్తుతుంది.

రాముడు సీతను అందరి ఎదుట అనుమానించటం, తన బాధలను లెక్కించనట్లు కనిపించటంతో, తానావిధంగా ఎట్లా వ్యవహరించగలడని ప్రశ్నిస్తారు దేవతలు. "నీవు దేవతలందరిలోకి శ్రేష్ఠుడవని నీకు తెలియదా? నువ్వు ఒక సాధారణ మానవుని వలె సీతను అవమానిస్తున్నావు" అంటారు. రాముడు వారి మాటలు అర్థంకానట్లు, "నన్ను నేనొక పురుషునిగా, రామునిగా, దశరథ తనయునిగా భావిస్తున్నాను. నేను వాస్తవంలో ఎవరినో తెలియజేయండి. నా తండ్రి ఎవరు? నేను ఎక్కడినుంచి వచ్చాను?" అంటాడు. రాముని ఆలోచన సూటిగా ఉండదు. తను ఒక అవతారమని దేవతలు గుర్తుచేస్తూ, సీతపట్ల అల్పత్వంతో కూడిన ప్రవర్తన నుంచి తనను వెలికి తెచ్చేందుకు ఆ వాదనను ఉపయోగిస్తారు. తర్వాత రాముడు సీతను పరిత్యజించగా, తను విష్ణువు అనే విషయాన్ని బ్రహ్మ ఆయనకు గుర్తు చేస్తాడు. అప్పటికే మరణించిన దశరథుడిని సీతారాముల దృష్టి ఎదుట ఆవిష్కరింపజేస్తాడు శివుడు. అపుడు దశరథుడు సీతతో, "పుత్రీ, రాముడు నిన్ను త్యజించినందుకు ఆగ్రహించకు. తను ఆ పని నీ మేలు కోరినందువల్లనే చేసాడు. నీ పవిత్రతను నిరూపించదలచాడు. నీ పాతివ్రత్యనిరూపణ కోసం నేడు నీవు ఎదుర్కొన్న పరీక్ష నిన్ను తక్కిన అందరు స్త్రీల కన్న యశోవంతురాలిగా చేస్తుంది. పుత్రీ, నీ భర్తపట్ల నీ విధి బాధ్యతలేమిటో ఎవరూ చెప్పనవసరం లేదు. కాని తను అధిదేవుడని మాత్రం నీకు తెలియజేయాలి" అంటాడు. ఈ సారి సీత భూమి ఒడిలోకి వెళ్లిపోయి శాశ్వతంగా నిష్క్రమించగా రాముడు వశం తప్పి ప్రవర్తించనారంభిస్తాడు. అపుడు బ్రహ్మ దేవతలందరితో కలిసి వచ్చి, "రామా, రామా, నీవు దుఃఖించవలదు. నీవు ఇంతకు ముందెవరినో, నీ రహస్యోద్దేశ్యం ఏమిటో గుర్తుచేసుకో. నీవు విష్ణువు అవతారానివని గుర్తుంచుకో" అంటాడు.

అంతకుముందు సీత అగ్ని ప్రవేశం చేస్తుంది గాని తన ఉద్దేశం ఆత్మహత్య చేసుకోవటం కాదు. తనను స్వీకరించేట్లు రాముడిని వత్తిడిచేయదలచుకుంటుంది. రాముడు చివరకు అదే చేస్తాడు. వారిక ఆనందంగా జీవించదలచుకుంటారు. కాని వదంతులు తిరిగి బయలుదేరుతాయి. రాముడు ఆమెను గర్భవతి అని కూడా చూడకుండా రెండవమారు త్యజిస్తాడు. సీత వాల్మీకి ఆశ్రమానికి వెళ్లి కవలలకు జన్మనిస్తుంది. కాని వాల్మీకికి ఈ కథనం సంతృప్తిగా ఉండదు. దానితో, సీతకు మరింత ప్రతిష్ఠాకరం కాగల విధంగా మరిన్ని పరిణామాలను సృష్టించాడు. రాముడి యాగాశ్వాన్ని లవకుశలు బంధించి తర్వాత రాముని ఆస్థానానికి వెళతారు. తమకు వాల్మీకి బోధించిన రామాయణ గాథను అక్కడ గానం చేస్తారు. అక్కడ సభికులంతా వారు రాముడిని ముమ్మూర్తులా పోలి ఉన్నారని భావిస్తారు. విషయాలు తెలిసిన తర్వాత రాముడు మాత్రం వారిని "సీతాపుత్రు"లని అంటాడు. అంతే తప్ప తన కుమారులనకపోవటం గమనార్హం. తర్వాత తను సీతను రప్పిస్తాడు. ఇది చివరిసారి. సీత ఈసారి భూగర్భంలోకి ప్రవేశించి ఈ కథకు తాను భరతవాక్యం పలుకుతుంది. ఆ చివరి సన్నివేశాలు ఈ విధంగా ఉన్నాయి:

## సీత భూగర్భ ప్రవేశం

రాముడు వాల్మీకికి ఒక సందేశం పంపుతూ "ఒకవేళ తను నిర్దోషి అయినట్లయితే, ఏ పాపం చేయనట్లయితే, తన విశ్వసనీయతను నిరూపించు కోవాలి", అంటాడు. వాల్మీకి సీతతోపాటు వచ్చి, ఆ పిల్లలు రాముని సంతానమేనని, సీత సచ్ఛీలతను దివ్యదృష్టితో చూసానని చెప్తాడు. అందుకు రాముడు "నేను పూర్తిగా అంగీకరిస్తాను. ఈ మాట సీత నాతో లోగడనే అన్నది. నేను తనను విశ్వసించి నా నివాసంలోకి పునరాహ్వానించాను. కాని ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావటంతో ఆమెను పంపివేయక తప్పలేదు. తన అమాయకత్వాన్ని నేను పూర్తిగా నమ్మినా ప్రజలకు భయపడి పంపివేసాను. వీరిద్దరు నా కుమారులేనని అంగీకరిస్తున్నాను. సీత పాతివ్రత్యాన్ని రాజసభాముఖంగా ప్రకటించి అంతటితో విషయాన్ని ముగించదలచాను" అంటాడు. అపుడు సీత, "నేను నా ఆలోచనల లోనైనా రాముడిని తప్ప మరెవరినీ తలంచని దానినైతే, ఈ భూదేవి నన్ను స్వీకరించుగాక" అని శపథం చేస్తుంది. ఆమె ఇంకా మాట్లాడుతుండగానే ఒక అద్భుతం జరుగుతుంది. నాగులు తమ శిరస్సులపై మోస్తుండగా దివ్య సింహాసనం ఒకటి భూమిని చీల్చుకుని పైకి లేస్తుంది. భూదేవి తను చేతులలోకి సీతను తీసుకుని ఆ సింహాసనంపై ఆశీనురాలిని చేస్తుంది. దేవతలు వీక్షిస్తుండగా సీత భూగర్భంలోకి ప్రవేశిస్తుంది.

కళ్లనుంచి నీరు ధారలుగా ప్రవహిస్తుండగా, శిరస్సును దించుకుని, మనోవేదనకు గురవుతూ, రాముడు మహా దీనంగా అక్కడే కూర్చునిపోతాడు. చాలాసేపు రోదించిన తర్వాత, కన్నీరు అదే రీతిన స్రవిస్తుండగా, విచారమూ ఆగ్రహమూ నిండిన స్వరంతో, "ఒకానొకప్పుడు ఆమె మహా సముద్రపు ఆవల లంకలోకి అదృశ్యమైంది. నేను తనను అక్కడి నుంచి కూడా కొనితెచ్చాను. అందువల్ల తనను భూగర్భం నుంచి కూడా తేగలను" అని ప్రకటిస్తాడు.

కాని అది జరగదు. సీత రాముడిని ఒంటరిగా మిగుల్చుతుంది. ఆమె నిష్క్రమణలో రామునిపై నింద అంతర్నిహితమై కనిపిస్తుంది. వాస్తవానికి మొదటిసారి అగ్ని ప్రవేశం కూడా రాముడి అపనమ్మకాన్ని నిందించటం కాగా, ఈసారి శాశ్వతంగా భూగర్భంలోకి నిష్క్రమించటం రెండవ నింద అయింది.

సీత ఎదుర్కొన్న రెండు కష్టాలు ఆమె స్వచ్ఛతను నిరూపిస్తాయి. అదే సమయంలో అవి అత్యున్నత స్వభావంగల ధిక్కారపూరితమైన నిరసనలు కూడా. సీత అనే స్త్రీ ప్రవేశద్వారం వద్ద కాళ్లు తుడుచుకునే గుడ్డవంటిది కాదు. తన భర్త తీవ్రమైన తప్పిదం చేసినట్లు భావించినపుడు తనను బెదిరించేందుకు సందేహించదామె. మొదట రాముడు తనతో పాటు అరణ్య వాసానికి రాకుండా ఆమెను నివారించజూస్తాడు. అందుకామె, "నా తండ్రి నన్ను నీకిచ్చి వివాహం చేసినపుడు నీ గురించి ఏమని తలపోసి ఉంటాడు రామా? పురుషుని శరీరంలో గల స్త్రీ అనా? దేనికి భయపడుతున్నావు? నేను నీ పట్ల విశ్వాసపాత్రురాలనని నమ్మలేవా? నీవు నన్ను నీ వెంటగొనిపోయినట్లయితే నిన్ను తప్ప పరపురుషుడిని కన్నెత్తి చూడటాన్ని కలలోనైనా ఊహించలేను. ఆ విధంగా ప్రవర్తించే కొందరు ఇతర స్త్రీలవంటిదానిని కాను నేను. నీ వద్దకు నేను కన్యగా వచ్చి ఇంతవరకు విధేయురాలిగా ఉన్నాను. కాని నీవు నన్ను ఇతరుల పరంచేసే వ్యక్తి వంటి మనిషివి" అంటుంది. అందుకు రాముడు, తనను "పరీక్షించేందుకే" ఆ విధంగా మాట్లాడానంటాడు. ఈ "పరీక్షించట"మన్న మాట తర్వాత కూడా వినిపిస్తుంది. రాముడు తనను విధేయులు కాని ఇతర స్త్రీలతో పోల్చుతున్నాడనే మాట కూడా రామాయణ కథలో తిరిగి వస్తుంది. సీత రావణునితో సన్నిహితంగా మెలిగిందంటూ రాముడు ఆరోపించినపుడు ఆ మాట అంటుందామె.

వారు మొదట అరణ్యంలోకి ప్రవేశించినపుడు, అటువంటి ప్రదేశంలోకి ఆయుధధారి అయి రావడమెందుకని రాముడిని అడుగుతుంది సీత. ముఖ్యంగా తను ఒక మునివలె కాషాయాంబరధారి అయి, ధార్మిక జీవనం గడపదలచుకున్నపుడు ఎందుకని అంటుంది. సీతను అడవిలో రక్షణలేని ప్రాణులను కాపాడేందుకని చెప్తాడాయన. రాముని స్వభావంలోనే హింస ఉందని, ఆయుధాలు వెంట ఉండటమంటేనే తనలో అటువంటి ఆలోచనలు కలగగలవని తాను భయపడుతున్నానని అంటుంది సీత. రాముడు నిజంగానే

ఒకవైపు రాక్షసులనేగాక మరొకవైపు వానరాలను కూడా సంహరిస్తాడు. ఒకవైపు మౌనివేషంలో ఉండి మరొకవైపు సాంసారిక జీవితం గడపటాన్ని శూర్పణఖ సైతం ప్రశ్నిస్తుంది.

## సీతాదేవత

సీత సాధారణ స్త్రీ కాదు దేవత. అయితే రాముడు స్పష్టమైన రీతిలో దేవుడైనట్లుగా ఆమె దేవత కాలేదు. వాల్మీకి రామాయణ తదనంతర శతాబ్దాలలో రాముని దైవత్వం పెరుగుతూపోయింది. కాని సీత వాల్మీకి రచన కన్నముందు కాలంలో దేవత. రామాయణంలో కనిపించే సీత ఒక మాజీ దేవత. ఆ ఛాయలు కొంతవరకు మాత్రం ఈ కావ్యంలో కనిపిస్తాయి. వాటిని తుడిచిపెట్టకపోయినా ఉపేక్షించటం కనిపిస్తుంది. అందుకు భిన్నంగా, రాముడిని ఒక దేవునిగా రూపుదిద్దే క్రమంలో, తనలోని వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు తర్వాతి తరాలవారు ప్రయత్నించారు. సీతారాములిద్దరి దైవత్వాలు ఎక్కడో ఒకచోట మాత్రం పరస్పరం తారసపడతాయి.

సీత అనే మాటకు 'పొలం చాలు' అని అర్థం. రుగ్వేదంలోని ఒక మంత్రం భూదేవతను గురించి చెప్తూ, పొలం చాలును ఆవుతో పోల్చుతుంది. దానినుంచి సమస్త ఆహారాలను స్వీకరించడం గురించి చెప్తుంది. రాముడు సీతను వివాహమాడటమంటే భూదేవతను పెళ్లాడటమే. రాజులు ఎప్పుడూ భూపతులే. కాని ఈ సందర్భంలో మాత్రం, రాముడు భూదేవి కుమార్తెను వివాహమాడినట్లు రామాయణ కథ స్పష్టంగా వర్ణిస్తుంది. సీత పుట్టుకను ఆమె తండ్రి అయిన విదేహ రాజు జనకుడు ఈ విధంగా వర్ణిస్తాడు:

### సీతా జననం

> ఒకరోజు యాగభూమిలో నేను, స్వర్గలోకవాసి అయిన అత్యంత సౌందర్యవతి మేనక ఆకాశంలో ఎగిరిపోతుండగా చూశాను. అపుడు నాకు, 'ఒకవేళ తనతో సంతానాన్ని కన్నట్లయితే ఆ శిశువు ఎంత గొప్పగా ఉండగలదోకదా' అనిపించింది. నేను ఆ విధంగా ఆలోచిస్తుండగా నా వీర్యం భూమిపైకి స్రవించింది. తర్వాత నేను భూమిని దున్నుతుండగా, నేల నుంచి తొలి ఫలంగా నా కుమార్తె లభించింది. ఆమెకు దేవతా సౌందర్యం, ఆ లక్షణాలు ఉన్నాయి. తను భూతలంపై నుంచి ఉద్భవించినందున, ఏ గర్భంనుంచి కూడా కానందున, ఆమెను సీత, పొలం చాలు, అన్నాము.

రామునికి ఈ కథనం తెలుసు. సీత భూగర్భ ప్రవేశం చేసిన తర్వాత ఆయన భూమిలో, "ఒకప్పుడు జనకరాజు భూమిని దున్నుతుండగా సీత లభించినందున నీవే నా అత్తవు" అంటాడు. యాగ సందర్భంగా జనకుడు భూమిని దున్నుతుండగా సీత జన్మించింది. ఆమె రాముని అశ్వయాగ సందర్భాన్ని పురస్కరించుకుని భూగర్భంలో

ప్రవేశించింది. ఆ విధంగా తన జనన మరణాలు రెండూ యాగాలు, బలులతో ముడిపడినవే. రావణుడిని సంహరించాలనే దైవ యత్నంలో భాగంగా రామునివలెనే సీత కూడా అవతరిస్తుంది. రావణుని మరణానికి రాముడు కాకుండా సీత మూల కారణమైంది. విభీషణుడు మొదట సీతను రామునికి తిరిగి ఇచ్చివేయవలసిందిగా రావణునికి నచ్చచెప్పేందుకు ప్రయత్నిస్తూ, "సీత రూపంలో గల ఆ మహా సర్పాన్ని ఎందుకు తీసుకువచ్చా"వంటాడు. "సీత అనే రాక్షస సంహారిణి" జన్మించగలదంటూ శివుడు కూడా దేవతలకు హామీ ఇస్తాడు.

కథ చివరన సీత రాముడిని వదలి వెళ్లిపోతుంది. ఒక హిందూ భార్య ఆ పని చేయటం అసాధారణమైనది. అదే విధంగా, ఆమె స్వర్గంలో తన భర్తను తిరిగి చేరదు. తను భూగర్భంలోకి చేరగా రాముడు వైకుంఠానికి చేరి విష్ణువుతో లీనమవుతాడు. ఆ విధంగా ఇరువురు దైవత్వం పొందుతారు గాని వేర్వేరు చోట్ల. సీతను అనుమానించినందుకు రాముడిని మందలించిన బ్రహ్మ, ఆమె లక్ష్మీదేవి అవతారమని, మరణానంతరం స్వర్గంలో తనను తిరిగి చేరగలదని హామీ ఇస్తాడు. కాని అది జరగదు. వైకుంఠానికి రాముని తిరిగి రాకపై చాలా వర్ణనలున్నాయి. వానరాలు కూడా తమ దైవ స్వరూపాలను పొందుతాయి. రాముడికి స్వర్గంలో స్వాగతం పలికేందుకు రాక్షసులతో సహా అందరూ సిద్ధంగా ఉంటారు. కాని సీత జాడ కన్పించదు.

సీత చిత్రీకరణ దేవతగా కన్న మానవమాత్రురాలిగానే ఎక్కువ సాగుతుంది. తన బహిష్కరణలో, ఆమె కష్టాలను అనుభవించటంలో ఇదే కనిపిస్తుంది. రామునివలె ఆమె కూడా తాను దేవతననే విషయం మరిచిపోతుంది. లంకలో బంధితురాలిగా ఉన్నప్పుడు, "ఇటువంటి దుర్భర జీవితాన్ని అనుభవించేందుకు గత జన్మలో ఘోరమైన పాపం ఏదో చేసి ఉంటాను. నాకు చనిపోవాలని ఉందిగాని ఆపని చేయలేను" అంటుంది.

రామాయణంలో కైకేయి, మందర, శూర్పణఖ వంటి స్వభావంగల స్త్రీలు ఒకవైపు, సీతవంటి వారు మరొకవైపు కనిపిస్తారు. అయితే బ్రాహ్మణ దృక్పథం గల రచయితలు సీతను హిందూ స్త్రీ లోకానికి ఆదర్శప్రాయురాలిగా చిత్రించగా, ఇతర సంస్కృత రచనలు కొన్నింటితోపాటు ప్రాంతీయభాషలలో గల రామాయణ కథనాలు కొన్ని ఆమెలోని మోహావేశాన్ని, శృంగారపరమైన పార్శ్వాన్ని ఎత్తి చూపాయి. ఇదే పార్శ్వం వాల్మీకి రామాయణంలోనూ కనిపిస్తుంది. ఒకవేళ సీతను వాల్మీకి రామాయణంలో ఏవిధంగా చిత్రీకరించారో అదేగాని భారతీయ స్త్రీలకు ఆదర్శప్రాయం అయి ఉంటే పరిస్థితి ఏ విధంగా ఉండేదోననిపిస్తుంది. మొత్తానికి వాల్మీకి రామాయణంలో స్త్రీల అణచివేతకు, ఆ స్థితిపట్ల వారి ప్రతిఘటనకు కూడా బీజాలున్నాయి. వీటిలో మొదటిది ధర్మాలు, శాస్త్రాల పద్ధతిగా మారగా, రెండవది ఇతర హిందూ సంప్రదాయాలలో భాగమైంది.

సీత పతివ్రత కాకుండా పోగలదేమోనన్న అనుమానం రామునికి పీడకలగా మారి వేధిస్తుంది. రామాయణంలో ఉత్తమ స్త్రీలనే వారిలో గల కామపిశాచులు ఆ విధమైన కోర్కెలనే వ్యక్తీకరిస్తుంటాయి. తర్వాత కాలంలో వెలువడిన బాల రామాయణంలో శూర్పణఖ కైకేయి రూపాన్ని, మరొక రాక్షసుడు దశరథుని రూపాన్ని దాల్చుతారు. వారిద్దరు రాముడిని బహిష్కరిస్తారు. అనగా నిజమైన కైకేయికి, దశరథునికి ఆ ఉదంతంతో నిమిత్తం లేదన్నమాట. అంతా రాక్షసులు చేసినపని. వాల్మీకి రామాయణంలో మాత్రం కైకేయి, సీతలతో అంతర్నిహితంగా గల కామపిశాచులు వారిలోనే అణగిపోయి ఉంటాయి. అవి సహజభావనలని, సాధారణ స్త్రీలు సీతవంటి ఆదర్శస్త్రీలు కాకుండా అవి అడ్డుపడు తుంటాయని రామాయణం చెప్తుంది. ఉత్తములనే ఇతర స్త్రీలలోని కామపిశాచులను చిత్రీకరించటంలోని ఉద్దేశం, సరిగా ఆ సమయంలో సీత పాతివ్రత్యాన్ని అందుకు భిన్నంగా చూపి ప్రశంసించటమే. సీతలోని ఆ లక్షణాన్ని పైకెత్తటం కోసం తనలోని ఇతర మంచి లక్షణాలను తగ్గించి చూపుతారు. స్త్రీలలోని కామపిశాచులకు కళ్లెం వేసి ఉంచటం కోసం తదనంతర శతాబ్దాల కాలంలో వారిని బాగా అణచిపెట్టారు.

రామాయణంలో ముఖ్యంగా ముగ్గురు ప్రమాదకర స్త్రీ రాక్షసులున్నారు. వారిలో తాటకిని రాముడు హతమార్చుతాడు. స్త్రీని పురుషుడు ప్రాణాలు తీసిన సందర్భాలు పురాణాలలో ఉన్నాయని మునులు చెప్పిన తర్వాత ఆపని చేస్తాడాయన. అయోముఖి అనే రాక్షసి లక్ష్మణునితో శృంగారాన్ని కోరగా ఆయన ఆమె ముక్కు చెవులను, వక్షోజాలను కోసివేస్తాడు. రామునితో ప్రేమ కోరినందుకు శూర్పణఖ ముక్కు, చెవులను కూడా కోసివేస్తాడు లక్ష్మణుడు. పరపురుషులను మోహించే స్త్రీలను ఆ విధంగా శిక్షించాలని ధర్మశాస్త్రాలు చెప్తున్నాయి.

అయితే శూర్పణఖకు విధించిన శిక్షమాత్రం రామునికి ఊరకనేపోదు. ఎందుకంటే ఆమె రావణుడి సోదరి. ఆమె రాముడి ప్రేమను కోరగా ఆయన తనతో, తాను వివాహితుడనని, ఇద్దరు పత్నుల మధ్య వైరాన్ని భరించలేనని అంటాడు. లక్ష్మణుడు ప్రస్తుతం ఒంటరి, యువకుడు అయినందున ఆయనతో ఆనందించమని చెప్తాడు. లక్ష్మణుడు సరిగా ఆ సమయంలో ఆమె ముక్కు చెవులు కోస్తాడు. ఆ బాధతో, అవమానంతో రావణుని వద్దకు పరుగు తీసిన ఆమె, సీత అందాన్ని వర్ణించి రెచ్చగొడుతుంది. అందుకాయన ఆకర్షితుడవుతాడు. అది యుద్ధానికి దారితీస్తుంది. దేవతలు మొదటినుంచి కోరుకున్నదీ అదే.

**జంతువులు**

సీత చివరిసారిగా అశ్వయాగం సందర్భంగా అంతర్ధానమవుతుంది. ఆమె అక్కడకు తన కుమారుల కారణంగా వస్తుంది. వారు యాగస్థలంలో కావ్యాలాపన చేస్తారు. రథసారథులైన గాయకులు ఒక ఉత్సవానికి మధ్యమధ్యగానం చేయటం గురించి పైన

చెప్పుకున్నాము. ఇది అటువంటిదే. సంచారగాయకుడిని అపుడు 'కుశిలవ' అనేవారు. ఈ ఇద్దరు పిల్లలపేర్లు అదే పదాన్ని విభజించి కుశుడు, లవుడు అనటం ఆసక్తికరం. యాగం వద్దకు రావటం ద్వారా వారు రాముని కుటుంబాన్ని ఏకం చేసినట్లవుతుంది. అదే విధంగా వారు గానం చేసింది కూడా రాముని కుటుంబకథనే.

రామాయణం ఆరంభంలో, చివరిలోనూ అశ్వయాగం కీలకపాత్ర వహిస్తుంది. సంతానహీనుడైన దశరథుడు రాజ్యం కోసమో, వైవాహిక సుఖాల కోసమోగాక పుత్ర సంతానాన్ని కోరి అశ్వయాగం జరుపుతాడు. ఆ యాగాశ్వం ఒక సంవత్సరం పాటు అనేక రాజ్యాలలో స్వేచ్ఛగా సంచరించి వచ్చిన తరువాత, అనేక జలచరాలతో పాటు దానిని వధిస్తారు. అవిగాక రకరకాల ఇతర జంతువులు, పక్షులను వేరుగా చంపుతారు. అవి మూడు వందలుంటాయి. కౌసల్య స్వయంగా ఆ అశ్వాన్ని మూడు కత్తులతో నరికి, దానితో కలిసి ఒక రాత్రి నిద్రిస్తుంది. తక్కిన ఇద్దరు రాణులు కూడా అదేపని చేస్తారు. యాగాశ్వం మూలుగలను రాజువాసన చూస్తాడు. ఆ బలిని రామాయణంలో చాలా వివరంగా వర్ణించి చెప్పారు. యాగం ముగిసిన తర్వాత విష్ణువు అంశతో రాముడు, తన సవతి సోదరులు జన్మిస్తారు.

కథ చివరన సీతను వెడలనంపిన తర్వాత రాముడు పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించాలని భావిస్తాడు. కాని లక్ష్మణుడు, అందుకు బదులు అశ్వమేధయాగం జరపవలసిందిగా రామునికి నచ్చజెప్తాడు. "అందువల్ల అన్ని పాపాలు హరించుకుని పోగలవు. శుద్ధికి అది సరైన మార్గ"మని అంటాడు. ఒక బ్రాహ్మణ అసురుని హత్యాదోషం నుంచి విముక్తికి ఇంద్రుడు, శాపం వల్ల కోల్పోయిన తన పుంసత్వాన్ని తిరిగి పొందేందుకు ఒక రాజు అదే పనిచేసినట్లు చెప్తాడు. రాముడు అదే ప్రకారం చేస్తాడు. తన "పాపాలు" ఏమిటన్న ప్రస్తావనలేదు. అయితే రావణుడు రాక్షసుడైనా బ్రాహ్మణుడు. పైగా ప్రజాపతికి మనవడు. అందువల్ల అది పాపమవుతుంది. రెండవపాపం ఒక స్త్రీ అయిన సీతను బహిష్కరించటం. ఇది స్త్రీగా మారిన రాజువంటి దోషమని భావించాలి. యాగాశ్వాన్ని లక్ష్మణుడు ఏడాది కాలం అనుసరిస్తాడు. కాని సీత లేనందున ఆ అశ్వంతో ఒక రాత్రి నిద్రించేందుకు గాని సంతానాన్ని కనేందుకు గాని రాణి ఎవరూలేరు. కనుక యాగ సమయానికి సీత తిరిగి రావటం అవసరం.

రెండు యాగాలూ విజయవంతమయాయిగాని వాటి మధ్య కొంత తేడా ఉంది. రెండవది ముగిసేముందు రాముని కుమారులు మాత్రమే ఆ కార్యక్రమం వద్ద కనిపిస్తారు. రాణి చివరన వస్తుంది.

రాముడు, సీత, లక్ష్మణుడు ముగ్గురూ పరిపూర్ణులైన వ్యక్తులు. కాని ఈ కథ వారికి పరిమితమై ఉంటే గొప్ప ఇతిహాసం కాకపోయేదేమో. అందులో రాక్షసులు, వానరాలు, భల్లూకాల వంటి ఇతర పాత్రలు కూడా ఉన్నాయి. ఇతరత్రా ఇవన్నీ మానవులకు

సన్నిహితమని, వారిని పోలి ఉండటమే గాక వీటిలక్షణాలు వారిలో కనిపిస్తాయని అంటారు. అయితే కథలో భల్లూకాల పాత్ర స్వల్పమయినందున వానరాలను గమనిద్దాం.

మానవులకు, వానరాలకు మధ్య రామాయణం అనేక పోలికలను చూపుతుంది. వాటిలో కొన్ని స్పష్టంగా, కొన్ని అంతర్నిహితంగా ఉంటాయి. తమకు జింకల భాష తెలియదని కథలోని మనుషులంటారు. కాని వానరాల విషయంలో అటువంటి వ్యాఖ్యలేమీ చేయరు. హనుమంతుడు మానవ భాషనే గాక సంస్కృతం కూడా మాట్లాడగలడు. తను లంకకు చేరినపుడు సీతతో ఏ భాషలో మాట్లాడాలన్న విషయమై తనలో తాను చర్చించుకుంటాడు. చివరకు సంస్కృతంలో సాధారణ మనిషివలె మాట్లాడాలని, బ్రాహ్మణుడివలె మాట్లాడినట్లయితే సీత తనను మారు రూపంలోగల రావణునిగా భావించగలదని సందేహిస్తాడు. దానితో అదే పద్ధతిలో, ఒకప్పుడు దశరథుడనే మహారాజు ఉండేవాడంటూ విషయాన్ని చెప్పనారంభిస్తాడు. సీత తనను విశ్వసిస్తుంది.

మనుషులవలె వానరాలలో ప్రత్యేకమైనవి కూడా దేవతల సంతానమే. సుగ్రీవుడు సూర్యుని కుమారుడు కాగా, వాలి ఇంద్రునికి, హనుమంతుడు వాయువుకు సంతానం. రావణుడు సీతను అపహరించిన వెనుక రామలక్ష్మణులు సుగ్రీవుడిని కలుస్తారు. వానర రాజ్యానికి మాజీ రాజు అయిన సుగ్రీవుడు, తన సోదరుడు వాలి తన భార్యను, రాజ్యాన్ని కూడా అపహరించినట్లు రామునికి ఫిర్యాదు చేస్తాడు. సుగ్రీవుని పక్షం వహించిన రాముడు ఆ వానర యోధులిద్దరు పరస్పరం పోరాడుతుండగా వాలిని దొంగచాటుగా బాణం వేసి సంహరిస్తాడు. ఇది అధర్మమన్న వివాదం నేటికీ కొనసాగుతున్నది. కాని రాముడు వాలిని ఎందుకు దెబ్బతీసినట్లు? తన భార్యను రావణుడు అపహరించటానికి, సుగ్రీవుని భార్యను వాలి అపహరించటానికి మధ్య పోలికలు చూసినట్లా? కాని తమ రాజ్యానికి పెద్ద కుమారునిగా తను వారసుడు కావలసినట్లే, వానర రాజ్యానికి సుగ్రీవుని అన్నగా వాలి రాజు కావాలి. సుగ్రీవుడు చిన్నవాడై కూడా అన్న నుంచి రాజ్యాన్ని, వానర రాణిని కాజేసాడు. వాలి తన అధికారాన్ని తిరిగి సాధించుకున్నాడు. అయినప్పటికీ తనవలె భార్యను పోగొట్టుకున్నందుకే రామునికి సుగ్రీవుని పట్ల అనుకూలత కలిగి ఉండవచ్చు. ఇక్కడ సింహాసనంతో పాటు రాణి కూడా చేతులు మారటం గమనించదగ్గది. ఒక సందర్భంలో రాముడు సీతను సంతోషంగా భరతునికి ఇవ్వగలనంటాడు (2.16.33). దాని అర్థం రాజ్యంతో పాటు రాణి కూడా మరొక రాజుకు లభించగలదని తను భావిస్తున్నట్లా? రాముడు తన తండ్రిపై, భరతునిపైగల ఆగ్రహాన్ని వాలిపై ప్రదర్శిస్తాడు.

రాముడు వాలిని సంహరించటానికి గల కారణం మనకు అర్థమైనప్పటికీ తనను బాణంతో వీపులో ఎందుకు కొట్టినట్లు? వానరాలకు మానవ భాష అర్థమైనపుడు వాటికి మానవ ధర్మం కూడా వర్తించాలి. వాలి తన మరణానికి ముందు రాముడిని మందలిస్తూ,

"నేను కేవలం వానరాన్ని, అడవిలో జీవిస్తాను. శాకాహారిని. కాని నీవు మానవునివి. వానర మాంసాన్ని భక్షించటం, వానర చర్మాన్ని ధరించటం ధర్మ విరుద్ధం" అంటాడు. రాముడు ఆత్మ సమర్థన చేసుకుంటూ, "అడవి జంతువులను బంధించేందుకు మనుషులు వలలను పన్నటంవంటివి సర్వసాధారణం. అందులో దోషమేమీ లేదు. మనుషులు సైతం వేటాడతారు. నువ్వు కేవలం వానరానివి. రాజులు మాత్రం మానవ రూపంలో గల దేవతలు'' అంటాడు. కాని రాముడు ధర్మాన్ని ఉల్లంఘించినట్లు రామాయణం వ్యాఖ్యానించింది. నవ్వు మానవునివి (వానరాలకన్న పై స్థాయి) అని వానరాలు గుర్తుచేయగా, రాముడు పొరపాటు చేసినపుడు దేవతలు ఆయనకు నువ్వు దేవతవు (మానవులకన్న పైస్థాయి) అని గుర్తుచేస్తారు.

రామునికి లక్ష్మణునిపై గల అనుమానాలను వాలి ప్రస్తావిస్తాడు. సీతతో తనకు బదులు లక్ష్మణుడు నిద్రించవచ్చుననే సందేహం రామునికి ఉండి ఉంటుందని రామాయణం సూచనామాత్రంగా చెప్తుంది. లక్ష్మణుడు ఆ పని చేయబోడని పలుమార్లు నొక్కి చెప్తుంది. రాముడు సీతను బహిష్కరించినపుడు ఆమెను మరెవరినైనా ఎంచుకొమ్మంటూ కఠినంగా మాట్లాడటాన్ని చూశాము. అపుడాయన ప్రస్తావించిన పేర్లలో అందరి కన్న లక్ష్మణునిది ముందు ఉంటుంది.

ఒక సందర్భంలో సీత, రాముని ప్రమేయం లేకుండానే సోదరులిద్దరి మధ్య సమస్యా అన్నట్లుగా మారుతుంది. రాముడు బంగారు జింకను వెతికేందుకు అడవిలోకి వెళ్ళి చాలా సేపటివరకు తిరిగి రాకపోవటంతో సీత ఆందోళన చెంది లక్ష్మణుడిని కూడా వెళ్లమంటుంది. అందుకు లక్ష్మణుడు నిరాకరించి, రాముడు తన జాగ్రత్త తాను తీసుకోగలడంటాడు. అందుకు "రాముడు అంతం కావాలన్నది నీ కోరిక. అందుకు కారణం నేను.. నీకు తనపై అనురాగం లేదు. తాను జాడలేకుండాపోయినట్లయితే, ఒంటరిగా మిగిలే నేను, నువ్వు ఇక్కడకు ఎందుకు వచ్చావో ఆ పని చేయకుండా ఎట్లా ఆపగలను? నీవు చాలా క్రూరుడివి. భరతుడు నిన్ను రాముని వెంట తన వేగుగా పంపాడు. అంతే అయి ఉంటుంది. కాని నేను రాముడిని గాక మరొక పురుషుడిని ఎన్నటికీ కోరుకోను. పర పురుషుని తాకనైనా తాకను. నా పాదంతో కూడా", అని మాట్లాడుతుంది. అందుకు ఆగ్రహించిన లక్ష్మణుడు తనను ఆ విధంగా అనుమానించినందుకు ఆమెను నిందిస్తాడు. సీత ఒక సాధారణ స్త్రీ వలెనే ఇతరుల గురించి చెడుగా ఆలోచిస్తున్నదంటాడు. అని వెళ్లిపోగా, ఒంటరిగా మిగిలిన సీతను రావణుడు అపహరిస్తాడు. రాముడు తిరిగి వచ్చిన తర్వాత, సీత మాటలను లక్ష్మణుడాయనకు కాస్త భిన్నంగా చెప్తాడు. అది ఈ విధంగా ఉంది: "సీత రోదిస్తూ నాతో ఈ విధమైన దారుణమైన మాటలన్నది: నువ్వు నాపై దృష్టి పెట్టావు. కాని నీ సోదరుడు వినాశమొందినా నువ్వు నన్ను పొందలేవు.

నువ్వు భరతునితో చేయి కలిపావు. నువ్వు మమ్ములను ఇక్కడకు వెంబడించిన రహస్య శత్రువువు". రాముడు మాత్రం ఇదంతా విస్మరించి లక్ష్మణునితో, "నువ్వు సీతను వదలివేసి నా కోసం రాకపోవలసింది. కోపగించిన ఒక స్త్రీ నిన్ను నిందించినందుకు తన ఆగ్రహానికి, నీ ఆగ్రహానికి లొంగిపోయి ఆ పని చేయటం సరికా"దంటాడు.

కాని సీతకు ఏదో ఒక స్థాయిలో అటువంటి భయాలు లేనట్లయితే ఆ విధంగా ఎందుకు మాట్లాడినట్లు? అవే భయాలు లక్ష్మణుడికి కూడా లేనట్లయితే తను అంత ఆగ్రహంగా ఎందుకు స్పందించినట్లు? రాముడు సీత కోసం అన్వేషిస్తుండగా ఒకచోట ఆమె వస్త్రం ఒకటి, దానితో పాటు ఆభరణాలు కనిపిస్తాయి. అపుడు, "నువ్వు వీటిలో వేటినైనా గుర్తిస్తావా?" అని లక్ష్మణుడిని అడుగుతాడు. అందుకు లక్ష్మణుడు "నేను సీత పాదాలు మినహా ఏమీ చూడలేదు. అందువల్ల కాలి ఆభరణాలను మాత్రం గుర్తించగల"నంటాడు. వాటినన్నింటిని రాముడు స్వయంగా గుర్తించగలిగినపుడు లక్ష్మణుడిని ప్రశ్నించటం ఎందుకు?

రామాయణం చివరన రాముడు లక్ష్మణుడిని విచిత్రమైన రీతిలో సంహరించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఒకసారి యముడు రాముని వద్దకు తన అవతారాన్ని చాలించవలసిన సమయం వచ్చిందని గుర్తుచేసేందుకు వస్తాడు. కాని ఆ పని చేయకుండా తనను ఎవరైనా ఆప జూసినట్లయితే ఆ వ్యక్తిని సంహరించగలనంటూ మాటివ్వమని యముడు రాముడిని కోరుతాడు. అపుడు ఒక ముని వచ్చి తాను రాముడిని కలవదలచుకున్నానని, ఎవరైనా ఆపినట్లయితే ఈ లోకాన్ని నాశనం చేయగలనంటూ లక్ష్మణుడిని హెచ్చరిస్తాడు. అపుడు లక్ష్మణుడు లోక నాశనంకన్న తన మరణమే మేలని భావిస్తాడు. దానితో రాముడికి అంతరాయం కలిగిస్తాడు. రాముడు తన అవతారాన్ని చాలించేపని భంగపడుతుంది. అపుడు రాముడు, తనకు దూరం కావటాన్ని లక్ష్మణుడు భరించలేడన్న ఆలోచనలతో, మరణానికి సమానమైన బహిష్కారాన్ని విధిస్తాడు. ఆ విధంగా యమునికిచ్చిన మాటను నిలబెట్టుకుంటాడు. కాని ఆ వెంటనే లక్ష్మణుడు ప్రాణత్యాగం చేస్తాడు. ఇందులో నర్మగర్భమైన అర్థం ఏదైనా ఉందా? ఒక సోదరుడి భార్యను అపహరించిన వాలిని రాముడు సంహరించాడు. రామునికి లక్ష్మణునిపట్ల కూడా అణగారిన అనుమానాలు, ఆగ్రహాలు ఉండి ఉంటాయా?

సోదరులైన మనుషుల మధ్యగల సంబంధాలు, భావోద్వేగాలు, వ్యవహారణలు వానర సోదరుల విషయంలో ప్రతిఫలించాయనుకోవాలేమో. వానరాలన్నవి కేవలం వాల్మీకి సృష్టి, లేదా రాముని మనసు నుంచి ప్రతిఫలించినవి కావు. అవి మనుషులకు సమాంతర జీవితాలు. రెండూ యథాతథం కాకపోయినా మనుషుల జీవితానికి అవి పోలికలు. అంతేకాదు. రాముడు ఉత్తముడైన పురుషుడు, తనయుడు, సోదరుడు అయినందున

తన ఆగ్రహాన్ని తండ్రిపైన, సోదరునిపైన ప్రదర్శించలేడు. కాని ఆ పనిని తనకోసం వానరాలు చేస్తాయి. వానరాలతో కూడిన అడవి ఒక వింత ప్రపంచం వంటిది. అక్కడ రాముని అవ్యక్త భావనలకు స్వేచ్ఛ లభిస్తుంది. ఆ భావనలను ఆయన మానవ సమాజంలో వ్యక్తీకరించలేడు. కాని ఆ ప్రతీకారాన్ని అడవిలో తీర్చుకోగలడు.

## మాట్లాడే జంతువులు, జంతువుల వంటి మనుషులు

రామాయణంలో మనుషులకు ప్రతిరూపాలవలె కనిపించేది వానరాలు మాత్రమే కాదు. ఇదే విధమైన ఇతర కథనాలు కొన్నింటిలో వేటగాళ్లు మనుషులను చూసి వారు శృంగార ప్రక్రియలోగల జంతువులని భావిస్తారు. శృంగారానికి భంగం కలిగించటమనే అంశంతో ఒక పురాణ కథ ఉంది. శివపార్వతులు ఒకసారి అంతులేకుండా సాగిస్తున్న సంభోగం దేవతలకు భయం కలిగిస్తుంది. వారికి తాము భరింపలేనంత శక్తిగల కుమారుడు జన్మించగలడని అనుమానిస్తారు. వారు దానితో శివపార్వతులకు అంతరాయం కలిగిస్తారు. అపుడు శివుని వీర్యాన్ని అగ్ని స్వీకరిస్తాడు. అగ్ని నుంచి ఆరు తలలుగల స్కంధుడు జన్మించి దేవతలకు సేనాధిపతి అవుతాడు. కాని, తమ శృంగారానికి అంతరాయం కలిగినందుకు ఆగ్రహించిన పార్వతి, దేవతల భార్యలకు శాశ్వతంగా సంతానం కలగరాదని శపిస్తుంది. తాను కుమారుడిని కోరి శివునితో రమిస్తుండగా ఆ పని చేసినందుకు వారికది శిక్ష అని ప్రకటిస్తుంది. పార్వతి శాపం కారణంగా సీతతో సహా పలువురు సంతానం పురుష దేవతలకు, లేదా రుషులకు జన్మిస్తారు. వీరు స్త్రీ గురించి ఆలోచించటం, లేదా వారిని చూడటం చేసినంత మాత్రాననే వీర్యం స్రవించి, స్త్రీల గర్భానికి బదులు పుష్పాలు, ఆడ జంతువు, నది, పొలం చాలు మొదలైన వాటిలోకి ప్రవేశిస్తుంది. అపుడు తల్లులు లేని సంతానం (అయోనిజ) కలుగుతారు.

మహాభారతంలోని ఒక కథలో పాండవుల తండ్రి అయిన పాండురాజు వేటకు వెళ్లి ఒక దుప్పిని చంపుతాడు. నిజానికి ఆ దుప్పి ఒక రుషి. ఆయన తన భార్యతో పాటు జంతురూపం దాల్చి శృంగారంలో పాల్గొంటుండగా ఆ విషం తెలియని పాండురాజు బాణం వేస్తాడు. అందుకు ఆగ్రహించిన ఆ రుషి, పాండురాజు తన భార్యలలో ఎవరిని కూడినా వెంటనే మరణించగలడని శపిస్తాడు. దశరథుడు తాను రాముడిని బహిష్కరించిన అయిదు సంవత్సరాల తర్వాత ఒక అర్థరాత్రి కౌసల్యను నిద్రలేపి, తనకు అకస్మాత్తుగా గుర్తుకు వచ్చిన ఒక ఉదంతం గురించి చెప్తాడు. దాని ప్రకారం, దశరథుడు యువకునిగా ఉన్నపుడు విలువిద్యలో ఆరితేరినవాడనే పేరుండేది. కేవలం శబ్దాన్ని వినికూడా బాణం వేయగలడనేవారు. ఒక వర్షాకాలంలో చెట్లకావల, దేనినో నీటితో నింపుతున్న శబ్దమవుతుంది. అది ఏనుగని, తొండంతో నీరుతాగుతున్నదని భావించిన దశరథుడు బాణం వేస్తాడు. కాని అది ఏనుగు కాదు. ఒక ముని కుమారుడు. తనపైన ఒక వృద్ధురాలు,

అంధురాలైన తల్లి (శూద్ర స్త్రీ) తో పాటు తండ్రి (వైశ్యుడు) ఆధారపడి ఉంటారు. ఆ తండ్రి దశరథుడిని ఆయన కూడా తనవలెనే వృద్ధాప్యంలో కుమారుడి కోసం విచారిస్తూ మరణించవలసిందిగా శపిస్తాడు. ఆ శాపాన్ని గుర్తుచేసుకుంటూ మరణిస్తాడు దశరథుడు. ఇటువంటి కథలే మరికొన్ని కూడా ఉన్నాయి. వాటిలో ఒకటి కృష్ణుడి గురించినది. కృష్ణుడు తన అవతారాన్ని చాలించదలచి ఒకచోట నేలపై శయనించి ఉంటాడు. ఒక వేటగాడు తనను జింకగా భావించి బాణంతో కొడతాడు. కాని దగ్గరకు వెళ్ళి చూసి మనిషి అని గుర్తుపట్టి విచారిస్తాడు. కృష్ణుడు తనను సమాధానపరుస్తాడు.

మొత్తంమీద రామాయణ, మహాభారతాలలోని ఈ విధమైన కథలన్నింటిలో కలిపి అయిదు విధాలైన కథాంశాలు కనిపిస్తాయి: వేటాడే వ్యసనానికి లోనుకావటం, మనిషిని జంతువుగా భావించి ఆ "జంతువు" ప్రాణాలు తీయటం, జంటలో ఒకరినిగాని ఇద్దరినీ గాని చంపి వారి శృంగారానికి భంగం కలిగించటం, జంతువులూ పక్షుల భాషను అర్థం చేసుకోవటం, కవితామయమైన భాషా సృష్టి.

మనుషులకు, జంతుజాలానికి మధ్య భూత దయ అనే బంధం ఉంటుంది. వాటిని చంపినపుడు పొరపాటు చేసినట్లు భావించటమూ కన్పిస్తుంది. అహింసా సంబంధమైన ఆలోచనలు కలుగుతాయి. జంతువులు, పక్షువుల గురించిన హిందువుల కథలలో ఇది మొదటినుంచి కనిపిస్తుంది. రామాయణంలోని జటాయు ఉదంతం ఇందుకొక ఉదాహరణ. రావణుడు సీతను అపహరించి తీసుకుపోతుండగా తనపై దాడి జరిపిన జటాయు, తనకు ధర్మ బోధ చేస్తుంది. రావణుడు ఆ పక్షి రెక్కలు తెగవేసి సీతను తీసుకుపోతాడు. నేలకూలిన జటాయు తర్వాత రాముడికి, సీతను రావణుడు ఎటు తీసుకుపోయాడో చెప్తుంది. తనకు జటాయు పక్షి దశరథునితో సమానమన్న రాముడు, దానికి తన తండ్రిస్థాయిలో అంత్యక్రియలు జరుపుతాడు. రామాయణంలోని మరొక పక్షి కాకి. లంకలో సీతను చూసిన హనుమంతుడు అందుకు ఆనవాలుగా రామునికి ఏదైనా ప్రత్యేక ఉదంతం గురించి గుర్తుచేయమని, అది సీతారాములకు మాత్రమే తెలిసిందై ఉండాలని అంటాడు. అపుడు సీత, ఒకసారి ఒక కాకి తనపై పదే పదే దాడిచేయగా తన రక్తంతో దాని గోర్లు ఎరుపెక్కాయని చెప్తుంది. రాముడు ఆ పక్షిని చంపగలడు గాని దయదలచి దానికి కుడికన్ను దృష్టి పోయేట్లు మాత్రం చేసి పారగొడతాడు. హిందూమతంలో కాకులు నీచ పక్షులు. వాటిని శునకాల తీరులో పరిగణిస్తారు (మనువు). సీత కాకిని రావణుడితో పోల్చుతుంది.

రామాయణంలో శునకాలకు నైతిక స్థానం కనిపిస్తుంది. సీత బహిష్కారంలో ఉండిన సమయంలో ఒక కుక్క రాముని వద్దకు వెళ్ళి తనను దేవాలయాలలోకి గాని, బ్రాహ్మణుల ఇళ్లలోకి గాని రానివ్వటం లేదని ఒక ఫిర్యాదు చేస్తుంది. ఒక బ్రాహ్మణ యాజకుడు తనను నిష్కారణంగా కొట్టాడని మరొక ఫిర్యాదు చేస్తుంది. మొదటిదానికి సమాధానంగా రాముడు ఆ కుక్కను తన భవనంలోకి ఆహ్వానిస్తాడు. రెండవదానిపై

రాముడు ఆ బ్రాహ్మణుడిని రప్పించగా, తను ఆకలితో ఉండి యాచిస్తున్న సమయంలో కోపం వల్ల ఆ కుక్కను నిష్కారణంగా కొట్టిన మాట నిజమని అంగీకరిస్తాడు. తను కుక్కను వెళ్లిపొమ్మనగా అది కొద్ది దూరం వెళ్లి అక్కడే ఉండిపోయిందని, దానితో కొట్టానని వివరిస్తాడు. ఆ బ్రాహ్మణునికి తగిన శిక్ష ఏమిటో సూచించవలసిందిగా రాముడు ఆ శునకాన్ని కోరుతాడు. అందుకా కుక్క, అతనికి క్రోధం ఎక్కువని, ధర్మంలేనివాడని, కనుక తనను ఒక తాంత్రిక శాఖకు నాయకునిగా చేయాలంటాడు. (గత జన్మలలో ఒకసారి స్వయంగా ఆ స్థానంలో ఉండిన ఆ శునకానికి, అందువల్ల నరకానికి పోవటం ఖాయమని తెలుసు.) అందుకు రాముడు అంగీకరించటంతో, అది తనకు గొప్ప వరమని భావించిన బ్రాహ్మణుడు ఆనందంగా ఒక ఏనుగుపై సవారీ చేస్తూ వెళ్ళిపోతాడు. శునకం వారణాసికి వెళ్ళి నిరాహార దీక్షతో ప్రాణాలు త్యజిస్తుంది. నైతికంగా బ్రాహ్మణుని కన్న శునకానిది పైస్థాయి అవుతుంది. రాముడు ఆ శునకాన్ని ఈ కథనం పొడవునా ఎంతో గౌరవంగా చూస్తాడు.

ఈ కథలలో శునకాలు ఒకోసారి శునకాలేకాగా, ఒకోసారి పారియాలు లేదా నిషాదులకు, ఒకోసారి శునకాలతో పాటు పారియాలకు కూడా చిహ్నాలుగా నిలుస్తాయి. నిషాదులు నిషాదులకు మాత్రమే ప్రాతినిధ్యం వహించగలరు. నిషాదులకు శునకాలుగాక మరేవైనా ప్రాతినిధ్యం వహించగలవా? ఉదాహరణకు శునకాలు గాక రాక్షసులు నిషాదులకు చిహ్నం కాగలరా?

శునకాలు, నిషాదులు గాక రాక్షసులుగాని, అసురులు గాని ఇతరులకు ప్రాతినిధ్యం వహించలేరు. ఎందుకంటే రాక్షసులు, అసురులు అనేవారు అసలు లేనేలేరన్నది నా అభిప్రాయం. అవి ఊహాగానాలు మాత్రమే. అవి కేవలం సంకేతాత్మకం. తదనంతర కాలంలో వారు గిరిజనులకు, విదేశీయులకు, నిమ్న కులాలవారికి, ద్రవిడులకు, దక్షిణ భారత వాసులకు సంకేతాలయారు. కొందరు హిందువులు వారికి నిజంగానే అటువంటి నామకరణాలు చేసారు. భీముడిని వివాహమాడిన హిడింబి అనే రాక్షసిని, అర్జునుడిని పెళ్లాడిన నాగకన్య ఉలూపిని మాత్రం గొప్ప చేసి చూపారు. ఆదివాసులు క్షత్రియులను వివాహమాడటానికి అది సంకేత ప్రాయమన్నారు. లంక రాక్షసులనే వారి గురించి పరిశోధకులు అనేక ఊహాగానాలు చేశారు. ఇంతకూ రామాయణంలో రాక్షసుల పాత్ర ఏమిటి?

మనుషులలోని ఏ చారిత్రక బృందాన్ని అయినా రాక్షసులని పిలిచేందుకు ఆధారాలేమీ లేవు. అదే విధంగా లంక రాక్షసులు అనే వారిని జయించటానికి సంబంధించిన ఘటన అన్నదేదీ చరిత్రలోలేదు. రాక్షసులు, అసురులు అనే వారు ఆయా విధాలైన స్వభావంగల మనుషులకు గుర్తుగా నిలుస్తారు. మనుషులకు వలెనే రాక్షసులకు,

జంతువులకు కూడా సామాజిక వర్గాలు లేదా వర్ణాలుంటాయి. బ్రాహ్మణుడైన తండ్రికి, రాక్షసి అయిన తల్లికి జన్మించిన రావణుడిని బ్రాహ్మణుడని, క్షత్రియుడని, మనిషి అని, రాక్షసుడని రకరకాలుగా వ్యవహరించారు. బ్రాహ్మణుడైన రావణుడిని సంహరించినందుకు రాముడికి బ్రహ్మ హత్యా దోషం సోకుతుంది. క్షత్రియుడైన జటాయుకు క్షత్రియునిగా, పక్షిగా కూడా అంత్యక్రియలు జరుగుతాయి. ఈ కథలో క్షత్రియ రాక్షసులు, క్షత్రియ అసురులు, బ్రాహ్మణ రాక్షసులు ఇంకా కూడా ఉన్నారు. ముగ్గురు ప్రధాన రాక్షసులలో రావణుడు త్రిగుణాలలోని రాజసానికి, విభీషణుడు సత్త్వానికి, కుంభకర్ణుడు తామసానికి ప్రతినిధులని కూడా ఈ సందర్భంగా చెప్పవచ్చు.

రామాయణంలోని రాక్షసుల ప్రధాన పాత్రలలో ఒకటి, ఆయా మానవ వ్యక్తులకు బదులుగా శిక్షకు గురికావటం. ఉదాహరణకు, సింహాసనాన్ని ఆశించిన భరతునిపై తనకు గల ఆగ్రహాన్ని విరధుడనే రాక్షసునిపై ప్రదర్శించనున్నట్లు రామునితో లక్ష్మణుడు స్పష్టంగా చెప్తాడు. అదిగాక, సీత లంకలో ఉండినపుడు ఆమెను ప్రభావితం చేసేందుకు స్త్రీ రాక్షసులు నిరంతరం ప్రయత్నిస్తారు. ధర్మం గురించి మనుషులు తరచు చేసే చర్చలు మనకు వానరాలతోపాటు రాక్షసుల నోట కూడా (ఉదాహరణకు విభీషణుడు) వినిపిస్తాయి.

దేవతలను రాక్షసులు తమ తపోశక్తితో బెదిరించినట్లు, దేవతలతోపాటు బ్రాహ్మణులను మనుషులు బెదిరించగలిగేవారు. వారికి వైదికమతం పట్ల వ్యతిరేకత ఉండేది. తమ తండ్రి కోర్కెలను నెరవేర్చటం గురించి భరతునితో రాముడు వాదిస్తుండగా, స్వయంగా బ్రాహ్మణుడైన జాబాలి నాస్తిక వైఖరి తీసుకుని శ్రాద్ధ కర్మలను, కర్మఫలాలు ఒకరినుంచి మరొకరికి సంక్రమించగలవనటాన్ని హేళన చేస్తాడు. “ఆహారం ఎంత వృధా అవుతున్నది! మరణించిన మనిషి ఎపుడైనా ఆహారాన్ని స్వీకరించాడా? ఒకరు భుజించిన ఆహారం మరొకరికి శక్తినివ్వగలిగితే, ప్రయాణాలపై వెళ్లేవారు తమ వెంట ఆహారాన్ని తీసుకుపోవలసిన అవసరమే లేదు. ఇంటివద్ద గల కుటుంబ సభ్యులే తనకోసం తినవచ్చు” నంటాడు. “అమాయకులైనవారు తమకు ధనాన్ని ఇచ్చేట్లు చేయటం కోసం తెలివిగలవారు వైదిక సాహిత్యాన్ని రచించారు. ఇది మినహా పరలోకమన్నది లేనేలే” దని కూడా వాదిస్తాడు. అందుకు రాముడు తీవ్రమైన నిరసన తెలపగా, తనకు ఉత్తమమైనది చేయవలసిందిగా రాముడికి నచ్చచెప్పేందు కోసమే జాబాలి నాస్తిక వాదనలు చేసాడని, అంతేతప్ప తను నిజంగా నాస్తికుడు కాదని, అదంతా మాయ అని ఇతరులు రామునికి నచ్చజెప్తారు. వేదాలపై జాబాలిది ఉత్తమమైన స్థాయి గల భౌతికవాద విమర్శ. మరొక వైపునుంచి చూసినపుడు, భౌతికవాదాన్ని ఖండించేందుకు వైదికవాదులు జాబాలిని గురిగా ఉపయోగించుకున్నారు.

సామాజిక వ్యవస్థకు మరింత ప్రమాదం శంబూకుడినుంచి ఎదురైంది. తన కథ ఈ విధంగా ఉంది:

## రాముని చేత శంబూకుని శిరఃఖండన

బ్రాహ్మణ బాలుడొకడు ఎందుకో తెలియని కారణాలవల్ల చనిపోతాడు. ఆ బాలుని తండ్రి రాముడిని ధర్మాన్ని కాపాడలేకపోయినట్లు నిందిస్తూ, తనది బ్రహ్మ హత్యా పాతకమంటాడు. నారదుడు రాముడిని కలిసి, శూద్రులకు తపస్సు చేసే అనుమతి కలియుగంలో మాత్రమే ఉండగా ఒక శూద్రుడు ఆ పని ఇపుడే చేస్తూ ధర్మాన్ని ఉల్లంఘిస్తున్నాడని, అందువల్లనే ఆ బాలుని మృతివంటి ఉత్పాతాలు సంభవిస్తున్నాయని అంటాడు. అపుడు రాముడు ఆ బాలుని మృతదేహాన్ని తైలంలో నిలువచేయవలసిందిగా ఆదేశిస్తాడు. తర్వాత దేశాన్నంతా అన్వేషించగా, వింధ్యకు దక్షిణాన ఒక వ్యక్తి తలకిందులుగా వేలాడుతూ తపస్సు చేస్తున్నట్లు దృష్టికి వస్తుంది. అతడిని రాముడు తన వర్ణమేది అని, ఎందుకోసం తపస్సు చేస్తున్నావని అడుగుతాడు. అందుకావ్యక్తి, “నేను శూద్ర గర్భంలో జన్మించాను. నా పేరు శంబూకుడు. నేను దేవుడినయేందుకు, దేవతల లోకాన్ని జయించేందుకు ఈ తపస్సు చేస్తున్నాను”, అని సమాధానమిస్తాడు. శంబూకుడు ఇంకా మాట్లాడుతుండగానే రాముడు తన ఖడ్గాన్ని దూసి తన శిరస్సును ఖండిస్తాడు. అదే క్షణంలో ఆ చనిపోయిన బాలుడు సజీవుడై తిరిగివస్తాడు (7.64–67).

శంబూకుడు తను తపస్సు ఆచరించే పద్ధతిగానే కాక, శూద్రుడు తపస్సు చేసే ప్రపంచం తలకిందులుగా ఉన్నందుకు కూడా ఆ విధంగా వేలాడి ఉన్నాడు. జీవితంలో ఊర్ధ్వ చలనాన్ని కోరుకున్న ఒక శూద్రుడి ప్రాణం తీయటమనే ఉదంతాన్ని మరొక కథలో భాగం చేసి, అది సరైన చర్యేనని సమర్థించబూనారు. ఒక బ్రాహ్మణ బాలుని మరణం, పునరుజ్జీవనమన్నది ఆ కథ. రాముని చర్యను ఆ విధంగా సమర్థించారంటే ఆ కాలంలో వర్ణవ్యవస్థపై అటువంటి వత్తిడి ఉండేదా? బహుశా కావచ్చు. శంబూకుని వర్ణం, తను వింధ్యాచలానికి దక్షిణాది వాడు కావటం మినహా ఆయన గురించి మనకు మరేమీ తెలియదు. ఉత్తర భారతపు పురాణాల ప్రకారం అది ఒక నిర్మానుష్య ప్రాంతం. మొత్తానికి శంబూకుడు అమానుషమైన అనుభవాన్ని ఎదుర్కొన్నాడు.

రామునికి నిషాదుల నాయకుడైన గుహునితో సహా ఆ జాతివారితో సత్సంబంధాలు లేవు. రాముడు అడవికి వెళ్లినపుడు గుహుడు తనకు ఆహారాన్ని, జలాన్ని ఇవ్వజూపుతాడు. అందుకు రాముడు నిరాకరిస్తూ, ఒక తాపసిగా తాను ఫలాలను, కందమూలాలను మాత్రమే తిని జీవిస్తానని, ఇతరుల నుంచి కానుకలు స్వీకరించనని అంటాడు. కాని ఇది నిజం కాదు. లేడి రూపంలో గల మారీచుడిని సంహరించిన తర్వాత రాముడు మరొక లేడిని చంపి మాంసం కోసం తన వెంట తీసుకుపోతాడు (3.42.21). తర్వాత భరతుడు అడవికి వచ్చినపుడు కూడా గుహుడు ఆయన కోసం చేపలు, మాసం, మద్యం తీసుకుని వెళతాడు. భరతుని మార్గదర్శకుడు రాజుతో, గుహుడు రాముని పాత మిత్రుడని

చెప్తాడు. గుహుడు భరతునితో తాను రాముడిని కలిసి పళ్లు ఇవ్వబోగా ఆయన స్వీకరించలేదంటాడు. రాముడు క్షత్రియ ధర్మాన్ని పాటిస్తున్నాడని, క్షత్రియులు ఇతరులకు ఇవ్వాలే తప్ప వారినుంచి స్వీకరించరాదని కూడా అంటాడు. గుహుడు తెచ్చిన వాటిని భరతుడు స్వీకరిస్తాడు. గుహుని ఆహారాన్ని రాముడు ఎందుకు తిరస్కరించినట్లు? ఈ ఉదంతంలోని వైరుధ్యాలలో ఇబ్బందికరమైన ప్రశ్నలు కొన్నున్నాయి.

రామాయణంలో ఆసక్తికరమైన కథ ఒకటుంది. అది రాముడికి సంబంధించినది కాదు గాని దానిని ఇతరులు తనకు చెప్తారు.

## త్రిశంకు స్వర్గం

విశ్వామిత్రుడు న్యాయ దృష్టిగల ఒక గొప్ప రాజు. కోరినవన్నీ ఇవ్వగల కామధేనువు అనే గోవును బ్రాహ్మణుడైన వశిష్ఠుడినుంచి దొంగిలించేందుకు ఒక రోజు తను ప్రయత్నిస్తాడు. అపుడు వశిష్ఠుని కోరిక మేరకు కామధేనువు పర్షియన్లు, సిథియన్లు, గ్రీకులు, మ్లేచ్ఛులు, కిరాటుల సైన్యాలను సృష్టిస్తుంది. ఆ సేనలు విశ్వామిత్రుడి సేనలను, ఆయన కుమారులను నాశనం చేస్తాయి. క్షత్రియుల కన్న బ్రాహ్మణుల శక్తి ఎక్కువని గ్రహించిన రాజు తాను స్వయంగా బ్రాహ్మణుడు కావాలనుకుంటాడు. గొప్ప తపస్సు చేస్తాడుగాని అప్పటికీ రాజర్షిగా మిగులుతాడు తప్ప బ్రాహ్మణుడు కాలేడు.

అదట్లుండగా త్రిశంకు అనే రాజు బొందితో కైలాసానికి వెళ్లగోరుతాడు. అది అసాధ్యమంటాడు వశిష్ఠుడు. అటువంటి కోరిక కలిగినందుకు ఆ ముని కుమారులు త్రిశంకుపట్ల ఆగ్రహించి తనను చండాలునిగా మారమని, నల్లగా మొరటువాడివి కమ్మని, ఇనుప ఆభరణాలు ధరించమని, జుట్టు చింపిరిగా మారి జడలు కట్టాలని, తను వేసుకునే పూలహారాలను స్మశానం నుంచి తెచ్చుకొమ్మని శపిస్తారు. దానితో త్రిశంకుని మనుషులు తనను వదలి పారిపోతారు. అపుడు త్రిశంకురాజు విశ్వామిత్రుని వద్దకు వెళతాడు. బొందితో స్వర్గానికి పోయేందుకు సహాయపడ గలనన్న విశ్వామిత్రుడు అందుకోసం ఒక మహా యాగానికి ఏర్పాట్లు చేస్తాడు. ఒక పారియా కోసం ఒక క్షత్రియుడు నిర్వహించే యాగంలో పాల్గొనేందుకు వేద పండితులు నిరాకరించటంతో విశ్వామిత్రుడు వారిని నిషాదులుగా, స్మశానాల వద్ద కుక్క మాంసం తిని జీవించే ముష్టికులుగా మారమని శపిస్తాడు.

యాగంలో పాల్గొనేందుకు దేవతలు కూడా నిరాకరించగా విశ్వామిత్రుడు తన తపోశక్తిని ఉపయోగించి త్రిశంకును స్వర్గం దిశగా పైకి పంపుతాడు. కాని ఇంద్రుడు త్రిశంకును తిరిగి భూమికి వెళ్లవలసిందిగా ఆదేశిస్తాడు. విశ్వామిత్రుడు త్రిశంకును భూమిపైకి పతనం కాకుండా ఆపుతాడు. ఆ విధంగా త్రిశంకు మధ్యలోనే ఆగి

ఉంటాడు. అపుడు విశ్వామిత్రుడు త్రిశంకుకోసం కొత్త స్వర్గాన్ని, గ్రహాలను సృష్టిస్తాడు. కొత్త దేవతలను సైతం సృష్టించబోగా దేవతలు తనను వారిస్తారు. ఆ విధంగా త్రిశంకు శాశ్వతంగా తన ప్రత్యామ్నాయ లోకంలో నివసిస్తాడు.

అగ్రవర్ణాలకు చెందిన ఇరువురి మధ్య ఘర్షణగా ఆరంభమైన ఈ వివాదం చివరకు అసంతృప్తికరమైన రాజీగా మారుతుంది. విశ్వామిత్రుడు క్షత్రియుడు, రుషి రెండూ అవుతాడు. తను వేద పండితులపై, దేవతలపై కాలు దువ్వటం త్రిశంకును భూమ్యాకాశాల మధ్య వదలుతుంది. అయితే ఈ అగ్రవర్ణాలవారి మధ్య ఘర్షణ ఫలితంగా మొదట విదేశీ సైన్యాలు, తర్వాత నిమ్న జాతులవారి సైన్యాలు ఉనికిలోకి వస్తాయి. అదంతా ముగిసిన వెనుక, క్షత్రియుల కన్న బ్రాహ్మణులే శక్తివంతులని తేలినప్పటికీ, బ్రాహ్మణేతరులు, వైదికేతరులు తమ తపశ్శక్తివల్ల యజ్ఞ యాగాదులకు మించినది సాధించగలమని అర్థం చేసుకుంటారు. యాగఫలం, కర్మఫలం వలె తపోఫలాన్ని కూడా ఇతరులకు సంక్రమింప చేయవచ్చు. ఆ శక్తి ఇతరులను స్వర్గానికి సగం దూరం వరకు తీసుకువెళ్లగలదు. అటువంటిది సాధ్యమే కాదన్నది బ్రాహ్మణ వశిష్ఠుని వైఖరి. క్షత్రియుడైన విశ్వామిత్రుడు పలువురు బ్రాహ్మణులను పారియాలుగా మార్చగలిగాడు. తనను సగదూరం దిగివచ్చి కలిసేట్లు దేవతలను వత్తిడి చేయటమూ విశేషమే.

## అధ్యాయం 10

# మహాభారతంలో హింస

### క్రీపూ. 300 - క్రీ.శ. 300

**కాలక్రమణిక**

| | | |
|---|---|---|
| సుమారు క్రీ.పూ. 300 – క్రీ.శ. 300 | : | మహాభారత రచన |
| సుమారు క్రీ. పూ. 200 – క్రీ.శ. 200 | : | రామాయణ రచన |
| సుమారు క్రీ.పూ. 327–25 | : | అలెగ్జాండర్ దండయాత్ర |
| సుమారు క్రీ.పూ. 324 | : | చంద్రగుప్తుని ద్వారా మౌర్య వంశస్థాపన |
| సుమారు క్రీ.పూ. 265–232 | : | అశోకుని పాలన |
| సుమారు క్రీ.పూ. 250 | : | పాటలీపుత్రలో మూడవ బౌద్ధ సమ్మేళనం |
| సుమారు క్రీ.పూ. 185 | : | మౌర్యవంశపు అంతం, పుష్యమిత్రుని ద్వారా శుంగవంశస్థాపన |
| సుమారు క్రీ.పూ.73 | : | శుంగవంశపు అంతం |
| సుమారు క్రీ.పూ. 150 | : | బార్హుత్, సాంచీ స్తూపాల నిర్మాణం |
| సుమారు క్రీ.పూ. 166 –క్రీ.శ. 78 | : | భారతదేశంలోకి గ్రీకులు, సిథియన్ల రాక |

### యుధిష్ఠిరుని ద్వైదీభావం

*యుధిష్ఠిరుడు ఎంతమాత్రం వెనుతిరిగి చూడకుండా స్వర్గపథం వెంట ఒంటరిగా ముందుకు సాగాడు. ఒక శునకం మాత్రమే తనను వెంబడించింది. దాని గురించి నేనిప్పటికే చాలా చెప్పాను. అంతలో దేవతల రాజైన ఇంద్రుడు తన రథంలో వచ్చి, యుధిష్ఠిరుని లోపలకు రమ్మంటాడు. అపుడు యుధిష్ఠిరుడు, 'భూత భవిష్యత్ కాలాలకు అధినాథుడవైన దేవా, ఈ శునకం నాకెల్లప్పుడూ విధేయంగా ఉన్నది. దానిని కూడా నాతో రానివ్వు. నేను క్రూరుడివలె వ్యవహరించదలచుకోలేదు' అంటాడు. అందుకు ఇంద్రుడు, 'ఈ రోజున నావలెనే నీవు కూడా చిరంజీవివయావు. సకల భోగభాగ్యాలు, కీర్తి సాధించావు. స్వర్గ సుఖాలను కూడా పొందబోతున్నావు. ఈ శునకాన్ని విడిచిపుచ్చు. అందులో క్రూరత్వమేమీ లేదు. శునక యజమానులకు స్వర్గంలో చోటులేదు. ఎందుకంటే నైవేద్యాలను సమర్పించినా వాటిని అగ్నికి ఆహుతి ఇచ్చినా, ఒకవేళ వాటిని ఆచ్ఛాదన లేకుండా ఉన్నపుడు శునకాలు చూసినట్లయితే అపుడా నైవేద్యాలు పిశాచాల పాలవుతాయి.*

*కనుక నీవీ శునకాన్ని వదలివేయక తప్పదు. ఆ పని చేయటం ద్వారా నువ్వు దేవలోకాన్ని జయించగలవు' అని చెప్తాడు.*
*అందుకు సమాధానంగా యుధిష్ఠిరుడు, "నిన్ను నమ్మినవారిని వదలి వేయటం మహా పాపమని, అది బ్రహ్మ హత్యా సమానమని లోకులంటారు. నా అభిప్రాయం కూడా అదే", నంటాడు. ఆ శునక రూపంలో ఉండిన ధర్మదేవత యుధిష్ఠిరుని మాటలు విని తన నిజ స్వరూపంలో ప్రత్యక్షమై తనను కొనియాడుతాడు. "మహారాజా, నీవు సకల ప్రాణులతోపాటు దుఃఖిస్తావు. 'ఈ శునకం నన్ను నమ్మి విధేయురాలిగా ఉం'దంటూ రథంలోకి ఎక్కేందుకు నిరాకరించటం వల్ల ఇపుడు స్వర్గంలో నీకు సమానులైన వారెవరూ లేరు. బొందితో స్వర్గానికి చేరటమనే అత్యున్నత లక్ష్యాన్ని నీవు సాధించావు", అని అంటాడు.*

– మహాభారతం (17.2.26, 17.3.1–21)

జంతువుల బలి, మాంస భక్షణలపై జరిగిన చర్చల నుంచి హిందువులలో అహింస అనే ఆలోచన రూపు తీసుకుంది. అదే ఆలోచన క్రమంగా యుద్ధాలకు విస్తరించి మహా భారతానికి విస్తరించింది. ఈ చర్చలో భాగంగానే జంతువుల పట్ల, జంతువులను చిహ్నాలుగా చేసుకుని మాట్లాడే నిమ్న వర్గాల పట్ల ఏ విధంగా వ్యవహరించాలనే చర్చ వచ్చింది. మనుషులు జంతువులు కావటం, జంతువులు హింసాత్మకమైనవి కావటమన్నది మనుషుల హింసకు అనివార్య కారణమైంది. బౌద్ధ చక్రవర్తి అశోకుడు, హిందూ రాజు యుధిష్ఠిరుడు ఇరువురు కూడా హింసను, ముఖ్యంగా జంతువుల పట్ల హింసను, నియంత్రించేందుకు ప్రయత్నించినవారే. ఈ అధ్యాయంలో పరిశీలనకు రాగల ముఖ్యమైన అంశాలలో ఇది కూడా ఒకటి.

## అశోకుడు

అశోకుడు తాను భారతదేశాన్నంతా జయించినట్లు చెప్పుకున్నాడు గాని దక్షిణ కర్ణాటక ప్రాంతానికన్న దిగువకు పోయినట్లు ఆధారాలు లేవు. తన పరిపాలన కాలపు ఎనిమిదవ సంవత్సరంలో ఆయన కళింగ దేశంపై జరిపిన దాడి మహా క్రూరంగా పరిణమించటంతో తనలో మానసిక పరివర్తన కలుగుతుంది. ఆ విషయమై అశోకుడు దేశమంతటా శిలాశాసనాలు వేయిస్తాడు. కాని అవి కళింగలో లేకపోవటం గమనించదగ్గది. ఆ యుద్ధంలో లక్షమంది ప్రాణాలు కోల్పోయి, లక్షన్నరమంది దేశ బహిష్కృతులుకాగా, కొన్ని లక్షల మంది వినాశనాన్ని ఎదుర్కొన్నారని, ఆ తర్వాత ఇపుడాయన పశ్చాత్తాపం చెంది ధర్మాన్ని ఆచరిస్తూ ఇతరులకు అదే బోధిస్తున్నాడని ఆ శాసనాల్లో ఉంది. అటువంటి మారణహోమం వల్ల వేర్వేరు వర్గాల ప్రజలు ఏ విధంగా కష్టనష్టాలకు, పరితాపానికి గురవుతారన్న ప్రస్తావన కూడా కనిపిస్తుంది. అయితే ఆయన అప్పటికే లోగడ ఎవరూ

జయించనన్ని భూభాగాలను గెలిచి, దేశంలోని అత్యధిక భాగాలు తన పాలనలోకి వచ్చినందున ఇక యుద్ధాలకు పాల్పడబోనని ఆ దశలో ప్రకటించటం ఒక విధంగా అర్థం లేనిది. అదే సమయంలో తను హింసను పూర్తిగా త్యజించలేదు కూడా. తన రాజ్యంలోని ఆటవిక తెగలవారిని, సరిహద్దులవెంటగల ప్రజలను అవే శాసనాలలో జాగ్రత్త అని హెచ్చరిస్తాడు. అయితే, ఆ శాసనాలలో కన్పించే ఆలోచనలు, పశ్చాత్తాపం గమనించదగ్గవి. పైగా వాటిని శాసనాల రూపంలో శాశ్వతం చేసాడు. ప్రాచీన భారత చరిత్రలో ఇది అంతకుముందెన్నడూ లేనిది.

అశోకుని శాసనాలలో గలది బౌద్ధంగాని, హిందూమతం గాని కాదు. అదంతా మనుషుల ప్రవర్తనా నియమావళికి సంబంధించినటువంటిది. ఆ నియమాలలో నిజాయితీ, సత్యం, ఆర్ద్రత, విధేయత, కరుణ, ఆదరణ, అందరిపట్ల దయ వంటివి ఉన్నాయి. అశోకుడు మనుషులకు, జంతువులకు కూడా చికిత్సా కేంద్రాలు నెలకొల్పాడు. చెట్లు, తోటలు నాటించటం, బావుల తవ్వకం, విశ్రాంతి గృహాల నిర్మాణం, నీటి సదుపాయాల కల్పన వంటివి చేసాడు. ఇది రామాయణంలోని రామరాజ్య భావన వంటిదనాలి. ఒక శాసనంలో, "మా ప్రభువు జంతువులను వధించటం తక్కువ. ఆ ప్రభావంతో ప్రజలు కూడా ఆ పని ఆపివేసారు. చివరకు చేపలు పట్టటంపై కూడా నిషేధం విధించారు" అని ఉంది. మాంస భక్షణను నిషేధించే శాసనమేదీ లేదుగాని, ప్రాణుల వధ మంచిది కాదనే బోధనలు కనిపిస్తాయి.

అశోకుడు పరమత సహనం గురించి కూడా చెప్పాడు. ఇతర మతాలకు హాని కలిగించేవారు తమ మతాలకు మరింత హాని కలిగించుకుంటారని అన్నాడు. బ్రాహ్మణులు, శ్రమణుల గురించి సాధారణ ప్రస్తావనలు మినహా వైదికాచారాల గురించి ఏమీలేదు. కాని రకరకాల పూజలు, క్రతువులు, ముఖ్యంగా స్త్రీలు ఆచరించేవాటివల్ల ఏ ఉపయోగం ఉండదనే అభిప్రాయాన్ని అశోకుడు ప్రకటిస్తాడు. కాని ఇదంతా ఆయనతో పాటే అంతరించింది. తను బౌద్ధానికి చేసిన సేవలు మాత్రం దీర్ఘకాలంపాటు నిలిచిపోయాయి. తన కారణంగా ఆ మతం భారతదేశంలోనేగాక ఇతర దేశాల్లోనూ వ్యాప్తి చెందింది. అశోకుడు, తన తండ్రి బిందుసారుడు బౌద్ధులతోపాటు జైనులను, అజీవికులను కూడా ఆదరించారు. ఆయన 'ధమ్మం' హిందూ మతంతో సహా అన్ని మతాలకు అవసరమైన సహకారాన్ని అందజేసింది.

## హిందూ మత శాఖల ఉద్భృతి

ఈ కాలంలో బౌద్ధం వర్ధిల్లినప్పటికీ వైష్ణవానికి, శైవానికి రాజకుటుంబాలలో, ఉన్నతాధికారులలో కొత్త పోషకులు లభించారు. దేవాలయ ప్రధానమైన నగరాల ఆర్థిక శక్తి పెరగటం బ్రాహ్మణ వ్యవస్థకు బలంగా మారింది. రాజులు వైదికాచారాలను పాటించటం

క్రీ.పూ. 500 నాటికి విరివిగానే ఉండేనా, అటువంటి ఆచారాలకు బదులు వేర్వేరు హిందూమత శాఖల సంప్రదాయాలు అమలుకు రావటం మొదలైంది. వైదిక దేవతలైన ఇంద్రుడు, సోముడు, అగ్ని స్థానంలో, వేదాలలో ఎక్కువ పాత్రలేని విష్ణువు, శివుడు ప్రముఖులుకాసాగారు. రామాయణ, మహాభారతాలలో అందరూ తాము ఒక నిర్దిష్టమైన దేవుడిని ఆరాధిస్తామని చెప్తుంటారు. ఆ విధంగా హిందూ మతంలో శాఖలు, శాఖావాదాలు, భేదాలు బయలుదేరాయి. అవి క్రమంగా బలపడుతూ పోయాయి. క్రీ.పూ. ఒకటవ శతాబ్దంలో శుంగుల పాలనలో శివలింగ విగ్రహం ఒకటి రూపుదిద్దుకుంది. దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో గుడిమల్లం వద్ద లభించిన ఆ లింగాన్ని తొట్ట తొలి శివలింగంగా భావిస్తారు. ఇటువంటివన్నీ శైవ, వైష్ణవ శాఖలు బలపడేందుకు దోహదం చేశాయి.

శివుడి ఆరాధన ఏ విధంగా ఆరంభమైందో చెప్పే కథ ఒకటి మహా భారతంలో ఉంది. దక్ష ప్రజాపతి తన యాగ ఫలంలో భాగాన్ని ఇచ్చేందుకు నిరాకరించటంతో శివుడు ఆ యాగాన్ని ధ్వంసం చేస్తాడు. యాగఫలం ఒక అడవి జంతువు రూపంలో ఆకాశం వైపు పారిపోతుంది. దానిని శివుడు విల్లంబులతో వెంబడించగా భీతిల్లిన దేవతలు పారిపోతారు. యాగఫలంలో శాశ్వతంగా భాగం ఇవ్వగలమని బ్రహ్మ మాట ఇచ్చిన తర్వాత శివుడు శాంతిస్తాడు. హిందూ మత చరిత్రలో ఈ కథ ఒక కీలకమైన పరిణామం. వైదిక యాగాలలో శివుడు భాగం కాడు. తను బయటివాడు గనుక దక్షుడు అతడిని వదలివేస్తాడు. ఒక ఉదంతంలో శివుడు అర్జునునికి నగ్నంగా గల కిరాతుని (వేటగాడు) రూపంలో కనిపిస్తాడు. దక్షయజ్ఞం పరిణామాల తర్వాత శివునికి యాగఫలంలో భాగం లభించటమేగాక తను కూడా అగ్రస్థాయిగల దేవుడవుతాడు.

హిందూ మతం శాఖలుగా విడిపోయిన తర్వాత, రామాయణంలో ఆరంభించి రాముడు కూడా శాఖాపరంగా గొప్ప దేవుడవుతాడు. మహాభారతంలో కృష్ణుడు అవతరిస్తాడు. క్రీ.పూ. అయిదవ శతాబ్దంలో పాణిని అనే వ్యాకరణ పండితుడు, విష్ణువు అవతారమైన వసుదేవుని కుమారునికి వసుదేవకుడు అనే భక్తుడు ఉన్నట్లు రాసాడు. ఆ కాలం నుంచి భాగవత శాఖలు మొదలయ్యాయి.

## రామాయణ, మహాభారతాలు

రామాయణం కన్న మహాభారత కథ ముందు ప్రారంభమై ఉంటుంది. కాని ఆ రెండింటి రచన కూడా ఉత్తర భారతదేశంలో క్రీ.పూ. 300 నుంచి క్రీ.శ. 300 మధ్య ప్రాంతంలో జరిగి ఉండాలి. అనగా మౌర్యుల తర్వాత, గుప్తుల కన్న ముందు. ఆ రెండు రచనల మధ్య కొన్ని పోలికలున్నాయి. రెండూ దీర్ఘకావ్యాలు. సంస్కృతంలో ఉన్నాయి. పద్యపు నిడివి ఇంచుమించు ఒకటే. రెండింటిలోనూ యుద్ధానికి ప్రాముఖ్యత ఉంటుంది. రెండూ ఒకే ఆధారాలను పేర్కొంటాయి. అనేక కథలు రెండింటిలోనూ కనిపిస్తాయి.

అదే సమయంలో కొన్ని ముఖ్యమైన తేడాలు కూడా ఉన్నాయి. మహాభారతంలోని భౌగోళిక వివరాలు రామాయణం కన్న ముందు కాలాన్ని సూచిస్తాయి. మహాభారత కేంద్రమైన హస్తినాపురం బ్రాహ్మణాల కాలానికే ఒక మహానగరం. రామాయణంలో కన్పించే రాజగృహ, కాశీ ఆ తర్వాత ఏర్పడ్డాయి. మృణ్మయ పాత్రలు మొదలైన పురావస్తు ఆధారాలు కూడా దీనినే బలపరుస్తున్నాయి.

హిందూ విశ్వాసాల ప్రకారం రామాయణం తర్వాత మహాభారతం సంభవించింది. రామాయణ కాలంలో ధర్మం మూడు పాదాల నడిచి, మహాభారతకాలానికి రెండు పాదాలకు క్షీణించిందని వారు భావిస్తారు. ఇది ఒక విధంగా నిజమనాలి. ఎందుకంటే మహాభారతం కన్న రామాయణ కాలం చిన్నది. భారతం ముందుగా మొదలైనా రామాయణం కన్న తర్వాత ముగిసింది. కనుక ఆసరికి పరిస్థితులు రామాయణం కన్న క్షీణించి ఉండవచ్చు. అదెట్లున్నా ఈ రెండు కథాకాలాలు కొంత అటుఇటుగా సమకాలీనమైనవి. అందువల్లనే ఒకదాని కథలు మరొక దానిలో కనిపిస్తాయి. పాత్రలు కూడా తారసపడతాయి.

మహాభారత కథ రెండు అగ్రవర్ణాల మధ్య సంబంధాన్ని సవాలు చేసి, చివరకు అదే సంబంధాన్ని ధృవీకరిస్తుంది. ఉదాహరణకు బ్రాహ్మణ రాజు పుష్యమిత్రుడు బౌద్ధంపై హిందుమత ఆధిపత్యాన్ని సాధిస్తాడు. అదే కథ మహాభారతంలోని పరశురాముని గాథకు ప్రేరణ అయి ఉండాలి. పరశురాముని తండ్రి బ్రాహ్మణుడు కాగా, తల్లి క్షత్రియురాలు. ఒక క్షత్రియుడు తన తండ్రిని హతమార్చటంతో అందుకు ప్రతీకారంగా పరశురాముడు ఇరవై ఒక్క తరాల క్షత్రియులందరిని వధిస్తాడు. తన తండ్రి కామధేనువు దూడను అపహరించిన రాజును కూడా వెంటాడి ప్రాణాలు తీసి ఆ దూడను తిరిగితెస్తాడు. ఆ కాలంలో పశువుల కోసం దాడులు చేయటం సర్వసాధారణం. ఈ కథ దానినే ప్రతిఫలిస్తుంది. అయితే ఇందులో కథానాయకుడు క్షత్రియుడు కాక ఒక బ్రాహ్మణుడు. క్షత్రియుల ఆధిపత్యాన్ని, దురాశను ఈ కథ తలకిందులుచేస్తుంది. లౌకికాధికారం, ఆధ్యాత్మికాధికారం మధ్య విభజన చెదిరిపోవటం కూడా ఇందులో కనిపిస్తుంది. రాజులు బౌద్ధానికి, జైనానికి మారి, సన్యాస ధోరణులను ప్రోత్సహించి, తమకు చేటు చేయగలరని భయపడిన బ్రాహ్మణులు, తామే పూనుకొని క్షత్రియులను నిర్మూలించి స్వయంగా అధికారాన్ని చేపట్టటం ఇందులోని అంతర్లీన భావన కావచ్చు.

మహాభారతంలో మనుషుల మధ్య, మనుషుల నుంచి జంతువులపైన, జంతువుల మధ్య జరిగే హింసల ప్రస్తావనలు విరివిగా ఉన్నాయి. చిన్న చేపను పెద్ద చేప తింటుందనే సామెత ఈ స్థితిని ప్రతిఫలిస్తుంది. ఇది మానవ స్వభావానికి కూడా ఉపమానం వంటిది. మనుషులు జంతువుల వలె అరాచకంగా ప్రవర్తించకుండా ఉండటం కోసమే ధార్మిక నియమాల రూపంలో ఆంక్షలను విధించారు. అదే సమయంలో హింస తప్పదన్నారు. కౌరవులపై యుద్ధం చేయాలని ధర్మరాజును కోరిన అర్జునుడు, “హింస చేయకుండా ఈ

సృష్టిలో ఏ ప్రాణి కూడా జీవించలేదు. బలమున్న ప్రాణి బలంలేని దానిని చంపి జీవిస్తుంది" అంటాడు. రాజ్యకాంక్షలు, ప్రతీకారాలు కూడా ఇదే పద్ధతిని అనుసరిస్తాయి. మహా భారత యుద్ధంలో అధికారం కోసం మారణహోమం సాగింది. అంతకుముందు తన తండ్రిని ఒక పాము కరిచి చంపిన దానికి ప్రతీకారంగా జనమేజయరాజు లోకంలోని సర్పాలన్నింటి ప్రాణం తీసేందుకు మహా సర్పయాగం నిర్వహిస్తాడు. ఖాండవ వనంలోని జంతుజలాల గురించి ఆలోచించకుండా అర్జునుడు, కృష్ణుడు, అగ్ని ఆ అడవిని దహనం చేస్తారు. పైగా అందు గురించిన వర్ణన కూడా కథలో ఈ విధంగా ఉంది: "వేలాది జంతువులు భీతిల్లి అరుస్తూ దగ్ధమైపోయాయి. కొన్ని తమ కుమారులనో, తల్లులనో, తండ్రులనో కరిచి పట్టుకున్నాయి. ప్రతిచోట ఆ జంతువులు, పక్షులు బాధతో తమ రెక్కలు, కళ్లు, కాళ్లు మండుతుండగా నేలపై దొర్లాయి". ఒక కరుణామయుడైన ముని సర్పయాగాన్ని ఆపించేసరికి కేవలం కొన్ని పాములు, తన దాహం తీరినందున అగ్ని ఖాండవ దహనాన్ని అపే సమయానికి కేవలం ఆరు జీవులు (ఒక సర్పం, నాలుగు పక్షులు, అసురులు వాస్తు శిల్పి అయిన మయుడు) మాత్రం మిగిలి ఉండటం కనిపిస్తుంది.

## యుధిష్ఠిరుని శునకం

జంతువుల గురించిన కథలు ఒకోసారి నిజంగానే వాటి గురించి అయి ఉంటాయి. వారి పట్ల ఏ విధంగా వ్యవహరించటమన్న విషయమై రాజులు కూడా శ్రద్ధ చూపేవారు. ఆ ప్రశ్నపై ఒకోసారి వైదికులు, వైదికేతరుల మధ్య వివాదం తలెత్తేది. మరొక వైపు, ఆ కాలంలో భిన్న వర్గాల మధ్య తలెత్తే ఉద్రిక్తతలకు సంబంధించి జంతువుల కథలు నీతి కథలుగా ఉపయోగపడేవి. ఉదాహరణకు శునకాల విషయం చూద్దాం. మనుషులకు వాటితో ఎటువంటి సంబంధం ఉండరాదని హిందూ ధర్మం నిషేధిస్తుంది. అవి హీనమైన జంతువులు. మాలిన్యాలను ఆహారంగా తీసుకుంటాయి. పారియాలే పరాన్న జీవులు కాగా, కుక్కలు వారిపై ఆధారపడే పరాన్న జీవులు. చివరకు యుధిష్ఠిరుడు కూడా పరుషమైన భాషను ఉపయోగిస్తూ శాంతి కోసం ప్రయత్నించే మనుషులు కుక్కల వంటివారంటాడు. అని ఏ విధంగా తోకను ఊపుతూ, మొరుగుతూ, ఒక అడుగు ముందుకు ఒక అడుగు వెనుకకు వేస్తూ, చివరకు పరస్పరం తలపడతాయో వర్ణిస్తాడు. అంతిమంగా బలమైంది గెలిచి మాంసాన్ని తింటుంది. మనుషుల తీరు కూడా సరిగా అదేనంటాడు. యుద్ధం ముగిసిన తర్వాత కూడా, "మనం శునకాలంకాము. కాని మాంసం ముక్కకోసం ఆశపడే శునకాలవలె అదే విధంగా ప్రవర్తిస్తాము" అంటాడు. కుక్కలు నిమ్న వర్గాల వారికి చిహ్నం కావటానికి సంబంధించి, జ్ఞానులైన బ్రాహ్మణులను, గోవును, ఏనుగును, శునకాన్ని, శునకాలను వండేవారిని కూడా వివేకవంతులు ఒకే దృష్టితో చూడగలరని

భగవద్గీత నొక్కి చెప్తుంది. కాని మహా భారతంలో మాత్రం శునకాల పట్ల హీనమైన దృష్టే కనిపిస్తుంది. జీవితంలో ఉన్నత స్థానాలకు పోవాలనుకునే నిమ్న వర్గాలతో పోల్చినట్లుగా చెప్పే ఒక శునకం కథ ఆసక్తికరమైంది. అది ఈ విధంగా ఉంది:

### సింహం కాగల శునకం

ఒకసారి చాలా ఉత్తముడైన ముని ఒకడుండేవాడు. తానెంత మంచివాడంటే సింహాలు, పులులవంటి క్రూర జంతువులు కూడా తన శిష్యులవలె సంచరించేవి. ఆ ముని వలెనే ఫలాలు, దుంపలు మాత్రం తీసుకునే ఒక శునకం బాగా బలహీనంగా మారి ఆ మునిపట్ల అభిమానంతో తన వద్ద చేరుతుంది. ఒక రోజు ఒక చిరుతపులి ఆకలితో వచ్చి ఆ శునకాన్ని తినబోతుంది. అపుడా శునకం తనను కాపాడవలసిందిగా మునిని కోరుతుంది. ముని దానిని చిరుతపులిగా మార్చుతాడు. తర్వాత ఇతర జంతువులుగా, చివరకు సింహంగా చేస్తాడు. ఆ విధంగా అది మాంసాహారి కావటంతో తక్కిన జంతువులు పారిపోతాయి. అపుడది ఆ మునినే తినజూస్తుంది. దాని ఆలోచనలను పసికట్టిన ముని దానిని తిరిగి తన జాతికి మార్చి ఆశ్రమం నుంచి పారదోలుతాడు.

మనుషుల పట్ల, జంతువుల పట్ల కూడా హింస అనివార్యమైన కాలంలో అహింస గురించిన ప్రస్తావనలు అసాధారణమైనవే. ఒక సందర్భంలో యుధిష్ఠిరుడు అహింస అన్నింటికి మించిన ధర్మమంటాడు. అర్జునుడు తనతో విభేదిస్తూ, హతమార్చే దేవతలనే ప్రజలు ఎక్కువగా గౌరవిస్తారంటాడు. రుద్రుడు, స్కంధుడు, ఇంద్రుడు, అగ్ని, వరుణుడు, యముడు అటువంటివారేనని పేర్కొంటాడు. తాపసులు సైతం హింసకు పాల్పడకుండా జీవించలేరని వాదిస్తాడు. రాముడు తాను ఒక వానరాన్ని (వాలి) చంపాడన్న విమర్శకు సమాధానంగా, మునులు కూడా వేటాడుతారంటాడు. భగవద్గీత సల్లక్షణాలను పేర్కొంటూ అహింసను ప్రస్తావిస్తుందిగాని ఆ విషయమై చర్చించదు. మహా భారతం హింసాహింసల మధ్య చీలి ఊగిసలాడినట్లు తోస్తుంది. ఒకోసారి యుధిష్ఠిరుని శునకం కథలో వలె క్రూరత్వానికి పాల్పడకుండా మాత్రం ఆగి రాజీధోరణిని చూపుతుంది. యుధిష్ఠిరునిపై అశోకుడు, పుష్యమిత్రుడు ఇరువురి ప్రభావాలూ ఉన్నట్లు కనిపిస్తుంది. బౌద్ధ, జైనాల అహింసా సిద్ధాంతం పట్ల ఈ ముగ్గురు రాజులు మూడు విధాలుగా స్పందించారు. ఎవరి రాజీ మార్గాన్ని వారు రూపొందించుకుని ఆ మేరకు అహింసను పాటించారు. అయితే బౌద్ధ, జైనాలతో నిమిత్తం లేకుండా కూడా అపుడు అహింసా ధోరణులు కొన్ని ఉండేవి.

బ్రాహ్మణులు రాజులకు సన్నిహితులైన సలహాదారులు అయినప్పటికీ, ఆ రాజుల క్రూర కార్యాలతో ప్రత్యక్ష సంబంధం లేకుండా జాగ్రత్త పడటం పైనే తమ విశ్వసనీయత అంతిమంగా ఆధారపడి ఉండేది. రాజుల స్వధర్మంలో హింస అన్నది అంతర్నిహితంగా

ఉండేది. భారతదేశంలో అహింస కూడా హింసాత్మకం కాగలగటం విశేషం. అందులో ఇతరుల కోసం ఆత్మ బలిదానం అనే అంశ వచ్చి చేరుతుంది. శిబి చక్రవర్తి కథ ఇటువంటిదే.

## పావురాన్ని కాపాడిన శిబి చక్రవర్తి

శిబి చక్రవర్తి ఔదార్యం గురించిన కథలు స్వర్గంలో దేవతలకు చేరుతాయి. దానితో ఇంద్రుడు, అగ్ని తనను పరీక్షించగోరుతారు. అగ్ని ఒక పావురంగా, ఇంద్రుడు ఒక గద్దగా మారుతారు. గద్ద వెంటాడుతూ రాగా పావురం చక్రవర్తి అండను కోరుతుంది. అపుడు గద్ద ఆ చక్రవర్తితో, నేను చిన్న పక్షులను ఆహారంగా తీసుకుంటాను. నీవు నాకు ఆహారం లభించకుండా చేయడమంటే నా ప్రాణాలు పోగొట్టడమన్నమాట. ఇది ధర్మమా అని అంటుంది. అపుడు శిబి ఆ గద్దను, పావురానికి బదులు మరే మాంసాన్నయినా స్వీకరించగలవా అని అడుగుతాడు. గద్దలు పావురాలను మాత్రమే తింటాయన్న ఆ పక్షి చివరకు, నీకు ఆ పావురంపై అంత ప్రేమ ఉంటే దాని బరువుకు సమానమైన మాంసాన్ని నీ శరీరం నుంచి కోసివ్వమని అడుగుతుంది. అపుడు శిబి త్రాసును తెప్పించి తన శరీర మాంసాన్ని కోసి అందులో ఉంచుతూ పోతాడు. కాని ఎంత కోసినా పావురం బరువుకు సమానం కాదు. చివరకా చక్రవర్తి తానే స్వయంగా ఆ త్రాసులో కూర్చుంటాడు. అపుడు గద్ద తన నిజస్వరూపాన్ని ప్రకటిస్తూ, తాను ఇంద్రుడనని, ఆ పావురం అగ్ని దేవుడని చెప్తాడు. శిబి చక్రవర్తి కీర్తి ఆ చంద్రతారార్కం కాగలదంటాడు.

## బలులు, వాటిపట్ల వ్యతిరేకత

జంతువుల పట్ల అహింస అనే భావనకు జంతు బలితో వైరుధ్యం వంటి పరిస్థితి మనకు మహాభారతంలో కనిపిస్తుంది. అందులో పధ్నాలుగు రకాలైన బలి జంతువుల ప్రస్తావన ఉంది. వాటిలో సింహం, పులి, అడవిపంది, కోతి, ఎలుగుబంటి, ఏనుగు దున్నపోతు అనే ఏడు అడవి జంతువులు కాగా, ఎద్దు, మగగుర్రం, మేక, గొర్రె, గాడిద, కంచర గాడిదతో పాటు మనిషి అనే ఏడు పెంపకం జంతువులు. మనిషిని కూడా పశువుల జాబితాలో చేర్చినప్పటికీ, నరబలి అన్నది లేదని ఆ కావ్యం నొక్కి చెప్తుంది. తాను బంధించిన పలువురు రాజులను బలివ్వగలనని హెచ్చరిస్తుండిన ఒక రాజుతో కృష్ణుడు, "అందులో ఆనందమేమున్నది? నువు రాజులను బంధించావు. వారిని రుద్రునికి బలివ్వ గోరుతున్నావు... నరబలిని ఇంతవరకు ఎవరూ చూడలేదు. అటువంటపుడు నువు శివునికి నరబలి ఇచ్చే యోచన ఎట్లా చేయగలవు? నీ జాతికే చెందిన వారైన మనుషులను బలిపశువులని ఎట్లా పిలవగలవు?" అంటాడు.

బ్రాహ్మణాలలో నరబలికి మారుగా ఇతర పద్ధతులను సూచించారు. ఒకానొక వేద కథనంలో ఒక ముని అశ్వినులకు సోమరసం గురించి చెప్పేందుకు అశ్వ శిరస్సును ఉపయోగిస్తాడు. అదే విధంగా, మనిషి శిరస్సుకు అశ్వ శిరస్సు సమానమైంది. బలికార్యంలో మనిషి శిరస్సుకు అశ్వ శిరస్సు ప్రత్యామ్నాయంగా మారింది. మహాభారతం నరబలిని గట్టిగా నిరాకరించింది. యాగాశ్వపు బలి గురించి చాలా రాసింది. బలుల పట్ల వ్యతిరేకతకు బీజం సరిగా ఇందులోనే ఉంది.

యుద్ధం ముగిసిన తర్వాత యుధిష్ఠిరుడు తన పాపాలన్నింటి పరిహారం కోసం అశ్వమేధయాగం జరుపుతాడు. బ్రాహ్మణులు అశ్వాన్ని ఊపిరాడకుండా చేసి చంపుతారు. తర్వాత ద్రౌపది ఆ అశ్వం వద్ద నిద్రిస్తుంది. బ్రాహ్మణులు అశ్వం నుంచి కొవ్వు తీసి అగ్నిలో కాల్చగా పాండవులు ఆ వాసనలు చూస్తారు. అది వారిని పాప విముక్తులను చేస్తుంది.

కాని ఆ యాగం సాధించిన విజయం, అది ముగిసిన వెనుక ఒక ముంగిస చెప్పిన కథతో భంగపడిపోతుంది. అతిథులందరూ వెళ్లిపోయిన తర్వాత ముంగిస తన కలుగులోంచి బయటకు వచ్చి మానవ స్వరంతో మాట్లాడుతూ, "గింజలు ఏరుకుని మాత్రమే జీవించగలనని శపథం చేసిన ఒక బ్రాహ్మణుడు, తను ఆ విధంగా ఏరిన ధాన్యాన్ని దానంగా ఇచ్చిన త్యాగం ముందు ఆ యాగం కొరగా"దని ప్రకటిస్తాడు. ఒకసారి కరువు ఏర్పడినపుడు ఆ బ్రాహ్మణుడు తన వద్ద మిగిలిన కొద్దిపాటి బార్లీ గింజలను ఒక అతిథికి దానమిస్తాడు. ఆ అతిథి మారు రూపంలో గల ధర్మమని తేలుతుంది. ఆ వెంటనే బ్రాహ్మణుడు తన కుటుంబంతో పాటు స్వర్గానికి వెళతాడు. ఆ కథ చెప్పటం ముగియగానే ముంగిస అంతర్ధానమవుతుంది. ఆ మీదట కథా రచయిత, ఇతర ప్రాణులకు హాని కలిగించకపోవటం, సంతృప్తిభావన, రుజువర్తన, తపస్సు, స్వీయ నియంత్రణ, సత్యసంధత, ఔదార్యం అన్నీ సమాన లక్షణాలని అంటాడు. అందుకు జనమేజయుడు స్పందిస్తూ, "రాజులు బలులివ్వటానికి, మునులు తపస్సుకు వ్యసనపరులైపోయారు. బ్రాహ్మణులు శాంతి సాధనలో, స్వీయ నియంత్రణలో నిమగ్నులయారు" అంటూ, ఇంద్రుడు యాగాలు, బలుల వల్లనే స్వర్గానికి రాజైనందున, అంతటి శక్తి సంపదలు గల యుధిష్ఠిరుడు కూడా యాగమాచరించటం సరైనదేనని వాదిస్తాడు. ఆయనను ముంగిస విమర్శించటం తప్పంటాడు. అపుడు కథా రచయిత, లేక కథాగానం చేసిన వ్యక్తి, జనమేజయునికి మరొక కథ చెప్తాడు:

## ఇంద్రుని జంతుబలి చర్చ

ఒకానొకప్పుడు ఇంద్రుడు అనేక జంతు బలులతో ఒక మహా యాగాన్ని జరపనారంభిస్తాడు. కాని, బలివ్వటం కోసం ఆ జంతువులను బంధించటం

చూసిన మహా మునులకు వాటిపై జాలి కలుగుతుంది. అపుడు వారు ఇంద్రునితో, "బలికి ఇది సరైన పద్ధతి కాదు. ఇంటి పెంపకం పశువులను సృష్టించింది బలికోసం కాదు. నీ ఈ క్రూరత్వం వల్ల ధర్మానికి హాని కలుగుతుంది. హింసను ధర్మమనలేము. అందుకు బదులు మూడు సంవత్సరాల పాటు నిలువ ఉంచిన ధాన్యాన్ని యాగంలో సమర్పణచేయి", అని చెప్తారు. కాని నూరు యాగాల దేవుడైన ఇంద్రుడు తన ఆలోచనలలో, తన గర్వంలో తానుండి అందుకు అంగీకరించడు. అపుడు వారు విషయాన్ని వసు చక్రవర్తికి నివేదిస్తారు: "బలులపై మీ తీర్పేమిటి? ఆ పని పెంపుడు జంతువులతో చేయాలా, లేక జీవశక్తి నశించిన ధాన్యంతోనా? అశ్వాలతోనా, లేక ఫలాలతోనా?" అని తెలుసుకోగోరుతారు. అందుకు వసు చక్రవర్తి ఆలోచన ఏమీ చేయకుండా, "ఏది అందుబాటులో ఉంటే అది" అంటాడు. కాని అది సత్యమైన మాట కాకపోయవటంతో వెంటనే నరకానికి పోతాడు. తప్పు మార్గంలో సంగ్రహించిన అంశాలతో, లేదా దుష్టబుద్ధితో, యాగం చేయటం వల్ల ధర్మాన్ని ఆచరించిన ఫలాలు లభించవు. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు తాము స్వయంగా సేకరించిన వాటిని దానమివ్వటం ద్వారా, సకల ప్రాణుల పట్ల కరుణ చూపటం ద్వారా, సౌశీల్యం వల్ల, సహానుభూతి వల్ల స్వర్గానికి పోగలరు (14.94.1–34).

కథ ఇది కాగా, మరొక వైపు ఇంద్రుడు తన యాగాన్ని పూర్తిచేసే ఉంటాడు. కాని తను ఆ పని వివేకంతో కాక అహంభావంతో జరిపినట్లు కథ చెప్తుంది. మునులు ప్రశ్నను ఉపేక్షించినందుకు వసు చక్రవర్తి కూడా శిక్షకు గురవుతాడు. జనమేజయుని వాదన ఇందుకు సమాధానం కాదు. కాని సరైన సమాధానమేమిటో మహాభారతం మనకు చెప్పదు. ఎందుకంటే, సరైన సమాధానమంటూ ఏదీలేదు. ఈ కథలన్నింటిని గమనించిన మీదట అశ్వయాగపు గొప్పతనంపై తీవ్రమైన సందేహాలు ఏర్పడుతాయి. మంత్రతంత్రాల వంటి ఇతర విషయాలపై కూడా మహాభారతం ఇదే విధంగా అనుమానాలను సృష్టిస్తుంది. ప్రతి విజయం వెనుక ఒక వినాశనాన్ని ఊహిస్తుంది.

## అధ్యాయం 11

# మహాభారతంలో ధర్మం

## క్రీపూ. 300 - క్రీ.శ. 300

ధర్మం సూక్ష్మమైనది

మహాభారతం

### ధర్మంలోని సూక్ష్మత

మహాభారతం పంచ పాండవుల గురించి అని కొందరు, కృష్ణుని గురించి అని మరి కొందరు అంటారు. కాని హిందూ సంప్రదాయాలలోని అత్యధిక భాగం అది ధర్మం గురించిన మహాకావ్యమని చెప్తాయి. దానిని కొన్నిసార్లు ఇతిహాసమని (చరిత్ర), కొన్నిసార్లు ధర్మశాస్త్రమని పిలుస్తారు. అయితే ఎప్పుడైనా ధర్మం కేంద్ర బిందువు అవుతుంది. ఇతిహాసం దాని చుట్టూ అల్లుకునే కథనం.

ఒక పాత్రకు తన ఎదుట గల నిర్ణయావకాశాలన్నీ తప్పువనిపించినపుడు, లేదా ఉత్తముడైన ఒక వ్యక్తి తప్పుచేసినపుడు, ధర్మం సూక్ష్మమైనదని అంటాడు. లేదా అదే మాట ఇతరులు తనతో అంటారు. ఒకోసారి మనుషులు మళ్లీ మళ్లీ ప్రయత్నించి కూడా ఏది సరైనదో తేల్చుకోలేరు. ఒక సందర్భంలో యుధిష్ఠిరుడు "ఏది ధర్మ"మని ప్రశ్నిస్తాడు. కాని అందుకు సమాధానం కోసం వేచి చూడడు. తొలి ధర్మశాస్త్రాలలో ఒకటి అన్నట్లు, "ధర్మాధర్మాలు ఇదిగో మేమీవిధంగా ఉన్నాయని చెప్పవు. ఏది సరైనదో ఏది కాదో దేవతలు, గంధర్వులు, లేదా పూర్వీకులు చెప్పరు" నైతిక జీవితంలోని అరాచకం, అస్తవ్యస్తత ఏ విధంగా ఉంటాయో మహాభారతం ధర్మం అనే దృక్పథాన్ని విడమరిచి చూపటం ద్వారా చెప్తుంది.

క్రీ.పూ. మూడు నుంచి ఒకటవ శతాబ్దాల మధ్యకాలంలో ధర్మసూత్రాల రచన గద్యరూపంలో సాగింది. సామాజిక జీవితం, మతపరమైన అంశాలకు సంబంధించిన నియమాలు వాటిలో ఉన్నాయి. ఆ సరికి బ్రాహ్మణులకు బౌద్ధ ధర్మం, అశోకుని ధర్మం, ఉపనిషత్తులు చెప్పిన మోక్షం, యోగ, రకరకాల హిందూ శాఖల రూపంలో పలు సవాళ్లు ఎదురు కావటం మొదలైంది. బౌద్ధుల చెప్పిన ధర్మానికి హిందూ మతంలో కొన్ని పోలికలు ఉన్నా రెండూ ఒకటే కాదు. బౌద్ధం ఆవిర్భావానికి ముందు ధర్మం అనే దృక్పథాన్ని అంతగా వివరించవలసిన అవసరం కలగలేదు. కాని బుద్ధుడు తన మతాన్నే 'ధమ్మ' అని పిలవటంతో ఆ పని చేయకతప్పలేదు.

మనిషి సంపదలు, బాగోగులు, జయాపజయాలు, ప్రశస్తి వంటి వివిధ కార్యకలాపాలు, లక్ష్యాలన్నింటికి ధర్మాన్ని వర్తింపజేసి చూడటం గతంలో వలెనే ఇప్పటికీ కొనసాగింది. కాని అదే సమయంలో ఆ దృక్పథం ఇతర అంశాలకు కూడా వర్తించసాగింది. పోతే, ప్రతినియమాన్ని మరొక నియమం నిరాకరించే ప్రపంచంలో ఏ ధర్మాన్ని అనుసరించటం కూడా తేలిక కాదని ధర్మశాస్త్రాలే అంగీకరించవలసి వచ్చింది. ధర్మం గురించి నిర్వచిస్తూ పోయినవారు చివరకు ఒక మూలకు ఇరికిపోయి, అక్కడినుంచి బయటపడటమెట్లానో తెలియక ఒక కొత్త కథ చెప్పటానికి సిద్ధపడటం మనకు కనిపిస్తుంది.

## ధర్మం యొక్క కర్మ

ధర్మానికి సవాళ్లు ఎదురుకావటం అస్పష్ట రూపంలో జరగలేదు. ఒక దేవతగా ధర్మదేవత కూడా తన చర్యలకు వివరణలు ఇవ్వవలసి వచ్చింది. ఎందుకంటే, ఆ దేవత చర్యలకు నైతిక పరిణామాలంటూ ఉంటాయి. మరొక మాటలో చెప్పాలంటే ధర్మానికి కర్మ ఉండటమన్నమాట. ఆ కాలంలో ధర్మానికి భిన్నమైన ఆలోచనలు గల వర్గాలనుంచి సవాళ్లు ఎదురవుతుండేవి. ఈ కథను గమనించండి:

### చావుకొయ్యపై మాండవ్యుడు

ఒకప్పుడు మాండవ్యుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. తను ధర్మంలో నిపుణుడు. చాలాకాలం పాటు మౌనవ్రతం పాటించాడు. ఒకసారి కొందరు దొంగలు ఆయన ఇంటిలో దాగి ఉంటారు. తన మౌనాన్ని వీడి వారెక్కడ ఉన్నదీ భటులకు చెప్పేందుకు ముని నిరాకరిస్తాడు. అందుకురాజు ఆ దొంగలతో పాటు తనకు కూడా మరణ శిక్ష విధిస్తాడు. భటులు ఆయనను చావు కొయ్యపైకి ఎక్కిస్తారు. ధర్మానికి ప్రతిరూపమైన ఆ బ్రాహ్మణుడు చాలాకాలం పాటు ఆ కొయ్యపైనే ఉండిపోతాడు. ఆహారం లేకపోయినా చనిపోడు. అపుడు రాజు తనవద్దకు వచ్చి, తన అజ్ఞానం, అహంకారంలో తీసుకున్న తప్పు నిర్ణయానికి తనను క్షమించమని కోరుతాడు. బ్రాహ్మణముని రాజును క్షమిస్తాడు. మునిని కిందకు దించుతారు. కాని ఆ కొయ్యను తన శరీరం నుంచి బయటకు లాగలేక పోవటంతో బయటకు గల భాగాన్ని కోసివేస్తారు. బ్రాహ్మణుడు ఆ కొయ్యలో కొంతభాగం తన శరీరంలోనే మెడ, పక్కటెముకలు, పేగులలో మిగిలిపోయిన స్థితిలో అదే విధంగా జీవిస్తుంటాడు. ప్రజలు తనను మాండవ్యుడని (కొయ్య చివరి భాగం) పిలుస్తారు.

మాండవ్యుడు ధర్మదేవత వద్దకు వెళ్లి తను చేసిన దోషమేమిటని, తనకు ఈ దుస్థితి ఎందుకుదాపురించిందని నిలదీస్తాడు. అందుకు ధర్మదేవత, నువ్వు బాలునిగా ఉండినపుడు చిన్నచిన్న సీతాకోక చిలుకల తోకలలోకి గడ్డి పరకలను

గుచ్చావని, ఆకర్మకు ఇది ఫలితమని అంటాడు. దానిపై మాండవ్యుడు, ఒక చిన్నదోషానికి ఇంతి కఠినశిక్ష విధించావు. అందుకు నువ్వు మనిషిగా ఒక శూద్రురాలికి జన్మిస్తావు. ధర్మానికి ఫలితం లభించేందుకు ఈ ప్రపంచం కోసం నేనొక హద్దును నిర్ధారిస్తాను. పధ్నాలుగేళ్ళ వయసు వరకు ఎవరికీ పాప ఫలమంటదు అని ప్రకటిస్తాడు.

ధర్మం తెలిసిన బ్రాహ్మణుడు రాజుకన్న బలవంతుడన్నది వేదాలు తెలిసిన వారికి చెప్పనవసరం లేదు. కాని అటువంటి బ్రాహ్మణుడు ధర్మదేవత కన్న శక్తివంతుడు కావటం గుర్తించవలసిన విషయం. నైతిక శాస్త్రం అర్థం లేనిది. కీటకాలను హింసించినప్పటికీ పిల్లలను శిక్షించటం తగని పని. కనుక ఆ శాస్త్రాన్ని సవరించాలి. అదే విధంగా తప్పు న్యాయం చెప్పినందుకు ధర్మదేవత శాపానికి గురికావాలి.

ధర్మానికి కూడా కర్మ ఉంటుందనటాన్ని బట్టి ఈ సరికి కర్మ ఎంత శక్తివంతమైనదో గ్రహించవచ్చు. కర్మఫలాన్ని ఒకరినుంచి ఒకరికి సంక్రమింపజేయవచ్చునని ఆ కాలంలో బౌద్ధం చెప్పేది. అందుకు అవకాశం ఉన్నట్లు తొలి హిందూ గ్రంథాలు కూడా సూచనా ప్రాయంగా చెప్పాయి. యుధిష్ఠిరుని స్వర్గ ప్రవేశపు కథను గమనించండి:

## స్వర్గంలో, నరకంలో యుధిష్ఠిరుడు

స్వర్గంలో ప్రవేశించిన ధర్మరాజైన యుధిష్ఠిరునికి అక్కడ తన సోదరులు, ద్రౌపది కన్పించరు. వారెక్కడ ఉన్నారని ఆయన ప్రశ్నించగా తనను నరకానికి తీసుకు వెళతారు. అక్కడ చిత్రహింసలు సాగుతుంటాయి. భరింపరాని దుర్గంధం వెలువడుతుంటుంది. ధర్మరాజు అక్కడినుంచి వెను దిరగబోగా తన సోదరులు, ద్రౌపది ఆయనను పిలిచి, అట్లా వెళ్లిపోవద్దని, తను ఉన్నంత సమయమైనా సుగంధాలు వ్యాపించి తమకు ఊరట లభిస్తుందని అంటారు. ధర్మరాజు దానితో అక్కడే ఉండిపోవాలనుకుంటాడు. అంతలో ధర్మదేవత, ఇతర దేవతలు అటు రావటంతో పరిస్థితులు మారిపోతాయి. ఇంద్రుడు యుధిష్ఠిరునితో, రాజులంతా నరకానికి రావలసిందే. దుష్కార్యాలు ఎక్కువగా చేసినవారు మొదట తమ సత్కార్యాల ఫలాలను అనుభవించి తర్వాత నరకానికి వెళతారు. తక్కిన వారు మొదట నరకానికి, తర్వాత స్వర్గానికి పోతారు. నువు కూడా నీ సోదరుల కోసం, ద్రౌపది కోసం కొంతసేపు నరకంలో ఉండవలసి వచ్చిందని అంటాడు. చివరకు అందరూ స్వర్గానికి వెళ్లటం వేరే కథ.

అయితే యుధిష్ఠిరుడి నుంచి సుగంధాలు తక్కిన వారికి వ్యాపించటమన్నది కర్మఫలం మరొకరికి సంక్రమించటం వంటిదే. మహా భారతంలో ఇటువంటిదే మరొక కథ ఉంది.

ఒక పూజారి తన రాజుకు వందమంది పుత్రులు జన్మించటం కోసమని ఒక బాలుడిని బలిస్తాడు. ఆ పాపానికి నరకానికి పోతాడు. ఆ పాప ఫలితాన్ని తాను స్వీకరించగలనని రాజు చెప్పగా, ఒకరి కర్మఫలం మరొకరికి సంక్రమించదంటాడు ధర్మదేవత. అపుడు రాజు, పూజారి నరకంలో ఉన్నంత కాలం తానుకూడా అక్కడనే ఉండగలనని పట్టుబట్టటంతో చివరకు ఇరువురూ స్వర్గానికి పోతారు. అంతకు ముందు పాండవులు నరకం నుంచి స్వర్గానికి పోయిన తర్వాత అక్కడ కొంత కాలం గడిపి అంతకన్న పైకి పోయినట్లు కథ చెప్తుంది. అది మోక్షానికన్నమాట.

## భగవద్గీతలో ధర్మం, మోక్షం, భక్తి

బౌద్ధం విసిరిన సవాలును ఎదుర్కొనేందుకు ధర్మం అనేక సూక్ష్మ మార్గాలను అనుసరించవలసి వచ్చింది. తొలి ఉపనిషత్తుల కాలం నుంచి బాగా విస్తరించిన మోక్ష భావనను ఎదుర్కోవటం ఇంకా పెద్ద సవాలయింది. ధర్మం, మోక్షం గురించిన ఆలోచనలు శతాబ్దాలుగా ఉన్నాయి గాని, భగవద్గీతలో ఆ రెండింటి మధ్య ముఖాముఖి సంఘర్షణ ఏర్పడింది.

అశోకునికి ఏర్పడినటు వంటి సందేహాలే అర్జునునికి కూడా ఎదురవుతాయి. కృష్ణుడుని హింసాహింసల గురించి కష్టతరమైన ప్రశ్నలు అనేకం అడుగుతాడు. అవి వెనుకటి నుంచి ఉన్నవే. జవాబిచ్చేందుకు సాధ్యపడనివి. ఆత్మను చంపలేవు గనుక యుద్ధంలో శరీరాన్ని చంపడమన్నది నిజంగా చంపటంకాబోదంటాడు కృష్ణుడు అర్జునుడితో. దానిని బట్టి రచయితకు అసలు హింస అనేది ఇబ్బందికరంగా మారిందని, దానిని సమర్థించేందుకు శ్రమపడవలసి వచ్చిందని అర్థమవుతుంది. చివరకు ఆ నైతికమైన ప్రతిష్ఠంభన పరిష్కారం కాదుగాని, కృష్ణుడు తన విశ్వరూపాన్ని అర్జునునికి ప్రదర్శించటంతో పక్కకు కొట్టుకుపోతుంది. అంతకుముందు కృష్ణుడు ఇచ్చిన సమాధానాలన్నీ సంక్లిష్టమైనవి, అస్పష్టమైనవి మాత్రమే. కృష్ణుడు తన విశ్వరూపం చూపి నోరు తెరిచినపుడు యోధులు, సైనికులంతా ఆ నోటిలోకి వెళ్లి పోవటం చూసిన అర్జునునికి తను యుద్ధంలో నిమిత్త మాత్రుడినని బోధపడుతుంది. ఆ విధంగా ధర్మాధర్మాలు, లేదా హింసా హింసల మధ్య రాజీ జరుగుతుంది. అయితే మొత్తం మీద మహా భారతంలోని సందేశం హింస, యుద్ధం కావు. భారతదేశంలో భగవద్గీతను యుద్ధానికి సమర్థనగా ఉపయోగించరు. అందుకు భిన్నంగా దానిని భారత కథా సందర్భం నుంచి విడదీసి చూసి అందులోని తాత్త్వికతను ఉపయోగిస్తారు. భగవద్గీతను గాంధీ శాంతి ప్రబోధానికి వినియోగించాడు.

ధర్మానికి, మోక్షానికి మధ్యగల ఘర్షణాత్మక స్థితిని కృష్ణుడు భక్తిని రంగంలోకి తేవటం ద్వారా పరిష్కరిస్తాడు. భక్తి ఆ రెండింటికి మధ్యవర్తిత్వ పాత్ర వహిస్తుంది. అర్జునుడు

ధర్మానికి, పరిత్యాగానికి మధ్య ఏమి చేయాలో తేల్చుకోలేనపుడు కృష్ణుడు తనకు భక్తి అనే మూడవ మార్గాన్ని చూపుతాడు. భగవద్గీత మోక్షానికి కర్మయోగం, జ్ఞానయోగం, భక్తియోగం అనే త్రివిధ మార్గాన్ని బోధిస్తుంది. కృష్ణుడు సూచించిన భక్తి మార్గాన్ని అనుసరించటం ద్వారా అర్జునుడు తన కర్మల దుష్ఫలితాలను అనుభవించకుండా తప్పించుకుంటాడు. ఇది ఒక అగ్రవర్ణ కుటుంబీకుని సిద్ధాంతంలోకి సన్యాసుల అధర్మాన్ని చొప్పించటం. భగవద్గీత అర్జునునికి తన కర్మలను ఆచరించుతూ కర్మఫలాలను మాత్రం పరిత్యజించడమనే అద్భుతమైన పరిష్కారాన్ని చూపుతుంది. అది నిష్కామ కర్మ. మరొక విధంగా చెప్పాలంటే ఎవరి కర్మనువారు ఆచరించటం. అర్జునుని విషయంలో నిష్కామ దృష్టితో తన బంధుమిత్రులను సంహరించటం. బౌద్ధంలోని సామాజిక నైతికతకు ఇది భిన్నమైంది.

## కుల, వర్గ ఘర్షణలు

స్వధర్మానికి కట్టుబడాలని భగవద్గీత బోధించిన విషయం, ఆ కాలంలో క్రమంగా రూపు తీసుకుంటున్న ఒక కొత్త సామాజిక వ్యవస్థలో భాగం. అది కులవ్యవస్థ. ఆ వ్యవస్థను వర్ణ వ్యవస్థలో భాగంగా చేసేందుకు మనువు ప్రయత్నించాడుగాని, అది అంత తేలికైన విషయం కాదు. వర్ణాలు, జాతులు (కులాలు) కలిసి ఒకే సామాజిక వ్యవస్థగా రూపుతీసుకోవటం మొదలైంది గాని వాటికింకా ఏకరూపం రాలేదు. వేర్వేరు సామాజిక వర్గాలు ఒకటయే ప్రక్రియకు ఆరంభం జరిగింది. ఆ వర్గాల వృత్తులు, జాతి స్థాయి, మతాలు లేదా శాఖలు, లేదా భాష ఒకటి కావటం ఇందుకు కారణాలు. జాతులలో అనేకం ఆయా వృత్తి సమూహాల నుంచి, నిర్దిష్టమైన పనులలో ప్రావీణ్యం సాధించే కుటుంబాలనుంచి రూపుతీసుకుని ఉంటాయి. కులానికి సంస్కృత పదం అయిన 'జాతి' కి 'పుట్టుక' అని అర్థం. కాని ఇతర జాతులలో బయటి ప్రాంతాల ప్రజలు, శకులు, కుషాణుల వంటివారు, నిషాదుల వంటి ఆటవికులు కూడా చేరి ఉంటారు. ఒకోసారి నిషాదులు, చండాలుర వంటివారు పంచమ వర్ణంగా మారిన సూచనలున్నాయి.

సమాజాన్ని జాతులుగా విభజించటంతో కొత్త సంస్కృతుల వారిని, కొత్త ప్రజలను ఏదో ఒక జాతిలోకి చేర్చేందుకు ఆస్కారం ఏర్పడింది. వారి వృత్తులు, సామాజిక మూలాలపై అది ఆధారపడి ఉంది. ఆ విధంగా కొత్తగా వచ్చి చేరిన జాతులలో అనేకం శూద్ర జాతులు. వారికి వైదికాచారాలలో భాగస్వామ్యం లేదు. తమ సంప్రదాయాలను తామాచరించి, తమ దేవతలను తాము పూజించేవారు. శూద్రులకన్న దిగువన అస్పృశ్య జాతులు, వారికి దిగువన ఆదివాసులు, మ్లేచ్ఛులు ఉండేవారు. బౌద్ధులు, జైనుల వలె హిందూ మతంలోని కొత్త శాఖలవారు జాతివ్యవస్థను వ్యతిరేకించారు. కనీసం ఆ విభజన

సూత్రాలను ప్రశ్నించారు. అదే సమయంలో, అందరికీ అన్నీ కాగల సాధారణ ధర్మ దృష్టికి ప్రాచుర్యం లభించసాగింది. దానిని అశోకుడు బాగా ప్రచారం చేసాడు. జాతి వ్యవస్థలో వ్యక్తులు పైకి పోకుండా ఉండేందుకు బ్రాహ్మణులు చేయగలిగినదంతా చేసారు గాని, తమ వృత్తిని మార్చుకోవటం ద్వారా ఒక జాతి మరొక జాతిగా మారి పైకిపోగల అవకాశాలుండేవి. లేదా ఉన్న ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మారి కూడా ఉన్నత జాతి వారయేవారు. ఆ విధంగా శూద్రులు బ్రాహ్మణులు కావచ్చునన్నమాట. పలువురు రాజులు వాస్తవానికి గతంలో శూద్రులు, లేదా బ్రాహ్మణులు. అందువల్లనే భారతదేశానికి ముస్లిం పాలకులు వచ్చినపుడు స్థానిక పాలకులలో ఎవరి వర్ణమేదో, జాతి ఏదో సరిగా గుర్తించలేకపోయారు.

మహాభారతం జాతి వ్యవస్థను సవాలు చేస్తుంది, సమర్థిస్తుంది కూడా. 'వర్ణ' మన్న పదానికి ఈ దశలో 'రంగు' అనే అర్థం రావటం ప్రారంభమైంది. ధర్మం గురించిన ఒక చర్చా సమయంలో ఒక ముని మరొక మునితో "బ్రాహ్మణులు తెల్లగా, క్షత్రియులు ఎర్రగా, వైశ్యులు పసుపుగా, శూద్రులు నల్లగా ఉంటా" రంటాడు. అయితే అది వారి చర్మపు రంగులు కావచ్చు, లేదా ఆయా జాతుల వారితో సంకేత ప్రాయంగా గుర్తింపుపెట్టిన వైనా కావచ్చు. అంతకన్న ముఖ్యమైన విషయం ఒకటుంది. ఒక మునిని ఎవరో వరుసగా కొన్ని ప్రశ్నలు అడుగుతాడు. నిమ్న జాతుల వారిని చిన్న చూపు చూడటాన్ని సమర్థించు కోవటం వారికి ఆ దశలో అవసరమైనట్లు ఆ ప్రశ్నలను బట్టి మనకు అర్థమవుతుంది.

### ఆయా జాతుల చర్మ వర్ణాలకు ఆరంభం

"నాలుగు వర్ణాలవారిని నాలుగు చర్మ వర్ణాలు వేరు చేసేమాట నిజమైతే, అన్ని వర్గాల వారిలోనూ కొందరు మిశ్రమ వర్ణాల వారుండటానికి కారణలేమిటి? కోరిక, క్రోధం, భయం, దురాశ, విచారం, ఆందోళన, ఆకలి, అలసట మనకందరికీ కలుగుతాయి. అటువంటి స్థితిలో భిన్న వర్ణాలను ఏ విధంగా గుర్తించారు? చెమట, మూత్రం, మలం, శ్లేష్మం, చీమిడి, రక్తం వంటివి మనందరి శరీరాల నుంచి వెలువడతాయి. అటువంటప్పుడు వర్ణాలను ఏ విధంగా వర్గీకరించారు? సమస్త ప్రాణికోటికి అనేక రంగులున్నపుడు దేనిది ఏవర్ణమవు తుంది?" అని ఆ వ్యక్తి ప్రశ్నిస్తాడు. అందుకు ఆ ముని సమాధానం ఈ విధంగా ఉంటుంది: "వాస్తవానికి వర్ణాల మధ్య ఏ వ్యత్యాసంలేదు. ఈ విశ్వమంతా బ్రహ్మమయం. కాని సృష్టికర్త ఈ లోకాన్ని సృష్టించినపుడు వారివారి కర్మలు ప్రజలను వర్ణాలుగా విభజించాయి. బ్రాహ్మణులలో సుఖాలకు అలవాటుపడి, త్వరగా ఆగ్రహానికి గురవుతూ, ఇంతలోనే ప్రేమ అంతలోనే ఆగ్రహం తెచ్చుకుంటూ,

స్వధర్మాన్ని పరిత్యజించినవాడు క్షత్రియుడై ఎర్రని శరీరాలను పొందారు. పశు గణాలను పెంచుతూ, వ్యవసాయం చేస్తూ, స్వధర్మాన్ని పాటించనివారు వైశ్యులై పసుపు శరీరాలను పొందారు. దురాశాపరులు, హింసాపరులు, అసత్యవాదులు, రకరకాల పనులుచేసి జీవించేవారు, స్వచ్ఛతను కోల్పోయినవారు శూద్రులై నల్లని శరీరాలను పొందారు. వారి వారి కర్మలు బ్రాహ్మణులను ఈ విధంగా విభజించాయి. అంతే తప్ప వారి ధర్మాన్ని, యాగ కర్మలను ఎవరూ ఎప్పుడూ ఆటంకపరచలేదు (12.181.5-14)".

మొదట అందరూ ఒకటే, అందరి ధర్మం, శరీర వర్ణం ఒకటే అయినా కొందరు స్వధర్మాన్ని వదలి ఇతర ధర్మాల వైపు మళ్లారని, అందువల్ల వారి శరీర వర్ణాలు మారాయని, స్వధర్మానికి కట్టుబడిన బ్రాహ్మణులు యథావిధిగా ఉండిపోయారని చెప్పటం ఇందులోని ఉద్దేశం. వర్ణ విబేధాలను ఈ విధంగా కొత్త రూపంలో ధృవీకరించటం కనిపిస్తుంది. వర్ణ వ్యవస్థను వేదాల్లో చెప్పినట్లు తొలినుంచి దేవతలు సృష్టించలేదు. ఆయా వర్ణాలవారు స్వయంగా ఎంపిక చేసుకున్న కర్మ విభాగాల వల్ల అది ఏర్పడుతుంది. అది వారి తప్పు.

## నిషాదులు

అప్పటి సమాజంలో చాతుర్వర్ణాలకు స్థానం ఉండేది. శూద్రులకన్న కిందివారైన పారియాలను, ఆదివాసులను ఆ వ్యవస్థ నుంచి వెలుపల ఉంచుతూనే అందుకోసం ఉపయోగించుకునేవారు. ఇందులో నిషాదులన్నవారు ఆటవికులు. వారిని ఎంత హీనంగా చూసేవారో మహాభారతం తొలి దశలో గల ఒక కథ చెప్తుంది.

### లాక్షా గృహం

పాండవులు చిన్న పిల్లలుగా ఇంకా వారి తల్లి కుంతితో నివసిస్తుండినపుడు, వారి శత్రువులు వారిని మోస పూరితంగా ఒక లక్క ఇంట్లో నివసించేట్లు చూస్తారు. ఆ ఇంటిని దహనం చేయాలన్నది శత్రువుల ఉద్దేశం. యుధిష్ఠిరుడు ఇది గ్రహించి, తమకు బదులు వేరే ఆరుగురిని ఆ ఇంటిలో ఉంచి నిప్పుపెట్టి, తప్పించుకుపోవాలనుకుంటాడు. కుంతి, ఆకలితో ఉన్న ఒక నిషాద స్త్రీని, ఆమె అయిదుగురు కుమారులను భోజనానికి ఆహ్వానిస్తుంది. నిషాదులు బాగా మద్యం సేవించి, పాండవులు తప్పించుకుని పోయిన తర్వాత కూడా ఇంటిలోనే ఉంటారు. నగరవాసులు ఆ శవాలను చూసి వారు పాండవులు, వారి తల్లి కుంతి అని భావిస్తారు. నిషాదులు లెక్కించదగినవారు కాదు గనుక వారికి ఏమైందో పట్టించుకోనక్కరలేదన్నది మహాభారత రచయిత దృష్టి. మరొక నిషాదుడు ఏకలవ్యుని కథను గమనించండి:

## బొటన వేలును ఖండించుకున్న ఏకలవ్యుడు

ద్రోణుడు పాండవులకు విలువిద్యలో గురువు. తనకు అర్జునుడు ప్రియ శిష్యుడు. నిషాదుల నాయకుని కుమారుడైన ఏకలవ్యుడు ఒక రోజు వారి వద్దకు రాగా, ధర్మం తెలిసిన ద్రోణుడు తనను శిష్యునిగా స్వీకరించేందుకు నిరాకరిస్తాడు. ఏకలవ్యుడు తన శిరస్సుతో ద్రోణుడి పాదాలను తాకి వందనం చేసి వెళ్ళి, మట్టితో ద్రోణాచార్యుని బొమ్మను తయారుచేస్తాడు. ఆ బొమ్మను గురువుగా భావించి సాధన ద్వారా గొప్ప విలుకాడవుతాడు. ఒకరోజు పాండవులు తమ శునకంతో పాటు వేటకు వెళ్లగా అది దారితప్పిపోయి ఏకలవ్యుని వద్ద నిలిచి మొరగటం మొదలుపెడుతుంది. ఆ నిషాదుడు ఇంచుమించు ఏక కాలంలో ఏడు బాణాలను ఆ కుక్క నోటిలోకి విడుస్తాడు. అపుడది పాండవుల వద్దకు వెళ్లగా, ఆ విధంగా బాణాలు సంధించినవారెవరా అని వారు ఆశ్చర్యపోతారు. వెతుకుతూపోయిన వారికి ఆ నిషాదుడు తన పేరు ఏకలవ్యుడని, ద్రోణుడి శిష్యుడినని చెప్తాడు. తర్వాత, ఏకలవ్యుడి గురించే ఆలోచిస్తూ ఉండిపోయిన అర్జునుడు ఒకరోజు ద్రోణుడితో, తను ఒక నిషాదుడిని శిష్యుడిగా ఎట్లా స్వీకరించాడని అడుగుతాడు. ఏకలవ్యుడు తనకన్న మంచి విలుకాడని కూడా అంటాడు. ద్రోణుడు అర్జునితో పాటు ఆ నిషాదుని వద్దకు పోయి, నువ్వు నా శిష్యుడివే అయితే అందుకు వెంటనే గురుదక్షిణ చెల్లించమంటాడు. ఎటువంటి దక్షిణ కోరినా ఆనందంగా ఇవ్వగలనని ఏకలవ్యుడనగా, తన కుడిచేతి బొటనవేలును కోరుతాడు ద్రోణుడు. అది మహాదారుణమైన కోరిక అయినప్పటికీ ఏకలవ్యుడు తన మాట నిలబెట్టు కుంటాడు. అర్జునుడు ఊపిరి పీల్చుకుంటాడు.

దీనిని మనమెట్లా అర్థం చేసుకోవాలి? ఏకలవ్యుడు తమ ప్రజలకు యువరాజు. కాని పాండవ రాకుమారులు దానిని లెక్కించలేదు. నిషాదులు హిందూ ధర్మానికి లోబడి ఆ సంప్రదాయాలను పాటిస్తున్నారు. అయినప్పటికీ జాతి వ్యవస్థలో వారిది అంతిమ స్థానం. అటువంటి నిషాదుడు పాండవులతో పాటు చేరి విలువిద్య నేర్వటమన్నది ఊహాతీతం. "ధర్మం తెలిసిన" ద్రోణునికి ఈ విషయం అర్థమైంది. తన ధర్మాన్ని, తన శిష్యుడిని కాపాడుకునేందుకు ఆయన ఏకలవ్యుని వద్ద 'గురు దక్షిణ' కోరుతాడు. మహాభారత రచయిత ఈ కథనాన్ని చెప్పిన తీరులోని ఒక విశేషాన్ని మనం గుర్తించాలి. ఏకలవ్యుని బాహిర రూపం ఏ విధంగా ఉన్నా తన అంతర్గతమైన మేలిమి లక్షణాలను భారతంలో పేర్కొన్నారు. అదే విధంగా ద్రోణుని కోరికను "దారుణ" మని అభివర్ణించారు.

రామాయణంలోని శంబూక వధ వలె, మహాభారతంలోని నిషాద స్త్రీ కుటుంబపు దహనం, ఏకలవ్యుని ఉదంతం ఆ కాలంలో వర్ణ వ్యవస్థకు వెలుపల, అన్ని సామాజిక వర్గాల కన్న అట్టడుగున గల నిషాదుల పరిస్థితికి అద్దం పడుతాయి.

## స్త్రీలు

మహాభారతంలోని స్త్రీలు అసాధారణమైన ప్రాముఖ్యత గలవారు, శక్తివంతులు, వ్యక్తిగత ధోరణిగలవారు. అందుకు కొంత కారణం అప్పటి సామాజిక వ్యవస్థలో వస్తున్న మార్పులు. స్త్రీలను దాతలుగా, పరిత్యాగులుగా, హిందూ సంప్రదాయాలలో క్రియాశీలంగా పాల్గొనే వారిగా వారికి గుర్తింపు రావటం మొదలైంది. స్త్రీల పట్ల చిన్న చూపులేని గ్రామీణ దృక్కోణాలు సంస్కృత సాహిత్యంలోకి ప్రవేశిస్తుండటం ఇందుకు ఒక మేర కారణం. మహాభారత రచయిత అయిన వ్యాసునితో పాటు, ఆ కథానాయకుల జన్మ వృత్తాంతాలను బట్టి కూడా స్త్రీలకు లభించిన ప్రాముఖ్యత ఏమిటో దృష్టికి వస్తుంది:

### వ్యాసుని పుట్టుక

> ఒక మత్స్యకారునికి ఒకసారి చేప కడుపులో ఒక ఆడ శిశువు కన్పించగా ఆ శిశువుకు సత్యవతి అని పేరు పెట్టి తన కుమార్తె వలె పెంచుతాడు. ఒకసారి ఆమె ఒక మహర్షిని తన పడవలో నదిని దాటించిన సమయంలో ఆయన తనను వశపరచుకుంటాడు. ఫలితంగా వ్యాసుడు జన్మిస్తాడు. సత్యవతి ఆ బాలుడిని ఒక దీవిపై వదలివేయగా తను వెంటనే మనిషిగా ఎదుగుతాడు. ఆ బ్రాహ్మణుడు సత్యవతికి కన్యాత్వాన్ని తిరిగి ప్రసాదిస్తాడు.

వ్యాసుని తల్లి సత్యవతి తల్లి చేప కాగా, తండ్రి క్షత్రియుడు. అటువంటి స్త్రీ తల్లి అయిన వ్యాసునికి తండ్రి బ్రాహ్మణుడు. వ్యాసుని సంతానపు కథ మరింత చిత్రమైంది.

తర్వాత సత్యవతి శంతనురాజును వివాహమాడి ఒక కుమారుడికి జన్మనిస్తుంది. ఆ కుమారుడు పెరిగి రాజై అంబిక, అంబాలిక అనే క్షత్రియ యువతులను పెళ్లాడతాడు. కాని సంతాన హీనునిగా మరణిస్తాడు. తమ వంశం నిస్సంతానంగా మిగలరాదని భావించిన సత్యవతి తన కుమారుడైన వ్యాసుడిని రప్పించి, ఆయన సవతి సోదరుని భార్యలైన అంబిక, అంబాలికలతో కూడి సంతానాన్ని కనవలసిందిగా చెప్తుంది. వ్యాసుడు వికారంగా, దుర్వాసనతో, ఎర్రటి గడ్డం, నారింజరంగు జుట్టుతో ఉండేవాడు. తనతో కూడినపుడు అంబిక కళ్లు మూసుకున్నందున తన కుమారుడు ధృతరాష్ట్రుడిని అంధుడివి కమ్మని శపిస్తాడు వ్యాసుడు. అంబాలిక పాలిపోవటంతో ఆమె కుమారుడు పాండుకు పాండురోగం రావాలని శపిస్తాడు. వ్యాసుడిని అంబిక వద్దకు రెండవసారి పంపగా ఆమె తనకు బదులు ఒక దాసిని వెళ్లమంటుంది. ఆ దాసి వ్యాసునికి పూర్తి ఆనందాన్నిస్తుంది. తనకు ఆరోగ్యవంతుడైన విదురుడు కలుగుతాడు. కాని ఆ దాసి క్షత్రియురాలు కానందున విదురుడు రాజు కాలేడు. ఈ కథలో సత్యవతి మూడవ కుమార్తె అంబ కూడా ఉంటుంది. ఆమెను శంతనుడి మరో కుమారుడైన భీష్ముడు అపహరిస్తాడు. ఆమె భీష్మునిపై ప్రతీకార చర్యకు పాల్పడి అందుకు పర్యవసానంగా మరణిస్తుంది.

పాండురాజు ఒక శాపం కారణంగా తన భార్య కుంతితో కలియకూడదు. ఆ పనిచేస్తే చనిపోతాడు. అయితే కుంతి తనకు తెలిసిన ఒక మంత్ర శక్తితో ధర్మదేవతను ఆహ్వానించి యుధిష్ఠిరుడిని, వాయు దేవుడిని ఆహ్వానించి భీముడిని, ఇంద్రుడిని ఆహ్వానించి అర్జునుడిని కంటుంది. ఆ మంత్రాన్ని పాండురాజు రెండవ భార్య మాద్రికి తెలియజేయగా ఆమె అశ్వినీ దేవతల ద్వారా నకుల సహదేవులనే కవలపిల్లలకు తల్లి అవుతుంది.

కుంతి వివాహానికి ముందే సూర్యుని ద్వారా కర్ణుడిని కంటుంది. ఆమె చిన్నపిల్ల తత్వంతో తన మంత్రాన్ని పరీక్షించదలచి సూర్యుడిని ఆహ్వానించటంతో అట్లా జరుగుతుంది. సూర్యుడు తర్వాత ఆమె కన్యాత్వాన్ని పునరుద్ధరిస్తాడు. కుంతి సిగ్గుపడి ఆ శిశువును నదిలో వదలగా ఒక సూతుడు ఆ పిల్లవాడిని పెంచుతాడు. కర్ణుడి ఉదంతాన్ని అట్లుంచితే ఇతరత్రా దీనంతటిలో నపుంసకులైన భర్తలు, ఆగ్రహించే భార్యలు కొందరు కనిపిస్తారు. సత్యవతి, అంబ, అంబిక, అంబాలిక, కుంతి, మాద్రి ఇందుకు ఉదాహరణలు. పోతే కథానాయకులు ఆ పద్ధతులలో ఇతరులకు జన్మించినవారే. సంతానాన్ని విడిచిపుచ్చటం, ఈ స్త్రీలలో ఇద్దరి కన్యాత్వ పునరుద్ధరణవంటి ఉదంతాలు కూడా ఉంటాయి. ఆ ఘటనలను మరుగున పడేట్లు చేయటం, లేదా కనీసం ఆ స్త్రీలను నిర్దోషులుగా నిలపజూపటం ఈ కథల ఉద్దేశమనుకోవాలి.

## బహుభర్తృత్వం

ఈ స్త్రీల జీవితాలలోని ఇతర విషయాలను కూడా గమనిస్తే వారికి లోగడ ఎవరికీ లేనంతటి స్వాతంత్ర్యం ఉండేదని అర్థమవుతుంది. అయితే ఆ స్థాయి స్వాతంత్ర్యం తర్వాత మరెవరికీ లభించలేదు.

మహాభారతంలో బహుభర్తృత్వం, లేదా పలువురు పురుషులతో సంబంధాలు విరివిగా కనిపిస్తాయి. ఇది వరుసగా నాలుగు తరాల పాటు కనిపించినా ఆ స్త్రీల పట్ల సమాజంలో సదభిప్రాయమే ఉంటుంది. సత్యవతి, అంబిక, అంబాలిక, కుంతి, మాద్రి ఇటువంటివారే. మాధవి అనే మరొక రాణి తనను వరుసగా నలుగురు రాజులకు కొన్ని వందల అశ్వాల కోసం విక్రయించుకుంటుంది. ప్రతిసారి తన కన్యాత్వాన్ని తానే పునరుద్ధరించుకుంటుంది. వీరందరిలో ప్రముఖస్థానం ద్రౌపదిది. ఆమెకు చట్టబద్ధంగానే అయిదుగురు భర్తలున్నారు. హిందూ చరిత్ర పొడవునా బహు భార్యత్వం సర్వసాధారణం. ద్రౌపది భర్తలైన అయిదుగురు పాండవులలోనే యుధిష్ఠిరుడిని మినహాయిస్తే తక్కిన వారికి ద్రౌపదికి అదనంగా ఇతర భార్యలున్నారు. అర్జునునికి ముగ్గురు. ద్రౌపదితో కలిపి నలుగురు. స్త్రీల బహుభర్తృత్వానికి మరీ ఇంత అవకాశం ఉండేది కాదు. కొన్ని కథలలో అటువంటి సూచనలున్నా స్పష్టమైన ఆధారాలు లేవు.

ద్రౌపది బహుభర్తృత్వం అప్పటి పురుషులకు ఇబ్బందికరంగానే తోచేది. ఇంతకూ అటువంటి వివాహం ఎందుకు జరిగినట్లు? అందుకు రెండు కారణాలు చెప్తారు గాని అవి అంత నమ్మశక్యంగా తోచవు. మొదటి కథ ప్రకారం అర్జునుడు ద్రౌపదిని గెలిచిన తర్వాత పాండవులంతా ఆమెతో పాటు ఇంటికి వచ్చి, అమ్మా మేమేమి తీసుకువచ్చామో చూడు అంటారు. కుంతి తలపైకెత్తి చూడకుండా, ఏదైనప్పటికీ మీరు సమానంగా పంచుకొండి అటుంది. దానితో ఆ అయిదుగురు సోదరులూ ద్రౌపదిని పెళ్లాడతారు. కాని ఈ వివరణతో సంతృప్తి చెందని రచయిత మరొక వివరణ ఇస్తాడు. పాండవులు అయిదుగురూ ఇంద్రుని అవతారాలని, ద్రౌపది లక్ష్మీదేవి అవతారమని అంటాడు. లక్ష్మీదేవి ఇంద్రుని భార్య. పాండవులంతా ఇంద్రుని రూపాలు గనుక సమస్య లేదన్న మాట. కాని వ్యాసుడు ఇప్పటికీ సంతృప్తి పడక మరొక వివరణ ఇస్తాడు. అది ఈ విధంగా ఉంది:

## ద్రౌపది అయిదుగురు భర్తలు

ఒక గొప్ప ముని కుమార్తె భర్తను కోరుకుంది గాని ఆమె కోరిక ఫలించలేదు. ఆమె శివుడిని పూజించగా ఆయన వరమిస్తాడు. ఆమె గుణవంతుడైన భర్తను కోరుకుంటుంది. కాని ఆమె అదే మాట అయిదుసార్లు అనటంతో శివుడు అయిదుగురు భర్తలను అనుగ్రహిస్తాడు. అందువల్లనే ఆమె పంచ పాండవులను వివాహమాడింది. కాని అంతకుముందే తను శివునికి అభ్యంతరం తెలియజేస్తూ ఒక స్త్రీ ఒకరికన్న ఎక్కువ మంది స్త్రీలను వివాహమాడటం శాస్త్ర విరుద్ధమంటుంది. అందుకు విరుద్ధంగా వ్యవహరించటం పురుషలోలత్వమవుతుంది. పైగా తన భర్త తనను కన్యగా పొందాలి. అందుకు శివుడు సమాధానమిస్తూ, స్త్రీలు ప్రతినెల తమ రుతుక్రమం కారణంగా పరిశుద్ధులవుతారని, ఆ విధంగా ఆమె ధర్మం తప్పినట్లు కాబోదని హామీ ఇస్తాడు. అపుడు ద్రౌపది, ప్రతి కలయికకు తాను కన్యను కాగలనా అని అడగగా, శివుడు ఆ వరం కూడా ఇస్తాడు.

ఇటువంటి పౌరాణిక కథలు ఎట్లున్నా ద్రౌపది హేళనకు గురవుతూనే పోయింది. ఆమెను నిండు సభకు ఈడ్చుకుని వచ్చి వస్త్రాపహరణం చేయబూనిన కౌరవులు, అయిదుగురితో నిద్రించే స్త్రీ వ్యభిచారిణి అయి ఉంటుందంటారు. తర్వాతి శతాబ్దాల కాలపు మహా భారతాలు కొన్నింటిలోనూ ఆమె పట్ల చులకన భావం కనిపిస్తుంది. వాటిలో కొన్ని పరోక్షమైన వ్యాఖ్యలు. కాని ద్రౌపది తన అయిదుగురు భర్తల పట్ల నిజాయితీ గల స్త్రీ అయినందున మహాభారత రచయిత ఆమెను పతివ్రతగా భావించాడు. దుశ్శాసనుడు తన వలువలు అన్నింటిని తొలగించలేకపోవటం ఆమె పాతివ్రత్యానికి చిహ్నం వంటిది. అయినప్పటికీ హిందువులు తమ కుమార్తెలకు సీత అని తప్ప ద్రౌపది అని పేరు

పెట్టకపోవటాన్ని బట్టి సాధారణ ప్రజల సంప్రదాయాలలో బహుభర్తృత్వానికి ఆమోదం లేదన్నది స్పష్టం.

హిమాలయ ప్రాంతాలు కొన్నింటిలో ప్రస్తుతం బహు భర్తృత్వం కనిపిస్తుంది. ఆ కాలంలో ఉండిన అదే సంప్రదాయాన్ని భారతం ప్రతిఫలించిందనే భావన ఒకటుంది. అయితే అందుకు నికరమైన ఆధారాలు మాత్రం లేవు. పాండురాజు కుంతికి ఒక కథ చెప్తూ పూర్వం ఎపుడో స్త్రీలకు శృంగార స్వేచ్ఛ ఉండేదని, కాని అది ఇపుడు లేదని అంటాడు.

## స్త్రీల శృంగార స్వేచ్ఛ ముగిసిన వైనం

శ్వేతకేతు అనే రుషి ఉండేవాడు. ఒకసారి ఒక బ్రాహ్మణుడు వచ్చి శ్వేతకేతు, అతని తండ్రి చూస్తుండగానే శ్వేతకేతు తల్లి చేయిపట్టుకుని "పద పోదాం" అన్నాడట. అది చూసి శ్వేతకేతు ఆగ్రహిస్తాడు. కాని తన తండ్రి, "కోపగించకుము, కుమారా, ఇది శాశ్వత ధర్మం. భూమిపైన అందరు స్త్రీలూ కట్టుబాటులో లేరు. అన్ని ప్రాణులూ గోవుల వలెనే ప్రవర్తిస్తాయి. దేని తీరులో అది", అంటాడు. కాని దానిని అంగీకరించిన శ్వేతకేతు ఇకపై అటువంటి స్వేచ్ఛ మనుషులకు ఉండబోదంటూ కట్టుబాటు చేస్తాడు. అప్పటి నుంచి అది నిలిచిపోయింది. భర్త పట్ల విశ్వాసపాత్రంగా లేని స్త్రీ వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి. ఆ పాపం భ్రూణహత్యతో సమానమవుతుంది. తన భర్తకు విధేయురాలిగా ఉన్న మరొక స్త్రీని లోబరచుకున్న పురుషుడు కూడా పాపి అవుతాడు.

మహాభారతంలోని ఇతర స్త్రీలు చెప్పుకోదగిన ధైర్యాన్ని, వివేకాన్ని ప్రదర్శిస్తారు. అయితే అదివారి భర్తల విషయంగా కనిపిస్తుంది. ఉదాహరణకు గాంధారి తన భర్త ధృతరాష్ట్రుడు అంధుడైనందున తాను గుడ్డతో కళ్లు కట్టివేసుకుంటుంది. పాండురాజు భార్యలు ఆయన మరణానంతరం సతీసహగమనానికి పోటీ పడతారు. మాద్రి చితినెక్కుతూ, "నా కోరిక తీరలేదు. తన కోరిక కూడా తీరలేదు. అందుకు ప్రయత్నిస్తూ తను మరణించాడు. కనీసం మరోలోకంలోనైనా తన కోరిక తీరాలి" అంటుంది. కుంతి కూడా సతికి సిద్ధమై, తాను పట్టపు రాణి గనుక ఆ హక్కు ఉంటుందని వాదిస్తుంది. చివరకు మాద్రి మాట నెగ్గగా, వారిరువురి సంతానపు బాగోగులు చూసేందుకు కుంతి ఉండి పోతుంది.

మహాభారత స్త్రీలకు అగ్నితో గల సంబంధం గమనార్హమైంది. కుంతి, గాంధారి అడవి అంటుకుని అందులో కాలిపోతారు. కృష్ణుని తండ్రి వాసుదేవుని భార్యలు నలుగురు భర్తతో సహగమనం చేస్తారు. ద్రౌపది తన భర్తల కన్న ముందు మరణిస్తుంది గనుక

సహగమనానికి అవకాశమే లేదు (పైగా వారంతా స్వర్గానికి బొందితో వెళతారు) గాని, ఆమె పుట్టుక అగ్నిలో జరుగుతుంది.

మహాభారత రచనా కాలం నాటి పరిస్థితులను గమనించినట్లయితే, అందులో బహుభర్తృత్వం పట్ల ఉదార దృష్టి ఎందుకు కనిపిస్తుందో కొంత అర్థమవుతుంది. కథా రచన మౌర్యుల కాలంలో, ఆ కాలం ముగిసిన వెంటనే మరికొంత కాలం పాటు సాగింది. ఆ దశలో స్త్రీలపై నగరాలలో, గ్రామాలలో కూడా కట్టుబాట్లు కొంత సడలి ఉండేవి. రాజ కుటుంబాల స్త్రీలు బౌద్ధులకు విరివిగా దానాలు చేసేవారు. వేశ్యలతో సహా వేర్వేరు తరగతులకు చెందిన స్త్రీలు బౌద్ధంలో చేరారు. రాజులు స్త్రీ విలుకాండ్రను రాజభవనాలలో అంగరక్షకులుగా నియమించుకునేవారు. రాజులు వేటకు వెళ్లినపుడు గ్రీకు స్త్రీలు వారి విల్లంబులు తీసుకుని వెళ్లేవారు. స్త్రీలు గూఢచర్యం చేసేవారు. స్త్రీ సన్యాసులు స్వేచ్ఛగా సంచరిస్తుండేవారు. వేశ్యలు పన్ను చెల్లించేవారు. పై తరగతి స్త్రీలు నిర్ధనులైనా, వృద్ధురాండ్రయినా, భర్తలు వారిని వదిలివేసినా ప్రభుత్వం వారికి నూలు వడకటం వంటి పనులు కల్పించేది. వయసు మీరిన వేశ్యలకు కూడా ఈ ఏర్పాటు చేసేవారు. ఒకవేళ బానిస స్త్రీ తన యజమాని వల్ల గర్భవతి అయితే ఆమెను, ఆమె సంతానాన్ని వెంటనే బానిసత్వం నుంచి విడిచిపుచ్చేవారు. ఆ విధంగా ఆ కాలంలో బౌద్ధంలో, హిందూ మతంలో కూడా స్త్రీలకు తగినన్ని పాత్రలు, స్వేచ్ఛలు ఉండేవి. మహాభారతం ఈ స్థితిని ప్రతిఫలించిందనుకోవాలి.

## అధ్యాయం 12

# శాస్త్రాలలోని 'తప్పించుకునే మార్గాలు'

## క్రీపూ. 100 - క్రీ.శ. 400

**కాలక్రమణిక**

| | | |
|---|---|---|
| సుమారు క్రీ.పూ. 166 – క్రీ.శ. 78 | : | భారత దేశంలోకి గ్రీకులు (యవనులు), సిథియన్లు (శకులు), బ్యాక్ట్రియన్లు, పార్థియన్ల (పహ్లవులు) రాకకొనసాగుదల |
| సుమారు క్రీ. శ. 100 | : | మను ధర్మశాస్త్ర రచన |
| సుమారు క్రీ.శ. 78–140 | : | కనిష్కుని పాలన, బౌద్ధమతానికి ప్రోత్సాహం |
| సుమారు క్రీ.శ. 150 | : | జునాగఢ్ వద్ద రుద్రదమనుడి ద్వారా మొదటి సంస్కృత శిలాశాసన ప్రకటన |
| సుమారు క్రీ.శ. 200 | : | కౌటిల్యుని అర్థ శాస్త్ర రచన |
| సుమారు క్రీ.శ. 300 | : | వాత్స్యాయన మల్లనాగుని కామసూత్ర రచన |

**ఒక దోషానికి పాల్పడినట్లయితే అందుకు పరిహారం ఏమిటన్న సూచనలు**

*పిల్లి, ముంగిస, కప్ప, తొండ, వంటివాటిని చంపితే అందుకు పరిహారంగా ఒక శూద్రుడిని చంపాలి. గుర్రాన్ని చంపితే అందుకు పరిహారంగా బ్రాహ్మణుడికి వస్త్రాన్నివ్వాలి. పాతివ్రత్యం లేని బ్రాహ్మణ స్త్రీని చంపితే చర్మంతో చేసిన సంచిని, క్షత్రియ స్త్రీనైతే విల్లును, వైశ్య స్త్రీనైతే మేకను, శూద్ర స్త్రీనైతే గొర్రెను బ్రాహ్మణునికి పరిహారంగా దానమివ్వాలి.*

– మనుధర్మ శాస్త్రం

ఇటువంటి జాబితాలలో జంతువులను, సామాజిక వర్గాలను, పాతివ్రత్యం లేని స్త్రీలను వర్గీకరించటం కనిపిస్తుంది. చంపటాలు, అందుకు పరిహారాలు అనే ప్రశ్నలను కేంద్రం చేసుకుని వాటి చుట్టు ఈ వర్గీకరణలు జరిగాయి. శాస్త్రాలలో ఇవన్నీ ప్రధానాంశాలే. అయితే స్త్రీలు, నిమ్న జాతులవారికి సంబంధించిన ఇటువంటి ప్రతిపాదనలను అన్నీ కాకపోయినా కొన్ని శాస్త్రాలు తిరస్కరించాయి.

బ్రాహ్మణ కాల్పనికతకు ఒక గ్రంథమంటూ లేదు. ఒకవేళ ఉందనుకుంటే శాస్త్రాలే ఆ గ్రంథాలవుతాయి. స్త్రీలు, జంతువులు, జాతుల (కులాలు) గురించిన దృక్పథం ఏమిటో

ఆ శాస్త్రాల్లోనే ఉంది. హిందూ మతంలోని అసమ్మతి ధోరణులవారు గురిపెట్టి విమర్శలు చేసింది కూడా ఈ దృక్పథాలపైనే. ఈ కాలంలోనే గాక తర్వాతి దశలలో విదేశీయులరాక వల్ల విజ్ఞాన పరిధులు విస్తరించాయి. ఆహారపుటలవాట్లు, వస్త్రధారణ, ఆలోచనలు కొత్తవి రాసాగాయి. అటువంటి మార్పులు తమకు ప్రమాదకరమని భావించటంతో బ్రాహ్మణులు తమ సామాజిక నియంత్రణను కొన్ని విధాలుగా కట్టుదిట్టం చేశారు.

## అంధయుగం

శాస్త్రాల రచన జరిగిన కాలంలో భారతదేశంలో చాలా వైవిధ్యత ఉండేది. ఆ వైవిధ్య స్థితిని నియంత్రించేందుకు శాస్త్రాలు ప్రయత్నించేవి. అపుడు గొప్ప రాజ వంశాలేవీ లేవు. శకులు, కుషాణులు రాజాధిరాజ వంటి బిరుదులు పెట్టుకునే వారుగాని అందుకు విలువలేదు. యూరో – అమెరికన్ చరిత్రకారులు కొందరు దానిని భారదేశపు అంధయుగమన్నారు. బలమైన రాజులు లేకపోవటం, అప్పటి చరిత్ర నిర్మాణానికి తగినన్ని ఆధారాలు లభించకపోవటం అందుకు కారణాలు. జాతీయవాద దృక్పథంగల భారత చరిత్ర కారులు అదే కాలాన్ని విదేశీ దండయాత్రల దశ అన్నారు. అయితే అదే సమయంలో సమాజంలో అస్తవ్యస్త స్థితి, సృజనాత్మకత, సాంస్కృతిక ఏకీకరణలు మనకు ఏక కాలంలో కనిపిస్తాయి. అస్తవ్యస్తతలు, రాజకీయ అరాచకాలు సంప్రదాయవాదులను భయపెడతాయి గాని, సంప్రదాయవాదులు కాని వారికి అది సృజనాత్మకతకు అనుకూలమైన పరిస్థితిగా తోస్తుంది. నిజానికి ఆ కాలంలో భారత ఉపఖండానికి పశ్చిమాన, తూర్పున ఇతర దేశాలతో వాణిజ్య సంబంధాలు పెరిగాయి. బయటి నుంచి కొత్త ఆలోచనలు వ్యాపించి వచ్చాయి. మౌర్యులు, గుప్తుల కాలానికన్న గొప్ప కళలు వర్ధిల్లాయి.

ఆ చారిత్రక దశ గురించి మనకు హిందూ నిర్మాణాలకన్న బౌద్ధ నిర్మాణాలు ఎక్కువ విషయాలను చెప్తున్నాయి. అమరావతీ స్తూపం, శిల్పాలు అందుకొక ఉదాహరణ. ఆ నిర్మాణ రీతుల ప్రభావం తర్వాత హిందూ దేవాలయాలపై కూడా కనిపిస్తుంది.

సంచార పశుపాలకులైన కుషాణులు మధ్య ఆసియా నుంచి గంగామైదాన ప్రాంతానికి తరలి వచ్చారు. కాని దండయాత్రగా కాక పశు పాలకులుగా, వ్యాపారులుగా, ఇంకా అదే విధమైన ఇతర పనుల కోసం వచ్చి విస్తరించారు. వారిలో కనిష్కుడు (క్రీ.శ. 112–144) రాజు కావటమే గాక బౌద్ధ మతాన్ని బాగా వ్యాపింపజేసాడు. నాల్గవ బౌద్ధ మహాసంఘ సమావేశాలను నిర్వహించింది ఆయనే. తన రాజధాని పెషావర్‌లో ఒక మహా స్తూపాన్ని కూడా నిర్మింపజేసాడు. తను అదే సమయంలో ఇతర మతాలను ఆదరించాడు. క్రీ.శ. 150 లో ఉజ్జయిని రాజధానిగా పాలించిన శక రాజు రుద్రదమనుడు గుజరాత్‌లోని జునాగఢ్ వద్ద మొట్టమొదటి సంస్కృత శిలాశాసనాన్ని ప్రకటించాడు. తన నేపథ్యం తెలియదుగాని ఆయన తనకు వ్యాకరణం, సంగీతం, శాస్త్రాలు, తర్కం

తెలుసునని చెప్పుకున్నాడు. వేర్వేరు యుద్ధ విద్యలలో ప్రావీణ్యం ఉంది. కవి కూడా. కుషాణులు క్రమంగా బలహీనపడగా శకులు క్రీ.శ. అయిదవ శతాబ్ది మధ్య వరకు పాలించారు. ఈ రెండు వంశాలకు సమకాలీనంగా వాయవ్య భారతంలో పహ్లావులు (పార్థియన్లు), దక్షిణాపథపు పశ్చిమ ప్రాంతాన అమరావతి రాజధానిగా శాతవాహనులు రాజ్యాలు నెలకొల్పారు. శాతవాహనులు తాము బ్రాహ్మణులమని, నిమ్న వర్గాలవారిని వివాహ మాడామని, క్షత్రియుల గర్వాన్ని అణచామని, చాతుర్వర్ణాల మధ్య వివాహాలను నిరోధించామని చెప్పుకున్నారు. వారు వైదిక సంప్రదాయాలతో పాటు బౌద్ధాన్ని కూడా ఆదరించారు.

బౌద్ధం నుంచి ఎదురైన సవాలును తట్టుకునేందుకు హిందూ మతం తన ధర్మాన్ని కాపాడుకోవటంతో పాటు విస్తరించేందుకు ప్రయత్నించింది. ధర్మమన్నది సాధారణంగా యాగాలు, బలులకు సంబంధించిన విధివిధానం కాగా ఇపుడు దానిని జీవితంలోని ఇతర విషయాలకు కూడా జీవితాంతం అన్వయించజూసారు. ఏ ఆహారం స్వీకరించాలి, ఎవరిని వివాహమాడాలి వగైరాలు కూడా ఈ పరిధిలోకి రాసాగాయి. బయటినుంచి కొత్త సంస్కృతి వచ్చి బ్రాహ్మణ సంస్కృతిని సవాలు చేస్తుండటంతో ఆ కొత్త సంస్కృతిని అర్థం చేసుకోవటం, నియంత్రించటం రెండూ సమస్యగా మారాయి. పర్యవసానంగా శాస్త్రాలు లోగడ కన్న పట్టు విడుపులు లేక కఠిన రూపం తీసుకున్నాయి. వాస్తవానికి శాస్త్రాలన్నవి భిన్నమైన విద్యలను, పద్ధతులను నిర్వచించి చెప్పేందుకు ఉద్దేశించినవి. ఆ విధంగా వాటిలో వైవిధ్యత పెరగాలి. కాని కొందరు వైవిధ్యతలు తమకు ప్రమాదకర మవుతున్నట్లు భావించి శాస్త్రాలను సంకుచితం చేసేందుకు ప్రయత్నించారు.

ఆ కాలంలో సామాజికవర్గాలు తామరతంపరగా పుట్టుకు రావటంతో, వాటిని ఎట్లా వర్గీకరించాలన్నది నిపుణులకు సమస్యగా మారింది. ఆ పని చేసేందుకు ఎవరో ఒకరు అవసరమయారు. ఆ వ్యక్తి మనువు. ధర్మశాస్త్ర కర్తలు వర్ణానికి, జాతికి మధ్య సమన్వయం సాధించజూసినపుడు, ఆ రెండూ కలిసి హిందూ సమాజమని భావించారు. బ్రాహ్మణుని శిరస్సు, నిమ్నజాతికి చెందినవాని శరీరం ఏకమై ఇద్దరు దేవతలుగా అవతరించిన పద్ధతిలో నన్నమాట. వర్ణం, జాతిలో ఏది మొదట ఆవిర్భవించిందీ తెలియదుగాని, ఆ రెండు దేనికది కొన్ని వందల సంవత్సరాలపాటు ఉనికిలో ఉన్న తర్వాత శాస్త్రాలు వాటిని ఒకటి చేశాయి. మొదట జాతులు వర్ణాలనుంచి ఏర్పడ్డాయన్నది ఒక వాదన. మనువు చెప్పిన దాని ప్రకారం బ్రాహ్మణ పురుషుడు, శూద్ర స్త్రీ కలియగా నిషాద జాతి ఏర్పడింది. క్షత్రియ పురుషుడు బ్రాహ్మణ స్త్రీకి కలిగిన సంతానం సూతులయారు. శూద్ర పురుషుడు, బ్రాహ్మణ స్త్రీకి జన్మించినవారు చండాలురయారు. కాని ఈ సూత్రీకరణలకు ఏ ఆధారం లేదు. పైగా ఈ పద్ధతిలో కొన్ని జాతుల గురించి

చెప్పగలరు. తక్కినవాటి మాటేమిటి? మనువు కాకపోయినా ఇతరులు కొంత వివరించబూనారు అదే పద్ధతిలో. ఉదాహరణకు మహా భారతం, చండాల పురుషునికి, నిషాద స్త్రీకి కలిగిన సంతానం కుక్కలను వండే జాతివారంటుంది. అయినప్పటికీ అంతిమంగా అన్ని జాతులను ఆ విధంగా వర్ణించి వర్గీకరించే అవకాశం లేదు. మనకు అటువంటివి కనిపించవు కూడా. ఇందుకు భిన్నంగా, వృత్తులను బట్టి జాతులు ఏర్పడినట్లు చెప్పేందుకు పలు ఆధారాలున్నాయి. అనగా, జాతులను వర్ణ వ్యవస్థలోకి ఇమిడించే మనువు ప్రయత్నాలు బలహీనమైనవన్నమాట.

ఇటువంటి నిమ్నజాతులు చేయవలసిన పనులేమిటి, వారు ఏ విధంగా జీవించాలన్న వివరాలు మనువు చేప్తాడు. ఆ విధంగా చండాలుర గురించి చెప్పింది గమనించండి:

చండాలురు, కుక్కల వంటకం చేసేవారి నివాసాలు గ్రామానికి బయట ఉండాలి. వారు పాతబడి పారవేసిన పాత్రలను ఉపయోగించాలి. కుక్కలు, గాడిదలు వారి సంపదలు కావాలి. చనిపోయిన వారి వస్త్రాలను ధరించాలి. పగిలిపోయిన పాత్రలలో ఆహారం తీసుకోవాలి. ఇనుప ఆభరణాలు ధరించాలి. వారెప్పుడూ సంచరిస్తుండాలి...

తర్వాతి శతాబ్దాలలో నిమ్నజాతుల వారందరికి ఇంచుమించు ఇటువంటి నియమాలే విధించారు. వారిపట్ల సామాజిక వివక్ష చూపటమేగాక వారిని ఆర్థికంగా దోపిడీ చేసేవారు. సంప్రదాయాలను బట్టి చూసినపుడు వారెప్పుడూ అపవిత్రులే. ఆ స్థితి నుంచి విముక్తి కోసం చేయవలసింది వారు బ్రాహ్మణుల కోసం, గోవుల కోసం, స్త్రీలూ పిల్లల సంరక్షణ కోసం ప్రాణాలు వదలటమంటాడు మనువు. జాతులు ఈ పద్ధతిలో ఏర్పడతాయని ఒకచోట చెప్పే మనువు, మరొక చోట అందుకు భిన్నమైన వాదన చేసాడు. మొదట సృష్టికర్త అన్నింటిని వాటి కర్మానుసారం (పనులు) సృష్టించాడంటాడు. కర్మ అన్నది జాతితో సంబంధం కలది అయి, జాతులన్నింటిని సృష్టికర్త మొదటనే సృష్టించినపుడు, బ్రాహ్మణ, శూద్ర సమాగమంతో నిషాదజాతి ఏర్పడటం మాట ఎక్కడిది.

జాతులంటూ ఒకసారి ఏర్పడిన తర్వాత అవి ఏ పద్ధతిలో ఏర్పడినప్పటికీ ఇక విడివిడిగా ఉండక తప్పదు. ఒకవేళ నిమ్న వర్గాల వారితో భౌతిక సంపర్కం ఏర్పడినా ఆలోచనలు కలుషితమవుతాయని, శరీరంలో మోహ వికారాలు ప్రవేశించవచ్చునని భయం ఉండేది. ఆ వర్గాలను మనువు 'శారీరక కలియుగ' మన్నాడు. ఇదే పద్ధతిలో రకరకాల 'బహిష్కృతుల' జాబితాలు వేర్వేరు శాస్త్రాలలో కనిపిస్తూపోయాయి. వేదాలు ఎవరెవరికి నేర్పరాదు, ఏ స్త్రీలను వివాహమాడకూడదు, ఎవరిని అంత్యక్రియలకు పిలువవద్దు, ఎవరినుంచి ఇతరులు ఆహారాన్ని స్వీకరించరాదు, ఎవరు సాక్షులుగా పనికిరారు వంటి జాబితాలు అనేకం ఉన్నాయి. మతి స్థిమితం లేనివారు, తాగుబోతులు, జారులు, జూదరులు, నపుంసకులు, కుష్ఠురోగులు, అంధులు, ఒంటికన్నువారిపై పలు ఆంక్షలుండేవి.

మనువుకు భిన్నంగా కామసూత్రలోగాని, అర్థశాస్త్రంలోగాని వర్ణాలు, జాతుల గురించి పెద్దగా ఏమీ లేకపోవటం గమనించదగ్గది. అర్థశాస్త్రం చాతుర్వర్ణ వ్యవస్థను, జీవితంలోని నాలుగు దశలను ఆమోదించి, ఆ విషయాన్ని తర్వాత అరుదుగా తప్ప ప్రస్తావించదు. అందుకు బదులు తమతమ వృత్తుల రీత్యా, స్థాయిరీత్యా ప్రముఖులైన వారి గురించి అర్థశాస్త్రం మాట్లాడుతుంది. కామసూత్ర ఒకచోట తప్ప వివాహ విషయంలోనూ జాతుల ప్రస్తావన చేయదు. తగినంత ధనం ఉన్నంతవరకు పురుషుడు ఎవరైనా పరవాలేదంటుంది. ధనం ఉన్నట్లయితే స్త్రీలు కూడా సుఖంగా జీవించవచ్చునని చెప్తుంది. కాని ఈనాటికీ భారత దేశంలో వివాహాలు సర్వసాధారణంగా మనువు నిర్దేశించిన నియమాల ప్రకారమే జరుగుతున్నాయి.

మనువుతోపాటు కామసూత్ర, అర్థశాస్త్ర కూడా మనుషులను వ్యసనాలకు దూరం చేయవలసిన అవసరాన్ని చెప్పాయి. జూదం, మద్యపానం, వ్యభిచారం, వేట అనే నాలుగింటిని తీవ్రమైన వ్యసనాలుగా పేర్కొన్నారు. ఈ వ్యసనాల వల్ల రాజులు కూడా నష్టపోయిన ఉదంతాలు చరిత్రలో అనేకం ఉన్నాయి. వేటవల్ల పాండురాజు, జూదం కారణంగా నలుడు, యుధిష్ఠిరుడు ఏ పరిస్థితిని ఎదుర్కొన్నదీ తెలుసు. ఈ నాలుగు వ్యసనాలకు సంబంధించిన చర్చ వివిధ శాస్త్రాలలో విస్తారంగా ఉంది.

## ధర్మశాస్త్రాలలో స్త్రీలు

అన్ని వ్యసనాలలోకి స్త్రీ వ్యసనమే హీనమైనదని శాస్త్రాలు అనలేదుగాని, వారి ప్రస్తావన ఒక్కటే అంతటా కనిపిస్తుంది. మద్యం, దుర్వర్తనుల సహవాసం, భర్తలకు దూరం కావటం, స్వేచ్ఛగా తిరగటం, నిద్రపోతుతనం, పరుల ఇళ్లలో నివసించటం అనే ఆరు విషయాలవల్ల స్త్రీలు చెడిపోతారని, పురుషుడు అందగాడైనా కాకపోయినా పురుషుడైతే చాలు తనతో కలవాలని కోరుకుంటారని మనువు అభిప్రాయపడ్డాడు. అందువల్ల పురుషులు స్త్రీలను జాగ్రత్తగా గమనించాలని, ఒక బాలిక, స్త్రీ, వృద్ధురాలు ఎవరూ స్వతంత్రించి ఏమీ చేయరాదని అన్నాడాయన. స్వంత ఇంటిలోనూ అది తగదన్నాడు. బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, ఆయన మరణానంతరం కుమారుడు స్త్రీలను నియంత్రించాలి తప్ప వారికి ఎటువంటి స్వేచ్ఛ ఉండరాదని ప్రకటించాడు.

మనుధర్మశాస్త్రం కన్న కౌటిల్యుని అర్థశాస్త్రం, వాత్స్యాయనుని కామసూత్ర స్త్రీల పట్ల ఉదారత చూపాయి. వారికి బహుభర్తృత్వం, విడాకులు, పునర్వివాహం, ఆస్తిపై నియంత్రణ వంటి అవకాశాలు వీటిలో కనిపిస్తాయి. శాస్త్రాలలో స్త్రీల వివాహాలు, పురుషులతో సంబంధాలు, శృంగార భావనలపై చాలా వివరాలు, చర్చలు ఉన్నాయి.

## తప్పించుకునే మార్గం

ఒకే అంశంపై శాస్త్రాలు అపుడపుడు పూర్తి భిన్నమైన, పరస్పర విరుద్ధమైన వైఖరి కూడా తీసుకుంటుంటాయి. అదే సమయంలో దేనిపట్ల కూడా బలమైన మొగ్గు చూపవు.

'నియోగం' పై మనువు చేసే చర్చ అందుకొక ఉదాహరణ. ఒక స్త్రీ తన భర్త తనకు సంతానాన్ని కలిగించలేని స్థితిలో ఉన్నప్పుడు అతని సోదరునితో సంతానం పొందేందుకు అనుమతించే నిబంధనను నియోగమంటారు. మహా భారత కథానాయకుల తండ్రులు జన్మించిన ఉదంతం ఇటువంటిదే. ఆ సందర్భంలో నియోగాన్ని అనుసరించాలన్న మనువు, అది తగదని కూడా అంతలోనే అంటాడు. మనుధర్మశాస్త్రం పై వెలువడిన వ్యాఖ్యానాలు ఇది పరస్పర వైరుధ్యమన్నాయి. కాని మనువు ఆ రెండింటినీ చెప్పదలచుకున్నాడు. ఆ పని చేయటం సరైనది కాదని, కాని ఇక తప్పని పరిస్థితులలో మాత్రమే చేయాలన్నది తన ఉద్దేశం. ఆ కార్యంలో ఆనందాన్ని పొందేందుకు ప్రయత్నించరాదని, ఆ పని ఒకే ఒకసారి చేయాలని కూడా అన్నాడు. ఆ విషయమై చాలా జాగ్రత్తగా ఉండాలి.

మనువులో ఇతర వైరుధ్యాలను కూడా ఇదే పద్ధతిలో పరిగణించాలి. బ్రాహ్మణుడిని చంపటం ప్రశ్న అటువంటిదే. బ్రాహ్మణుడిని ఎప్పుడూ హత్యచేయరాదని పదేపదే చెప్తాడు. మరొక చోట, "తనపై దాడి చేసిన వ్యక్తిని మనిషి తన చేతిలో గల ఆయుధంతో ఎటువంటి సందేహం లేకుండా చంపవచ్చు. ఆ వ్యక్తి తన గురువు, ఒక బాలుడు, వృద్ధుడు వేదపారంగతుడైన బ్రాహ్మణుడు ఎవరైనా సరే. ఆ పని బహిరంగంగా చేసినా, రహస్యంగా నైనా. క్రోధానికి క్రోధమే జవాబు చెప్తుంది", అంటాడు. కన్యాశుల్కం చెల్లింపు మరొక ఉదాహరణ. అయితే దీనంతటిలోని ఉద్దేశాన్ని గ్రహించటం కష్టం కాదు. నీ సోదరుని పత్నితో నిద్రించకపోవటం, బ్రాహ్మణుడిని చంపకపోవటం, కన్యాశుల్కం స్వీకరించక పోవటం ఆదర్శస్థితి. కాని ఆ పని చేయక తప్పని పరిస్థితులు కొన్ని ఉంటాయి. అటువంటప్పుడు ఆ పని చేయటం ఎట్లాగో మనువు మీకు తెలియజేస్తాడు. ముందునుయ్యి వెనుక గొయ్యి వంటి స్థితిలో మీరాపని చేస్తారు. మామూలుగానైతే అందుకు సంతృప్తికరమైన సమాధానం ఉండదు.

ముందు నుయ్యి వెనుక గొయ్యి అనే స్థితిని సంస్కృతంలో 'ఆపద్' అంటారు. అపుడు సాధారణ నియమాలు వర్తించవు. ఆపద్ అన్నమాటను ధర్మంతో జోడించి ఆపద్ధర్మమంటారు. అనగా అత్యవసర స్థితిలో వ్యవహరించవలసిన పద్ధతన్నమాట. అదొక తప్పించుకునే మార్గం వంటిది. ఆర్తి, క్షుధ వంటివి ఇదే స్థితిని పోలిన ఇతర పరిస్థితులు. కరువు కాటకాలు ఏర్పడినపుడు ఒక తండ్రి తన కుమారుడి ప్రాణం తీయవచ్చు. బ్రాహ్మణులు కుక్క మాంసం తినవచ్చు. దీనికి ఇంకా విస్తరణలున్నాయి. "ఒక స్త్రీ నోరు ఎపుడు కూడా కలుషితం కాదు. పండును కొట్టి పడవేసి పక్షి నోరు కలుషితం కాదు. పొదుగు నుంచి పాలు పొర్లుతుండగా దూడ నోరు కలుషితం కాదు. ఒక జంతువును కరిచి పట్టుకున్నప్పుడు కుక్క నోరు కలుషితం కాదు". అనగా, కుక్క పట్టుకున్న జంతువును నువు ఆహారంగా తీసుకోదలిచావు. గనుక దాని నోరు కలుషితం కాదంటూ ఆ సందర్భం వరకు పునర్నిర్వచనం చెప్పాలి. ఇటువంటివే మనువులో అనేకానేకం కనిపిస్తాయి. అందుకు

ప్రామాణికత స్వీయావసరాలు. తను నిర్దేశించిన వాటిని తు.చ. తప్పకుండా అనుసరిస్తే మొత్తం జీవితమే స్తంభించిపోవచ్చు. కాని అవే నియమాలను ఆయన మరొక చోట నెమ్మదిగా సడలిస్తూ పోతాడు.

అయితే హిందువులు ఏమి చేయదలచినా, ఏమి చేయరాదనుకున్నా వాటన్నింటిని మను ధర్మశాస్త్రమే ప్రాతిపదిక కాలేదు. స్థానిక సంప్రదాయాలు కూడా అందుకు ఆధారమయాయి. అవి ఒకోసారి, మనుశాస్త్రానికి స్థానిక భాష్యాలుగా చలామణీ అయ్యాయి. మనువు చెప్పింది న్యాయశాస్త్రం వంటిది కాదు. కాని ఆదర్శాలు, నియమాలకు సంబంధించి మాత్రం అదే మూలాధారం. మనుధర్మశాస్త్రంలోగాని, కామసూత్రలో గాని ఉన్న విషయాలను అప్పటి ప్రజలు వాస్తవంగా ఆచరించేవారని కాదు. కాని సిద్ధాంతాలుగా, సూత్రీకరణలుగా అవి ప్రాచీన కాలపు శాస్త్ర ప్రపంచంలో గొప్ప సార్వజనీనత గల సాహిత్యమనాలి.

## అధ్యాయం 13

# దక్షిణ భారత దేశంలో 'భక్తి'

## క్రీపూ. 100 - క్రీ.శ. 900

**కాలక్రమణిక**

| | | |
|---|---|---|
| సుమారు క్రీ.పూ. 300 | : | పాండ్యులు, చోళులు, చేరుల గురించి ప్రస్తావించిన గ్రీకులు, అశోకుడు |
| సుమారు క్రీ. శ. 100 | : | చంకం (అసెంబ్లీ) కవితా రచన |
| సుమారు క్రీ.శ. 375 | : | పల్లవ వంశస్థాపన |
| సుమారు క్రీ.శ. 550–880 | : | చాళుక్య వంశోద్దీపన |
| సుమారు క్రీ.శ. 500–900 | : | నయన్మార్ శైవ తమిళ కవుల యుగం |
| సుమారు క్రీ.శ. 600–930 | : | ఆళ్వార్ వైష్ణవ తమిళ కవుల యుగం |
| సుమారు క్రీ.శ. 800 | : | తిరువాచకం రచించిన మాణిక్యవాచకర్ |
| సుమారు క్రీ.శ. 880–1200 | : | దక్షిణ భారతంలో వర్ధిల్లిన చోళ సామ్రాజ్యం |

### మనకు మరో దేవుడు దొరకడా?

నేను తనను నా తల్లి అనను. నేను తనను నా తండ్రి అనను. తనను నా ప్రభువంటే చాలుతుందనుకున్నాను– కాని నేను లేనే లేనన్నట్లు నటిస్తున్నాడు. రవ్వంతైనా దయచూపడు. కొలనులతో, బాతులతో నిండిన పచ్చిలాచ్చిరామంలో నివసించే ఆ దేవుడు తన భక్తులపై చూపవలసిన కరుణను వాయిదా వేసేవాడైతే– మనకు మరో దేవుడు లభించడా?

– కుంతరర్, క్రీ.శ. ఎనిమిదవ శతాబ్దం

పచ్చిలాచ్చిరామంలో నివసించే దేవుడు శివుడు. అటువంటి దేవుడిని తల్లిగా, తండ్రిగా, చివరకు తనవంటి భక్తుడైన సంతానాన్ని విడిచిపుచ్చే వానిగా ఊహించటమన్నది భక్తి తత్త్వానికి కేంద్ర బిందువు అయిన భావన. తన భక్తికి, ప్రేమకు స్పందించనందున తనను విడిచిపుచ్చగలనని హెచ్చరించటం కూడా ఆ భక్తి తత్త్వంలో భాగమే. యథాతథంగా భక్తి అన్నది ఒక మతపరమైన జీవన విధానం, లేదా ఉద్యమం. అంతే తప్ప ఒక మత శాఖవంటిది కాదు. భక్తి భావం లేదా ఉద్యమం ఒక దశలో ఒక శక్తిగా మారి తమను కూడా ప్రధాన స్రవంతిలో భాగం చేసుకోవాలని డిమాండ్ చేసింది. అయితే, ఆ భావనోద్వేగం వల్ల ఒకోసారి ఉద్రిక్తతలు ఏర్పడి వేర్వేరు మతాలమధ్య హింస కూడా

చోటుచేసుకుంది. ఇది ఒక మూడవ కూటమివంటిది. ఇందులో దేవతలు తమ భక్తుల పక్షం వహించటమే గాక పాపుల వెంట నిలిచారు. ఈ పాపులలో కొందరు దేవుడిని పూజించేవారు కూడా కాదు.

## దేశకాలాలు, కాలక్రమణిక, భౌగోళికత

చరిత్ర పరిశీలనలో మనమిపుడు ఎటువంటి దశకు చేరామంటే, ఒక సుదీర్ఘమైన కథలో 'ఇదిట్లుండగా' అంటూ మరో విషయానికి పోతుంటాము కదా – అటువంటి దశకన్నమాట. ఇంతవరకు చెప్పుకున్న కథకు కేంద్రం ఉత్తర భారతదేశం. ఎపుడైనా ఒకసారి ఒక ఉత్తరాది రాజు ఒక దక్షిణదేశపు రాజుపై దండెత్తినపుడు, లేదా రెండు ప్రాంతాల మధ్య వాణిజ్యానికి సంబంధించి మాత్రమే దక్షిణ ప్రాంత ప్రస్తావనలు వస్తుండేవి. ఇపుడాస్థితి తొలగిపోతుంది. భారతదేశ చరిత్ర ఒక పెద్ద మర్రి వృక్షం వంటిది. కొమ్మలు లేక ఆకాశంలోకి నిలువునా చొచ్చుకుపోయే ఒక వృక్షంవలె గాక మర్రిచెట్టు తన కొమ్మలను అన్నివైపులా విస్తరింపజేసి ఊడలను నేలలోకి దించుతుంది. ఆ ఊడలు ఆ కొమ్మలను వేరే చెట్లకు సమానం చేస్తాయి. ఆ విధంగా ఒక్క మర్రి చెట్టే ఒక అడవిగా మారుతుంది. కొంత కాలానికి వాటిలో ఏది అసలైన చెట్టో, ఏవి ఊడలో తెలియదు. ఇదే పద్ధతిలో మనం భారతదేశ చరిత్రకు సంబంధించి ఒకచోట ఏమి జరుగుతున్నదో తెలుసుకునే క్రమంలో మన దృష్టిని అందుకు సమాంతరంగా సాగించి మరొక చోట ఏమి జరుగుతున్నదో కూడా చూడవలసి ఉంటుంది. ఆ విధంగా ఇపుడు దక్షిణాదివైపు చూద్దాము.

## ప్రాచీన దక్షిణ భారతదేశం

భక్తి అన్నది ఏ విధంగా ఆరంభమైందో తెలియాలంటే, అందుకు తావిచ్చిన ప్రాపంచిక పరిస్థితులు ఏమిటో మనం ముందు తెలుసుకోవాలి. ఆ ప్రపంచంలో ఉత్తర – దక్షిణ సాంస్కృతిక ధోరణుల మధ్య పరస్పర సమ్మేళనం ఉండేది. వేర్వేరు మత ఉద్యమాల మధ్య క్రియాశీలమైన సంపర్కాలు ఉండేవి. మతాలకు రాజుల నుంచి బలమైన ఆదరణ లభించేది. రెండు ప్రాంతాల మధ్య క్రీ.పూ. నాల్గవ శతాబ్దంలో మౌర్యులకాలం నాటికి మంచి వాణిజ్య సంబంధాలు ఏర్పడ్డాయి. దక్షిణ భారతంలో సిరి సంపదలు ఎక్కువన్న గుర్తింపు క్రీ.పూ. 1000 ప్రాంతపు హిబ్రూ బైబిల్ నాటికే లభించింది. అక్కడి నుంచి బంగారం, వెండి, ఏనుగు దంతాలు, మర్కటాలు, మయూరాలను తీసుకు వెళ్లేందుకు సాల్మన్ రాజు బహుశా మూడు సంవత్సరాలకొకమారు తన ఓడలను పంపేవాడు. అప్పటి వాణిజ్యంలో నూలు వస్త్రాలు పశ్చిమ దేశాలకు చేరుతుండేవి. రోమ్‌తో విస్తారమైన వాణిజ్య సంబంధాలుండేవి. రోమన్లు ముఖ్యంగా సుగంధ ద్రవ్యాలు, ఆభరణాలు, వస్త్రాలు, దంత సామగ్రి, కోతులు, చిలుకలు, నెమళ్లవంటి విలాస సామగ్రిని దిగుమతి చేసుకునేవారు. అదే విధమైన సంబంధాలు చైనాతో, ఆగ్నేయాసియాలోని భారతీయీకరణ చెందిన స్థానిక

సంస్కృతుల వారితో ఉండేవి. ఎడారులలో ఒంటెలు, కొండప్రాంతాలలో గాడిదలు, ఇతరత్రా ఎద్దులు, కంచర గాడిదలు రవాణా సాధనాలుగా ఉపయోగపడేవి. గుర్రాలను వాడేవారు కాదు.

ఉత్తర దేశ రాజ్యాలకన్న దక్షిణదేశ రాజ్యాలు ఎక్కువ కాలం నిలిచి ఉండేవి. భౌగోళికంగా ఇంచుమించు అంతే విస్తారమైనవి కూడా. క్రీ.పూ. 300 ప్రాంతంలో చంద్రగుప్త మౌర్యుని ఆస్థానంలో రాయబారిగా ఉండిన గ్రీకు చరిత్రకారుడు మెగస్తనీస్, పాండ్యరాజ్యం దక్షిణ దేశంలోని తూర్పు తీరం వరకు విస్తరించి ఉండేదని రాసాడు. ఆ రాజ్యంలో 365 గ్రామాలుండేవి. తమిళనాడులోని పాండ్య, చోళరాజుల ప్రస్తావన అశోకుని శాసనాలలో కనిపిస్తుంది. కేరళలో పాలించిన చేరులు, శ్రీలంకవాసుల ప్రస్తావనలు కూడా చేసాడాయన. మరొకవైపు తమిళులకు ఉత్తర భారతదేశం గురించి, మౌర్యుల గురించి తెలుసు.

చోళ పాలకుడైన మొదటి రాజరాజు (క్రీ.శ. 985–1014) సముద్రాంతర సామ్రాజ్యాన్ని కూడా స్థాపించాడు. 9 నుంచి 13వ శతాబ్దారంభం వరకు మహాశక్తి సంపన్నులుగా ఉండిన చోళులు కావేరీ నదీ పరీవాహక ప్రాంతం విస్తరించి తమ పొరుగు రాజులైన చేరులు, పాండ్యులు, శ్రీలంక పాలకులపై దాడులు చేసారు. ఉత్తర సరిహద్దులలో గల చాళుక్యులపై నిరంతరం యుద్ధాలలో మునితేలారు. చాళుక్యుడైన మొదటి పులకేశి (క్రీ.శ. 543–566) అశ్వమేధయాగాన్ని నిర్వహించి వాతాపి (ఇపుడు బాదామి) రాజధానిగా కర్ణాటకలో ఒక వంశాన్ని నెలకొల్పాడు. అది దక్షిణాదిన వ్యాపించింది. ఆ క్రమంలో ఆయన చోళులు, పాండ్యులు, చేరులతో సంధి చేసుకున్నాడు. అటువంటి చాళుక్య రాజ్యాన్ని తమిళ చోళులు ఎట్టకేలకు 800వ సంవత్సరం ప్రాంతంలో జయించారు.

దక్షిణాదికి చెందిన చోళ, పాండ్య, చేర రాజ్యాలు బలమైనవి. అవన్నీ కొన్ని శతాబ్దాల పాటు నిలిచాయి. ఆ మూడింటికి ఉత్తరాన కాంచీపురం రాజధానిగా పాలించిన పల్లవ వంశం కూడా బలమైనదే. వారి రాజ్యం క్రీ.శ. 375 నుంచి ఆ స్థాయికి చేరింది. పల్లవ రాజ్యపు రేవుల నుంచి చైనా, పర్షియా, రోమ్‌లతో ముమ్మరంగా వాణిజ్యం జరిగేది. గుప్తరాజ్య పతనం తర్వాత ఆరవ శతాబ్దంలో పల్లవుల కాలంలో కళలు, సాహిత్యం ఉత్కృష్ట స్థితికి చేరాయి. పల్లవ సంస్కృత సాహిత్యంలో, దేవాలయాలు కేంద్రంగా గల శిల్పకళలో ఉత్తర దేశస్థుల పాత్ర చాలా ఉంది.

## తమిళంలో తొలి దేశభక్తి సాహిత్యం

ఒకవైపు పల్లవులు, చోళుల రాజ్యశక్తి, శిల్పకళ వ్యాపిస్తుండగా, మరొక వైపు భక్తి కూడా వ్యాపించసాగింది. అప్పటికి కొన్ని శతాబ్దాల క్రితం వైదిక సంస్కృతి బలంగా ఉండగా మోక్ష భావనలు వ్యాపించి పరిస్థితిని కల్లోలంగా మార్చినట్లు, ఇపుడు కూడా

వైదిక సంస్కృతి ఇంకా బలంగా కొనసాగుతుండగా భక్తి ఉద్యమం మరొక కల్లోలాన్ని సృష్టించింది. అక్షరాస్యులైన తమిళులతో ఆరంభమై, ఇతర ద్రవిడ భాషా సాహిత్యాలలో ప్రవేశించి, అంతిమంగా నిరక్షరాస్యులను చేరింది. ఆ విధంగా దక్షిణ భారతదేశమంతటా వ్యాపించిన భక్తి ఉద్యమం మధురలో కృష్ణుని ఆరాధన, పురీలో జగన్నాథ ఆరాధనలను ప్రభావితం చేసింది. తీర్థయాత్రలు, దేవాలయోత్సవాలపై కూడా ప్రభావం చూపింది. తన తమిళ స్వభావాన్ని కోల్పోక ఆ లక్షణాను ఉత్తర దేశానికి వ్యాపింపజేసింది. ఉత్తర భారతపు భక్తి భావనలను, ఉద్యమాన్ని ఉత్తర – దక్షిణాలు, సంస్కృత – తమిళాల మిశ్రమంగా మార్చింది.

ఉత్తర, దక్షిణాల మధ్య భౌగోళికమైన విభజనతో పాటు భాషా పరమైన విభజన కూడా ఉండేది. ఉత్తర భారతదేశంలో సంస్కృతంతో పాటు దాని నుంచి ఉద్భవించిన హిందీ, బెంగాలీ, మరాఠీ వంటి భాషలు దక్షిణ దేశంలో తమిళంతో పాటు ద్రవిడ భాషా కుటుంబానికి చెందిన తెలుగు, కన్నడ, మలయాళాలు మాట్లాడేవారు. తమిళ రచనలు క్రీ.శ. ఆరవ శతాబ్దికన్న ముందు కాలానికి లభ్యంకాలేదు. కాని ఆ సాహిత్యం కనీసం క్రీ.పూ. మూడవ శతాబ్దిలో అశోకుని కాలానికే ఉండేదనేందుకు ఇతర ఆధారాలున్నాయి. ఉత్తర దేశంలో సంస్కృతం, ఆ కుటుంబ భాషలవలె దక్షిణాదిన తెలుగు, కన్నడ, మలయాళ భాషలు వాడుకలోకి రాకముందు అనేక వందల సంవత్సరాల పాటు తమిళం రాజభాషగా ఉండేది. కవితా రచన కూడా అదే భాషలో సాగేది.

తమిళ సాహిత్య సంప్రదాయం సంస్కృతంతో నిమిత్తంలేకుండా స్వతంత్రంగా అభివృద్ధి చెందినట్లు కనిపిస్తుంది. గుహలలో కన్పించిన తమిళ లేఖనాలు ఒక విధమైన తమిళ బ్రాహ్మీ లిపిలో ఉన్నాయి. ఆ లిపి ఉత్తరాన మౌర్య సామ్రాజ్యం నుంచి గాక, దక్షిణాన గల శ్రీలంక నుంచి వచ్చినట్లు తోస్తుంది. అందుబాటులోగల అతి ప్రాచీన తమిళ సాహిత్యం సుమారు రెండు వేల మూడు వందల లఘు కవితా సంకలనాలు. అవి బహుశా క్రీ.శ. తొలి శతాబ్దాల నాటికి కూర్చి ఉంటారు. తర్వాత క్రీ.శ. 9–13 శతాబ్దాల కాలంలో పాండ్యులు, చోళులు పాలించినపుడు మరికొంత కవితా సాహిత్య రచన జరిగింది. వాటినన్నింటిని కలిపి చంకం (అసెంబ్లీ లేదా మహా సమావేశాలు) కవితలన్నారు. ఆ సమావేశాలు ప్రాచీన కాలంలో, 9,900 సంవత్సరాలపాటు వ్యాపించిన చారిత్రక దశలో, మూడుమార్లు జరిగాయి. మొదటి రెండు సమావేశాలు జరిగిన నగరాలను సముద్రం ముంచి వేసింది. భారతీయుల విశ్వాసాలలోని వరదల కథకు ఇది మరొక దృష్టాంతం. సంస్కృత, పాళీ భాషలలోని సంఘం అనే పదం తమిళంలో చంకం అయింది. బౌద్ధులు, జైనులు తమ సమాజాలను సంఘం అని పిలవగా, ఆ సవాలును తట్టుకునేందుకు హిందువులు కూడా అదే మాట వాడారు. అదే పద్ధతిలో తమిళ సాహిత్య సమాహారానికి అనంతర కాలంలో చంకం అనే పేరు పెట్టి ఉంటారు. చంకం కవితా సంకలనాలను

పరిశీలించినపుడు వారికి నందులు, మౌర్యులు, బౌద్ధులు, జైనుల సాహిత్యంతో పాటు రామాయణ, మహా భారతాల గురించి తెలిసినట్లనిపిస్తుంది.

దక్షిణ దేశంలో రాజ్యాలు ఏర్పడిన తర్వాత అక్కడ స్థిరపడిన బ్రాహ్మణులు సంస్కృతాన్ని క్రమంగా స్థానిక భాషలోకి ప్రవేశపెట్టారు. అదే పద్ధతిలో తాము తమిళ పదాలను నేర్చుకుని, తమిళ దేవతలు, సంప్రదాయాల గురించి తెలుసుకున్నారు. ఈ క్రమంలో తమిళ మతపరమైన భావనలు సంస్కృతంలోకి ప్రవేశించాయి. సంస్కృతంలో అప్పటికే రుగ్వేదకాలం నుంచి తమిళ పదాలు కొన్ని అరువుగా స్వీకరించినవి ఉన్నాయి. సంస్కృత పురాణ రచన దశలో దక్షిణాదిన చాళుక్యులు, పల్లవుల రాజ్యాలున్నాయి. తమిళ స్థల పురాణాలపై సంస్కృత సాహిత్య ప్రభావం ఉండగా, మరొక వైపు ఆ స్థలపురాణాలు దక్షిణదేశంలోనే రూపొందిన భాగవతపురాణాలపై ప్రభావం చూపాయి.

చంకం కవితలలో కొన్ని మతపరమైన అంశాలకు సంబంధించినవి. తిరుమల (విష్ణు) దేవుడు, నదీ దేవత వైకై, మురుకన్‌ల గురించి రాసినవి. శివ-పార్వతుల కుమారుడైన ఉత్తరాది దేవత స్కంధునికి, మురుకన్‌కు మధ్య అప్పటికే అబేధ భావనను కనుగొన్నారు. కాని ఆ కవితలలో అత్యధికం లౌకికమైన అంశాలకు సంబంధించినవే. అవి రెండు విధాలైనవి. ఒకటి ప్రేమ, ఉద్వేగాల వంటి అంతః (అకం) ప్రపంచం గురించి, రెండు రాజకీయాలు, యుద్ధం వంటి బాహిర (పూరం) ప్రపంచానికి సంబంధించి. రాజులను కీర్తించిన ఈ పూర్వ కవితలు, అనంతర కాలంలో దేవతలను ప్రార్థించిన కీర్తనలకు ప్రాతిపదికలయాయి.

అయిదు విధాలైన అంతర్భావనలను చిత్రీకరించేందుకు అకం కవితలలో, కొన్ని విధాలైన జంతువులు, పుష్పాలు ఉండే వేర్వేరు భౌగోళిక ప్రాంతాలను ఎంచుకున్నారు. ఆ అయిదు అంతర్భావనలు ప్రేమైక్యత (మర్కటాలు, ఏనుగులు, అశ్వాలు, ఎద్దులతో కూడిన పర్వతాలు), భాగస్వామి కోసం వేచి ఉండటం (లేళ్లు గల అడువులు, గడ్డి భూములు), భాగస్వామి విశ్వాసహీనుడు లేదా విశ్వాసహీనురాలు కావటం పట్ల ఆగ్రహం (కొంగలు వగైరా పక్షులు, గేదెలు గల నదీలోయ), ప్రేమించిన వ్యక్తి కోసం ఉత్కంఠతో ఎదురుచూడటం (సముద్రపు పక్షులు, మొసళ్లు, సొర చేపలతో కూడిన సముద్ర తీరం), వియోగావస్థ (రాబందులు, ఆకలిగొన్న ఏనుగులు, పెద్దపులులు, తోడేళ్లు గల ఎడారి ప్రాంతం). అకం కవితలు ప్రేమలో ఏడు విధాలను గుర్తించాయి. వాటిలో మొదటిది ప్రతిఫలం కోరనిది, లేదా లభించనిది కాగా, చివరది పరస్పరం సరిపోనిది. అనగా స్థాయి ఎక్కువైనది.

భక్తి కవులు తమ రచనల కోసం ఈ లౌకిక భావనలను స్వీకరించారు. ప్రధానంగా వియోగం లేదా విరహ సంబంధమైన వాటిని, తమవంటి భక్తుల పట్ల కరుణ, స్పందనలు చూపని దేవతలుకు వర్తింపజేశారు. వారు కరుణ చూపకపోవటానికి కారణం తమపై ప్రేమ లేకపోవటం కాదు. వారు ఇతర విషయాలలో నిమగ్నులై ఉన్నారన్నమాట.

క్రీ.శ. 600 ప్రాంతం నుంచి శివభక్తులైన నయన్మార్లు (సంప్రదాయకంగా అరవై ముగ్గురు), క్రిష్ణ లేదా విష్ణు భక్తులైన ఆళ్వార్లు (పన్నెండుగురు) భక్తి గీతాలు ఆలపిస్తూ సంచరించేవారు. నయన్మార్లు ఆరు నుంచి ఎనిమిదవ శతాబ్దాల కాలంలో తెవరం అనే కవితా సంచయాన్ని కూర్పు చేసారు. వారిని మొదటి ముగ్గురు నయన్మార్లు అన్నారు. వారిపేర్లు అప్పర్, కంపతర్, కుంతరర్. ఈ రచనలలో భిన్నమైన తమిళ వ్యాకరణాన్ని ఉపయోగించినందున చంకం కవితల శైలికి భిన్నంగా ఉంటాయి. విష్ణు భక్తులైన ఆళ్వార్లలో చివరివాడైన నమ్మాళ్వార్ తొమ్మిదవ శతాబ్దివాడు. ఆయన తన రచనకు తిరువైమొళి అని పేరు పెట్టాడు. అదే శతాబ్ది చివరి నాటికి చెందిన శివభక్తుడు మాణిక్కవాచకర్, తిరువాచకం అనే రచన చేసాడు. ఈ కవితలను దేవాలయాలలో, ఇళ్లలో చదివేవారు.

శివునికి పరిపూర్ణంగా అంకితమయే భక్తి భావన ప్రసక్తి శ్వేతశ్వతరోపనిషత్తులో ఉంది. అదే విధమైన అంకితభావం గురు దేవుని పట్ల కూడా ఉండవచ్చు. మహాభారతంలో ఏకలవ్యుడు గురువు పట్ల అటువంటి భక్తి కలిగి అందుకోసం తనను తాను హింసించు కోవటమనే భక్తి రూపాన్ని ప్రదర్శిస్తాడు. భక్తి భావన రామాయణంలో, భగవద్గీతలో మరిన్ని మెరుగులు దిద్దుకుంది. పూజలవంటి సంప్రదాయక క్రతువులు, జ్ఞానానికి భిన్నంగా భక్తి అన్నది మూడవ మార్గమని ఆ రెండు రచనలు పేర్కొన్నాయి. కాని దక్షిణ భారతదేశంలోని భక్తి భావన గీతలోని భావోద్వేగాన్ని స్వీకరిస్తుంది. అందులోని కర్మ, భక్తి వంటి మౌలిక పదాలకు దక్షిణ భారతదేశపు భక్తి భావనలో ఆ విధంగా పూర్తిగా కొత్త అర్థం కనిపిస్తుంది.

భక్తి అనే మాటకు తమిళంలో అంపు, పఱ్రు అనే పదాలున్నాయి. కాని వారు క్రమంగా సంస్కృత పదాన్ని స్వీకరించి భక్తిని పత్తి అన్నారు. తమిళ కవులు భక్తి భావనను తగు విధంగా సవరించి, దానిని స్థానిక మహాత్ముల అద్భుత చర్యలకు కూడా వర్తింప జేసారు. ఒకోసారి భగవత్కార్యంలో భక్తులు భౌతికంగా పాల్గొనటం గురించి చెప్పారు. ఉదాహరణకు రాముడు లంకకు వారధిని నిర్మించటంలో ఉడత చేసిన సహాయం గురించి కథ ఒకటుంది. దానిని ఆళ్వార్లు తమదైన పద్ధతిలో చెప్తూ, ఆ ఉడత వెన్నుపై రాముడు ప్రేమతో నిమిరాడని ఆ విధంగా దాని వెన్నుపై మూడు గీతలు శాశ్వతంగా ఏర్పడ్డాయని అంటారు.

భక్తికి రాజరికమైన, సాహిత్యపరమైన మూలాలు ఉన్నప్పటికీ, దానికి జానపదమైన, మౌఖికమైన లక్షణాలు కూడా ఉన్నాయి. భక్తి గీతాలు అనేకం మౌఖిక రూపంలో కూర్చినటువంటివే. కొన్నింటిని బహుశా నిరక్షరాస్యులైన సన్యాసులు కూర్చి ఉంటారు. వైదిక ఉపనిషత్ సంబంధమైన సంప్రదాయాలు, పురాణాలు, బౌద్ధ, జైన సంప్రదాయాలు, తమిళ, సంస్కృత కవితలు, తమిళంలోని ప్రేమ భావనలు మొదలైన వాటితో అప్పటికే ఎంతో సంపన్నంగా ఉండిన మిశ్రమంలోకి శైవ, వైష్ణవ భక్తి ఉద్యమాలు జానపద మతాన్ని, జానపద గీతాలను ప్రవేశపెట్టాయి. ఈ మిశ్రమానికి తర్వాత కాలంలో ఇస్లాంలోని అంశాలు

కూడా వచ్చి చేరాయి. ఈ విధమైన సాంస్కృతిక సమ్మిశ్రమాలు భారతదేశంలోని సర్వసాధారణమైన విషయం. దక్షిణ దేశంలో ఆ వైవిధ్యత మరింత ఎక్కువ.

సంస్కృత కవులు, చంకం కవులలో అధికులకు భిన్నమైన రీతిలో భక్తి కవులు స్వీయ జీవితాలు, వ్యక్తిత్వాల గురించిన వివరాలను కూడా తమ రచనలలో పొందుపరచారు. ఆ విధంగా ఆయా సన్యాసుల స్వరాలు కూడా ఆ కవితలలో వినవస్తాయి. గతకాలపు కాల్పనికతలు ఈ కవితలలో కొత్త రూపంలో కన్పిస్తాయి. ఒక కాల్పనిక కథలో ఏదో పాత్రకు ఎదురైన స్థితి ఈ కవితలోని పాత్రకు ఎదురవుతుంది. అయితే ఇది కొత్తకాదు. ఋగ్వేదంలోని అపల అనే స్త్రీ పాత్రలో మనకు ఇటువంటి స్థితే కనిపిస్తుంది. మహా భారతంలో ఆ కథను చెప్పే వ్యక్తి ఒకోసారి నేరుగా పాఠకుల ఎదుటకు వచ్చి, 'నేనిది నీకు ఇప్పటికే చెప్పా' నంటాడు. కాని చంకం కవితలలో ఆ కవి స్వయంగా ప్రముఖంగా ముందుకొస్తాడు. అదే స్థితి దక్షిణ భారతదేశపు భక్తి కవిత్వం నిండా కనిపిస్తుంది.

## దక్షిణ భారత దేవాలయాలలో వైవిధ్యత

భక్తి పెరుగుదలకూ, మతాలవారీ, శాఖలవారీ, విశ్వాసాలవారీ దేవాలయాల విస్తరణకూ అవినాభావ సంబంధం ఉంది. ఈ విధమైన వైవిధ్యతకు సూచనలు మనకు మహాభారత, రామాయణ కాలాల్లో, శాసనాల్లో కామసూత్ర, అర్థశాస్త్ర వంటి గ్రంథాలలో పేర్కొన్న అనేక దేవాలయాలలో కనిపిస్తాయి. భజ, కార్లే, నాసిక్, అజంతా, ఎల్లోరా వంటి గుహాలయాల గురించి మనం ఇప్పటికే పేర్కొన్నాము. మునుముందు రాజస్థాన్‌లోని దేవగఢ్‌లో గల ఆరవ శతాబ్ద కాలపు విష్ణు దేవాలయం, ఐహోలు, బాదామీ, పట్టడకల్ వంటి చోట్ల గల గుప్తుల కాలపు దేవాలయాల గురించి చూస్తాము. ప్రస్తుతం దక్షిణ భారతదేశంలో పల్లవ రాజుల హయాంలో దేవాలయాలు ఏ విధంగా దేవాలయ నగరాలుగా అభివృద్ధి చెందాయో చూస్తాము.

దేవాలయ నిర్మాణ మన్నది ఒక మేరకు బౌద్ధులు, జైనుల స్థూప నిర్మాణాలకు, ప్రముఖుల విగ్రహాలను ఆరాధించటానికి స్పందన కావచ్చు. నిధుల సేకరణలో హిందువులు బౌద్ధులతో పోటీపడ్డారు. దేవాలయాల కోసం, స్థూపాల కోసం ఎవరెంత ఖర్చు చేస్తారన్నది కూడా పోటీ వంటిదయింది. ఐహోల్‌లో ఒక జైన సన్యాసికి అంకితం చేసిన దేవాలయంలో 636 వ సంవత్సరానికి చెందిన శాసనం ఒకటి ఉంది. సంవత్సరాన్ని పేర్కొంటూ నిర్మించిన భారతదేశపు తొలిదశ దేవాలయాలలో అది ఒకటి. పల్లవులు బౌద్ధులను, జైనులను, బ్రాహ్మణులను, అదే విధంగా సంగీతం, చిత్రలేఖనం, సాహిత్యాలను ఆదరించారు. అజంతా గుహ చిత్రాల పనిలో పాల్గొన్న కళాకారులలో పలువురు దక్షిణాదికి వచ్చి, తమిళ రాజ్యాలలో హిందూ కళలు, నిర్మాణాల పనులలో నిమగ్నులయారు. ఆ కాలంలో దక్షిణాన కళాకారుల అవసరం పెరిగింది.

మహామల్ల, లేదా మామల్లగా పేరుపొందిన పల్లవరాజు మొదటి నరసింహ వర్మ (630–638), తన పేరిట నిర్మించిన మామల్లపురంలో గొప్ప దేవాలయాలయ నిర్మాణాన్ని చేపట్టాడు. ఆ దేవాలయం మహాబలిపురంగా ప్రసిద్ధి చెందింది. ఆ నిర్మాణాలను ఇతర పల్లవరాజులు పూర్తి చేశారు. అక్కడ సముద్ర తీరాన ఒక శైవాలయం, వరాహావతారంలో విష్ణువు గుహ, మహిషాసుర మర్దని రూపంలో దుర్గాదేవి విగ్రహం, ఒకే భారీ శిల నుంచి చెక్కిన అయిదు దేవాలయాలు (వాటి రథాలన్నారు) ఉన్నాయి. అవిగాక, సుమారు వంద అడుగుల పొడువు, యాభై అడుగుల ఎత్తునగల ఒక బృహద్ శిలపైన సముద్రాభిముఖంగా, పైకి ఉబికి వచ్చినట్లు శిల్పాలున్నాయి. దాని మధ్య భాగంలో పై నుంచి ఒక నది కిందకు దొర్లి వస్తున్నట్లు ఉంటుంది. నాగులు, నాగినుల చిత్రాలు, ఒక నాగసర్ప చిత్రం కూడా ఉంటాయి. బలమైన ఏనుగులు, జింకలు, కోతులు ఉత్సాహంగా ఆ నదివైపు పరుగిడుతూ కనిపిస్తాయి. హిందూమతంలో ఇంద్రుడు, సోముడు, ఇతర వైదిక దేవతలకు బదులు విష్ణువు, శివుడు, ఇతర దేవతలకు ప్రాధాన్యత లభించే క్రమం ఒకటి ఆరంభమైనట్లు చెప్పుకున్నాము. అందుకు తార్కాణంగా మహాబలిపురంలో విష్ణు, శివ దేవాలయాలు కనిపిస్తాయి. ఒక దేవాలయం అంతర్భాగంలో పై కప్పు అంచుల చుట్టూగల చిత్రాలలో ఆసక్తికరమైంది ఒకటుంది. మునుల కపట ధోరణిని వెక్కిరించటమా అన్నట్లు, ఒక పిల్లి యోగాసన ముద్రలో నిల్చుని ఉంటుంది. దాని చుట్టూ ఎలుకలుంటాయి. వాటిలో ఒకటి పిల్లిని ప్రార్థిస్తున్నట్లు కనిపిస్తుంది. సంస్కృత సాహిత్యంలో గల ఒక కథ, శాకాహారి అయిన ఒక పిల్లి గురించి చెప్తుంది. ఆ పిల్లి నిజానికి ఎలుకలను తింటూనే శాకాహారి అయినట్లు నటిస్తుంది. ఎలుకల సంఖ్య తగ్గుతుండటంతో వెతక సాగిన ఎలుకలకు ఒకరోజున పిల్లి మల విసర్జనలో ఎలుకల ఎముక ముక్కలు కనిపిస్తాయి.

అదే వలయంలో ఒక వ్యక్తి ఒంటికాలిపై నిల్చుని తపస్సు చేస్తుంటాడు. తను పాశుపతాస్త్రం కోసం శివుడిని ప్రార్థించే అర్జునుడని, గంగావతరణాన్ని కోరిన భగీరథుడని రకరకాల నిర్వచనాలున్నాయి. బహుశా రెండూ కావచ్చునన్నది నా ఊహ. 642లో ఒక గొప్ప సైనిక విజయాన్ని సాధించిన మహా మల్లుడిని కీర్తిస్తూ ఒక రచన ఉంది. అందులో అర్జునుడు, భగీరథుని ప్రస్తావనలు, విష్ణువు, శివుని ప్రసక్తులు కూడా ఉంటాయి. అదొక శ్లేష కావ్యం వంటి స్థితి. అదే ప్రకారం ఆ ప్రార్థనా శిల్పం అర్జునుడు భగీరథుడు ఇద్దరిదీ అయి ఉండవచ్చు కూడా. అనగా శ్లేష శిల్పం వంటిది.

మొదటి రాజరాజు తంజావూరులో శివుని కోసం బృహదీశ్వరాలయం పేరిట ఒక గొప్ప ఆలయ నిర్మాణాన్ని 995లో ఆరంభించాడు. దానినే రాజరాజేశ్వరాలయం అని కూడా అన్నారు. దాని నిర్మాణం తన మరణానంతరం 1012లో పూర్తయింది. దేవాలయంలో మంత్రాలు పఠించే సంప్రదాయాన్ని ఆయన ప్రవేశపెట్టినట్లు ఒక శాసనంలో ఉంది. మొత్తం దేశంలోని అతి పెద్ద దేవాలయాలలో ఒకటైన బృహదీశ్వరాలయ

అంతర్భాగంలో ఒక భారీ శివలింగం ఉంది. ఆ నిర్మాణానికి వ్యయం కూడా చాలా అయి ఉండాలి. రాజరాజు ఇతర రాజ్యాలను జయించటం ద్వారా లభించిన 230 కిలోలకు సమానమయే బంగారాన్ని, అంతకు మించిన వెండిని, కుప్పతెప్పలుగా ఆభరణాలను విరాళంగా ఇచ్చాడు. అదిగాక చోళ సామ్రాజ్యంలోని అన్ని గ్రామాలపై పన్నులు విధించారు. ఆ వసూళ్ళ నుంచి కొంత మొత్తాలను ఒక నిధిగా ఏర్పాటు చేసి అవే గ్రామాలలో పెట్టుబడి పెట్టటం, ప్రజలకు రుణాలివ్వటం వంటివి కూడా చేసారు.

చోళ సామ్రాజ్యంలోని భూములకు కావేరీ నది నుంచి నీరు లభించేది. దానిని దక్షిణ గంగ అనేవారు. వాస్తవంగా కూడా ఉత్తర భారతదేశానికి గంగానది ఎంతటిదో, దక్షిణానికి కావేరీ నది అంతటిది. 1023 లోనైతే చోళ రాజులు నిజంగానే గంగాజలాన్ని పెద్ద పాత్రలతో తెప్పించారు. దానిని 'చోళ గంగ' పేరిట ఒక పవిత్ర తటాకంలో నింపేందుకు రాజేంద్ర రాజుకు (1014–1044) అందజేసారు. అంతకుముందు ఎనిమిదవ శతాబ్దంలో రాష్ట్రకూటులు ఎల్లోరాలోని శివాలయంలో గంగా, యమున, సరస్వతీ నదుల చిత్రాలను చెక్కించటమే గాక, ఆ మూడు నదుల నుంచి పెద్ద పాత్రలతో నీటిని తెప్పించారు. ఆ ఉదంతం ఇపుడు చోళ రాజులకు ప్రేరణ కలిగించి ఉంటుంది.

చోళుల దేవాలయ నిర్మాణాలు శిల్పులకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించి ఉంటాయి. ప్రతి దేవాలయపు కుడ్యాలపైన వాటి వాస్తు శిల్పులు, గణకులు, కాపలాదార్లు, సిబ్బంది ఎందరన్న సంఖ్యలతోపాటు, ఆ దేవాలయానికి మాన్యాలపై లభించే ఆదాయమెంతో కూడా పేర్కొన్నారు. వాస్తు శాస్త్రాలు, శిల్పశాస్త్రాలు తెలిసిన మహా స్థపతుల వద్ద ఆ పనిలో నిరక్షరాస్యులైన పలువురు సహాయకులుగా, కూలీలుగా పనిచేసారు. చాలామంది దేవదాసీల పేర్లు కూడా అక్కడ కనిపిస్తాయి. వారిలో కొందరు భగవంతుని కోసం, కొందరు రాజుల కోసం ఆయన చెలికాండ్ర కోసం నృత్యాలు చేయగా, కొందరు నర్తనం చేయటమే గాక ఉన్నత శ్రేణి వేశ్యలుగా ఉండేవారు. నర్తకుల శిల్పాలు ఒకోసారి దేవాలయాలపై ఉండేవి.

భక్తికి, పూజలకు, అన్ని విధాలుగా దేవాలయాలే కేంద్రంగా ఉండేవి కావు. వాస్తవానికి హిందూ మతానికి ప్రజలు తమ ఇళ్లలో చేసే పూజలే గుండెకాయ వంటివి. పరిస్థితి ఎప్పుడూ అదే విధంగా ఉంటూ వచ్చింది. మరొకవైపు సంవత్సరం పొడవునా మధ్యమధ్య ఒక నిర్దిష్ట ప్రాంతంలోనో, లేక మొత్తం భారత ఉపఖండంలోనో కొన్ని మతపరమైన ఉత్సవాలు భారీ ఎత్తున జరిగేవి. ఇంటికి పరిమితమైన పూజలలో, ఇటువంటి ఉత్సవాలలో జరగని కార్యాలు అనేకం దేవాలయాలలో జరిగేవి. వాటిని హిందువుల మత జీవితంలో దేవాలయాల పాత్ర అనవచ్చు. భక్తి వల్ల వచ్చిన ఒక కొత్తదనం మత సంబంధమైన బహిరంగ వ్యవహారాలను రాజస్థానాల నుంచి దేవాలయాలకు మార్చటం.

తీర్థయాత్రలు, మత సంబంధమైన ఉత్పత్తులకు మార్కెట్లు, చర్చా సమావేశాల విషయాలను ఆస్థానాలలో గాక దేవాలయాలలో చర్చించటం మొదలైంది. అయితే, కొన్ని ఇతర మతాల ఆలయాలు వడ్డీ వ్యాపారులను ఆలయ ప్రాంగణం నుంచి బయటకు పంపివేసినటువంటి పని హిందూ మతంలో జరగలేదు.

దేవాలయాల ప్రపంచం వాటి కేంద్ర స్థానం నుంచి వెలుపలికి విస్తరించినా కొద్దీ దాని ప్రభావాలు కూడా వలయాలు– వలయాలుగా విస్తరించేది. దేవాలయానికి మధ్యలో గర్భ గృహం ఉంటుంది. అందులో భగవంతుడు నిర్గుణరూపుడై ఉంటాడు. ఒకోసారి తను నిర్వచించ వీలుగాని సంకేతప్రాయ రూపంలో కనిపిస్తాడు. ఒకోసారి ఒక సాధారణమైన విగ్రహంగా ఉండవచ్చు. ఒకోసారి నగ్నంగా ఉండవచ్చు లేదా దట్టంగా పట్టు వస్త్రాలు చుట్టి ఉండవచ్చు. గర్భ గృహం వెలుపలి మందిర భాగంలో చుట్టూ దేవతల విగ్రహాలు, లేదా చిత్రాలుంటాయి. వాటి తీరులో, హావభావాలలో, వాటికి ఎన్నితలలూ చేతులు ఉంటాయి, ధరించే ఆయుధాలు ఏమిటి, ఇతర వస్తువులేమిటి అనే దానిని బట్టి వాటి గుణగణాలు (స–గుణ) అర్థమవుతాయి. దేవాలయానికి బయటి గోడలపైన, మొత్తం ప్రాంగణంలో మరింత విస్తారమైన, ఇహలోకంతో సంబంధంగల విగ్రహాలు, చిత్రాలు నిండి అదంతా ఒక 'దేవాలయ దుర్గం' అనదగ్గ విధంగా తోస్తుంది. గర్భగుడికి వెలుపలి ఈ రెండు శ్రేణుల విగ్రహాలు, చిత్రాలలో శిల్పులు తమ చుట్టూ గల జీవిత దృశ్యాలను, శరీర సౌష్టవంగల స్త్రీలను, ఒకోసారి శృంగార పరమైన దృశ్యాలను చిత్రీకరించారు. భక్తులు భగవంతునికి అర్పించే పూవులు, పళ్లు, కొబ్బరికాయలు, వస్త్రాలు, సాంబ్రాణి వంటి సామగ్రిని వ్యాపారులు ప్రాకార కుడ్యానికి లోపల, వెలుపల కూడా విక్రయించేవారు.

## దేవాలయాలు, హింస

ఈ మహాదేవాలయ నిర్మాణాలకు రెండవ పార్శ్వం ఒకటుంది. ఏ నిర్మాణం కూడా ఉచితంగా జరగలేదు. అందుకు ధన వ్యయం చాలా అయింది. ఆ ధనం కోసం యుద్ధాలు, హింస బాగానే సాగాయి. వేదకాలంలో రాజులు – క్రతువులు – హింస అన్న క్రమానికి బదులు ఒక కొత్త క్రమం రూపతీసుకుంది.

దేవాలయ నిర్మాణాలకు పూనుకునే రాజవంశాలు గొప్పవి, సంస్కృతిగలవి, క్రూరమైనవి కూడానని ఆగ్నేయాసియాలో అంటారు. అదేమాట ఇక్కడ కూడా వర్తిస్తుంది. దక్షిణ భారతదేశపు రాజులు ప్రజలపై పన్నులు విధించటం, హింసకు పాల్పడటం ఒక నిత్య క్రమంగా మారింది. చోళ రాజుల కాలం నుంచి ఇతర రాజ్యాలపై దండయాత్రలు ఒక (దిగ్విజయ) కార్యక్రమమయాయి. మొదటి రాజేంద్రుడు 1014 లో శ్రీలంకపై దాడి జరిపి అనూరాధపురలోని స్తూపాలను, బౌద్ధరామాల సంపదలను పూర్తిగా లూటీ చేసాడు.

సమకాలీన బౌద్ధ రచనలు ఆయన సేనలను రక్తంతాగే రాకాసులుగా (యక్కాలు) వర్ణించాయి. చోళులు గురిచేసుకున్నది బౌద్ధాన్ని మాత్రమే కాదు. బిజాపూర్ జిల్లాలోని పశ్చిమ చాళుక్యుల శాసనం ఒకటి, చోళ సేనలు ఎంత పరమ క్రూరంగా ప్రవర్తించాయో, హిందూ స్త్రీలను, పిల్లలను, బ్రాహ్మణులను ఏ విధంగా వధించాయో, అగ్రవర్ణ స్త్రీలపై ఏ తీరున అత్యాచారాలకు పాల్పడ్డాయో వివరించింది.

అయితే దీనిని మతపరమైన హింస అనలేము. చోళులు శైవులైనా తమ రాజ్యంలో శైవంతోపాటు వైష్ణవాలయాను, జైన, బౌద్ధ వ్యవస్థలను కూడా ఆదరించారు. తమ హిందూ ప్రత్యర్థులు దేవాలయాలను ధ్వంసం చేయటం, తమ దేవాలయాలను గొప్పగా అభివృద్ధి పరచి తద్వారా తమ రాజకీయాధికారపు ఘనతను చాటి చెప్పటం చోళుల పద్ధతి. వారి దండయాత్రల ప్రాథమిక లక్ష్యం సంపదలను దోపిడీ చేయటం. తంజావూరు దేవాలయ నిర్మాణం కోసం రాజరాజులతో నిర్మించిన ఆలయాల స్థానంలో రాళ్లతో కొత్తవి నిర్మించారు. ఉత్తరాన రాష్ట్రకూటుల రాజ్యం వెంటగల తమ సరిహద్దులలో అదే జరిగింది. రాజులు, సామంతుల వద్ద చెప్పుకోదగిన సంపదలు ఉండినప్పటికీ, దేవాలయాలను అప్పటి బ్యాంకులనవచ్చు. దండయాత్రలు చేసే రాజులు ఆ ధనరాసుల కోసమే ఆలయాలను దోచుకునేవారు.

చోళులకు భిన్నంగా చాళుక్యులు ఎప్పుడు కూడా పల్లవుల దేవాలయాలను నాశనం చేయలేదు. పల్లవుల ఆలయ నిర్మాణ రీతులను గమనించి తమ రాజధానిలో వాటిని అనుకరించటంతో సంతృప్తి చెందారు. ఆ పనికోసం ఉత్తర, దక్షిణాల నుంచి కూడా శిల్పాలను, ఇతర పనివారిని రప్పించుకున్నారు. అందువల్లనే దక్షిణదేశపు గొప్ప నిర్మాణాలలో చాళుక్యులవి కూడా కొన్ని చేరుతాయి. ఇతరులు ఉత్తర దేశపు, లేదా ఒరిస్సా రీతులను అనుకరించారు. చాళుక్యుల దేవాలయాలను మొదట కొండలను తొలిచి నిర్మించారు. కాని రెండవ పులకేశి (610–42), స్థానికంగా లభించే ఎర్ర ఇసుక రాయిని ఉపయోగించి విడిగా నిర్మాణాలు జరిపించాడు. అటువంటి తొలి దశ నిర్మాణాలలో ఆయన చేపట్టినవి కూడా ఉన్నాయి. ఆ తరహా ఆలయాలు బాదామి, ఐహోలు, మహాకూట, ఆలంపూర్, పట్టడకల్ వంటి చోట్ల కనిపిస్తాయి. రెండవ చాళుక్య విక్రమాదిత్యుడు (733–46) పల్లవుల కైలాసనాథ దేవాలయం వద్ద ఒక శాసనం వేయిస్తూ (742), తాను ఆ దేవాలయాన్ని వశపరచుకున్నా దానిని గాని, ఆ నగరాన్ని గాని విధ్వంస పరచలేదని, దేవాలయపు బంగారాన్ని తిరిగి ఇచ్చివేసానని ప్రకటించటం విశేషం. ఒక రాజు ఆ విధంగా వ్యవహరించటం అసాధారణమైనది.

## రాజరికం, భక్తి

దక్షిణ దేశంలో మతాన్ని చోళులు, పల్లవులు చాలా ఆదరించారు. భక్తికి రాచరిక వ్యవస్థ ఒక నమూనా కూడా అయింది. భక్తి భావమన్నది మొదటినుంచి కూడా

భగవంతుడిని రాచరికంపై ఆవహింపజేసిన విధంగా వ్యవహరించింది. తమిళంలోని తొలి కవితలు కొన్ని తమ పోషకుడైన రాజును కీర్తించిన విధంగానే దేవుడిని కొనియాడాయి. అటువంటి కవితలలోని నాయకుడు, రాజు అనే పదాలకు బదులు దైవం అనే మాటను చేర్చితే చాలు తక్కినదంతా భగవంతునికి సరిపోతుంది. లౌకిక కవితలు రాజు పూర్వీకులను ప్రశంసిస్తే, భక్తి కవితలు దేవుని పూర్వావతారాలను ఆకాశానికెత్తాయి. దేవతల యుద్ధాలను, రాజుల యుద్ధాలను కూడా ఆయా హింసలను వర్ణిస్తూ ఒకేవిధంగా వర్ణించాయి. రాజులు తమ ఆశ్రయాన్ని కోరిన గాయకులకు వస్తు సంపదలనివ్వగా, భగవంతుడు తన భక్తులకు ఆహారం, సంపదలను అనుగ్రహించేవాడు.

రాముడు రాజు, భగవంతుడు కూడా అయిన పద్ధతిలో రామరాజ్యమనే ఊహలో రాజుకు, భగవంతుడికి మధ్య గల సన్నిహిత సంబంధమేమిటో మనం చూసాము. చోళు లు శైవులై ఉండి కూడా తమనుతాము విష్ణువు అవతారంగా చెప్పుకున్నారు. దశావతారాల పద్ధతిలో కాదుగాని సాధారణార్థంలో. ఇహలోకంలో రాజు రూపంలో గల విష్ణువు శివునికి భక్తుడు. రాజు ఏలుబడిలో గల పౌరునికి రాజు ఎటువంటివాడో, రాజుకు భగవంతుడు అటువంటివాడు. అంతా భక్తిమయమే. అదే సమయంలో రాజును భగవంతునికి సమానుడైనట్లు చూసేవారు. శివ–పార్వతులు, సీతారాముల వంటి దేవతా దంపతులు, రాజును, తన రాణులను కూడా అదే దృష్టితో చూసేందుకు ఒక నమూనాగా ఉండేవారు. రాజులు ఒకవైపు ఆ దేవతా దంపతుల శిల్పాలను, మరొకవైపు తాము – తమ రాణుల శిల్పాలను చెక్కించేవారు, లేదా లోహంతో తయారు చేయించేవారు. ఆ విధంగా చోళరాజులు చేయించిన కంచు విగ్రహాలు ప్రసిద్ధి చెందాయి. అవి చాలా అందమైనవి కూడా. ఉత్తర భారతదేశంలో రాముడు, క్రిష్ణుడు కూడా మొదట రాజులై తర్వాత దేవతలుగా మారారు. రాముని పూజ మొదటి నుంచి రాజకీయమైనదే. భక్తి ధోరణులు పెరిగినా కొద్దీ దాని ప్రభావం రాజుల పట్ల ప్రజల దృష్టిపై పడింది. మరొకవైపు రాజుల వ్యవహరణ ఏ విధంగా ఉండేదన్న దానిపై కూడా ఈ భక్తి ప్రభావం ఉంది.

రాజుల రాజ్యాలు, రాజధానులు, కోటలకు పుణ్యక్షేత్రాలు సమాంతర కేంద్రాలవలె ఉండేవి. దేవాలయాన్ని ఒక రాజభవనంవలె నిర్మించేవారు. నిజానికి తమిళంలో కోయిల్, కోవిల్ అనే పదాలను రాజ భవనానికి, దేవాలయానికి కూడా ఉపయోగిస్తారు. వర్ధమాన రాజవంశాలవారు మరింతగా వృద్ధి చెందే ఆలోచనల్లో దేవాలయాల కేంద్రస్థానం ఉండేది. ఇతర రాజ్యాలను జయించిన వారు తాము సాధించిన దానికి గుర్తుగా ఒక దేవాలయాన్ని నిర్మించటం తమ బాధ్యతగా భావించేవారు. బ్రాహ్మణులు రాజులకు గురువులైన విధంగానే దేవాలయాలలో పూజారులయేవారు. దేవాలయాలు పూజలను గృహపరిధి వెలుపలికి తెచ్చాయి. అందరూ కలిసి గుళ్లలో పూజించటాన్ని మతపరమైన కార్యక్రమాలకు కేంద్రంగా మార్చాయి. ఆ విధంగా గృహానికి, రాజ భవనానికి

మధ్యమస్థానంలో నిలిచి రెండింటికి అనుసంధానం జరిపాయి. దేవాలయ మధ్య చిత్రాలపై శివభక్తులైన నయన్మార్లు, వైష్ణవ భక్తులైన ఆళ్వార్ల చిత్రాలు కూడా ఉండేవి. ఆలయాల నిర్మాణం, పూజాదికాలకు దానాలు, భక్తి గీతాల సేకరణ వంటి చర్యల ద్వారా చోళరాజులు వ్యవస్థీకృత భక్తిని తమకోసం బాగానే ఉపయోగించుకున్నారు. మత వ్యవహారాలతో రాజులకు ఈ విధమైన ఘనిష్ట సంబంధాలు ఉన్నందువల్లనే, రాజకీయ వ్యూహాలలో మతపరమైన ఉదంతాలను, భావనలను తేలికగా ఉపయోగించుకోగలిగారు. ఇది మనకు హిందూ మత చరిత్ర పొడవునా కనిపిస్తుంది.

## దర్శనం

సామంతులైన రాజులు తమ పైవాడైన చక్రవర్తి కొలువులో స్వయంగా హాజరై తమ విధేయతను ప్రకటించవలసి ఉండేది. అది బహిరంగంగా జరగాలి. అదే విధంగా దేవాలయం భగవంతుని నివాసమేగాక భవనం కూడా అయినందున ప్రజలు తనను పూజించటంతోపాటు తనవైపు చూస్తూ దర్శించుకోవాలి. భగవంతుడు కూడా వారివైపు చూస్తాడన్నది నమ్మిక. అనేక ఆలయాలలో దేవుడికి సంవత్సరానికి ఒకమారు ఊరేగింపు జరుపుతారు. అందుకు కలపతో తయారుచేసిన రథాన్ని ఉపయోగిస్తారు. అది రాజు ఊరేగింపును పోలి ఉంటుంది.

దర్శనమన్న పద్ధతి ఆళ్వార్లు, నయన్మార్ల కాలం నుంచి ఉత్తర, దక్షిణ భారతాలలో నేటి వరకూ ఉంది. దర్శనంవల్ల భగవంతుని ఆశీస్సులు చూపు ద్వారా భక్తులకు లభిస్తాయి. ప్రజలకు అది వ్యక్తిగతమైన చర్య. వారు భగవంతుడిని గాని, రాజునుగాని సూటిగా చూడాలి. దర్శనం అన్నది రాజుల కొలువు నుంచి దేవాలయాలకు వచ్చింది. అందువల్ల భగవద్దర్శనం, భగవంతుడు మనను వీక్షించేట్లు చేసుకోవటమన్నది, ఒక శక్తి మనకు సంక్రమించేట్లు చేసుకోవటమన్నమాట. కర్మ, పుణ్యాలు, సల్లక్షణాల మార్పిడి వంటిదే ఇది కూడా. భగవంతునికి, భక్తునికి మధ్య ఇది అత్యంత సన్నిహితమైన స్థితి. దక్షిణ భారతదేశపు భక్తి భావనలు కల్పన చేసిన సాన్నిహిత్యమిది. బౌద్ధ స్థూపాలలోని బుద్ధుని అవశేషాలను వీక్షించే సంప్రదాయాపు ప్రభావం కూడా దీనిపై కొంతవరకు ఉండి ఉంటుంది. మరొక వైపు, నిర్గుణుని కన్న సగుణుని పట్ల భక్తి గాఢత ఎక్కువకావటమనే స్థితికి కూడా ఇది స్పందన అనాలి. నిర్గుణుని కన్న సగుణుని పట్ల భక్తి భావన పెంచుకోవాలన్నది భక్తి ఉద్యమం కొత్తగా చెప్తుండిన మాట.

ఒక విగ్రహానికి కళ్లను హిందూ, బౌద్ధ కళాకారులు ఇరువురు కూడా అన్నింటికన్న చివరన చిత్రించేవారు. దానితో విగ్రహం ప్రాణం పోసుకుంటుంది. విగ్రహం అపుడు మనలను చూడగలదు. విగ్రహతయారీలో ఆపైన చేయవలసిందేమీ ఉండదు. శక్తి అన్నది అక్కడ ఆరంభమవుతుంది. రాజస్థానీ కథాగాయకులు కథ చెప్పే క్రమంలో ఆయా

కావ్యాలలోని దృశ్యాల చిత్రాలను ప్రదర్శిస్తుంటారు. వారొకసారి ఒక మానవ వికాస శాస్త్రజ్ఞునితో, కథానాయకుని నేత్రాల చిత్రీకరణ పూర్తయిన తర్వాత తాముగాని, ఆ చిత్రకారుడుగాని, దానికొక చిత్రంగా పరిగణించబోమని చెప్పారు. "అపుడా చిత్రం ఒక సంచార దేవాలయమవుతుంది.. భగవంతుని ఆత్మకు ఒక నివాసం లభిస్తుంది", అన్నారు వారు. వైదిక దేవతలైన ఇంద్రునికి, వరుణునికి వేయి నేత్రాలున్నాయంటారు. ఆకాశంలో ఉండే దేవతలుగా నక్షత్రాలు వారి నేత్రాలవుతాయి. న్యాయపర్యవేక్షణ కోసం వారికి వేయి మంది గూఢచారులుండేవారు. సూర్యుడిని ఆకాశనేత్రమని, వరుణుని నేత్రమని, యాగాశ్వపు నేత్రమని అనేవారు. మానవ నేత్రానికి, సూర్యునికి మధ్య సామ్యాలను కూడా మనం చూసాం. రుగ్వేదంలోని వరుణుడు ఎప్పుడూ కన్నార్పడు. తర్వాత కాలంలో దేవతలకు, మానవులకు మధ్య అది ఒక ముఖ్యమైన తేడా అయింది.

బౌద్ధమత కథనాలలో కుణాలుడు, దక్షిణ భారత కణ్ణప్పర్ తమ కళ్లను తామే పొడుచుకోవటం కనిపిస్తుంది. 18వ శతాబ్దికి చెందిన కుంతరర్ అనే నయనార్, తాను తన భార్యను వదలివెళ్లిపోగా శివుడు తన దృష్టి కోల్పోయేట్లు చేసాడని, తిరిగి ఆమె వద్దకు వెళ్లినాక దృష్టిని ప్రసాదించాడని రాసాడు. ఇటువంటి కథనాలు మనకు పుణ్య పురుషుల జీవిత చరిత్రలలో కనిపిస్తాయి. కుంతరర్ కవితలు అనేకం తను అంధునిగా ఉన్నప్పుడు రాసినవి. ఈ అధ్యాయానికి మొదట రాసింది కూడా అదే. వాటిని 'నిందా – స్తుతి' లేదా దూషణా పూరితమైన భక్తి కవిత్వమంటారు. ఇది సంస్కృత సంప్రదాయంలో కూడా ముఖ్యమైంది. కుంతరర్‌కు ఆగ్రహపూరితమైన కవితలు రాస్తాడనే పేరుంది. ఆయన తనను తాను "కఠినుడైన భక్తు"నిగా కూడా చెప్పుకున్నాడు. కాని తమిళ సంప్రదాయం ఆయనను 'భగవంతుని స్నేహితు'నిగా గుర్తించింది. హాస్యపూరితమైన వెక్కిరింతల నుంచి విషాదభరితమైన ఫిర్యాదులవరకు పలు విధాలుగా గల కుంతరర్ కవితలలో భగవంతుడిని ఆక్షేపించటం, ఆత్మ దూషణ రెండూ కలిసి ఉంటాయి.

వరుణుని ఉద్దేశించి రాసిన ఒక వేద మంత్రంలో రచయిత తనను తాను నిష్ప్రయోజకునిగా చెప్పుకుంటూ భగవంతుని క్షమను కోరుతాడు. అది కూడా భక్తి దేవతల పట్ల గల వైఖరి వంటిదే. 12వ శతాబ్దికి చెందిన మహదేవ్యక్క అనే కవయిత్రి ఈ కింది కవితలో శివుని గురించి రాసిన పద్ధతిలోనే భక్తి దేవతల పట్ల భక్తుల వైఖరులుంటాయి. ఆ కవిత ఈ విధంగా ఉంది:

తమ మొలకు
చుట్టుకున్న వస్త్రం జారినపుడు
స్త్రీలైనా, పురుషులైనా సిగ్గుపడతారు
మన జీవితాలకు ప్రభువైనవాడు
ఈ లోకంలో నిర్ముఖుడై ఉన్నప్పుడు

ఎట్లా సిగ్గుపడగలవు?
సమస్త లోకమే ప్రభువు నేత్రమైనపుడు
అణువణువునూ పరికిస్తున్నపుడు
నీవు మూయగలదేమిటి, దాచగలదేమిటి?

## దక్షిణ భారత భక్తి ఉద్యమంలో స్త్రీలు

భక్తి కవిత్వంలో స్త్రీ-పురుష భిన్నత్వం, శృంగార భావనలన్నవి కేంద్ర బిందువులు. సాధారణంగా స్త్రీని సాత్వికురాలు, త్యాగగుణం కలది, ప్రేమస్వభావి అని చిత్రీకరిస్తారు. అదే విధంగా పురుషుడు తెలివి కలవాడు, సమర్థుడు. ఈ లక్షణాలను భక్తి కవిత్వంలో మార్చలేదు గాని అందుకు భిన్నమైన విలువలనివ్వటం కనిపిస్తుంది. భక్తి మార్గంలో పురుషులు స్త్రీలను అనుకరించగా, కుటుంబానికి సంబంధించిన మతపరమైన సంప్రదాయాలలో అనేకాన్ని స్త్రీలు నిర్వర్తిస్తారు. అదే సమయంలో ఒక కొత్త స్త్రీ మూర్తి రూపు తీసుకోవటాన్ని చూడవచ్చు. ఆమె తనకు వ్యక్తిగతంగా కలిసే మత భావనలను అనుసరించేందుకు సంప్రదాయక సమాజాన్ని ధిక్కరిస్తుంది. 18వ శతాబ్దానికి చెందిన 12 మంది ఆళ్వార్లలో స్త్రీ ఒక్కరే. తనపేరు ఆంతాళ్. ఆమె విష్ణువుతో తన సహజీవనాన్ని ఊహిస్తుంది. చివరకు విష్ణువు ఆమెను తన పత్నిగా స్వీకరిస్తాడు. ఆళ్వారులందరిలోకి ఆమె జీవితం గురించే మనకు ఎక్కువగా తెలుసు. సన్యాసినులు ఎందరో ఆమెను అనుకరించారు. ఆమె కవితలలో స్త్రీల అణచివేత పట్ల నిరసన కనిపిస్తుంది. నయన్మార్లలో స్త్రీలు ఇద్దరున్నారు. కాని వారు చెప్పిందేమిటన్నది నమోదుకాలేదు. ఆ ఇద్దరిలో ఒకరు ఒకరు పాండ్య రాణికాగా, మరొకరు కుంతరర్ కవి తల్లి. మరొక నయన్మార్ స్త్రీ నాలుగు కవితలు రాసింది. ఆమె పేరు కరైక్కాళ్ అమ్మెయ్యార్.

కరైక్కాళ్ అమ్మెయ్యార్ అయిదు లేదా ఆరవ శతాబ్ది మధ్యలో జీవించి ఉండాలి. 12వ శతాబ్దిలో చెక్కియార్ రాసిన పేరియ పురాణం చెప్పేదానిని బట్టి ఆమె సౌందర్యవతి. భక్తి శ్రద్ధలుగల ఒక సంపన్న వర్తక కుటుంబంలో జన్మించింది. ఆమె చేతిలోకి మధురమైన మామిడి పండ్లను తెప్పించి అంతలోనే అంతర్ధానం చేయటం ద్వారా శివుడు ఆమె భక్తిని ఆశీర్వదించాడు. అది గమనించిన ఆమె భర్త తనను త్యజించాడు. ఆయన తిరిగి రాగలడనే ఆశతో ఆమె ఒక భార్యగా తన ధర్మాలను నిర్వర్తిస్తూ, తనను తాను చక్కబెట్టు కుంటుంటుంది. కాని తన భర్త మరొక స్త్రీని వివాహమాడినట్లు ఒకరోజు దృష్టికి వస్తుంది. ఇక తన సౌందర్యం నిరుపయోగమని భావించిన ఆమె, తనను ఒక అస్తిపంజరంగా మార్చమని శివుడ్ని అర్థిస్తుంది. తర్వాత శివుని నివాసమైన హిమాలయాలకు చేతులపై నడుస్తూ యాత్ర చేస్తుంది. తను స్మశాన వాటికలో నృత్యం చేస్తుండగా ఆమె మంత్రాలు పఠిస్తూ తన బృందంలో చేరవచ్చునని శివుడు అనుమతిస్తాడు. ఆమె అంతిమంగా

అలంకతు వద్ద ఒక స్మశానంలో స్థిరపడుతుంది. ఆమె రాసిన నాలుగు కవితలు తమిళ శైవ కావ్యమైన తిరుమురైలో కనిపిస్తాయి. వాటిలో ఇది ఒకటి.

ఆమెకు కృశించిన రొమ్ములు
ఉబికిన నరాలూ ఉన్నాయి
తెల్లని పళ్లకు బదులు
ఖాళీలు కనిపిస్తున్నాయి
ఉదరంపై రక్తిమ గల కేశాలతో
రెండు కోరలు, గుండ్రని చీలమండలు, పొడవైన పిక్కలతో
ఆ రాక్షసి ఆ నిర్జన స్మశానంలో ఆక్రందిస్తుంటుంది.
జడలు కట్టిన సుదీర్ఘకేశాలు
అష్ట దిశలా గాలికి ఎగురుతుండగా
జ్వాలల మధ్య నృత్యం చేస్తూ
తన అంగాలకు కొత్త జవసత్వాలు కూర్చుకుంటున్న
మన ప్రభువు భూమి అది.
తన నివాసం అలంకతు.

ఒక స్త్రీ తన తండ్రికి, భర్తకు, కుమారునికి నిరంతరం విధేయురాలై ఉండాలనే మనువు సూత్రీకరణను సన్యాసినులు బాహాటంగా ఉల్లంఘించటం మనకు తరచు కనిపిస్తుంది. వారు ఏ పురుషునికి బద్ధులై ఉండరు. వివాహిత అయిన సన్యాసిని తనను భరిస్తూ ఉండటం కన్న ఆయనకు దూరం కావటం సర్వసాధారణం. ఒకోసారి ఆమె తన తల్లిదండ్రులను ధిక్కరించి, రకరకాల పద్ధతులలో పెళ్లిని తప్పించుకోవచ్చు. మనువు అన్నదానికి భిన్నంగా ఆమె ఒక వేశ్యగా మారవచ్చు, వివాహానికి తగని వృద్ధురాలి దశకు చేరవచ్చు. లేదా కరైక్కాళ్ అమ్మైయ్యార్ వలె అద్భుతాలు చేయవచ్చు. భగవంతుడిని పెళ్లాడినట్లు తనకు తాను భావించుకోవచ్చు. భర్తను వదలివేసి, తన నిజమైన ప్రియుడైన భగవంతుని కోసం వెళ్లిపోవచ్చు. దళాయి అనే ఒక యువతి తన భర్త తనతో శృంగారం జరుపుతుండగా శివుడి నుంచి పిలుపు రావటంతో మధ్యలోనే వెళ్లిపోతుంది. ఇదేదీగాక, ఆ స్త్రీ దేవుడిని తన ప్రియునిగా స్వీకరించేందుకు తిరస్కరించవచ్చు కూడా. గొగ్గవ్వె అనే వీరశైవ సన్యాసిని, మారు రూపంలో వచ్చిన శివుడిని వివాహమాడేందుకు ఎంతమాత్రం అంగీకరించదు. తను ఆమె ప్రాణాలు తీయగలనని బెదిరించినా ఒప్పుకోదు.

తమిళంలోని తొలి పురుష లౌకిక కవులు స్త్రీ దృక్పథంతో ఏకీభవించి ఆమె అభిప్రాయాలకు స్వరాన్నిచ్చారు. భక్తి భాషకు స్త్రీల స్వరం మౌలికమైనదిగా మారటంతో భక్తికవులు ఆ సంప్రదాయాన్ని స్వీకరించి, పురుషులు స్త్రీల స్వరంతో మాట్లాడటాన్ని ఒక సంక్లిష్ట వేదాంత వాదనగా మార్చారు. 15వ శతాబ్దికి చెందిన తెలుగుకవి అన్నమయ్య

అదే ధోరణిలో అనేక కీర్తనలు రచించాడు. సన్యాసినులు లింగమార్పిడి వంటి స్థితికి గురికావలసిన అవసరం ఏమీ ఏర్పడలేదు. అయితే, పుణ్య జీవుల కథలను రచించిన కొందరు, భగవత్కృపవల్ల పురుషులుగా మారిన కొందరు స్త్రీల గురించి పేర్కొన్నారు.

కృష్ణుని గురించి ఒక గీతంలో నమ్మాళ్వార్ తనను తాను ఆ భగవంతుడు విడనాడిన స్త్రీగా ఊహించుకుంటాడు. ఆ గీతం ఈ విధంగా ఉంది:

సంధ్యావేళ అయినా
రాలేదా నల్లనివాడు
తనులేని ఇచ్చోట
ఏమి పలుకుదునేను?
ఎట్లు జీవింతు?
వృషభమ్ములు
వాటి గంటలు మ్రోగ
గోవులను కలిసె
గోవులు త్రుళ్లాడెనంత.
మురళి పాడె క్రూరమైన గీతి
తెల్లని మల్లియలపై, నీలి కలువలపై
తుమ్మెదలు తిరుగాడె.
సాగరము ఆకసమ్ముపైకెగసి
గొంతెత్తి విలపించె.

పురుషుడైన భక్త కవి ఒకోసారి, గతకాలపు ప్రేమ కవితల (అకం) లోని నాయికలు, లేదా వారి తల్లుల ఆలోచనలను స్వీకరించి ప్రియుడిని భగవంతునిగా సంబోధిస్తాడు. ఆ విధంగా ఒక కవి రాముడిని లంకను నాశనమొనర్చిన వాడిగా పేర్కొంటూ రాసిన కవితను గమనించండి:

లక్కతోనో, మైనంతోనో చేసిన కడ్డీని
అగ్నిలోకి చొప్పించి నట్లు
ఆమె మనసు మహా వికలమై ఉంది
కాని నీకు మనసులేదు.
రాక్షసుల లంకను
నాశనమొనర్చిన ప్రభూ
నీకేమి చేయగలను?

ఇప్పటికే విరహాగ్నికి సంకేతంగా మారిన అగ్ని ఇపుడు భక్తి అనే అగ్నికి కూడా సంకేతప్రాయమైంది. సీతను రావణుడి నుంచి కాపాడినట్లే, రాముడనే ప్రియుడు తన

నాయికను, భక్తుడిని లేదా భక్తురాలిని కాపాడాలన్నది కోరిక. అదే సమయంలో, రావణుడిని అంతం చేసినట్లు తనను కూడా అంతం చేయవచ్చు. కానట్లయితే సీతను అగ్ని ప్రవేశం చేయనిచ్చినట్లు తనను తాను ఆహుతి చేసుకునే అవకాశం కల్పించవచ్చు.

పురుషత్వం మూర్తీభవించిన శివుడిని ఒక కవి "సంగమించే నదులకు ప్రభు" వని అభివర్ణించాడు. అటువంటి దేవుడిని కూడా కన్నడ భక్తి కవి ఒకరు స్త్రీగా చూసాడు:

సర్పంపై, మంటపై
చేయివేసిన పిల్లవాడి వెనుక
పరుగెత్తే తల్లివలె,
అనుసంధానమయేనదుల
అధిపతి అయినవాడు
అడుగడుగునా నా వెంట ఉండి
కాపాడుతుంటాడు

సూటిగా ఉన్న ఈ కవితకు వేరే నిర్వచనాలు అక్కరలేదు. కాని కన్నడ పాఠకుడొకరికి అందులో ఈ కథలోని ఛాయలు కన్పించాయి.

### మంత్రసానిగా శివుడు

ఒక భక్తుని కుమార్తె మొదటిసారిగా ప్రసవించనుంది. కావేరీ నదికి ఆవల ఉండిన ఆ యువతి తల్లి, నదికి వరదల మూలంగా సమయానికి దాటి ఇటు రాలేకపోతుంది. అపుడు శివుడు, నెలవంకవలె వంగిన నడుము, వెన్నెలవలె పండిన తల, చేత వెదురు కర్రతో అదే వృద్ధురాలి రూపంలో ఆ ఇంటికి వస్తాడు. అంతకుముందే తన భార్యలు పార్వతి, గంగలను అవసరమైన సామగ్రితో పంపుతాడు. నొప్పులు మొదలుకాగానే శివుడు మంత్రసాని పని చేస్తాడు. పిల్లవాడు పుట్టగానే తనను ఉయ్యాలలో వేసి, తన కుమారుడు మురుకన్ వలె ఆలనా పాలనా చూస్తాడు. త్వరలోనే వరద తగ్గటంతో అసలు అమ్మ వస్తుంది. దానితో శివుడు వెళ్లిపోజూస్తాడు. ఒకే రూపంలో ఉన్న ఆ ఇద్దరు ముసలమ్మలను గమనించిన ఆ దంపతులు విస్మయం చెందుతారు. వీరిలో నా తల్లి ఎవరని ఏడుస్తుందా యువతి. ఆమె చూస్తుండగానే శివుడు ఆకాశంలోకి మెరుపువలె అదృశ్యమైపోతాడు.

## కులం

### పారియాలు

భక్తి సాహిత్యంలో కణ్ణప్పర్ అనే నాయనార్ ఒక గొప్ప పాత్ర. ఈ కథ అనేక రచనలలో ఉన్నా, రెండవ కుళోత్తుంగ చోళుని (క్రీ.శ. 1133-50) కాలానికి చెందిన చెక్కిలర్ అనే కవి రాసిన పెరియ పురాణం ద్వారా ప్రసిద్ధి చెందింది.

## కణ్ణప్పర్ కళ్లు

నల్లని శరీరవర్ణం కలిగి హింసాత్మకగా వేటాడే ఒక ఆటవిక తెగకు కణ్ణప్పర్ నాయకుడు. వారు వేట కుక్కల సహాయంతో వేటాడుతూ, పశువులను దొంగిలిస్తూ జీవిస్తారు. కణ్ణప్పర్‌కు ఒకసారి అడవిలో శివుడు కన్పిస్తాడు. తనకు ఆ భగవంతుని పట్ల ప్రేమ కలుగుతుంది. ఒంటరిగా ఉన్నందుకు జాలితోచి తనకు ఆహారమివ్వజూస్తాడు. తాను అప్పుడే వేటాడిన అడవి పంది మాంసం ముక్కలు తీసి, అవి రుచిగా ఉన్నాయనే నమ్మకం కోసం ప్రతి ముక్కను రుచి చూసి, అపుడు శివుని వద్దకు తీసుకుపోతాడు. శివలింగంపై ఒక బ్రాహ్మణ పూజారి ఉంచిన పూలను కాలితో పక్కకు తన్ని తను పుక్కిలిలో పట్టి తెచ్చిన నీళ్లను శివలింగంపై ఉమ్ముతాడు. తన తలపై ఉన్న పూలను తీసి పెడతాడు. లింగంపై తన పాదాలు, తన వేట కుక్క పాదాల ముద్రలు పడతాయి. తర్వాత ఆ రాత్రంతా అక్కడే ఉండి మరునాడు ఉదయం తిరిగి వేటకు వెళతాడు.

అక్కడకు చేరిన బ్రాహ్మణ పూజారి కణ్ణప్పర్ నివేదనలను తొలగించి, ఏమి జరుగుతుందో చూసేందుకు ఒకవైపు దాగి ఉంటాడు. కణ్ణప్పర్ భక్తిలోని గొప్పతనాన్ని ఆ పూజారికి తెలియజేయదలచుకున్న శివుడు, తన కళ్లలో ఒకదాని నుంచి రక్తాన్ని స్రవింపజేస్తాడు. అది చూసిన కణ్ణప్పర్ ఒక బాణంతో తన కంటిని పెరికి తీసి శివునికి అమర్చుతాడు. అపుడు శివుని రెండవ కంటినుంచి కూడా రక్తం స్రవించటంతో, అక్కడ గుర్తుకోసం తన ఎడమ పాదపు వేలినుంచిన కణ్ణప్పర్, తన రెండవ కంటిని కూడా తీయనుండగా శివుడు తన చేయిని సాచి ఆపుతాడు. ఆ భక్తుడిని తన కుడి బాహువులోకి తీసుకుంటాడు.

కణ్ణప్పర్ నిషాదుడు కావచ్చు, లేదా హిందూ పరిధికి బయటి మరేదైనా ఆటవికుడు కావచ్చు. సంస్కృతంలో గల ఒక కథనం ఆయనను కిరాతుడంటుంది. పెరియ పురాణం ప్రకారం తన తల్లిది మరవార అనే యోధుల కులం కాగా, ఆ తలిదండ్రులిద్దరూ మురుకన్‌ను పూజించే వారు. అయినప్పటికీ, దేవతలకు మాంసాన్ని నైవేద్యంగా పెట్టరాదనే బ్రాహ్మణ నియమాలు కణ్ణప్పర్‌కు తెలియవు. శివలింగంపై నీటిని ఉమ్మటం, కంటివద్ద కాలు ఉంచటం వంటి చర్యలు కూడా అటువంటివే. ఈ కథలో అసాధారణమైన కోణం ఒకటున్నది. భక్తులకు దేవునికి మధ్య పరస్పరం చూపులు ఆరాధనలోని సంప్రదాయం కాగా, కణ్ణప్పర్ నేరుగా తన కళ్లనే భౌతిక రూపంలో భగవంతునికి అర్పించజూస్తాడు.

### బ్రాహ్మణులు

మనుషులు బ్రాహ్మణుల సహాయం లేకుండా తపఃశ్శక్తితో మతపరమైన శక్తిని సాధించినట్లు, భక్తి మార్గం ద్వారా కూడా శక్తిని సంపాదించవచ్చు. అది సైతం బ్రాహ్మణుల

ఆధిపత్యాన్ని దెబ్బతీసేదే. దేవాలయాలలోకి నిమ్న జాతులవారికి ప్రవేశం ఉండాలనే కోరిక ఒకటి చోళుల కాలంలో వ్యక్తమవుతుండేది. దానినిబట్టి, బ్రాహ్మణులకు ప్రత్యేకాధికారాలు, అవకాశాల పరిస్థితి పట్ల భక్తి ఉద్యమంలో తొలిదశలోనే నిరసన ఉండేదని అర్థమవుతుంది. కణ్ణప్పర్ కథ ఎంతో శక్తివంతంగా చూపినట్లు, దక్షిణ భారత దేశానికి చెందిన భక్తి ఉద్యమంలోని కొన్ని శాఖలు, బ్రాహ్మణుల కన్న బ్రాహ్మణేతరులను ఉన్నతులుగా భావించాయి. ఒకోసారి భక్తి భావనలు బ్రాహ్మణులను, వారి సంప్రదాయాలను పక్కన ఉంచి, భగవంతునికి భక్తునికి మధ్య మధ్య ప్రత్యక్ష అనుసంధాన్ని కల్పించాయి. భక్తిలో గురువుకు కేంద్రస్థానం ఉండటం కూడా బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని సవాలు చేసింది. ఎందుకంటే గురువులలో అందరూ బ్రాహ్మణులు కారు. ఇది ఇంతటితో ఆగలేదు. రామానుజన్ పేర్కొన్నట్లు భక్తి మార్గపు సన్యాసులలో పురుషులు స్త్రీలు కావాలనుకుంటారు. అగ్రకుల పురుషులు అహంభావాన్ని, సంపదలను వీడగోరుతారు. గౌరవాన్ని కోల్పోయి అస్పృశ్యులైన భక్తుల నుంచి నేర్చుకోజూస్తారు. కొన్ని భక్త బృందాలు రాజకీయాలకు, కులాలకు, స్త్రీ-పురుష భిన్నత్వాలకు, వృత్తులకు అతీతంగా ఉంటాయి. కొందరు సభ్యులు పారియాలుకాగా, అనేకులు బ్రాహ్మణేతరులు.

అయితే ఈ ధోరణులన్నీ కుల వ్యవస్థలను, స్త్రీ-పురుష అంతరాలను ప్రశ్నించాయేగాని తిరస్కరించలేదు. కాకపోతే ఎపుడైనా అవి తిరగబడి ఉండవచ్చు. యథాతథంగా బ్రాహ్మణ ఆధిపత్యం మాత్రం బలంగానే కొనసాగింది. పెరియపురాణంలో కణ్ణప్పర్ కథ తర్వాత తిరుణాలైప్పోవార్ నాంతనర్ అనే పారియా ఉదంతం ఒకటుంది. తనను దేవాలయంలోకి అనుమతించకపోవటంతో అగ్నిద్వారా శుద్ధి పొందుతాడు, బ్రాహ్మణుడవుతాడు. అదొక పరిష్కారమేగాని, అది బ్రాహ్మణాధిపత్యాన్ని మరింత స్థిరపరచి, పారియాలను దేవాలయాలనుంచి దూరంగా ఉంచుతుంది. తర్వాత కాలంలో నాంతనార్,కుల వివక్షపట్ల నిరసన కథనాలలో కథానాయకుడయాడు. హిందూ సామాజిక వ్యవస్థలోని అన్యాయాలను ప్రశ్నించిన బౌద్ధం ఆ వ్యవస్థను సంస్కరించజూసింది. కాని భక్తి ఉద్యమంలో నిరసనలు తప్ప సంస్కరణ ధోరణులు లేవు. కుల అసమానతల సంస్కరణోద్యమాల తర్వాత కాలంలో వచ్చాయి గాని పాక్షిక విజయాలనే సాధించాయి. భక్తి ఉద్యమం బ్రాహ్మణ ఆధిపత్యానికి సమాంతరంగా సాగింది. భక్తి ఉద్యమం కుల అన్యాయాలను గుర్తించి అపుడపుడు సవాలు చేసిందిగాని, అవి తొలగి పోవటం అరుదుగా జరిగింది.

త్రిశంకు స్వర్గమన్నది ఒక ప్రత్యామ్నాయ సృష్టికాగా, భక్తి ప్రపంచం చుట్టు ఆవరించిన సన్నని పొర నుంచి భావజాలాలు అటు ఇటు ప్రసరిస్తూనే ఉండేవి. హిందూ మతం పరిస్థితి కూడా అంతే. భక్తి ప్రపంచం నుంచి ఆ విధంగా హిందూ మత పరిధిలోకి వచ్చిన ప్రభావాలతో స్త్రీలు, నిమ్న కులాల వారి పరిస్థితులు మెరుగుపడటం కన్పిస్తుంది.

అనేక భక్తి ఉద్యమాల నాయకులు ముఖ్యంగా తొలి దశలలో నిమ్న కులాల వారైనప్పటికీ, అగ్రవర్ణాల వారైన వైష్ణవులు, శైవులు వారి సాహిత్యాన్ని స్వీకరించారు. ఈ ధోరణులలో ఒకోసారి కొంత చెడు కూడా జరిగింది. కుల వ్యవస్థతో తరచు రాజీపడిన భక్తి ఉద్యమాలు అగ్రవర్ణాల వారిని నాయకులుగా ఆమోదించాయి. ఒకప్పుడు బ్రాహ్మణేతరంగా ఉండిన రచనలు బ్రాహ్మణ ప్రభావానికి లోనయ్యాయి. మౌఖికంగా ఉండిన విషయాలు లిఖిత రూపంలోకి వెళ్లిన దాని ప్రభావమది. రాజులు శైవ మత విస్తరణకు పాల్పడిన క్రమంలో భాగంగా మౌఖిక భక్తి సంప్రదాయాలు కొంతకాలం తర్వాత లిఖిత రూపం తీసుకున్నాయి. దక్షిణ భారతంలోని భక్తి ఉద్యమకారులలో బ్రాహ్మణేతర శక్తులు ఉండినప్పటికీ ఆ ఉద్యమం అంతిమంగా చాలా వరకు బ్రాహ్మణుల ప్రయోజనాలకే ఉపయోగపడింది.

కాలం గడిచినా కొద్దీ కులపరమైన ఆంక్షలు తిరిగి ముందుకొచ్చాయి. వైష్ణవ భక్తి సంప్రదాయంలో ఒక ప్రధానమైన శాఖను ఆరంభించిన రామానుజుడు ఒక పరిమితిలో కుల విభజనను ఆమోదించాడు. తర్వాత కాలం వాడైన బెంగాలీ వైష్ణవ గురువు చైతన్యుడు కూడా ఆ విభజనను పూర్తిగా తొలగించలేకపోయాడు. నమ్మాళ్వార్ నిమ్న కులస్తుడు. భక్తి పురుషులపై వచ్చిన చరిత్రలన్నీ ఆయను శూద్రుడని గుర్తించాయి. శ్రీ వైష్ణవ బ్రాహ్మణులు తమ శాఖ వ్యవస్థాపకుడు తనేనని అంగీకరిస్తూనే, ఆయన నిమ్న కులస్తుడు అయినదాని ప్రభావం తమపై పడకూడదన్న ఆలోచనతో, ఆ ప్రభావాన్ని తగ్గించేందుకు పలు ప్రయత్నాలు చేసారు. భక్తి చరిత్రకారుడు ఒకరైతే, నమ్మాళ్వార్ శిశువుగా ఉన్నప్పుడు తన కుటుంబంతోపాటు ఆహారం స్వీకరించలేదని, వారిని చూడనైనా లేదని, చివరకు శూద్రురాలైన తనతల్లి పాలు అయినా తాగలేదని రాసాడు. ఆత్మ గౌరవం గల బ్రాహ్మణులు నిమ్న కులాలవారు సిద్ధం చేసిన ఆహారాన్ని తీసుకోకపోవటం పద్ధతిలోనన్నమాట. ఆ విధంగా భక్తి ఉద్యమం ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనుకకు అన్న పద్ధతిలో సాగింది.

## దక్షిణదేశ భక్తిలో హింస

యోగుల వలెనే భక్తి ఉద్యమకారులు కూడా జంతువుల పట్ల హింసను తీవ్రంగా వ్యతిరేకించారు. కొన్ని మినహాయింపులు ఉన్నా అది సర్వసాధారణ స్థితి. కాని మనుషులపై హింసను అదే స్థాయిలో వ్యతిరేకించలేదు. రాబర్ట్ ఫ్రాస్ట్ అనే కవి నిప్పు, మంచు గురించి రాస్తూ, ద్వేషంలో ఎంత హింస ఉంటుందో కోరికల రూపంలో గల ప్రేమ కూడా అంత హింసాత్మకం కాగలదన్నాడు. శారీరక బాధను లెక్క చేయకపోయే లక్షణం యోగులకు ఎంతో యోధులకు కూడా అంతే. ఇందుకు శిబి, కర్ణుని వంటి వారు దృష్టాంతాలు. కాని భక్తిలోని హింస తమపైతాము జరుపుకునేది కాదు. అది ఒకోసారి దేవతల కోసం

జరగవచ్చు, లేదా పూజలు చేయనిరాకరించిన ఇతర హిందువులపైనో, లేదా ఇతర మతాలతో ఘర్షణ తలెత్తినపుడో చోటుచేసుకోవచ్చు. భక్త్యావేశం మితిమీరినపుడు హింసకు పాల్పడటం పెరియ పురాణంలో నయన్మార్ల చర్యలను గమనించినపుడు అర్థమవుతుంది. వారిలో ఒకరిద్దరు జైనులపై హింసకు తలపడగా, ఆత్మహత్యకు ప్రయత్నించినవారు, ఆ పని నిజంగా చేసినవారు, తండ్రికాళ్లు, లేదా భార్య చేయి లేదా ఒక రాణిముక్కు, లేదా మరెవరిదో నాలిక కోసిన వారున్నారు. తమ గొంతునే కోసుకున్నవారు, బంధువులను హతమార్చినవారు, మోచేతిని అరగదీసుకున్నవారు, తమ జుట్టుకు నిప్పు పెట్టుకున్నవారు, కుమారుడిని చంపి వండినవారు కూడా ఉన్నారు. అంతేకాదు. స్వయంగా భగవంతుడు తన భక్తుని కుటుంబంపై హింసకు పాల్పడటం విశేషం. ఈ కథను చూడండి:

### చిరుత్తొంతర్, తన కుమారుడు

శైవ సన్యాసి ఒకరు చిరుత్తొంతర్ వద్దకు వెళ్లి, ఒక చిన్నపిల్లవాడిని తిన గోరుతున్నాని, తనను ఆ పిల్లవాడి తలిదండ్రులే తనకు కూరగా వండి పెట్టాలని అంటాడు. చిరుత్తొంతర్ దంపతులు తమ ఏకైక సంతానమైన పిల్లవాడిని ముక్కలుగా కోసి కూర వండుతారు. ఆ కూరను వారు వడించబోతుండగా ఆ సన్యాసి, వారు దానిని ముందుగా తినాలని, తర్వాత భోజనానికి తమ కుమారుడిని కూడా పిలవాలని పట్టుబడతాడు. వారదేవిధంగా పిలవటంతో ఆ పిల్లవాడు బయటినుంచి పరుగెత్తుతూ వస్తాడు. అపుడా సన్యాసి తన నిజస్వరూపాన్ని ప్రదర్శిస్తాడు. తను భైరవుని రూపంలోగల శివుడు. తన వెంట పార్వతి, వారి కుమారులు కూడా ప్రత్యక్షమవుతారు. శివుడు చిరుత్తొంతర్ కుటుంబమంతటినీ కైలాసానికి తీసుకువెళతాడు.

మహాభారతంలో యుధిష్ఠిరునికి, శిబికి ఎదురైన పరీక్షల వంటిదే ఇది కూడా. కాని భయంకరమైనది, దారుణమైనది. ఈ కథ తెలుగు, కన్నడంలో కూడా ఉంది. తమ కుమారుడిని చంపి కూరగా వండవలసి వచ్చినందన్న తలిదండ్రుల బాధ వర్ణనాతీతమైనది. కాని అది కూడా భక్తే. వీరశైవ సంప్రదాయానికి చెందిన బసవ పురాణమనే కావ్యంలో, చిరుత్తొంతర్‌ను వత్తిడి చేసి తన కుమారుడి ప్రాణాలు తీయించిన శివుడిపై, ఒక సన్యాసి బహిష్కారం విధిస్తాడు. దేవుడిని శిక్షించటం కూడా భక్తే. అదే సమయంలో మనం రెండవ పార్శ్వాన్ని విస్మరించలేము. ఆ విధమైన భక్తితో మహా ఉద్వేగం, భగవంతునికి సన్నిహితంగా ఉన్నామన్న ఉద్విగ్నత అందులో కనిపిస్తాయి.

## ప్రాచీన దక్షిణ దేశంలో భిన్న మతాల సంవాదం

పదకొండవ శతాబ్దంలో ఒక కేరళ కవి, “ఒక పవిత్ర ఆశ్రమ పరిసరాలలో క్రూర జంతువులు ఏ విధంగా తమ సహజ విరోధాలను మరచి సంచరిస్తాయో, అదే

విధంగా రాజధానీ నగరంలో వేర్వేరు దేవతలు ప్రశాంతంగా కలిసి ఉంటున్నా"రని రాసాడు. కాని ఒకోసారి ఆ విరోధాలు వారికి గుర్తుకు వచ్చేవి కూడా.

## బౌద్ధం, జైనం

హిందువులు, బౌద్ధులు, జైనుల మధ్య హింస గురించి దక్షిణ భారతదేశంలో చాలా కథలున్నాయి. అయితే ఆ ఘటనలు నిజంగా ఆ విధంగా జరిగాయనేందుకు ఆధారాలు అంతగాలేవు. ఆయా మతాల మధ్య సంబంధాలు తగినంత సామరస్య పూర్వకంగానే ఉన్నా, వారి కథలు, సాహిత్యం ఆ విధంగా ఎందుకు ఉన్నాయనే ప్రశ్న వస్తుంది. చోళులు ఉన్నతస్థితికి చేరటానికి ముందే దక్షిణ దేశంలో బౌద్ధం, జైనం బాగా స్థిరపడ్డాయి. ఆ స్థితిలో అనుయాయులు, పోషకుల కోసం హిందూమతం తక్కిన రెండు మతాలతో పోటీపడవలసి వచ్చింది. అపుడు జైనం ముఖ్యంగా కర్ణాటకలో, దక్కన్‌లోనూ బౌద్ధం చోళ, పాండ్య రాజ్యాలలోనూ బలంగా ఉన్నాయి. ప్రజలు వేదకాలపు బలిక్రతువుల నుంచి, వివిధ మతశాఖలను ఆధారం చేసుకున్న దేవాలయాల చుట్టూ కేంద్రీకృతమైన ఇతర సంప్రదాయాల వైపు మళ్లసాగారు. అదే విధంగా భక్తి ధోరణుల వైపు. అనగా ప్రజలు మిగులు సొమ్మును వైదిక పూజారులకు బదులు ఇతర మత సంప్రదాయాలకు చెందిన గురువుల కోసం ఖర్చు చేయసాగారన్నమాట. అటువంటి స్థితిలో ఆ ప్రజల నుంచి, రాజుల నుంచి ఆదరణ కోసం పోటీ ఏర్పడింది. అది ఒకోసారి స్నేహ పూర్వకంగా ఉన్నా, కొన్నిసార్లు ఉద్రిక్తతలు తలెత్తాయి. అప్పటి హిందూ, బౌద్ధ, జైనాలలోని కొన్ని ధోరణుల పట్ల ప్రజలకు నిరసన కలిగి భక్తి ఉద్యమం పుంజుకోవటం మొదలుకావటంతో ఉద్రిక్తతలు మరింత పెరగసాగాయి. హిందూ మతంలోని కుల వ్యవస్థ నుంచి పారిపోదలచిన వారు బౌద్ధ, జైనాలలో ఆశ్రయం పొందవచ్చునని ఆ రెండు మతాలవారు ప్రచారం చేస్తుండగా, ఆ కులవ్యవస్థను సంస్కరించేందుకు భక్తి ఉద్యమం పూనుకోవటం ఆ రెండింటి ఆకర్షణకు ఒకమేర అడ్డుకట్ట వేసినట్లయింది. అన్ని కులాలవారిని ఆకర్షించేందుకు ప్రయత్నించిన ఆళ్వార్లు, నయన్మార్లు, దక్షిణాన బౌద్ధ, జైనాల పెరుగుదలను అరికట్టగలమని భావించేవారేమో కూడా. ఈ పోటీ ఒకోసారి వైరంగా మారి, ముఖ్యంగా జైనులతో తీవ్ర వాగ్యుద్ధాలకు దారితీసింది. ప్రచారాలు కూడా పోటాపోటీగా సాగాయి.

స్వయంగా జైనుడైన పల్లవరాజు మొదటి మహేంద్రవర్మ (600–630) మత్త విలాస ప్రహసనం అనే వ్యంగ్య రచనను సంస్కృతంలో చేసాడు. మద్యపాన మత్తుడైన ఒక శైవ సన్యాసి, తాను భిక్షాటన చేసే మానవ కపాలాన్ని ఒక వైష్ణవ సన్యాసి, ఒక బౌద్ధ భిక్షువు దొంగిలించారని ఆరోపించటం అందులోని కథాంశం. కాని దానిని ఒక కుక్క దొంగిలించగా చివరకు దొరుకుతుంది. మహేంద్రవర్మ పదునైన వ్యగ్యం నుంచి తప్పించుకున్నది జైనులు మాత్రమే. ఆయన ఇతర మతస్తులపై నిజ రూపంలో హింసను

ఎప్పుడూ ప్రయోగించలేదు. మొదట జైనునిగా ఉండిన అప్పర్, తర్వాత శైవ సన్యాసిగా మారి జైనులను, బౌద్ధులను తీవ్రంగా విమర్శిస్తాడు. ఆయన మహేంద్రవర్మను కూడా జైనం నుంచి మార్చినట్లు చెప్తారు. అదెట్లున్నా పల్లవ రాజులు బౌద్ధ, జైనాలను, బ్రాహ్మణులను ఆదరించటం మానలేదు.

దేశంలోని ఇతర ప్రాంతాలలో హిందువులు, ముఖ్యంగా శైవులు, బౌద్ధులకు వ్యతిరేకంగా తీవ్ర చర్యలకు పాల్పడ్డారు. కనీసం ఇద్దరు శైవ రాజులు ఆరామాలపై దాడిచేసి భిక్షువులను హతమార్చినట్లు చెప్తారు. తిరుమంకై అనే ఆళ్వార్ ఒక ఆరామాన్ని దోచుకుని, దానిలో గల ప్రధానమైన విగ్రహాన్ని దొంగిలించి పొడిపొడిగా పగలగొట్టి, అక్కడి బంగారాన్ని శ్రీరంగంలోని గోపురానికి ఉపయోగించినట్లు కూడా చెప్తారు. ఆళ్వార్లు, నయన్మార్ల కీర్తనలలో బౌద్ధానికి, జైనానికి వ్యతిరేకమైన భావనలు బలంగా కన్పిస్తాయి. తిరువత్తపూరర్, పురాణం, తిరువిళైయత్తల్ పురాణాలలో ఈ కథ ఉంది:

**బౌద్ధులకు నోట మాట రాకుండా చేసిన మాణిక్యవాచకర్**

ఒకసారి శ్రీలంక నుంచి మూడు వేలమంది బౌద్ధ సన్యాసులు చోళ రాజు వద్దకు వచ్చి, తమను సంవాదంలో ఓడించి శైవమతపు గొప్పతనాన్ని రుజువు పరచాలని అన్నారు. అది జరిగితే రాజు బౌద్ధులను నిర్మూలించవచ్చు. చర్చ అనంతరం మాణిక్యవాచకర్, సత్యాన్ని మలినపరచకుండా బౌద్ధులను నిరోధించవలసిందిగా సరస్వతీ దేవిని ప్రార్థిస్తాడు. అపుడామె వారిని మూగవారిని చేస్తుంది. బౌద్ధుల నాయకుడు శైవానికి పరివర్తన చెందగా అపుడాయన కుమార్తెకు తిరిగి మాటవచ్చి, బౌద్ధాన్ని విమర్శిస్తుంది. ఆమె కూడా శైవురాలై, వారి వస్త్రాలను ధరించి, చితంపరంలో ఉండిపోతుంది.

రెండుమతాల మధ్య సంవాదమన్నది అధమస్థాయికి చేరినట్లు ఈ ఉదంతం చూపుతుంది. పాల వంశస్తులు, మరికొందరు చిన్న రాజుల ఆదరణతో బీహార్, బెంగాల్‌లో మాత్రం బౌద్ధారామాలు విరాజిల్లాయి. గంగా పరివాహక ప్రాంతంపై అరబ్బులు 12వ శతాబ్ద కాలంలో దండయాత్ర జరిపినపుడు, తూర్పు భారతదేశ ప్రాంతాలలో బౌద్ధం హిందూ మతంలో విలీనమయ్యే మార్గంలో ఉంది. ఆ తర్వాత బౌద్ధులు ఎక్కువ మంది మిగలకపోగా, జైనం మాత్రం కొంతకాలం పాటు కొనసాగింది. తమిళ భూభాగాలలో జైన సన్యాసులు, పాలకులపై వేధింపులు, హింసలగురించిన కథలు అనేకం ప్రచారంలో ఉన్నాయి.

ఏడవ శతాబ్దంలో తిరుజ్ఞాన కంపంతర్ అనే శైవ సన్యాసిని హతమార్చేందుకు జైనులు ప్రయత్నించారనే కథనం ఒకటి హిందువులలో ఉంది. అటువంటి జైనులను ఆయన వినాశనమొనర్చడానికి కూడా అదే కథనం చెప్తుంది. కాని ఆ పని చేసింది

యుద్ధంలో కాదు. అద్భుతాల ద్వారా. ఆయన పాండ్య రాజును జైనం నుంచి శైవానికి మార్చుతాడు కూడా. ఈ కథ పెరియ పురాణంలో ఈ విధంగా ఉంది.

## జైనులకు కొరత వేసిన కంపంతర్

నలుపుకన్నా నల్లనివారైన జిత్తులమారి జైనులు, కంపంతర్ పై రాక్షసులవలె కుట్రపన్నారు. వారు తానున్న ఆశ్రమానికి నిప్పుపెట్టారు. కాని ఆయన ప్రార్థించటంతో అగ్ని ఆ ఆశ్రమం నుంచి వెళ్లిపోయి, పాండ్య రాజుకు జ్వరంగా మారింది. తన జ్వరాన్ని ఇరువురిలో ఎవరు తగ్గించగలిగితే వారిని ఆదరించగలనని రాజు ప్రకటిస్తాడు. జైనులు విఫలం కాగా కంపంతర్ సఫలుడవుతాడు. అపుడు జైనులు, తామిద్దరూ తమ తమ విశ్వాసాలకు సంబంధించిన సూత్రాలను తాళ పత్రాలపై రాసి అగ్నిలో వేయాలని ప్రతిపాదిస్తారు. ఎవరి పత్రాలు దగ్ధం కాకుండా ఉంటే వారిదే సరైన మతమవుతుంది. ఆ పోటీలో జైనుల పత్రాలు దగ్ధమవుతాయి. అపుడు జైనులు మరో రెండు పత్రాలను మదురై వద్ద గల వైకై నదిలో వదలాలంటూ, ఒకవేళ తాము ఈ మూడవ పరీక్షలోనూ విఫలమైనట్లయితే రాజు తమను మొనతేలిన కొయ్యలపై కొరత వేయవచ్చునంటారు. నదిలో శైవ పత్రాలు పైకి తేలినిలవగా, జైనులవి కొట్టుకుపోతాయి. అపుడు ఎనిమిదివేల మంది జైనులు తమకు తాము కొయ్యలపై పడి కొరత వేసుకుంటారు.

గాలి ఎటువీస్తున్నదీ గ్రహించిన రాజు, కంపంతర్ వాదనను ఆమోదిస్తాడు. కథలోని మూడు పోటీలు ఎంతవరకు నిజమైనవన్నది ఎవరూ సవాలు చేయరు. కాని మొనతేలిన కొయ్యలపై కొరత వేయటమనే భాగం మాత్రం వివాదస్పదమైంది. ప్రాచీన భారతంలో కొరత వేయటమన్నది సాధారణంగా జరుగుతుండేదని మాండవ్యుని కథను బట్టి మనకు తోస్తుంది. కాని ఈ కొరతల ప్రస్తావన కంపంతర్ కథనంలో గాని, అప్పర్ కథనంలోగాని కన్పించదు. ఆ ఉదంతం ఏడవ శతాబ్ది నాటిది కాగా, కొరత వేయటం మాట కొన్ని శతాబ్దాల తర్వాతి కథలలో ఉంది. అందువల్ల అనుమానాస్పదమవుతున్నది.

చోళుడైన మొదటి రాజరాజు (985–1014) కాలం నాటి నంపి అంతర్ నంపి ఈ ప్రస్తావన చేసాడు. రెండవ రాజరాజు (1150–73) కాలానికి చెందిన ఒక దేవాలయంలో ఆ శిల్పం ఉంది. అది తంజావూరు జిల్లా కుంభకోణానికి దక్షిణానగల తరకురం శివాలయం. ఆ ఉదంత రచయిత అయిన చెక్కియార్‌కు జైనుల వ్యతిరేకి అనే పేరుంది. జైనులను కొరత వేసిన చిత్రాలు అప్పటినుంచి మరికొన్ని చోట్ల కూడా కనిపిస్తాయి. కాని అది వాస్తవంగా జరిగిందనేందుకు ఆధారాలు లేవు. పలువురు జైనులకు తమరాజు కొరత వేసాడంటూ హిందువులు ఉత్సవం జరుపుకునేవారని చెప్పే చారిత్రకాధారాలు మాత్రం ఉన్నాయి.

రెండు వైపులా ఇదే విధమైన కథలు మరికొన్ని ఉన్నాయి. వీరశైవులు శ్వేతాంబర జైనుల శిరస్సులను ఖండించి గర్వించే వారని చెప్పే 16వ శతాబ్ది శాసనాలు ఆంధ్రప్రదేశ్‌లో లభించాయి. వారు పంచజినుల దేవాలయాన్ని పంచలింగ ఆలయంగా మార్చినట్లు, మరికొన్ని జైనాలయాలను కూడా అదే విధంగా మార్చినట్లు కథనాలున్నాయి. శివపూజను వ్యతిరేకించినందుకు జైన ఆలయాలపై జరిగిన దాడిని ప్రశంసిస్తూ ధార్వాడ సమీపానగల అబ్లూరు వద్ద ఒక శాసనం లభించింది. శివుడు తన విగ్రహాన్ని తాను పూజించకుండా ఆపేందుకు జైనులు ప్రయత్నించారని, దానిని పురస్కరించుకుని జరిగిన కలహంలో శైవులు జైన విగ్రహాన్ని ధ్వంసం చేసారని అంటారు. ఆ వివాదాన్ని జైన రాజైన బిజ్జలుని దృష్టికి తీసుకుపోగా ఆయన శైవుల వాదనను సమర్థిస్తాడు. ఇదే విధంగా 14వ శతాబ్దంలో ఒక ఫిర్యాదు అప్పటి హిందూ రాజు విచారణకు రాగా ఆయన హిందువులదే తప్పంటాడు. ఆ విధంగా మతాతీతంగా న్యాయం చెప్పే రాజులు కొందరు ఇరువైపులా ఉండటం గమనించదగ్గది. అది అంధకారంలో ఒక చిన్న కిరణం వంటిది.

వాస్తవానికి ఆ కాలంలో తలెత్తిన ఘర్షణలకు మూలం సాధారణంగా శైవులు, జైనుల మధ్యగల వైరం కాదు. వైష్ణవుల పరిస్థితి కూడా అంతే. పాండ్యులు, చోళుల రాజకీయ వైరం అందుకు కారణమయేది. ఒకోసారి ఇరువురూ శైవులు, లేదా బౌద్ధులు అయినా కావచ్చు. శైవులు శివాలయాలను, వైష్ణవులు విష్ణువు ఆలయాలను దోచుకుని, కూల్చి, అక్కడి విగ్రహాలను తమతో తీసుకుపోయిన సందర్భాలున్నాయి. తర్వాత కాలంలో తురుష్కుల దండయాత్రల సందర్భంలో వలె ఇపుడు కూడా మతపరమైన కారణాల కన్న ఎక్కువగా రాజకీయమైన, ఆర్థికమైన ఉద్దేశాలతో ఈ తరహా దాడులు జరుగుతుండేవి. శైవులు, వైష్ణవులు, వైరాలు కూడా ఇదే విధంగా సాగేవి.

## క్రైస్తవం, యూదుమతం

జైనులు, బౌద్ధులకు హిందువులతో సంవాదాలు, వైరాలు, లేక మైత్రి కూడా క్రీ.పూ. ఆరవ శతాబ్ది నుంచి ఉండేవి. క్రీ.శ. తొలి శతాబ్దాల కాలం నుంచి మొదట క్రైస్తవం, తర్వాత యూదు మతం, చివరగా ఇస్లాం కూడా రంగంలోకి వచ్చాయి.

యాక్ట్స్ ఆఫ్ సెయింట్ థామస్ (బహుశా క్రీ.శ. మొదటి శతాబ్దం నాటిది) అనే గ్రంథం చెప్పే కథనాన్ని బట్టి, దేవదూతలు లాటరీ వేయగా, వడ్రంగి అయిన జూడాస్ థామస్ అనే దూతకు భారతదేశం లభించింది. తనకు ఆ రాత్రి జీసస్ కలలోకి రాగా, “ఓ ప్రభూ, నీ నిర్ణయం ఏదైనప్పటికీ నేను ఇండియాకు మాత్రం వెళ్ల”నంటాడాయన. అయినప్పటికీ జీసస్ తనను ఇరవై వెండినాణేలకు ఒక భారతీయ వర్తకునికి అప్పగిస్తాడు. ఆ వర్తకుడు థామస్‌ను గాంధార రాజు భవనంలో పని చేసేందుకు తీసుకుపోతాడు. అది క్రీ.శ. 19-45 సంవత్సరాల మధ్య మాట. అక్కడి నుంచి థామస్ క్రీ.శ. 52లో

మలబారు తీరానికి చేరుతాడు. అక్కడ తను నెలకొల్పిన సిరియన్ క్రైస్తవుల సమాజం ఈనాటికీ ఉంది. అక్కడి నుంచి భూమార్గం మీదగా తూర్పు తీరానికి చేరిన ఆయన ప్రస్తుతపు చెన్నై పరిసరాలలో మరణిస్తాడు. ఎప్పటివలెనే సరుకులు, మనుషులు చెప్పే కథలూ రెండు వైపులా ప్రయాణించాయి. రోమ్‌లో బాగా డిమాండు ఉండిన మిరియాలు, దాల్చిన చెక్క కేరళ నుంచి రవాణా అయ్యాయి. అదే విధంగా ఆసక్తికరమైన కథలు. వాటిలో క్రీ.శ. రెండవ శతాబ్దిలో అశ్వఘోషుడు రాసిన బుద్ధ చరిత విశేషాలు కూడా ఉన్నాయి. కన్యలు సంతానాన్ని కనటం, అసురుల ఆకర్షణ వంటివీ వాటిలో ఉన్నాయి. ఏసుక్రీస్తు జన్మ వృత్తాంత రచనపై ఈ అంశాల ప్రభావం ఉండవచ్చు.

దక్షిణాదిన యూదు మతం కూడా ఉనికిలోకి వచ్చింది. సాలమన్‌కు మలబార్‌తో సంబంధం ఉండి ఉంటుందనే విషయాన్ని మనం ఇప్పటికే పేర్కొన్నాము. క్రీ.శ. 70లో సెకండ్ టెంపుల్ విధ్వంస కాలం నుంచి యూదులు అక్కడ నివసించేవారనే కథనాలున్నాయి. అయితే వారి నివాసం గురించిన నిర్దిష్టమైన ఆధారాలు క్రీ.శ. 970–1035 కాలపు రాగి ఫలకాలు. అవి తమిళంలో ఉన్నాయి. వారు కొచ్చిన్‌లో నివసించేవారని అందులో పేర్కొన్నారు. జేకబ్ రబ్బాన్ అనే వ్యక్తికి తమ మతాచారం ప్రకారం ఒక ఛత్రాన్ని ధరించేందుకు, ఆయుధాలు ఉంచుకునేందుకు, అదే విధంగా మరికొన్ని హక్కులు కల్పించినట్లు ఆ ఫలకాలలో ప్రకటించారు. భారతదేశంలో అన్నింటికన్న ప్రాచీనమైన జూయిష్ సినగాగ్‌ను 1344లో అంగడి వద్ద నిర్మించారు. తర్వాత 1489లో రెండవది ఏర్పడింది.

## ఇస్లాం, భక్తి

మలబార్ తీరంలో ఇస్లాం కూడా ఈ తొలి దశలలోనే ప్రచారానికి వచ్చింది. ఆ మతమంటూ ఒకటి ఏర్పడటానికి ముందే అరబ్బులు అరేబియా సముద్రం మీదుగా భారతదేశపు నైరుతి తీరానికి చేరి చాళుక్యులు, చేరుల నగరాలలో, శ్రీలంకతో వర్తకం సాగించేవారు. అరబ్బుల గుర్రాలకు ఉత్తర, దక్షిణ దేశాలలో బాగా డిమాండు ఉండేది. వాటిని కేరళ తీరానికి సముద్రమార్గంలో, ఉత్తర దేశానికి భూమార్గంలో తీసుకువచ్చేవారు. ప్రవక్త మరణానంతరం కొందరు అరబ్బులు ఉత్తర మలబార్ ప్రాంతంలో స్థిరపడ్డారు. వారిని భారతీయులు మాపిళ్లై (కొత్త పెళ్లి కొడుకులు, లేదా కొత్తల్లుళ్లు) అనేవారు. ఆ తర్వాత ఇస్లాంకు మారిన అరబ్ వర్తకులు ఇక్కడకు వచ్చినపుడు, అప్పటికే ఇక్కడ గలవారిని కూడా ఆ మతంలోకి మార్చారు. వారు నేటికీ అక్కడే స్థిరపడి ఉన్నారు. ఏడవ శతాబ్ది మధ్య నాటికి ఆ ప్రాంతపు రేవుల అనేకంలో ముస్లింలు తగిన సంఖ్యలో ఉన్నారు.

ఢిల్లీ సుల్తానేట్‌లో ఇస్లాం ఒక ప్రబల శక్తిగా మారటం 11వ శతాబ్దిలో జరగగా, అంతకన్న చాలా ముందే ఇస్లాం భారతదేశానికి వచ్చింది. అది ఇక్కడ అప్పుడప్పుడే భక్తి

ఉద్యమం ముందుకొస్తున్న కాలం. ఆ కాలపు తొలిముస్లిములు ఒకవైపు ఇక్కడి ప్రజలకు స్ఫూర్తిని కలిగించగా, మరొకవైపు వ్యతిరేకత కూడా ఏర్పడసాగింది. వ్యక్తిగతంగా, సామూహికంగా కూడా భక్తి ఉద్యమంతో సంపర్కానికి వారికి అవకాశం ఏర్పడింది. పదవ శతాబ్దికి చెందిన వైష్ణవుల భాగవత పురాణంలోని ఒక కవిత, భక్తి ఉద్యమానికి, ఇస్లాంకు మధ్య ఉండిన ప్రతికూల సంబంధాల గురించి ప్రస్తావిస్తుంది. ఆ కవితలో భక్తి తనకు తానే ఈ విధంగా చెప్పుకుంటుంది: “నేను ద్రవిడ దేశంలో జన్మించి కర్ణాటకలో పెరిగాను. మహారాష్ట్రలోనూ అక్కడక్కడ జీవించాను. గుజరాత్‌లో బలహీనపడి వృద్ధురాలినయాను. అక్కడ కలియుగంలో పాఖండులు నన్ను విచ్ఛిన్నం చేసారు. నేను, నా కుమారులు కూడా వృద్ధులమై బలహీనపడ్డాము. కాని బృందావనానికి చేరిన తర్వాత తిరిగి వయస్కురాలిని సౌందర్యవతిని అయాను”. ఎవరీ పాఖండులు? జైనులు కావచ్చు. వారు దక్షిణ దేశంలో శైవులకు ఎప్పుడూ శత్రువులే. కాని ఇది వైష్ణవ కావ్యం. పైగా కృష్ణ భక్తులకు కేంద్రమైన బృందావనం ఉత్తర దేశంలో ఉంది. భక్తిని విచ్ఛిన్నం చేయటమనే ప్రస్తావన గుజరాత్ సందర్భంలో కనిపిస్తుంది. అది జైనం బలంగా ఉన్న కేంద్రం. అయినప్పటికీ ఈ కవితలో భక్తి ఉద్యమానికి శత్రువుగా పరిణమించింది జైనం అనిగాక ఇస్లాం అని మొదటి నుంచి నిర్వచనం చెప్పారు.

అదే సమయంలో దక్షిణ భారతదేశంలో ఇస్లాంకు, భక్తి ఉద్యమానికి మధ్య సానుకూలమైన సంపర్కాలు అనేకం చోటు చేసుకున్నాయి. ఉదాహరణకు శ్రీ వైష్ణవ సంప్రదాయంలోని ‘ప్రపత్తి’ (అధీనమై పోవటం) అనే భావన, ఇస్లాం ప్రభావంతో కలిగింది అయి ఉండాలి. దానినట్లుంచితే, మరొక మతం తమ ప్రాంతంలో ప్రవేశించినపుడు, మతపరమైన కొత్త ఆలోచనలు కలగటం సహజం. అదే క్రమంలో హిందువులకు భక్తి కవుల పట్ల లోగడ లేని సానుకూలత ఏర్పడి ఉండవచ్చు.

## మతాంతరీకరణ

వ్యక్తులు బౌద్ధం, జైనం, వైష్ణవ భక్తి సంప్రదాయం, శైవభక్తి సంప్రదాయాల మధ్య అటు ఇటు మారటాన్ని అన్ని సందర్భాలలో మతాంతరీకరణ అనలేము. ఆ మాటను ఇస్లాం, క్రైస్తవాలకు పరిమితం చేయటం మంచిది. ప్రాచీన దక్షిణ భారతదేశంలో ప్రజలకు బహు మతాలన్నవి తమకు అందుబాటులో గల బహుళావకాశాలే తప్ప అదొక యుద్ధ రంగం కాదు. సాధారణ ప్రజలు హిందూ దేవాలయాలకు వెళతారు, బౌద్ధులకు భిక్ష వేస్తారు, సూఫీ బాబాలకు ప్రార్థన చేస్తారు. నిజమైన అర్థంలో మతాంతరీకరణ చెంది తమ జీవితాలను, ప్రపంచ దృష్టిని మార్చుకునేవారు కూడా ఉన్నారు. సన్యాసులు, సన్యాసినులు, విరాగులు, యోగులు, మూఢ భక్తుల వంటివారు ఈ వర్గీకరణలోకి వస్తారు.

బౌద్ధం, జైనం మొదటి నుంచి కూడా మతాంతరీకరణ జరిపే మతాలే. హిందూమతం మాత్రం మొదట ఆ విధంగా కాదు. హిందువుగా జన్మించినవారే హిందువులయేవారు. కాని సన్యసించే ధోరణులకు అవకాశంగల మతాలు, ఆ తర్వాత సంప్రదాయ పద్ధతికి భిన్నమైన మతాలు, భక్తి ఉద్యమం, తాత్త్విక ధోరణులు గల శాఖలూ, మనం ఒక విధమైన హిందువుగా జన్మించి మరొక విధమైన హిందువుగా పరివర్తన చెందవచ్చునని వాదించాయి. అదే విధంగా, మనం జైనులుగా జన్మించినా మొత్తం మీద మౌలికంగా హిందువులము కానక్కరలేదని, ఒక ప్రత్యేక శాఖకు చెందినవాళ్లం కావచ్చునని కూడా అన్నాయి. అది సన్యాస మార్గానికి సంబంధించిన శాఖ కావచ్చు, లేదా భక్తి మార్గానికి సంబంధించినదైనా. ఆ పరిస్థితులలో భక్తులు తండోపతండాలుగా పరివర్తన చెందారు. అది ఇతర మతాలకు ముప్పుగా పరిణమించింది. వైదిక హిందూ మతం విషయంలో అట్లా ఎప్పుడూ జరగలేదు. ఈ విధమైన పరివర్తనలను కొన్ని సందర్భాలలో మతాంతరీకరణ అనవచ్చుననుకుంటాను.

భక్తి ధోరణుల రచయితలు స్వయంగా తమ మతపరివర్తనలను కూడా అపహాస్యం చేయటాన్ని ఈ కింది కథలో గమనించవచ్చు:

## శైవునిగా మారిన శివుడు

శైవ సన్యాసి ఒకరు మతాంతరీకరణలు విరివిగా జరిపేవాడు. అందుకు ప్రేమ, ధనం, బలప్రయోగం – దేనినైనా సరే ఉపయోగించేవాడు. తనను పరీక్షించేందుకు ఒకరోజు శివుడు మారు రూపంలో రాగా, తనకు ఇష్టం లేనట్లు కనిపించినా ఆ సన్యాసి తనకు బలవంతంగా విభూది పూయబోతాడు. ఆ వత్తిడిని తట్టుకోలేని శివుడు తాను ఎవరైనదీ చెప్పజూస్తాడు. అయినప్పటికీ ఆ సన్యాసి శివునికి విభూదిని పూయనే పూస్తాడు. ఆ విధంగా శివుడు శైవునిగా మారుతాడు.

భక్తి ఆ విధంగా భగవంతుడిని కూడా తన దౌర్జన్య శక్తితో లోబరచుకుంది. ఆ క్రమంలో, భారతదేశంలోని మతానికి గల ఆత్మ శాశ్వతంగా మారిపోయింది.

## అధ్యాయం 14

# తొలి పురాణాలలో స్త్రీ దేవతలు, పురుష దేవతలు

## క్రీ.శ. 300 - 600

**కాలక్రమణిక (అన్నీ క్రీ.శ. సంవత్సరాలు)**

| | | |
|---|---|---|
| 320–550 | : | పాటలీపుత్ర రాజధానిగా గుప్తుల పాలన |
| సుమారు 400 | : | సంస్కృత నాటకాలు, దీర్ఘ కవితలు రచించిన కాళిదాస కవి |
| 405–411 | : | భారతదేశానికి ఫాహియాన్ రాక |
| 455–467 | : | ఉత్తర భారతదేశ దేశంపై హూణుల దండయాత్ర |
| సుమారు 460–77 | : | అజంతా గుహా చిత్రాలను పూర్తి చేసిన వాకాటక రాజులు |
| 350–750 | : | సుమారు 450 కాలపు హరివంశం. తొలి పురాణాలైన బ్రహ్మాండ (350–950), కూర్మ (550–850), మార్కండేయ (250–550), మత్స్య (250–500), పద్మ (750–1000), శివ (750–1350), స్కంధ (700–1150), వామన (450–900), వరాహ (750) పురాణాల రచన |

## శివుని అగ్ని, కామం

*శివుని ఆగ్రహాగ్ని నేటికీ నీలో తప్పక జ్వలిస్తుండి ఉంటుంది,*
*సముద్ర గర్భంలోని ఆడ గుర్రం అగ్నివలె –*
*లేనిదే ఓకాముడా, నీలో ఇంత వేడి ఎక్కడిది*
*నావంటి వారిని బూడిదగా మార్చేట్లు?*

– కాళిదాస, శాకుంతలం, సుమారు క్రీ.శ. 400

శివుని తాపసాగ్నిని, మన్మథుని కామాగ్ని బాణాలను ఒక దానికొకటి పోటీగా నిలిపిన పౌరాణికం, విలయాన్ని సృష్టించగల సముద్ర గర్భంలోని ఆడగుర్రం, ఒకవైపు

పురాణ సాహిత్యానికి, మరొకవైపు గుప్త రాజుల పనుపున సృష్టి అయిన సంస్కృత సాహిత్యానికి కేంద్ర బిందువులుగా నిలిచాయి. సమాజంలో ప్రాచుర్యం పొందిన సంప్రదాయాలు సంస్కృత రచనలలో, సంప్రదాయాలలో స్థానం పొందగా, శివుడు, విష్ణువు వంటి పురుష దేవతలు మరింత శక్తివంతులు కాసాగారు. వారికి సంబంధించిన సంక్లిష్టతలు కూడా పెరగసాగాయి. అయితే ఈ దశనుంచి మొదలుకొని స్త్రీ దేవతల ప్రాముఖ్యం కూడా పెరిగి వారు రంగస్థలి మధ్యలోకి రాసాగారు.

## స్వర్ణయుగం

ఈ కాలంలో దక్షిణ దేశాన పల్లవులు, పాండ్యులు, చోళులు పరస్పరం తలపడుతుండగా, ఉత్తర భారతదేశంలో మొదటి చంద్రగుప్తుడు స్థాపించిన గుప్త సామ్రాజ్యం ఉత్తరమంతటనే గాక మధ్యభారతంలో కూడా చాలా వరకు వ్యాపించింది. క్రీ.పూ. మూడవ శతాబ్దిలో మౌర్యుల సామ్రాజ్య పతనం తర్వాత ఇదే అతిపెద్ద సామ్రాజ్యమైంది. గుప్త సామ్రాజ్యాన్ని క్రీ.శ. 324 లో మొదటి చంద్రగుప్తుడు నెలకొల్పాడు. తర్వాత రెండవ చంద్రగుప్తుడు (376–415) తన తండ్రి సముద్ర గుప్తుడి నుంచి సామ్రాజ్యాన్ని వారసత్వంగా పొందిన వెనుక, ఉత్తరాన ఇంకా మిగిలి ఉన్న కొద్ది పాటి భూభాగాలను కూడా జయించాడు.

గుప్తుల కాలంలో భారతదేశాన్ని సందర్శించిన చైనా బౌద్ధ యాత్రికుడు ఫాహియాన్ అప్పటి పరిస్థితుల గురించి చాలా రాసాడు. తనతోపాటు, షువాన్ జాంగ్ (7వ శతాబ్దం) అనే మరొక యాత్రికుడు రాసిన దానిని బట్టి గుప్తుల పాలనలో చండాలురు, లేదా పారియాల పట్ల వివక్షను మినహాయిస్తే అన్ని పరిస్థితులు బాగుండేవి. గుప్తుల కాలపు గాంధర్వ శిల్పకళ, ఇతర కళలు తర్వాత కాలంలో యూరోపియన్ చరిత్రకారుల దృష్టిని ఆకర్షించటంతో వారు దానిని స్వర్ణయుగమన్నారు. గుప్తుల కొలువు "నవరత్నా"లకు ప్రసిద్ధి చెందింది. ఆ తొమ్మిది మందిలో కాళిదాసు వంటి కవులతో పాటు శాస్త్రవేత్తలుండేవారు. ఖగోళశాస్త్రంలో గణిత శాస్త్రంలో ప్రసిద్ధి చెందిన ఆర్యభట, మరొక ఖగోళశాస్త్రజ్ఞుడు వరహమిహిర, గణితశాస్త్రవేత్త బ్రహ్మగుప్త ఆ కాలంవారే. అదే కాలంలో ఎవరో చతురంగ (చదరంగ) క్రీడను కనుగొన్నారు. గుప్తులు ప్రజోపయోగ కార్యక్రమాలు అనేకం చేపట్టారు. తాము హిందూ మతాన్ని అవలంబించినా బౌద్ధ, జైనాలను కూడా ఆదరించారు. వారి సామ్రాజ్యం బలహీనపడుతున్న దశలో అనేక చిన్న రాజ్యాలు అవతరించాయి. వాయవ్య దిశనుంచి హూణులు దండయాత్ర చేసి తమ రాజ్యాన్ని నెలకొల్పారు.

## పురాణ రచన

తొలి సంస్కృత పురాణాలు గుప్తుల కాలంనాటివే. హిందూ మతంలోని వేర్వేరు శాఖల మధ్య సంబంధాలు, హిందూ – బౌద్ధ – జైన మతాల సంబంధాలు, చక్రవర్తి

కొలువుకు గ్రామాలకు మధ్య సంబంధాలు ఆ పురాణ రచనలలో ప్రతిఫలించాయి. మొదట గుప్తుల సాహిత్యం అప్పటికే గల జానపద సంప్రదాయ సాహిత్యాన్ని, ఇతిహాసాలను స్వీకరిస్తూ తనదైన రీతిలో రచనలు సాగించింది. తర్వాత పురాణాలు జానపదంతోపాటు గుప్త సాహిత్య రీతులను పునర్లిఖించాయి. పురాణాలు వేదాలకన్న, మహాభారతం కన్న కూడా సామాజిక పరిస్థితులకు ఎక్కువ దగ్గరగా ఉంటాయి. వాటి భాష సరళమైంది. కుల వ్యవస్థ విషయంలోనూ అరమరికలు లేని తీరు కనిపిస్తుంది.

పురాణాలు మొత్తం 18 అని, అవిగాక అనేక ఉప పురాణాలున్నాయని చెప్తారు. ఉపపురాణాలు ఎన్నో, ఏ సంవత్సరాలలో రాసినవో, వాటిలోని రచనాంశాలు ఏమిటో ఎవరికీ తెలియదు. పురాణాలు మాత్రం తమ రచనాంశాలలో సృష్టి, ప్రతిసృష్టి, దేవతలూ, రాజుల వంశ చరిత్రలు మనువుల పరిపాలన (ఒకోయుగ సృష్టి కోసం ఒకో మనువు ఉండేవాడు), సూర్య వంశరాజులు, చంద్రవంశ రాజుల చరిత్రలను పేర్కొంటాయి. అయితే దేవతలు, మనువులు,రాజుల వంశ చరిత్రల గురించి రాసే సమయంలో ఆయా రచయితలు స్వేచ్ఛగా వ్యవహరించారు. ధార్మికమైన జీవిత, క్రమం ఏది, దేవతల పూజా విధానం, ఇంటిలో ఆచరించే క్రతువులు, దేవాలయాలలో చేయవలసిందేమిటి, ప్రత్యేక పండుగలు, తీర్థయాత్రా స్థలాలు, ప్రార్థనా పాఠాలు, భక్తి కథలు మొదలైనవి అనేకం వాటిలో కనిపిస్తాయి.

'పురాణ' అనే మాటకు అర్థం ప్రాచీనమైనదని. అందుకు తగినట్లే, ఈ రచనలో కాల్పనికత, మతపరమైన అంశాలు ఎప్పుడో గతానికి సంబంధించినవి అనేకం ఉన్నాయి. అదే సమయంలో ఆధునిక కాలానికి సంబంధించిన సామాజికాంశాలు కనిపిస్తాయి. వాటిలో గ్రామాలు, తీర్థాలు, నదులు, పూజా విధానాలు, రాజాస్థాన విషయాలు మొదలైనవి వస్తాయి. ఒక పురాణానికి మరొక దానికి మధ్య తేడా అవి తమ స్వీయ మతాచారాలు, శాఖల మధ్య చూపే పాక్షిక దృష్టి. మరొకవైపు, నిమ్న కులాలను, గిరిజనులను సామ్రాజ్య వ్యవస్థలోకి ఇముడ్చుకునే ప్రయత్నాలు ఆ కాలంలో సాగుతుండగా, అదే ధోరణి సాహిత్యంలోనూ కన్పించేది. తొలి పురాణాలు వేర్వేరు కులాలవారికి చెందిన విశ్వాసాలను, ఆలోచనలను ఆ విధంగా తమలో ఇముడ్చుకున్నాయి. అప్పటి సమాజంలో ఒకవైపు సన్యసించే ధోరణులు, మరొకవైపు పలు శాఖలుగా మత విస్తరణలు ఉండేవి. వాటి మధ్య సమన్వయం కోసం ధర్మశాస్త్ర కర్తలు ప్రయత్నించేవారు. ఆ ప్రయత్నాలలో తమ స్వంత ఆలోచనలు కూడా ఉండేవి. ఇదంతా పురాణ రచయితలకు మంచి అవకాశంగా కన్పించింది. మరొక స్థాయిలో హిందూమతం ప్రతి అంశాన్ని తనలో ఇముడ్చుకొనజూసే క్రమం కొనసాగింది. నిమ్న కులాలు, స్త్రీలు, గ్రామీణ ప్రాంతాలలో కథలు చెప్పేవారికి అంతవరకు సంస్కృత సాహిత్యంలో ఎపుడైనా ఒకసారి స్థానం లభించగా, ఇపుడు తగినంత ప్రాముఖ్యత కన్పించసాగింది. వారి పాత్రలు ఇపుడు మాట్లాడతాయి కూడా. మొదటి

గుప్తులు, తర్వాత సాధారణ రాజ్యవ్యవస్థలు ఆదరించటంతో, ఆధిపత్య ధోరణులు లేని, వైదికేతర సంప్రదాయాలు పురాణాలలో తగినంత చోటు సంపాదించుకున్నాయి.

దేవాలయాల సంఖ్య పెరగటంతో శాస్త్రాల ఉపయోగం కూడ పెరిగింది. ఆగమ శాస్త్రాలు పూజాదికాల నిర్వహణను భక్తులకు వివరించాయి. అంతకు ముందు సంస్కృత రచనలను చదవలేని వారికి దేవాలయాలు, వాటిలో పూజాదికాల పెరుగుదలతో ఆ రచనలలోని విషయాలేమిటో తెలియసాగింది. దేవాలయాలపైగల శిల్పాలు, చిత్రాలు కూడా అందుకు తోడ్పడ్డాయి. వాటిలోని విషయమేమిటో పూజారి, లేదా మరొకరు సామాన్య ప్రజలకు తెలియజెప్పేవారు. పురాణ పఠనం చేసేవారు, లేదా వారి పక్కన ఉండేవారు ఆ సంస్కృత పాఠానికి అర్థాన్ని ప్రజలకు వివరించేవారు. ప్రజలనే వారిలో నిమ్న కులాలవారు, స్త్రీలు కూడా ఉండేవారు. పారియాలు తాము దేవాలయాలలోకి ప్రవేశించి చూడలేని విగ్రహాలను బయట చూడగలిగేవారు. మరొకవైపు, జానపద దేవతలు, స్థానిక విశ్వాసాల గాథలు, సంప్రదాయాలు బ్రాహ్మణుల ప్రపంచంలోకి ప్రవేశిస్తుండగా, ఆ మొత్తం వ్యవస్థలో దేవాలయాలు ఒక భాగమయాయి.

ఆస్థాన సంస్కృత సాహిత్యానికి, మౌఖికమైన స్థానిక సంప్రదాయాలకు మధ్య పురాణాలు సంధానకర్తలవంటి వనాలి. ఆస్థాన సాహిత్యం, పురాణాలు, జానపద సాహిత్యం రచించే వారికి మధ్య ఒకోసారి ఆర్థికపరమైన వర్గాల వంటి వ్యత్యాసాలుండేవి. కాని పురాణ రచయితలను పేద వర్గాలనుంచి వచ్చినవారనలేము. పురాణాలు వర్గ విభజనకు అటు–ఇటుగా కూడా ఉండేవి. వాటిని ఆదరించిన వారిలో సంపన్నులైన వర్తకులూ ఉండేవారు. పురాణాలో ఆశ్చర్యకరమైనంత స్థాయిలో వేర్వేరు విశ్వాసాలు ఇమిడి ఉండటానికి, వాటిని హిందువులు తమ శాస్త్రాలలో, సమాజాలలోనే గాక స్వంత కుటుంబాలలో కూడా సహించి ఆమోదించటానికి ఒక కారణం వాటిలో ఒక నిర్దిష్టమైన, ఖచ్చితమైన సంప్రదాయం లేకపోవటం. పురాణాలలో పేర్కొన్న అనేక క్రతువులు, పూజలలో బ్రాహ్మణుల పాత్ర లేకపోవటం గమనించదగ్గది. జానపద కథలు, సంప్రదాయాలలో బలం ఉండినందున బ్రాహ్మణులు కూడా వాటిని విస్మరించలేకపోయారు.

దేశ పురాణాలు, లేదా స్థల పురాణాలు ఆ ప్రాంతానికి చెందిన భాషలో ఉండేవి. స్థానిక దేవతలకన్నా ఎక్కువగా అక్కడి దేవాలయాల గురించి రాసేవి. చరిత్ర కూడా స్థానికమైనది. ఎక్కడో దూరానగల రాజు గురించి గాక ఆ ప్రాంతంలో పన్నులు వసూలు చేసే అధికారి ముఖ్యమైనందున తన తీరు గురించి వాటిలో చెప్తారు. దేవతల పట్ల హాస్యాన్ని, ధిక్కారాన్ని, బ్రాహ్మణులపై వెక్కిరింతలను అందులో చూడవచ్చు. ఆ కాలంలో గిరిజనులను కూడా హిందూ సంస్కృతి ప్రభావంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతుండిన వారి కథలు కూడా పురాణాలలో కన్పించేవి. వారి గురించిన వర్ణనలూ ఉండేవి.

సాధారణ ప్రజలకు, నిమ్నవర్గాలకు చెందిన కథలు, ఆలోచనలు, సంప్రదాయాలు ఈ విధంగా సంస్కృత రచనలలోకి ప్రవేశిస్తుండినప్పటికీ వాటిని ఒక స్థాయిలో బ్రాహ్మణులు కొంత వడబోసేవారు. వాటి గురించి వారికి పూర్తిగా తెలిసేది కాదు. తరచు వ్యతిరేకత ఉండేది. ఒకోసారి వాటిని తమ సిద్ధాంతాలకు అనుగుణంగా తిరగరాసే వారు. తర్వాత శతాబ్దాలలో మనకిది తమిళం, తెలుగు, బెంగాలీ, హిందీ వంటి వివిధ భాషలలో కనిపిస్తుంది. బహుశా ఇటువంటిది కొన్ని శతాబ్దాల క్రితం పురాణాల కన్న ముందు కాలంలో కూడా జరిగి ఉండవచ్చు.

ఉదాహరణకు, మొదట తెలుగులో ఒక నిమ్న జాతికి చెందిన వ్యాపారి చెప్పిన జానపద కథను, సంస్కృత పురాణంలో గల అదే కథతో పోల్చి చూసినట్లయితే తేడా కన్పిస్తుంది. సంస్కృత పురాణంలో ఆ నిమ్నజాతి పేరుకు బదులు వైశ్యకులం వస్తుంది. వారు అదే కథ చెప్తారు. మొదటి జానపద కథలో ఉన్నదానిని బట్టి, నిర్ణయాధికారం స్త్రీది కూడా, సంస్కృత కథలో బ్రాహ్మణునిది అవుతుంది. ఇటువంటి వక్రీకరణలు జరిగినప్పటికీ జానపద గాథలు, సంప్రదాయాలు తగినంతగా సంస్కృత పురాణాలలో ప్రవేశించాయి.

ఈ సరికి సంస్కృతంపై బ్రాహ్మణుల ఆధిపత్యం తగ్గుతుండటం విశేషం. ఆ భాషను వైశ్యులు కూడా చదవసాగారు. అనేక లౌకిక వ్యవహారాలలో బ్రాహ్మణేతరులు సంస్కృతాన్ని ఉపయోగించటం మొదలైంది. బ్రాహ్మణులలో భౌగోళికంగా, స్థాయీపరంగా, పాండిత్యపరంగా భిన్నత్వాలుండటం మరొక విశేషం. రాక్షసులలో బ్రాహ్మణులు ఉండటాన్ని మనం ఇతిహాసాలలో (రావణుడు ఒక ఉదాహరణ) చూసాం. ఇపుడు, రాక్షసులకు వారసులనబడే మానవ బ్రాహ్మణుల ప్రసక్తి వస్తుంది. అదే విధంగా శూద్ర బ్రాహ్మణులు, మ్లేచ్ఛ బ్రాహ్మణులు, చండాల బ్రాహ్మణులు, నిషాద బ్రాహ్మణులు కూడా ఉండేవారు. తాము దొంగతనాలు చేస్తూ మాంసాహారం తీసుకునేవారని చెప్తారు.

త్రిమూర్తులలో బ్రహ్మను అట్లుంచి, విష్ణుభక్తులు, శివ భక్తుల మధ్య ఒక స్థాయిలో ఉద్రిక్తతలుండేవి. ఈ ఇద్దరిని తప్ప బ్రహ్మను అంతగా పూజించేవారు కాదు. సృష్టికి బ్రహ్మ, పాలనకు విష్ణువు, వినాశనానికి శివుడు బాధ్యులనే ఆలోచనలు ప్రాచీన సాహిత్యంలో కన్పించవు. ఆ సాహిత్యాన్ని బట్టి విష్ణువు, శివుడు ఇరువురు కూడా సృష్టికర్తలే. విలయకారులే. వీరిరువురు తరచు హరి–హరులుగా పరస్పర సమన్వయంతో వ్యవహరించటం కనిపిస్తుంది. అయితే ఏ కథను ఎవరు రాసారనే దానిని బట్టి ఇరువురిలో ఎవరో ఒకరు అధికులవు తుంటారు. బ్రహ్మను అధికుడిని చేసిన కథనాలు కూడా ఉన్నాయి. ఆధిక్యత కోసం త్రిమూర్తులు పోటీ పడినట్లు చూపేవీ కనిపిస్తాయి.

## స్త్రీ దేవతలు

పురాణాలలో స్త్రీ దేవతల కథలున్నాయి. రుగ్వేదంలో కొందరు స్వతంత్రమైన దేవతలుండినా వారు ఉష, సంధ్య వంటి సంకేతప్రాయులు మాత్రమే. లేదా, ఇంద్రుని భార్య ఇంద్రాణివలె స్వతంత్రత ఏమీలేనివారు. ద్రౌపది, సీతల జన్మవృత్తాంతాలను బట్టి వారు మొదట దేవతలే అయినా భారత, రామాయణాలు వారిని సాధారణ మానవ స్త్రీలుగా పరిగణించాయి. వీరందరిని అట్లుంచితే ఇపుడు తొలి పురాణాలలో నిజమైన అర్థంతో స్వతంత్ర స్త్రీ దేవతలు ముందుకొస్తారు. దేవుడొక్కడేనని, తక్కిన దేవుళ్లంతా అతని ప్రతిరూపాలేనని పురుష దేవతల గురించి అన్నట్లు, దేవి పేరిట స్త్రీ దేవత ఒకరేనని, ఇతర స్త్రీ దేవతలందరూ ఆమెకు ప్రతిఫలనాలని అంటారు. అదెట్లున్నా స్వతంత్ర దేవతలు మనకు పురాణాలలో కనిపిస్తారు. పురుష దేవతలలో ఒకటి కన్న ఎక్కువ తలలు గలవారు పలువురున్నారు. బ్రహ్మకు నాలుగు, శివునికి అయిదు, స్కంధునికి ఆరు. దేవుడు కాకపోవచ్చుగాని రావణుడు దశకంఠుడు. స్త్రీ దేవతలలో తలలు ఒకటికన్న ఎక్కువ కాకపోయినా చేతులు అనేకం కలవారున్నారు.

స్త్రీ దేవతలలో ముఖ్యమైనవారు మహిషాసురమర్దిని, శివుని భార్య సతీదేవి, మరొక భార్య పార్వతి. చండిక అనే మరొక పేరు కూడా గల మహిషాసుర మర్దిని ఆరాధన దేశంలో ఎప్పటినుంచి జరుగుతున్నదీ తెలియదు. కుషాణుల నాణేలపై దుర్గ, పార్వతి చిత్రాలు ఉన్నాయి. బహుశా క్రీ.శ. రెండవ శతాబ్దానికి చెందిన ఒక కుషాణ శిల్పంలో వృక్ష దేవత (యక్షి) కనిపిస్తుంది. ఆమె పాదాల కింద ఒక మరుగుజ్జు ఉంటాడు. అది దుర్గకు నమూనా వంటి తొలి రూపమైనా కావచ్చు. స్త్రీ పూజకు ప్రాథమిక సూచనలన్నవి సింధూ నాగరికతలో ఉన్నాయి. అంతకన్న కొంత స్పష్టంగా మహాభారతంలో కన్పిస్తాయి. 'మాతృక'ల ప్రస్తావన అటువంటిదే. వారు ఏడుగురో, ఎనిమిదిమందో ఉన్నారు. వారు గాక మహాకాళి, మృత్యుదేవత, నిశాదేవి వంటి వారున్నారు. స్త్రీ దేవతలను కీర్తించేందుకు దేవీ మహాత్మ్యం అన్న దీర్ఘ కవిత ఒక ప్రాథమిక కావ్యం వంటిది. మార్కండేయ పురాణంలో మరికొందరు శక్తివంతులైన స్త్రీ దేవతల గురించి కూడా పేర్కొన్నారు. వారు అప్పటికే సంస్కృత కావ్యాలలోనో, లేక జానపద సంప్రదాయాలలోనో ఉండి ఉంటారు. జానపదంలో గిరిజన దేవతలు కూడా ఉండవచ్చు. మొత్తానికి మార్కండేయ పురాణ కాలానికి స్త్రీ దేవతల ఆరాధన నగరాలలో, గ్రామాలలో అన్ని వర్గాలవారు చేసేవారు.

మార్కండేయ పురాణం ఈ దశలో స్త్రీ దేవతల గురించి ఎందుకు పేర్కొన్నట్లు? ఇతరత్రా కూడా ఆ దశలో దేవతారాధన గీతాలు, కావ్యాలు ఉండేవి. ప్రజలు చండికను పూజిస్తుండినందున తన గురించి కూడా ఒక రచన అవసరమైందనుకోవాలి. కుషాణుల నాణేలపై స్త్రీ దేవతల చిత్రాల మాట ఇప్పటికే చెప్పుకున్నాము. క్రమంగా కొంత కాలానికి

దేవీ భక్తి, పూజలు, కీర్తనలు తగినంత పెరగటంతో బ్రాహ్మణులు గుర్తించక తప్పలేదు. సంస్కృత రచనలలోనూ చేర్చక తప్పలేదు. మొదట ఎక్కడో స్థానిక దేవతగా ఉండిన ఆమె గుర్తింపు ఆ స్థాయికి పెరిగింది. తనను రాజులు, వర్తకులు కూడా పూజించేవారని పురాణాలు పేర్కొన్నాయి. తన రాజ్యం కోల్పోయిన ఒక రాజుకు, సంపదలను, కుటుంబాన్ని పోగొటుకున్న ఒక వర్తకునికి ఒక రుషి మహామాయ అనే దేవత గురించి చెప్తాడు. కథ చివరన ఆ దేవత వారిద్దరికి తాము కోరుకున్నవి అనుగ్రహిస్తుంది. రాజు తిరిగి తన రాజ్యాన్ని కోరుకోగా, వర్తకుడు తానేమిటో గ్రహించే జ్ఞానాన్ని ఆశిస్తాడు. చండిక గురించి పురాణాలలో గల ఆసక్తికరమైన కథను గమనించండి:

## మహిషాసురుని మర్దనం

ఒకానొకప్పుడు అసురులు మహిషుని నాయకత్వాన యుద్ధంలో దేవతలను ఓడిస్తారు. ఆ దేవతలు ఆగ్రహోదగ్రులు కావటంలో తమ నుంచి ఒక్కొక్క శక్తి బయటికి వచ్చి చండిక రూపం తీసుకుంటాయి. వారామెకు తమ ఆయుధాలు ప్రతిరూపాలను, కంఠమాలలను, కమల పుష్పాల మాలలను కూడా ఇస్తారు. వాహనంగా సింహాన్నిస్తారు. నాగరాజు నాగులమాలను, వాటి శిరస్సుపై ఉండే మణులమాలను ఇస్తాడు. చండికను చూసిన మహిషుడు ఎవరీమె అని గర్జిస్తూ సింహంపై దాడి చేస్తాడు. చండిక ఆ మహిషుని శిరస్సును ఖండించగా చేతిలో ఖడ్గంతో మనిషి అవుతాడు. ఆ తర్వాత ఏనుగై, చివరకు తిరిగి మహిషుడవుతాడు. అపుడు చండిక నవ్వి ఒక దివ్యపానాన్ని స్వీకరించగా తన కళ్లు ఎరుపెక్కుతాయి. ఆ పానంతో తన నోరు ఎరుపవుతుంది. అపుడు మహిషాన్ని మెడపై కాలితో తన్నగా దాని నోటి నుంచి ఆ అసురుడు సగం మేర బయటపడతాడు. అపుడు చండిక తన శిరసును ఖండిస్తుంది.

భారతదేశంలో నేటికీ మహిషాలను బలిచ్చే సంప్రదాయం ఉంది. దానికి ఈ కథతో సంబంధం కల్పించారు. ద్రౌపదిని దేవతగా ఆరాధించే ఒక శాఖ వారు ఈ బలివ్వటం కూడా ఉంది. కాళీమాతకు మేకలను, ఇతర జంతువులను బలివ్వటం సర్వసాధారణం. జంతువు తలను కోసి, ఆ రక్తాన్ని దేవతకు పానంగా సమర్పిస్తారు. దానినట్లుంచితే, ఈ కథలో చండికకు గల శక్తులు తననుంచిగాక దేవతల నుంచి లభించినట్లు చూపటం గమనించదగ్గది. జానపదులలోని అసలు కథ ఒకటి కాగా, దానిని సంస్కృతంలోకి మార్చినపుడు బ్రాహ్మణులు ఆపని చేసారనుకోవాలి. భారతదేశంలోని స్త్రీ దేవతలలో కొందరు 'వక్షోజ దేవతలు' కాగా, కొందరు 'దంత దేవత' లని ఎ.కె. రామానుజన్ ఒకసారన్నాడు. మొదటి తరహావారు తమ భర్తలకు విధేయులుగా ఉంటారు. ఎక్కువమంది సంతానవతులు కారు. ఒకోసారి పిల్లలను పెంచుకుంటారు. దేవి ఒక

మహామాత. కాని తన సంతానం గురించి మనకేమీ తెలియదు. వీరికి భిన్నంగా రెండవ తరహా స్త్రీ దేవతలు అవివాహితలు. భయంకరులు. తరచు అదుపు తప్పి ప్రవర్తిస్తారు. వధిస్తారు. వారికీ సంతానముండదు. అంతేకాదు. ఒకోసారి వారి కంఠాలలో చిన్నపిల్లల శిరస్సులతో చేసిన హారాలు కన్పిస్తాయి. పిల్లల ఖండిత హస్తాలతో చేసిన హారాలను నడుము చుట్టూ ధరిస్తారు. దేవీ మహాత్మ్యంలో చండికను అంబిక అనీ పేర్కొంటారు. ఆమె 'శక్తి' కూడా.

శివుని భార్యలలో ఒకరైన సతీదేవి పాత్ర నిజ జీవితంలో కూడా స్త్రీలకు సంబంధించి ఉంది. ఆమె పేరిట సతీసహగమనాలు తెలిసినవే. వాస్తవానికి దక్షుని కుమార్తె, శివుని భార్య అయిన సతీదేవి సహగనమంటూ ఏమీ చేయలేదు. శివుడు మరణించనూలేదు. కాని అగ్నివల్ల, అది కూడా తన అంతరాగ్ని వల్ల మరణిస్తుంది గనుక ఆ పేరిట సహగమనాలు జరిగాయి. తర్వాతి కాలంలో సరైన ధర్మాన్ని అనుసరించే స్త్రీలు తమ భర్తలపట్ల ఆ స్థాయిలో విధేయులై ఉండాలన్నది అందులోని సూత్రం.

సతి మరణించి పార్వతిగా పునర్జన్మిస్తుంది. అపుడు బ్రహ్మచారిగా ఉండిన శివుడిని ఆమె మన్మథుని సహాయంతో గెలుచుకుంటుంది. పార్వతి హిమ పర్వతాల తనయ. శివుడు అవే పర్వతాలలో కైలాస పర్వతంపై నివసిస్తాడు. తన లక్షణాలు రూపు ఎవరూ తమ కుమార్తెను ఇవ్వదలచుకునే విధంగా ఉండవు. అయినా పార్వతి తనను ప్రేమిస్తుంది. వివాహం తర్వాత సంతానాన్ని పార్వతి కోరుకోగా శివుడు ఎంతమాత్రం అంగీకరించడు. పెద్ద కుమారుడైన స్కంధుడిని ఆయన పార్వతితో సమాగమం లేకుండా తనంతట తానే కంటాడు. అందుకు ఆగ్రహించిన పార్వతి ఇతర దేవతలకు కూడా సంతానం కలగరాదంటూ శపిస్తుంది. తర్వాత వినాయకుని ఉదంతం తెలిసిందే. పిండి బొమ్మకు ప్రాణం పోయటం ద్వారా ఉనికిలోకి వస్తాడాయన. ఈ విషయమై వేర్వేరు కథలు ప్రచారంలో ఉండటాన్ని అట్లుంచితే, స్కంధుడు కేవలం శివుని సంతానం కాగా, గణేశుడు కేవలం పార్వతి సంతానం కావటం విశేషం.

పోతే, పురుష దేవతలకు వలె స్త్రీ దేవతలకు కూడా తమ వాహనాలుంటాయి. అవి జంతువులు, లేదా పక్షులు కావచ్చు. శివునికి నంది, స్కంధునికి నెమలి, గణేశునికి మూషికంవలె, పార్వతికి వాహనం సింహం. చండిక, కాళి కూడా సింహాన్నే ఉపయోగిస్తారు. ఒకోసారి పెద్దపులిని.

పోతే ఈ కాలంలో వైదిక కర్మకాండలకు బదులు పురాణ కర్మకాండలు అమలుకు వచ్చాయి. వైదిక కర్మలు భంగపడిన జీవితాలను తిరిగి జోడించగలవని భావించారు. పురాణ కర్మకాండలు ఆ పని చేయటంతో పాటు గత కాలపు లోపాలను, వెనుకటి సంస్కృత రచనలలోని కొరతలను పూరించగలవని అభిప్రాయపడ్డారు. అనేక పురాణాలు వాటిని చదివినవారికి, విన్నవారికి మోక్షం లభించగలదని హామీ ఇస్తాయి. కాని ఆ

భక్తులతో అధికులు బ్రహ్మలో లీనం కావాలని గాక, తమ దేవుడు ఏ పరలోకంలో ఉంటాడో అక్కడకు వెళ్లాలని కోరుకుంటారు.

పురాణాలలో ప్రతి సమస్యకు, లేక అపరాధానికి ఒక పరిష్కారం ఉండటం విశేషం. ఉదాహరణకు శ్రీకృష్ణుని సోదరుడు బలరాముని కథ ఒకటి మార్కండేయ పురాణంలో ఉంది.

## మద్యంతో చిత్తం కోల్పోయిన బలరాముడు

శ్రీకృష్ణుని సోదరుడైన బలరాముడు ఒకరోజు బాగా మద్యం సేవించి, కళ్లు ఎరుపెక్కగా, కాళ్లు తడబడుతూ అటు ఇటు తిరగసాగాడు. ఆ విధంగా ఒక అడవి వద్దకు చేరగా అక్కడ విద్వత్తును నేర్చిన బ్రాహ్మణులు కొందరు ఒక రథచోదకుని కథాగానాన్ని వింటున్నారు. ఆ రథ చోదకుడు బ్రాహ్మణునికి బదులు కథాగానం చేస్తున్నాడు. బలరాముడిని గమనించిన బ్రాహ్మణులు తను మద్యాన్ని సేవించి ఉన్నట్లు గ్రహించి వెంటనే లేచి నిల్చుంటారు. కాని రథ చోదకుడు ఆ పని చేయడు. అందుకు ఆగ్రహించిన బలరాముడు తనను కొట్టి ప్రాణాలు తీస్తాడు. దానితో బ్రాహ్మణులు వెంటనే అడవిని విడిచి వెళ్లిపోతారు. వారు తనను ఆ విధంగా వదలిపోవటాన్ని, తన శరీరం రక్తపువాసన వేయటాన్ని గమనించిన బలరాముడు తను బ్రహ్మహత్యాదోషానికి పాల్పడినట్లు తెలుసుకుంటాడు. దానితో తన ఆగ్రహాన్ని, మద్యాన్ని, తన అహంకారాన్ని, క్రౌర్యాన్ని శపిస్తాడు. తన దోషం నుంచి విమోచన పొందేందుకు పన్నెండేళ్లపాటు సరస్వతీ నదికి అభిముఖంగా యాత్ర చేస్తాడు.

రథసారథి నిమ్న కులస్తుడైనా అందుకు భిన్నంగా కథాగానం చేయడమంటే ప్రవాహానికి ఎదురీదడమన్నమాట. కనుక బలమరాముని యాత్ర కూడా సరస్వతీనది సముద్రంలో కలిసే చోటు నుంచి ఆరంభమై దాని స్రోతస్సు దిశగా సాగుతుంది. రథసారథి పుట్టుకతో బ్రాహ్మణుడు కాకపోయినా కొన్ని విధాలుగా వారితో సమానుడు కావటం, జ్ఞానవంతుడవటం, నిజమైన బ్రాహ్మణుల దృష్టిలో తనకాస్థాయి ఉండటాన్ని బట్టి తను బ్రహ్మ హత్యాపాతకానికి ఒడిగట్టినట్లేనని బలరాముడు భావిస్తాడు. రథసారథి తన పట్ల గౌరవంతో లేచి నిలబడాలనుకోవటం తన అహంకారం. ఈ విధంగా తన దోషాలను అంగీకరించి యాత్ర చేయటం తన ఆగ్రహానికి, క్రూరత్వానికి తనకు తాను విధించుకున్న శిక్ష. మొత్తానికి పురాణాలలో ఈ విధంగా ప్రతి సమస్యకు పరిష్కారం కన్పిస్తుంది.

## అధ్యాయం 15

# తాంత్రిక పురాణాలు, తంత్రాలలో శాఖలు, శృంగారం

## క్రీ.శ. 600 - 900

**కాలక్రమణిక (అన్నీ క్రీ.శ. సంవత్సరాలు)**

| | | |
|---|---|---|
| 550–575 | : | ఎలిఫెంటాలో శివునికి గుహాలయాన్ని నిర్మించిన కాలచూరులు |
| 606–647 | : | కన్నౌజ్ రాజధానిగా హర్షుని పాలన |
| 630–644 | : | భారతదేశానికి హ్యూన్‌త్సాంగ్ రాక |
| 650–800 | : | తొలి తాంత్రిక రచనలు |
| 765–773 | : | ఎల్లోరాలో కైలాస దేవాలయాన్ని నిర్మించిన మొదటి రాజక్రిష్ణ |
| 900, 1150 | : | ఖజురహోలో దేవాలయాలను నిర్మించిన ఛందేల రాజులు |
| 1238–1258 | : | కోణార్క్ దేవాలయాన్ని నిర్మించిన మొదటి నరసింహదేవుడు |

### కాల్పనిక కల్పనలతో ఉపయోగమేమిటి?

*ఒకవేళ పురుషులు తమ మనసులలో ఊహించుకునే శరీరాకృతులు తమకు రసానందాన్ని కలిగించగలిగితే, తమ కలలలో ఊహించుకునే రాజ్యాలతో తప్పక రాజులు కూడా కాగలరు. భగవంతుడు మట్టి, రాజు, లోహం, దారు శిల్పాలలో ఉన్నట్లు నమ్ముతూ, సరైన జ్ఞాన సముపార్జన చేయకుండా తమను తాము సన్యాసంతో కృశింప జేసుకునేవారు ఎప్పటికీ మోక్షాన్ని పొందలేరు. నిరాహారులై శక్తి హీనులుగా మారినా, కోరినదల్లాతిని ఉదరాలను పెంచినా, అంతిమ సత్యమేదో గ్రహించనివారికి చికిత్స ఎక్కడిది? మనుషులు గాలిని, ఆకులను, ఏవో చిన్న ఆహారపు ముక్కలను, నీటిని ఆహారంగా తీసుకుని మోక్షాన్ని సాధించగలిగితే, అపుడు పశువులు, పక్షులు, చేపలకు కూడా మోక్షం లభిస్తుంది.*

– మహానిర్వాణ తంత్ర

తంత్రాలు అనే శాస్త్రాలు నిరాహారం, సన్యాసం సహా సంప్రదాయిక హిందూ మతంలోని అనేక అంశాలను సవాలు చేస్తాయి. అందులో భాగంగా దేవతా విగ్రహాలను, కల్పనలను కూడా అపహాస్యం చేస్తాయి. కాని అందుకు బదులు తమ కల్పనలను,

చిత్రాలను ముందుకు తెచ్చి, ఆ పద్ధతిలో పూజలు చేసేవారిని దేవతలుగా మార్చగలమంటాయి. తాంత్రిక మార్గం యధాతథంగా మొత్తం హిందూ మతాన్ని సవాలు చేసింది. బ్రాహ్మణుల భావనలు, కల్పనలు కొన్నింటిని నిజంగానే తలకిందులు చేయగలిగింది. హిందూ మతంలో తాంత్రికేతరమైన కేంద్రం ఒకటుంది. తాంత్రిక మార్గం ఆ కేంద్రానికి బయటి వర్తులంలో గల అనేక అంశాలలో ఒకటి. అయినప్పటికీ అది ఆ కేంద్రాన్ని ధిక్కరించి నిలువగలిగింది.

హిందూ తంత్రం గురించి మనం ఏమనదలచుకుంటామో దానిని బట్టే మన నిర్వచనాలు ఆధారపడి ఉంటాయి. కొందరు విద్యావేత్తలు గానిని సాధారణంగా స్త్రీ దేవతలతో, శివునితో సంబంధంగల వేదాంత శాస్త్రంతో ముడిబెట్టి నిర్వచిస్తారు. అయితే అటువంటి నిర్వచనం తంత్ర శాస్త్రాలకు ప్రత్యేకం కాదు. కొందరు సామాజిక దృక్పథాన్ని బట్టి నిర్వచిస్తారు. అవి తాత్త్విక దృష్టికే విరుద్ధమైనవి. కాని అది కూడా తంత్ర శాస్త్రానికి ప్రత్యేకమైనది కాదు. మరికొందరు తాంత్రిక క్రతువులను బట్టి నిర్వచిస్తారు. ఆ క్రతువులను అనుసరించి తరచు శారీరకమైన స్రావాలను ఉదరంలోకి ప్రవేశపెడతారు. ముఖ్యంగా శృంగార స్రావాలను. తంత్రంలో అదొక ప్రత్యేకత.

## హర్షుని కాలంలో భారతదేశం

గుప్తుల పతనం తర్వాత క్రీ.శ. ఏడు, ఎనిమిది శతాబ్దాల కాలంలో దేశంలో పెద్ద సామ్రాజ్యమేదీ లేని దశ తిరిగి మొదలైంది. ఆ సమయంలో మార్పులు, సృజనాత్మకత మరోమారు వెల్లివిరిసాయి. కొత్త కులాలు, శాఖలు, ప్రాంతీయ రాజ్యాలు ఏర్పడ్డాయి. వాటిలో హర్షుని (606–47) రాజ్యమొకటి. సమకాలీనులైన ఇతర రాజులకన్న మనకు హర్షుని గురించిన సమాచారం ఎక్కువ తెలుసు. అందుకు మూడు కారణాలున్నాయి. ఆయన ఆస్థానకవి బాణుడు తనపై హర్ష చరితమనే కావ్యం ఒకటి రాసాడు. దాని నిండా పొగడ్తలు ఉన్నప్పటికీ, ఆస్థాన పరిస్థితులు, జీవితం ఏ విధంగా ఉండేదో అది వివరిస్తుంది. రెండు శతాబ్దాల క్రితం గుప్తుల కాలంలో భారత దేశాన్ని సందర్శించిన ఫాహియాన్ స్ఫూర్తితో, ఇపుడు అదే దేశం నుంచి యువాన్ త్సువాంగ్ అనే మరొక యాత్రికుడు 630–44 మధ్య ఇక్కడ గడిపాడు. ఆయన తిరిగి వెళ్లేటపుడు ఇరవై గుర్రాలు మోయగలిగినన్ని బౌద్ధ మత సంబంధ రచనలను, అవశేషాలను తనతోపాటు తీసుకుని వెళ్లాడు. తను భారతదేశం గురించి ప్రత్యక్ష సాక్షిగా చేసిన సుదీర్ఘ వర్ణనలలో హర్షుని పరిపాలనా విశేషాలు కూడా ఉన్నాయి. ఇవి గాక హర్షుడు స్వయంగా మూడు సంస్కృత నాటకాలు రచించాడు. వాటిలో రెండు ఆస్థాన జీవితాన్ని వివరించి చెప్తాయి.

ఒక శక్తివంతమైన కుటుంబానికి చెందిన హర్షుడు గంగా–యమునా నదుల మధ్యగల సారవంతమైన ప్రాంతాలను పరిపాలించాడు. ఆ విధమైన తన రాజ్యాన్ని నేపాల్,

అస్సాం వరకు, హిమాలయాల నుంచి నర్మద వరకు, ప్రస్తుతం గుజరాత్‌గా ఉన్న కఠియావాడ్, సౌరాష్ట్రవరకు విస్తరింపజేసాడు. అధికార కేంద్రాన్ని ఉజ్జయిని, పాటలీపుత్రల నుంచి కన్నౌజ్‌కు మార్చాడు. ఆ నగరం ప్రస్తుత కాన్పూర్‌కు సమీపాన ఉంది. హర్షుడు రాజైన తొలి దశలో చేసిన యుద్ధాల తర్వాత రాజ్యంలో శాంతి నెలకొంది. ఆయనకు వారసులు లేకపోవటంతో తన అనంతరం మంత్రి ఒకరు రాజయ్యాడు. ఆ మంత్రి మరణానంతరం రాజ్యం ఎక్కువ కాలం నిలువలేదు.

తన నాయనమ్మ, లేదా అమ్మమ్మ ద్వారా హర్షుడు గుప్తుల వంశానికి చెందినవాడే. ఆయన సోదరి రాజ్యశ్రీ కన్నౌజ్ పాలకుడైన ముఖారి వంశీకుడిని వివాహమాడింది. బాణుడు రాసిన దాని ప్రకారం ఒక యుద్ధంలో ఆయన మరణించగా రాజ్యశ్రీ బందీ అయింది. శత్రువు నుంచి తప్పించుకుని వింధ్య పర్వతాల ప్రాంతానికి పారిపోయిన ఆమె సతీ సహగమనం చేయనుండగా హర్షుడు ఆపుతాడు. అపుడామె బౌద్ధ సన్యాసిని కాగోరగా వద్దని నచ్చ చెప్తాడు. తన ద్వారా ముఖారి రాజ్యాన్ని నియంత్రించ వచ్చునన్నది ఆయన ఆలోచన. ఆ కాలంలో సతీసహగమనం ఒక తీవ్రమైన సమస్య అని బాణుడు భావించినట్లు తన రచనలోని ఒక భాగాన్ని బట్టి గ్రహించవచ్చు. అది ఈ విధంగా ఉంది:

> విచారం ముప్పిరిగొన్నవారు జీవితాన్ని సులభంగా త్యాగం చేస్తారు. కాని తీవ్రమైన సమస్యలు ఎదురైనపుడు జీవితాన్ని నిలుపుకోవాలంటే చాలా ప్రయత్నం అవసరం. భర్తను మరణంలోనూ అనుసరించాలనే (అను మరణ) ఆలోచన అర్థం లేనిది. విద్యలేనివారికే అది తగినది. మోహావేశపరులైన వారికి అదొక కాలక్షేపం వంటిది. అజ్ఞానులు అనుసరించే మార్గమది. వెనుక ముందుల ఆలోచనలేని చర్య. పరిస్థితుల పట్ల సంకుచిత దృష్టి. ఎంతో అజాగ్రత్తతతో కూడినది. తండ్రో, సోదరుడో, స్నేహితుడో, భర్తో మరణించాడని నీ ప్రాణాన్ని తీసుకోవటం అవివేకంతో కూడిన తప్పు. ప్రాణం దానంతట అది పోతే తప్ప దానిని వదలకూడదు. ఆ విషయమై ఆలోచిస్తే అందులో నీ స్వార్థం మాత్రమే కనిపిస్తుంది. ఎందుకంటే నీకు కలిగిన బాధ నుంచి నువు విముక్తి చెందాలనుకుంటున్నావు. అప్పటికే మరణించిన వ్యక్తికి అందువల్ల కలిగే ఉపయోగం లేదు. అన్నింటి కన్న ముందుగా, ఆ వ్యక్తి ప్రాణం తిరిగి వచ్చేది కాదు. ఆయన గుణగణాలను పెంచేది కాదు. తాను ఒకవేళ నరకానికి వెళ్లవలసి ఉంటే కాపాడలేదు. ఈ చర్య ద్వారా తనను చూడగలగటమూ జరిగేది కాదు. తనను తిరిగి కలవలేవు కూడా. మరణించిన వ్యక్తి పక్వానికి వచ్చిన ఫలం వలె తనకు తగిన చోటికి చేరుతాడు. అందుకు భిన్నంగా, తన జీవితాన్ని త్యజించే వ్యక్తి ఆత్మహత్య అనే పాపానికి పాల్పడతాడు. అందువల్ల ఇరువురిలో ఎవరికీ ప్రయోజనం లేదు. కాని జీవించి ఉండటం వల్ల ఇతరులకు

నీరివ్వటం, చేతులు జోడించటం, కానుకలు ఇవ్వటం వంటి చర్యల ద్వారా మృతి చెందినవారి కోసం, స్వయంగా తమ కోసం ఎంతో చేయగలరు.

బాణుడు చెప్పిన ఈ అద్భుతమైన మాటలలో వైరుధ్యమన్నది ఎక్కడా లేదు. వాటిలో ఒక ధార్మికుడైన హిందువు ఎంతో సున్నితంగా, ప్రేమపూర్వకంగా, మానవతతో, ఆర్ద్రతతో, సహేతుకమైనరీతిలో సతీ సహగమనానికి వ్యతిరేకంగా హితవు చెప్పటం, వాదించటం ఉంది. హర్షుని కాలంలో ఆ సంప్రదాయం పట్ల గల వ్యతిరేకతకు ఇదొక గొప్ప ఉదాహరణ.

హర్షుడు విశాల దృష్టి గల ఉదారుడైన రాజు. కళలను, అన్ని మతాలను ఆదరించాడు. తన ఆస్థానంలో బాణునితో పాటు మయూరుడనే మరొక ప్రసిద్ధకవి, మాతంగ దివాకరుడనే విమర్శకుడు, నాటక రచయిత ఉండేవారు. దివాకరుడు చండాలుడు, లేదా జైనుడనే అభిప్రాయం ఉంది. హర్షుని నాటకాలలో దేవాలయపూజల గురించి లేదు. వసంత కాలంలో ప్రజలు వీధులలో నృత్యం చేస్తూ, ఇప్పటి హోలీవలె ఒకరిపై ఒకరు ఎర్రరంగు చల్లుకోవటం గురించి రాసాడాయన. అదిగాక, తమ నివాస భవనానికి బయట ఒక చిన్న గుడిలో రాణి కౌముదిని పూజించటం గురించి కూడా పేర్కొన్నాడు. హర్షుడు సర్వధర్మ సమభావం కలవాడు. తన నాటకాలలో రెండింటిని శివునికి, నాగానందమనే మూడవ దానిని బుద్ధునికి అంకితమిచ్చాడు. ఆ నాటక కథాంశంలో హిందూ, బౌద్ధ అంశాలు రెండూ ఉన్నాయి. ఒక రాజు గరుడునికి బలిగా సర్పాలను ఇవ్వటానికి బదులు తన శరీరాన్ని ఇచ్చేందుకు సిద్ధపడతాడు. ఇందులో మహా భారతంలో జనమేజయుని సర్పయాగంతోపాటు, శిబిచక్రవర్తి కథాఛాయలున్నాయి. జంతువుల పట్ల హింస కూడదనే ఉద్యమం వంటిది హర్షుని కాలంలో ఉండినట్లు హ్యూన్ త్సాంగ్ పేర్కొన్నాడు. భారతీయులు ఎద్దు (లేక ఆవు), గాడిద, ఏనుగు, గుర్రం, పంది, శునకం, నక్క, తోడేలు, సింహం, కోతి, ఇంకా శరీరంపై జుట్టుగల ఇతర జంతువుల మాంసం తినరాదనే నిబంధన ఉన్నట్లు రాసాడాయన. అట్లా తినేవారిని రోసించేవారు.

హర్షుడు తన జీవితపు మలిదశలో బౌద్ధాన్ని స్వీకరించి ఉంటాడు. తను చైనాకు బౌద్ధ ప్రతినిధి వర్గాన్ని పంపటం, హిందువుల పవిత్ర క్షేత్రమైన ప్రయాగలో బౌద్ధ సభలు నిర్వహించి అక్కడ అన్ని మతాల వారికి దానాలు చేయటం మనకు తెలుసు. తన కాలంలో బౌద్ధం దక్షిణ భారతంలో క్షీణిస్తూ, ఉత్తర దేశంలోని కొన్ని ప్రాంతాలలో బలహీన పడుతుండినా, బీహార్, బెంగాల్‌లోని పెద్ద ఆరామాలలో ఇంకా ప్రవర్ధమానమవుతూనే ఉంది. అప్పటి సింధూ రాజు శూద్రుడని, బౌద్ధాన్ని అమితంగా గౌరవించేవాడని హ్యూన్‌త్సాంగ్ రాసాడు.

## తాంత్రిక పురాణాలు

### తాంత్రికత ఆరంభ దశలోని శైవ శాఖలు

తాంత్రికత మూలాలు ఏమిటో కనుగొనేందుకు పరిశోధకులు చాలా ప్రయత్నించారు. అందుకు ఆధారాలు అనేకం ఉన్నాయి. అనేకచోట్ల ఉన్నాయి. వాటి కాలాన్ని కనుగొనటం మాత్రం కష్టం. ఏవో కొన్ని తాంత్రిక లక్షణాలతో అనేక శాఖలు క్రీ.శ. మొదటి సహస్రాబ్ది తొలి శతాబ్దాలలో కనిపించాయి. తర్వాత వెనుదిరిగి పరిశీలించినపుడు అదంతా తాంత్రికత అయినట్లు బోధపడింది. శాక్త తంత్రాలను అనేక శైవ పురాణాలు వర్ణించాయి. శక్తి దేవతకు అంకితం చేసిన వాటిని శాక్త తంత్రాలన్నారు. తాంత్రిక ఆలోచనలకు మూలాలు గల ఆధారాలు కాలగర్భంలో కలసిపోయాయి. కాని అవి ఒక పాఠం రూపంలో మొదట పురాణాలలో కన్పిస్తాయి. తర్వాత తాంత్రిక శాస్త్రాలు రూపొందాయి. అందువల్ల మనం క్రీ.శ. 600 నుంచి 900 సంవత్సరాల కాలంలో రచించిన పురాణాలలోని కాల్పనికతలను పరిశీలించినపుడు గాని, తాంత్రిక విధులకు ఆధారమైన కాల్పనికతలు ఏమైనదీ అర్థంకాగల అవకాశంలేదు.

తాంత్రికత ప్రాథమిక దశ అనదగ్గ పురాణాలతోపాటు మరికొన్ని లిఖిత ఆధారాలలో, శిలాశాసనాలు, లోహఫలకాలలో చెదురుమదురుగా కనిపిస్తుంది. క్రీ.శ. మొదటి శతాబ్దంలో లకులిశ అనే ముని, పశుపతుల శాఖ నొకటి ఏర్పాటుచేసాడు. శివుడిని పశుపతి రూపంలో ఆరాధించేవారు పశుపతులు. ఆ తర్వాత శతాబ్దాలలో మరింత మంది తమను తాము అదే పేరుతో గుర్తుంచుకోసాగారు. క్రీ.శ. 381 నాటి పశుపత శాసనం ఒకటి, లకులిశునికి పదకొండు తరాల గురువులున్నట్లు పేర్కొంటుంది. మహాభారతంలో ఈ ప్రస్తావన ఉంది, స్వయంగా తంత్రశాస్త్రాలలో ఇందు గురించి రాయటం చాలాకాలం తర్వాత మొదలవుతుంది. తాంత్రికతను కూర్మపురాణం ఖండించగా, లింగ పురాణంలో వారి ధర్మాలు, నియమాల ప్రస్తావనలు కొన్నున్నాయి. తాంత్రికులు స్మశానాలలో నివసించేవారు. కనుక వారు పారియాలు, అంటరానివారు. వారి సంప్రదాయంలో రక్తం, మాంసం, మద్యం, వీర్యాలను నైవేద్యంగా అర్పించటం ఉండేది. సంభోగ క్రియలు కులాలలో నిమిత్తం లేకుండా జరపటం కూడా పూజాదికాలలో భాగమే. స్మశాన భూముల ప్రస్తావనలు అంతకన్న ముందటివైన పరిత్యాగుల కథలలో కనిపిస్తాయి. అవి తర్వాత శివునితో సంబంధంగల కాల్పనిక గాథలలోకి వచ్చి, ఇంకా ఆ వెనుక తాంత్రిక సంప్రదాయాలలో చేరాయి.

పశుపతులు అహింసాత్మకమైన పద్ధతిలోనే తీవ్రమైన విధంగా వ్యవహరించటమన్న దానికి కొత్త నిర్వచనం చెప్పారు. మర్యాదస్తులను భ్రష్టులను చేయటంలో చాలా దూరం

వెళ్లారు. బహుశా లకులిశుడు స్వయంగా రచించిన పశుపత సూత్ర, కొత్తగా తాంత్రిక మార్గంలోకి వచ్చిన వారికి, ఇతరుల పట్ల ఒక ప్రేతం వలె వ్యవహరించాలని ఉపదేశిస్తుంది. ఇతరులపై గురకపెట్టటం, బిగ్గరగా మాట్లాడటం, శరీరాలను గజగజలాడించి ఊపటం, హీనంగా ప్రవర్తించటం, అసభ్యకరంగా మాట్లాడటం వంటివి చేయాలంటుంది. అపుడు వారు తమపట్ల అనుచితంగా వ్యవహరించినట్లయితే తన చెడు కర్మల ఫలితం వారికి పోయి, వారి మంచి కర్మల ఫలితం తమకు లభిస్తుందని చెప్తుంది. సత్కర్మల ఫలాన్ని ఇతరులకు ఉద్దేశపూర్వకంగా బదిలీ చేయటం, తమకు తెలియకుండా దుష్కర్మలు చేసి ఆ ఫలాన్ని మూటకట్టుకోవటం అనే భావనలను పూర్తిగా కొత్త విధంగా మల్చి చూడటమిది. ఈ తాంత్రిక సూత్రంలో చెడు కర్మల ఫలాన్ని ఉద్దేశపూర్వకంగా ఇతరులకు బదిలీ చేస్తారు. వాస్తవానికి ఈ పశుపతులు పూర్తిగా సత్స్వభావులు. మద్యం సేవించినట్లు, ఇతరుల పట్ల అసభ్యంగా ఉంటున్నట్లు నటిస్తారు మాత్రమే. కాని అది గ్రహించని ఇతరులు పశుపతులను అనవసరంగా అనుమానించి నిందిస్తారు. దానితో వారి సత్కర్మఫలం పశుపతులకు, వారి దుష్కర్మఫలం ఇతరులకు లభిస్తాయి. అయితే, పశుపతులు మోసపూరితంగా వ్యవహరించటం ద్వారా ఇతరులను బాధించటం, ఆ కారణాన తమ సత్కర్మ ఫలం కొంత ఇతరులకు బదిలీ కావటం గురించి ఎవరూ వ్యాఖ్యానించినట్లు లేరు.

తొలికాలపు రచన ఒకటి పశుపతులను వర్ణిస్తూ వారు సంచారులని, పై భాగంలో కపాలాన్ని బిగించిన దండం ఒకటి వారి చేతిలో ఉంటుందని, కపాలాన్ని భిక్షాపాత్రగా ఉపయోగిస్తారని, మనుషుల ఎముకలతో చేసిన మాలలు ధరిస్తారని, శవాలను దహనం చేసిన బూడిద పూసుకుంటారని, శిరోజాలు జడలు కట్టి ఉంటాయని, లేదా శిరోముండనం చేసుకుంటారని, రుద్రుని అనుకరిస్తారని (రుద్రుడు శివునికి వేదకాలపు రూపం) పేర్కొంది. బ్రాహ్మణుడిని హత్య చేసిన మనిషి ఏ రూపంలోకి మారాలని మనువు రాసాడో దానికి ఈ వర్ణనకు పోలిక ఉండటం గమనించదగ్గది. "బ్రాహ్మణుని హత్యకు పాల్పడిన వాడు తనను తాను శుద్ధిపరచుకునేందుకు అడవిలో పూరిల్లు వేసుకుని అక్కడ పన్నెండేళ్లపాటు నివసించాలి. భిక్షాటన చేసిన ఆహారాన్ని స్వీకరించాలి. కపాలాన్ని తన జండా గుర్తుగా ఉపయోగించాలి" అన్నాడు మనువు. దీనినంతా రుద్రుడిని అనుకరించటమని ఎందుకు భావించాలి? ఎందుకంటే శివుడు బ్రహ్మ హంతకుడు గనుక. అది బ్రాహ్మణ హత్యవంటిదే.

## కపాలధారి అయిన శివుడు

పశుపతులు తర్వాత కాలంలో కాపాలికులనే (కపాల ధారులు) శాఖగా మారారు. వారు పశుపతులవలె ఇతరుల పట్ల హీనంగా ప్రవర్తించే పద్ధతిని మానుకున్నారు. భిక్షాటనకు మాత్రం కపాలాన్నే ఉపయోగించేవారు. వారు తమ శాస్త్రాలు తాము రాసుకున్నారు. కాపాలికుల మూలాల గురించిన కథలు అనేక పురాణాలలో ఉన్నాయి. వాటిలో ఒకటి చూడండి:

## బ్రహ్మ శిరస్సు ఖండించిన శివుడు

బ్రహ్మ, సరస్వతిని కోరుకుని తనతో సహజీవనం చేయవలసిందిగా అడుగుతాడు. తను ఎప్పుడూ మొరటుగా మాట్లాడతాడని అంటుందామె. ఒకరోజు శివుడు బ్రహ్మను కలిసినపుడు, తన (బ్రహ్మ) అయిదవ శిరస్సు అప్రియమైన శబ్దమేదో చేయటంతో శివుడు దానిని ఖండిస్తాడు. ఆ కపాలం శివుని చేతికి అంటుకుని ఉండిపోతుంది. శివుడు కావాలనుకుంటే దానిని దగ్ధం చేయగలడు కాని వారణాసికి చేరేవరకు దానితోనే సంచరిస్తాడు.

వేదాలలో ఇటువంటి కల్పనే ఒకటుంది. ప్రజాపతి తన కుమార్తె ఉషతో శృంగారం జరపగా అందుకు శిక్షగా రుద్రుడు ఆయన శిరస్సును ఖండిస్తాడు. మరొక కథలో ఇంద్రుడు ఒక బ్రాహ్మణుడిని వధించగా, ఆ పాతకం ఒక స్త్రీగా మారి తనకు అతుక్కుని పోతుంది. ఇపుడు బ్రహ్మ తన కుమార్తెను కాదుగాని, తాను వివాహమాడ గోరిన సరస్వతిపై దాడిచేస్తాడు. సరస్వతి వాగ్దేవి అయినందున, అసభ్యంగా మాట్లాడినందుకు ఆయనను మందలిస్తుంది. బ్రహ్మకు గల ముఖాలు నాలుగైనా ఒకోసారి పంచముఖుడంటాడు. ఈ కథలో మాత్రం చతుర్ముఖుడవుతాడు. శివుడు బ్రహ్మ శిరస్సును "అందరికోసమని" భరిస్తాడు. తాంత్రిక సంప్రదాయాల సమర్థనకు సాక్షాత్తూ శివుడిని రంగంలోకి తేవటమిది. ఈ కథ కొన్ని ఇతర రూపాలలో కూడా కనిపిస్తుంది. తన భక్తుల కోసం శివుడు సముద్ర మథనంలో వెలువడిన గరళాన్ని స్వీకరించి తన కంఠంలో శాశ్వతంగా నిలుపుకోవటం, బ్రహ్మ చర్యాన్ని శాశ్వతంగా పాటించదలచుకుని కూడా పార్వతిని వివాహమాడటం వంటివి కూడా చేస్తాడాయన.

### సతి, శాక్త దేవాలయాలు

శివుడు బ్రహ్మ శిరస్సుతో సంచరించేవాడనే కథా సందర్భంలో, తొలి పురాణాలలోని సతి – దక్షుని కథ మళ్లీ ముందుకు వస్తుంది. ఈ కొత్త కథలో శివుడు దక్షుని శిరస్సును ఖండించి, సతి శవంతో పాటు సంచరిస్తాడు.

## సతి శవాన్ని విచ్ఛిన్నం చేయటం

దక్షుడు శివుని పట్ల, తన కుమార్తె అయిన సతిపట్ల ద్వేషం సృష్టించుకుంటాడు. తండ్రి తన భర్తను అవమానించటంతో తన సతీ ధర్మాన్ని ప్రదర్శించేందుకు సతి తన యోగాగ్నితో తనను తాను దగ్ధం చేసుకుంటుంది. అపుడు శివుని ఆగ్రహం ముల్లోకాలను దగ్ధం చేస్తుంది. శివుడు దక్షుని శిరస్సును ఖండిస్తాడు. తర్వాత శివుడు దక్షునికి ఒక మేక తలనిచ్చి తనను జీవింపజేస్తాడు. కాని, దగ్ధమవుతున్న సతిని చూసి ఆమె శరీరాన్ని భుజంపై ఉంచుకుని పదేపదే రోదిస్తాడు. ఏమి చేయాలో తోచక అదే విధంగా సంచరిస్తుండటంతో దేవతలు ఆందోళన చెందుతారు.

విష్ణువు వెంటనే తన విల్లంబులతో సతి శరీర భాగాలను ఖండించగా అవి పలుచోట్ల చెల్లాచెదురుగా పడతాయి. అవి పడిన ప్రతిచోట శివుడు భిన్న రూపాలు తీసుకుని, "ఈ చోట్ల ఎవరైతే మహామాతను పూజిస్తారో వారికి తీరని కోరికంటూ ఉండదు. ఆమె తన శరీరభాగాలలో ఉంది. వారి ప్రార్థనలు నెరవేరుతాయి" అంటాడు. సతితో ఎడబాటు బాధను అనుభవిస్తూ శివుడు ఆయా స్థలాలలో శాశ్వతంగా ఉండిపోతాడు.

ఈ కథను బట్టి 'సతీ ధర్మ' మన్నది సతి ఏమి చేసిందన్నదే గాక, ఉత్తమురాలైన స్త్రీ ఏమి చేయాలన్నది కూడా. యజ్ఞంలో బలిచ్చేది సాధారణంగా మేకను కాగా దక్షుడి శిరస్సును ఖండిస్తారు. తనను తిరిగి జీవింపజేయటానికి మేక తలనిస్తారు. బలి ఇవ్వవలసినవాడే బలవుతాడు. బలికావలసిన జంతువు శిరస్సు తన శిరస్సుగా మారుతుంది. ఆ విధంగా క్రతువుయావత్తు గందరగోళంగా మారుతుంది. వారణాసి వద్ద బ్రహ్మ కపాలం పడిన చోటు బ్రహ్మ కపాల తీర్థమవుతుంది. సతీదేవి శరీరభాగాలు పడిన ప్రదేశాలు శక్తి పీఠాలవుతాయి. భక్తుల కోర్కెలను తీర్చేందుకు శివుడు, సతీదేవి ఆ పీఠాల వద్ద శాశ్వతంగా నివసిస్తారు. ఇతర కథల ప్రకారం ప్రతి పీఠం వద్ద శివుడు లింగ రూపంలో అవతరిస్తాడు. సతీదేవి యోనిభాగం పడిన అస్సాంలోని ప్రదేశం కామరూపమవుతుంది. అది ప్రధాన తాంత్రిక కేంద్రమవుతుంది.

## తాంత్రిక స్త్రీ దేవతల తొలి రూపాలు

## చండిక/దుర్గ, శక్తి పట్ల భక్తి

చండికను భగవంతుని తేజస్సు నుంచి సృష్టించినట్లు 'దేవీ మహాత్యం'లో చెప్తారు. కాని ఆమె త్వరలోనే వ్యవహారాలను తన అధీనంలోకి తీసుకుంటుంది. అపుడామె తన శక్తినుంచే ఉద్భవిస్తుంది. శృంగారమూర్తి అవుతుంది. ఈ క్రమమంతా 'దేవీ మహాత్యం'లోనూ పరోక్షంగా ఉంటుంది. అందులో ఆమె మహిషాసురుడిని సంహరించిన తర్వాత, మరొక అసురుడిని కూడా శృంగారపరంగా ఆకర్షించి హతమార్చుతుంది.

### శుంభక వధ

చండికను గాఢంగా మోహించిన శుంభకుడు తనను వివాహమాడవలసిందిగా కోరుతాడు. తనను పోరాటంలో ఓడించిన వానిని మాత్రమే వివాహమాడగల నంటుందామె. పోరాటం మొదలు కావటంతో బ్రహ్మ, శివుడు, స్కంధుడు, విష్ణువు, ఇంద్రునిలోని శక్తులు ఆమెకు సహాయంగా వస్తాయి. ప్రతి దేవునికి ఏమేమి ఆభరణాలు, ఆయుధాలు, జంతు వాహనాలు ఉన్నాయో వారి శక్తులు ఆ రూపాలలోకి మారుతాయి. స్వయంగా చండిక శక్తికూడా బయల్పడుతుంది. ఆమె

వంద తోడేళ్లకు సమానంగా అరుస్తుంది. ఆయా దేవతలందరి శక్తులను తనలో ఇముడ్చుకున్న తర్వాత శుంభుడిని వధిస్తుంది.

శుంభుని సహచరుడు నిశుంభుడిని కూడా చండిక హతమార్చుతుంది. అంతకుముందు ఒక కథలో తిలోత్తమ అనే అప్సరస, సుందుడు, ఉపసుందుడు అనే ఇద్దరు అసురులను ఆకర్షించగా, వారిని దేవతలు వధిస్తారు. కొన్ని తేడాలతో చండిక కథ దానిని పోలి ఉంది. చండిక చేతిలో హతమారిన శుంభుడు స్వర్గానికి పోతాడు. తనది ద్వేషభక్తి అయినందున.

మహిషాసుర మర్దిని కథలోనూ దేవత మహిషుడిని ఆకర్షించి సంహరిస్తుంది. ఈ ఆకర్షణ అనే కోణాన్ని సంస్కృత రచనలు అనేకం తగ్గించి చూపగా, 'దేవీ మహాత్యం'లో ఆరంభించి కొన్ని అసలా ప్రస్తావన చేయవు. ఇతర కథనాలు దానిని విశేషంగా పేర్కొంటాయి. చండికనే దుర్గ అని వ్యవహరించటం మొదలవుతుంది. దేవీ మహాత్యంలో ఆమెకు దేవతలు ఆభరణాలనిచ్చినట్లు, ఆమె శరీర భాగాలన్నీ దేవతల శరీర భాగాలతో సృష్టి అయినట్లు ఉంది. ఆమె జననాంగాలను శక్తి స్వరూపమంటుంది. తర్వాత కాలపు స్కందపురాణం, మహిషుడు దేవతలను ఓడించే సమయానికే దుర్గ మహాశక్తివంతురాలని, మహిషుడిని సంహరించేందుకు సహాయపడవలసిందిగా దేవతలు తనను ప్రార్థించారని రాసింది. అదే కాలానికి చెందిన మరొక రచన శృంగారాకర్షణ కోణాన్ని వివరంగా పేర్కొంది.

ఇంతకుముందు ఒక కథలో (దక్షునిది) శివుడు సతీదేవి శరీరాన్ని భుజంపై మోస్తూ అంతటా సంచరించినట్లు చూసాము. మహిషాసుర మర్దిని కథలో దుర్గాదేవి తన పాదాలను మహిషుని భుజాలపైన, తలపైన మోపి తన శిరస్సును ఖండించేందుకు సిద్ధమవుతుంటుంది. తాంత్రిక చిత్రాలలో కాళిక తన భర్త శివుని మృతదేహంపై నృత్యం చేస్తూ, చేతిలో ఖడ్గాన్ని, మరొక చేతిలో ఒక ఖండించిన శిరస్సును ధరించి ఉంటుంది. కొన్ని చిత్రాలలో, ఖండించిన శిరస్సుల నుంచి స్రవించే రక్తాన్ని తాగేందుకా అన్నట్లు నాలికను బయటకు చాచి కన్పిస్తుంది. అది చూసినపుడు బ్రాహ్మణాలలోని దీర్ఘ జిహ్వా అనే అసుర స్త్రీ గుర్తుకు వస్తుంది. అయితే, కాళిక తాను తన భర్తపైనే నృత్యం చేస్తున్నట్లు గుర్తించి దిగ్భ్రమతో నాలుకను బయటకు చాచినట్లు బెంగాల్ వంటి చోట్ల నిర్వచనాలు చెప్పారు. శిరస్సును ఖండించటమన్నది అహంభావాన్ని ఖండించటమని కూడా అన్నారు. ఆ విధంగా ఆ ఉగ్ర దేవతను సాధారణ విధేయతగల పార్వతిగా మార్చబూనటం కన్పిస్తుంది. కొన్ని చిత్రాలు ఆమెను, శృంగారంలో పాల్గొంటున్న దంపతులపై అటు ఇటు కాళ్లు వేసి కూర్చొని, చేతిలో ఖండిత శిరస్సుతో ఉన్నట్లు చూపుతాయి.

ఆ దేవత చేతిలో గల శిరస్సు ఎవరిది? కొన్ని శిల్పాలు, చిత్రాలలో ఆమె తల లేకుండా కన్పిస్తుంది. దానిని బట్టి అది తన శిరస్సుని భావించాలి. పైగా రంగు, ఇతర లక్షణాలను బట్టి అది తన శరీరానికి సరిపోయేట్లు ఉంటుంది. కొన్ని సంస్కృత, తమిళ కథనాలు అది శివుని శిరస్సని పేర్కొన్నాయి. ఒక తీర్థంలో స్నానమాచరించిన తర్వాత చండికకు మహిషుని శిరస్సు స్థానంలో శివలింగం కన్పిస్తుంది. దానిని బట్టి మహిషుడు శివుని భక్తుడని భావించిన ఆమె విచారంలో మునుగుతుంది. అందుకు ప్రతిగా ప్రాయశ్చిత్తం అవసరమవుతుంది. ఇటువంటివే ఇంకా అనేక విధాలైన కథలు అప్పటి సాహిత్యంలో ఉన్నాయి.

## తాంత్రికులు

ఇటువంటి కల్పనలు, పురాణ కథలు, శిల్పాలు, చిత్రాలు అనేకం ఉన్న నేపథ్యంలో, అసలు తాంత్రికత ఏమిటో, తాంత్రికులు ఎవరో ఇపుడు చూద్దాము.

తాంత్రిక సంప్రదాయంలో దేవీ పూజ, ఉపదేశం, సామూహిక పూజ, రహస్యం, హీనమని తోచే ప్రవర్తన, శృంగార పరమైన ఉత్సవాలు, సంప్రదాయాలు, శారీరక స్రావాలను ఉదరంలో ప్రవేశపెట్టటం వంటివి ఉంటాయి. అయితే ఇవి అన్నీ అన్ని వేళలా జరగాలని లేదు. పోతే తాంత్రిక శాస్త్రాలు, తాంత్రిక ఉత్సవాలూ సంప్రదాయాలు, తాంత్రిక కల్పనలు, తాంత్రిక కళలు, అన్నింటికి మించి తాంత్రిక ఆరాధకులు ఉన్నారు. తాంత్రిక మంత్రాలతో పాటు తాంత్రిక యంత్రాలు, తాంత్రిక దేవీ దేవతలు కూడా ఉన్నారు. హిందూ మతంలో శైవ, వైష్ణవ, శాక్త తంత్రాలు, ఇతర దేవతలతో నిమిత్తం గల తంత్రాలున్నాయి. ఇవిగాక బౌద్ధ, జైన తంత్రాలు కూడా ఉన్నాయి. ఉపనిషత్తుల కాలంలో వలె ఇపుడు కూడా హిందూ, బౌద్ధాల మధ్య సామాన్య లక్షణాలు కొన్ని కన్పిస్తాయి.

హిందూమతంలో, బౌద్ధంలో కూడా తాంత్రిక సంప్రదాయాలు నిజమైన విధంగా క్రీ.శ. ఆరు, ఎనిమిదవ శతాబ్దాల మధ్య ఆరంభమయాయి. పదవ శతాబ్ది నాటికి అవి పూర్తిగా వికసించాయని చెప్పాలి. అప్పటి నుంచి వాటిలోకి భక్తి సంప్రదాయాలు కూడా వచ్చి చేరాయి. తాంత్రికత బహుశా ఉత్తర దేశ సరిహద్దు ప్రాంతాలైన కశ్మీర్, నేపాల్, బెంగాల్, అస్సాం వంటి చోట్ల ఆరంభమై ఉంటాయి. బౌద్ధం కూడా అవే ప్రాంతాలలో విలసిల్లింది. కాని తాంత్రిక ధోరణులు త్వరలోనే మధ్య భారతానికి, దక్షిణ దేశానికి కూడా విస్తరించాయి. అప్పటి సామాజిక పరిస్థితులు ఈ కొత్త మార్గానికి ప్రేరణ అయ్యాయి. కొన్ని భక్తి సంప్రదాయాలలోని బ్రాహ్మణ వ్యతిరేకత అందులో ఒకటి. ఆ వ్యతిరేకత వేదకాలంలో వ్రత్య సన్యాసులు చీలిపోవటం నాటి నుంచి ఉంది. అనంతర ఉపనిషత్తుల కాలంలో పరిత్యాగ ధోరణులు తీవ్రస్థాయికి పోయినపుడు కొనసాగింది. తమ స్పృహను, చైతన్యాలను మార్చుకునేందుకు వారు మతపరంగా కొత్త మార్గాలను అన్వేషించసాగారు.

తాంత్రికతలో, యోగలో పరివర్తనను ధ్యానం ద్వారా నియంత్రించారు. అదే పద్ధతిలో వేదకాలపు దీర్ఘకేశాలు, మద్యపానం, మత్తు పదార్థాల సన్యాసులు ఇంచుమించు అవే లక్షణాలతో తాంత్రిక యుగంలో కన్పిస్తారు.

తాంత్రిక ఆచారం చాలావరకు ఎక్కడో దూర ప్రాంతంలో రహస్యోపదేశం చేసేటపుడు జరుగుతుంది. కాని ఆచారాలు నిజంగా రహస్యమైనవేమీ కాదు. రహస్యం లేకపోవటమన్నదే రహస్యం. తంత్రాలు, తాంత్రిక ఆచారాల గురించి ప్రచారాలు బాగానే జరిగేవి. ఒకోసారి రాచరిక స్థాయిలోనూ ఆ కార్యక్రమాలుండేవి. అవి ఆ వ్యవస్థలకు వ్యతిరేకమైనవేమీ కావు. ఉపనిషత్ కాలపు మునులవలె, భక్తి ఉద్యమాలవలె, తాంత్రికులకు కూడా రాజులతో సన్నిహిత సంబంధాలుండేవి. తంత్ర విద్యలను రాజులు సైతం ఉపయోగించుకునేవారు. రాచరికపు ప్రతీకలను తాంత్రికతకు ఆపాదించేవారు. శృంగార సంబంధమైన ఆచారాలలో వారు స్వయంగా పాల్గొనటం కొన్ని శతాబ్దాల పాటు సాగింది. ప్రతిరోజు కనీసం ఒక దేవతను (శ్రీ, లక్ష్మి, భూదేవి వగైరా) వివాహమాడేవాడు. పైగా, తాంత్రికులు అన్నట్లు మీరు మీ శరీరాలను దేవతలు కాగలిగేట్లు మార్చుకుంటే, మీరు రాజులు కూడా కాగలరు. అసలు తంత్ర అన్నదే శక్తి సాధన గురించి.

బ్రాహ్మణులు అనేక శతాబ్దాల పాటు ఇతర శాఖలను తమ వ్యవస్థలలోకి విలీనం చేసుకోవటం, లేదా వాటిని బలహీన పరచటం, లేదా ధ్వంసం చేయటం వంటివి విజయవంతంగా సాగించారుగాని, తాంత్రికతల విషయంలో అది తేలికగా సాధ్యపడలేదు.

తాంత్రికులలో పలు విధాలైనవారున్నారు. హిందూ మతంలో ఉపనిషత్తుల కాలంలో రెండు మార్గాలు ఏర్పడ్డాయి. ఆ ధోరణిలో తాంత్రికత అన్నది ఒక భిన్న రూపాన్ని తీసుకుంది. తాంత్రికతకు బయట, మరణానంతరం మోక్షం కోసం అన్వేషించిన తాపసులు ఇప్పటికీ అదే ఆశాభావంతో ఉన్నారు. మోక్షమన్న భావనలో అన్ని దైహిక రూపాలను, వ్యక్తిత్వాన్ని విసర్జించి బ్రహ్మలో విలీనం కావటమనేది ఉంది. కాని పునర్జన్మను కోరుకున్నవారు ఇపుడు పురాణాలను అనుసరిస్తూ, మరణానంతరం తిరిగి భూమిపైగాని, లేదా స్వర్గంలోనో, కైలాసంలోనో, లేక ఏదైనా దేవత లోకంలోనో పునర్జన్మించాలని ఆకాంక్షించేవారు. ఊర్ధ్వలోకాలకు వెళ్లినట్లయితే ఇక పునర్జన్మ ఉండకపోవచ్చు, లేదా మోక్షం కూడా ప్రాప్తించవచ్చు. స్వర్గంలో పునర్జన్మ కూడా మోక్షం వంటిదేనన్నారు కొందరు. ఆ విధంగా రెండు మార్గాల వారు కూడా మోక్షమే తమ అంతిమ లక్ష్యమన్నారు. కాని అందుకోసం వేర్వేరు మార్గాలను ఎన్నుకున్నారు.

ఈ పరిస్థితిలోకి తాంత్రికత ప్రవేశించింది. అందులోకి తాపసులకు, గృహస్తులకు కూడా ప్రవేశం ఉంది. ఆ మార్గంలో మోక్షానికే గాక (దానిని వారు ఒకోసారి నిర్వాణమన్నారు), ఆ క్రమంలో సిద్ధులకు (మాంత్రికశక్తులు), భోగాలకు లభించే రెండు విధాలైన ప్రయోజనాలు కూడానన్నమాట. పోతే, బలుల క్రతువులు గాని, ధ్యానమార్గంగాని

అనుసరించని వారు మూడవ మార్గంలో క్రిములుగా జన్మించగలరని చెప్పేవారు. తాంత్రిక మార్గాన్ని అనుసరిస్తే అటువంటి సమస్య కూడా తప్పిపోగలదన్నది తాంత్రిక వాదుల హామీ. ఇహపరాలు రెండింటిలోని సుఖాలు కూడా ఆ మార్గంలో లభిస్తాయన్నమాట. భుక్తి–ముక్తి, భోక్ష–మోక్ష, భోగ–యోగ పద్ధతిలో నన్నమాట.

హిందూమతంలో భాగంగా తాంత్రికతను అర్థం చేసుకొనేందుకు మరొక పద్ధతి కూడా ఉంది. అది, భక్తి (గురువు/భగవంతుడు/దేవత), వేదాంత (ధ్యానం), తంత్ర (క్రతువులు, ఆచారాలు) అనే విధమైన విభజన. ఇది భగవద్గీతలో చెప్పిన భక్తి, జ్ఞానం, కర్మల విభజనను పోలినటువంటిది. ఇదే సూత్రీకరణ తంత్రాన్ని 'వామ–హస్త' సంప్రదాయం (రక్తం, మృత్యువు, కపాలాలు, శృంగారం వంటి అపవిత్రతలలో నిమగ్నమై కులాలలో నిమిత్తం గల సూత్రాలను ఉల్లంఘించేది), 'దక్షిణ–హస్త' లేదా గతస్థితిని అనుసరించే సంప్రదాయంగా విభజించవచ్చు. తాంత్రికేతరులైన హిందువులలో అధికులు దక్షిణ హస్తీయులు కొందరున్నారు. వారు, తమ దృష్టిలో వామ హస్తీయులైన వారిని విస్మయంగా చూస్తారు. నిజానికి వారు దక్షిణ హస్తీయులకు మించిన దక్షిణ హస్తీయులు.

## కలియుగంలో మోక్ష మార్గంగా తాంత్రిక మార్గం

పరిరక్షకునిగా శివుని పాత్ర కాపాలికుల శాఖను సృష్టించి, భవిష్యత్తులో పాపులు కాగలవారిని కాపాడేందుకు వారణాసిలో ఒక ఆలయాన్ని నిర్మించటంతో ముగిసిపోలేదు. శైవ తాంత్రిక సంప్రదాయంలో శివుడు అంతకు మించినవి చేస్తాడు. తను స్వయంగా పాపులను వెతికి వారికి ఉపదేశాలు చేస్తాడు. దక్షుని దృష్టిలో ఆ ఉపదేశాలు పొందినవారు పారియాలు.

అనేక శైవపురాణాలు తాంత్రిక మార్గాన్ని తిరస్కరిస్తాయి. అవి వేదాలను స్వీకరిస్తాయి గాని, దాని అర్థం వైదిక బలి క్రతువులని కాకపోవచ్చు. పౌరాణిక మతం అనే అర్థంలో వైదిక మతం కావచ్చు. ఆ వైదిక మతం ప్రస్తుత సందర్భంలో శివుని పూజ. ఈ శైవ పురాణాలు తాంత్రిక మార్గాన్ని తిరస్కరిస్తూనే, తంత్రశాస్త్రాల రచయిత శివుడని మాత్రం అంగీకరిస్తాయి. తమకు కాకపోయినా కొందరికి అవి ఉపయోగకర మంటాయి. వేదాలను అనుసరించకకుండా నిషేధానికి గురైన కొందరు మునులను శివుడు కాపాడినట్లు చెప్తాయి. ఆ మునులు శాపగ్రస్తులు కావటం పలు విధాలుగా ఉంటుంది. వారు ఒకోసారి శివునికి వ్యతిరేకంగా దక్షుని వెంట నిలుస్తారు. అందుకు కూడా శాపానికి గురవుతారు. దీనంతటి గురించి ఉన్న కథలలో ఒక దానిని గమనించండి:

### శివుని తాంత్రికోపదేశం

కొందరు మునులు వేదాలకు బయట ఉండాలనే శాపానికి గురైనట్లు తెలిసిన విష్ణువు శివుని వద్దకు వెళ్లి, "వేదాలకు వెలుపలగల వారిలో సద్గుణాలు లేశమైనా

లేవు. వారు నరకానికి పోకతప్పకపోయినా వారికి మనపట్ల గల భక్తి కారణాన మనం వారిని కాపాడాలి" అంటాడు. మనం చిత్త భ్రమలు కలిగించే కావ్యాలు కొన్ని రచించి వీరిని చిత్త భ్రమలకు గురి చేయాలని కూడా చెప్తాడు. అందుకు శివుడు అంగీకరించగా వారు కపాల, పశుపత, వామ (అనగా తాంత్రిక), తదితర శాస్త్రాలను రూపొందిస్తారు. అపుడు శివుడు ఆ మునుల కోసమని భూమిపై అవతరిస్తాడు. అంతటితో శాపం ముగుస్తుంది. బహిష్కృతులైన వారికోసం ఆయన భిక్షమెత్తుతాడు. తను కపాలాలు, బూడిద, జడలు కట్టిన కేశాలతో రావటంతో వారికి చిత్త భ్రమ కలుగుతుంది. వారితో శివుడు "మీరు నరకానికి పోతారు. కాని పునర్జన్మనెత్తి క్రమంగా పుణ్యం సాధిస్తారు" అని చెప్తాడు.

ఈ కథను బట్టి, బహిష్కృతులైన మునుల నైతిక స్థితి ఏమిటన్నది అస్పష్టంగా తోస్తుంది. అది విష్ణువు మాటలలో కనిపిస్తుంది. ఆ మునులు పాపులని, వారు నరకానికి పోక తప్పదని, కాని దేవతలు వారిని భ్రమలనుంచి బయటకు తెచ్చి కాపాడాలని, వారు అంతిమంగా పుణ్యాత్ములవుతారని అంటాడాయన. వారికి శివుడు చేసే ఉపదేశాలు వేదాలకు తక్కువగా, బహిష్కరణకు ఎగువగా ఉంటాయి. అయితే ఆ ఉపదేశాలను వారింకా బహిష్కృతులుగా ఉన్నపుడు చేయలేడు. శాప ప్రభావం ముగిసినపుడు మాత్రమే వారి వద్దకు వెళ్ళి, ఆ కల్పిత ఉపదేశాలను బోధించగలడు. అనగా శాపవిమోచన కోసం, పుణ్యాత్ములుగా మారేందుకు వారు ప్రయత్నించాలి. అప్పుడే శివుడు వారికి తంత్రాలను ఉపదేశించగలడు.

నూతన మార్గోపదేశం ద్వారా ఆ మునులను శివుడు ఏ విధంగా "కాపాడ"గలడు? వేదాలు అందుబాటులో లేనివారికి వామ మార్గాన్ని అనుసరించటంవల్ల ఏదో ఒక మతమంటూ లభిస్తుంది. వైదికేతరం నుంచి వైదికతకు వెళ్లేందుకు అది మెట్లవలె ఉపయోగపడుతుంది. తమ అపవిత్రతా వలయాన్ని ఛేదించేందుకు వారికి నిజమైన, సంప్రదాయికమైన మతం అవసరం. అపవిత్రులను ఆ స్థితి నుంచి దూరం చేయటమనే ఆలోచనను ముందుకు తెచ్చింది కొందరు తాంత్రికవాదులే. మద్యమాంసాలను కోరుకునే జంతు లక్షణాలు కలవారి గురించి శివునికి ముందే తెలుసునని, వారిని ఆ మార్గం నుంచి దూరం చేసేందుకే తాంత్రిక మార్గాన్ని కనుగొన్నాడని వారు వాదిస్తారు. శూద్రులు, శాపగ్రస్తులైన వారు వేదాలను చదివేందుకు, వినేందుకు అనర్హులు కాగా, కొందరికి ఆ శక్తిలేదు. వారందరిపట్ల కరుణ గల శివుడు, వారిని ఒక్కొక్క మెట్టుగా పైకి తెచ్చేందుకు తంత్రాన్ని ఉపదేశిస్తాడు. తగిన నైపుణ్యం లేనివారికి తమ స్థాయిలో బోధించి వారి నైపుణ్యాన్ని క్రమంగా పెంచటమన్న బౌద్ధ సూత్రం ప్రభావం ఈ వాదనపై ఉండి ఉంటుంది. శివుడు వారికి తమకు సహజమైన, వారితో పాటు ఆవిర్భవించిన మతాన్నిస్తాడని, అందరూ ఆనందించగల మద్యమాంసాలు, శృంగారానికి అందులో

అవకాశం ఉంటుందన్నది ఇందులోని భావన. వారి స్థాయికి వెళ్లి ఉపదేశించటమంటే అదే.

తాంత్రికతను సమర్థించేందుకు పురాణాలు అంతిమంగా చెప్పేదేమంటే, సంప్రదాయానికి భిన్నమైన మార్గాలను అవలంబించే వారికి అదే భిన్నత్వాన్ని బోధించటం వల్ల వారు మరింత హీనులై, మరింత హీనస్థాయికి చేరుతారు. ఆ స్థితి నుంచి వెనుదిరిగి సన్మార్గులవుతారు. అక్కడి నుంచి తిరిగి వెనుకకు వెళ్లి కలియుగపు తక్కిన జీవులతో పాటు ఒక వరసలో నిలబడతారు. గతంలో నిషిద్ధమైన కొన్నిచర్యలను కలియుగంలో అనుమతించటం ఎందుకంటే ఇప్పటివారు బాగా నీతిహీనులై, గతకాలపు ప్రమాణాలను అందుకోలేని స్థితిలో ఉన్నారు. ఈ సూత్రాన్ని కొంతమార్చి, గతకాలంలో స్త్రీలకు గల శృంగార స్వేచ్ఛ, ద్రౌపది వంటి బహుభర్తృత్వానికి ఇపుడు అనుమతి లేకపోవటానికి కారణం ఇప్పటివారికి నైతికత లేకపోవడమంటారు.

## తాంత్రికాచారాలు : నిప్పును నిప్పుతో ఎదుర్కోవటం

### అయిదు 'మ' కారాలు

'చేయవలసినవి' అంటూ ప్రజలకు తంత్రాలు బోధించిన ఆ భయంకరమైన, ప్రమాదకరమైన విషయాలు ఏవి? తంత్రశాస్త్రాలు వాటిని పంచ 'మ' కారాలంటాయి. అవి మద్యం, మాంసం, మత్స్య, ముద్ర, మైథునం. ఈ విధంగా అయిదేసి కలిసి ఉండటమన్నది పౌరాణిక హిందువులలో ఇతరత్రా కూడా కనిపిస్తుంది. ఉదాహరణకు వారు అపవిత్రత నుంచి తమను తాము కాపాడుకునేందుకు ఆవు ఉత్పత్తులు అయిదు అవసరం. అవి నెయ్యి, పాలు, పెరుగు, మూత్రం, పేడ. అదే పద్ధతిలో తాంత్రిక మార్గం అయిదు మానవశరీర స్రావాలను నిర్దేశించి వాటిని పంచ రత్నాలంటుంది. అవి వీర్యం, మూత్రం, మలం, బహిష్టు రక్తం, కఫం. ఒకోసారి వీటిలో కఫానికి బదులు ఎముకల మూల్గును చేర్చి పంచామృతమంటుంది. బౌద్ధ తంత్రమొకటి మాంసాన్ని అయిదు విధాలుగా విభజించి పశుమాంసం, శునక మాంసం, ఏనుగు మాంసం, అశ్వమాంసం, మనిషి మాంసమని పేర్కొంటుంది. అదిగాక వీర్యం, మూత్రం, మలం, రక్తం, మూల్గులను పంచామృతాలని చెప్తుంది. ఒక తంత్ర శాస్త్రం గోవుకు సంబంధించిన అంశాలలో మూత్రం, పేడకు బదులు రక్తమాంసాలను చేర్చుతుంది.

పంచ 'మ' కారాలను మహా నిర్వాణ తంత్రం వివరించి చెప్తుంది. మద్యాన్ని పంచదార, బియ్యం, తేనె, తాటి కల్లుల నుంచి ఉత్పత్తి చేయవచ్చు. ఆ పని ఏ కులానికి చెందినవాడైనా చేయవచ్చు. మాంసం కోసం ఉపయోగించే జంతువులు నీరు, నేల ఆకాశంలో ఎక్కడి నుంచైనా రావచ్చు. వాటిని ఎవరైనా వధించవచ్చు. అయితే, వైదిక

బలులలో వలె తాంత్రిక మార్గంలో కూడా అవి మగ జంతువులు మాత్రమే అయి ఉండాలి. చేపలు ఎముకలు లేకుండానైతే ఉత్తమం. ఒకవేళ చాలా ఎముకలు ఉన్నవైతే వాటిని బాగా వేయించి దేవతకు నైవేద్యంగా సమర్పించాలి. ఉత్తమమైన ముద్ర బియ్యం, బార్లీ, గోధుమ నుంచి తయారు చేయవచ్చు. వెన్నతో వేయించినపుడు గోధుమ మరీ రుచికరంగా ఉంటుంది. మైథునం తన భార్యతో కావచ్చు, మరొకరి భార్యతో కావచ్చు, లేదా ఆ తాంత్రికుల బృందానికి చెందిన ఏ స్త్రీతో అయినా కావచ్చు.

అగ్రవర్ణాల హిందువులకు మద్యం, మాంసం, చేపలు నిషిద్ధం. ఈ నిషేధాన్ని అక్షరాలా తీసుకోవాలా అన్న ప్రశ్నపై చాలా చర్చించారు గాని, ఆ పదాలకు గల అర్థం, భావం ఏమిటన్న దాని గురించిన చర్చ ఎక్కువలేదు. ముద్ర, మైథున అనే వాటి ప్రాథమికార్థాలను నిర్వచించటం కూడా సమస్యాత్మకంగా మారింది. ముద్ర అన్నదానికి అర్థం చిక్కుడు గింజలు లేదా మైథున శక్తిని కలిగించే ఇతర పప్పు దినుసులు. అదే సమయంలో ముద్రిక, సంజ్ఞ వంటి అర్థాలు కూడా ఉన్నాయి. కొన్ని తంత్రాలలో ఆ మాటకు గల అర్థం వేళ్లతో చేసే సైగలు, లేదా స్త్రీ జననేంద్రియం కావచ్చు. మైథున స్థితిలో ఆ ఇంద్రియం పురుషుని జననేంద్రియాన్ని కప్పివేస్తుంది. ఇంతకూ అసలు అర్థమేమిటన్నది అస్పష్టం.

మైథునమన్న మాటను సంభోగప్రక్రియ అని అనువదిస్తున్నారు. కాని ఇతర నాలుగు పదాలు ఏదో ఒక వస్తు పదార్థాన్ని సూచిస్తున్నందున, ఈ పదానికి అర్థం కూడా కేవలం మైథునం ప్రక్రియ గాక, ఆ క్రమంలో శరీరాల నుంచి వెలువడే స్రావాలు అయి ఉండవచ్చు. మైథునం అనే పదానికి గల అర్థాన్ని ఇది కొంత సాగతీయటం అయితేకావచ్చుగాని, అది ఇతరత్రా తాంత్రిక ఆచారాలకు సరిపోతుంది. అటువంటి ఆచారాలలో శరీరస్రావాలను ఉదరంలోకి ప్రవేశపెట్టటం, లేదా ఆహారంగా స్వీకరించటమనేది ఉంది. ఆ విధమైన ఆహారానికి మనిషిని పరివర్తన చెందించగల శక్తి ఉన్నదన్నది తాంత్రికుల నమ్మిక.

తంత్రశాస్త్రాలు, "ప్రతి శరీరంలో వీర్యం, రక్తం ఉంటాయి. మైథునానందాన్ని కోరుకునే (దేవతలు) వీర్యాన్ని, రక్తాన్ని గ్రోలుతారు" అని పేర్కొంటాయి. ఈ రెండింటిని కలిపి స్వీకరించటమన్నది తాంత్రికాచారం. ఈ విధమైన తంత్ర శాస్త్రాలకు ముందు పురాణాలలోగల 'దేవీస్తుతి'లో చండిక రక్తబీజుడనే అసురుడిని ఎదుర్కొంటుంది. అతని ప్రతీ రక్త బిందువు (లేదా వీర్యపు బిందువనవచ్చు) నుంచి మరొక రక్తబీజుడు జన్మిస్తాడు. తనను సంహరించేందుకు చండిక కాళికతో తన నోటిని పెద్దగా తెరిచి మొత్తం రక్తాన్ని, దాని బిందువుల నుంచి జన్మించగల అసుర సంతానాన్ని కూడా తాగివేయవలసిందిగా చెప్తుంది. అపుడు రక్తబీజుడిని సంహరిస్తుంది. ఇతర పురాణాలలో చండిక అనేక రూపాలలో అవతరించి ఆ రక్తానంతా తానే నాలుకలు చాచి తాగివేసినట్లుంది.

తంత్ర శాస్త్రాలలో స్త్రీ రక్తం, పురుషుని వీర్యానిది కేంద్ర పాత్ర. తాంత్రిక కార్యకలాపాలలో పాల్గొనే స్త్రీ రుతుస్రావానికి, దేవత రుతుస్రావంతో ముడిపెడతారు. దేవత రుతుస్రావం భూమిపైకి ప్రతి సంవత్సరం స్రవిస్తుంది. ఆమె జంతు రూపంలో గల అసురులను సంహరించగా వారి రక్తాన్ని నైవేద్యంగా తర్పణ చేస్తారు. దేవతలేగాక, మహా సొగసుకత్తెలు, భీతిగొలిపేవారు, శక్తివంతులు అయిన యోగినులు అనే దేవతలు కూడా మైథున సంబంధమైన పానీయాలను స్వీకరిస్తారు. ఈ యోగినులను అపుడపుడు రక్త తర్పణలతో, జంతుబలులతో సంతృప్తిపరుస్తారు. అంతేగాక, తాంత్రిక మార్గాన్ని అనుసరించే పురుష భాగస్వాములతో మైథున సంబంధమైన స్రావాలను వారు పరస్పర వినిమయం చేసుకుంటారు. అదే విధంగా ఇతర నిషిద్ధ ఆహారాలను. అందుకు బదులుగా యోగినులు, తంత్రాచారాలను అనుసరించే బ్రాహ్మణులకు “వారి చైతన్యాన్ని శక్తివంతమైన రీతిలో విస్తరింపజేస్తారు.” లేదా గరిష్ట స్థాయిలో అతీతశక్తులను ప్రసాదిస్తారు. గాలిలో విహరించగల శక్తి వాటిలో ఒకటి.

## తాంత్రికాచారాల సంకేతాలకు దిద్దుబాట్లు

ఈ విధమైన విపరీత ధోరణులు గల తాంత్రికాచారాల పట్ల నిరసనతో అనేక తంత్ర శాస్త్రాలు, అవన్నీ నిజంగా ఆచరించేందుకు ఉద్దేశించినవి కాదని, అవి సంకేతప్రాయం మాత్రమేనని వాదించాయి. ఉదాహరణకు పైన పేర్కొన్న అయిదు ‘మ’ కారాలను మద్యం, మాంసం, మత్స్య, ముద్ర, మైథునంగా పేర్కొంటూనే వాటికి కొత్త నిర్వచనాలు చెప్పాయి. దాని ప్రకారం మద్యం ధ్యాన సంబంధమైన అమృతం, మాంసమన్నది తాంత్రికుని నాలుక, మత్స్యం తన ఊపిరి, ముద్ర అనేది అంతర్ జ్ఞానం కాగా మైథునానికి అర్థం సమున్నత సారం. తాంత్రిక సంప్రదాయాలు మొదట పైన పేర్కొన్నట్లే ఉండి కాలక్రమంలో మారాయని అనుకోవాలి మనం. లేదా తొలి దశలోనూ అవి సంకేత ప్రాయాలే తప్ప వాస్తవంగా ఆచరించినవి కావని భావించాలి. లేదా రెండూ ఏక కాలంలో ఉండేవి కావచ్చు. ఈ మొత్తం ప్రశ్నను మనం ఈ విధంగా కుదించి చూపవచ్చు. తాంత్రికులు నిజంగా తాంత్రిక మైథునం జరిపే వారా? అందుకు సమాధానంగా మూడు విధాలైన ఊహా గానాలున్నాయి:

మొదటి ఊహ: అవును

1వ విధం : ఒకప్పుడు అవును. ఇపుడు కేవలం మాట్లాడతారు.

2వ విధం : మొదట మాట్లాడారు. తర్వాత జరిపారు.

రెండవ ఊహ : అది ఎల్లప్పుడూ వారి ఆలోచనలలో మాత్రమే ఉంది.

మూడవ ఊహ: ఎప్పుడూ జరిపేవారు, అదే సమయంలో ఊహించేవారు.

ఇపుడు వీటిని ఒక్కొక్కటిగా పరిశీలిద్దాము.

తంత్రశాస్త్రాల చరిత్ర పైగల వాదనలను బట్టి చూస్తే, తమ సంప్రదాయాల నుంచి కొన్ని భాగాలను తొలగించే పని హిందువులు స్వయంగా చేసారు. "ఎవరూ ఏదీ నోటిలోకి మింగటంలేదు. మేమంతా ధ్యానం మాత్రమే చేస్తున్నా"మన్నది వాదన. చారిత్రకంగా చూస్తే తంత్రాలు బ్రాహ్మణేతర, ఒకోసారి బ్రాహ్మణ వ్యతిరేక, గృహస్థ వ్యతిరేక ఉద్యమంగా ఆరంభమయాయి. తర్వాత వాటిని బ్రాహ్మణులు, గృహస్థులు తమ అధీనంలోకి తీసుకున్నారు. కాని తంత్ర శాస్త్ర రచనలకు ముందటి తాంత్రిక విధానాలు ఏమిటో మనకు తెలియనందున, వాటిని మొదట అనుసరించిన వారెవరో, వారేమి చేసారో కూడా తెలియదు. వారు మొదట రక్తాన్ని తాగి, తర్వాత ఆపి ఉండవచ్చు. లేదా ఇదేమీ కాకపోవచ్చు. అయితే ఆ శాస్త్రాలను రచించినవారు రక్తాన్ని తాగి మైథునాచారాలను అనుసరించి ఉంటారనే సూచనలు తాంత్రిక రచనలలో కనిపిస్తాయి.

చరిత్ర గురించిన చర్చలు చెప్పేదానిని బట్టి, పలువురు హిందువులు ఈ విధమైన ఆచారాలను ఊహించారే తప్ప ఎప్పుడూ అనుసరించలేదు. కాని వాటిని అనుసరించినవారు వాటిని చిహ్న భాషలో వర్ణిస్తూ దానిని తాము సంకేత ప్రాయంగా మాత్రమే అనుసరిస్తున్నామని చెప్పారు. బ్రాహ్మణులలోని ఉన్నత వర్గాలకు చెందిన మంత్రాన్ని అనుసరిస్తుండిన కొందరు, కశ్మీర్‌కు చెందిన అభినవ గుప్తుడనే క్రీ.శ. 975-1025) వేదాంతి నాయకత్వాన, తాంత్రికాచారాలను ఉత్సవ ప్రాయంగా, ధ్యానకరమైన పద్ధతులుగా మార్చివేశారు. ఉన్నత వర్ణాల సామాజిక వ్యవస్థకు అవసరమైన స్వచ్ఛతను, నిబంధనలను ఉల్లంఘించని విధంగా" ఆ పద్ధతులను రూపొందించారు. అనగా, బ్రాహ్మణుల గృహాలలోకి ప్రవేశించగల విధంగా తంత్రాచారాలను సంస్కరించటమన్నమాట. వివిధ పదార్థాలను ఆహారంగా స్వీకరించటమనే అపరిశుద్ధతను తాంత్రికాచారాలనుంచి ఈ సిద్ధాంతకర్తలు ఇపుడు తొలగించివేసారు. నిజానికి అటువంటి స్వీకరణ తాంత్రికుల ప్రధాన లక్ష్యం. అందుకు బదులు, చైతన్యాన్ని విస్తరింప జేసుకోవటమనే అప్రధానమైన లక్ష్యాన్ని మాత్రం కొనసాగించారు. మైథునం పతాకస్థాయికి చేరినపుడు అనుభవైకమయే ఆనందానికి బదులు, మన మేథోస్థితిని దైవత్వం స్థాయికి చేరగల విధంగా పెంపొందించాలని అన్నారు. మైథునానందాన్ని, ఈ స్థాయిని సరిసమానం చేసారు. అసలు తంత్రాలు వాస్తవమైన క్రియలు, ప్రక్రియలను ఉపదేశించగా, ఉన్నత వర్ణాల వారు సంస్కరించిన తంత్రాలు దానిని పరిజ్ఞాన ప్రక్రియల స్థాయికి మార్చాయి. అందుకు సాధనాలు ధ్యానం, మంత్రం. ఈ విధమైన పరిణామాల వల్ల తాంత్రిక మార్గం రెండుగా చీలింది. ఒకటి గృహస్థులు ఆచరించే మర్యాదస్తుల తాంత్రికత. ఇందులో శివుని పూజ ఉంటుంది. తంత్రాలు ఉపదేశించే ఆచారాలను కార్యాచరణగా కాక కేవలం సంకేతప్రాయంగా స్వీకరిస్తారు. మరొక వైపు తంత్రాల పట్ల నిబద్ధ వైఖరి తీసుకున్న తీవ్ర వైఖరి గల శాఖల వారి దేవతా

ఉపాసనలలో రక్తం, మద్యం, మైథునస్రావాల వంటి సంప్రదాయాలు వాస్తవ రూపంలో చోటు చేసుకుంటూనే పోయాయి.

చారిత్రక పరిణామాల గురించి సిద్ధాంతీకరణలు సూటిగా కనిపించినా అందులో క్లిష్టతలు కూడా ఉన్నాయి. వాటిని క్లిష్టంగా మార్చే అంశాలు కొన్నున్నాయి. పరిస్థితులు తగినంత మారిన తర్వాత కూడా రహస్యోపదేశాలు, నిషిద్ధ పదార్థాలను, దైహిక స్రావాలను ఆహారంగా స్వీకరించటం కొనసాగాయి. బహుగా తొలిదశలో కూడా తాంత్రికత ఇదే విధంగా ఉండి ఉంటుంది. మర్యాదస్తులైన సంప్రదాయ వాదులు, అగ్రవర్ణాలవారు ఆ ప్రాచీన సంప్రదాయాన్ని సంస్కరించినా, అది ఒక మేరకు రహస్యంగా భూగర్భనదివలె కొనసాగి ఉండవచ్చు. ఈ పరిస్థితికి సూచనలు కొన్ని రచనలలో కన్పిస్తాయి.

ఇవిగాక మరొక రాజీ మార్గం కూడా కన్పించింది. అందులో తాంత్రిక విధులు యథాతథంగా ఉంటాయి. కాని లక్ష్యాలుమాత్రం మాంత్రిక శక్తులను సంపాదించటం, అపరిశుద్ధమైన పదార్థాలను స్వీకరించటం ద్వారా పవిత్రతా భావనల నుంచి విముక్తి చెందటం అనేవి కాకుండా పోతాయి. అంతిమంగా ఉన్నతవర్ణాలకు చెందిన సంప్రదాయిక కుటుంబీకులు రెండు విధాలుగానూ వ్యవహరించగల వ్యవస్థను రూపొందించి ఉంటారు. దాని ప్రకారం వారు ఒకవైపు సాధారణ కుటుంబ జీవనాన్ని గడుపుతారు. మరొక వైపు తాంత్రిక విధులను రహస్యంగా పాటిస్తుంటారు. అటువంటివారు కొందరు 18వ శతాబ్దిలో క్రైస్తవ మిషనరీలతో మాట్లాడుతూ, తాంత్రిక విధానాల పట్ల "దిగ్భ్రాంతి" ప్రకటించటం ఇందుకొక ఉదాహరణ.

తాంత్రికతను ఆచారంలో భాగంగా పాటించటానికి, వ్యక్తిగత స్వేచ్ఛా కార్యకలాపంగా మార్చటానికి మధ్య తేడా ఉందని చెప్పదలచుకోవటం వల్ల కూడా, తొలి ఆచారాలలో కొన్నింటిని మార్చి ఉంటారు. అది, "పిల్లలూ, ఈ పని ఇంట్లో చేయవద్దు" అని హెచ్చరించటం వంటిది. మైథున పరమైన చర్యల గురించి తొలి తాంత్రిక రచనలు 'ఆనంద'మంటూ దాదాపు ఎప్పుడూ పేర్కొనవు. కాని అది తర్వాత రచనలలో కన్పిస్తుంది. మరొకవైపు ఇటువంటి ప్రక్రియలో గల ప్రమాదాలను గురించి కూడా అవి హెచ్చరించాయి. దానిని నిప్పుతో చెలగాటమన్నాయి. హిందూ సంస్కృతి, కామసూత్ర కావ్యం కూడా ఇదే వైఖరి తీసుకున్నాయి. ఆ మేరకు వాటితో తంత్ర శాస్త్రాలకు ఏకీభావం ఉందన్నమాట.

తాంత్రిక క్రియలు, పదార్థాల సహజ స్వభావం గురించిన వాదనలు ఇక్కడ ప్రస్తావనకు వస్తాయి. ఏ ప్రమాదాలు లేనట్లయితే ఆ స్వభావాల గురించి హెచ్చరించటమెందుకు? ఉదాహరణకు మైథునంవలె మద్యం కూడా ప్రమాదకరమైనదే. మహానిర్వాణ తంత్రంలో అయిదు 'మ' కారాల గురించి రాసిన ఈ వాక్యాలను చూడండి: 'మాంసం, మత్స్యం, పప్పుధాన్యాలు, ఫలాలు, కందమూలాలను మద్యంతో పాటు దైవానికి

నైవేద్యమివ్వటం ఆ పానీయాన్ని శుద్ధి చేసేందుకే. అటువంటి శుద్ధి లేకుండా మద్యాన్నివ్వటమంటే విష సేవనమవుతుంది. ఆ పని చేసే వ్యక్తి తరచు అనారోగ్యంపాలై, స్వల్పకాలమే జీవించి, త్వరలోనే మరణానికి గురవుతాడు." ఇదే హెచ్చరిక అదే రచనలో తర్వాత మళ్లీ కనిపిస్తుంది. తాంత్రిక విధిలో భాగంగా మద్య సేవనానికి, అదొక స్వేచ్ఛగా మారటానికి తేడా ఉన్నట్లు చెప్తుంది. ఆ పని యథేచ్ఛగా చేసేవారిని రాజుగాని, ఆ తాంత్రిక బృందపు నాయకుడు గాని హింసించాలని, తన ఆస్తులను జప్తుచేయాలని అంటుంది. తాంత్రిక విధి విధానాల ద్వారా శుద్ధి అయిన మద్యాన్ని అయినా అతిగా సేవించటం ప్రమాదకరమని కూడా చెప్తుంది.

తాంత్రిక సంప్రదాయాలు ఈ రోజుకు కూడా బెంగాల్‌లోని బాల్ శాఖ వారిలో, పశ్చిమ భారతంలోని నిజార్ పంథీయులలో (హిందూయీకరణ చెందిన ఇస్మాయిలీలు) కనిపిస్తాయి. దానిని బట్టి 'వామ – హస్త' తాంత్రికత చారిత్రకంగా ఉండేదని భావించాలి. ఈ ఆచారాలకు సంబంధించిన గురు–శిష్య పరంపర ఇప్పటికీ కొనసాగుతున్నదనటానికి మరొక ఉదాహరణ యోగినులు. ప్రస్తుతం వారు పేదలు, భర్తలను కోల్పోయిన వారు, ఉపేక్షితులు, ఒకోసారి వయసుమీరిన వారు కూడా. వారిని ఇతరులు దైహికంగా ఉపయోగించుకుంటున్నారు. ఒక గ్రామానికి అకాలమైన ముప్పు ఏదైనా సంభవించినపుడు వారిపై మంత్రతంత్రాల నిందలు వేస్తుంటారు. ఒకోసారి ప్రాణాలు కూడా తీస్తారు. అదే సమయంలో, సంప్రదాయికంగా వస్తున్న తాంత్రికాచారాలను మార్చే ప్రయత్నాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఉదాహరణకు, కలకత్తా కాళీఘాట్ లోని కాళికాదేవిని వైష్ణవీకరించేందుకు పూజారులు ఒకోసారి ప్రయత్నిస్తుంటారు. అందుకోసం, దేవీ విగ్రహాన్ని పరివేష్టించి ఉండే చిహ్నాలను తొలగించటం కనిపిస్తుంది.

దీనిని బట్టి, పైన చెప్పుకున్నట్లు తాంత్రికులు ఆ విధానాలను ఒకప్పుడు అనుసరించి తర్వాత కేవలం అందుగురించి మాట్లాడేవారనటం, లేదా మొదట కేవలం మాట్లాడి తర్వాత కాలంలో అనుసరించారనటం రెండూ కూడా చారిత్రకంగా నిజంకాదని అర్థమవుతుంది. తార్కికంగా అది సాధ్యంకావచ్చుగాని వాస్తవంగా అట్లా జరగలేదు.

పైన పేర్కొన్న మూడు ఊహాగానాలలో రెండవదానికి వస్తే, 'వామ–మార్గ' తాంత్రిక సంప్రదాయం కేవలం ఊహాగానమని, అది వాస్తవంగా ఎప్పుడూ ఆచరణలో లేదన్నది వాదన. మొదటినుంచి అది సంకేతప్రాయం మాత్రమేనని వారంటారు. ఈ రోజున విద్యావంతులైన హిందువులలో అధికుల అభిప్రాయం ఇదే అయి ఉంటుంది. పదకొండవ శతాబ్దపు కశ్మీర్‌లో భ్రాంతి సిద్ధాంతమొకటి రూపుదిద్దుకుంది. అందుకు అనుగుణంగా, తాంత్రిక విధులన్నీ చిత్త భ్రాంతి మాత్రమేనని, మనుషులు మనుషుల మాంసం తినటమనేది ఎటువంటి భ్రాంతో, తాంత్రిక మైథునం కూడా అటువంటిదేనని కొందరు వాదిస్తారు. అనగా, సంప్రదాయాలు ఆరంభమైన తొలి దశలో కూడా వాటిని రచించిన వారు ఆ

విధులను కేవలం ఊహించారు తప్ప స్వయంగా ఎప్పుడూ ఆచరించలేదన్న అర్థం వస్తుంది. గాలిలో ఎగిరినట్లు, దేవతల మధ్య నడయాడినట్లు ఊహాగానాలు చేసినవారు, తమ అక్కా చెల్లెళ్ల రుతుస్రావరక్తాన్ని తగినట్లు మాత్రం ఎందుకు భ్రాంతి చెందలేరు?

ఇపుడు మూడవ ఊహను గమనిద్దాము. ఇది రెండు స్థాయిలలో జరగవచ్చు. ఒక స్థాయిలో అనుసరించటం, మరొక స్థాయిలో ఊహించటం. తొలి ఉపనిషత్తులలోనూ ఈ ధోరణి కనిపిస్తుంది. కొందరు జంతుబలుల గురించి ఆలోచించటం, ఆచరించటం రెండూ చేయవచ్చు. కొందరు కేవలం ఆలోచించవచ్చు. తంత్రాల విషయానికి వస్తే, ధ్యానము లేదా జ్ఞానము, కర్మ ఒకదానివెంట ఒకటి ఉండి ఉండవచ్చు. ఒకోసారి ఒకే వ్యక్తిలోనూ ఉండవచ్చు. పారియాలు, దేవతలు, స్త్రీల పట్ల మనకు కథలలో కనిపించే వైఖరులు ఏకకాలంలో వాస్తవం, సంకేతప్రాయం కూడా కావచ్చునన్నది నా అభిప్రాయం. తాంత్రిక నిర్వచనాల ప్రధానమైన ధోరణి మొదటి నుంచి ఉపమాన సంబంధమైనది, లేదా తాత్త్వికమైనదనే మాటను కాదనేవారు తక్కువ. కాని శుద్ధి ప్రక్రియకు లోనుకాని తాంత్రికులు తమ శాస్త్రాలకు ఉపమాన సంబంధమైన నిర్వచనాలు చెప్పుకోలేదని మనకెట్లా తెలుసు? అనగా అటువంటి తాంత్రికులు ఆ విధులను వాస్తవంగా ఆచరించి ఉంటారు కూడానన్నమాట. ఈ మాట నిర్ధారణగా చెప్పలేకపోయినా, కాదని కొట్టివేయటం కూడా సాధ్యమయేదికాదు.

మహానిర్వాణ తంత్రం మనుషులలో మూడు విధాలైన వారున్నట్లు గుర్తిస్తుంది. మొదటి వర్గీకరణలోకి వచ్చేవారు జంతువుల వంటివారు. ఆ మనుషులు విగ్రహారాధన వంటి సంప్రదాయికమైన పూజలు మాత్రమే చేయగలరు. రెండవ వర్గీకరణలోకి వచ్చేవారు వీరులవంటి మనుషులు. వారు తాంత్రిక విధులను ఆచరిస్తారు. అది పునర్జన్మ మార్గం. మూడవ వారు తాంత్రిక ధ్యానం మాత్రం చేస్తారు. వారికా విధులు తమలో అంతర్గత భాగమవుతాయి. అది మోక్ష మార్గం.

ఈ అధ్యాయానికి మొదట మనం 'కల్పిత కల్పనలతో ప్రయోజనమేమిటి? అనే మాటను చూశాము. వాస్తవమైన ఆచరణ లేకుండానే కేవలం ఊహాగానాలతో సంతృప్తి పడేవారిని ఈ వాక్యం అపహాస్యం చేస్తున్నట్లు కనిపిస్తుంది. పలుమార్లు ఆచరించి ఒక స్థాయి చేరిన తర్వాత ధ్యానానికి పరిమితం కావటం వేరు. కాని, ఆద్యంతం కేవలం ధ్యానమన్నది అర్థరహితం.

బృహదారణ్యకోపనిషత్తులోని ఒక ఉదంతానికి దీనితో మరింత సన్నిహిత సామ్యం కన్పిస్తుంది. ఒక ఉపాసకుడు తన భార్యతో శృంగార ఆలింగనంలో ఉండి, తన చర్యలోని ప్రతి భాగమూ అగ్నిలోకి వేసే వైదికమైన హవిస్సు అని భావిస్తాడు. దీనినే తిరగవేసి చూస్తే, యజ్ఞ కుండంలోకి హవిస్సును వేసే ఉపాసకుడు తన ప్రతి చర్యనూ శృంగార కార్యంలో భాగంగా భావించవచ్చునన్నమాట. తంత్రశాస్త్రం చెప్పేదానిని బట్టి, తాంత్రిక

విధులలో సభ్యురాలైన స్త్రీతో మైథునం కూడా ఒక విధే. మైథునం యజ్ఞకుండంలోకి హవిస్సును వదలటం వంటిదే. ఆ విధంగా, ఉపనిషత్ పరమైన మోక్ష మార్గం నుంచి బ్రాహ్మణులు తొలగించిన మోహతత్త్వాన్ని తంత్ర శాస్త్రాలు పునరుద్ధతి తెస్తున్నాయన్నమాట.

భారతీయ సాహిత్య, శృంగార సంప్రదాయాలలో ద్వంద్వార్థాలకు చాలా చోటు ఉంది. అదే పద్ధతిలో పైన ప్రస్తావించిన ఆలింగనం అనే మాటకు సంకేతాలను చూసి ఉంటారనుకోవచ్చు. దాని అర్థం ఇద్దరూ, రెండూ అని కావచ్చు. ఏదీకాదని కూడా కావచ్చు. అక్షరాలా అని కావచ్చు, కేవలం సంకేతప్రాయమని కావచ్చు. రెండింటిలో ఏదీ కాకపోవచ్చు. అది జంట అర్థాలకు సూచనలు మాత్రమే. అందులో ఏది సరైనదో తేల్చి చెప్పేది అయిదు 'మ' కారాలు. సహజ సంప్రదాయాలకు భిన్నమైన ఈ చర్యలు కేవలం ఊహాగానాలా లేక వాటిని ఆచరించారు కూడానా అనే దానికన్న, ఆ విషయాలపై ఉన్నత స్థాయిలో జరిగిన చర్చ తాంత్రికులకు, భారతీయ మతంలోని ప్రధాన స్రవంతిలోగలవారికి కూడా ప్రధానమైందన్నది గమనించవలసిన విషయం.

తొలికాలపు తాంత్రికులు తాము అనుసరించామన్న విధులను వాస్తవంగా అనుసరించలేదన్నది కొందరి వాదన గనుక, వారాపని ఎల్లప్పుడూ చేసేవారంటూ ఎదురు వాదన చేయాలని కొందరికి అనిపించవచ్చు. కాని శాస్త్రాలలో ఎల్లప్పుడూ కొన్ని అస్పష్టతలుంటాయి. మనం వాటిని చదివి అటైనా మాట్లాడవచ్చు, ఇటైనా మాట్లాడవచ్చు. ఆ విధంగా తంత్రాలు కొందరికి విధి సాంప్రదాయాలని తోచగా కొందరు కేవలం కల్పనలన్నారు. కొందరికది మైథున విధికాగా, ఇతరులకు జ్ఞాన సముపార్జన కోసం ఉపయోగపడే ధ్యానమార్గం. మరికొందరికి రెండూ కూడా. ఊహా గానాలకు అర్థం దానిని ఆచరించకూడదని కాదు. ఆచరణకు అర్థం ఊహించరాదని కాదు. అవి రెండూ ఏక కాలంలో జరగవచ్చు. తాంత్రికులు రెండింటినీ ఏకకాలంలో చేయగల సమర్థులన్నది మాత్రం నిశ్చయం.

## అందులో స్త్రీల కోసం ఏమున్నట్లు?

'వామ' అనే మాటకు ఎడమచేయి, స్త్రీ అనే అర్థాలు ఉన్నాయి. మైథునం ప్రమాదకరమైనది, తాంత్రిక విధానానికి కేంద్రమైనది కూడా. తాంత్రికతను 'వామపథ' మనటం దానికి స్త్రీత్వాన్ని ఆపాదించటం, మాలిన్యతను అంటగట్టటం కూడా. తాంత్రిక మైథునాచారాలను, తాంత్రిక స్త్రీలను కూడా జాగ్రత్తగా నియంత్రించటం కనిపిస్తుంది. అనేక తాంత్రిక విధులలో వారు మైథున క్రియ భాగస్వాములు కావటంతోపాటు స్త్రీ దేవతలను చేరేందుకు వాహికలు. ఆ కాలంలో స్త్రీలపట్ల ఉండిన సాధారణాభిప్రాయాలపై, తాంత్రికాచారాలలో స్త్రీలది కేంద్రపాత్ర కావటం అనే స్థితికి గల సానుకూల ప్రభావాన్ని చూశాము. శక్తి, దేవత అనే పదాలు కూడా విరివిగా ఉపయోగంలో ఉండేవి. మహాభారతం,

రామాయణం తొలి పురాణాల రూపంలో ఉండగా, శైవ తంత్రాలలో అధిక భాగం, కొన్ని వైష్ణవ తంత్రాలు, శివపార్వతుల మధ్య సంభాషణలుగా సాగుతాయి. కాని, స్త్రీల స్థానం ఇంతగా ఉండినప్పటికీ తాంత్రిక విధానంలో తాము దోపిడీకి గురికావటం తప్ప వారికి ప్రయోజనం ఏమైనా కలిగిందా అన్నది సందేహాస్పదమే.

ప్రధానమైన తాంత్రిక క్రతువులలో పురుష తాంత్రికుడు శివుడిని ప్రార్థించగా ఆయన తనలో ప్రవేశిస్తాడు. తాంత్రికుని మహిళా భాగస్వామి శక్తిని ప్రార్థించగా ఆమె ఆ మహిళలో ప్రవేశిస్తుంది. తను తన మహిళా భాగస్వామితో ఏకమైనప్పుడు, ఆమెలోని దేవతాశక్తి (లేదా మైథున స్రావాలు) తన వీర్యంతో కలసి, వెన్నెముక ద్వారా పలు చక్రాల ద్వారా శిరస్సు వరకు ప్రయాణిస్తాయి. అప్పుడు పూర్తి జ్ఞానోదయాన్ని, లేదా మోక్షాన్ని కలిగిస్తాయి. ఈ విధానంలో ఇమిడి ఉన్న శక్తిని కుండలిని అంటారు. అందులో దైహిక స్రావాలు ఒక మగసర్పం, ఒక ఆడ సర్పం రూపంలో వెన్నెముక చుట్టూ పెనవేసుకుని ఉంటాయి. (సంపూర్ణారోగ్యానికి చిహ్నంగా వైద్యరంగంలో కన్పించే పెనవేసుకున్న సర్పాల చిహ్నంవలె). కుండలిని ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచుకునేందుకు, ఒకోసారి చిరంజీవత్వ సాధనకు వీలు కల్పించే మార్గాలను యోగవిద్య ఇప్పటికే కనుగొన్నది. ఆచార పూర్వకమైన మైథునం ద్వారా అదే లక్ష్యాన్ని సాధించే ఆలోచనను తాంత్రికత ముందుకు తెచ్చింది. కుండలినీ యోగ గురించి నాథ్ చెప్పిన పద్ధతిని బట్టి, సముద్రగర్భంలోని ఆడగుర్రం వెన్నెముక మొదటగల అగ్ని. దానికి కుండలినీ సర్పంతో సమాన ధర్మం ఉంది. భారతదేశంలో ఒకోసారి అశ్వాలకు సర్పాలతో నిమిత్తం ఉంటుంది. ఈ తాంత్రిక విధిలో వీర్యానిది కేంద్ర స్థానం కావటాన్ని బట్టి ఆ విధిని రూపొందించింది పురుషుల కోసమనే అభిప్రాయం కలుగుతుంది. అయితే కొన్ని భారతీయ రచనలు (వైద్య గ్రంథాలతో సహా), పురుషులవలె స్త్రీలకు కూడా వీర్యం ఉంటుందని, దానిని వారు వెన్నెముక ద్వారా మెదడు వరకు పంపగలరని అభిప్రాయపడతాయి. కొన్ని శాస్త్రాలైతే, స్త్రీ వీర్యాన్ని తన జననేంద్రియం లోకి గ్రహించి తన వెన్నెముక ద్వారా మెదకుడు పంపగల శక్తి పురుషునికి ఉందని రాసాయి.

తంత్రశాస్త్రాలు స్త్రీలు ఎంత అద్భుతమైనవారో పేర్కొంటాయి. ఆ వర్ణనలను గమనించండి: "స్త్రీలు దేవతలు, స్త్రీలు జీవితం, స్త్రీలు నిజంగా ఆభరణాలు. పురుషుడు ఎల్లప్పుడూ స్త్రీతో సంబంధం కలిగి ఉండాలి. ఆమె భార్య అయినా, మరొకరి భార్య అయినా. నేను నీకు చెప్పినదే అన్ని తంత్రాల రహస్యం" అని యోని తంత్రంలో రాశారు. కాని తాంత్రిక స్త్రీలకు సమానస్థానం ఉండేదనేందుకు ఎటువంటి ఆధారాలు లేవు. "అందులో స్త్రీలకు ఏమున్న"దనే ప్రశ్న తాంత్రికులకు అన్నిటికన్న ఇబ్బందికరమైనదని అన్నారు ఒకప్పుడు. మొత్తానికి అందుకు సమాధానం, "ఎక్కువేమీ కాదు" అన్నదే

అయినట్లు కనిపిస్తుంది. స్త్రీ, పురుషులలో ఎవరి పాత్ర ఏమిటనే దానిపై తాంత్రిక విధులలో నిర్దిష్టమైన పద్ధతులున్నాయి. అయినప్పటికీ వాటిని అటు ఇటు మార్చేందుకు కూడా అవకాశాలు ఉన్నాయి. తాంత్రిక బృందాలలో చేరిన స్త్రీలు తమ కుటుంబాల నుంచి కొంత స్వేచ్ఛ లభించినట్లు భావిస్తారు. కాని ఆ మార్గం ఉపయోగపడింది చాలావరకు పురుషులకే తప్ప స్త్రీలకు కాదు.

తమ గురించి ఇతరులు ఏమి భావిస్తారనే విషయాన్ని తాంత్రికులు సాధారణంగా పట్టించుకోరు. తమను ఖండించే మర్యాదస్తులను వారు హేళనగా తోసిపుచ్చేవారనిపిస్తుంది. కాల్పనిక కల్పనలవల్ల ఉపయోగమేమిటనే ప్రశ్నలోనే ఇది కొంత ప్రతిఫలిస్తున్నది. ఉప వాస దీక్షలు, విగ్రహారాధనలను ఈ ప్రశ్న వెక్కిరిస్తుంది. ఈ విధమైన తాంత్రికులలో అఘోరీలను తీవ్రవాదులనవచ్చు. వారికి ఏదీ దారుణంగా తోచదు. సంతోషం, బాధల విషయమైగల సంప్రదాయిక ఆలోచనలను తామెంత మాత్రం లక్ష్యపెట్టమని చెప్పేందుకు వారు ఏదైనా చేస్తారు, ఏదైనా తింటారు. అటువంటి నిర్లక్ష్యాన్ని ఆ విధమైన ప్రవర్తన ద్వారా ముందు తమకు తాము అలవరచుకుని తర్వాత దానిని ఇతరులకు ప్రదర్శిస్తారు. వామ సూత్ర వంటి శాస్త్రాలు మైథునం, మాంసభక్షణం పూర్తిగా సాధారణమైనవని పేర్కొన్నందున, ఆ రెండింటిలో దైవత్వం ఉన్నట్లు నిరూపించేందుకు వారు చాలా చేయవలసి ఉంటుంది. అందువల్ల కొందరు తాంత్రికులకు మైథున విధి అన్నది భార్యతోనేగాక సోదరితో, నిమ్న జాతి స్త్రీతో అయినా కావచ్చు.

మహానిర్వాణ తంత్రం స్వంత భార్యకు, మొత్తం తాంత్రికుల బృందానికి చెందిన స్త్రీకి మధ్య తేడా చూస్తుంది. ఈ తంత్రం చివరి ఇద్దరు స్త్రీలతో సమాగమాన్ని నిషేధిస్తుంది. ఇతర తంత్ర శాస్త్రాలు మరొకరి భార్యతో మైథునాన్ని కూడా ఆమోదిస్తాయి. అటు వంటి శాస్త్రాలపట్ల తనకు విముఖత ఉన్నట్లు మహానిర్వాణ తంత్ర రచయిత చెప్తాడు. ఆ రచయిత అటువంటి వైఖరి తీసుకోవటానికి కారణం శుద్ధి కార్యక్రమ ప్రభావం. తన భార్యతో సంపర్కంలో ఆమె "పుష్పాన్ని" ఉపయోగించటం కూడా ఉంటుంది. "పుష్ప" మన్నది రుతుస్రావ రక్తానికి అలంకారికమైన పేరు. ఈ ప్రక్రియలో పాల్గొనే ఇతర స్త్రీలను 'శక్తు'లంటారు. వారు ఇతర పురుషుల మైథున భాగస్వాములు.

## కులాలు తలకిందులు కావటం

కులాలను అనేక సాన్యాసిక ధోరణులు, భక్తి ఉద్యమాల వలెనే తాంత్రిక సంప్రదాయం కూడా పరిగణనలోకి తీసుకోదు. క్రీ.శ. పదకొండవ శతాబ్దం వచ్చేసరికి, అప్పటికే కొన్ని శతాబ్దాలుగా తంత్ర శాస్త్రాలు సంస్కృతంలో ఉన్నాయి. అవి బ్రాహ్మణ వర్గాలలోకి కూడా చేరాయి. ముఖ్యంగా కశ్మీర్‌లో. ఒక మేరకు అభినవ గుప్తుని రచనల

ద్వారా. కశ్మీర్ రాజాస్థానంలోనూ అవి ప్రవేశించాయి. దాని అర్థం అవి బ్రాహ్మణులకు పరిమితమయ్యాయని కాదు. దేవాలయాలలో సామూహిక పూజల వల్ల సంస్కృత గ్రంథాలు అందరికీ పరిచయమైనట్లే తాంత్రిక శాస్త్రాల విషయంలోనూ జరిగి ఉంటుంది. స్త్రీల పరిస్థితి పైన చెప్పినట్లుండగా, భక్తి ఉద్యమంలో కన్నా తాంత్రిక సంప్రదాయంలో నిమ్న కులాలపాత్ర మొదటినుంచి కూడా చాలా ఎక్కువగా ఉండేదనేందుకు ఆధారాలున్నాయి. తాంత్రికులు ఉద్దేశపూర్వకంగానే అపరిశుద్ధిని తమ సంప్రదాయంలోకి స్వీకరించారు. భిక్షాటన కోసం కపాలాలను పాత్రలుగా ఉపయోగించారు. మద్య మాంసాలను ఆహారం చేసుకున్నారు. స్మశాన సన్యాసులను తమలో చేర్చుకున్నారు. వారిలో అధికులు నిమ్న జాతులకు చెందినవారు. పౌరాణిక హిందూ విధివిధానాలను తాంత్రిక సంప్రదాయం తలకిందులు చేసింది. అధికారం, కాలుష్యం అనే అంశాలపై బ్రాహ్మణుల దృక్పథాలను అది అక్షరాలా, సంకేతాత్మకంగా కూడా తలకిందులు చేసింది.

కొన్ని తంత్ర శాస్త్రాలు స్త్రీలు, పురుషులు అనే రెండే కులాలున్నాయని వాదిస్తాయి. తాంత్రిక లక్షణాలుగల స్కంద పురాణం, సృష్టిలోని అన్ని ప్రాణులు శివ, పార్వతులకు సహజోపాసకులంటుంది. అందుకు కారణం వాటిలో మగ ప్రాణులకు శివుని చిహ్నమైన లింగం, ఆడవాటికి పార్వతివలె స్త్రీ జననేంద్రియాలు ఉండటమని వివరిస్తుంది. మనలోని ఆత్మలు బ్రహ్మను మనలో నిలిపినట్లు, జననేంద్రియాలు కూడా దైవత్వానికి గుర్తులవుతాయి. మహానిర్వాణ తంత్రం తాంత్రికులంతా కలిపి ఒక కులమని, అందులోని సభ్యులు కౌలులని అంటుంది. అందులోని ఈ కింద వాదనను గమనించండి : ఇవి పార్వతితో శివుడన్న మాటలు :

## కులం నిరర్థకత

అన్ని జీవుల పాదముద్రలు ఏనుగు పాదముద్రలో అమరిపోయినట్లు, అన్ని ధర్మాలు కులధర్మంలో ఇమిడిపోతాయి. కౌలులు ఎంత శ్రేష్ఠ లక్షణాలు గలవారు! స్వయంగా వారే పుణ్యక్షేత్రాలు. కేవలం తమతో సంపర్కంవల్ల ఇతరులను, పారియాలను, అత్యంత దుర్మార్గులను సైతం పరిశుద్ధులుగా మార్చగలరు. గంగానదిలో సంగమించిన జలాలన్నీ గంగగా మారినట్లు, కుల సంప్రదాయంలో చేరిన వారంతా కౌలులవుతారు. సముద్రంలో కలిసిన జలాలను తిరిగి విడదీయలేనట్లు, కుల జలంలో చేరిన మనుషులను కూడా ఇక వేరుచేయలేము. బ్రాహ్మణుల నుంచి పారియాల వరకు ఈ భూమిపైగల ద్విపాద జీవులన్నీ కులాచారంలో నిష్ణాతులవుతాయి...కుల సభ్యులు ఎవరైనా పారియాలను గాని, విదేశీయులను (యవనులు, గ్రీకులు) గాని అధములని భావించి, లేదా స్త్రీని, ఆమెపట్ల గల చిన్నచూపు వల్ల, కులంలోకి అనుమతించనట్లయితే, తానే నిజంగా అధముడై, అన్నిటికన్న హీనస్థానంలోకి వెళతాడు.

గమనించదగినదేమంటే ఈ తంత్రశాస్త్రం ఒకవైపు పారియాలను, విదేశీయులను (మ్లేచ్ఛులు) అపరిశుద్ధులని పరిగణిస్తుంది. వారిని, స్త్రీలను ఎక్కువమంది గౌరవించరని అంటుంది. తాంత్రికులతో సంపర్కంవల్ల వారు పరిశుద్ధులవుతారని చాటుకుంటుంది. మరొకవైపు వారు తాంత్రిక బృందాలలోకి అనుమతించరానంతటి హీనులేమీ కారని, (కుల) కుటుంబంలోకి చేరినట్లయితే వారిని గౌరవించవచ్చునని చెప్తుంది. ఇందులోని మౌలికమైన ఆలోచన పారియాలను ఉద్ధరించటం గాక, తాంత్రికతకు గల శక్తిని చాటడం. "వారు పారియాలనే పరిరక్షించగలిగినప్పుడు బ్రాహ్మణులను ఏమి చేయగలరో ఆలోచించండి!" ఆ విధంగా కుల విభజన రేఖకు రెండువైపులా ఉండి అందుకు అనుకూలంగా, వ్యతిరేకంగా పోరాడే ఇద్దరి అభిప్రాయాలను ఈ మాటలు ప్రతిబింబిస్తాయి.

కొన్ని పురాణాలవలె తంత్రశాస్త్రాలు కూడా అవి చేసే వాదనలకు, సూచించే విధులకు అనుకూలమైన వాదనలను ముందుకు తెస్తూ, మరొకవైపు సవర్ణ హిందువులు వెలివేసే జాతులను తమలో చేర్చుకునేందుకు ప్రయత్నిస్తాయి. శివుని లక్షణాలు కూడా కొన్ని ఇందులోకి వస్తాయి. స్కంధ పురాణం వంటివి శివుడు స్వయంగా పారియా అని, శూద్రులకన్నా తక్కువవాడని అంటాయి. ప్రాంతీయ భాషలలోని జానపద కథలు ఆయన పారియా స్త్రీలతో కలిసాడని చెప్తాయి. చోళుల కాలపు కంచు విగ్రహాలు, శిల్పాలలో శివుడిని 'భిక్షాటన మూర్తి'గా చూపినప్పుడు తన కాలికి ఒక గంటకట్టి ఉంటుంది. పారియాలు వస్తున్నట్లు అగ్రవర్ణాలవారు గుర్తించటానికి వీలుగా వారి కాలికి గంటకట్టే సంప్రదాయం ఉంది. ఆ శిల్పాలను గమనించినప్పుడు, భగవంతుడు సంప్రదాయిక వేద మార్గానికి వెలుపల ఉంటాడనే విశ్వాసం బలపడుతుంది. భిక్షాటన మూర్తి రూపంలో, భైరవుని రూపంలో కూడా శివుని వెంట తరచు ఒక కుక్క ఉంటుంది. జంతు ప్రపంచంలో అది కూడా పారియానే.

## మృత జంతువులు

మోక్షానికి 'సహజ' మార్గం ఉంటుందనే భావనను నిరాకరించటాన్ని ఈ అధ్యాయానికి ఆరంభంలో చూసాము. "పాములు, పశువులు, పక్షులు, చేపలకు సహజమైన రీతిలో పుణ్యభావనలు అంటూ ఉండవు. అయినప్పటికీ తాంత్రిక విధులలో జంతువులకు ముఖ్య మైనపాత్ర ఉంటుంది. పంచ'మ'కారాల్లో రెండు (చేపలు, మాంసం) జంతు సంబంధమైనవే. వైదిక పశువులుగా పిలిచే మేకలు, గొర్రెలతోపాటు వివిధ జంతువులను దేవతకు బలిస్తారు. వాటిలో జింక, దున్న, పంది, ముళ్ళపంది, కుందేలు, తొండ, తాబేలు, ఖడ్గమృగం వంటివి ఉన్నాయి. వాటిని పదునైన కత్తితో వధించాలి. అప్పుడు ప్రధాన పూజారి ఆ జంతువు తలపై దీపాన్ని వెలిగించి దేవతకు నైవేద్యంగా ఇస్తాడు. దాని కుడి చెవిలో గాయత్రీ మంత్రం చదువుతాడు. వైదికమైన బలిలో రక్తం చిందటాన్ని తగ్గించేందుకు

ఆ జంతువుకు మొదట ఊపిరాడకుండా చేస్తారు. కాని తాంత్రికమైన బలిలో రక్తం చిందటం ముఖ్యం.

శాకాహారం విషయానికి వస్తే, ఇతర హిందువులవలె తాంత్రికులు కూడా రాజీ పడతారు. మాంసాహారాన్ని కొన్ని పరిమితులతో అనుమతిస్తారు. ఈ విషయాలలో వారికి బ్రాహ్మణులతో కొన్ని పోలికలు, కొన్ని తేడాలు ఉంటాయి :

**తినగూడని మాంసం**

ఎవరైనా మనిషి మాంసాన్ని గాని, గోవు మాంసాన్ని గాని తెలిసి తిన్నట్లయితే ఆ దోష నివారణకు పక్షంరోజులు ఉపవాసం చేయాలి. మనిషి రూపంలో గల జంతువును తిన్నా, మాంసభక్షణ చేసే జంతువును తిన్నా మూడు రోజులపాటు ఉపవాసం చేయాలి. విదేశీయులు, పారియాలు, జంతువుల వంటివారు లేదా కులద్రోహులు వండిన మాంసాన్ని భుజించేవారు పక్షం రోజులు ఉపవాసం చేయాలి. వీరు భుజించి విసర్జించిన పదార్థాలను తెలిసి కూడా స్వీకరించినట్లయితే నెలరోజులు ఉపవసించాలి. ఆ పని తెలియక చేస్తే పక్షం రోజులు. నిమ్న కులాలవారు సిద్ధంచేసిన ఆహారాన్ని ఒక్కసారి స్వీకరించినా శుద్ధికోసం మూడురోజులపాటు ఉపవాసం చేయాలి.

కాని, జంతువు వంటి మనిషి, లేక పారియా, లేక విదేశీయుడు వండిన ఆహారాన్ని తాంత్రికుల పరిధిలోనో, లేక తాంత్రికుల చేతిలోనో ఉంచినట్లయితే ఎటువంటి దోషం అంటదు. నిషిద్ధ ఆహారాన్ని కరువు కాలంలో ప్రాణాలను కాపాడు కునేందుకు, లేదా అత్యవసర స్థితిలో, లేదా చావు బతుకులవంటి పరిస్థితుల మధ్య తీసుకున్నట్లయితే దోషం కాబోదు. ఏనుగుపై లేదా రాళ్ళపై పలువురు కలిసిగాని మోయలేని కర్రదుంగలపై కూర్చుని, లేదా అందులో చెడు ఉన్నట్లు భావించేవారెవరూ లేనిచోట తిన్నా దోషమంటదు. ఆహారానికి ఉపయోగపడని జంతువులను, వ్యాధిసోకిన వాటిని, ఎవరు కూడా దేవుళ్ళకోసం సైతం చంపకూడదు. ఆ పనిచేయటం దోషమవుతుంది.

మహా నిర్వాణతంత్రంలోని ఈ భాగంలో అగ్రవర్ణాల తత్త్వం కనిపిస్తుంది. ఉదా హరణకు, మనిషి మాంసాన్ని తినటం ఎంత దోషమో ఆవు మాంసాన్ని తినటం కూడా అంతే దోషం. అందుకు ఎంతటి ప్రాయశ్చిత్తం ఉందో పారియాల చేతివంట తీసుకున్నా అదే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. ఇంకా ఇటువంటివే అందులో గమనించవచ్చు. అయితే, ఈ నిబంధనలు తినటానికి సంబంధించి ఉన్నంత క్లిష్టంగా జంతువులను చంపటం విషయంలో లేవు:

## వధించరాని జంతువులు

గోవును తెలిసి వధించిన వ్యక్తి నెలరోజులపాటు ఉపవాసం చేసి, తర్వాత మరొక నెల కాలం కొద్దిపాటి ఆహారమే తీసుకోవాలి. మూడవ నెలలో భిక్షాటనలో లభించినది భుజించాలి. ఈ దీక్ష అంతా ముగిసిన వెనుక శిరోముండనం చేయించుకుని తన కులం వారికి, దగ్గరి-దూరపు బంధువులకు విందు చేయాలి. ఒకవేళ తెలియకుండా గోవధకు పాల్పడితే, దీనంతటిలో సగం ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. ఈ కార్యక్రమమంతా ముగిసే వరకు క్షురకర్మలు చేసుకోకూడదు. గోళ్ళు కత్తిరించుకోవటం, బట్టలు ఉతుక్కోవటం వంటివి కూడా చేయరాదు. గోవును అజాగ్రత్త వల్ల చంపినట్లయితే అందుకు శుద్ధి కోసం బ్రాహ్మణుడు ఎనిమిది రోజులు, క్షత్రియుడు ఆరు, వైశ్యుడు నాలుగు, శూద్రుడు రెండు రోజులపాటు ఉపవసించాలి.

ఒకవేళ ఏనుగు, ఒంటె, దున్న, గుర్రం వంటి జంతువులను తెలిసి చంపినట్లయితే చేయవలసిన ఉపవాసం మూడు రోజులు. జింక, గొర్రెపొటేలు, మేకపిల్ల వంటి వాటికి ఒక రోజు. నెమలి, చిలుక, బాతు అయితే సూర్యుని వెలుగు ఉన్నంతసేపు. ఎముకలు గల ఏ ఇతర జంతువును చంపినా ఒక రాత్రి మాంసాహారం స్వీకరించరాదు. ఎముకలు లేని వాటిని చంపితే అందుకు విచారం వ్యక్తపరిస్తే సరిపోతుంది. రాజులు వేట సమయంలో జంతువులు, చేపలు, పక్షులను వధించినట్లయితే, అది శాశ్వతమైన రాజధర్మం గనుక వారికి ఏ దోషం అంటదు. అయితే, భగవంతుని కోసం తప్ప ఏ ప్రాణిని కూడా గాయ పరచకూడదు. ఆ పని ధర్మశాస్త్రాలు నిర్దేశించిన విధంగా చేసిన పక్షంలో ఏ పాపం సోకదు.

ఇంతకు ముందటి భాగంతో పోల్చితే, ఇందులో దేవతల కోసం జంతువును వధించేందుకు ఒక వీలు ఉంది. వేటాడినందుకు రాజులకు మినహాయింపు ఉంది. తంత్రాలు ఎప్పుడూ రాజులకు అనుకూలం కావటం అందుకు కారణమనాలి. తెలిసి చేయటం, తెలియక చేయటానికి, ఉద్దేశపూర్వకానికి అనుద్దేశపూర్వకానికి మధ్య తేడా ఉంది. పశ్చాత్తాపానికి గుర్తింపు కనిపిస్తుంది. ఇంతకుముందటి శాస్త్రాలలో శాకాహారం గురించి చెప్తూ, పశ్చాత్తాపాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. కాని ఈసారి అది స్పష్టమైన రూపంలో ఉంది. కొన్ని జంతువుల వధ విషయమై విచారం వ్యక్తపరిస్తే చాలు.

## శైవ ఆలయాలు, తాంత్రిక ఆలయాలు

### ఎలిఫెంటా, ఎల్లోరా

హర్షునికి ముందు, తన కాలంలో, ముఖ్యంగా ఆ తర్వాత, హిందూ దేవాలయాల నిర్మాణం ఉచ్ఛస్థాయికి చేరింది. అప్పటివరకు వాటిని కొండలను తొలచి నిర్మించగా

ఇప్పుడు విడి నిర్మాణాలు మొదలయాయి. నిర్మాణశైలి ఒకో ప్రాంతంలో ఒకో విధంగా అభివృద్ధి చెందింది. ముంబాయికి సమీపాన ఎలిఫెంటా దీవిపై నిర్మించిన శివాలయం, ఆ కాలంలో శివారాధనలో గల శక్తికి, ప్రతిష్టకు తార్కాణంగా నిలుస్తుంది. శివుని గురించి గల అనేక విశ్వాసాలను, కథలను అక్కడ చిత్రీకరించారు. ఆయన పట్ల తాంత్రికులకు గల భిన్నమైన విశ్వాసాలు అక్కడ ప్రతిఫలిస్తాయి. తంత్రశాస్త్రాలు పూజా క్రతువులో భాగంగా ఏమేమి చేసాయో, అవి ఎల్లోరాలోని కైలాసనాథ దేవాలయంలో కనిపిస్తాయి. సంప్రదాయకమైన హిందూ రూపాలన్నీ అక్కడ తలకిందులవుతాయి.

ఈ రెండు మహా నిర్మాణాలు కొండలను తొలిచి నిర్మించేదశకు, విడిగా నిర్మించే దశకు మధ్య కాలానికి చెందినవి. ఈ రెండూ ఏకకాలంలో గుహలు, దేవాలయాలు కూడా. తాను రాయిని చెక్కి చిత్రించే శిల్పాలు ఆ శిలలో ముందే ఉన్నాయని, తాను చేసేదల్లా ఆ శిల్పానికి చెందని భాగాలను తొలగించడం మాత్రమేనని మైఖేలేంజలో అన్నాడొకసారి. ఈ రెండు అసాధారణమైన దేవాలయాలకు కూడా అదే మాట వర్తిస్తుంది. వీటిలో ఎలిఫెంటాను ఎల్లోరా కన్న ముందు నిర్మించారనేందుకు బహుశా సందేహం అవసరంలేదు. దానిని కాలచూరి వంశానికి చెందిన మొదటి క్రిష్ణరాజు (550–55 ప్రాంతం) నిర్మించాడనే అభిప్రాయం ఉంది. ఆ కాలంలో ఆ ప్రాంతంలో ప్రాచుర్యం పొందిన శైవ పాశుపత శాఖ అనుయాయి తను. ఆ దేవాలయంలో శివ పార్వతుల వివాహం, వారి పాచికలాట, గంగావతరణ, శివతాండవం, లకులిశునిగా యోగాచార్యుని పాత్ర నిర్వహించటం, తన త్రిశూలంతో ఒక అసురుని సంహరించటం, అర్థనారీశ్వర రూపం, శివలింగ రూపం వంటివి కనిపిస్తాయి. శివపార్వతులు కైలాస పర్వతంపై శృంగారం జరుపుతుండగా అందుకు అభ్యంతరం చెప్పిన రావణుడు ఆ పర్వతాన్ని పెకిలించి పైకెత్తుతాడని, అప్పుడు శివుడు పర్వతాన్ని తన పదఘట్టనతో కిందికి నొక్కివేసి రావణుడిని దాని కింద బందీచేసాడని ఒక కథ ఉంది. ఈ కథకు చిత్రీకరణ కూడా ఎలిఫెంటాలో ఉంది.

ఈ రెండు దేవాలయాల మధ్య వ్యవధి 200 సంవత్సరాలు, దూరం 150 మైళ్ళు అయినందున, ఎల్లోరా శిల్పులకు ఎలిఫెంటా గురించి తెలిసే ఉండాలి. ఎలిఫెంటా సాంకేతిక నైపుణ్యాలు ఎల్లోరాలో కనిపిస్తాయి. ఎల్లోరా కొండ చరియల వెంట క్రీ.శ. ఆరు నుంచి తొమ్మిది శతాబ్దాల కాలంలో 30కి పైగా దేవాలయాలను సృష్టించారు. ఎనిమిదవ శతాబ్దంలో రాష్ట్ర కూటులు అప్పటికే గల ఒక చిన్న గుహాలయాన్ని కైలాసనాథ దేవాలయ రూపంలో గొప్పగా అభివృద్ధి పరచారు. దాని నిర్మాణానికి పదిహేను సంవత్స రాలు తీసుకుంది. యుద్ధాలలో ఓడిన చాళుక్య, పల్లవ రాజ్యాల నుంచి శిల్పకారులను రప్పించారు. అందుకే వారి శిల్ప కళారీతులు ఒక మేరకు మహామల్లపుర దేవాలయాలను పోలి ఉంటాయి.

ఎల్లోరా దేవాలయ శిల్పులు ఆలయ ప్రాంగణం ముందు భాగంలో ఏనుగుల విగ్రహాలను చెక్కి, రెండు భారీ రాతి స్తంభాలను రూపొందించి, ఆలయాన్ని సైతం రాతి లోకి చెక్కుతూపోయారు. తొంభై అడుగుల ఎత్తు గల గోపురాన్ని తయారు చేశారు. గుహాలయాల తొలిదశలో కుడ్య శిల్పాలు ఆలయాల లోపలి భాగంలోనే ఉండేవి. కాని ఎల్లోరాలో ప్రధానాలయపు బయటి భాగాన్ని కూడా తొలిచి చుట్టూ ప్రదక్షిణలకు వీలు కల్పించారు. బయటవైపు కూడా శిల్పాలు కనిపిస్తాయి. ఎల్లోరా దేవాలయాన్ని హిమాలయాల లోని కైలాసగిరిని పోలినట్లు నిర్మించారు. దాని అడుగున రావణుడు కూడా కన్పిస్తాడు. మహిషాసురమర్దిని శిల్పం మరొక విశేషం.

## ఖజురహో, కోణార్క

తర్వాత కాలంలో నిర్మించిన మరో రెండు గొప్ప దేవాలయాలు ఖజురహో, కోణార్క. వాటిని తాంత్రిక శాస్త్రాల సందర్భంలోనే బాగా అర్థం చేసుకోగలం. ఆ కాలంలో శాఖల వారీగా దైవారాధన జరిగేదనేందుకు ఈ రెండు ఆలయాలు తార్కాణాలు. వాటిలో కన్పించే శైవశాఖలు కొన్ని తాంత్రిక సంబంధమైనవి.

ఛందేలులు పాలించిన బుందేల్‌ఖండ్ అనే చిన్న రాజ్యానికి ఖజురహో రాజధాని. కవులు, వ్యాకరణ పండితులు, నాటకకర్తలతో ఆ నగరం పెద్ద సాంస్కృతిక కేంద్రంగా ఉండేది. సంపన్నులైన జైనవర్తకులు, ఆస్థానాధికారులతో ఆ రచయితలు, కళాకారులకు నిత్య సంపర్కాలుండేవి. ఆ కాలంలో యోగులు, సన్యాసుల మఠాలు, పీఠాలు బలపడటంతో రాజులు క్రీ.శ. 900–1150 మధ్య బ్రహ్మాండమైన దేవాలయాలను నిర్మించారు. ఖజురహో వద్ద గల ఇరవై అయిదు ఆలయాలతోపాటు, రథం ఆకారంలో బహు సుందరమైన కోణార్క సూర్యదేవాలయంతోపాటు ఒడిశా, అస్సాం, కాఠ్మాండులలోని ఇతర దేవాలయాల వెలుపలి భాగంలో మైథున శిల్పాలు అనేకం ఉన్నాయి.

అదే విధమైన కోణార్క దేవాలయాన్ని మొదటి నరసింహదేవుడు (క్రీ.శ. 1238–58) తన తల్లికి కానుకగా నిర్మించి ఇచ్చాడంటారు. పూర్తిగా రథరూపంలోగల ఆ ఆలయంపై సూక్ష్మ రూపంలో సూర్యుడు తన సప్తాశ్వాల రథంలో కనిపిస్తాడు. అదే ఆలయంలో సైనికులను తొక్కివేస్తున్న ఏనుగులు , రాక్షసులను తోసివేస్తున్న గుర్రాలు, శృంగారం నెరపే జంటలు, నరసింహుడిని పూజిస్తున్న వారి చిత్రాలు, ఇంకా అనేకం కనిపిస్తాయి.

భారతదేశంలోని మరి అనేక దేవాలయాలలో కూడా ఇంతకన్న కొంత తక్కువగా శృంగార శిల్పాలు కన్పిస్తాయి. బౌద్ధ స్థూపాలపైనా నిండైన వక్ష సంపదలు కలిగిన యక్షిణులు, అప్సరసలు ఉంటారు. లోకంలోని వస్తుగత ప్రపంచాన్నంతా చిత్రీకరించే ప్రయత్నంలో అది భాగమనాలి. అందాన్ని చిత్రీకరించటమేగాక, ఆరాధకులు వాటిని వదలివేసి, దేవాలయాల అంతర్భాగంలోకి ప్రవేశించటానికి అది చిహ్నప్రాయం కావచ్చు.

శృంగార శిల్పాలు మూడు విధాలుగా ఉండటం గమనించదగ్గది. స్త్రీల ఒంటరి శిల్పాలు అన్నింటికన్న పెద్దవి కాగా, జంటలు అంతకన్న కొంత చిన్నగా, పలువురు కలిసి శృంగారంలో పాల్గొనేవి ఇంకా చిన్నగా ఉంటాయి. మితిమీరినతనంగా తోచేవి తేలికగా మన దృష్టికిరాని చోట్ల చిత్రీకరించారు.

శృంగార శిల్పాలు సంతానశక్తిని కూడా ప్రతిఫలిస్తాయి. ఆ జంటలు తాంత్రికమైన వన్నది కొందరి అభిప్రాయం. అనేక తాంత్రిక శాఖలకు ఖజురహో ఒక ముఖ్య కేంద్రంగా ఉండేది. బహుశా చందేలా రాజులు కూడా తాంత్రికులై ఉంటారనే అభిప్రాయం ఒకటుంది. అస్సాంలోనూ ఈ లక్షణాలు కన్పిస్తాయి. స్త్రీ–పురుషుల భంగిమలు, కొన్ని చోట్ల ముగ్గురు నలుగురు కలిసి ఉండటమన్నది కొన్ని తంత్రశాస్త్రాల వర్ణనలకు సరి పోతుంది. శరీర సౌష్ఠవం గల కొందరు స్త్రీలు యక్షుణులో, అప్సరసలో కాక తాంత్రిక యోగినులైనట్లు తోస్తుంది. తాంత్రిక శాస్త్రాలు అరవై నలుగురు యోగినుల గురించి పేర్కొనటం తెలిసిందే. వారిలో కొందరికి జంతు ముఖాలుంటాయి. ఎనిమిది–పన్నెండు శతాబ్దాల మధ్య యోగినీ దేవాలయాలు అనేకం నిర్మాణం కావటాన్ని బట్టి, ఆ ప్రదేశాలలో తాంత్రిక క్రియలు జరిగేవన్న అభిప్రాయానికి బలం చేకూరుతుంది.

చందేలా రాజులు ఖజురహోలో ఒక దేవాలయాన్ని ఘజనీ మొహమ్మద్ మొదటి దండయాత్ర కాలంలో నిర్మించారు. వాటన్నింటిలోకి గొప్పదైన ఖండరియా మహాదేవ ఆలయాన్ని తర్వాతి దండయాత్రల కాలంలో నిర్మించారు. అయితే ఆయన సేనలు ఈ దేవాలయాల సమీపానికి ఎప్పుడూ రాలేదు. ఆ నిర్మాణాలు దండయాత్రలకు స్పందన అనలేము. అయితే, ఆ కాలానికి వైదిక సంప్రదాయాలు బలహీనపడి నూతన పూజా విధానాలు ఆరంభమైన స్థితిని అవి ప్రతిఫలించాయి. ఇస్లామిక్ రాజ్యాలు, సైన్యాలు ఉనికిలోకి వచ్చిన స్థితిలో, దేవాలయ నిర్మాణాలకు కొత్త అర్థం ఏర్పడిందని చెప్పాలి. దేవాలయ శిల్పాలలో సైనికులు, ఆయుధాలు, ఏనుగులు, పెద్ద గుర్రాలు చాలా కన్పిస్తాయి. ఆలయ నిర్మాణాలు ఒక మేరకు రాజకీయ కార్యకలాపం కూడా అయినందున, ముస్లిముల దండయాత్రల పట్ల హిందూ రాజుల ప్రతిఘటనలను అవి ప్రతిబింబించాయనాలి.

దేవాలయాలపై గల శృంగార శిల్పాలు ముస్లిముల పవిత్రతా భావనలకు ఎంత మాత్రం సరిపడేవి కాకపోయినా, వారు వాటిని ధ్వంసం చేయకపోవటం గమనించదగ్గది. ఘజనీ సైన్యాలు ఖజురహోవైపు రాకపోవటం, మొఘలుల రాక సమయానికి దేవాలయాలలో ఛందేలుల ఉనికి లేకపోవటం, ఔరంగజేబు దృష్టికి రాకపోవటం అందుకు కారణాలని భావించాలి. ఒడిశా ఆలయాలు, మొహమ్మద్ బిన్ తుగ్లక్ కాలంలో నిర్మించిన పూరీ జగన్నాథాలయం (10, 11 శతాబ్దాల చివరి దశలలో) కొంత మారుమూలన ఉన్నందున ముస్లిం పాలకుల దృష్టిని ఆకర్షించి ఉండకపోవచ్చు. లేదా, స్వయంగా శృంగార కవిత్వం, చిత్రాల పట్ల ఆసక్తిగల వారైనందున, వాటిని గమనించినా ఆ జోలికి వెళ్ళలేదనుకోవాలా?

అధ్యాయం 16

# ఢిల్లీ సల్తనేట్ పాలనలో మైత్రి, శత్రుత్వాలు
## క్రీ.శ. 650 - 1500

**కాలక్రమణిక (అన్నీ క్రీ.శ. సంవత్సరాలు)**

| | | |
|---|---|---|
| 570–632 | : | ముహమ్మద్ జీవిత కాలం |
| 650 ప్రాంతం | : | సింధూనదిని చేరిన అరబ్బులు |
| 711–715 | : | వాయవ్య భారతాన అరబ్బుల దండయాత్ర |
| 1001 | : | ఉత్తర భారతంపై ఘజనీ మహమ్మద్ (979–1030) దాడులు |
| 1192–1206 | : | ఢిల్లీని ఘోరిడ్ వంశ రాజధాని చేసిన మహమ్మద్ ఘోరీ |
| 1210–1526 | : | ఢిల్లీ సల్తనేట్ పాలన |
| 1325–1351 | : | ముహమ్మద్ బిన్ తుగ్లక్ పాలన |
| 1200 ప్రాంతం | : | ఉత్తర భారతంలో తొలి సూఫీలు |
| 1200 ప్రాంతం | : | దక్షిణ భారతంలో బసవతోపాటు వీరశైవుల కాలం |
| 1336–1565 ప్రాంతం | : | విజయనగర సామ్రాజ్య ఉచ్ఛస్థితి |
| 1398–1448 ప్రాంతం | : | కబీర్ నివసించిన కాలం |
| 1469–1539 | : | పంజాబ్‌లో సిక్కుమతాన్ని స్థాపించిన గురునానక్ |

### రామ్ రహీమ్

*రాముడు ప్రేమ పాత్రుడంటారు హిందువులు. తురుష్కులు రహీమ్ గురించి మాట్లాడతారు. తర్వాత వారు పరస్పరం చంపుకుంటారు.*

– కబీర్, 1398–1448

*నేను హత్యకు గురైనా రామ్, రహీమ్‌ల పేర్లను పునశ్చరించకుండా ఉండలేను. నాకు వారిద్దరూ ఒకే దేవుడు. నా పెదవులపై ఈ రెండు పేర్లతో నేను సంతోషంగా మరణిస్తాను.*

– మహాత్మా గాంధీ, 1947

తన హత్యకు తొమ్మిది నెలలముందు ఒక ప్రవక్తవలె గాంధీ అన్న పై మాటలు, కబీర్ చెప్పిన దానికి తలకిందులు చేసాయి. గాంధీ తాను అన్నట్లు, అవే మాటలంటూ మరణించి ఉంటాడు. భారతదేశంలో హిందువులు, ముస్లిముల చరిత్రను పరిశీలించే ముందు ఈ పరిస్థితికి గల రెండు పార్శ్వాలను మనం దృష్టిలో ఉంచుకోవాలి. ముస్లిముల

ఉనికి కారణంగా కలిగిన సాంస్కృతిక పరిణామాల ప్రభావాలకు హిందువులు తమ రీతిలో తాము స్పందించగా, మరొకవైపు బ్రాహ్మణ భావజాలాన్ని సవాలు చేసేందుకు మత పరంగా కొత్త ఆలోచనలు ముందుకొచ్చాయి.

## సున్నీలు, సూఫీలు, శైవులు...ఓరి నాయనో !

భారతదేశ చరిత్రలోని తొలి దశలను మినహాయించి తక్కిన భాగాలను పరిశీలించిన మనం, ఆ చరిత్రకు కేంద్ర శక్తులు ఏమిటని గాక ఇతర శక్తులేమిటో చూసేందుకు ప్రయత్నించాము. ఆ ఇతర శక్తులు ఇప్పటికీ ఉన్నాయి. హిందూ ప్రపంచంలో, ముస్లిం ప్రపంచంలో కూడా. అవిగాక ఢిల్లీ సల్తనేట్, మొఘల్ సామ్రాజ్యం అనే మరొక రెండు శక్తులు ఉనికిలోకి వచ్చి తమదే కేంద్రస్థానమన్నాయి. అయితే, రాజకీయాధికారానికి సంబంధించి ఒక కేంద్రమన్నది ఉన్నా, మతం విషయంలో అనేకమున్నాయి.

ఈ పరిణామాల గురించిన ప్రధానమైన ఆధారాలు మనకు జౌన్‌పూర్, అహ్మదాబాద్, మండూ, చితోర్, విజయనగర, గౌర్ తదితర ప్రాంతీయ రాజ్యాల రాజధానులలో కనిపిస్తాయి. కార్యకలాపాలు సాగింది కూడా ఎక్కువగా అక్కడనే. ఈ రాజ్యాలలో హిందూ, ముస్లిం రాజులు పలువురు పాలించారు. ఎవరూ స్థిరంగా దీర్ఘకాలంపాటు అధికారంలో లేరు. 'హిందూ' అనే మాటకు చరిత్ర ఆరంభంలోనే ఏ విధంగానైతే నిర్దిష్టమైన అర్థమంటూ లేకుండా పోయిందో, 'ముస్లిం' అనే మాట విషయంలోనూ అదే జరిగింది. హిందువులు వారందరినీ మతం గుర్తింపుతో ముస్లిములు అని కాకుండా వారు ఎక్కడి నుంచి వచ్చారన్న గుర్తింపుతో అరబ్బులు, తురుష్కులు (టర్కీ నుంచి) అనేవారు. హిందువులు కాని వారందరినీ మ్లేచ్ఛులని పిలిచినట్లు వీరందరినీ ఆ పేరిట కూడా పిలిచేవారు. హిందువులకు ఆ పాలకులపట్ల ఒక వైఖరి, పాలకులు కాని వర్తకులు, గుమాస్తాలు మొదలైన వారిపట్ల మరొక వైఖరి ఉండేది. హిందూ దేవాలయాలను ధ్వంసం చేసిన కొందరు అరబ్, తురుష్క పాలకులపట్ల దీర్ఘకాలిక నిరసనలు ఏర్పడినా సాధారణ ముస్లిముల విషయమై అరుదుగా తప్ప అది జరగలేదు. హిందువుల లిఖిత ఆధారాలలో విదేశీయులందరికి కలిపి ఏదో ఒక పేరుగాక యవన (గ్రీకు), మ్లేచ్ఛ (పర్షియన్లు), తురుష్క అనే మాటలు కనిపిస్తాయి. హిందూ దేవాలయాలను దోపిడీచేసి దేవతల విగ్రహాలపై మలాన్ని, మద్యాన్ని పోయించిన ఒక హిందూ రాజును కూడా 1148లో కశ్మీర్ రచన ఒకటి తురుష్కుడని ప్రస్తావించడం ఆసక్తికరం.

కొందరు హిందువులు చేసినపని మరింత ఆసక్తికరంగా తోస్తుంది. వారు అరబ్బులు, తురుష్కుల పేర్లను సంస్కృతీకరించి తమలో కలుపుకొనజూసారు. ఆ విధంగా ఘోరిడ్‌లు గౌరీ-కుల అయారు. ఆ మాటలకు అర్థం శ్వేత వర్ణం కలవారని లేదా పార్వతీదేవి కులస్తులని అవుతుంది. అదే పద్ధతిలో సుల్తానులు సుర-త్రాణులు (దేవతలను రక్షించే

వారు), ముహమ్మద్‌లు మహా–ముద (మహానందం) అయారు. సంస్కృతం, అరబ్బు భాషలు రెండింటిలోనూ గల 1264వ సంవత్సరపు శాసనం ఒకటి, గుజరాత్‌లోని సోమనాథ్ దేవాలయం వద్ద నిర్మించిన ఒక మసీదు గురించి హిందువుల భాషలో చెప్తుంది. ఆ మసీదు 'ధర్మ స్థాన'మని, అక్కడ ప్రజలు 'పుణ్యకర్మ' కోసం 'పూజలు' జరుపుతారని అంటుంది. శివుడు, అల్లా ఇద్దరినీ 'ఓం! నమః!' అని 'శ్రీ విశ్వనాథ' అని సంబోధిస్తుంది. భారతీయ సాహిత్యంలో సర్వ సామాన్యమైన శ్లేషార్థ ప్రయోగం వంటిదిది.

మరొకవైపున అరబ్బులు, తురుష్కులు కూడా హిందువులను హిందువులుగా పరిగణించక వైష్ణవులు, బెంగాలీలు, గొప్ప కళాకారులు అన్న పద్ధతిలో గుర్తించారు. అయితే స్థానికులలో వైష్ణవులు, శైవులు, బౌద్ధులు, సహజీయుల వంటి భిన్నమతాలు, శాఖలు ఉన్నట్లు కూడా వారు గుర్తించారు. తమను తాము ముస్లిములని, సున్నీలు, సూఫీలని గుర్తించుకోవటం కూడా మొదలుపెట్టారు. ఈ విధమైన పరిస్థితిని ముందుగా గమనించిన తర్వాత, ఇక నుంచి హిందూ, ముస్లిం అనే పదాలనే మనం కూడా ఉపయోగిద్దాము. అవసరమైన చోట్ల వారిలోని భిన్నత్వాలను చెప్పుకోవచ్చు.

## భారతదేశంలోని ఢిల్లీ సల్తనేట్‌కు ముందు నాటి ఇస్లాం

క్రీ.శ. ఏడవ శతాబ్దంలో మహమ్మద్ ప్రవక్త మరణా నంతరం కొద్ది కాలం నుంచే భారతదేశంలో హిందువులు, ముస్లిములకు మధ్య సంబంధాల గురించిన ఆధారాలు అపరిమితంగా ఉన్నాయి. అల్–బిరూనీ (973–1048) భారత దేశానికి వచ్చి సంస్కృతం నేర్చుకుని అనేక హిందూ గ్రంథాలను అరబిక్‌లోకి అనువ దించాడు. తర్వాత జియా–ఉద్–దిన్ బరానీ (1285–1357), అబూ అల్–మాలిక్ ఇస్లామీ (1350లో మరణం), ఇబ్న్ బతూతా 1304 – 1368/1377) వంటి వారు కూడా దేశాన్ని సందర్శించి అరబ్, పర్షియన్ భాషలలో గ్రంథాలు రాసారు.

ఘజనీ మహమూద్ కన్న ముందే ముస్లిములు వర్తకులుగా రావటంతో ఇక్కడ ఇస్లాంకు ఉనికి ఏర్పడింది. 650కి ముందు అరబ్బులు దిగువ సింద్ ప్రాంతంలో తమ గుర్రాల వ్యాపార రక్షణకు, ఇక్కడి నుంచి సుగంధ ద్రవ్యాల వర్తకానికి దాడులు జరిపారు. 650 నాటికి సింద్ ప్రాంతంలో ప్రవేశించారు. అప్పటికే 647లో హర్షుడు మరణించాడు. 663 ప్రాంతంలో అరబ్ బలాలు ఆఫ్ఘనిస్తాన్ నుంచి బోలన్ కనుమల మీదుగా సింద్‌లోకి ప్రవేశించి, గుర్రాలనిచ్చి సుగంధ ద్రవ్యాలు తీసుకోవటం మొదలు పెట్టాయి. అదంతా శాంతియుతంగానే సాగింది. ఆ తర్వాతనే మొదట అరబ్బులు, తర్వాత తురుష్కులు, మంగోలుల దండయాత్రలు ఆరంభమయాయి. 713లో వచ్చిన మహమ్మద్ ఇబ్న్ ఖాసిం, హిందువులకు, బౌద్ధులకు మతపరమైన హక్కులు కల్పించే షరతులపై సంధికి ప్రయత్నించాడు. ఆయన అధికారాలు ఇతర మతాలవారిని కాఫిర్లుగా భావించటం, వారిని

అణచివేయ చూడటం వంటివి చేయలేదు. కాకపోతే వారిపై జిజియా పన్ను విధించాడు. ఆయన తర్వాత తన సైనికులు ఇక్కడనే స్థిరపడి, స్థానికులను వివాహమాడి, ముస్లిం టీచర్లను, మసీదులను తీసుకువచ్చారు. అదే కాలంలో గుజరాత్‌లోని పాలకులు అరబ్బులతో వర్తకం కోసం భద్రేశ్వర్ రేవు ప్రాంతపు ఇస్మాయిలీ వర్తకులకు మసీదుల నిర్మాణం కోసం అనుమతించారు.

## ఢిల్లీ సల్తనేట్

మరో మూడు వందల సంవత్సరాల తర్వాత తురుష్కులు, పర్షియన్లు, అఫ్ఘాన్లు వాయవ్య సరిహద్దుల ద్వారా భారతదేశంలోకి ప్రవేశించారు. 1001, నవంబర్ 27న తురుష్కుడైన ఘజనీ మహమూద్ దండయాత్ర విజయవంతంగా జరిగింది. తనతో యుద్ధంలో ఓడిన స్థానిక రాజు యాభై ఏనుగులనిచ్చి సంధి అయితే చేసుకున్నాడు గాని, ఆ పరాజయంతో కులభ్రష్టుడైనట్లు భావించి, రాజ్యాన్ని తన కుమారుడికి అప్పగించి, చితిపై కెక్కి ఆత్మాహుతి చేసుకున్నాడు. తదనంతరం మహమూద్ పంజాబ్, మధుర, కన్నౌజ్‌లను కూడా వశపరచుకుని వారణాసి తదితర ప్రాంతాలలో తురుష్కులను స్థిర పరిచాడు. దేశం భిన్న సంస్కృతుల సమ్మేళనం కావటానికి ఆ విధంగా నాంది జరిగింది.

ఆ వెనుక నాలుగు శతాబ్దాలపాటు భారత ఉపఖండపు ఉత్తర, మధ్య ప్రాంతాలలో అనేకానేక వంశాలు, రాజ్యాలు ఏర్పడి నిరంతర యుద్ధాలు సాగించాయి. ఢిల్లీ రాజధానిగా 1192 నుంచి 1206 వరకు ఘోరీ మహమ్మద్ పాలించిన తర్వాత రజియా అనే మహిళ నాలుగేళ్ళపాటు సమర్థవంతంగా రాజ్యాన్నేలింది.

ఘోరీ మహమూద్ అనంతరం రాజులైన పలువురిని బానిసరాజులనే వారు. వారు ఒకప్పుడు బందీలు కావటం అందుకు కారణం. ఢిల్లీని పాలించిన వారిలో అల్లావుద్దీన్ ఖిల్జీ (1296–1316 పాలనా కాలం) ఒకరు. తర్వాత కాలంలో రాజైన మహమ్మద్ బిన్ తుగ్గక్‌ను కొందరు క్రూరుడనగా, కొందరు తత్త్వవేత్త అని భావించారు. ఆయన ముస్లిం ఉలేమాలకు బదులు నిమ్న తరగతులకు చెందిన భారతీయ ముస్లిములకు ఎక్కువ అవకాశాలిచ్చాడు. తనకు మతతత్త్వం లేకపోవటం, స్థానికులకు అవకాశాలివ్వటంలో తనకు మేలున్నట్లు భావించటం అందుకు కారణాలు. ఆయన తర్వాత పాలించిన ఫిరోజ్‌షా తుగ్లక్ (1351–1388) పూరీ జగన్నాథ దేవాలయాన్ని అపవిత్రం చేసి, ముస్లిమేతరులపై మారణకాండ జరిపాడు. అప్పటివరకు మినహాయింపుగల బ్రాహ్మణులపై జిజియా పన్ను విధించాడు. 1526లో బాబర్ మొఘల్ సామ్రాజ్యాన్ని స్థాపించేవరకు ఢిల్లీ సల్తనేట్ కొన సాగింది.

ఈ కాలంలో సల్తనేట్ పాలకులు, హిందువులు మూకుమ్మడి మత మార్పిడులకు ప్రయత్నించలేదు. మార్పిడులు జరిగాయి గాని సాధారణంగా నిమ్న కులాలకు చెందిన

కూలీలు, చేతిపనుల వారు, బందీలైన వారు ఇస్లాంలోకి మారుతుండేవారు. జిజియా పన్నును నిరుపేదలకు, బ్రాహ్మణులకు మినహా తక్కినవారికి విధించేవారు. కొన్ని ఇతర పన్నులుండేవి. కాని వాటిని మత దృష్టితో గాక ఆదాయం కోసం వసూలు చేసినట్లు కనిపిస్తుంది. మతం మార్పిడికి స్పందనగా హిందువులలోని సంపన్నులు తమ మతాన్ని శక్తివంతం చేసుకునే చర్యలు కొన్ని తీసుకునేవారు. బ్రాహ్మణులకు ద్వైదీభావం ఉండేది. వారు ఒకవైపు బయటి వారికి దూరంగా ఉండాలనుకునేవారు. మరొకవైపున, తమ ప్రయోజనాల కోసం పాలకుల మద్దతు కోరుకునేవారు. అది జరగాలంటే ఆ పాలకులకు ఆమోదముద్ర వేయాలి. 1369 నాటి ఒక శాసనం సుల్తాన్లు పాండవుల వంశీకులని తేల్చింది! వారిని నిందించదలచుకున్న వారు మరొక విధమైన కథలు చెప్పారు. 1261 నాటి ఛందేలా శాసనమొకటి, విష్ణువు వరాహావతారమెత్తి భూమిని సముద్రం నుంచి పైకెత్తినట్లు తురుష్క సముద్రం నుంచి భూమిని ఒక హిందూ రాజు పైకెత్తాడని రాసింది. 1491లో మరొక శాసనం, తురుష్కులు, మ్లేచ్ఛులు, శకులు భూమి భారాన్ని తాము మోసి విష్ణుమూర్తి భారాన్ని తగ్గించారన్నది. ఇటువంటి భిన్నాభిప్రాయాలు ఒకే కాలంలో ఉండేవి.

## అశ్వాలు, అశ్వ వ్యాపారులు

భారతదేశంపై విదేశీయుల దండయాత్రలలో గుర్రాలు వహించిన కీలకపాత్ర గురించి మొదట చెప్పుకున్నాం. ఢిల్లీ సల్తనేట్‌ను స్థాపించిన తురుష్కుల పాలనలోనూ గుర్రాలది ముఖ్యమైన పాత్రే. భారతదేశంలో ఏనుగులకూ కేంద్రస్థానం ఉండేది. కాని అవి ఎక్కువ ఖరీదైనవి. ఘజనీ మహమ్మద్ భారతదేశంపై దండెత్తినప్పుడు ఆయన సైన్య మంతటికీ మధ్య ఆసియా ప్రాంతపు గుర్రాలు ఉండటంవల్ల తనది పైచేయి అయింది. తురుష్కుల గుర్రాలు, అఫ్ఘానిస్తాన్ ఏనుగులు, భారతదేశపు సైన్యాలు పేరుపొందినవి రాశాడు అల్ – బిరూనీ. భారతదేశంలో పోలో క్రీడను ప్రవేశపెట్టింది టర్కీ నుంచి వచ్చిన పాలకులే.

వారు భారతదేశంలో తమ బలగాల కోసం గుర్రాలను దిగుమతి చేసుకొనేవారు. వారేగాక వారి శత్రువులు, మహారాష్ట్ర, విజయనగర రాజులు కూడా అరేబియన్ గుర్రాలను పెద్ద సంఖ్యలో దిగుమతి చేసుకునేవారు. ఆ విధంగా మధ్య ఆసియా నుంచి “తుర్కీ” గుర్రాలు, ఇరాన్, అరబ్ ప్రాంతాల నుంచి “తాజీ” గుర్రాలు వస్తుండేవి. 1292 ప్రాంతంలో భారతదేశాన్ని సందర్శించిన మార్కోపోలో, మదురై పాండ్యరాజు, ఆయన నలుగురు సోదరులు ఒక్కొక్కరు సంవత్సరానికి రెండువేల గుర్రాలను దిగుమతి చేసుకునేవారని పేర్కొన్నాడు. దక్షిణాది పాలకులంతా కలిపి ఏడాదికి పద్నాలుగు వేల గుర్రాలను తెప్పించుకునేవారనేందుకు ఆధారాలున్నాయి. విజయనగర రాజ్యాన్ని 16వ శతాబ్దంలో

పాలించిన ఒక రాజు తన వ్యక్తిగత అవసరాల కోసం, అధికారుల కోసం సంవత్సరానికి 13,000 గుర్రాలను ఖరీదు చేసేవాడు. మలబార్ ప్రాంతానికి 10,000 వరకు వస్తుండేవి.

గుర్రాల దిగుమతి అవసరం ఢిల్లీ సల్తనేట్ కాలం నుంచి పెరిగింది. అయితే, ఓడలలో దిగుమతి చేసుకునే సమయంలో, తర్వాత ఇక్కడి మేత, వాతావరణం సరిపోక అనేకం చనిపోయేవి.

## దేవాలయాలను అపవిత్రం చేయటం

ఆ కాలంలో హిందువులు, ముస్లింల పరస్పర సంబంధాలలో అవాంఛనీయమైన ధోరణులు కొన్ని ఉండేవి. హిందూ జాతీయవాదులు ఎత్తి చూపే అంశాలలో అనేకం, నిజానికి అప్పటి యుద్ధాలు, రాజకీయాల సందర్భంలో చూసినప్పుడు చాలా అల్పమైనవి. అదే సమయంలో కొందరు ముస్లింలు కొన్ని దుర్మార్గాలు సాగించిన మాట నిజం. దేవాలయాలను అపవిత్రం చేయటం వాటిలో ఒకటి. తమకన్నా ముందటి హిందూ రాజులు కొందరివలె ముస్లిం పాలకులలోనూ కొందరు దేవాలయాలను ధ్వంసం చేశారు. వారిలో అందరిదీ మతతత్త్వం కాకపోయినా కొందరికి ఆ దృష్టి ఉండి ఉంటుంది. కొందరిని ఆలయాలలోని అపార సంపదలు ఆకర్షించేవి. దేవతా విగ్రహాలను అపుడు పూర్తిగా బంగారంతో తయారు చేసేవారు. ఇతర ఆలయాల నుంచి, బౌద్ధ స్థూపాల నుంచి దోచిన బంగారాన్ని అక్కడ నిలువచేసేవారు.

ఘజనీ మహమ్మద్ 1004లో మథుర దేవాలయం నుంచి భారీ ఎత్తున బంగారం, వెండి, రత్నాలను లూటీచేసి ఆలయాలన్నీ దగ్ధం చేశాడు. 1026లో సోమనాథ దేవాలయంపై దాడి జరిపాడు. అక్కడ సుప్రసిద్ధమైన శివలింగం ఒకటుండేది. ఇవన్నీ చారిత్రక వాస్తవాలు. ఇందుకు కల్పిత గాథలు కొన్ని తోడయ్యాయి. ఆ ముస్లింరాజు శివలింగాన్ని తన ఖడ్గంతో ముక్కలుచేసి వాటిని జామీ మసీదు మెట్లతో అమర్చేందుకు ఘజనీకి పంపాడని కొన్ని కథలు చెప్పగా, ఆ ముక్కలు తిరిగి శివలింగంగా మారాయని మరొక కథ ప్రచారంలోకి వచ్చింది. ఇటువంటి వాటిని బ్రిటిష్ చరిత్రకారులు కొద్దిమంది ఉపయోగించుకుంటూ, ఆ విధమైన ముస్లిం పాలన నుంచి తాము హిందువులను కాపాడినట్లు చెప్పుకున్నారు.

మహమ్మద్ ఘోరీ 1192లో రాజపుత్రులను ఓడించినప్పుడు వారిపై మారణకాండ సాగించి, అనేక నిర్మాణాలను దోచుకుని ధ్వంసం చేశారు. వారణాసిలో వెయ్యి దేవాలయాల విగ్రహాలను ముక్కలుచేసి వాటిని "నిజమైన దేవునికి" పునరంకితం చేసినట్లు, పధ్నాలుగు వందల ఒంటెలపై సంపదలను తరలించుకుపోయినట్లు అప్పటి అరబ్ చరిత్రకారులు రాసారు. అరబ్బు సేనలు గుజరాత్‌లోని జైన దేవాలయాలను మినహాయించాయి. పాలరాతితో నిర్మించిన ఆ మందిరాల వెలుపలి భాగం ఎటువంటి విగ్రహాలు, అలంకరణలు

లేక మసీదులను తలపిస్తాయి. 1296లో దేవగిరిని యథాతథంగా వదలివేసిన అల్లా ఉద్దీన్ ఖిల్జీ రెండేళ్ళ తర్వాత సోమనాథ దేవాలయంపై దాడి చేశాడు. దానిని సుమారు 250 ఏళ్ళక్రితం ఘజనీ మహమ్మద్ ధ్వంసం చేసిన వెనుక పునర్నిర్మించారు. ఈసారి ఆయన అక్కడి శివలింగం రాతి ముక్కలను ఢిల్లీలోని మసీదు మెట్లుగా పేర్చాడు. సోమనాథ్ దేవాలయానికి సంబంధించిన పత్రాలను అధ్యయనం చేసిన రోమిలా థాపర్, ఆ దేవాలయాన్ని ముస్లిములు పదే పదే ధ్వసం చేశారని హిందువులు పేర్కొన్నట్లు రాసింది. అల్లా ఉద్దీన్ సేనలు అంతవరకు ఎవరూ ముట్టని చిదంబరంలోని నటరాజ మందిరాన్ని, అందులోని శివలింగాన్ని నేలకూల్చాయి. అల్లా ఉద్దీన్ అనంతరం రాజ్యానికి వచ్చిన బానిస రాజు కాఫర్, వజ్ర వైడూర్యాలకు పేరుపడిన ఆంధ్రను జయించాడు. మదురై, శ్రీరంగం, చిదంబరాలలోని మందిరాల నుంచి బంగారు విగ్రహాలను, ఇతర సంపదలను దోచుకుని వాటిని 612 ఏనుగులు, 20,000 గుర్రాలపై తరలించుకుపోయాడంటారు. శ్రీరంగంపై దాడిని ప్రస్తావిస్తూ కాల్పనిక గాథలు కూడా ప్రచారంలోకి వచ్చాయి. అక్కడి రంగనాథ్ విగ్రహాన్ని సుల్తాన్ సైన్యం ఉత్తరదేశానికి తీసుకుపోగా రంగనాథుడు రాత్రిళ్ళు ప్రాణం పోసుకుని సుల్తాన్ కుమార్తెను సమ్మోహితురాలిని చేశాడని, తర్వాత శ్రీరంగానికి తిరిగి వచ్చాడని చెప్తారు. రంగనాథునికి ఈ రోజు వరకు కూడా సుల్తాన్ దర్బార్ శైలిలో పూజలు జరగడం, నైవేద్యాన్ని ఉత్తరాది వంటకాల పద్ధతిలో తయారు చేయటం విశేషం.

మందిరాలలోని విగ్రహాల సంపదలను దోచుకోవటం లోగడ హిందువులు కూడా చేసిన పనే కావచ్చు. కాని అది ఒక అవమానం కాగా, విగ్రహాలను ముక్కలుచేసి మసీదుల నేలపై పరచటం పుండుపై కారం చల్లటమే అవుతుంది. ఇటువంటి చర్యలు హిందువుల ప్రతిఘటనకూ దారితీశాయి. కొన్ని సందర్భాలలో దోపిడీ ఉదంతాలలో, ప్రతిఘటన కథనాలలో అతిశయోక్తులు కూడా చోటు చేసుకున్నాయి. అది సహజమేననాలి. ఎన్ని ఏనుగులు, గుర్రాలపై సంపదలను తీసుకుపోయారనే సంఖ్యలు ఆ విధంగా పెరుగుతూ పోయాయి. అదేవిధంగా, ఉత్తరప్రదేశ్‌లోని అవధ్ వద్ద 1220 ప్రాంతలో భర్తు అనే హిందువు ఒక్కడే 1,20,000 మంది ముస్లింలను హతమార్చినట్లు ఒక కథనం పేర్కొంటుంది.

మరొకవైపు రెండు వర్గాలలోనూ రక్తపాతాలు ప్రతీకారాలకు, విధ్వంసాలకు వ్యతిరేకులైన వారుండేవారు. కొందరు కనీసం ఆ ధోరణితో ఏకీభవించేవారు కాదు. ఢిల్లీని పాలించిన ముస్లిం రాజులలోనూ కొందరిది 'మక్కా–కేంద్రీకృత' దృష్టి కాగా, కొందరిది 'ఇండియా దృక్పథం' గల దృష్టి. యుద్ధాలు ఎపుడైనా క్రూరంగా ఉంటాయి గనుక వారు కూడా క్రూరంగానే వ్యవహరించినా, ఒక పెద్ద భూభాగాన్ని పరిపాలించాలి గనుక యుద్ధానంతరం రాజీలు అవసరమయేవి. ఆ వైఖరి రెండు వైపుల నుంచీ కన్పించేది.

సంస్కృతి విషయానికి వస్తే, అనేక ముస్లిం సంప్రదాయాలను హిందువులు అనుసరించారు. తరుష్క, రాజపుత్ర రాజ కుటుంబాల స్త్రీలు మొదటిసారిగా కలిసినప్పుడు, ముస్లిం స్త్రీలు పరదా విషయమై పట్టుదల చూపలేదు. వారు కలిసి మద్యం సేవించారు, సాహిత్య కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ విషయం బాబర్ స్మృతుల నుంచి తెలుస్తుంది. కొంతకాలం గడిచిన వెనుక రాజపుత్ర గౌరవ మర్యాదల గురించి తెలిసి, అప్పుడు రాజపుత్ర అంతఃపుర సంప్రదాయాల ప్రకారం పరదా పద్ధతిని అనుసరించారు. హిందూ కులవ్యవస్థ పద్ధతులు కొన్నింటిని కూడా స్వీకరించారు. హిందూ స్త్రీలు కూడా ముస్లిముల పర్దా పద్ధతిని కొన్ని మార్పులతో ఆమోదించారు. అనేక నియంత్రణలు ఉండిననప్పటికీ కొందరు స్త్రీలు తమ స్వేచ్ఛను నిలుపుకొనజూసారు. ఉదాహరణకు ఒకే ఒక సుల్తాను అంతఃపురంలో ఉండిన పదివేల మంది స్త్రీలు ఫెమినిస్ట్ రిపబ్లిక్ వంటిది ఏర్పాటు చేసుకుని తమ పరిపాలన, రక్షకభట వర్గం, ఉత్పత్తి వ్యవస్థ, మార్కెట్‌ను నెలకొల్పుకున్నట్లు 'ఇండియా, ఎ పొలిటికల్ హిస్టరీ' అనే గ్రంథంలో జాన్ కే అనే రచయిత పేర్కొన్నాడు.

ఇదే కాలంలో వ్యవసాయం, వాణిజ్యం, సాంకేతిక పరిజ్ఞానం బాగా వృద్ధి చెందాయి. హిందువులలో, ముస్లిములలో కూడా రాజకీయ, మతపరమైన కొత్త వ్యవస్థలు ఏర్పడ్డాయి. మహమ్మద్ బిన్ తుగ్లక్ పాలనలోనూ వర్తక – వాణిజ్యాలు, పరిశ్రమలు, ఆర్థిక సేవలు అధిక భాగం హిందువుల అధీనంలో ఉండేవి. ఇస్లాంకు మారిన హిందువులు ఉన్నత స్థానాలకు చేరారు. వ్యవసాయం, చేతివృత్తులు, వ్యాపారాల వంటి రంగాలలో రెండు మతాలకు చెందిన సామాన్య వర్గాల వారు కలసి మెలిసి పనిచేసేవారు. పలువురు ముస్లిములు హిందూ స్త్రీలను వివాహమాడారు. ఉద్యానవనాలు, ఫౌంటేన్లు, పుచ్చ, కర్బూజా ఫలాలు, నిర్మాణాలు, కళలను కూడా ఇందుకు జోడిస్తే ఉభయుల మధ్య సాంస్కృతిక ఆదాన ప్రదానాల దృశ్యం మనకు సంపూర్ణమవుతుంది.

పాలకుల నుంచి మద్దతు లేకపోవటం, వేధింపులు, మత సంబంధమైన ఆరామాలు, స్థూపాలను హిందువులు, ముస్లిములు కూడా విధ్వంసం చేయటం వంటి కారణాలవల్ల భారతదేశం నుంచి బౌద్ధం నిష్క్రమించింది. కాని ఈ పరిస్థితులను ముస్లిముల నుంచి ఎదుర్కొని కూడా హిందూమతం తిరిగి బలపడింది. విగ్రహారాధనను ముస్లిం పాలకులలో అధికులు ఖండించినా, ప్రజలను పూజలు చేయకుండా నిరోధించలేదు. పైగా సుల్తాన్ బాల్బన్ వంటివారు హిందువులకు కల్పించిన రక్షణను 1280 నాటి శాసనం ఒకటి ప్రశంసించింది. మహమ్మద్ బిన్ తుగ్లక్ ఒక దేవాలయం మరమ్మతుల కోసం 1326లో ముస్లిం అధికారులను నియమించాడు. జిజియా పన్ను చెల్లించిన వారెవరైనా దేవాలయాలను నిర్మించుకోవచ్చునని ప్రకటించాడు. 1355–73 మధ్య కశ్మీర్‌ను పాలించిన ఒక ముస్లిం రాజుకు తన బ్రాహ్మణ మంత్రి, రాజ్యంలోగల హిందూ, బౌద్ధ బంగారు విగ్రహాలన్నింటిని కరిగించి ఆ ధనాన్ని సంపాదించాలని సూచించగా, రాజు ఆ మంత్రిని మందలించాడు.

మొత్తంమీద ముస్లిముల పాలనలో హిందువులపై ఒకవైపు వేధింపులు, దాడులు సాగినా మరొకవైపు తగు రక్షణ, ఆదరణ కల్పించిన వారు కూడా ఉన్నారు. హిందూ మతం బౌద్ధంవలె బలహీనపడక వర్ధిల్లుతూనే పోయింది. హిందువులపై జిజియా పన్ను విధింపుతోపాటు రాజపుత్ర రాకుమార్తెలను సుల్తానులు వివాహమాడటం, హిందూ కళాకారులను, సంస్కృత పండితులను ఆదరించటం, హిందువులకు ఉన్నత పదవులివ్వటం కనిపిస్తుంది. బెంగాల్‌లో 1418లో రాజా గణేశ్ అనే హిందువు సుల్తాన్ అయాడు. ఆయన కుమారుడు ఇస్లాంకు మారి 1431 వరకు పాలించాడు. ఆ తర్వాత సుల్తాన్ అయిన అల్లా ఉద్దీన్ హుస్సేన్ అనే అరబ్ ముస్లిం (1593–1519) చైతన్యుడనే వైష్ణవ సన్యాసికి ఆధారకుడుగా మారటంతో హిందువులు ఆయనను విష్ణువు అవతారమన్నారు. అదే సుల్తాన్ ఒక యుద్ధ సందర్భంగా ముఖ్యంగా ఒడిశాలో అనేక దేవాలయాలను ధ్వంసం చేసాడు.

యోగులు, సన్యాసులకు మొదటి నుంచి కూడా ముస్లిములతో సత్సంబంధాలు ఉండినట్లు కన్పిస్తుంది. సిలోన్‌కు చెందిన కాపాలిక తాంత్రికులు ముస్లింల పట్ల దయతో వ్యవహరించే వారని బుజుర్గ్ ఇబ్న్ షహరియార్ అనే పర్షియన్ వర్తకుడు 953 ప్రాంతంలో రాసాడు. టిబెట్‌కు చెందిన 13వ శతాబ్దపు బౌద్ధ చరిత్రకారుడు తారానాథ్, తాము “తురుష్కులకు వ్యతిరేకం కాద”ని నాథయోగులు ప్రకటిస్తారంటూ రాసాడు. అదే కాలంలో పర్షియన్, అరబిక్, సంస్కృతం, ప్రాకృతాల నుంచి పదాలను, సంప్రదాయాలను స్వీకరిస్తూ ఉత్తర భారతదేశంలో కొన్ని కొత్త భాషలు రూపుతీసుకోసాగాయి. పర్షియన్, అరబిక్ పదాలు అనేక భారతీయ భాషలలో ప్రవేశించాయి.

## సూఫీ తత్త్వం

ఇస్లాంలో ఒక శాఖ అయిన సూఫీ మార్మిక తత్త్వం, హిందూమతాల మధ్య పరస్పర ప్రభావాలు చాలా ఉన్నాయి. సూఫీలు పదకొండవ శతాబ్ది మధ్యకాలంలో, ఘజ్నవీల ఏలుబడిలోగల వాయవ్య భారత ప్రాంతానికి చేరారు. ఖ్వాజా మొయినుద్దీన్ చిష్తీ అనే సూఫీ భారతదేశానికి సూఫీ తత్త్వాన్ని తీసుకువచ్చినట్లు చెప్తారు. ఆయన పన్నెండవ శతాబ్ది చివరలో ఢిల్లీకి చేరి, అజ్మీర్‌కు సమీపానగల హిందూ పుణ్యక్షేత్రమైన పుష్కర్ వద్ద స్థిరపడ్డాడు. తనకు ముస్లిములలో, హిందువులలో కూడా చాలామంది శిష్యులుండేవారు. చిష్తీ సూఫీ బాబాలు, సుల్తాన్ వద్దకు వెళ్ళడమంటే దయ్యంవద్దకు పోవటమేనని భావించే వారు. అయినప్పటికీ ఢిల్లీ సల్తనేట్ సాంస్కృతిక, భక్తి జీవనంలో వారిది ప్రభావశీలమైన పాత్ర. సుల్తాన్ దర్బారులో పలువురు ముఖ్యులు వారి అనుయాయులే.

సూఫీ తత్త్వం తొలిదశలోనే ముస్లిములు, క్రైస్తవులు, యూదులు, జొరాష్ట్రియన్లు, హిందువులు అందరూ ఒకే లక్ష్యం వైపు ప్రయాణిస్తున్నారని, వారిని వేర్వేరుగా చూపే బాహిర లక్షణాలు అసత్యమైనవని ప్రకటించారు. ఇదే ఆలోచన ఆ కాలంలో బలంగా

విస్తరిస్తుండిన భక్తి ఉద్యమంలో కూడా భాగమైంది. దర్బార్ సాహిత్యాన్ని పరిశీలిస్తే, సంస్కృతంలోని రసైక భావనలు, ముఖ్యంగా శృంగార రసభావనలు, దేవునిపట్ల ప్రేమ అనే ఇస్లామిక్ తత్త్వంలో కలగలిసి, సూఫీ తత్త్వాన్ని సృష్టించినట్లు అర్థమవుతుంది. ఆ తత్త్వంలో మతం, శృంగారం కూడా కలగలసి ఉంటాయి. సూఫీ శృంగార భావనలలో ఒక యోగి కథానాయకుడు కాగా ఒక భారతీయ సుందరి కథానాయిక.

ప్రస్తుతం మనం హిందూమతంపై ఇస్లాం ప్రభావం ఏమిటనేది ప్రధానంగా చర్చిస్తున్నాము. అదే సమయంలో, ఇస్లామిక్ సంస్కృతిపై హిందూమతం ప్రభావం ఏమిటో కూడా కనీసం ఒక మేరకు గమనించాలి. మహమ్మద్ ప్రవక్త నిజమైన జన్మస్థానం భారతదేశమని ఆజాద్ బిల్‌గ్రామీ (1785లో మరణం) వాదించజూసింది. అది అతివాదమే గాని, అనేక ముస్లిం సంప్రదాయాలకు భారతదేశం పుట్టినిల్లనే మాట మాత్రం నిజం. 'అమృత సరోవరం' అనే ఒక కావ్యం నాథ యోగులను, హఠయోగం బోధించే పలు సంప్రదాయాలను ముస్లిములకు అందుబాటులోకి తెచ్చింది. ఈ కావ్యం అనేక రూపాలలో వెలువడింది. కశ్మీర్‌కు చెందిన ఒక సూఫీ శాఖవారు తమను తాము రుషులని చెప్పుకుంటారు. పూర్తిగా శాకాహారులైన వీరు, లాల్ దేడ్ అనే 14వ శతాబ్దపు కశ్మీరీ హిందూ స్త్రీ రచించిన గీతాలను ఆలపిస్తారు. కృష్ణభక్తికి, యోగ విద్యకు సంబంధించిన ఉద్వేగపూరిత సంస్కృత భాషను సూఫీలు తమ గీతాలలో బాగానే పొందుపరచారు.

కథాకథన రీతులను కూడా అరబ్బులు, ఇరానియన్లు భారతదేశం నుంచి నేర్చుకుని యూరోపియన్లకు కూడా నేర్పారు. అవే కథలు అనేకం కథాసరిత్సాగరంలో, అరేబియన్ నైట్స్‌లో కనిపిస్తాయి. మొదటి రచనలో శివుడు, విష్ణువు ఉంటారు. రెండవ దానిలో భగవంతుడంటూ లేడుగాని అల్లా ఉంటాడు. ఈ రెండింటిలోనూ కన్పించే కొన్ని కథలు, భారతదేశానికి ఇంగ్లీషు రాకముందే ఇంగ్లాండ్‌కు చేరాయి. షేక్స్పియర్ రచనలోని 'ఆల్ ఈజ్ వెల్ దట్ ఎండ్స్ వెల్' వంటి కథా వస్తువులు అటువంటివే. సంస్కృతంలో ఇతరత్రా భారతదేశంలో గల గ్రంథాలను బాగా అధ్యయనం చేసిన అల్–బిరూనీ, హిందూ సంస్కృతిపై ఒక ఉత్తమమైన గ్రంథాన్ని రాసాడు. ఢిల్లీ సుల్తానులు మసీదుల నిర్మాణంలో హిందూ దేవాలయ నిర్మాణ రీతులను అనుసరించటమే గాక హిందూ కళాకారులను నియోగించారు.

## కబీర్

సూఫీ మార్మికత ప్రభావం ఉత్తర భారతంలోని సంత్‌ల భక్తి సంప్రదాయంపై గణనీయంగా ఉంది. సంత్‌లు నిర్గుణ మూర్తిని కొనియాడారు. హిందూమతం, ఇస్లాం రెండింటితోనూ మమేకులైన సంత్‌లు పలువురు గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిమ్న కులాలవారు. రవిదాస్ చమార్ కాగా, దాదూ చేనేత వృత్తికి, సేనా క్షురక వృత్తికి చెందిన వారు. కాని అందరిదీ ఇటువంటి నేపథ్యంకాదు. సిక్కు మత స్థాపకుడు గురునానక్

క్షత్రియుడు. మీరాబాయి క్షత్రియ రాకుమారి. మహారాష్ట్రలో 13–17 శతాబ్దాల కాలపు సంత్‌లు వేర్వేరు కులాల నుంచి వచ్చినవారు.

సంత్‌లందరిలోకి ప్రసిద్ధి చెందినవాడు కబీర్. వారణాసిలో 15వ శతాబ్ది ఆరంభంలో జన్మించిన ఆయనది చేనేత కుటుంబం. ఆయన కుటుంబం తన పుట్టుకకుముందే హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారింది. ఒక కథనాన్ని అనుసరించి, కబీర్ మొదట ఒక శాక్త దేవతను ఆరాధించాడు. వారి కుటుంబం శాక్తేయులలోని నాథ వంటి ఏదైనా సంప్రదాయానికి చెందినదై ఉండాలి. తర్వాత మతం మార్చుకుని ఉండవచ్చు. కొన్ని కథనాలు, కబీర్ నిజంగా నిమ్న కులానికి చెందినవాడు కాదని, ఆయనను ముస్లిములు దత్తత తీసుకున్నారని చెప్తాయి. తను బ్రాహ్మణుడని, ఆ కుటుంబం ధర్మమార్గం నుంచి పతనమై తర్వాత ముస్లిములయారని ఇంకా పలువిధాలైన కథనాలున్నాయి. హిందూస్థానీలో బోధనలు చేస్తుండిన రామానుజుని శిష్యుడైన రామా నందుని (1370–1440 ప్రాంతం) శిష్యులలో కబీర్ ఒకడన్నది పలువురి అభిప్రాయం. రామానుజుని శిష్యులలో పలువురు నిమ్నకులాల వారు. రామానందుడు రోజూ సూర్యో దయానికి ముందే స్నానంచేసే ఒక కొలను మెట్లపై కబీర్ అడ్డంగా పడుకున్నాడని, అది గమనించని రామానందుడు తనను తగిలి పడిపోతూ 'రామ్! రామ్!' అన్నాడని, ఆ విధంగా కబీర్‌కు రామమంత్రోపదేశం చేసి తన శిష్యునిగా స్వీకరించినట్లయిందనే కథ ఒకటుంది. కబీర్ ఉద్దేశపూర్వకంగానే ఆ పని చేసాడంటారు. అయితే ఈ రాముడు రామాయణంలోని రాముడు కాదు. తను నిర్గుణుడు. ఆ పేరు ఒక మంత్రమే తప్ప దాని వెంట కథ ఏమీ లేదు.

కబీర్‌కు వివాహమైందని, కమల్ పేరుతో ఒక కుమారుడున్నాడన్నది పరిశోధకుల అభిప్రాయంకాగా, కబీర్ పంథ్‌కు చెందిన సాధువులు మాత్రం తను బ్రహ్మచారి అన్నారు. అదెట్లున్నా కబీర్, ఆయన భార్య గురించిన కథలు మాత్రం ఉన్నాయి. ఈ కింది కథను గమనించండి :

## కబీర్, ఆయన భార్య, దుకాణదారు

తన ఇంటికి వచ్చిన దర్వీష్‌లకు పెట్టేందుకు కబీర్ ఇంటిలో ఆహారమేమీ లేదు. ఆహార పదార్థాలు అప్పుపై ఇచ్చినట్లయితే ఆ రాత్రి తనతో గడపగలనని కబీర్ భార్య దుకాణదారుతో అంటుంది. కాని ఆ ప్రకారం చేసేందుకు ఆమె సందేహిస్తుండగా, అప్పుడు వర్షం కురుస్తుండగానే కబీర్ తనను స్వయంగా తీసుకుని దుకాణదారు ఇంటికి వెళతాడు. అది తెలిసిన దుకాణదారు సిగ్గుపడి, తన దుకాణంలో గల సరకులన్నీ పేదలకు పంచి, సాధువవుతాడు.

ఇది స్త్రీలను, కింది కులాలవారిని పైకులాల వారు దోపిడీ చేయటం గురించిన కథ కూడా. తన భార్య విధేయత పట్ల సాధారణమైన దృష్టి తీసుకున్న కబీర్, స్త్రీల సతీ

సహగమనాన్ని మాత్రం ఒక ఉపమానంగా తీసుకుని ఒక భక్తుడు దేవునికి పూర్తిగా అంకితం కావటంతో పోల్చి చెప్పాడు. తను 'మాయ'ను ఒక మోహిని అయిన స్త్రీతో పోల్చుతూ, దాని నుంచి మనం దూరం కావాలంటాడు. తన దృష్టిలో స్త్రీకి అనేక రూపాలు, అర్థాలు ఉన్నాయనుకోవాలి.

తన మాతృ భాషలోనే బోధనలు చేసిన కబీర్, సంస్కృతం బావిలోని నీరు వంటిదికాగా, ప్రజల భాష ఒక జలప్రవాహమన్నాడు. హిందూ, ఇస్లాం రెండు మతాల నేపథ్యం కూడా ఉన్న ఆయన ఆ రెండింటిని పడుగు పేకలుగా చేస్తూనే రెండింటికీ దూరంగా ఉన్నాడు. హిందువులు కాళికాదేవికి మేకలను, ముస్లిములు తమ యాత్ర చివరన ఆవులను బలివ్వటాన్ని ప్రస్తావిస్తూ హేళనగా వ్యాఖ్యానిస్తాడు. కబీర్‌ను రెండు మతాలవారు తన జీవిత కాలంలో విమర్శించటంలో ఆశ్చర్యంలేదు. కాని తన మరణానంతరం ఉభయులూ ఆయనను తమవానిగా చెప్పుకోవటం గమనార్హం. కబీర్ కే దోహే పేరిట ప్రసిద్ధి చెందిన ఆయన కవితలలో ఒక దానిని గమనించండి. ఇటువంటివి రాసిన వ్యక్తిని రెండు మతాలవారూ విమర్శించటం సహజమనాలి :

ఎవరు ఎవరి భర్త? ఎవరు ఎవరి భార్య?
మృత్యువు దృష్టి చెప్పలేని కథలను చెప్తుంది
ఎవరు ఎవరి తండ్రి? ఎవరు ఎవరి కుమారుడు?
బాధపడే దెవరు? మరణించేదెవరు?...దేవుడే సున్తీ అవసరమనుకుంటే నువ్వు సున్తీతోనే ఎందుకు జన్మించలేదు?
సున్తీతోనే నువ్వు ముస్లింవు అయితే నీ స్త్రీల నేమంటావు?
స్త్రీలను పురుషుని అర్ధాంగి అన్నప్పుడు మీరు హిందూవులు అయినా కావచ్చు...
జంధ్యం వల్లనే నీవు బ్రాహ్మణునివైతే నీ భార్య ఏమి ధరించాలి?
ఓ పండితుడా, ఆ శూద్రుడు నీ ఆహారాన్ని తాకుతున్నాడు. ఎట్లా స్వీకరించగలవు దానిని?
హిందువులు, ముస్లిములు – ఎక్కడి నుంచి వచ్చారు వారు? ఈ దారి వేసింది ఎవరు?
నీ మనసులోకి చూసుకో, అన్వేషకులను పంపు ఎక్కడుంది స్వర్గం?

మతంతో అనుబంధం గురించిన కవిత ఇది :

వేదాలు, ఖురాన్, పవిత్రత, నరకం, స్త్రీ, పురుషుడు...
అన్నింటిదీ ఒకే చర్మం, ఒకే ఎముక, ఒకే మల మూత్రం
ఒకే రక్తం, ఒకే మాంసం...
రామునిలో లీనం కమ్మన్నది కబీర్ మాట!
అక్కడ హిందువులేదు, తురుష్కుడు లేదు.

'హిందువు' అన్న మాటలో అంతకుముందు అస్పష్టత ఉండగా, దానికి అప్పుడప్పుడే ఒక నికరమైన అర్థం ఏర్పడుతున్నది. ఆకారణంగా కబీర్ అటువంటి నిర్వచనాలకు గల విలువను సవాలు చేశాడు. ఆ స్థితికి భిన్నంగా తురుష్కులనే పదం టర్కీవాసులు, అరబ్బులు, హిందువులు కాని ఇతరులకు వర్తించేది.

కులానికి, మోక్షానికి సంబంధం లేదన్నది కబీర్ అభిప్రాయం. తను కులవ్యవస్థను సవాలు చేయటం గురించి చాలా కథలున్నాయి. వాటిలో ఇదొకటి:

## కబీర్, ఒక వేశ్య

కబీర్ చాలా ప్రసిద్ధుడైన తర్వాత తన చుట్టూ చాలామంది సందర్శకులు చేరుతారు. వారిని దూరంగా ఉంచాలన్నది తన ఆలోచన. దానితో ఒక వేశ్య ఇంటికి వెళ్ళి, ఆమె మెడ చుట్టూ చేయివేసి పవిత్ర జలాలు గల ఒక పాత్రను అది మద్య పాత్ర అయినట్లు చేతిలోకి తీసుకుని తాగుతాడు. అప్పుడు ఆ స్త్రీతోపాటు వీధిలోకి వెళ్ళగా నగరవాసులు తనను చూసి నవ్వుతారు. తన భక్తులు విచారిస్తారు. బ్రాహ్మణులు, వ్యాపారులు ఆయనను హేళన చేస్తూ "తక్కువ కులాల వారు భక్తిమార్గంలో ఎట్లా పోగలరు? కబీర్ ఆ పని పది రోజులపాటు చేసి ఇప్పుడు వేశ్యతో తిరుగుతున్నాడు" అని అన్నారు. రాజు తన పట్ల గౌరవం చూపలేదు. ప్రతి ఒక్కరు తనను చూసి ఆశ్చర్యపోయారు.

కబీర్ ఉద్దేశపూర్వకంగా అటువంటి అగౌరవాన్ని కోరుకున్నాడు. అది తాంత్రికుల లోని పశుపతులు అనుసరించిన పద్ధతులను గుర్తు చేస్తుంది. అయితే వారి ఉద్దేశం వేరు. కులం గురించిన మరొక కథను చూడండి :

## కబీర్, గేదె కథ

ఒక రోజు కబీర్, ఆయన శిష్యులు రామానుజుని శిష్యులను కలిశారు. వారంతా బ్రాహ్మణులు. తమ వంట స్థలంపై పారియాల నీడసోకినా అటువంటి ఆహారం స్వీకరించరు. కనుక కబీర్ తమతోపాటు కూర్చోవటంగాని, భోజనం చేయటంకాని ఇష్టంలేకపోయింది. కాని ఆ మాట నేరుగా అనటానికి బదులు, వేదమంత్రాలను చదవగలిగిన వారే తమతో కూర్చోవాలన్నారు. నిమ్నజాతుల వారు వేదపఠనం చేయరాదనే నిషేధం ఉన్నందున కబీర్‌కు ఆ అవకాశం లభించదనుకున్నారు. ఆ సమయంలో కబీర్ వెంట ఒక గేదె ఉంది. తను దాని తలపై చేయివేసి వేదాలు చదవమంటాడు. గేదె చదవటం మొదలు పెడుతుంది. దానితో అందరూ విస్మయం చెంది కబీర్‌ను క్షమాపణ కోరుతారు.

రాజకీయంగా కాని, సామాజికంగా కాని కబీర్ విప్లవకారుడేమీ కాదు. తను అప్పటికిగల విశ్వాసాలను ధ్వంసం చేయబూనాడు, వ్యవస్థలను ధిక్కరించాడు. పేదవాడు, నిమ్న వర్గాలకు చెందిన వ్యక్తి. కాని పేదరికాన్ని అంతం చేయాలనే దృష్టి ఏమీ తనకు లేదు. ఆయన దృష్టి ఆధ్యాత్మికమే తప్ప ఆర్థికమైన, లేదా రాజకీయమైన విమోచన కాదు.

## ఢిల్లీ సల్తనేట్ పాలనలో హిందూమతం

ఈ కాలంలో హిందూమతం కొత్తపుంతలు తొక్కింది. అందుకు ఒక కారణం ఇస్లాం కాగా, హిందూమతంలో చోటుచేసుకున్న అంతర్గత పరిణామాలు మరొక కారణం. ఇస్లాం ప్రభావం ప్రత్యక్షంగా కొంత ఉండగా, కొంత పరోక్షంగా కన్పించింది. విజయనగర సామ్రాజ్యానికి గల ప్రాముఖ్యతను బట్టి, అదేవిధంగా ఆ రాజ్యానికి సంబంధించిన వివరాలు విరివిగా లభ్యమవుతున్నందున, ఆ కాలంనాటి తక్కిన అన్ని హిందూ రాజ్యాలకు కూడా దానిని సంకేతంగా భావించి మన పరిశీలనను సాగిద్దాము.

### విజయనగర

భారతదేశంలోని చిట్టచివరి సువిశాల సామ్రాజ్యానికి (14-17 శతాబ్దాల మధ్య కాలం) విజయనగరం రాజధాని. ఆ నగర జనాభా సుమారు అయిదు లక్షలు. దక్కన్ పీఠభూమి ఎగువ ప్రాంతాల నుంచి, భారత్ ఉపఖండపు దక్షిణాగ్రం వరకు, దక్షిణ దేశం లోని అత్యధిక భూభాగం విజయనగర సామ్రాజ్యంలో ఉండేది. తరచు దొవాబ్, డెక్కన్, ఒరిస్సా కూడా ఆ రోజుల ఏలుబడిలో ఉండేవి.

తుంగభద్ర నదికి దక్షిణాన గల విజయనగరాన్ని 1336లో సంగమ వంశానికి చెందిన మొదటి హరిహరుడు (1336-57), ఆయన సోదరుడు బుక్క (1344-77) కలిసి స్థాపించారు. వారి గురించి గల ఒక కథనం ప్రకారం, ఢిల్లీ సుల్తాన్ సేనలు వారిద్దరిని బందీచేసి ఢిల్లీకి తీసుకుపోతాయి. అక్కడవారు ఇస్లాం మతాన్ని స్వీకరించి, సుల్తాన్‌ను తమ ప్రభువుగా అంగీకరిస్తారు. అప్పుడు సుల్తాన్ పరిస్థితులను చక్కబెట్టేందుకు వారిని తిరిగి రాజ్యానికి పంపుతాడు. అట్లా తిరిగివచ్చిన వెంటనే వారు స్వతంత్రాన్ని ప్రకటించుకుని, తిరిగి హిందువులుగా మారి, ముస్లిములు దక్షిణానికి విస్తరించకుండా నిలువరిస్తారు. ఆ సోదరులను ప్రజలు శివుని అవతారంగా పరిగణిస్తారు.

విజయనగర ఒక పవిత్ర ప్రదేశం. ఆంజనేయుని రాజ్యం అదేనని పలువురు హిందువులు భావిస్తారు. అక్కడి స్థలాలను రామాయణంలో ప్రస్తావించిన ప్రదేశాలుగా గుర్తిస్తారు. ఆ నగరం ఒక నగర రాజ్యం వంటిది. శాసనాలను, చారిత్రక కథనాలను, పురావస్తు ఆధారాలను పరిశీలించినప్పుడు రాముడు ఒక ఆదర్శనీయుడైన రాజు, రామాయణ కథాక్షేత్రం అయోధ్య అనే భావనలు మధ్య భారతంలో, ఉత్తర భారతంలో 14-17 శతాబ్దాల కాలంలో ఏర్పడినట్లు తోస్తుంది. కాని విజయనగర సామ్రాజ్య

కాలంలోనే రాముడు, రామరాజ్యమన్న భావన పరాకాష్టకు చేరింది. రాచరికానికి దైవత్వాన్ని ఆపాదించటంలో రామాయణం పాత్ర ముఖ్యమైనది. అది చిరకాలంగా ఉంది కూడా. కాని ఇప్పుడు మొదటిసారిగా, చారిత్రకమైన రాజులు తమను తాము రామునితో గుర్తించుకుని, రాముడు రావణుని వినాశనం చేసినట్లే తాము తమ శత్రువులను అంతం చేసినట్లు చాటుకున్నారు. ఆ క్రమంలో శత్రువులను రాక్షసీకరించారు, లేదా రావణీక రించారు. దేవాలయాలలో రామాయణ దృశ్యాలు కనిపించటం కనీసం క్రీ.శ. అయిదవ శతాబ్ది నుంచే ఆరంభమైంది. కాని వాటిలో రాముని శిల్పం ప్రముఖంగా, ప్రధానమైన ఆరాధనా చిహ్నంగా ఉండేది కాదు. ఈ కాలంలో పలు దేవాలయాలలో ఆ ధోరణి ఆరంభమైంది. ఉత్తర భారతంలో, ముఖ్యంగా సీతా జన్మస్థలమని భావించే జనక్‌పూర్, రాముని జన్మస్థానమని భావించే అయోధ్య ప్రాంతాలలో రాముడు, ఆంజనేయుడు హిందూమత శాఖలు అనేకానికి ప్రధానమయ్యారు.

ఇది కొంతవరకు ముస్లిముల దాడులకు, ఢిల్లీ సల్తనేట్ విస్తరణకు ప్రతిస్పందన. ఢిల్లీ సుల్తానులతో అధికార ఘర్షణ సాగుతుండిన కాలంలో విజయనగరంలో మొట్టమొదటి రామాలయాన్ని మొదటి దేవరాయ (1406-22) నిర్మించాడు. అయితే, రామునిచేత రావణ సంహారాన్ని ఒక ఉత్సవంగా జరుపుకోవటం ఇక్కడ ఇస్లాం విస్తరణకు ముందే ఉంది. విజయనగర దేవాలయాల శాసనాలలో ఎక్కడ కూడా ముస్లిం వ్యతిరేక ప్రస్తావనలు లేవు. కాని విజయనగరంలో శ్రీవైష్ణవులు అనేక రామాలయాలు నిర్మించగా వాటికి రాజ ప్రతినిధులు, సామంతులు, పుర ప్రముఖులు, వ్యాపార సంఘాలవారు భూములను, విరాళాలను అందజేసేవారంటే రామునిపట్ల ఆరాధనా భావం ఉన్నతస్థాయిలో ఉండేదను కోవాలి. ఆ భావన వెనుక ఒకవైపు దైవ సంబంధమైన ఆలోచనలు, మరొకవైపు రాముడిని ఆదర్శ ప్రాయుడైన రాజుగా చూడటం ఉండేవి.

ఈ ఆలయాల నిర్మాణానికి మరొక కారణం జైనులతో సిద్ధాంతపరమైన ఘర్షణ కావచ్చు. జైనమతం ఆసరికి కొంత క్షీణిస్తుండినా శైవ, వైష్ణవాలతో తగినంత ఘర్షణ ఉండేది. శైవానికి చెందిన బసవ, వైష్ణవానికి చెందిన రామానుజుల శాఖలు బాగా విస్తరిస్తున్న కాలమది. శ్రీవైష్ణవులు తమపట్ల అన్యాయాలు చేస్తున్నారని జైనులు 1368లో బుక్కరాయలకు విజయనగరంలో ఫిర్యాదుచేయగా, జైన - వైష్ణవాల మధ్య తాత్త్వికమైన వ్యత్యాసాలు లేవని, వైష్ణవులు జైన సంప్రదాయాలను, వైష్ణవులు జైన సంప్రదాయాలను పరిరక్షించాలని ఆ రాజు ప్రకటించాడు.

ముస్లిములకు ప్రతిగా రాముడు ఒక కథానాయకుడనే భావన ఏదీ అప్పుడు హిందూ సమాజమంతటా ఏమీ లేదు. 17వ శతాబ్ది ఆరంభానికి చెందిన ఒక శాసనం, రామునివలెనే 'ఢిల్లీశ్వరుడు' ఒక రాజని గుర్తిస్తుంది. వాస్తవానికి విజయనగరంలో హిందూ - ముస్లింల మధ్య ఘర్షణాత్మక స్థితిగాక సమన్వయమే ఉండేది. రెండు రాజ్యాల మధ్య

సన్నిహిత సంబంధాలుండేవి. పలు సాంస్కృతిక రూపాలు ఇరువురి మధ్య కన్పించేవి. విజయనగర, ఢిల్లీల మధ్య నృత్య కళాకారులు, సంగీత విద్వాంసుల పరస్పర సందర్శన లుండేవి. విజయనగర సైన్యంలో అశ్విక బలంలో ఎక్కువగా ముస్లిములు, దుర్గాల సేనానులుగా బ్రాహ్మణులు, శతఘ్ని దశాలలో ముస్లిములతోపాటు పోర్చుగీసువారు, కాల్బలంలో అధికంగా గిరిజనులు ఉండేవారు. 1565 తళ్ళికోట యుద్ధంలో ముస్లిం సుల్తానులంతా కలిసి విజయనగర సామ్రాజ్య సేనలను, నాయక రాజులను ఓడించారు. ఆ వెంటనే యధావిధిగా మారణకాండలు, దోపిడీలు సాగాయి. కాని అందులో మత దృష్టిలేదు. దేవాలయాలను చాలా తక్కువగా నష్టపరచారు లేదా యథాతథంగా వదలివేసారు.

1565లో విజయనగర సామ్రాజ్య పతనం తర్వాత, నాయక రాజుల పాలన సాగింది. వారు మైసూరు రాజధానిగా 16, 17 శతాబ్దాలలో పాలించారు. నాయక రాజ్య స్థాపన, విజయనగర స్థాపన పద్ధతిలోనే జరిగింది. విజయనగర వ్యవస్థాపకులైన హరిహర, బుక్కరాయలు ఢిల్లీ చక్రవర్తిని మోసగించినట్లుగానే, చోళులపై యుద్ధానికి నాయకరాజులను పంపగా వారు విజయనగర చక్రవర్తిని మోసగించారు. నాయక రాజులు 15, 16 శతాబ్దాలలో గొప్ప సంస్కరణలను, రాజ్యంలో, సమాజంలో ఒక పునరుజ్జీవనాన్ని తీసుకువచ్చారు. ఆ మార్పులు తమిళదేశంలో, ఆంధ్రలో కూడా కన్పించాయి. రాజకీయ ప్రయోగాలు, ఆర్థిక-సామాజిక మార్పులు, స్త్రీ-పురుషుల స్థితిగతులు, వారి పట్ల దృక్పథాల మార్పు ఆ కాలంలో చోటు చేసుకున్నాయి.

## మసీదు, దేవాలయం

విజయనగర రాజులు సామంతుల నుంచి, ఓడిన రాజుల నుంచి సంపాదించిన కప్పాలు, ఇతర రాజ్యాలను దోచిన సంపదలను భారీ ఉత్సవాలు, కళాపోషణ, గొప్ప దేవాలయాల నిర్మాణంపై ఖర్చుచేసారు. ఆలయాలను దోపిడీ చేసిన ధనరాశులు మసీదుల నిర్మాణానికే గాక, తిరిగి మరోచోట ఆలయాల నిర్మాణానికి ఖర్చుచేసేవారు. నిర్మాణాలు ఘనంగా ఉండే విషయంలో హిందూ-ముస్లిం పాలకుల మధ్య పోటీ వంటిది కన్పించేది. ముస్లిములు దాడిచేసినప్పుడల్లా ఆలయాల నిర్మాణం తాత్కాలికంగా నిలిచిపోయేది. అప్పటికే గలవి కొన్ని విధ్వంసమయేవి. కాని ఆ తర్వాత ఆలయ నిర్మాణాలు మరింత ఉధృతంగా జరిగేవి. కళారంగంలోనూ విస్తరణ కనిపించేది. ఇది భారతదేశవ్యాప్తంగా జరిగింది. ఇస్లాం ప్రవేశంతో హిందూ రాజవంశాలు బలమైన దుర్గాలను నిర్మించి ఆశ్విక బలాన్ని పెంచుకోవటం, భారీ నిర్మాణాలు చేపట్టటం వంటివి చేసారు. హంపి, హళెబీడు, బాదామీలలో ఇది ప్రముఖంగా జరిగింది. మధుర, కన్నౌజ్‌లలో ఆలయ విధ్వంసం జరిగిన సమయంలో అందుకు హిందువుల స్పందన అన్నట్లు ఇతర చోట్ల అంతకన్న పెద్ద ఆలయాలను నిర్మించారు. చెడు పనులు ఒకోసారి మంచి పనులకు ఉపకరించాయి. ఉదాహరణకు దోపిడీ సొమ్ముతో కళాపోషణ జరిగింది. సంక్షేమ కార్యక్రమాలు

అమలయాయి. దానధర్మాలు చేసారు. అదే పద్ధతిలో బ్రాహ్మణ గురుకులాలను ఆదరించటం తగ్గగా భక్తి ఉద్యమం వంటివి విస్తరించాయి. హిందూమతంలోని జవసత్త్వాలు, పునరుజ్జీవన శక్తి ముస్లింలు భారతదేశంలో ప్రవేశించిన ఈ తొలి సంవత్సరాలలో కనిపించినంతగా మరెప్పుడూ లేదు.

ముస్లిముల పాలన దేశంలో 13వ శతాబ్దిలో ఆరంభం కాగా, ఇస్లామిక్ భవన నిర్మాణ రీతులు అంతకన్నముందే దేశంలో ప్రవేశించాయి. వాటిని హిందువులు ఆహ్వానించారు. గుజరాతీలు, అరబ్బుల మధ్య వాణిజ్య ఒప్పందాలు జరగటంతో హిందూ, జైన రాజుల వద్ద పనిచేస్తుండిన గుజరాతీ చిత్రకారులు పర్షియన్, తురుష్క కళారీతులను తెలుసుకో గలిగారు. ఇస్లాం కారణంగా భారతదేశానికి మసీదులేగాక పలువిధాలైన నిర్మాణ రీతులు, వాటితోపాటు గొప్ప హర్మ్యాలు, కోటలు, ఉద్యానవనాలు లభించాయి.

## సంచార దేవాలయాలు : వీరశైవులు

యోగులు, సన్యాసుల మత జీవితం ఎప్పుడైనా తమ గృహ జీవితానికి దూరంగానే సాగేది. కాని, అనేక పెద్ద దేవాలయాల నిర్మాణం జరుగుతూ, బ్రాహ్మణ సంస్కృతికి రాజ భవనమో, లేక నివాస గృహమో కాక దేవాలయం కేంద్రస్థానం అవుతుండిన కాలంలో, దక్షిణ భారతదేశంలోని ఒక ప్రధానమైన హిందూమత శాఖ మాత్రం గత సంప్రదాయానికి భిన్నంగా ఇంటిని గాక గుడిని కాదన్నది. వారిని లింగాయతులు, లేదా వీర శైవులు, లేదా చరణులు అన్నారు. తమ చరణాలు లేక పాదాలపై నిత్యం సంచరించటం వల్ల వారికా పేరు వచ్చింది. కళ్యాణీ రాజ్యపాలకుడైన బిజ్జలుని ఆస్థానంలో ఉండిన బసవ (1106–67) అనే బ్రాహ్మణుడు వీరశైవ వ్యవస్థాపకుడు. దైవభక్తికి ఆయన కొత్త నిర్వచనం చెప్పాడు. అది సులభమైంది కూడా. దాని ప్రకారం భక్తులు ఒక చిన్న శివ లింగాన్ని మెడలో ధరించాలి. వేరే పూజలక్కరలేదు. దానితోపాటు తాము మరణించినప్పుడు శివైక్యం పొందాలి. చెడు కాలం వచ్చినప్పుడు విగ్రహాలను విక్రయించి, దొంగలు దాడి చేసినప్పుడు దాచిపెట్టే పద్ధతి దైవారాధనను బసవడు తిరస్కరించాడు. "మీకు అవసరమై నప్పుడు అమ్మి, దొంగల భయానికి పాతిపెట్టే దేవుళ్ళు సరైనవారని నేనెట్లా భావించగల"నని ప్రశ్నించాడాయన. అందువల్ల, మనం విశ్వసించగల ఏకైక ఆలయం మన శరీరమేనన్నాడు:

సంపన్నులు
శివునికి దేవాలయాలు నిర్మిస్తారు
పేదవాడిని
నేనేమి చేయగలను?
నా కాళ్ళే స్తంభాలు
శరీరమే ఆలయం
శిరస్సు స్వర్ణ గోపురం

వినుు, ఓ నదీ సంగమ దేవతా,
నిలుచున్న నిర్మాణాలు కూలుతాయి
కదిలేవి ఎప్పుడూ నిలిచే ఉంటాయి అని చెప్పాడు.

'నదీ సంగమ దేవతా' అన్న మాటలో అన్ని తరగతులు, కులాల సంగమం అనే అర్థం కూడా స్ఫురిస్తుంది. 'నిలుచున్న నిర్మాణాలు కూలుతా'యనటం భారీ దేవాలయ నిర్మాణాలను అవహేళన చేయటం.

మధ్యయుగాల నాటి సంప్రదాయిక సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలపై వీరశైవులు దాడి చేసారు. వారిని కొందరు సంప్రదాయ విరోధులనగా, కొందరు వామ హస్తీకులన్నారు. చేతివృత్తుల వారు, వ్యాపారులు, సేవకులు వామ హస్తీకులు కాగా, వ్యవసాయ కూలీలు దక్షిణ హస్తీకులు. తొలినాటి వీరశైవుల గురించి గల ఒక కథలో ఒక పారియా కుమారుడు ఒక బ్రాహ్మణుని కుమార్తెను పెళ్ళాడతాడు. రాజు వారిద్దరి తండ్రులకు ఉరిశిక్ష విధిస్తాడు. వీరశైవులు ఆ రాజుపై తిరుగుబాటు చేసి తనను వధిస్తారు. వారిని అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంది గాని విఫలమవుతుంది. బసవడు కులాలకు, బ్రాహ్మణులకు కూడా వ్యతిరేకి. కులాలు లేని ఇస్లాం తనపై లోతైన ప్రభావం చూపింది. వీరశైవ తత్త్వం రూపు దిద్దుకుంటున్న కాలంలోనే భారతదేశపు పశ్చిమతీర ప్రాంతంలో ఇస్లాం ప్రబోధకులు క్రియాశీలంగా ప్రచారాలు సాగిస్తున్నారు. అదే పద్ధతిలో ఇస్లాం మతస్తులు విగ్రహ విధ్వంసకులు కావటమనే ప్రమాదం, భారీ శివలింగాలకు బదులు చిన్నవాటిని మెడలో ధరించటమనే ఆలోచనకు దారితీసి ఉంటుంది.

వీరశైవుల తొలి కవిత్వం కన్నడంలో ఉండేది. కాని మొదటి పూర్తి నిడివి గాథా రచన తెలుగులో జరిగింది. దానిని 13వ శతాబ్దికి చెందిన పాల్కురికి సోమనాథుడు 'బసవ పురాణం' పేరిట చేశాడు. అది ప్రధానంగా బసవని గాథ. కాని అందులో అసాధారణ స్థాయిలో హింస ఉందని డేవిడ్ షుల్మన్ పేర్కొన్నాడు. వీరశైవ కథానాయకులు నిరంతరం ఎవరో ఒకరి శిరస్సులను ఖండించటం, అంగచ్ఛేదన చేయటం, లేదా వారికి విషమివ్వటం చేస్తూనే ఉంటారు. వారి బద్ధ శత్రువులు బ్రాహ్మణులు, జైనులు, లేదా రాజకీయాలకు చెందినవారు. ఒకోసారి తమ భక్తిలో ఏదో చిన్న లోపం ఉందని ఇటువంటివి తమపై తామే చేసుకుంటారు. ఈ హింస ఎక్కడి నుంచి వచ్చినట్లు? దీని మూలాలు పెరియ పురాణ సంప్రదాయానికి చెందిన తమిళ సన్యాసులలోనో, లేక ఆంధ్రలో వీరభద్రుని రూపంలోగల శివునిలోనో ఉండవచ్చు. సంప్రదాయానికి భిన్నమైన ఒక జానపద మతం కొన్ని చారిత్రక పరిస్థితులలో సాహిత్య రూపంలో వ్యక్తమవుతుంటుంది. చారిత్రక పరిస్థితు లన్నది 12వ శతాబ్దపు కళ్యాణీ రాజ్యంలో ఉండిన రాజకీయ శూన్యం వంటిది కావచ్చు. వీరశైవ వ్యవస్థాపకుడైన బసవ, ఈ రాజ్యానికి చెందినవాడే కావచ్చు. వీరశైవ వ్యవస్థాపకుడైన బసవ, ఈ రాజ్యానికి చెందినవాడే.

బసవ పురాణంలోని హింస చాలావరకు సంప్రదాయిక మతాన్ని గురిచేసుకుంది. ఆ కథలో దేవాలయంలోని మూర్తి అవమానాన్ని భరించలేక వెనుకగల ద్వారం నుంచి నిష్క్రమిస్తాడు. అధికారం కోసం వెంపర్లాడే రాజకీయవాదులు, మతవాదులపై చాకళ్ళు, చోరులు, పారియాలు విజయం సాధిస్తారు. ఒక భక్తుని కుక్క (మారు రూపంలో గల శివుడు) వేదాలను పఠించటంతో, కులతత్త్వం గల బ్రాహ్మణులు సిగ్గుపడతారు. ఇది కబీర్ కథలో ఒక గేదె ఆ పనిచేయటం వంటిది. కుక్క వేదాలు చదవటంలో కుల కోణం కన్పిస్తుంది. కొన్ని కథలు జైనులపై విజయాల గురించి చెప్తాయి. కథలో జైనులను అంధులుగా చేస్తారు. అయితే చివరకు బసవడు వీరశైవుల మితిమీరిన హింస నచ్చక, తాను స్వయంగా స్థాపించిన వీరశైవ సమాజం నుంచి దూరంగా నివసిస్తాడు.

## మహదేవ్యక్క : వీరశైవ సన్యాసిని

మహదేవ్యక్క అనే వీరశైవ సన్యాసిని 12వ శతాబ్దంలో కన్నడంలో కవితలు రాసింది. వాటిలో మోక్షతత్త్వం, మాయల గురించిన చర్చతోపాటు, అత్త మామలతో ఎట్లా వ్యవహరించాలనే సాధారణ విషయాలు కూడా ఉన్నాయి. ఒక కవితను గమనించండి:

మాయ నా అత్త
ప్రపంచం మామ
ముగ్గురు బావలున్నారు, పులులవలె
భర్త ఆలోచనల నిండా
నవ్వులాడే ఆడవారే
దేవుడు కాడీ మనిషి
ఈ వదినను నేను దాటలేను
కాని దాటుతా
ఈ టక్కరి దాని కళ్ళు గప్పి, భర్తను దగాచేసి
నా ప్రభువు హరునితో గడుపుతా

సాధారణ దృష్టితో చూసినట్లయితే, అత్త అదుపాజ్ఞలలో ఉండే గృహిణి సమస్యలను ఎదుర్కోవటం గురించిన ప్రస్తావన ఇది. మను ధర్మశాస్త్రం స్త్రీలు తమ భర్తలను దేవునిగా చూడాలని చెప్తుంది. కాని ఈ కవిత ఆయనను పనికిమాలిని వాడంటుంది. ఇతర ప్రస్తావనలు కూడా కొన్ని ఉన్నాయిందులో. వాటిలో అత్తను మాయ అని, మామను ప్రపంచమని చెప్పటం ప్రత్యక్షమైనవి కాగా, ముగ్గురు బావలను పులులనటం పరోక్షమైంది. మూడన్నవి త్రిగుణాలు. వాటి నుంచి మనిషి తప్పించుకోజాలడు. ఎ.కె. రామనుజన్ చెప్పే నిర్వచనం ప్రకారం భర్త అన్నవాడు కర్మకు సంకేత ప్రాయం. వదిన అనే వ్యక్తి 'వాసన'. అది కర్మను అనుసరిస్తుంది. ఈ కవితలోని ఏ వ్యక్తి కూడా ఆ కవితా రచయితకు

రక్త సంబంధీకులు కాదు. భర్తను దగా చేయటమన్నది వారందరిని దిగ్భ్రాంతికి గురి చేస్తుంది. భగవంతునిపట్ల ఆమె ప్రేమతో సంప్రదాయికతను ధ్వంసం చేయటం, అక్రమ వ్యవహరణ, పరిధులను దాటటం వంటివన్నీ ఉన్నాయి.

మహదేవ్యక్క జీవితం గురించి మనం చాలా చెప్పుకోవచ్చు. ఆమె తనకు తాను శివుడిని వివాహమాడినట్లు భావించుకుని, తనను ప్రేమించిన కౌశిక అనే రాజుతో పెళ్ళికి నిరాకరిస్తుంది. ఈ ఘర్షణాస్థితి గురించి ఈ విధంగా రాసింది :

లోపల భర్త
బయట నన్ను ప్రేమించినవాడు
ఇరువురినీ సంభాళించలేను నేను.
ఈ ప్రపంచం
ఆ ప్రపంచం
రెండింటినీ సంభాళించలేను.

చివరకు మహదేవ్యక్క తన భర్తను వదలి, శిరోజాల ఆచ్ఛాదన మినహా వస్త్రాలేమీ లేక నగ్నంగా వెళ్ళిపోయి సంచరిస్తుంది. ఇంకా ఇరవైల వయసులో ఉండగా తన మరణ పర్యంతం అదే విధంగా సంచరిస్తూనే ఉంటుంది. తన గురించి రామానుజన్ ఈ విధంగా రాశాడు: "ఆమె ఘర్షణ తన పరిస్థితులతో, తన శరీరంతో, తన స్త్రీత్వంతో, తన వేర్వేరు సామాజిక పాత్రల పీడనకు గురైన సామాజిక జీవనంతో, ఒక ప్రదేశానికీ ఒక కాలానికీ పరిమితమైన మనిషి కావటంతో. ఒక పరమానందం కోసం అన్వేషిస్తూ తను ఈ బంధనాలన్నింటిని ఛేదించుకుంది" మహాదేవ్యక్కను ఒక నమూనా స్త్రీ అనలేము. అయినప్పటికీ, సంప్రదాయానికి భిన్నమైన నమూనాకు తగిన ఒక భూమికను ఆమె సిద్ధం చేసింది. హిందూమతం చరిత్రలో మరెందరో స్త్రీలు కూడా వారి గురించి సమాజంలో గల భావ జాలాలను మార్చగల విధంగా వ్యవహరించారు. ఆ వ్యవహరణ ఎంత శక్తివంతంగా ఉండేదంటే, ఇతర స్త్రీలకు కూడా వారి జీవితాలు అనుకరించదగ్గ ప్రత్యామ్నాయాలుగా తోచలేదు.

అధ్యాయం 17

# అనంతర పురాణాలలో అవతారాలు, 'అనుకోని భక్తి'

## క్రీ.శ. 800 - 1500

**కాలక్రమణిక (అన్నీ క్రీ.శ. సంవత్సరాలు)**

| | | |
|---|---|---|
| 750–1500 | : | మధ్యయుగ పురాణాల రచన<br>అగ్ని (850), భాగవత (950), భవిష్య (500–1200), బ్రహ్మ (900–1350), బ్రహ్మవైవర్త (1400–1500) దేవీభాగవత (1100–1350), గరుడ (900), కాలిక (1350), లింగ (600–1000), మహాభాగవత (1100), సౌర (950–1150) |
| 1210–1526 | : | ఢిల్లీ సల్తనేట్ పాలన |
| 1200 ప్రాంతం | : | ఉత్తర భారతంలో తొలి సూఫీ సంప్రదాయాలు |
| 1200 ప్రాంతం | : | దక్షిణ భారతదేశంలో బసవ, ఇతర వీరశైవుల కాలం |
| 1200 ప్రాంతం | : | జయదేవుని గీత గోవింద రచన |
| 1336–1565 ప్రాంతం | : | విజయనగర సామ్రాజ్య ఉచ్ఛస్థితి |
| 1398–1448 ప్రాంతం | : | కబీర్ జీవించిన కాలం |
| 1469–1539 | : | పంజాబ్‌లో సిక్కు మతాన్ని స్థాపించిన గురునానక్ |

### పురాణాల భిన్న కథనం

*ప్రహ్లాదుని గురించి బ్రహ్మ స్వయంగా చెప్పే కథనం వినండి. అదే కథను పురాణాలు భిన్నంగా చెప్తాయి.*

–పద్మ పురాణం, క్రీ.శ. 750–1000 ప్రాంతం

తొలి పురాణాల తర్వాత మలి పురాణాలు, లేదా మధ్య యుగాల కాలపు పురాణాలు మనకు జంతువులు, స్త్రీలు, నిమ్న తరగతులు, ఇతర మతాల గురించి కథలను అనేక విధాలుగా చెప్తాయి. అందులో ఊహాశక్తి చాలా కన్పిస్తుంది. సంస్కృతంకాని సంస్కృతుల నుంచి, మౌఖిక, ప్రాంతీయ సంప్రదాయాల నుంచి ఆలోచనలను స్వీకరించటం అందుకు కారణం. క్రీ.శ. తొమ్మిదవ శతాబ్దం నాటికి సంస్కృతభాష సాహిత్య, రాజకీయ, మత పరమైన రంగాలలోకి బాగా చొచ్చుకుని పోయింది. ఆ విధంగా సార్వత్రిక భాష కావటంతో దానిని సాహిత్యపరులు, రాజాస్థానాల వారు ఆదరించారు. ఈ దశలో సంస్కృతభాషా

ప్రశస్తి తగ్గిందని, అందుకు కారణం స్థానిక భాషలు ఎక్కువ ఉపయోగంలోకి రావటమని కొందరు భావించారు. కాని స్థానిక భాషల ప్రాముఖ్యత నిజమే అయినా సంస్కృత పురాణ రచయితలు అంతటితో తమ వ్యాపకాన్ని ఆపివేయలేదని, ప్రాంతీయ కథాంశాలను స్వీకరించి తమ పద్ధతిలో తాము సంస్కృత పురాణాలను రచించారన్నది నా అభిప్రాయం. అది సంప్రదాయ సంస్కృతంలో గాక పురాణ సంస్కృతంలో జరిగింది. అదే క్రమంలో వారు కొందరు స్థానిక ప్రముఖులకు తమ కావ్యాలలో స్థానం కల్పించి, విష్ణువు అవతారాలుగా కూడా చిత్రీకరించారు.

## విష్ణ్వవతారాలు

విష్ణువు అవతారాలైన రాముడు, క్రిష్ణుని గురించి మనం ఇప్పటికే చూసాము. వారు భూలోకంలో మానవులుగా అవతరించి మనుషులకు శత్రువులైన అసురులను, రాక్షసులను సంహరించారు. క్రీ.శ. తొలి శతాబ్దాల నాటికి విష్ణువు మరికొన్ని అవతారాలు కూడా ఎత్తినట్లు చెప్తారు. కొన్నిసార్లు ఆరు, కొన్నిసార్లు పద్దెనిమిది, సర్వసాధారణంగా మొత్తం పది. పోతే అవతారాల విషయంలో రాజులు చాలా ఆసక్తి చూపారు. వారిలో కొందరు తాము స్వయంగా విష్ణువు అవతారాలమని తామే చెప్పించుకున్నారు. తర్వాత కాలంలో కేశబ చంద్రసేన్ (1838–84), దశావతారాలను జీవకోటి పరిణామ దశలుగా నిర్వచనం చెప్పాడు. అనగా, గతంలో హిందూ రుషులు కనుగొన్న పరిణామ దశలను ఇప్పుడు డార్విన్ తిరిగి కనుగొన్నాడన్న మాట. సేన్‌కన్న ముందు 1877లో మేడమ్ బ్లావటిస్కీ కూడా ఐసిస్ అన్‌వెయిల్డ్ అనే గ్రంథంలో ఇదే అభిప్రాయం వెలిబుచ్చింది. దశావతారాలు మత్స్యం, కూర్మం, వరాహం, నరసింహం (అన్నీ కృతయుగంలో). వీటిలో నరసింహం తప్ప మిగిలినవి జలచరాలు. వామనుడు, పరశురాముడు, రాముడు (ముగ్గురూ మనుషులు–త్రేతాయుగం). క్రిష్ణుడు, బుద్ధుడు (ఇద్దరూ మనుషులు, ద్వాపరయుగం). చివరగా కల్కి (కలియుగంలో). ఈ అవతారాలను మనం జంతువులు, స్త్రీలు భిన్న మతాల మధ్య సంబంధాలు, కులం–వర్గం అనే క్రమంలో పరిశీలిద్దాము.

## జంతువులు

విష్ణువు అవతారాలలో మత్స్యం, వరాహం, కూర్మం ఉన్నాయి. మత్స్యం, వరదలు అనే కథకు మొదట విష్ణువుతో నిమిత్తం లేదు. మొదట మత్స్యమన్నది మత్స్యం మాత్రమే. కాని తర్వాత మహాభారతంలో మత్స్యం మనువుతో తాను ప్రజాపతి బ్రహ్మనని, సకల చరాచరాల సృష్టికర్తనని చెప్తుంది. కాని ఆ మత్స్యం ఒక తిమింగిలం వలె పెరగటం, ప్రాణులను కాపాడటంతో పురాణాలు దానిని విష్ణువు అవతారమన్నాయి.

వరాహానికి కూడా మొదట విష్ణువుతో సంబంధం చూపలేదు. కాని బ్రాహ్మణాలలో అది ప్రజాపతి అయినట్లు కనిపిస్తుంది. వరాహం భూమిని జలరాశిపై పరిచి, ఒక

వలయంగా మార్చి వివాహమాడుతుంది. మాళ్వాలోని ఉదయగిరి వద్ద ఒక కొండను తొలిచి నిర్మించిన క్రీ.శ. అయిదవ శతాబ్దినాటి ఆలయంలో విష్ణువును వరాహావతారంగా, భూమిని ఆడ వరాహంగా చూపి, ఆ భూమిని విష్ణువు రక్షించినట్లు చెప్పారు.

కూర్మం ప్రస్తావన మహాభారతంలో కనిపిస్తుంది. దేవతలు, రాక్షసులు మందర పర్వతాన్ని కవ్వంగా ఉపయోగించి సముద్రాన్ని మథించబూనిపుడు, ఆ పర్వతాన్ని నిలిపేందుకు ఆధారంగా ఉపయోగపడాలని కూర్మాన్ని కోరుతారు. వాస్తవానికి ఇందులో కూర్మం విష్ణువు అవతారం కాదు. కూర్మం పాత్ర ఇంద్రునిది. విష్ణువు మోహిని అవతారం ఎత్తి అమృతం అసురులకు దక్కకుండా చేస్తాడు అయినా పురాణాలు విష్ణువును కూర్మావతారంగా చిత్రీకరించాయి.

## స్త్రీలు

ఈ దశలో క్రిష్ణుని ఆరాధనలో ముఖ్యమైన మార్పులు రాసాగాయి. మనం మహాభారతంలో చూసేసరికి తను అప్పటికే ఎదిగిన మనిషి. కాని తర్వాత సుమారు వందేళ్ళకు (క్రీ.శ. 450 ప్రాంతం) రచించిన హరివంశంలో తనకు బాల్యం కూడా ఉంటుంది. మహాభారతంలో తను ఒక శక్తిశాలియైన రాజు కాగా, హరివంశంలో అందుకు భిన్నమైన కథనం కనిపిస్తుంది. క్రీ.శ. తొలి శతాబ్దాల కాలంలోని బ్రాహ్మణేతర సంప్రదాయాలలో, ఆవులమందల మధ్య నివసించే బాలుని కథ ఒకటి బాగా ప్రచారంలో ఉండేది. హరివంశం బహుశా ఆ కథతోపాటు మహాభారతాన్ని స్ఫూర్తిగా తీసుకుని మూడవ కథను రూపొందించి ఉంటుంది.. ఆ విధంగా బాలక్రిష్ణుడు, తన ఆరాధన ప్రచారంలో రావటం మొదలైంది.

హరివంశంలోని క్రిష్ణుని జన్మవృత్తాంతం ప్రకారం, కంసుడనే రాజు తన సోదరి దేవకి, ఆమె భర్త వసుదేవునికి ఎనిమిదవ సంతానంగా జన్మించే బాలుడు తనను సంహరించగలడని ఆకాశవాణి చెప్పగా వింటాడు. ఆమె శిశువులందరిని తనకు అప్పగించగలననే షరతుపై కంసుడు దేవకిని జీవించనిస్తాడు. ఆ విధంగా మొదటి ఏడుగురు శిశువులు తన చేతికి రాగానే వారి ప్రాణాలు తీస్తాడు. ఎనిమిదవ పిండంలో విష్ణువు స్వయంగా ప్రవేశిస్తాడు. తన విజ్ఞప్తిని పురస్కరించుకుని నిద్రాదేవి కాళీదేవి రూపంలో, నందుడనే గోపాలుని భార్య అయిన యశోద గర్భంలో ప్రవేశిస్తుంది. ఒక రాత్రి దేవకికి క్రిష్ణుడు, యశోదకు కాళి జన్మిస్తారు. అప్పుడు వసుదేవుడు క్రిష్ణుడిని యశోద వద్దకు తీసుకుపోయి అక్కడి నుంచి కాళిని తీసుకువస్తాడు. ఆ బాలికలను చూసిన కంసుడు నేలకు బలంగా విసిరికొట్టగా స్వర్గానికి చేరి కాళికాదేవత అవుతుంది. ఆమెకు మాంసాహారమంటే ప్రీతి అయినందున జంతువులను బలి ఇస్తారు. క్రిష్ణుడు గోపాలకుల మధ్య పెరిగి, పెద్దవాడయాక కంసుడిని సంహరిస్తాడు. ఇదే కథ మరికొన్ని రూపాలలోనూ కన్పిస్తుంది.

నిద్రాదేవి, దేవకి, యశోద, కాళివంటి పాత్రలతో స్త్రీలకు కొంత ప్రాముఖ్యత లభించటం ఈ విధంగా చూడవచ్చు. హరివంశంతోపాటు భాగవత పురాణం యశోదను ఒక ప్రముఖ పాత్రగా చిత్రీకరిస్తాయి. ఆసరికి దక్షిణాన గల భక్తిధోరణుల ప్రభావంవల్ల కావచ్చు క్రిష్ణుని ఆరాధన కన్పిస్తుంది. పలువురు గోపస్త్రీలు తనను పెంచటంతోపాటు ఆరాధిస్తారు. భగవద్గీతలో క్రిష్ణుడు తన విశ్వరూపం చూపిన కథను పోలినట్లు, భాగవత పురాణంలో క్రిష్ణుడు తన నోటిని తెరిచి యశోదకు బ్రహ్మాండాన్ని చూపుతాడు. ఆ దృశ్యాలను తర్వాత మరచిపోగలరంటూ క్రిష్ణుడు అర్జునునికి వరమిచ్చినట్లే యశోదకు కూడా ఇస్తాడు.

ఎపుడైన మోహానికి పాత్ర ఉన్నప్పుడు అందులో శృంగారం కూడా ఉంటుంది. అది మతపరమైన మోహమైనా సరే. మహాభారతంలోని క్రిష్ణుడు ఒక రాజు. తనకు పలువురు భార్యలుంటారు. కొన్ని లెక్కల ప్రకారం 16,000 మంది. వారిలో కొందరు ఆయనకు ఎక్కువ ప్రియమైనవారు. పురాణాలు తనను గొప్ప సుందరుడని వర్ణిస్తాయి. ఆయన గోపాలకుల భార్యలతో కలిసి నాట్యాలు చేస్తుంటాడు. గోపికలు క్రిష్ణుని తల్లులు, ప్రియురాండ్రు కూడా. పురాణాలు తల్లి ప్రేమ (వాత్సల్యం)కు, ప్రియురాండ్ర ప్రేమ (మాధుర్యం)కు మధ్య అస్పష్ట స్థితిని సృష్టిస్తాయి. ఈ విధంగా వేర్వేరు స్థితులను ఒకటిగా చేయగలగటం హిందూమతానికి గల ఒక అద్భుతమైన సృజనాత్మకత. ఇది ఇతర మతాలలో కన్పించదు.

అనంతర పురాణాలలో రాధ అనే గోపిక క్రిష్ణునికి ప్రత్యేకమైన ప్రియురాలు. ఆమె ఇతర గోపికల వంటిది కాదు. ఆమె పేరు సంస్కృత పురాణాలలో ఏడవ శతాబ్ది వరకు కన్పించదు. తను భక్త సమాజానికి ముఖ్యురాలయేది 16వ శతాబ్దం నుంచి మాత్రమే. భక్తికి అప్పటి నుంచి స్త్రీత్వాన్ని ఆపాదించటంతో స్త్రీల ప్రాముఖ్యత పెరిగింది. సంస్కృత గీత గోవిందానికి రాధా-క్రిష్ణుల ప్రేమ కథే ఆధారం. బెంగాలీ రాజు లక్ష్మణసేన (1179- 1209 ప్రాంతం) ఆస్థానకవి అయిన జయదేవుడు రచించిన ఆ కావ్యం వైష్ణవోపాసకులకు ముఖ్యమైనది. రాధ శక్తిశాలి అయిన స్త్రీ. క్రిష్ణుడు తన ముందు మోకరిల్లి పాదాలపై శిరస్సు ఉంచుతాడు.

భాగవత పురాణంలో క్రిష్ణుడు గోపికలతో నృత్యంచేస్తూనే మధ్య మధ్య అదృశ్య మవుతాడు. వారు తనకోసం అన్వేషిస్తుంటారు. భారతీయ సాహిత్యంలో ప్రేమ – విరహాలు ఒక గొప్ప కథాంశం. అదే ఇక్కడ భక్తి సందర్భంలోనూ కన్పిస్తుంది. భక్తి, ప్రేమ కలగలిసిన గోపికలు కనిపించకుండా పోయిన భగవంతుని కోసం విరహ బాధతో వెతుకుతుంటారు. అనంతర పురాణాలలో క్రిష్ణుని పెంపకం తల్లులలో రాధ కూడా ఒకరు. ఆమె క్రిష్ణుని ప్రియురాలు అయిన తర్వాత కూడా పెంపకం తల్లిపాత్రను పూర్తిగా వదలుకోదు. బ్రహ్మ వైవర్తన పురాణంలో యువతి అయిన రాధకు బాలకృష్ణుడిని పెంచే బాధ్యత ఉంటుంది. కాని అది ఆమెకు నచ్చదు. ఆ స్థితిలో క్రిష్ణుడు అకస్మాత్తుగా యువకునిగా మారుతాడు.

వారిద్దరు కలిసి పలు దినాలపాటు శృంగారంలో మునిగి తేలుతారు. తర్వాత క్రిష్ణుడు తిరిగి బాలుడవుతాడు. ఈ పురాణ రచన బెంగాల్‌లో బహుశా 15, 16 శతాబ్దాలలో జరిగి ఉంటుంది.

## రాముడు (సీత)

రాముని జీవిత చిత్రీకరణ దేవగఢ్‌లోని దశావతార దేవాలయంలో కన్పిస్తుంది. దేవాలయాలలో రాముడిని పూజించే పద్ధతి గుప్తుల కాలంలో ఉండేదనేందుకు ఆధారాలు లేవు. క్రిష్ణుడి కథవలె రాముడి కథను తొలి పురాణాలలో విస్తరించి చెప్పటం కూడా జరగలేదు. అయితే ఈ అనంతర పురాణాల కాలంలో (క్రీ.శ. 800–1500) వాల్మీకి సంస్కృత రామాయణ పఠనం విరివిగా ఉండేది. దానిని సంస్కృతంలోనే తిరగ రాయటం, ఇతర భాషలలోకి అనువదించటం కూడా ఈ దశలో కన్పిస్తుంది. మహాభారతం, హరి వంశం, విష్ణు పురాణాలలో, అనేక ఇతర పురాణాలలో సీత అగ్ని ప్రవేశ ఉదంతం అసలు కన్పించదు. 15వ శతాబ్దినాటి ఆధ్యాత్మ రామాయణం, సీత బంగారు లేడి కోసం రాముడిని కోరటం, లంకలో రావణుడి నివాసంలో ఉండటమనే దోషాల నుంచి తప్పిస్తుంది. అందులోని కథనాన్ని గమనించండి :

## మాయలేడి, మాయ సీత

> రావణుడి ఉద్దేశం తెలిసిన రాముడు సీతతో, రావణుడు ముని వేషంలో రాగలడని, కనుక తన (సీత) మాయా రూపాన్ని పర్ణశాల వెలుపల ఉంచి లోపలకు వెళ్ళి అగ్నిలో అదృశ్యరూపంలో ఉండాలని చెప్తాడు తాను రావణుడిని సంహరించిన తర్వాత తిరిగి యధారూపంలోకి రావాలంటాడు. అందుకు అంగీకరించిన సీత పర్ణశాల బయట మాయా సీతను ఉంచి తాను అగ్నిలో ప్రవేశిస్తుంది. అప్పుడు మాయా సీత రాముడిని మాయలేడి కోసం కోరుతుంది.

రావణుడు మాయ సీతను బందీచేస్తాడు. రాముడు ఆమె కోసం దుఃఖించినట్లు నటిస్తాడు. లక్ష్మణుడు నిజంగానే దుఃఖిస్తాడు. లంకలో జరిగిన కథ ముగిసిన వెనుక అదే మాయ సీత వెనుకకు వచ్చి అగ్ని ప్రవేశం చేసి అంతర్థానమవుతుంది. నిజమైన సీత రామునితో ఉండిపోతుంది.

## భిన్నమతాల మధ్య సంబంధాలు

మహాభారతంలో బుద్ధావతారం ప్రస్తావన ఉంది. కలియుగారంభంలో విష్ణువు బుద్ధుడవుతాడని, శుద్ధోదనుని కుమారునిగా జన్మించి మాగధీ భాషలో బోధనలు చేస్తాడని, తన వలెనే అందరూ బట్టతల వారవుతారని, కాషాయాంబరాలు ధరిస్తారని, పూజారులు పూజాదికాలు వేద పఠనాలు నిలిపివేస్తారని ఆ ఇతిహాసం చెప్తుంది. అయితే ఇది బౌద్ధాన్ని హిందూమతంలోకి విలీనం చేసుకునే ప్రయత్నమనే అభిప్రాయముంది. కాని అటువంటి

విలీన ప్రయత్నాలు ఇతరత్రా అనేకం జరిగినా, అవతారం అన్న మాటలో వేరే చర్చ కనిపిస్తుంది. హిందువులు బౌద్ధులను, జైనులను, భౌతికవాదులను, అదేవిధమైన ఇతర విశ్వాసాలు కలవారిని వేద విరుద్ధమైన ఆలోచనలు కలవారని నిందిస్తారు. అటువంటి వారిని శిక్షించటం అవసరం. దేవతలు సుగుణశీలురను శిక్షించలేదు. ఆ పనిచేయాలంటే వారిని ముందు దుర్లక్షణాలు కలవారిగా మార్చాలి. కనుక విష్ణువు బుద్ధుని అవతారంలో బౌద్ధమనే చెడును బోధించటం ద్వారా వారిని చెడువారిగా మార్చిన తర్వాత భగవంతుడు వారిని శిక్షిస్తాడు. అందుకు సంబంధించిన కథ ఈ విధంగా ఉంది.

## విష్ణువు బుద్ధుని రూపంలో అసురులను దుర్మార్గులను చేయటం

అసురులు యుద్ధంలో దేవతలను జయిస్తారు. అప్పుడు దేవతలు వెళ్ళి విష్ణువు సహాయం కోరుతారు. ఆయనతో "అసురులు మా యాగ ఫలాలను దొంగిలించారు. కాని వారు తమ వర్ణ ధర్మాన్ని నిర్వర్తిస్తూ ఆనందం పొందుతున్నారు. వేదాలను కూడా అనుసరిస్తున్నారు. వారిలో అంతఃశక్తి అపరిమితంగా ఉంది. కనుక మేము వారిని సంహరించలేము. మేము ఆ పని చేసేందుకు ఏదైనా మార్గం చెప్పండి" అంటారు. అప్పుడు విష్ణువు తన దేహం నుంచి ఒక మాయాశక్తిని వెలువరించి దేవతలతో "ఈ శక్తి అసురులకు భ్రాంతిని కల్పించివారు వేదమార్గం నుంచి వైదొలగేట్లు చేస్తుంది. అప్పుడు వారిని సంహరించేందుకు వీలవుతుంది అంటాడు." ఆ మాటలను విన్న దేవతలు తిరిగిపోగా ఆ భ్రాంతి మూర్తి అసురుల వద్దకు వెళుతుంది.

నగ్నంగా, బట్టతలతో, నెమలి ఈకలతో గల ఆ భ్రాంతి మూర్తి అసురులకు మోక్ష సాధన కోసం సులభమైన మార్గాన్ని ఉపదేశిస్తాడు. "ఇది ధర్మమే కాని ధర్మం కాదు. ఇది మోక్షాన్ని ప్రసాదిస్తుంది కాని ప్రసాదించదు" అంటాడు. ఇతర అసురులతో, "మీరు స్వర్గాన్ని కాని, నిర్వాణాన్ని కాని కోరుకున్నట్లయితే జంతుబలి వంటి దురాచారాలను మానివేయాలి. జంతుబలి వల్ల స్వర్గం ప్రాప్తించినట్లయితే యాగకర్త తన తండ్రిని ఎందుకు బలివ్వడం? పూర్వీకులకు పెట్టే నైవేద్యాన్ని ఒకరు స్వీకరించటంవల్ల మరొకరికి తృప్తి కలిగితే, ఇతర దేశాలకు ప్రయాణించే వారు ఆహారాన్ని మోసుకుపోవలసిన అవసరమే లేదు" అంటాడు. ఆ విధంగావారు త్రివేదాలను వర్జించి స్వేచ్ఛగా ఆలోచించేవారిగా మారుతారు. తన శిష్యులూ ఇతరులకు కూడా అవే బోధనలు చేస్తారు. గతంలో తమను కాపాడిన స్వధర్మం ఇప్పుడు లేకపోగా వారు వినాశనం చెందుతారు. దేవతలు దాడి జరిపి వారిని సంహరిస్తారు.

ఇది ఒక కాల్పనిక కథ. బౌద్ధంపట్ల సంప్రదాయవాదుల వ్యతిరేకత ఎంత తీవ్ర మైనదో దీనినిబట్టి గ్రహించవచ్చు. అయినా ఈ కథలో కనిపించేది కొంత నాటకీయతే తప్ప, అందులో బౌద్ధంపై తాత్త్వికమైన దాడి ఏమీలేదు. ఇందుకు భిన్నంగా అదే కాలానికి చెందిన కొన్ని సంస్కృత కావ్యాలు, అనంతర పురాణాలు కొన్ని బుద్ధావతారం గురించి సానుకూల దృక్పథంతోనే రాసాయి. ఉదాహరణకు భాగవత పురాణం విష్ణువు మనను జ్ఞానరాహిత్యం నుంచి, తీవ్రమైన దోషాల నుంచి కాపాడేందుకు బుద్ధునిగా అవతరించా డంది. వరాహ పురాణం, మత్స్య పురాణం వంటివి కూడా సానుకూల దృక్పథమే చూపాయి. పురాణాలు కాని గీత గోవిందం మొదలైనవి కూడా ఇదే వైఖరి తీసుకున్నాయి. మరికొన్ని రచనలు బుద్ధుని ప్రస్తావనలే చేయలేదు. మరొకవైపు బుద్ధునికి బోధగయలోని మహాబోధి దేవాలయంలో కొన్ని శతాబ్దాలుగా హిందువులు పూజలు జరుపుతున్నారు. శ్రీలంకలో ప్రచారంలోగల ఒక కథనంలో పదిమంది బోధిసత్త్వులుంటారు. వారిలో విష్ణువు ఒకరు. ఆ మేరకు దేవాలయాలలో చిత్రీకరణలు కూడా ఉన్నాయి.

బౌద్ధంపట్ల వైఖరి మూడు దశలలో మారుతూ కన్పిస్తుంది. మొదట ఆయన బోధలను ఉపనిషత్తులు, రామాయణం, మహాభారతాలలోకి విలీనం చేసుకోజూసారు. అది దేవతలకు, మనుషులకు మధ్య హిందూ – బౌద్ధ – జైనాలకు మధ్య సామరస్య పూర్వకమైన సంబంధాలు ఉన్న కాలం. ఒకోసారి పరస్పరం పోటీలుండినా పరిస్థితి నాగరికంగానే ఉండేది. ఇది క్రీస్తుపూర్వపు స్థితి. క్రీస్తుశకం మారుతున్న దశలో, మారిన తర్వాత రెండవ దశలో బౌద్ధం శక్తివంతంగా మారింది. దానిని ఇతరులు తమకు ప్రమాదకరమని భావించారు. బుద్ధుని గురించి కల్పిత కథలు ప్రచారంలోకి వచ్చింది ఇప్పుడే. అది గుప్తుల కాలం. హిందూమతానికి బౌద్ధ, జైనాలతో, ఇతర అసమ్మతి విశ్వాసాలతో ఘర్షణ సాగుతున్న దశ అది. ఈ స్థితి సాహిత్యంలో ప్రతిఫలించింది. మూడవ దశవచ్చేసరికి బౌద్ధం క్షీణించ సాగింది. రచనలలో పరస్పర ద్వేషాలు తగ్గాయి. అంతేగాక హిందువులు మరోసారి బౌద్ధాన్ని ప్రశంసించనారంభించారు. ఇదే మార్పు కొత్త పురాణాలలో కన్పిస్తుంది.

## కల్కి

దశావతారాలలో చివరిదైన కల్కి కలియుగాంతంలో అవతరించి బర్బరులను, నాస్తికులను నాశనం చేస్తాడు. ఇదొక్కటే భవిష్యత్తులో రానున్న అవతారం. భారతదేశంపై గ్రీకులు, సిథియన్లు, పార్థియన్లు, కుషాణులు, హూణుల దండయాత్రలకు స్పందనగా కల్కి అవతార ఆలోచన కలిగి ఉంటుంది. అయితే భవిష్యత్తులో అవతరించనున్న బుద్ధ మైత్రేయుడు ఈ ఆలోచనకు కొంత స్ఫూర్తి కావచ్చు. మైత్రేయుడు బౌద్ధ విశ్వాసాలను, వ్యవహరణా శైలిని పునరుద్ధరిస్తాడని నమ్మకం. అయితే పార్థియన్లు క్రీ.శ. మొదటి శతాబ్దిలో ఒక సంరక్షకుని కథను తమవెంట తెచ్చారు. అతను అందరినీ పరిశుద్ధులను చేస్తాడు.

అదే కథ మైత్రేయుడు, కల్కి అనే ఆలోచనలకు స్ఫూర్తి కలిగించి ఉండాలి. ఆ కాలంలో ఐరోపాలో, క్రైస్తవులలో కొత్త ఆలోచనలు రాజ్యమేలుతున్నాయి. క్రైస్తవ సాహిత్యంలో ఒక మహనీయమూర్తి శ్వేతాశ్వంపై స్వారీ చేస్తుంటాడు. కల్కి వాహనం కూడా శ్వేతాశ్వం కావటం గమనించదగ్గది. క్రైస్తవ సాహిత్యంలోని మహనీయుడు తన వస్త్రం రక్తంతో తడిసి ఉండగా క్రీస్తు వ్యతిరేకులను సంహరించేందుకు వెళతాడు. కల్కి బయటి నుంచి దండెత్తిన వారిని అంతం చేయబూనుతాడు. ఆసక్తికరమేమంటే, అటువంటి కల్పిత కథను భారత దేశానికి తీసుకువచ్చింది అట్లా దండెత్తి వచ్చినవారే.

కల్కి ప్రస్తావన మొదట మహాభారతంలో వస్తుంది. కలియుగంలో జరిగే చెడును సుదీర్ఘంగా వర్ణించిన ఆ కావ్యం ఆ తర్వాత కల్క్యవతారం గురించి చెప్తుంది. శంభాలా అనే గ్రామంలో ఒక బ్రాహ్మణుడు కల్కి విష్ణుయశస్ అనే పేరుతో జన్మించి రాజవుతాడు. బర్బరులను, దోపిడీ దొంగలను సంహరించి, ఒక గొప్ప అశ్వమేధయాగాన్ని నిర్వహించి, అక్కడ రాజ్యాన్ని ద్విజులకు అప్పగిస్తాడని అందులో ఉంది. కాని తను అవతారమనే ప్రసక్తిలేదు. పేరులో విష్ణువు అని ఉండటం తప్ప. అదే విధంగా, శ్వేతాశ్వారూఢుడు కావటమన్నదీ లేదు. అశ్వం ప్రస్తావన యాగానితో ముడిపడి ఉంటుంది. విష్ణు పురాణం అవతారం గురించి కొంత స్పష్టత ఇస్తుంది. కాని శ్వేతాశ్వం మాట కన్పించదు.

విష్ణు పురాణం చెప్పే దాని ప్రకారం కల్కి దండెత్తేది గ్రీకులు, సిథియన్లు, హూణులు మొదలైన విదేశీయులపై. అదే విధంగా భారతదేశాన్ని అపవిత్రంచేసే ఇతరులపై (బౌద్ధులు, జైనులని భావం). కల్కి పురాణ రచనాకాలం బహుశా 18వ శతాబ్దం అయి ఉంటుంది. ఈసరికి ఆ విదేశీయులు లేరు, బౌద్ధ, జైనాలు బలహీనపడిపోయాయి. కనుక బర్బరులు, లేదా మ్లేచ్ఛులన్న వారు క్రైస్తవులు (విదేశీయులు గనుక) కావచ్చు. ముస్లిములు కూడా కావచ్చు.

## వర్గ, కుల ఘర్షణలు

మహాభారతంలో పరశురాముడు అవతారం కాదు గాని ఒక ప్రముఖుడు. జమదగ్ని అనే బ్రాహ్మణునికి, రేణుక అనే క్షత్రియ స్త్రీకి కలిగిన సంతానం. తండ్రి మహా అసూయా పరుడు. తల్లిదండ్రుల మధ్య కలహంలో పరశురాముడు చిక్కుకుంటాడు. ఒక రోజు రేణుక నదిలో స్నానంచేస్తూ, ఒక రాజు తన రాణితో జలకాలాడటం చూసి ఆయనపై మనసుపడుతుంది. అది గ్రహించిన జమదగ్ని పరశురామునితో తన తల్లి శిరస్సును ఖండించమని చెప్తాడు. తను అదే ప్రకారం చేయటంపట్ల సంతోషించి ఏదైనా కోరు కొమ్మంటాడు. పరశురాముడు తల్లి ప్రాణాన్ని కోరుకోగా అనుగ్రహిస్తాడు. రేణుక ప్రాణాలతో తిరిగివస్తుంది. హిందూ పురాణాలలో మరణం అన్నది నిజంగా మరణం కానక్కరలేదు. పోతే, పరశురాముడు తన తండ్రిని, ఆ ఉదంతాన్నంతా అందరూ మరచిపోవాలని ఆ

దోషం కూడా శమించాలని మరొక వరం కోరగా తండ్రి అందుకు కూడా అంగీకరిస్తాడు. ఆ విధంగా చివరకు ఇక ఏమీ జరగనట్లే అవుతుంది. దోషమని పరశురాముడన్నది తను తల్లి శిరస్సును ఖండించటమా, లేక తన తల్లికి పరపురుషునిపై కోరిక కలగటమా అన్నది తెలియదు. కాని తర్వాత పరశురాముడు తన తల్లికి చెందిన క్షత్రియ వర్గాన్నంతా నిందించి వారందరిని సంహరిస్తాడు. అయితే దీనంతటిలో అర్థంకానిది ఒకటుంది. వేర్వేరు కులాలవారికి జన్మించి, తన కుటుంబం విచ్ఛిన్నంకాగా, అట్లా జరగటంలో తన పాత్ర కూడా కొంత ఉన్నప్పుడు, అంతటి హింసాత్మకమైన చర్యలకు పాల్పడిన వ్యక్తికి విష్ణువు అవతారాలలో స్థానం ఎందువల్ల లభించినట్లు? పురాణ రచయితలైన బ్రాహ్మణులకు తను క్షత్రియులను ఆ రీతిన సంహరించటం నచ్చి ఉండవచ్చు. అయితే తను బ్రాహ్మణుని వలె క్షత్రియుని వలె కూడా ప్రవర్తించాడు. విచిత్రమేమింటే క్షత్రియులు కూడా ఆయనను ఆ పరాక్రమం దృష్ట్యా తమకు ఆదర్శప్రాయుడని భావిస్తారు.

## సన్మార్గులైన అసురులు

హిందూమత చరిత్రలో సన్మార్గులైన అసురులు, లేదా రాక్షసులుండటం ఒక ఆసక్తి కరమైన విషయం. ఉదాహరణకు రామాయణంలో విభీషణుడు అటువంటివాడే. భాగవతంలో ప్రహ్లాదుడు మరొక ఉదాహరణ. వామనావతార కథలోని బలి చక్రవర్తి ఇంకొకరు. రాక్షసులలో కొందరు ఆయా కాలాలకు చెందిన సుగుణాలనే స్వీకరించి అనుసరించి శక్తివంతులవుతారు. రావణుడు మహా తపస్సంపన్నుడు. బలిచక్రవర్తి దాన గుణంలో సాటిలేనివాడు. ప్రహ్లాదుడు రాక్షసుడైనా గొప్ప భక్తుడు. వారు ఆ విధంగా కూడా దేవతలకు ప్రమాదకారులవుతారు. విష్ణువు వారిని మాయోపాయాలతో లొంగదీసి దేవతలకు భద్రత కల్పిస్తాడు. నిమ్న కులాలవారు ధర్మాన్ని అనుసరించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరటమన్నది దానికి పురాణాలలో ఇవి సంకేత ప్రాయమైన కథలు కావచ్చు.

రామాయణంలో సుకేశ అనే రాక్షసుని కథ ఉంది. సుకేశుని ముగ్గురు కుమారులు వేదాలను అభ్యసించటంతోపాటు విరివిగా దానధర్మాలు చేస్తారు. తను ఆ విధంగా మొదట చాలా ఉత్తముడు. తర్వాత అహంభావం పెరిగి దేవతలను బాధలకు గురిచేస్తాడు. విష్ణువు తనను యుద్ధంలో సంహరించి నరకానికి పంపుతాడు. కాని పురాణాలలో ఈ కథ భిన్నంగా ఉంది. దాని ప్రకారం సుకేశుడు శివుడి నుంచి తననెవరూ జయించకుండా, సంహరించ కుండా వరం పొందుతాడు. ధర్మాన్ననుసరించి జీవిస్తాడు. ఒక రోజు మునుల ఆశ్రమానికి వెళ్ళి ధర్మమేమిటో తెలియజేయవలసిందిగా కోరుతాడు. వారు దేవతల ధర్మమేదో, రాక్షసుల ధర్మమేదో (అందులో శివోపాసన ఒకటి), ఇతరులది ఏదో వివరిస్తారు. చివరగా అందరికీ వర్తించే సామాన్య ధర్మాన్ని చెప్పి, ఎవరు కూడా తన తరగతికీ, వయసుకు నిర్దేశించిన

స్వధర్మాన్ని విడనాడరాదంటారు. సుకేశుడు సామాన్య ధర్మాన్ని తక్కిన రాక్షసులకు బోధిస్తాడు. వారు ఆ ధర్మాన్ని ఆచరించటం మొదలుపెట్టడంతో దాని కళ్ళు చెదిరే కాంతితో సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు మసకబారుతారు. రాత్రి పగలుగా మారుతుంది. గుడ్లగూబలు బయటకురాగా కాకులు వాటిని చంపుతాయి. అప్పుడు సూర్యునికి, ఆ రాక్షసులు తమ స్వధర్మాన్ని విడనాడారనే విషయం స్ఫురిస్తుంది. సాధారణ ధర్మాన్ని అనుసరించటంతో లభించిన ఫలం స్వధర్మ విస్మరణతో తుడిచిపెట్టుకుపోతుంది. అప్పటికే ఆగ్రహంతో ఉండిన సూర్యుడు తన కిరణాలను గుప్పించటంతో సుకేశుని నగరం ఆకాశం నుంచి నేలకూలుతుంది. అప్పుడు సుకేశుడు శివుడిని ప్రార్థించగా, శివుడు తన దృష్టిని సూర్యునివైపు మరల్చుతాడు. సూర్యుడు ఒక రాయివలె ఆకాశం నుంచి పడిపోతాడు. దేవతలు శివుడిని ప్రార్థించి సూర్యుడిని తిరిగి తన రథంపై ఉంచు తారు. సుకేశుడిని స్వర్గానికి తీసుకుపోతారు. కాని రాక్షసులందరినీ కాదు. నిజానికి సూర్యచంద్రులను మసకబార్చటంలో వారందరి పాత్ర ఉంటుంది.

ఇందులో కన్పించేదేమిటి? మొదటిది సాధారణ ధర్మానికి, స్వధర్మానికి మధ్య ఘర్షణ. తర్వాతది స్వధర్మానికి అనుకూలమైన వాదన. చివరగా స్వధర్మాన్ని కూడా కొట్టి వేస్తారు దేవతలు. సుకేశుడు భక్తి తంత్రాన్ని ప్రయోగించి ఆ వర్ణవ్యవస్థను ఒక మేరకు ఎదుర్కొంటాడు.

అనంతర పురాణాలలో గల కథనాల ప్రకారం, ఒకానొక మందిరం అందరికీ స్వర్గానికి మార్గం చూపుతుంది. ఇది భగవంతునికి ఆగ్రహం కలిగించగా శివుడు జోక్యం చేసుకుని ఆ మందిరానికి రక్షణ కల్పించి, అందరినీ బ్రహ్మలోకానికి తీసుకువెళతాడు. స్త్రీలు, శూద్రులు, కుక్కలను వండేవారు, అందరూ ఒక మందిరం ద్వారా స్వర్గానికి పోతున్నారని నరకలోకపు రాజైన యముడు ఫిర్యాదు చేస్తాడు. ఆ మందిరం సోమనాథాలయం. అట్లా జరగటంవల్ల యమునికి పనిలేకుండా పోతుంది. యముని ఫిర్యాదుకు సమాధానంగా శివుడు, వారంతా సోమనాథాలయాన్ని దర్శించటంతోనే పాప నిష్కృతి జరిగి పుణ్యాత్ములయారంటాడు. ఈ రచనలు చాలావరకు, పారియాలు ప్రస్తుత జన్మలో బ్రాహ్మణుల వలె వ్యవహరించగలరని చెప్పవు. ఈ జన్మ నుంచి మాత్రం విముక్తి చెందగలరు. భగవద్గీతలో అన్నట్లు, ఫలితం మరుజన్మలో లభిస్తుంది.

భక్తి, దేశీయీకరణ, ఇస్లాంలు విసిరిన సవాలుతో హిందూ కావ్యాలు కొన్ని మరొక అడుగు ముందుకు వెళ్ళాయి. ఇప్పుడు భగవంతుడు తన భక్తుడైన అసురుని వద్దకు పోయి, తాను గాక అసురులంతా శాశ్వతంగా స్వర్గానికి పోవచ్చునంటాడు. అక్కడ సంస్కరణ పొందిన పాపులకే గాక సంస్కరణ పొందనివారికి, అన్ని తరగతుల వారికి అవకాశం ఉంటుంది.

ఇందులోని పరిణామగతిని గమనించవచ్చు. మొదటి నుంచి భక్తులు, మంచి మనుషులు, శివభక్తుని కథలు వస్తాయి. తర్వాత దుర్గుణుడైన భక్తుడు కన్పిస్తాడు. దుష్కర్మలు, దురాలోచనలు చేసే వారు, మతంలోని అసమ్మతివాదులు, అసత్యవాదులు అసురులు అందరూ శివుడిని పూజిస్తే చాలు స్వర్గానికి పోతారు. యముడు వారందరికీ మినహాయింపు ఇవ్వవలసిందే. మూడవ తరహాలో మరొక ఉదంతాన్ని గమనించండి. అందులోని వ్యక్తి సన్మార్గుడు కాడు, భక్తుడు కూడా కాడు.

## ఒక దొంగ కథ

> బ్రాహ్మణులను హత్యచేసి, మద్యం సేవించి, బంగారాన్ని దొంగిలించి, ఇతరుల భార్యలపై అత్యాచారాలు చేసిన ఒక మనిషి తన సొమ్మునంతా జూదంలో పోగొట్టు కుంటాడు. ఆ రాత్రి ఒక శివలింగంపైకెక్కి ఒక గంటను దొంగిలిస్తాడు. ఆ గంట పొరపాటున మోగుతుంది. శివుడు తన సేవకులను పంపి ఆ దొంగను కైలాసానికి రప్పించి, తన సేవకునిగా నియమించుకుంటాడు.

ఆ వ్యక్తి మద్యం, స్త్రీ వ్యసనం, జూదం అనే సాధారణమైన తప్పులతోపాటు, బ్రాహ్మణ ప్రపంచంలో దోషాలైన బ్రాహ్మణ హత్య, వారి బంగారాన్ని దొంగిలించటం వంటివి మొత్తం అయిదు నేరాలకు పాల్పడతాడు. శివుని వద్ద గంటకొట్టటమనే భక్తి చర్య అనుకోకుండా జరుగుతుంది. తను సంస్కరణకు లోనైనట్లుకాదు. తన దురలవాట్ల మరణ పర్యంతం కొనసాగిస్తాడు. అయినా కైలాసానికి పోతాడు. కొన్ని కథలలో తను గంట మోగిన తర్వాత మారినట్లు ఉంది. ఇటువంటి 'అనుకోని భక్తి', లేదా 'ప్రమాద వశాత్తు భక్తి' కథలు అనేకం ఉన్నాయి. వారెవరూ సంస్కరణకు గురికాకున్నా విముక్తి పొందుతారు.

ఇంతకూ ఈ ఆలోచన ఎట్లా వచ్చినట్లు? దీని మూలాలను దక్షిణ భారతదేశంలోని 'ద్వేషభక్తి'లో గమనించవచ్చు. అది అనంతర పురాణాలలో కొత్త రూపం తీసుకుంటుంది. ఒక అసురుడు భగవంతుడిని హతమార్చేందుకు ప్రయత్నించడమంటే తన పట్ల భక్తి వ్యామోహం ఏర్పడటమన్న మాట. కనుక భగవంతుడు ఆ అసురుడిని ప్రేమిస్తాడు. తను పశ్చాత్తాపపడకపోయినా, ఈ దృక్పథాన్ని కాదనలేదు. సంప్రదాయిక ధర్మాన్ని ధిక్కరించి కూడా భగవంతునితో విలీనం కావచ్చుననే తాంత్రిక లక్ష్యాలు కూడా, 'అనుకోని భక్తి' అనే దృక్పథానికి దోహదం చేశాయి.

## శునక సౌజన్యంతో

కుల వ్యవస్థకు సంబంధించిన ఇతర నిబంధనలు కూడా తలకిందులయే దానికి అనుగుణంగా, ఈ తాత్త్విక ధోరణిలో తరచు శునకాలు ముఖ్యపాత్ర వహిస్తుంటాయి. ఒక కథను గమనించండి :

## త్రిశూల పాదం

దుర్మార్గుడైన ఒక దొంగను రాజ భటులు చంపుతారు. ఆ శవాన్ని తినేందుకు వచ్చిన ఒక కుక్క గోళ్ళవల్ల అనుకోని విధంగా ఆ మనిషి నుదుటిపై త్రిశూలం గుర్తు ఏర్పడుతుంది. త్రిశూలం శివుని ఆయుధం. ఈ కారణంగా శివుని దూతలు ఆ దొంగను కైలాసానికి తీసుకుపోతారు.

ఇందులో త్రిశూలం గుర్తు వేసింది కుక్కే తప్ప దొంగ కాదు. అయినప్పటికీ దొంగ ఆ కుక్కపట్ల ఉదారత చూపాడు. కుక్క ఆ దొంగను తనకు తెలియకుండానే ఆశీర్వదించింది. కైలాసానికి కుక్కపోలేదు గాని దొంగపోయాడు. దీనిని పోలిన కథ ఒకటి స్కంద పురాణంలో ఉంది. అదే పురాణంలోని వేనుని కథలోనూ కుక్క పాత్ర కన్పిస్తుంది. తను కైలాసానికి స్వయంగా వెళ్ళలేకపోగా ఆ జంతువు తనకందుకు సహాయ పడుతుంది. మహాభారతంలోని శునకం యుధిష్ఠిరుడు స్వర్గంలోకి ప్రవేశించటానికి ముందు అంతర్ధానమవుతుంది. కాని వేనుని కథలోని శునకం కైలాసానికి పోతుంది.

**అధ్యాయం 18**

# దక్షిణ దేశంలో, కశ్మీర్‌లో తాత్త్విక వివాదాలు

## క్రీ.శ. 800 - 1300

**కాలక్రమణిక (అన్నీ క్రీ.శ. సంవత్సరాలు)**

| | | |
|---|---|---|
| 788–820 ప్రాంతం | : | కేరళలో జీవించిన అద్వైత సిద్ధాంతకర్త శంకరుడు |
| 975–1025 ప్రాంతం | : | కశ్మీర్‌లో జీవించిన శైవతాత్త్వికుడు అభినవ గుప్తుడు |
| 1021 | : | లాహోర్‌లో ఘజ్నవీద్ (తరుష్క) ముస్లిముల రాజధాని స్థాపన |
| 1056–1137 ప్రాంతం | : | తమిళ దేశంలో నివసించిన విశిష్టాద్వైత సిద్ధాంతకర్త రామానుజుడు |
| 1192 | : | ఢిల్లీలో ఘోరిడ్ ముస్లిం రాజధాని స్థాపన |
| 1200 ప్రాంతం | : | బెంగాల్‌లో నివసించిన జయదేవుడు |
| 1210–1526 | : | ఢిల్లీ సల్తనేట్ పరిపాలన |
| 1238–1317 ప్రాంతం | : | కర్ణాటకలో నివసించిన ద్వైత సిద్ధాంతకర్త మధ్వుడు |

*ఇప్పుడు 'కె'గా మారిన ఆ లోయపేర్లు ప్రాచీన కాలంలో భిన్నంగా ఉండేవి. వాటిలో 'కచ్–మేర్' ఒకటి. దాని అర్థం 'సముద్రాన్ని దాచిన స్థలం' అని. 'కోశ్–మార్' అనే మరొక పేరు కూడా ఉండేది. దాని అర్థం 'పీడకల'.*

సల్మాన్ రష్దీ, హారూన్ అండ్ ద సీ ఆఫ్ స్టోరీస్ (1990)

కశ్మీర్ దాచిన సముద్ర మన్నది సంస్కృతంలో గల కథాసరిత్సాగరమనే గొప్ప కావ్యం. దానికి కశ్మీర్‌లో రచించారు. మాయా సిద్ధాంతంపై కశ్మీర్‌లో ప్రసిద్ధమైన చర్యలు అనేకం జరిగాయి. ఈ ప్రపంచం ఒక మాయ లేక పీడకల అన్నది ఈ సిద్ధాంతంలోని భావన. దీనిని మనమీ అధ్యాయంలో పరిశీలిద్దాము.

### తాత్త్విక ఆలోచనరీతులు

తిరిగి వెనుకకు వెళ్ళి హిందూమత చరిత్ర అనే మర్రి చెట్టుకు గల మరొక శాఖను చూడాలి మనం. అది తాత్త్వికత. ఈ శాఖను దక్షిణ భారతదేశంలోని భక్తి ఉద్యమం, ఉత్తర దేశంలోకి అరబ్బుల రాక దశ నుంచి గమనించాలి. అయితే ఇక్కడ రాసేది యథాతథంగా తత్త్వశాస్త్రం గురించి కాదు. తత్త్వవేత్తలతో నిమిత్తం లేకుండా ఆ విషయాలు ప్రజల మధ్య ఏవిధంగా ఉన్నాయి, వారు తత్త్వవేత్తల గురించి చెప్పే కథనాలేమిటి, తాత్త్విక

విషయాలను తమ కథలలోకి ఏవిధంగా చొప్పిస్తారనేవి మనం చర్చిద్దాం. ఎందుకంటే భారతదేశంలోని సాధారణ ప్రజలు తమ మతం, పూజాదికాలు, సంప్రదాయాల జీవితంలో భాగంగా తత్త్వాల గురించి చర్చిస్తుంటారు.

ముగ్గురు గొప్ప వేదాంతిక తత్త్వవేత్తల గురించి ప్రజలు చెప్పే కథనాలేమిటి? ఒక వేదాంతి అనుయాయులు మరొక వేదాంతి విషయమై ఏమంటారు? మాయాతత్త్వాన్ని ప్రజలు చెప్పే కథలు కులానికి, స్త్రీ – పురుషులకు, గృహస్తులకు – సన్యాసాశ్రమానికి మధ్య ఉండే సంఘర్షణస్థితి ఏమిటి? అనేవి కూడా ఇందులో వస్తాయి. ఎందుకంటే, సన్యాస భావన భౌతిక ప్రపంచాన్ని, భౌతిక జీవనాన్నీ మృత్యువల్ల అనే గాక అవాస్తవికమైన మృత్యువల అంటుంది.

ఈ విధమైన దృష్టితో విషయ చర్చచేసినప్పుడు ఇతర ముఖ్యమైన తాత్త్విక ధోరణులు అనేకం ప్రస్తావనకు రాకుండా పోతాయి. అందువల్ల, హిందూ తాత్త్వికతలోని ప్రధానమైన రీతులేమిటి, వాటి మౌలిక వాదన లేమిటో క్లుప్తంగా పేర్కొంటాను. ఆ రీతులు, లేదా ధోరణులన్నవి షడ్దర్శనాలు. వీటికి మూలాలు అంతకు ముందటి శతాబ్దాలలోనే ఉన్నప్పటికీ 12వ శతాబ్ది కాలం నుంచి సంపూర్ణమైన విధంగా రూపుదిద్దుకున్నాయి. ఆ క్రమంలో వాటి మధ్య పరస్పర సంపర్కాలు కూడా సాగాయి. ఆ షడ్దర్శనాలు ఇవి :

1) **మీమాంస :** అనగా విషయాలను క్లిష్టమైన దృష్టితో శోధించటం. ఇది క్రీ.పూ. 400 ప్రాంతంలో జామినితో ఆరంభమైంది. వేదాలను ధర్మానికి, కర్మకు సాధికారమైన గ్రంథాలుగా భావించి వాటికి నిర్వచనాలు చెప్పటం జామిని చేసినపని. బలి క్రతువును ఆచరించినవారికి స్వర్గంలో చోటు తప్పక లభించగలదని ఆయన తేల్చాడు. బలులను స్త్రీలు కూడా ఇవ్వవచ్చునని, కాని శూద్రులు కాదని ప్రకటించాడు.

2) **వైశేషికం :** ఇది క్రీ.పూ మూడవ శతాబ్ది ప్రాంతానికి చెందిన కానడతో ఆరంభమైంది. ఆయన అణు సంబంధమైన విశ్వ సృష్టి గురించి చెప్పాడు. తన వాదనను అనుసరించి భౌతికమైన వస్తు పదార్థాలన్నింటిలో 9 అంశాలుంటాయి. వాటిలో మట్టి, నీరు, అగ్ని, వాయువు భౌతికాంశాలు కాగా, స్థలము, సమయం, ఆకాశం, మేధస్సు, ఆత్మ అన్నవి నైరూప్యాంశాలు. కాడుని దృష్టిలో ఈ విశ్వానికి సృష్టికర్త భగవంతుడు. కాని ఆ పని శూన్యం నుంచి చేయలేదు. అప్పటికే అణురూపంలో గల పదార్థాల ఆధారంగా ఆయా రూపాలను సృష్టించాడు. వైశేషికులను శంకరుడు అర్ధశూన్యవాదులన్నాడు.

3) **తర్కం :** క్రీ.పూ. రెండవ శతాబ్ది ప్రాంతానికి చెందిన గౌతమునితో (బుద్ధునితో సంబంధం లేదు) తర్కం ఆరంభమైంది. విశ్లేషణా ప్రధానమైన ఈ తత్త్వం తదనంతర కాలపు హిందూ తత్త్వశాస్త్రాలకే గాక వైజ్ఞానిక శాస్త్రాలకు కూడా వర్తించింది.

4) **యోగ సూత్రాలు :** క్రీ.పూ. 150 ప్రాంతంవాడైన పతంజలి అప్పటికే వందల ఏళ్ళుగా గల యోగ విధానాలను సూత్రీకరించాడు. ఒక వ్యక్తిగతమైన భగవంతుడు

ఉంటాడని, తను తరచు సర్వాన్ని సృష్టించి, వినాశనం చేస్తాడని, సర్వ సమర్థుడని యోగ శాస్త్రం భావిస్తుంది. మేధస్సును, శరీరానికి వ్యాయామం అవసరమని, అసలు ఏ వ్యాయామం లేని స్థితి కూడా అవసరమని ఆ శాస్త్రం చెప్తుంది. మోక్షమన్నది జ్ఞానమార్గంలో గాక, మేధస్సును, దేహాన్ని కేంద్రీకరించి ఒక క్రమశిక్షణలో ఉంచటం ద్వారా లభిస్తుందని యోగశాస్త్రం చెప్తుంది.

5. **సాంఖ్యం :** సాంఖ్యమనే తత్త్వశాస్త్ర మూలాలు ఉపనిషత్తుల కాలంలో ఉన్నాయి. ఇది మహాభారతంలో, ప్రధానంగా భగవద్గీతలో, ముఖ్యమైంది. కాని దానికి ఒక రూపమిచ్చినవాడు క్రీ.శ. మూడవ శతాబ్దికి చెందని ఈశ్వర క్రిష్ణ. సాంఖ్యం ద్వైత మైనది. విశ్వాన్ని పురుష, ప్రకృతి అని విభజిస్తుంది. ఆత్మ, అహం, లేదా వ్యక్తి వంటివి పురుష కాగా, వస్తు పదార్థాలు, ప్రకృతి వంటివి స్త్రీ సంబంధమైనవి. భగవంతుడు ఉన్నదీ లేనిదీ తెలియదు గాని, ఈ విశ్వానికి నిర్వచనం చెప్పేందుకు ఆయనతో పనిలేదని తొలినాటి సాంఖ్యతత్త్వవేత్తలన్నారు. కాని తర్వాత కాలపు వారు దేవుని ఉనికిని అంగీక రించారు.

**6. వేదాంత :** ఆత్మ, బ్రహ్మల ఏకాత్మతా దృష్టి నుంచి ఉపనిషత్తులను అధ్యయనం చేసేది వేదాంతం. వేదాంతాలు తరచు ఉపనిషత్తులు, భగవద్గీత, బాదరాయణుని వేదాంత సూత్రాలపై క్రీ.పూ. 400 ప్రాంతం వ్యాఖ్యానాల రూపంలో ఉంటాయి. వేర్వేరు వేదాంత శాఖలు ప్రపంచాన్ని జ్ఞానమీమాంస సంబంధమైన పొరపాటు లేదా అవిద్యగా, మాయగా చూపుతాయి. చివరకు చెడును, మరణాన్ని కూడా మాయ అని భావిస్తాయి.

వేదాంతాల దశ దక్షిణ భారతదేశానికి చెందిన ముగ్గురు గొప్ప తత్త్వవేత్తలతో ఆరంభమవుతుంది. వారంతా బ్రాహ్మణులే. వారిలో ద్వైతులు భగవంతుడు, ప్రపంచం వేర్వేరు అనగా, అద్వైతులు అవి రెండు ఒకే పదార్థంతో సృష్టి అయినట్లు చెప్పారు. కేరళకు చెందిన శంకరుడు శుద్ధ అద్వైతి. తమిళ దేశంలోని కంచీపురం (కంజీవరం)లో రామానుజుడనే వైష్ణవుడు విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించాడు. కర్ణాటకలోని కళ్యాణ్‌కు చెందిన మధ్వాచార్యులు ద్వైతాన్ని చెప్పాడు. ఈ ముగ్గురి అనుచరులు, వ్యతిరేకులు కూడా వారి గురించి చాలా కథలు వినిపించారు. వారి తత్త్వాలలో మానవ సంబంధమైనవి ఏమిటి, ఆ కథలలోగల భిన్న స్వరాలేమిటన్నది మనం గమనించవచ్చు.

## మధ్యయుగాల కథనాలలో వేదాంతిక ప్రతీకారాలు

మధ్య యుగాలలో ప్రజలు తత్త్వశాస్త్రాల పట్ల తగినంత ఆసక్తి చూపేవారు. అది ఒకోసారి వారి మధ్యతగవులకు దారితీసేది. దిగ్విజయ అన్నది సాధారణంగా రాజులకు సంబంధంగల మాట. కాని అది ఒక తత్త్వవేత్త మరొక తత్త్వవేత్తను ఓడించటానికి కూడా వర్తించసాగింది. అవి ఎక్కువగా వాగ్యుద్ధాలు, అప్పుడప్పుడు తమ పోషకులు సమకూర్చే

నిధులతో చేసేవి కాగా, అరుదుగా భౌతికమైన కలహాలు సైతం చోటు చేసుకునేవి. పంజాబ్‌లోని థానేశ్వర్ వద్ద హిందూ భక్తుల బృందాలు రెండు 1597–98 కాలంలో విల్లంబులు, ఖడ్గాలు, కత్తులతో పరస్పరం తలపడుతున్న చిత్రం ఒకటి అక్బర్ నామాలో ఉంది. వారంతా యోగులు, మునులు. వారి కలహాన్ని అక్బర్ చక్రవర్తి గమనిస్తుంటాడు.

మనం ఇప్పటికే శివుడు, దక్షుడు, బుద్ధుని గురించిన కాల్పనిక కథలను చూశాము. తర్వాత కాలంలో దక్షిణ దేశంలో, కశ్మీర్‌లో ఆదర్శవాదానికి బౌద్ధం దోహదం చేసింది. అంతవరకు బుద్ధునికి వ్యతిరేకంగా ఉండిన దృష్టి శంకరునివైపు మళ్ళింది.

## శంకరుని కథలు

శంకరుని శాస్త్రాలు తన తాత్త్వికమైన ఆలోచనల గురించి వెల్లడించగా, కథలు ఆయన జీవితం గురించి చెప్తాయి. శంకరుడు ఒక నైతిక నియమావళితో సంస్కారోద్యమాన్ని ఆరంభించాడని, అది బౌద్ధుల అష్టాంగ మార్గంతో పోటీపడుతుందని అన్నారు. ఇస్లాంలోని అల్లా ఒక్కడే అనే దృక్పథం విసిరిన సవాలుకు సమాధానం చెప్పవలసిన అవసరం కూడా తనకు ఏర్పడిందనుకోవాలి. గురువు, తాత్త్వికుడు, మతాంతరీకరణలు జరిపిన వాడు కూడా అయిన శంకరుడు దేశవ్యాప్తంగా నెలకొల్పిన మఠాలు ఆయన పేరిట నేటికీ ఉన్నాయి. మన దైనందిన జీవితానుభవాలు, చావు పుట్టుకలనే సంసార వలయం అంతిమంగా మాయ అన్నది శంకరుని సిద్ధాంతం. భగవంతునితో మనకుగల బంధాన్ని ప్రాతిపదిక చేసుకుని సన్యసించాలని కూడా చెప్పాడాయన.

అయితే సన్యసించే హక్కు బ్రాహ్మణులకు మాత్రమే ఉంటుందని వాదించాడు శంకరుడు. సమాజంలో సన్యసించటంపట్ల తగినంత వ్యతిరేకత ఉండేది. అది ఒక మేరకు శంకరుని పట్ల వ్యతిరేకతగా మారింది. సన్యసించటమనే భావన ఉపనిషత్తులకన్న ముందు నుంచే ఉన్నా, శంకరుని కాలం వరకు అది వ్యవస్థీకృత రూపం తీసుకోలేదు. శంకరుడు ఇందుకు సంబంధించిన ఆలోచనలను బౌద్ధం నుంచి స్వీకరించి, హిందూ మతానికి తగినట్లుగా రూపొందించాడు. అది రామానుజుని వంటి వారి నుంచి విమర్శలకు దారితీసింది. ఆయన శంకరుడిని 'ప్రచ్ఛన్న బౌద్ధ' అని నిందించాడు.

శంకరుని అద్వైతానికి మొదట రామానుజుని విశిష్టాద్వైతం నుంచి, తర్వాత మధ్వుని ద్వైతం నుంచి సవాళ్ళు ఎదురయాయి. శంకరుడు ఏకేశ్వరోపాసనను బోధించ టానికి కారణం ఆయన ఒకటికిమించి లెక్కించలేకపోవటమన్నారు మధ్వుని శిష్యులు. అద్వైతాన్ని అనుసరించినట్లయితే, ఒకవేళ నీవు భగవంతునివైన పక్షంలో, లేదా నీ భగవంతుడు నిర్గుణుడైనట్లయితే, అప్పుడు దైవారాధన చేయలేవు. అద్వైతులు ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు సగుణోపాసన చేయసాగారు. భగవంతుడు సగుణాలు "ఉన్నవానివలె" కన్పిస్తాడు. అయితే భగవంతుడు, నీవు వేర్వేరు అయి, ఆ భగవంతుడు సగుణాలు

"కలవాడైనట్లు" కన్పించి, అటువంటి భగవంతుడిని ఆరాధించినట్లయితే అప్పుడు సమస్య లేదంటాడు మధ్వుడు.

శంకరుని జీవిత చరిత్రలు భక్తి భావనలు వేగంగా వ్యాపిస్తూ, మరొకవైపు కేరళలో క్రైస్తవులు, ఇతరత్రా బౌద్ధులు, ముస్లిములు బలపడుతుండిన దశలో వెలువడుతాయి. లోగడ బౌద్ధానికి సమాధానంగా భగవంతుడు అవతారాలు దాల్చినట్లు ఇప్పుడు మహమ్మద్‌కు, జీసస్‌కు శంకరుడు జవాబన్నమాట.

బ్రాహ్మణ కులంలో జన్మించిన శంకరుడు బోధనలు చేయటమే గాక, ఇతర తత్త్వ వేత్తలు పలువురితో సంవాదాలు కూడా జరిపాడు. దేశవ్యాప్తంగా సంచరించిన తను బౌద్ధులతో తీవ్రమైన వాదనలు చేయటంతోపాటు, వారి ఆరామాలను ఆదరించరాదంటూ రాజులకు, ఇతర ప్రముఖులకు నచ్చజెప్పినట్లు ఆయన జీవిత చరిత్రలు తెలుపుతున్నాయి. ఒక గ్రంథమైతే శంకరుడు శివుని అవతారమని, విష్ణుదేవుని బుద్ధావతారాన్ని ఎదుర్కొనేందుకు భూమిపైకి వచ్చాడని పేర్కొన్నది. కథనం ఈ విధంగా ఉంది :

### శంకరుని శివుడు, బుద్ధునిగా విష్ణువు

దేవతలు శివుని వద్దకు వెళ్ళి, విష్ణువు తమ కోసమే బుద్ధుని శరీరంలో ప్రవేశించాడని, కాని ఇప్పుడు మత విద్వేషకులు బ్రాహ్మణులను, ధర్మాన్ని, జీవితాశ్రమ ధర్మాలను వ్యతిరేకిస్తూ భూమిపై నిండిపోయారని ఫిర్యాదుచేస్తారు. ఒక్క వ్యక్తి కూడా క్రతువులను ఆచరించటంలేదని, అందరూ బౌద్ధులు, కాపాలికులుగా మారారని, అందువల్ల తమకు నైవేద్యాలు లభించటంలేదని అంటారు. అప్పుడు శివుడు శంకరునిగా అవతారమెత్తి వైదిక ధర్మ పునరుద్ధరణకు అంగీకరిస్తాడు. అందువల్ల దుర్వర్తనలు అంతమై లోకం సుఖసంతోషాలతో నిండుతుందంటారు.

ఈ దశనుంచి ప్రచారంలోకి వచ్చిన కథలు, శంకరునికి హిందూయేతరులతోనే గాక మీమాంసకారులతో, ఇతర వేదాంత తత్త్వవేత్తలతో కూడా ఘర్షణ ఏర్పడినట్లు చెప్తాయి. ఇరువురి మధ్య భిన్నాభిప్రాయాలు ఏర్పడిన అంశాలలో కోర్కెలకు, శృంగార జీవితాన్ని పరిత్యజించటం కూడా ఉన్నాయి. ఈ కథను గమనించండి.

### శంకరుడు, తత్త్వవేత్త పత్ని

మండనమిశ్రుడనే మీమాంసజ్ఞుని భార్య అయిన భారతి, కామశాస్త్రంపై తనతో చర్చించవలసిందిగా శంకరుడిని సవాలు చేస్తుంది. శంకరుడు బ్రహ్మచారి, సన్యాసి అయి నందున తనకు ఆ విషయాలేవీ తెలియవు. ఆమె మైథునం గురించి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వలేకపోయిన శంకరుడు తనకు కొంత వ్యవధి కావాలని కోరుతాడు. అప్పుడు పెద్ద సంఖ్యలో అంతఃపుర స్త్రీలుగల ఒక రాజు శరీరాన్ని

(మనస్సును కాదు) ఆవహిస్తాడు. అది ఆ రాజుకు, దైహిక సంతృప్తిలేని అంతఃపుర స్త్రీలకు కూడా ఊరట నిస్తుంది. అక్కడ ఒక నెల రోజులు గడిపిన శంకరుడు తిరిగి తన తాత్త్విక శరీరంలో ప్రవేశించి వాదనలో నెగ్గుతాడు. అప్పుడు భారతి, ఆమె భర్త కూడా అద్వైతులుగా మారుతారు.

**మరొక కథను చూడండి :**

శంకరుడు ఎనిమిదేళ్ళ బాలునిగా ఉన్నప్పుడు, సన్యాసిని కాగలనని ప్రతిన చేస్తాడు. అందుకు విస్మయం చెందిన తన తల్లి, శంకరుడు సన్యసించేందుకు తన అనుమతిని వాయిదా వేస్తుంటుంది. ఒకరోజు ఆ బాలుడు నదిలో స్నానం చేస్తుండగా ఒక మొసలి తన కాలును పట్టుకుంటుంది. తన కేకలు విని తల్లి వస్తుంది. ఇక మరణం అనివార్యం కావటం, మోక్ష సాధనకు అది చివరి అవకాశం అవటంవల్ల అందుకోసం శంకరుడు అప్పటికప్పుడు సన్యసించవలసి ఉంటుంది. అందుకు శంకరుని తల్లి సమ్మతించటంతో మొసలి ఆయన కాలును వదలుతుంది. శంకరుడు సన్యసిస్తాడు. అయితే తల్లి అవసాన దశలో ఆమె వెంట ఉండి అంత్యక్రియలు కూడా జరుపుతానని మాట ఇస్తాడు. అదే ప్రకారం చేస్తాడు.

రాజీ పడటం ఏ విధంగా అవసరమో ఈ కథ సూచిస్తుంది. ఇది అటు కుటుంబ సంతృప్తి, ఇటు సన్యాసాభిలాష మధ్య రాజీ.

**రామానుజుడు, మధ్వుల కథలు**

ఇదే విధమైన కథలు రామానుజుని గురించి కూడా ఉన్నాయి. తను శంకరుని శిష్యులతో కాదు గాని, ఇతర శైవులతో వాదనలు సాగిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒక గొప్ప దేవాలయంలో తను శైవులను సవాలు చేస్తాడు. తను గెలిచేది చర్చలో కాదు. చర్చ సందర్భంగా విష్ణువు అక్కడ నేలపైగల వైష్ణవ చిహ్నాలు తీసుకుని ధరించగా, శైవ చిహ్నాలు ఆ విధంగానే నేలపై ఉండిపోతాయి. విష్ణువువలె శివుడు ఆ పనిచేయలేదన్న మాట.

మరొక సందర్భంలో, శైవుడైన చోళరాజు, శివుడు మినహా మరొక దేవుడే లేడంటూ రామానుజుని చేత ప్రకటింపచేసేందుకు ప్రయత్నిస్తాడు. రామానుజుడు తన వేషంలో ఒక శిష్యుడిని, ఆయన వెంట మరొకరిని పంపుతాడు. వారిలో ఒకరు 'శివ' అనే పదాన్ని ద్వంద్వార్థంలో ఉపయోగించగా రాజు వారిద్దరు కళ్ళను పెరికివేయిస్తాడు. అక్కడి నుంచి మైసూరుకు తప్పించుకుపోయిన రామానుజుడు అక్కడి హోయసల రాజును జైనం నుంచి శ్రీ వైష్ణవానికి మార్చినట్లు చెప్తారు. తర్వాత, జైన ఆలయాలకు చెందిన పలు భూములను విష్ణాలయాలకు బదిలీ చేసేందుకు ఒప్పిస్తాడు.

రామానుజుడు ముస్లిములకు వ్యతిరేకంగా చర్యలు తీసుకున్నట్లు కూడా కథలున్నాయి. రంగనాథుని విగ్రహాన్ని ముస్లిములు తరలించుకుపోగా, దానిని తిరిగి

సంపాదించేందుకు ఆయన ఢిల్లీ వెళతాడు. అక్కడ ఆ విగ్రహం తనను చూసి "ప్రియ కుమారా!" అని కేకవేసి తన చేతులలోకి దుముకుతుంది. రామానుజుడు వాదనలో వేయి మంది జైన సన్యాసులను ఓడించాడని, వారు శ్రీవైష్ణవంలోకి మారే బదులు ఆత్మ హత్య చేసుకున్నారని మరొక కథ ఉంది. అంధులు కావటం, వీర మరణం, అద్భుత శక్తులతో కూడిన వాదనలు, వేల సంఖ్యలో జైనుల మరణాల వంటి కథలు అనేకం దక్షిణ భారతంలో శైవ యోగుల గురించి ఉన్నాయి. రామానుజుని గురించిన ఈ కల్పిత గాథలు కూడా అటువంటివే. కాని ఇవేవీ చరిత్రలలో కన్పించవు. ఆ కాలపు రాజులలో శైవాన్ని, వైష్ణవాన్ని, జైనాన్ని, బౌద్ధాన్ని ఆదరించినవారున్నారు. కొందరు అన్నింటినీ ఆదరించారు. కాని వారిలో ఎవరూ మూఢభక్తులు కారు. హోయసల రాజు మొదట జైనుడని, తర్వాత వారిపట్ల ఆదరణను మానుకున్నాడని చెప్పేందుకు ఏ ఆధారాలు లేవు. అయినప్పటికీ ఈ కథలన్నీ వందల ఏళ్ళుగా సజీవంగానే ఉన్నాయి.

శంకరుని అనుయాయులు తరచు మధ్వుని శిష్యులతో వాదనలకు తలపడ్డారు. మధ్వుడు అనేక అద్భుత చర్యలను ప్రదర్శించాడంటారు. అటువంటివి కొన్ని న్యూ టెస్ట్ మెంట్‌లో క్రీస్తుకు ఆపాదించటం విశేషం. నీటిపై నడక, కొద్దిపాటి రొట్టెముక్కలను అనేకులకు ఆహ్వానంగా ఇవ్వటం, ఎగసిపడుతున్న అలలను శాంతింపచేయటం అటువంటివే. క్రైస్తవులు కనీసం ఆరవ శతాబ్ది నుంచి కేరళలో, మధ్వుని జన్మస్థానమైన కళ్యాణ్ (కర్ణాటక)లో నివసిస్తున్నారు. శైవులతో మధ్వుని వాదనలలో క్రైస్తవంగాక బౌద్ధమత ప్రస్తావనలు వచ్చినట్లు అధికారిక కథనాలు చెప్తున్నాయి.

## మధ్వుడు, శంకరుడు

> కలియుగారంభంలో భూమి యావత్తు బౌద్ధమత ప్రాబల్యంలో ఉండేది. అప్పుడు మణిమత్ అనే రాక్షసుడు సంకరుడనే పేరుతో ఒక విధవకు జన్మిస్తాడు. అతడు తనకు ఆతిథ్యమిచ్చిన బ్రాహ్మణుని భార్యను లోబరచుకుంటాడు. తన మాయాశక్తులతో పలువురిని శైవానికి మార్చుతాడు. శంకరుని ఆశీస్సులతో శాస్త్రాలను అభ్యసిస్తాడు. బడుగు జీవులు తనను ఆహ్వానిస్తారు. అసురులు ఆయనను తమ సంరక్షకుడంటారు. వారి సలహాపై ఆయన బౌద్ధులతో చేరి, వేదాంతం పేరిట బౌద్ధాన్ని బోధిస్తాడు అనేక దుష్కార్యాలు కూడా చేస్తాడు. తన సిద్ధాంతాలు లోకాయతులను, జైనులను, పశుపతులను పోలి అంతకన్న హీనంగా, హానికరంగా ఉంటాయి. తన అనుయాయులు క్రూరులై ఆశ్రమాలను ధ్వంసంచేసి, స్త్రీలను, పిల్లలను సంహరిస్తారు. వైదీకులు కానివారిని కొరడాలతో కొట్టించి ఇతరులను బలవంతంగా తన మార్గంలోకి మార్చుకుంటాడు. తన మరణానంతరం వాయు దేవుడు మణిమత్ – సంకరుని బోధనలను తిరస్కరించేందుకు మధ్వునిగా అవతరిస్తారు.

తనకు ఆతిథ్యమిచ్చిన బ్రాహ్మణుని భార్యను శంకరుడు లోబరచుకున్నాడనే నింద, మీమాంసజ్ఞుని భార్య తనను శృంగార విషయాలపై వాదనకు సవాలు చేసిందనే కథను దృష్టిలో ఉంచుకుని రాసింది కావచ్చు. అదే విధంగా శంకరుని వేదాంతంలో బౌద్ధ లక్షణాలు ఉన్నాయన్నారు గనుక, ఈ కథలలో తను బౌద్ధాన్ని బోధిస్తాడు. శంకరుడు శివుని అవతారం కాకుండా మణిమత్ అనే రాక్షసుని అవతరమవుతాడు. మధ్వుడు వాయువు అవతారమనే కొత్త అంశం కన్పిస్తుంది. అసురులను భ్రష్టులుగా చేసేందుకు దేవతలు స్వయంగా రావటానికి బదులు ఇటువంటి కథలలో సంకరుని వంటి బోధకులే అసురులవుతారు. ఈ పరస్పర విరోధాలు చివరకు 'శంకరు'ని పేరును 'సంకరు'డని మార్చటంలో కూడా ప్రతిఫలిస్తాయి. ఇవన్నీ కలియుగపు కథలు. కలియుగంలో వేర్వేరు వర్ణాల మధ్యగల అవరోధాలు చెదిరి పోతుంటాయి. అట్లా చెదరటం కలియుగం రాకకు ఒక ప్రధానమైన గుర్తు. సంకరుడు ఒక విధవరాలికి జారత్వం వల్ల కలిగిన పుత్రుడు కావటం కూడా గమనించదగ్గది.

## వేదాంతంలో ఏకేశ్వరోపాసన, శాఖాంతరీకరణ

కులవ్యవస్థ, అందులోని అంతరాలు మితిమీరటంతో అందుకు స్పందనగా వేదాంతులు అటువంటి అంతరాలకు అవకాశముండని తాత్త్విక మార్గాన్ని కనుగొన్నారు. లేదా అటువంటి సూచనలు ఉపనిషత్తులలోనే ఉండేవి గనుక వాటిని పునరుద్ధరించి తగు విధంగా సవరించారనవచ్చు. ఆ కొత్త దృక్పథంలో, సకల జీవరాశులు ఒకే ఒక విశ్వజనీనమైన అంశం నుంచి ఉద్భవించాయి. అది ఏకేశ్వరోపాసన అయింది. అప్పటి వరకు వేదాంత తత్త్వవేత్తలు అంతరాల వ్యవస్థలను సృష్టించుకున్నారు. ఉదాహరణకు శంకరుడు శూద్రులను వెలివేయటం, ఇతరులపట్ల తరచు అసహనాన్ని ప్రదర్శించటాన్ని మనం చూశాము.

ఈ నేపథ్యంలో ఏకేశ్వరోపాసక తత్త్వవేత్తలు ఒకే ఒక సత్యం ఉందన్నారు. కాని అది వారికే తెలుసు. ఆ వాదనను ఆధారం చేసుకుంటూ వారు ఇతరులను తమ వాదం వైపు తిప్పుకోసాగారు. మామూలుగానైతే హిందూమతం, సత్యమార్గం అన్ని మతాల వారికి అందుబాటులో ఉంటుందని భావిస్తుంది. అటువంటప్పుడు ఇతరులను హిందూమతంలోకి మార్చవలసిన అవసరంలేదు. కాని అట్లా జరగలేదు. సనాతన దృష్టిగల హిందువులు మత మార్పిడులకు పాల్పడలేదు. హిందువులుగా జన్మించినవారే హిందువులవుతారన్నది వారి విశ్వాసం. కాని కొందరు హిందూ తాత్త్వికులు తమదే సరైన మార్గమని వాదించి ఇతరులను మార్చేందుకు ప్రయత్నించారు. అది స్వయంగా హిందూమతంలోని శాఖల విషయంలోనే జరిగింది గనుక బయటి మతాలకు సంబంధించి కూడా అదే పని చేశారు. యథాతథంగా మతాంతరీకరణం లేదా శాఖాంతరీకరణ అన్నదే అసహనం కానక్కరలేదు. కాని అందువల్ల బహు తాత్త్వికత అనే స్థితికి ద్వారాలు మూసివేయటం అవుతుంది.

## తాత్త్విక జంతువులు

దక్షిణ భారత తత్త్వవేత్తల మధ్య తలెత్తిన వివాదాల ప్రభావం దేశమంతటా, ముఖ్యంగా కశ్మీర్‌లో కన్పించింది. అది దక్షిణానికి చెందిన రెండు శాఖలతో, అవి జంతువులను ఉపమానంగా చేసుకుని మాట్లాడటంతో ఆరంభమైంది.

జంతువుల ప్రసక్తి ఎక్కువగా కన్పించేది శైవంలో. శైవ సిద్ధాంతం తన మూలాలు క్రీ.శ. 5–9 శతాబ్దాల కాలానికి చెందిన శైవ నయన్మార్లు రచించిన భక్తి గీతాలలో ఉన్నట్లు గుర్తిస్తుంది. ఆ సంప్రదాయం కశ్మీర్ వరకు వ్యాపించి, 9వ శతాబ్దంనాటి కశ్మీర్ శైవంలో ఒక ముఖ్యాంశంగా మారుతుంది. కశ్మీర్‌కు చెందిన తిరుములర్ అనే మార్మిక యోగి, సంస్కర్త దక్షిణ భారతదేశానికి వెళ్ళి శైవ సిద్ధాంత మార్గాన్ని స్థాపించాడని, తర్వాతి కాలంలో భోజదేవ, అఘోరశివ, మెయికండదేవర వంటివారు నయన్మార్లు సిద్ధాంతాలకు నిర్దిష్ట రూపాన్ని కల్పించారని చెప్తారు. కశ్మీర్‌లో శైవ సిద్ధాంతం అక్కడి తాంత్రికతలోని కొన్ని అంశాలను స్వీకరించి దానిని ఇంటింటి మతంగా మార్చింది. ఈ పరివర్తన దక్షిణాన వేగంగా సాగింది. రాజాదరణ అందుకు తోడ్పడింది. శైవులు వేదాలపట్ల శ్రద్ధ చూపలేదు. కులాన్ని తిరస్కరించారు. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, మతిస్థిమితం లేనివారు, వికలాంగులకు మినహా శైవంలో అందరికీ ప్రవేశం ఉంది. వారు సన్యాసాన్ని కూడా నిరాకరించారు. వీర శైవులవలెనే వారు కూడా దేహమే నిజమైన శివాలయమన్నారు. ఇతర భక్తి ఉద్యమాలవలె ఈ సంప్రదాయం కూడా ఉత్తరాదికి వ్యాపించి, కశ్మీర్ శైవాన్ని మరింత శక్తివంతం చేసింది.

శంకరుడు, కశ్మీర్ శైవం బోధించిన అద్వైతాన్ని, ఆదర్శవాదాన్ని శైవ సిద్ధాంతం తోసిపుచ్చింది. భగవంతుడు, ఆత్మ ఒకటేనని, ప్రపంచం ఒక మాయ అని శంకరుడు ప్రతిపాదించాడు. అందుకు భిన్నంగా దైవ సిద్ధాంతం వాస్తవిక దృష్టిని తీసుకుంటుంది. ద్వైతాన్ని ఆమోదిస్తుంది. ప్రభువు (పతి), ఆత్మ ఒకటి కాదని, కాని ఆ ప్రభువుకు ఆత్మ (పశువు)తో సంబంధం (పాశం) ఉందని చెప్తుంది. శునకాన్ని ఒక తాడు తన యజమానితో కలిపి ఉంచినట్లు, ఆత్మకు ప్రభువుతో బంధం ఏర్పడుతుందని వివరిస్తుంది. ఆ బంధ మన్నది శివుని ఇచ్ఛ, మాయాశక్తి. మేధోపరమైన, భౌతికమైన అంశలన్నీ ఆ మాయలో ఉంటాయి. కేవల ఆదర్శవాదంతో పోల్చితే ఈ అంశలు వాస్తవమైనవి. ఎందుకంటే వాటిలో దైవత్వముంటుంది. తాంత్రిక విధానంలోవలె శైవ సిద్ధాంతంలోనూ శివుడు కొందరిని అసమ్మతి వర్గీయులుగా మార్చుతాడు. వారు జంతువులవుతారు. వారిని ఆయన ఆ స్థితి నుంచి ఉద్ధరిస్తాడు.

శైవ సిద్ధాంతంలోని ప్రధానమైన ఉపమానం హిందూమతంలో చాలా గుర్తింపు పొందింది. దానితో తర్వాత కాలంలో ఆ ఉపమానాన్ని ఇతర అర్థాలలో కూడా ఉపయో గించారు. ఉదాహరణకు వలలో చిక్కిన బలి పశువును రక్షించటం వంటిది. హింసపట్ల వ్యతిరేకత పెరుగుతుండినా బలులు అప్పటికి ఇంకా కొనసాగుతున్నాయి.

## శ్రీవైష్ణవ మర్కటాలు, మార్జాలాలు

శ్రీవైష్ణవం కూడా శైవంవలెనే జంతువుల ప్రస్తావనలు చేసింది. బాలక్రిష్ణుని పట్ల భక్తి భావం పెరుగుతుండిన దశలో క్రీ.శ. 900–1300 ప్రాంతంలో వైష్ణవ తాత్త్వికులు దీనిని సిద్ధాంతీకరించారు. 14వ శతాబ్ద కాలపు తమిళ దేశంలో వీరు దక్షిణ ప్రాంతంలో మార్జాలశాఖ (తమిళంలో తెంకలై), ఉత్తర ప్రాంతంలో మర్కటశాఖ (వడకలై)గా ఏర్పడ్డారు. సిద్ధాంతాలపై భిన్నాభిప్రాయాల కారణంగా చీలిపోయిన ఈ రెండు శాఖల మధ్య ఆలయాలపై నియంత్రణ కోసం పోటీలు ఏర్పడ్డాయి. దానిపై రాజు జోక్యం చేసుకుని తీర్పు చెప్పవలసి వచ్చింది. విజయనగర రాజ్యానికి చెందిన ఇద్దరు రాజప్రతినిధులు మార్జాల శాఖను ఏర్పాటు చేయగా, మరొక రాజు వద్ద ఉండిన పూజారి మర్కట శాఖను స్థాపించి తిరుపతిలో దేవాలయాన్ని నిర్మించాడు.

మర్కట శాఖలో భక్తులు, కోతిపిల్ల తన తల్లిని కరుచుకుని ఉండగా తల్లి కోతి చెట్టునంతా తిరుగుతూ పిల్లను భద్రంగా తీసుకుపోయినట్లు, భగవంతుడు కూడా తన భక్తులను కాపాడతాడు. భక్తులు పూర్తిగా భగవంతుని అంటిపెట్టుకుని తనపై ఆధారపడ తారు. ఇందుకు భిన్నంగా మార్జాలశాఖలో భక్తులు భగవంతుడిని అంతగా అంటిపెట్టుకోవడ మంటూ ఉండదు. వారిని ఆయనే కరుణించి కాపాడతాడు. పిల్లి తన పిల్లలను నోట కరచుకుని ఒకచోటి నుంచి మరొక చోటికి తీసుకుపోయే పద్ధతిలోనన్నమాట. అప్పుడు పిల్లి పిల్లలు తమంతట తాము ఏమీ చేయకూడదు. చేసినట్లయితే తల్లి కదలికలకు ఆటంకమవుతుంది. మర్కట శాఖకు చెందిన వారు తాము ద్విజులమని, మార్జాల శాఖ వారు నిమ్న తరగతులవారని అన్నారు. సంప్రదాయికమైన భక్తి మార్గంలో తాము మోక్షాన్ని సాధించగా, దేవాలయాలలో ప్రవేశంలేని రెండవ తరగతివారు భగవంతునికి తమను తాము అర్పించుకోవటం ద్వారా మాత్రమే మోక్షాన్ని పొందగలరు.

## సర్పము, రజ్జువు

తాత్త్విక శాస్త్రాలలో మరొక ముఖ్యమైన ప్రాణి సర్పం. అది వాస్తవానికి తాడు అయినా సర్పమనే భ్రాంతి కలుగుతుంది. వేదాంతులు ప్రపంచం ఒక భ్రాంతి అంటారు గాని, దాని అర్థం గొడ్రాలి కుమారుని తరహాలో పూర్తి భ్రాంతి కాదు. (గొడ్రాలి కుమారుడనే ఉదాహరణ వేదాంత చర్చలలో తరచు వస్తుంటుంది). తాడు రూపంలో ఒక వాస్తవం ఉంటుంది. కాని దృష్టిలోపం, లేదా దృక్పథంలోపం వల్ల అది సర్పంవలె తోస్తుంది. దానిని రజ్జు సర్ప భ్రాంతి అన్నారు.

వేదాంతంలోని ఇతర అంశాలను సాధారణంగా పండితులు చర్చిస్తారు. కాని మాయ, భ్రాంతి అన్న దృక్పథం హిందూ సంస్కృతిలో భాగమైంది. ఆ విషయం అందరూ మాట్లాడతారు. మాయ అన్నది రుగ్వేదంతోనే ఆరంభమైంది. అందులో ఇంద్రుడు ఒక

మహా మాంత్రికుడు. కనుక ఇంద్రజాలమనే మాటవచ్చింది. అసురులంతా మాంత్రికులే. ఇంద్రుడు తన ఇంద్రజాలశక్తిని వృత్రుడనే అసురునిపై ప్రయోగిస్తాడు.

హిందూ పురాణాలలో నేత్రాలకు, దర్శనానికి కూడా కీలకమైన స్థానం ఉంది. భక్తుడు నేత్రాలతో భగవంతుడిని సందర్శించుకోవటమే గాక, భగవంతుడు తనను చూస్తున్నట్లు తెలుసుకోవాలి. దాని నుంచి అవాస్తవాన్ని వాస్తవంగా భావించటమనేది వచ్చింది. భగవంతుడు భక్తుడిని నిజంగా ఏమీ చూడడు. కాని చూస్తున్నట్లు భక్తుడు భావించాలి. అందులో అద్వైతముంది. ఆ భ్రాంతిని సృష్టించేది భగవంతుడే. పైగా అద్వైతులు భగవంతునికి ఒక రూపంలేదని, తను నిర్గుణుడని అన్నారు. అటువంటి స్థితిలో భ్రాంతి అవసరమవుతుంది.

ఉపనిషత్తులు చేతనావస్థలో నాలుగు దశలున్నట్లు చెప్తాయి. అవి మేల్కొని ఉండటం, కలలు కనటం, కలలు లేని నిద్ర, నాల్గవది బ్రహ్మతో ఐక్యమయే అతీతస్థితి. మనిషి మేల్కొని ఉండటం బ్రహ్మ నుంచి పూర్తి దూరంగా ఉంచుతుంది. కలలతో కూడిన నిద్రావస్థ కొంత మెరుగు. కలలు లేనిది మరింత మెరుగైనది. పూర్తి చైతన్యం పొందాలంటే, మేల్కొని ఉండే దశ భ్రమపూరితమైనదని గుర్తించాలి. నాల్గవ దశవైపు ప్రయాణాన్ని ఆరంభించాలి. సర్పంగా తోచే దానిని జాగ్రత్తగా గనించినట్లయితే అది తాడని తెలుస్తుంది. అదే పద్ధతిలో భౌతిక ప్రపంచం మాయ మాత్రమే తప్ప వాస్తవం (బ్రహ్మం) కాదని, పునః పరిశీలనా క్రమంలో మనకు అర్థమవుతుంది. సర్పమన్నది తాడే తప్ప సర్పంకాదని ఒకసారి అర్థమైన తర్వాత అసలు తాడు కూడా లేదని బోధపడుతుంది.

## యోగ - వాశిష్టంలో కుల, లింగ భ్రాంతులు

మాయా సిద్ధాంతాన్ని 11-12 శతాబ్దాల కాలపు కశ్మీర్‌లో ఎంతో సృజనాత్మకమైన, ఊహాత్మకమైన అద్భుతంగా అభివృద్ధిపరచారు. ఆ ప్రయత్నంలో దక్షిణ భారతదేశపు ప్రభావం కూడా ఉంది. భక్తి, తాంత్రికత, శైవ సిద్ధాంతాల విషయంలో రెండు ప్రాంతాల మధ్య ఆదాన ప్రదానాల గురించి మనం చెప్పుకున్నాము. మాయా సిద్ధాంతంలో అత్యున్నత మైన ఆదర్శ స్థితిని అభివృద్ధిపరచినవాడు నాగార్జునుడనే బౌద్ధ తాత్వికుడు. తను దక్షిణ దేశంలో బ్రాహ్మణునిగా జన్మించి, బౌద్ధునిగా మారి, కశ్మీరానికి వెళ్ళినట్లు చెప్తారు. అక్కడ తన తాత్త్విక బోధన అయిన మాయావాదం కుషాణుల పాలన కాలంలో బాగా వర్ధిల్లింది. అక్కడ బౌద్ధం దాడికి గురికాగా తను దక్షిణ దేశానికి తిరిగి వచ్చాడు.

కశ్మీర్‌లోని శైవ తాత్త్వికులు బౌద్ధంతో సహా అన్ని సిద్ధాంతాలను శంకరుని ఏకేశ్వర వాదంతో మిళితంచేసి కశ్మీర్ శైవం పేరిట కొత్త తత్వాన్ని రూపొందించుకున్నారు. దానిని ప్రతిజ్ఞావాదమని కూడా అన్నారు. ఇందులో అభినవ గుప్తుడు (975-1025) ప్రముఖుడు. దక్షిణ హస్త తాంత్రిక సంప్రదాయాన్ని అభివృద్ధిపరచటంలో తనది ప్రధాన పాత్ర.

ముస్లిముల ప్రాబల్యం పెరిగి వారు శత్రు వైఖరి తీసుకోవటంతో కశ్మీర్ శైవం 12వ శతాబ్ది చివరికి అంతమైపోయింది. ద్వైతాన్ని వెంట తీసుకుని అక్కడి నుంచి దక్షిణావనికి వెళ్ళింది. కాని, విదేశీయుల ఉనికి కారణంగా కశ్మీర్‌లో అదే కాలంలో ఇతర సంప్రదాయాలు రూపు తీసుకున్నాయి. ముస్లిం తత్త్వవేత్త ఇబ్న్ అరబీ (1165–1240) భగవంతుని సృష్టిలో భాగం కానిదంతా మాయ అని చేసిన వాదన ప్రభావం హిందూ తాత్త్వికతపై కూడా ఉందంటారు. మరొకవైపు, స్త్రీ పురుష శృంగారం దైవ ప్రేమకు సంకేతమనే మొఘల్ కాలపు సూఫీ సూత్రీకరణలకు స్ఫూర్తి, కశ్మీరీ తాంత్రిక సంప్రదాయాలని భావించవచ్చు.

కశ్మీర్ భౌగోళికంగా మధ్య ఆసియాకు, టర్కీ, అరేబియా ప్రాంతాలకు సమీపంలో ఉంది. మధ్య ఆసియాలో బలంగా ఉండిన బౌద్ధం అక్కడ భిన్నమైన మాయా సిద్ధాంతాన్ని రూపొందించుకుంది. టర్కీ, అరబిక్ ప్రాంతాలలో కథా కథన సంప్రదాయాలు ప్రాచీన భారతదేశంలో పోటీపడగల విధంగా ఉన్నాయి. కశ్మీర్‌లో అప్పటికే బౌద్ధ, హిందూ మతాల మిశ్రమంగా ఉండిన తాత్త్వికత, హిందూ – ఇస్లాం కథల రీతులను పుణికి పుచ్చుకుంది. భావనల కళాత్మకమైన పరిణామ గతుల గురించి అభినవ గుప్తుడు చేసిన రచనలు అందుకు తోడయ్యాయి. అటువంటి నేపథ్యంలో కథాసరిత్సాగరం, యోగ వాశిష్ఠ మహా రామాయణం వంటి గొప్ప గ్రంథాలు వెలువడ్డాయి. కథాసరిత్సాగరం ప్రభావం అరేబియన్ నైట్స్ కథలపై ఉండగా, యోగ వాశిష్ఠాన్ని అక్బర్ చక్రవర్తి సంస్కృతం నుంచి పర్షియన్‌లోకి అనువదింపజేశాడు.

## లింగ సంబంధమైన మాయ

యోగ – వాశిష్ఠంలోని ఒక కథలో ఒక రోజు సన్యాసాశ్రమం నుంచి తిరిగివచ్చి తన రాజ్యాన్ని పాలించగోరుతాడు. తిరిగివచ్చే దారిలో తనకు శృంగారం, లింగభేదాలు మాయగా తోస్తాయి. ఆ కథ ఇది :

## చూదల రాణి కథ

> చూదల రాణి, ఆమె భర్త అయిన రాజు శిఖిధ్వజుడు పరస్పరం గాఢమైన ప్రేమలో ఉంటారు. రాణికి జ్ఞానోదయం కలిగి మాయా విద్యలు లభిస్తాయి. ఆమె గాలిలో ఎగర గలుగుతుంది కూడా. కాని ఆ విషయం భర్త నుంచి దాచిపెట్టి, ఆయనకు ఆ విద్యలు నేర్పజూస్తుంది. రాజు ఆ మాటను కొట్టివేసి భార్య అవివేకి అని భావిస్తాడు. తర్వాత తానే జ్ఞానాన్ని సంపాదించగోరి, తపస్సు చేసేందుకు అడవులకు పోతాడు. సింహాసనాన్ని పరిత్యజించి, భార్యను పాలించవలసిందిగా కోరుతాడు. తన వెంట అడవులకు వచ్చేందుకు ఆమెను అనుమతించడు.

పద్దెనిమిది సంవత్సరాల తర్వాత రాణి తన భర్తను చూడగోరుతుంది. కుంభ్ అనే బ్రాహ్మణ యువకుని రూపాన్ని దాల్చి వెళ్ళగా రాజు ఆమెను ఆహ్వానిస్తాడు. తనను గుర్తించడు గాని యువకుడు తన రాణి చూదలను పోలి ఉన్నదంటాడు. ఆ యువకునిపై అభిమానం కలిగి ఉపదేశాల ద్వారా జ్ఞానవంతుడిని చేస్తాడు. తన సౌందర్యవంతుడైన భర్తపట్ల చూదలకు ఆకర్షణ కలుగుతుంది. అప్పుడు కుంభ్ రూపంలో గల తాను కొంతసేపు దూరంగా వెళ్ళి, స్త్రీ రూపంలో తిరిగి వస్తుంది. ప్రతి రాత్రి వక్షోజాలు, దీర్ఘకేశాలతో తను స్త్రీగా మారాలంటూ ఒక ముని తనను శపించినట్లు చెప్తుంది. ఆ రాత్రి రాజు కళ్ళ ఎదుటనే, కుంభ్ రూపంలోగల రాణి స్త్రీగా మారి మదనిక అవుతుంది. వణికే స్వరంతో "నేను సోలిపోతున్నట్లు, వణికిపోతున్నట్లు, కరిగిపోతున్నట్లు తోస్తున్నది. నేను స్త్రీగా మారటం సిగ్గు కల్గిస్తున్నది. నా వక్షస్థలంపై ఉరోజాలు ఉబికి వస్తున్నాయి. నా శరీరంలో నుంచే ఆభరణాలు మొలుచుకొస్తున్నాయి" అంటుంది. ఆ తర్వాత వారిద్దరు  వివాహమాడి ఆ రాత్రంగా శృంగారంలో మునిగి తేలుతారు.

పగలంతా స్నేహితులుగా, రాత్రి దంపతులుగా జీవించనారంభిస్తారు. కొద్ది కాలం తర్వాత మదనిక తిగిరి చూదలగా మారి, విషయమంతా రాజుకు తెలియజేస్తుంది. అప్పుడు రాజు ఆమెను పరవశంతో ఆలింగనం చేసుకుని, "నీ వంటి అద్భుతమైన అర్ధాంగి మును పెన్నడూ ఈ లోకంలో లే"దంటాడు. ఆమెతో ఆ రాత్రంతా గడిపి, తిరిగి రాజ్యమేలేందుకు పోతాడు. పదివేల సంవత్సరాలపాటు పాలించి మోక్షం పొందుతాడు.

చూదల తన భర్తకు ప్రియురాలు కావటమే గాక తనకు అసాధారణ శక్తులను నేర్పే అధ్యాపకురాలు కూడా కాగోరుతుంది. కాని ఆమెకు ఈ రెండవ పాత్రనిచ్చేందుకు భర్త నిరాకరిస్తాడు. ఆమె రెండుసార్లు తన లింగభేదాన్ని మార్చుకుని తన లక్ష్యాన్ని సాధిస్తుంది. చూదలగా ఉండిన తను మెదట కుంభ్ అనే యువకునిగా, తర్వాత మదనిక అనే స్త్రీగా మారుతుంది. భారతదేశంలో స్త్రీ పురుష వ్యత్యాసాలు అధికమైన స్థితిలో చూదల ఆ విధంగా లింగమార్పిడి చేసుకోవటం ద్వారా ఆ నియంత్రణలను భంగపరచటం గమనించదగ్గది. కాని చివరకు తిరిగి అదే చట్రంలో ఒదిగిపోతుంది. ఆమెకు మంత్ర తంత్రాలు తెలుసు. యోగినివలె గాలిలో ఎగరగలదు కూడా. అయినా అదంతా మాయగా మిగులుతుంది.

## కులం మాయ

యోగ – వాశిష్ఠంలోని రెండు కథలు కులం గురించి చెప్తాయి. మొదటిది లవణ రాజు కథ కాగా, రెండవది ఒక బ్రాహ్మణునిది. అవి దీర్ఘమైనవి అయినందున క్లుప్తంగా చెప్తాను.

## తాను పారియా అయినట్లు కలగన్న లవణుడు

లవణుడనే రాజు ఒక రోజు ఒక అశ్వాన్ని గమనిస్తూ మూర్ఛపోతాడు. తిరిగి స్పృహవచ్చిన తర్వాత ఈ కథ చెప్తాడు. నేను ఆ గుర్రంపై ఎక్కినట్లు, అది నన్ను ఎక్కడో దూరంగా ఒక చండాలుర గ్రామానికి తీసుకు పోయినట్లు తోచింది. అక్కడ గుర్రం వేగంగా పరుగిడుతుండగా, కిందికివాలి ఉన్న ఒక చెట్టుకొమ్మ తగిలి పడిపోయాను. అక్కడ ఒక పారియా యువతిని పెళ్ళాడగా మాకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలిగారు. నేను అరవయ్యేళ్ళపాటు అక్కడే నివసించాను. నేను రాజుననే విషయం మరచిపోయాను. అంతలో అక్కడ తీవ్రమైన కాటకం సంభవించింది. నా పిల్లలు కనీసం నా మాంసాన్నయినా తిని బతకగలరన్న ఆలోచనతో మంటలోకి దూకబోయాను. సరిగా అప్పుడు ఈ సింహాసనంపై కళ్ళు తెరిచాను అంటాడు. అది విని సంస్థానంలోని వారు అమితాశ్చర్యానికి గురవుతారు. మరునాడు రాజు తన మంత్రులతోపాటు ఆ గ్రామాన్ని కనుగొనేందుకు బయలుదేరుతాడు. దానిని కనుగొంటాడు. అక్కడ ఒక వృద్ధురాలు, తమ గ్రామానికి ఒక రాజువచ్చి తన కుమార్తెను వివాహమాడాడని, తర్వాత కాటకం సంభవించి అందరూ చనిపోయారని చెప్తుంది. అది విన్న రాజు తన భవనానికి మరలిపోతాడు.

ఇందులో వాస్తవం ఏమిటో రాజుకు తెలుసు. కాని అందుకు తన ఆస్థానోద్యోగుల సమక్షంలో గ్రామంలోని వృద్ధురాలి నుంచి ధృవీకరణ పొందుతాడు. రాజభవనానికి తిరిగి వస్తాడు గాని, తన రెండవ జీవితం నిజమని కూడా ఆయనకు తెలుసు. తను పారియా కావటానికి సంబంధించి, తొలి ఉపనిషత్తులలో కలల గురించిన మాట ఒకటుంది. "తను కలగన్నప్పుడు ఒక గొప్ప రాజైనట్లు తోస్తుంది. అప్పుడొక గొప్ప బ్రాహ్మణుడవు తాడు. ఉచ్ఛస్థానాలకు వెళతాడు, అంతలోనే నిమ్నస్థానాలకు." నిమ్నస్థానాలన్నవి పారియాలకు కలిగే పీడకలలు. మహాభారత, రామాయణాలలో యుధిష్ఠిరుడు, నలుడు, రాముడు రాజులు కావటానికి ముందు సామాన్య ప్రజలలో భాగమై వారెట్లా జీవించేదీ తెలుసుకుంటారు. మార్కండేయ పురాణంలోని రాజా హరిశ్చంద్ర కథలో రాజ్య బహిష్కరణ గురించిన కల, వాస్తవంగా బహిష్కృతుడు కావటమనే రెండూ కలగలిసిపోతాయి. యోగ వాశిష్ఠం చెప్పేదానిని బట్టి లవణునికి హరిశ్చంద్రుడు తాత అవుతాడు.

## హరిశ్చంద్రుని కథ

రాజైన హరిశ్చంద్రుడు శాపానికి గురై చండాలులవుతాడు. భార్యను, కుమారుడిని కోల్పోతాడు. అనేక సంవత్సరాలపాటు చండాలునిగా ఉన్న తర్వాత తానొక పుల్కస స్త్రీకి జన్మించి పుల్కసుడైనట్లు కలగంటాడు. పుల్కస అన్నది మరొక పారియా

కులం. అట్లా పుల్కస కులస్థుడై ఏడేళ్ళ బాలునిగా ఉన్నప్పుడు, తనపట్ల ఆగ్రహించిన కొందరు బ్రాహ్మణులు, "జాగ్రత్తగా ప్రవర్తించు. హరిశ్చంద్రుడు కొందరు బ్రాహ్మణులకు ఆగ్రహం తెప్పించి పుల్కసుడు కమ్మనే శాపానికి గురయ్యా" దంటారు. అప్పుడు తనను నరకానికి పొమ్మని శపించగా ఒకరోజు అక్కడ గడిపి చిత్ర హింసలననుభవిస్తాడు. శునకంగా పునర్జన్మించి, శవాలను తింటూ, చలికి ఎండకు తట్టుకుంటూ జీవిస్తాడు. శునకంగా మరణించిన తర్వాత గాడిదలా తిరిగి జన్మిస్తాడు. ఇంకా తర్వాత ఏనుగు, కోతి, తాబేలు, అడవిపంది, ముళ్ళపంది, కోడి, చిలుక, కొంగ, పాము అవుతాడు. ఆ వెనుక రాజుగా జన్మించి, జూదంలో రాజ్యాన్ని కోల్పోతాడు. భార్యను, కొడుకును కూడా పోగొట్టుకుంటాడు. చివరగా మరొకమారు చండాలుడై స్మశానవాటికలో కాపరిగా పనిచేస్తూంటాడు. ఒకరోజు తన భార్య తమ మరణించిన కుమారుడిని దహనం కోసం తీసుకుని వస్తుంది. ఆ బాలుని చితిపైనే తాము సైతం మరణించాలని వారిద్దరు నిర్ణయించుకుంటారు. సరిగా ఆ సమయంలో ఇంద్రుడు, ధర్మదేవత ప్రత్యక్షమై ఆ బాలుడిని బతికిస్తారు. తర్వాత ముగ్గురినీ స్వర్గానికి తీసుకునిపోతారు.

లవణరాజు కథా ఛాయలు ఇందులో కనిపిస్తాయి. సందర్భం మాత్రం కశ్మీర్ శైవం కాదు. శాపం మూలంగా హరిశ్చంద్రునికి ఈ కష్టాలన్నీ ఎదురవుతాయి. తను నిజంగా పారియా అవుతాడు. రెండు కథలలోనూ కుమారుల మరణం, అగ్నిలో ప్రవేశించాలన్న ఆలోచన వారి జ్ఞానానికి దారితీస్తాయి. కాని అంతిమంగా జరిగేది స్వర్గానికి పోవటం తప్ప మోక్షం లభించటం కాదు. బ్రాహ్మణుల శాపం కారణంగా కులం అస్థిరతకు లోనవుతుంది. మాయా సిద్ధాంతం దానిని మరింత అస్థిరపరుస్తుంది. శాపమేగాక ఒక కల కూడా మిమ్మల్ని మార్చగలదు. గమనించదగినదేమంటే, కులం మనిషితో విడదీయ రానిదని ధర్మశాస్త్రాలు చెప్తుండగా, అది నిజంకాదని ఈ కథలు తేల్చుతున్నాయి.

అంతిమంగా హరిశ్చంద్రుడు, ఆయన కుటుంబం, లవణ రాజువలె వెనుకటి జీవితాన్ని పొందరు. ఆ కలలు, వాస్తవాలు, రాచరిక వైభోగాలు, పారియా జీవితపు కష్టాలు అన్నీ పోతాయి. ఈ విషయంలో వారు హిందువులుగాకన్న ఎక్కువ బౌద్ధులుగా కనిపిస్తారు. బౌద్ధంలోని వెస్సాంతర జాతక కథ నిజానికి ఇదే విధంగా ఉంటుంది. దాని ప్రభావం హరిశ్చంద్రుని కథపై ఉండవచ్చు కూడా. నిమ్నవర్గాల వారితో సంపర్కానికి సంబంధించి గౌతమ శాక్యముని జీవితం అన్నింటికన్న ప్రముఖంగా కనిపిస్తుంది. బుద్ధుడు కాకముందు తన రాజవైభోగాలన్నింటిని వదలి బాధలను ఎదుర్కొంటున్న ప్రజల మధ్యకు వెళ్ళిన ఆయన, తిరిగి తన వెనుకటి జీవితానికి పోడు. ఇది హిందూ కథలకు విరుద్ధమైనది. ఆ కథలలో రాజులు దాదాపు ప్రతి సందర్భంలోనూ చివరకు తిరిగి రాజులవుతారు, లేదా స్వర్గానికి వెళతారు.

బ్రాహ్మణులకు తాము మాట్లాడుతున్న చండాలుడే హరిశ్చంద్రుడని తెలియక తన కథనే తనకు చెప్తారు. కాని తనను చండాలునిగా కాక పులస్కునిగా మార్చుతారు. హరిశ్చంద్రుని కలలోనూ అదే జరుగుతుంది. పునర్ఘటనలు ఎప్పుడూ ఒకే విధంగా ఉండవు. ఒక ఉపకులపు పారియా తనను తాను మరొక ఉపకులపు పారియాగా భావించు కోవచ్చు కూడా. యోగ–వాశిష్ఠంలోని గాధి అనే బ్రాహ్మణుని కథను గమనించినప్పుడు ఈ వైవిధ్యతలు మరింత స్పష్టమవుతాయి. అదీ లవణుని కథ వంటిదే అవుతుంది, కాదు కూడా.

**గాధి కథ**

> గాధి అనే ఒక బ్రాహ్మణుడు ఒక రోజున నదిలో స్నానంచేస్తూ స్పృహ కోల్పోతాడు. తాను ఒక పుల్కస స్త్రీకి పుల్కసునిగా జన్మించినట్లు తనకు తాను కనుగొంటాడు. పుల్కసునిగా పెరిగి, వివాహమాడి, సంతానాన్ని పొంది, వృద్ధుడవుతాడు. తన కుటుంబ సభ్యులంతా మరణించగా అటు ఇటు సంచరిస్తూ కీరుల నగరానికి చేరుతాడు. అక్కడ రాజు మృతిచెందగా ప్రజలు తనను రాజుగా చేస్తారు. ఎనిమిదేళ్ళ తర్వాత వారి గ్రామానికి చెందిన వృద్ధ పుల్కసుడొకరు తనను పుల్కసుడైనట్లు గుర్తిస్తాడు. ప్రజలు తన నుంచి పారి పోగా ఆ రాజు అగ్నిలోకి ఉరుకుతాడు. మెలకువ వచ్చేసరికి నదిలో ఉంటాడు. ఇంటికి పోయి ఎప్పటివలెనే జీవిస్తాడు. ఒక రోజు ఒక బ్రాహ్మణుడు తనవద్దకు వచ్చి, కీరుల నగరానికి ఒక పుల్కసుడు రాజై ఎనిమిదేళ్ళు పాలించినట్లు, చివరకు తన విషయం వెల్లడి కావటంతో మంటల్లోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్తాడు. అప్పుడు గాధి స్వయంగా ఆ నగరానికి వెళ్ళి, అంతా ఆ బ్రాహ్మణుడు చెప్పినట్లే ఉందని కనుగొంటాడు. అప్పుడు తిరిగి బ్రాహ్మణునిగా మారి జీవితం గడుపుతాడు.

లవణుని కథను గాధి కథను పక్క పక్కన ఉంచి చూస్తే, ఒక దానినిబట్టి రెండవ దానిలో గ్రహించవలసినవి కనిపిస్తాయి. అనగా ఒకే అంశానికి సంబంధించిన రెండు దృశ్యాలన్నమాట. లవణరాజు తాను పారియా అయినట్లు కలగని తిరిగి రాజవుతాడు. బ్రాహ్మణుడైన గాధి పారియా అయినట్లు కలగని, రాజై, తను పారియా అయినట్లు వెల్లడి కావటంతో తిరిగి బ్రాహ్మణునిగా మారుతాడు. లవణుని కథ గాధి కథకు మధ్యలో మొదలైనట్లు తోస్తుంది. ఇద్దరు కూడా మరెక్కడికోపోయి వేరే జీవితాలు గడిపి, తిరిగి వెనుకటి జీవితాలకు వెళతారు. రెండు కథల మధ్య కొన్ని తేడాలూ ఉన్నాయి. ఉదాహరణకు లవణుడు మరొక చోటికి ప్రయాణించగా, గాధి మరణిస్తాడు. తిరిగి జన్మించి పూర్తిగా కొత్త జీవితాన్ని అనుభవిస్తాడు.

## అధ్యాయం 19

# మొఘలులు, బ్రిటిష్ పాలనలో పరిస్థితులు

## క్రీ.శ. 1500 - 1947

*హిందూ, ముస్లిముల మధ్య తీవ్రమైన విద్వేషాలున్నట్లు గుర్తించిన వివేకవంతుడైన పాలకుడు, ఆ విద్వేషాలకు కారణం ఒకరి గురించి ఒకరికి తెలియకపోవటమేనని గ్రహించి, ఒకరి గ్రంథాలు ఒకరికి అందుబాటులోకి తీసుకురాదలిచాడు. అందుకు ఆరంభంగా మహాభారతాన్ని ఎంపిక చేశాడు. ఎందుకంటే అది ఒక సమగ్రమైన కథనం, ఎంతో అధికారికమైనది. అందువల్ల రెండు మతాలకు చెందిన సమర్థులైన వ్యక్తులతో దానిని అనువాదం చేయించబూనాడు. ఆ విధంగా, తమ తప్పు సంప్రదాయాలకు, మూఢ నమ్మ కాలకు తమ కావ్యాలలోనే ఎటువంటి ప్రాతిపదిక లేదని హిందువులకు చూపదలచాడు. అదే విధంగా, ప్రపంచం కేవలం 7,000 సంవత్సరాల నుంచే ఉనికిలో ఉన్నట్లు భావించటం హాస్యాస్పదమని ముస్లిములకు చెప్పగోరాడు.*

–అబుల్ ఫజల్ (1551–1602)

ఇందులో పాలకుడన్న చక్రవర్తి అక్బర్. మొఘల్ పాలకులలోనే గాక యావత్ ప్రపంచంలోనే సర్వకాలాలలోనూ బహుళత్వాన్ని ఆయన స్థాయిలో ఆచరించినవారు చాలా తక్కువమంది కన్పిస్తారు. తను ఒకవైపు మహాభారతాన్ని ప్రస్తావిస్తూనే మరొకవైపు అటు వంటి కావ్యాలకు విరుద్ధమైన రీతిలో తప్పు సంప్రదాయాల ఆచరణ గురించి ఎత్తి చూపటం గమనించదగ్గది. ఇతర మొఘల్ పాలకులలో కొందరు హిందూమతంలోని కొన్ని అంశాలను ప్రస్తుతించగా, కొందరు పూర్తిగా వ్యతిరేకించారు.

### మొఘలులు

మొఘలులు అన్నమాట మంగోలుల నుంచి వచ్చింది. వారు తమ కుటుంబ సభ్యులపట్ల, చిన్న నేరాలకు కూడా ఇతరులపట్ల మహా క్రూరంగా వ్యవహరించేవారు. మరొకవైపు ప్రపంచ సంస్కృతి, భారతీయ సంస్కృతి అభివృద్ధికి వారు ఎనలేని సేవలు చేసారు. వారి పాలనలో పరిశ్రమలు, వాణిజ్యం బాగా వర్ధిల్లాయి. ఢిల్లీని పాలించిన అరబ్బులు, తురుష్కులలో అందరి వైఖరి హిందూమతంపట్ల ఒకేవిధంగా ఉండేది కాదు. వారిలో కొందరు మతతత్త్వంతో వ్యవహరించారు. కొందరు మతం గురించి ఎక్కువ పట్టించుకోలేదు. కొందరికి మతమంటే అభిమానం ఉన్నా ఇస్లాంను ఇతరులపై రుద్ద చూడలేదు. ఔరంగజేబు వంటివారు దారుణంగా ప్రవర్తించగా అక్బర్ ఒక అద్భుతమైన

పాలకుడనాలి. మొత్తం మీద చూస్తే అధికులలో రెండు విధాలైన లక్షణాలూ ఉండేవి. ఇస్లాంలో సున్నీ, షియా, సూఫీ వంటి భిన్న శాఖలుండేవి. ఢిల్లీ సల్తనేట్ కాలం నుంచి హిందూమతం కూడా మార్పులకు గురైంది. అందులో పలు శాఖలు, తాంత్రిక ధోరణులు కన్పించాయి. ఆ విధంగా ఒక భిన్నమైన ఇస్లాం, భిన్నమైన హిందూ మతం ఉనికిలోకి వచ్చాయి.

1484లో ఫెర్ఘానాలో జన్మించి బాబర్‌గా ప్రసిద్ధుడైన జహీరుద్దీన్ ముహమ్మద్, మొదటి గొప్ప మొఘల్ చక్రవర్తి. ఆయన తన తల్లివైపు చెంగిర్ఘ్‌ఖాన్‌కు, తండ్రివైపు తామర్లేన్‌కు చెందినవాడు. ఆయన తనలో ఉన్నది మంగోల్ రక్తమైనా తనను తాను తురుష్కునిగా చెప్పుకున్నాడు. ఆయన ఒకవైపు క్రూరత్వాన్ని ప్రదర్శించాడు. అనేక దేవాలయాలను ధ్వంసం చేశాడు. మరొకవైపు సంస్కృతిని పెంపొందించాడు. తను బాబర్ నామా పేరిట రాసిన స్మృతులను బట్టి అప్పటి విషయాలు చాలా తెలుస్తాయి. తనకు హిందూ, జైన విగ్రహాలు నగ్నంగా ఉండటం సరిపడలేదని, కనుక వాటి విధ్వంసానికి ఆదేశించాడని ఆ రచనవల్ల తెలుస్తుంది. నిజానికి ఆయనకు భారతదేశం గురించి నచ్చింది ఇక్కడి బంగారం, ఇతర సంపదలు మాత్రమేనని కూడా అర్థమవుతుంది. బాబర్‌కు పూర్తి నిబద్ధత ఉన్నది ఇస్లాంపట్ల, తన సైనిక విజయాలపట్ల మాత్రమే. అటువంటి ఒకానొక విజయం తర్వాత, ఇస్లాం కోసమే తాను సంచారినయానని, ఇస్లాం పట్ల విశ్వాసంలేని వారిపైన, హిందువులపైన యుద్ధాలు జరిపానని రాసుకున్నాడు. అయితే మతాంతరీ కరణకు, దేవాలయాల విధ్వంసానికి ప్రాధాన్యతనివ్వలేదు. ఆయన అయోధ్యలో బాబ్రీమసీదు సహా అనేక మసీదులను నిర్మింపజేసినట్లు చెప్తారు. తన మరణానంతర మృతదేహాన్ని తాత్కాలికంగా ఆగ్రాలో ఖననంచేసి తర్వాత కాబూల్‌కు తరలించారు.

1508లో కాబూల్‌లో జన్మించిన హుమాయూన్, బాబర్‌కు జ్యేష్ఠపుత్రుడు. 1530లో బాబర్ మరణానంతరం ఆయన చక్రవర్తి అయాడు. జ్యోతిషం, ఖగోళశాస్త్రాలలో కూడా అమితమైన ఆసక్తి ఉండిన ఆయన ఢిల్లీలోని తన ఖగోళ వేధశాల నుంచి మెట్లు దిగుతూ 1556లో చనిపోతాడు. అప్పటికి 13 సంవత్సరాల వయసువాడే అయిన అక్బర్ రాజ్యాభిషిక్తుడవుతాడు. భారతదేశంలోనే జన్మించిన మొదటి పాలకుడు ఆయనే. తను మహా సాహసికుడు, క్రూరుడు కూడా. విద్య నేర్వలేదు గాని నవరత్నాలని పేరుబడిన తొమ్మిదిమంది మహా పండితులను తన ఆస్థానంలో నియమించి ఆదరించాడు. వారిలో ఒకరైన అబుల్ ఫజల్ అక్బర్–నామా, ఐన్–ఎ–అక్బరీ అనే రెండు గ్రంథాలు రచించాడు.

హిందూ, ముస్లిం మతతత్త్వవేత్తలు ముందస్తు పట్టుదలల వంటివి లేకుండా పరస్పర చర్చలు సాగించటం అంతకుముందు కూడా ఉండేది గాని, అటువంటి బహుళత్వానికి మద్దతునిచ్చిన మొదటి మొఘల్ పాలకుడు అక్బర్. ఆగ్రా సమీపాన తాను నిర్మించిన ఫతేపూర్ సిక్రీ నగరంలో ప్రతి గురువారం ఈ విధమైన చర్చల కోసం ప్రత్యేకమైన

ప్రాంగణముండేది. ఆ చర్చలు ఇస్లాంలోని సున్నీ, షియా, ఇస్మాయిలీ, సూఫీ శాఖలతో ఆరంభం కాగా, తర్వాత క్రమంగా పార్శీలు, హిందువులు, సిక్కులు, జైనులు, యూదులు, జెస్యూట్‌ల వంటివారు కూడా చేరుతూ పోయారు. చార్వాకులు, లోకాయతులకు కూడా అవకాశం లభించడం విశేషం. దీనంతటి మధ్య సత్యాన్వేషణ అక్బర్ ఉద్దేశం. స్వయంగా ఆయనకు సూఫీ తత్త్వం, చిష్తీల పట్ల అభిమానముండేది. "వేదాంతాలలోని వివేకమే సూఫీ తత్త్వంలోగల వివేక"మని కూడా అన్నాడాయన. అక్బర్‌కు క్రైస్తవులతోనూ సత్సంధాలుండేవి. అయితే ఆయన ఇక్కడ సర్వమత సమభావం గురించి మాట్లాడుతుండిన కాలంలో మరొకవైపు యూరప్‌లో క్రైస్తవంతో విభేదించిన వారిపై ఇంక్విజిషన్ల పేరిట మారణకాండ సాగుతుండేది. అక్బర్ 'దీన్–ఇ–ఇలాహీ' పేరిట తననే కేంద్రం చేసుకుంటూ ఒక కొత్త మతాన్ని నెలకొల్పటం విశేషం. కాని అది నిలవలేదు. పైగా ఉలేమాలు దానిపై తిరుగుబాటు చేశారు.

అక్బర్ హిందువులను ఇతర మొఘల్ పాలకులవలె కాఫిర్లు అని పిలవటం గాక తన పౌరులుగా పరిగణించటం విశేషం. ఆయనకు వారితో పూర్తి సత్సంబంధాలుండేవి. వారిపట్ల ఎప్పుడైనా హానికరంగా వ్యవహరిస్తే తర్వాత క్షమాపణలు చెప్పేవాడు. తన సేనలు కూల్చిన హిందూ దేవాలయాలను తిరిగి నిర్మింపజేశాడు. నాగర్‌కోట్, కురుక్షేత్ర దేవాలయాలు అందుకు ఉదాహరణలు. అదేవిధంగా వారిపై జిజియా పన్ను రద్దుచేసి వారికి తమ చట్టాలు, న్యాయస్థానాలు తమకుండగలవని ప్రకటించాడు. పరిపాలనలో, ఆర్థిక వ్యవస్థలో వారికి అనేక ఉన్నతావకాశాలను కల్పించాడు.

అక్బర్‌కు, తన రాజపుత్ర పత్నితో కలిగిన సంతానం జహంగీర్ (సలీం). 1569లో జన్మించిన ఆయన అక్బర్ తర్వాత 1605లో రాజ్యానికొచ్చాడు. మద్యపాన వ్యసనపరుడైన తను అబుల్ ఫజల్‌ను, పలువురు ముస్లిం మత గురువులు చంపించాడు. ఆయనకు హిందూమతం పట్ల చిన్నచూపు ఉండేది. అదే సమయంలో దాని గురించి పెద్దగా పట్టించుకోలేదు కూడా. ఒకటి రెండు దేవాలయాలను మాత్రం కూలగొట్టించి తక్కినవాటిని వదలివేశాడు. కొన్నింటికి మరమ్మతులు చేయించటం విశేషం.

జహంగీర్ అనంతరం రాజ్యానికి వచ్చిన షాజహాన్ కూడా రాజపుత్ర స్త్రీకి జన్మించిన వాడే. కాని ఆయన అనేక హిందూ దేవాలయాలను ధ్వంసం చేయించాడు. ఒక్క వారణాసిలోనే అటువంటివి 70 ఉన్నాయి. అదే సమయంలో తనకు హిందూ కళలు, సంస్కృతిపట్ల గౌరవం ఉండటం విశేషం. తన భార్య ముంతాజ్‌కు స్మృతిగా తాజ్‌మహల్‌ను నిర్మింపజేసింది ఆయనే. షాజహాన్ కుమారుడు ఔరంగజేబు తనను జైలులో బందీ చేసాడు.

షాజహాన్ పెద్ద కుమారుడైన దారా షికో తండ్రికి బాగా ఇష్టుడు. కాని హిందూ, ఇస్లాం మతాల సారాంశం ఒకటేనని ప్రకటించిన దారా పట్ల, సంప్రదాయిక ముస్లిములకు వ్యతిరేకత ఉండేది. ఆయనకు అక్బర్ వలెనే అన్ని మతాల వారితో సత్సంబంధాలుండేవి.

షాజహాన్ మరణశయ్యపై ఉండినా వారసత్వం కోసం దారా షికో, ఔరంగజేబుల మధ్య పోటీ ఏర్పడింది. ఔరంగజేబు దారా కుమారులను ఆయన ముందే చంపించి, తర్వాత దారాను వీధులలో ఊరేగించి, ముక్కలుగా నరికి, తిరిగి ఆ ముక్కలను కూడా ఊరేగింపజేసినట్లు కొన్ని కథనాలు చెప్తున్నాయి.

ఔరంగజేబు పూర్తి మతతత్త్వవాదిగా వ్యవహరించాడు. సున్నీ అయిన తాను షియాలను కూడా అవమానించి వేధించాడు. హిందువులు, సిక్కులపై తీవ్రమైన వివక్ష చూపాడు. దారాకు మద్దతునిచ్చారని సిక్కు గురువులను చంపించాడు. హిందువులపై జిజియా పన్ను తిరిగి విధించి, ఈసారి బ్రాహ్మణులను సైతం మినహాయించలేదు. హిందువులను అనేక విధాలుగా బాధించటంతోపాటు మతం మారవలసిందిగా వత్తిడి తెచ్చాడు. దేవాలయాల దోపిడీ, ధ్వంసం, బ్రాహ్మణుల హత్యలు సాగాయి. ఇటువంటి అకృత్యాలకు అంతులేకుండా పోయింది. అదే సమయంలో కొన్ని దేవాలయాలకు సహాయ పడటం గమనార్హం. ముఖ్యంగా రాజకీయమైన, సైద్ధాంతికమైన శక్తిగల దేవాలయాలను ఆయన సహించలేదు.  తను కళా సాహిత్యాలకు కూడా వ్యతిరేకి. ఔరంగజేబ్ అనంతరం రాజ్యానికి వచ్చిన వారి గురించి చెప్పుకోవలసింది ఏమీలేదు. వారంతా బలహీనులు.

## హిందువుల ప్రతిఘటన

మొఘలుల పాలనలో హిందూమతానికి వ్యతిరేకంగా జరిగిన చర్యలకు హిందువుల నుంచి అనివార్యంగా ప్రతిఘటన ఎదురైంది. వారు కొన్ని మసీదులను కూల్చి దేవాలయాలుగా మార్చారు. ఇది 13వ శతాబ్ది ఆరంభంలో, తిరిగి 1540 తర్వాత, అక్బర్, షాజహాన్, ఔరంగజేబుల పాలనా కాలాల్లో జరిగింది.

మొఘలులకు మొత్తం దేశంపై నియంత్రణ ఉండేది కాదు. పంజాబ్‌లో సిక్కు గురువుల నాయకత్వంలో, విజయనగర రాజ్యంలో, అన్నింటికన్న ముఖ్యంగా శివాజీ నాయకత్వాన మహారాష్ట్రుల నుంచి తీవ్ర ప్రతిఘటనలుండేవి. శివాజీకి ముందు అదే ప్రాంతంలో మాలిక్ అంబర్ అందుకు నాయకత్వం వహించాడు. శివాజీ తర్వాత మహారాష్ట్రుల ప్రతిఘటన ఎక్కువ కాలం సాగలేదు.

## పరస్పర మత సంబంధాలు

మొఘలుల కాలంలో హిందూ–ముస్లిం సంబంధాలు ఒకే విధంగా ఉండేవి కావు. అక్బర్ పాలనలో అత్యుత్తమంగా ఉండేవి. దారా షికో పాలకుడు కాలేదు గాని తన వైఖరి కూడా అదే. ఔరంగజేబు కాలంలో పరిస్థితి అన్నింటికన్నా అధ్వాన్నంగా ఉండేది. షాజహాన్ పాలనలో మిశ్రమం. పోతే, మొఘలుల కాలమంతా కూడా మతాంతరీకరణ అరుదుగా మాత్రమే జరిగేది. ఇస్లాం తమ స్వంత వారసత్వమని భావించిన పాలకులు ఇతరులను అందులోకి తీసుకురానక్కరలేదనుకునేవారు. మూకుమ్మడిగా, బలవంతంగా ఆ పని జరిగిన

దాఖలాలూ లేవు. అయినప్పటికీ పలువురు హిందువులు మతం మారారు. లేనట్లయితే ముస్లిముల సంఖ్య ఇంతగా పెరిగేది కాదు. ధనం, శిక్షలు, వివాహాలు, విశ్వాసం వంటివి అందుకు కారణాలయాయి. మరొకవైపు పలువురు ముస్లిములు కూడా హిందువులుగా మారారు. దానిని నిరోధించేందుకు షాజహాన్, అక్బర్ వంటివారు చర్యలు కూడా తీసుకున్నారు.

మత గ్రంథాలు, రచనల విషయానికి వస్తే భక్తి, సూఫీ భావనలు ఎంతగా కల గలిసిపోయాయంటే, ఒక జానపద గీతానికి రెండింటిలో ఏది ఆధారమో చెప్పటం కష్ట మయేది. ముస్లిములు రాసే గీతాలు చాలావరకు అల్లా పేరుతో ఆరంభమైనా వాటినిండా హిందూ సంబంధమైన భావనలు, భాష నిండి ఉండేవి. హిందూ భక్తి సంప్రదాయ సాహిత్యంలో ఇదే విధంగా సూఫీ ప్రభావాలు బలంగా కన్పించేవి. ఉదాహరణకు 16వ శతాబ్దికి చెందిన రూపా గోస్వామి రచించిన భక్త్యామృత మహాసాగరంలో కృష్ణుని గురించి సూఫీ గీతాల నమూనాలో రాయటం కన్పిస్తుంది. తారిఖ్–ఇ–ఫరిష్తాలో పర్షియన్ కావ్యం షానామా, హిందూ ఇతిహాసం మహాభారతంలోని ప్రధాన పాత్రధారులు పరస్పరం సంభాషిస్తారు. హిందూ, ముస్లిం శాఖలు రెండూ కూడా ఆ కాలంలో ప్రవర్ధిల్లాయి. కొత్త శాఖలు ఆవిర్భవించాయి. కాంగ్డా, మథురలలోని హిందూ దేవాలయాలను ముస్లిములు దర్శిస్తుండేవారు.

వివిధ మతాల సమ్మేళనమన్నది సూఫీతత్త్వసారం. ఆ సంప్రదాయంలో ముస్లిం శిష్యులు, వారికి హిందూ శిష్యులు, వారికి తిరిగి ముస్లిం శిష్యులు తయారవుతూపోయేవారు. వారిలో కొందరు దేవుడిని అల్లా అన్నారు. కొందరు రాముడు, లేదా హరి అని పిలిచారు. సూఫీ కేంద్రాలలో పారియాలతో సహా హిందువులు ఇతర హిందూ, ముస్లిములతో కలిసి భోజనాలు చేసేవారు. 17వ శతాబ్దంలో ఉర్దూలో సాగిన దక్కనీ కవితా సంప్రదాయంలోనూ ఇదే కనిపిస్తుంది. అందులో ఇస్లామిక్, హిందూరీతులు రెండూ ఉంటాయి. స్త్రీ పురుష స్వరాలు రెండూ వినిపిస్తాయి. హిందువుల గానరీతి, అరబిక్ కథాకథన పద్ధతి రెండూ ఒక స్త్రీ కథకురాలి పాత్ర నిర్వహించగా మనకు కనిపిస్తాయి. మొఘల్ పాలకులు యోగాను ప్రోత్సహించారు. హిందువులు సూఫీ పీర్లను కొలిచారు.

## మత సాహిత్యానువాదాలు

మత సాహిత్యానువాదాల కారణంగా హిందూమతాన్ని ఇస్లాం, ఇస్లాంను హిందూ మతం సుసంపన్నం చేసాయి. అనువాదాలు కొత్త సాహిత్య సృష్టికి దారితీసాయి. మొఘలుల కాలానికి ముందే ఉత్తర దేశంలో సంస్కృతం, పర్షియన్, అరబిక్, టర్కిష్, సింధీ, పంజాబీ, పష్తో, హిందీ భాషా సాహిత్యాలు వర్ధిల్లుతుండేవి. దక్షిణ భారతదేశంలోనూ తెలుగు, తమిళంతోపాటు ఇతర భాషలలో సాహిత్యం విరివిగా ఉండేది. తర్వాత సైనిక శిబిరాలుండిన ప్రాంతాలలో ఉర్దూ అభివృద్ధి చెందింది. దాని లిపి పర్షో–అరబిక్ కాగా, వాక్య నిర్మాణం,

పదజాలంలో సంస్కృత – హిందీ ప్రభావాలుండేవి. షాజహాన్ కాలంలో ఉర్దూ ప్రధానమైన వాడుక భాషగా మారింది.

మొఘల్ చక్రవర్తులు పలువురు హిందూ సాహిత్యకారులను, పండితులను ఆదరించి అనేక సంస్కృత కావ్యాలను అరబిక్, పర్షియన్ భాషలలోకి అనువదింపజేసారు. ఎనిమిదవ శతాబ్ది నాటికే పంచతంత్ర కథలు కలీలా వా దీమ్నా పేరిట అరబిక్‌లోకి, అన్వరీ సుహైలీ పేరిట పర్షియన్‌లోకి అనువాదమయ్యాయి. అదే పుస్తకాన్ని అబుల్ ఫజల్ చేత అక్బర్ మరొకమారు పర్షియన్‌లోకి అనువదింపజేసాడు. అబుల్ ఫజల్ రామాయణ, మహా భారతాలను కూడా పర్షియన్‌లోకి అనువదించాడు. హరివంశ కావ్యాన్ని పర్షియన్‌లోకి సచిత్ర అనువాదం చేసారు. యోగ వాశిష్టాన్ని జహంగీర్ సంక్షిప్తంగా అనువదింపజేసాడు. ఆ గ్రంథాన్ని దారా షికో స్వయంగా మరింత వివరంగా అనువదించాడు. దారా షికో మొదటిసారిగా ఉపనిషత్తులను పర్షియన్‌లోకి అనువాదం చేయగా, దానినిబట్టి ఫ్రెంచ్ అనువాదం వెలువడింది. అక్బర్, దారా షికోల ప్రయత్నంవల్ల ముస్లిం ప్రపంచంలో సంస్కృతం ఒక ముఖ్య సాహిత్య భాషగా మారింది. తుర్కీ, పర్షియన్ శృంగార సాహిత్యంలోకి కామ–సూత్ర బాగా ఇమిడిపోయింది. దాని అనువాదాలు అద్భుతమైన చిత్రాలతో వెలు వడ్డాయి. పర్షియన్ అనువాదాలు యూరోపియన్ భాషలలోకి మారాయి.

## భవన నిర్మాణాలు, చిత్రకళ

మొఘలులు దోపిడీలకు, కొల్లగొట్టటాలకు ఎంత పేరు మోసారో బ్రహ్మాండమైన నిర్మాణాలకు కూడా అంత పేరుపడ్డాడు. వారి భవన నిర్మాణ రీతులపై హిందూ రీతుల ప్రభావం బలంగా ఉండేది. అదేవిధమైన ముస్లిం ప్రభావాలు హిందూ నిర్మాణాలపై పడ్డాయి.

బాబర్‌కు హిందూ నిర్మాణకర్తలపట్ల సదభిప్రాయం ఉండేది కాదు. కాని అక్బర్ వారిని మెచ్చుకున్నాడు. ఆయన స్థాపించిన ఫతేపూర్ సిక్రీనగరంలో పర్షియన్, హిందూ, జైన నిర్మాణ రీతులన్నీ కన్పిస్తాయి. అక్కడ తను సుమారు 1500 మంది శిల్పులను నియోగించాడు. సాధారణంగా ప్రభుత్వ నిర్మాణాలకు వినియోగించే ఎర్ర ఇసుక రాతిని బృందావన్‌లో దేవాలయాల కోసం ఉపయోగించేందుకు ఆయన మాన్‌సింగ్‌కు అనుమతి నిచ్చాడు. ఆ దేవాలయాలలో మొఘల్ నిర్మాణ రీతులు కొన్ని కన్పిస్తాయి.

చిత్రకళా రంగంలోనూ ఇరు మతాల రీతుల మేళవింపును గమనించవచ్చు. హిందూ ఇతివృత్తాలు గల చిత్రాలపై ముస్లిముల సంతకాలు కనిపిస్తాయి. హిందూ మినియేచర్ చిత్రాలను పర్షియన్ నమూనాలో చిత్రించారు. లిఖిత ప్రతులతో సూక్ష్మ చిత్రాలు ఉపయో గించే సంప్రదాయం భారతీయులలో గతంలోనూ ఉండినా, పర్షియన్లు దానినొక ఆస్థాన సంప్రదాయంగా మార్చారు. అందులో కొత్త మెలకువలను ప్రవేశపెట్టారు.

ఈ కళా సాహిత్య నిర్మాణాదికాలన్నింటికి అయిన ఖర్చుల భారం మాత్రం ఎప్పటి వలెనే సామాన్యులపైనే పడింది. మొఘలుల మహా నిర్మాణాలన్నీ వారి ప్రాగల్భ్యానికి, అణచివేతలకు కూడా చిహ్నాలయాయి. పాలకులు రైతుల పంటలను నేరుగా స్వాధీన పరచుకోలేకపోయినా వారిపైన, వృత్తి పనుల వారిపైన శిస్తులు, పన్నుల మోతను గణనీయంగా పెంచివేసారు. రైతును గతంలో ఎన్నడూలేనంత దోపిడీ చేసారు. మొఘలులకు ముందు మహా దేవాలయ నిర్మాణాలు సామాన్యునికి ఏ విధంగా ఆర్థికంగా పెనుభార మయాయో, మొఘల్ చక్రవర్తుల భవన నిర్మాణాలు కూడా అదే విధంగా వారి నడ్డి విరిచాయి.

## మొఘలుల పాలనలో హిందూమతం

మొఘలుల పాలనా కాలంలో పలు హిందూ శాఖలు వర్ధిల్లాయి. ఇతర దేశాల సంస్కృతులు ఇక్కడ వ్యాపించినప్పుడు హిందూ మేధావులు తమ సాంస్కృతిక వారసత్వాల పరిరక్షణకు ప్రయత్నించారు. భిన్న సంస్కృతుల మధ్య మేళవింపులు కూడా జరుగుతుండగా కొందరు, తమకు కూడా ముస్లిములనే ముద్ర రాగలదన్న జంకుతో మరింత సనాతన వాదులయారు. ఆ కాలపు ధర్మశాస్త్రాలలో సంప్రదాయిక తత్త్వం మరింతగా కన్పించ టానికి ఇదొక కారణం అయి ఉండాలి.

మరొకవైపు గమనిస్తే మధ్యయుగాల నాటి హిందూ రాజులు ఈ అంశాలపై పెద్ద ఎత్తున బహిరంగ చర్చలు జరిపించారు. ముస్లిముల భయం, తమ సమాజాల పరిరక్షణ కోరిక ఇందుకు కారణం. వ్యాపారాన్ని, తీర్థయాత్రలను ప్రోత్సహించిన మొఘలుల విధానాలు అయోధ్య, బృందావనం వంటి పుణ్యక్షేత్రాలకు ఉపయోగపడ్డాయి. 16వ శతాబ్ది కాలపు వైష్ణవభక్తి సంప్రదాయాలు తదనంతర కాలపు హిందూమతానికి పునాది వంటివయాయి. హిందూమతానికి ఒక బలమైన రాజకీయ కేంద్రం మొఘలుల కారణంగా లేకపోవటంతో హిందువుల దృష్టి కృష్ణుని వైపు మళ్ళింది. పాలకులు కులాలపై ఎక్కువ శ్రద్ధ చూపనందున హిందువులలోనూ కొందరు అదే ధోరణిని అనుసరించారు. ఆ విధంగా బ్రాహ్మణ ప్రపంచానికి వెలుపల కొన్ని మంచి పనులు జరగసాగాయి.

## ఉత్తర దేశంలో తులసీదాసు

ఉత్తర భారతదేశంలో వైష్ణవ తత్త్వానికి రూపుదిద్దిన ప్రముఖులలో ఒకరైన తులసీ దాసు, మాన్‌సింగ్‌తో సహా పలువురు ఆస్థాన ముఖ్యులకు సన్నిహితుడు. ఆయన రచించిన రామచరిత మానస్ ఇప్పటికీ ఒక ప్రసిద్ధ గ్రంథమే. ఆయన దానిని వారణాసిలో రచించగా, అక్కడి బ్రాహ్మణులు అటువంటి గ్రంథాన్ని ఒక ప్రాంతీయ భాషలో రాయటమేమిటా అని దిగ్భ్రాంతి చెందినట్లు చెప్తారు. తులసీదాసు కులవ్యవస్థను సవాలు చేయటంపట్ల

కొందరు బ్రాహ్మణులు అభ్యంతరం చెప్పారు. అయితే తను మొత్తంమీద ఆ వ్యవస్థను అనుసరిస్తూనే పారియాలు, గిరిజనులపట్ల సానుభూతి చూపుతాడు. ఆయన సీత ఉదంతంలో కూడా కొన్ని మార్పులు ప్రవేశపెట్టాడు.

## బెంగాల్‌లో చండీదాసు, చైతన్య

సీతవలెనే రాధ కూడా తను ప్రేమించిన వ్యక్తికి (క్రిష్ణుడు) దూరమై వేదనను అనుభవిస్తుంది. కాని ఈ ఇరువురి వేదన మధ్య తేడా ఉండగా, దానికి చండీదాస్, చైతన్య మరింత వ్యత్యాసంగల నిర్వచనాలు చెప్పారు. చండీదాస్ చిత్రించిన రాధకు లోగనే వివాహమైన తర్వాత క్రిష్ణునితో సంచరిస్తుంది. ఆయన స్వయంగా తన గురించి రాసుకున్న కవితల ప్రకారం, ఆయన ఒక బ్రాహ్మణుడు, గ్రామ పూజారి. రామి అనే రజక స్త్రీని ప్రేమించి ఆ విషయం బయటకు చెప్తాడు. తన గురించి గల కథనాలను బట్టి ఆయనను ఈ నేరానికి పూజారి పని నుంచి తొలగిస్తారు. ఆయన అందుకు నిరసనగా నిరాహారదీక్ష చేసి మరణిస్తాడు గాని, చితిపైన తిరిగి ప్రాణం వస్తుంది. ఇదిగాక ఇతర కథనాలు కూడా ఉన్నాయి.

చైతన్యునికి సంబంధించి చూస్తే, బ్రాహ్మణుడైన ఆయన సంస్కృత కావ్యాలను బాగా అభ్యసిస్తాడు. తండ్రి మరణించిన తర్వాత అంత్యక్రియల కోసం గయ వెళ్ళి అక్కడ సన్యసిస్తాడు. క్రిష్ణుని గానంచేస్తూ పూరీలో స్థిరపడతాడు. తన అనుచరులు చైతన్యుడిని రాధాకృష్ణులు ఇరువురూ మూర్తీభవించిన వ్యక్తిగా పరిగణిస్తారు. వారు ఒక పురుషుడు మరొకరి భార్యను ప్రేమించటం, లేదా నిమ్నకులం స్త్రీని ప్రేమించటం, లేదా ఒక అవివాహిత ఒక వివాహితుడైన పురుషుడిని ప్రేమించటంవంటి దానిని ప్రశంసిస్తారు. ఎందుకంటే, సమాజం ఆమోదించకపోయినా ప్రేమించటమన్నది ఆ ప్రేమలోని స్వచ్ఛతకు రుజువు. రాధాకృష్ణుల ప్రేమ ఇటువంటిదే.

చైతన్యుడు ఒరిస్సా గవర్నర్‌ను ఇస్లాం నుంచి తిరిగి హిందూమతంలోకి మార్చినట్లు చెప్తారు. అదేవిధంగా పలువురు పఠాన్లను కూడా హిందువులుగా చేసినట్లు చెప్తారు. చైతన్యునికి సహజీయులు, గోస్వాముల వంటి అనేక అనుచరులున్నారు. వారిలో కొందరికి తాంత్రిక లక్షణాలు కూడా ఉన్నాయి.

బెంగాలీ వైష్ణవ సంప్రదాయానికే చెందిన రాంప్రసాద్ (1720–1781) అనే కవి నిత్య జీవితంలోని పేదరికం, రుణాలు, రైతులు, భూస్వాములు, న్యాయవాదులు, వ్యాపారుల వంటి అంశాలను తన కవితలలో ప్రస్తావించటం విశేషం.

## మహారాష్ట్రలో తుకారాం

మహారాష్ట్రకు చెందిన తుకారాం (1608–1649) శూద్రుడు. తన కవితలేవీ ఆయన జీవిత కాలంలో రాసినవి కావు. తర్వాత ఆయన గురించి గల మౌఖిక

సంప్రదాలయాలను ఆధారం చేసుకుని వాటిని రచించారు. ఒక కథను బట్టి, పలు కష్టాలకు గురైన ఆయన ఒకసారి తన రెండవ భార్యను, పిల్లలను, అప్పులను అన్నింటినీ వదలివేసి అడవులకు వెళ్ళిపోతాడు. కవిగా మారి విఠలుని భక్తుడవుతాడు. తన కవితలలో కులంపై, బ్రాహ్మణులపై విమర్శలు కనిపిస్తాయి.

## ఆంధ్రలో క్షేత్రయ్య

స్త్రీల మనోభావాలపై పురుషులు రాసే తెలుగు భక్తి కవితా సంప్రదాయం ఒకటి 15–18 శతాబ్దాల మధ్య దక్షిణాంధ్ర, తమిళ దేశాలలో కనిపిస్తుంది. వారిలో చెప్పుకోదగ్గ వాడు క్షేత్రయ్య. బహుశా 17వ శతాబ్ది మధ్య కాలంలో నాయక రాజులు పాలించినప్పుడు జీవించిన ఆయన, మువ్వగోపాలుడిని స్తుతిస్తూ పద కవితలు రాశాడు. వాటిలో ఒక వేశ్య తన వద్దకు వచ్చిన పురుషునితో సంభాషిస్తున్నట్లు ఉంటుంది. అతను ఆమె ప్రియుడే గాక తనకు భగవంతుడు, రాజు కూడా. క్షేత్రయ్య పదాలు వేశ్యల గాన సంప్రదాయంలో నిలిచిపోయాయి. అదే విధంగా పురుషులైన బ్రాహ్మణులు స్త్రీ వేషాలలో నృత్యంచేస్తూ వాటిని ఆలపిస్తారు.

## బ్రిటిష్ పాలనా కాలం

భారతదేశానికి వచ్చిన బ్రిటిష్ వారి సామాజిక మూలాలు తమ దేశంలో ఏవైనప్పటికీ, వారు ఇక్కడ మాత్రం ఉన్నత వర్గాలతో చేరారు. వారి దృష్టిలో బ్రాహ్మణులు గాక రాజులు ఉన్నతులయారు. వారినే తమతో సమానులుగా పరిగణించారు. ఇతరులందరిని చిన్న చూపు చూసినా రాజులను గౌరవించారు. ఈ ఆలోచనల వల్లనే తమ ఆధిపత్యాన్ని రాజ్, బ్రిటిష్ రాజ్ అని పిలుచుకున్నారు. తమ సభలను దర్బార్ అన్నారు. హిందువులలో కుల వ్యవస్థ లేదా ఆ రూపంలో వర్గ వ్యవస్థ ఉండినందున, బ్రిటిష్‌వారు అందులో అగ్ర స్థానంలో చేరారు. 'సాహెబ్'లయారు.

ఆ విధంగా కొందరు హిందువుల వర్గంతో కలిసిపోయిన బ్రిటిష్‌వారు పలు విధాలుగా కులవ్యవస్థను కూడా బలపరచారు. స్వయంగా తమ సామాజిక అంతరాలకు అది ఉపయోగపడింది. దానిని రాజకీయంగా కూడా ఉపయోగించుకుంటూ బెంగాల్ సైన్యంలోని బ్రాహ్మణ సైనికులలో కుల ధోరణిని, వారొక ప్రత్యేక తరగతి అంటూ చెప్పి పెంచారు.

మరొకవైపు వివిధ కారణాలవల్ల హిందువులకన్న ముస్లిముల సాన్నిహిత్యాన్ని కోరుకునేవారు. తమ వలెనే వారు కూడా భారతదేశాన్ని పాలించారు. వారు హిందువుల కన్నా మెరుగైన ఆశ్వికులు. ఇస్లాంలో ఏకేశ్వరోపాసన ఉంది. ముస్లిములు హిబ్రూ బైబిల్‌ను, క్రైస్తవుల న్యూ టెస్ట్‌మెంట్‌ను గౌరవిస్తారు. మతాంతరీకరణలు హిందూమతంలో కన్నా ఇస్లాంలోకి సులభం. స్థానిక నవాబులు కూడా బ్రిటిష్ వారిని మొఘల్ వ్యాపార పారిశ్రామిక

వర్గంలో భాగం చేసేందుకు వారితో సంబంధాలు పెంచుకున్నారు. స్థానిక స్త్రీలు కూడా బ్రిటిష్ వారిని ఇక్కడి రాజులు, నవాబులతో సమానంచేసి చూశారు. ఇదంతా బ్రిటిష్ జాతీయుల భారత రాకలోని తొలిదశ పరిస్థితి. వారు తమను తాము సగటు భారతీయుని కన్నా భిన్నంగా చూపుకొనేందుకు ఎక్కువ శ్రమపడనక్కరలేకపోయింది.

మరొకవైపు ఈస్టిండియా కంపెనీ అధికారులకు భారతదేశ పరిస్థితులు, చరిత్రపట్ల ఆసక్తి కూడా ఉండేది. వాటిలో ఉపయోగకరమైనవి ఏమైనా ఉండవచ్చునని ఓరియెంటలిస్టులు అధ్యయనాలు చేస్తుండేవారు. అధికారులు స్థానిక మతాలు, సంప్రదాయాలలో జోక్యంచేసుకునేవారు కాదు. భారతీయ కళలను, ఉత్సవాలను, విద్యను ప్రోత్సహించారు కూడా. ఈ వైఖరి మొఘల్ పాలకుల తీరును తగినంత పోలి ఉండటం గమనించదగ్గది.

ఈ పరిస్థితులు క్రమంగా మారాయి. ఇంగ్లాండ్‌లో జాతి తత్త్వం, భారతదేశంలో బ్రిటిష్‌వారిపట్ల నిరసనలు తలెత్తటం ఇందుకు కొంత కారణం. మొదటి దశలో ఇక్కడ స్త్రీలను వివాహమాడటం లేదా వారితో సహజీవనం చేయటం చేస్తుండిన బ్రిటిష్‌వారు స్వదేశం నుంచి తమ భార్యలను తీసుకురావటం మొదలుపెట్టారు. వారిక్కడ మేమ్ సాహెబ్ లయారు. మగవారు భారతీయ జీవనం నుంచి ఉపసంహరించుకున్నారు. వారికి ప్రత్యేకమైన క్లబ్బులు ఏర్పడ్డాయి. వాటిలోకి భారతీయులకు ప్రవేశం లేకపోయింది. పాలకులకు, పాలితులకు మధ్య దూరాలు పెరిగిపోయాయి. ఉభయుల మధ్య కొన్ని హింసాత్మక ఘటనలు కూడా 1857–58 తిరుగుబాటుకు ముందే చోటుచేసుకున్నాయి. కలకత్తా బ్లాక్ హోల్ ఉదంతం వాటిలో ఒకటి.

తర్వాత వందేళ్ళ కాలంలో పన్నులు పెరిగిపోయాయి. రైతులపై భారం పెరిగింది. కరువు కాటకాలు తరచుగా ఏర్పడసాగాయి. అంటువ్యాధులు వ్యాపించాయి. ఇటువంటి సమయాలలో దేవతల ప్రాధాన్యం పెరుగుతుంది. బెంగాల్‌లో దాదాపు కోటిమంది ఆకలికి ఆహుతి కాగా కాళికాదేవి వంటి భీకరమైన దేవతస్థాయి పెరిగింది. మతం రూపంలో బ్రిటిష్‌వారికి చుక్కెదురైంది. ఇదంతా మొదటిదశ.

## మిషనరీలు

బ్రిటిష్ వారికి సంపాదనలు, అధికారం మాత్రమే ఆకర్షణలు అయినంత కాలం భారతీయులు మనుషులుగానే కన్పించారు. వారిని దోచుకున్నారు. కాని క్రైస్తవ మిషనరీల రంగప్రవేశంతో భారతీయులను దయ్యాలు, రాక్షసులుగా చూడసాగారు. కంపెనీవారు మొదట మిషనరీలను ఇండియాలో ప్రవేశించకుండా గట్టిగానే అడ్డుకున్నారు. స్థానికులతో వైరంవల్ల నష్టాలుంటాయనుకున్నారు. భారతీయుల మత వ్యవహారాలలో జోక్యం చేసుకోబోమంటూ గవర్నర్ – జనరల్ కార్న్ వాలీస్ 1793లో ఒక ఒప్పందం కూడా చేసుకున్నాడు. కాని 1813లో కంపెనీ ఛార్టర్‌ను తిరిగి రాసుకున్నప్పుడు పరిస్థితి మారింది. ఇండియాలో

మిషనరీల ప్రవేశానికి అంగీకారం జరిగి, ఇక్కడ బ్రిటిష్‌వారి ఉనికిలో రెండవదశ మొదలైంది. మతాంతరీకరణలు ఆరంభమయాయి. గిరిజనులు, నిమ్నకులాలవారు, పేదలతో ఆరంభమైన ఈ క్రమం, వివిధ కారణాలవల్ల అందరికీ విస్తరించింది. హిందూ మత వ్యవహారాలలో జోక్యం చేసుకునేట్లు మిషనరీలు ప్రభుత్వాన్ని వత్తిడి చేసారు. ఈ జోక్యాలు విద్యారంగానికీ విస్తరించాయి.

## 1857 తిరుగుబాటు

ఈ విధమైన రెండవదశ అనంతరం మూడవదశ ప్రవేశించింది. 1857లో తిరుగుబాటు సంభవించింది. 18వ శతాబ్దం పొడవునా సైనిక దాడులు, తిరుగుబాట్లు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. వరదలు, కరువులు, వ్యాధులు, రాజకీయ అస్థిరతలు, ఖాళీ కోశాగారాలు సర్వసాధారణమయాయి. కొత్త రెవెన్యూ వ్యవస్థలో యజమానులు భూములను కోల్పోయారు. హిందూ మతాధికారులకు అద్దె లేకుండా ఉచితంగా లభిస్తుండిన భవనాలను ప్రభుత్వం స్వాధీనపరచుకోవటం పలువురికి ఆగ్రహం కలిగించింది. ఆ విధంగా 1813 తర్వాత భారతీయులతో బ్రిటిష్‌వారి సంబంధాలు నాటకీయంగా మారిపోయాయి. క్రైస్తవం మొత్తం దేశాన్ని ఒక అగ్ని పర్వతంగా మార్చి వేసింది. అది ఇక ఎప్పుడైనా పేలవచ్చు.

సరిగా అప్పుడు కొవ్వు పూసిన తుపాకీ తూటా ఉదంతం చోటు చేసుకుంది. ఆ దరిమిలా మీరట్‌తో ఆరంభించి జరిగిందేమిటో తెలిసిందే. చివరకు మరుసటి సంవత్సరం 1858లో ఈస్టిండియా కంపెనీ నుంచి అధికారాన్ని స్వీకరించిన విక్టోరియా రాణి, హిందూ మతంలో జోక్యంవల్ల కలిగే ఉపద్రవమేమిటో గ్రహించి, మిషనరీలను ఉపసంహరించుకో వలసిందిగా ఆదేశించింది. తమ విశ్వాసాలు పౌరులపై రుద్దబోమని ప్రకటించింది. కాని అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోయింది. మరొకవైపు, స్వయంగా ప్రభుత్వ అధికారులే మిషనరీల ధోరణిని అలవరచుకొని భారతీయులపట్ల క్రైస్తవులైన పాలనాధికారుల పద్ధతిలో వ్యవహరించటం మొదలైంది.

## బ్రిటిష్ పాలనలో హిందువులు

తూటాలను సైనికులు ఆ విధంగా అనుమానించటానికి 1756-1857 మధ్య వందేళ్ళ కాలంలో బ్రిటిష్ వారికి, భారతీయులకు మధ్యగల మతపరమైన సంబంధాలు కారణం. బ్రిటిష్ వారి రాక తర్వాత మొదటిదశలో (సుమారు 1750 నుంచి 1813)లో రాజకీయాలు ఎట్లున్నా బ్రిటిష్‌వారు హిందూమతాన్ని, ఇస్లాంను కూడా గౌరవించారు. క్రైస్తవ మతానికి, ఈ రెండు మతాలకు మధ్య చర్చలు జరుగుతుండేవి. అయితే ఇవి తరచు మతాంతరీకరణలకు దారితీసాయి. దానితో క్రమంగా ఉద్రిక్తతలు తలెత్తాయి. హిందూ మతం మతాంతరీకరణలు జరపదు. ఆ స్థితిలో మిషనరీలు ఆ పనిచేయటం,

క్రైస్తవంలోకి వివిధ కారణాలవల్ల మారినవారు తిరిగి హిందూమతంలోకి మారటం తేలిక కాకపోవటం సమస్యలను సృష్టించింది.

ఈస్టిండియా కంపెనీ చట్టాన్ని పునర్నవీకరించిన 1813 నుంచి రెండవ దశ ఆరంభమవనుండగా, భారతీయులతో జాగ్రత్తగా వ్యవహరించాలని మేజర్ జనరల్ సర్ థామస్ మన్రో కంపెనీ డైరెక్టర్లను హెచ్చరించాడు. కాని వారు ఆ మాటలను పెడచెవిన పెట్టారు. భారతీయులను, వారి మతాన్ని కూడా హీనంగా చూడసాగారు. మూడవ దశలో పరిస్థితి మరింత క్షీణించింది. హిందూ-ముస్లిం సంబంధాలలో బ్రిటిష్ వారి జోక్యం నిప్పుకు ఉప్పు వంటిదయింది. వారి సంబంధాలు చెడిపోయేందుకు బ్రిటిష్ అధికారులు చాలా చేసారు. పరిస్థితి సారాంశాన్ని చెప్పాలంటే మొదటి దశలో భారతీయుల పట్ల, ఇక్కడి మతాలపట్ల సహనం చూపిన బ్రిటిష్‌వారు రెండవ దశలో అసహనాన్ని, మూడవ దశలో శత్రుత్వాన్ని ప్రదర్శించారు. ఓరియెంటలిజం అనే విధానంలోని మూడు దశలివి. అందుకు తగినట్లు మొదటి దశలో భారతీయ భాషలను నేర్చుకుని అనేక గ్రంథాలను అనువదించారు. ఇక్కడి కళలను సంస్కృతిని తగినంత అభిమానించారు. ఈ వైఖరిని భారతీయులు కూడా ప్రశంసించారు. అటువంటి స్థితి చివరకు 1857 నాటికి ఉభయుల మధ్య మత సంబంధాల పరంగా కూడా వికటించి, కొవ్వు పూసిన తూటాలు హిందువులను, ముస్లిములను కూడా మొదటి తిరుగుబాటుకు పురికొల్పాయి.

భారతదేశంలో సతీ సహగమన సంప్రదాయం బ్రిటిష్‌వారి రాకకు ముందు నుంచే ఉండేది. మహా భారతంలో ఈ ఉదంతాలున్నాయి. ఆ కాలపు ఇతర గ్రంథాలలోనూ కనిపిస్తాయి. తర్వాత ముస్లిముల పాలనా కాలంలో రాజపుత్ర స్త్రీలు ఇదే సంప్రదాయాన్ని పాటించేవారు. క్షత్రియులతో ఆరంభమైన ఈ సంప్రదాయం క్రమంగా బ్రాహ్మణులకు, ఇతర కులాలవారికి కూడా వ్యాపించింది. ఉదాహరణకు బెంగాల్‌లో ఒక్క 1823లోనే 25 మంది క్షత్రియ స్త్రీలు, 234 మంది బ్రాహ్మణ, 14 మంది వైశ్య, 292 మంది శూద్ర స్త్రీలు సతికి పాల్పడినట్లు లెక్కలున్నాయి. హిందువుల దృష్టిలో తన భర్త జీవించి ఉండేట్లు చూసే బాధ్యత భార్యది. ఒకవేళ భర్త ముందు మరణిస్తే ఆమె తన బాధ్యతలో విఫలమైందన్న మాట. కనుక తర్వాత జీవించి ఉండటం ఆమెకు గౌరవప్రదమైంది కాదు. భర్తతోపాటు మరణించినట్లయితే ఆమెకు వైధవ్యం సోకదు కూడా. అయితే ఇటువంటివి పలు నిర్వచనాలున్నాయి. మరొకవైపు స్త్రీలు మనస్ఫూర్తిగా సతిని ఆచరించారా లేక వారిని చితిలోకి బలవంతంగా ఎక్కించారా అనే దానిపై కూడా భిన్నమైన కథలున్నాయి. మతపరమైన, సామాజికమైన, కుటుంబాలు, చివరకు ఆస్తులపరమైన భిన్న పరిస్థితులు సంప్రదాయంతో ముడిపడ్డాయి.

ఇటువంటి పరిస్థితుల మధ్య రాజారామమోహనరాయ్ (1774-1833) అనే బెంగాలీ బ్రాహ్మణుడు సతి ఆచారాన్ని వ్యతిరేకిస్తూ మాట్లాడాడు. అనేక భాషలు తెలిసి,

అనేక మత గ్రంథాలను అధ్యయనం చేసిన ఆయన అవన్నీ ఒకటేనన్నాడు. బ్రాహ్మణ సంప్రదాయాలను అనుసరిస్తూనే స్త్రీ విద్యను, వారి ఆధునీకరణను కోరాడు. సతిని వ్యతిరేకిస్తూ రెండు రచనలు చేశాడు. బ్రిటిష్ ప్రభుత్వం 1829లో సతిని నిషేధించటంపై ఆయన ప్రభావం కూడా ఉందనాలి. రామ్మోహనరాయ్ బ్రహ్మ సమాజ వ్యవస్థాపకుడు కూడా. తన తర్వాత ఆ సంస్థ నాయకుడైన దేవేంద్రనాథ టాగూర్, ఆయన కుమారుడు రబీంద్రనాథ టాగూర్ కూడా అదే వైఖరి తీసుకున్నారు. దేవేంద్రనాథ్ అనంతరం నాయకుడైన కేశబ చంద్రసేన్ బ్రహ్మ సమాజంలో కుల పరిగణనలను రద్దుచేసి, స్త్రీలను సభ్యులుగా చేర్చుకోవటం కూడా చేసాడు.

సతీ సంప్రదాయంపట్ల హిందువులలో భిన్నాభిప్రాయాలుండటం సరేసరి కాగా, బ్రిటిష్ అధికారులలో కొందరు హిందువుల మత విషయాలలో జోక్యం చేసుకోరాదన్నారు. మరికొందరు అది అమానుషం అయినందున, స్త్రీలకు వ్యతిరేకం గనుక సంస్కరణలు అవసరమని భావించారు. వాస్తవానికి అక్బర్, జహంగీర్ వంటి వారు కూడా సతీ సహగమనంపై ఆంక్షలకు ప్రయత్నించారు. ఎట్టకేలకు బ్రిటిష్ ప్రభుత్వం 1829లో సతిని నిషేధిస్తూ చట్టం చేసింది. అది మానవ హక్కులకు భంగకరమని పేర్కొంది. అయినప్పటికీ ఆ సంప్రదాయం నిలిచిపోలేదన్నది వేరే విషయం. అధికారులు కూడా, అగ్రవర్ణ హిందువుల వత్తిడికి లొంగి కొన్ని షరతులపై సతిని అనుమతించసాగారు.

## దయానంద సరస్వతి

ఆర్య సమాజ స్థాపకుడైన దయానంద సరస్వతి (1824–1883) తన బోధనలకు వేదాలు ఆధారమన్నాడు. తదనంతర హిందూ కావ్యాలపై క్లిష్టమైన పరిశీలనలు చేసి విగ్రహారాధన, బలులు, బహు దేవతారాధనలను వ్యతిరేకించాడు. ముస్లిములుగా మారిన హిందువులు తిరిగి హిందువులయేందుకు 'శుద్ధి' కార్యక్రమాన్ని ప్రారంభించాడాయన. గతంలో హిందువులు కానివారిని కూడా ఇదే పద్ధతిలో హిందూమతంలోకి మార్చసాగారు. పారియా కులాలకూ ఇది వర్తింపజేశారు. తమను తాము హిందువులని గాక ఆర్యులని పిలుచుకున్నారు. ఆర్యులు వైదిక మతాన్ని అనుసరించారన్నది వారి నమ్మకం.

దయానందుడు గోసంరక్షణ కోసం 1882లో ఒక కమిటీని నియమించాడు. దాని శాఖలు బ్రిటిష్ ఇండియా అంతటా ఏర్పడ్డాయి. గోహత్యకు వ్యతిరేకంగా మొదటి ఆందోళన పంజాబ్‌లో జరిగింది. గోవు పవిత్ర ప్రాణి ఏమీ కాదని, గోవులను వధించిన ముస్లిములు హిందూమతాన్ని అగౌరవపరచినట్లు భావించలేమని, అటువంటి ముస్లిములకు పోలీసుల రక్షణ కల్పించాలని 1888లో అలహాబాద్‌లోని బ్రిటిష్ కోర్టు ఒకటి తీర్పు చెప్పింది. గోవులను చంపిన పారియాలపై, ముస్లిములపై గోరక్షణ కమిటీలు దాడులకు పాల్పడుతుండేవి. ఈ అంశంపై కొన్నిసార్లు మత కలహాలు కూడా జరిగాయి.

అధ్యాయం 20

# వర్తమానంలో గతం

## (1950- )

వర్తమాన కాలంలోని హిందువుల రాజకీయ పరిస్థితులకు చరిత్ర ఎంతవరకు వర్తిస్తున్నదనేది ఈ అధ్యాయంలో చూద్దాము. వేదాలలో, బ్రాహ్మణాలలో గల కథనాలు కొన్నింటిని మహాభారతంలో, పురాణాలలో తిరిగి చెప్పటాన్ని మనం చూసాము. అందులో వైవిధ్యతలు కూడా కనిపిస్తాయి. అదే పద్ధతిలో, గతాన్ని వర్తమానానికి వర్తింపచేయటంలో కూడా మనం వైవిధ్యతలను గమనించవచ్చు. అయితే ఇది ఒక పద్ధతిలో జరగలేదు. ఉదాహరణకు ఒక అంశానికి గతంలో గల అర్థం ఇపుడు మారిపోయి ఉండవచ్చు. కొన్ని విషయాలు యథాతథంగా ఉండిపోయాయి. మరికొన్ని మారాయి, మారలేదు కూడా. ఉదాహరణకు స్త్రీలు, దళితులకు అనేక హక్కులు లభించినా పలు విషయాలలో ఒకప్పటి అణచివేతల పరిధిలోనే ఉండిపోయారు.

వేదాలలో బలులకు సంబంధించి జంతువులను ఊపిరాడకుండా చేసి బలివ్వటం, జంతువులకు బదులు పిండి బొమ్మలను తయారు చేయటం రెండూ కన్పిస్తాయి. ఇది ఇప్పటికీ ఉంది. బ్రాహ్మణులు జంతువులకు బదులు పిండి బొమ్మలను, కొబ్బరికాయలను ఉపయోగించగా, నిమ్నకులాలవారు జంతుబలి చేస్తారు. అది వారి ఆహార విధానాలతో ముడిపడి జరుగుతున్నది.

హింసలేని నైవేద్యం ఇవ్వాలనే వైదిక సంప్రదాయ ప్రభావం గోవులపట్ల గల దృష్టిని కూడా ప్రభావితం చేస్తున్నది. అయితే ఇపుడిది నైవేద్యం అనే భావనతో నిమిత్తం లేకుండా గోవు పవిత్రమైనది గనుక దానిని రక్షించాలనే విశ్వాసంగా మారింది. గోపూజ సర్వసాధారణంగా మారింది. పలురాష్ట్రాలలో గోవధపై నిషేధం ఉన్నందున గోమాంసం తినేవారు కూడా వాటిని బహిరంగంగా వధించరు. అదే సమయంలో ముసలివి, వట్టిపోయిన ఆవులను ఎవరికో అమ్మటం, వాటిని వారు కబేళాలకు తరలించటం జరుగుతున్నదే.

కుక్కలను హీనమైన జంతువుగా పరిగణించటం గతంలో వలెనే ఇప్పటికీ ఉంది. అయితే తాంత్రిక సంప్రదాయాల కాలంలో శివుడిని భైరవునిగా పూజించారు. నేటికీ దేశంలో అనేకచోట్ల భైరవ దేవాలయాలుండగా, వాటిలో పూజలు సాగుతూనే ఉన్నాయి. అక్కడ శునకాల విగ్రహాలతో పాటు సజీవ శునకాలను కూడా పూజిస్తారు.

మోక్షమనే భావన వర్తమానంలో నిమ్న వర్గాల వారికి ఉన్నట్లు తోచదు. వారిని సామాజిక శాస్త్రవేత్తలు, రచయితలు కదిలించినపుడు వారి స్పందనలు ప్రతిసారి ఇదే

విధంగా ఉంటున్నాయి. వర్తమానంలో గతం అని ఆలోచించినపుడు అయోధ్య వివాదం, భారతదేశానికి – శ్రీలంకకు మధ్య రాముడు నిర్మించాడనే వారధి వివాదం తెలిసినవే. అవి రాజకీయ రూపం తీసుకున్నాయన్నమాట. మరొక వైపు ఏకలవ్యుడు, లక్క ఇంటిలో నిషాదుల దహనం వంటి ఉదంతాలు దళిత ఉద్యమకారులకు ప్రచార ఆయుధాలుగా మారాయి. జ్యోతిబాఫూలే విష్ణువు అవతారాలకు భారతదేశాన్ని జయించిన ఆర్యుల రూపాలుగా నిర్వచనం చెప్పటం విశేషం. ఆయన విష్ణువు శత్రువులైన అసురులను ప్రజల నాయకులుగా చూపాడు. ఇటువంటివే అనేకానేక విశ్వాసాలు, సంప్రదాయాలు, నిర్వచనాలు, పునర్నిర్వచనాలు, రాజకీయాల రూపంలో భారతదేశపు గతం వర్తమానంలోనూ నివసిస్తున్నది. కొన్ని మరుగునపడి, కొన్ని మార్పులకు లోనైనా గతం పూర్తిగా గతం కావటమన్నది మాత్రం జరగలేదు. అది సహజమే కూడా.

## అధ్యాయం 21

# ముగింపు లేదా చరిత్ర దురుపయోగం

*అన్ని విశ్వాసాలను అమోదించే విశాల దృష్టి, ఔదార్యం, సహనశీలత, సత్యనిష్ఠ, త్యాగ నిరతి, సకల జీవరాశుల పట్ల ప్రేమ అన్న లక్షణాలు, పాశ్చాత్య ప్రభావాలతో విషపూరితంకాని సగటు హిందువులకు గల భావనలు. అవి హిందూ సంస్కృతి ఘనతకు నిదర్శనం... హిందూ స్థాన్‌లోని హిందూయేతరులు ఈ భూమి పట్ల తమ అసహనాన్ని, కృతజ్ఞతా రాహిత్యాన్ని విసర్జించటమే కాదు... కాని, తప్పక... హిందూజాతికి పూర్తిగా విధేయులై ఈ దేశంలో నివసించాలి. వారేమీ హక్కులు కోరరాదు. ప్రాధాన్యతలను అంతకన్నా ఆశించరాదు. చివరకు పౌరహక్కులనుకూడా.*

– మాధవ సదాశివ గోల్వాల్కర్ (1906–1973)

*నాకు హిందూమతం గురించి అసలేమైనా తెలిసి ఉంటే, అది ప్రధానంగా అందరినీ కలుపుకొని పోతుంది. అది నిరంతరం విస్తరించేది, పరిస్థితులకు ఎప్పటికప్పుడు స్పందించే లక్షణాలు గలది. ఊహాత్మక భావనలకు, ఆలోచనలకు, తర్కానికి, సహేతుకతకు పూర్తి అవకాశాన్నిస్తుంది... హిందూమత పరిరక్షకులుగా పరిగణింపబడే పూజారుల చుట్టూ పేరుకుపోయిన దురభిప్రాయాలను, మూఢనమ్మకాల భావనలను బంగారు త్రాసులతో తూచటం అసాధ్యమైన పని.*

– మహాత్మాగాంధీ (1869–1948)

హిందూ మతంలో చాలావరకు గల సృజనాత్మకమైన వైవిధ్యతలకు ఆర్ఎస్ఎస్ నాయకుడు గోల్వాల్కర్ 1939 లో అన్న మాటలు భిన్నమైనవి. తన ప్రకటనలోని మొదటి భాగం తగినంత విలువగల చారిత్రక సత్యం. కాని రెండవ భాగంలోని రాజకీయ అజెండా ఆ మొదటి భాగానికి విరుద్ధమైనది. హిందువుల సహనశీలన గురించిన గర్వం సరైనది కాగా, ఆయన మతపరమైన అసహనాన్ని సమర్థించుకునేందుకు దానిని ఉపయోగించు కుంటున్నాడు. ఆర్ఎస్ఎస్‌కు ఎంతమాత్రం సరిపడని గాంధీ రెండు మాటలు చెప్పాడు. వాటి మధ్య వైరుధ్యం లేదుగాని కొంత సమస్య ఉంది. హిందూ మతంలో అందరినీ కలుపుకుని పోయే తత్త్వం, ఊహాత్మకశక్తి ఉందని అంగీకరిస్తూనే దానిని హిందూ యేతరులతో పోల్చి చెప్పటం గాక బ్రాహ్మణులతో పోల్చుతున్నాడు. బ్రాహ్మణులకు దళితులపట్ల, ముస్లిముల పట్ల గల వ్యతిరేక భావనలను ఆయన తన జీవిత కాలమంతా నిరసించాడు. హిందూమతం సహనశీలమైనదని, అందరినీ కలుపుకుని పోతుందన్న వాస్తవాన్ని ఈ రోజున పలువురు హిందువులు చెప్పుకోవటమేకాదు. అది చట్టాలలో

భాగమైంది. తరచుగా అసహనాలు తలెత్తుతున్నా, కొందరిని వెలివేసినా ఇదికాదనలేని వాస్తవం. హిందువుల చరిత్రలోని ఈ పరస్పర విరుద్ధ పరిస్థితులను మనం ఏ విధంగా అర్థం చేసుకోవాలి?

భారతదేశపు మహాశక్తివంతమైన అణ్వస్త్రాలలో ఒకదానిపేరు అగ్ని. అది వేదకాలపు దేవతలలో ఒకరిపేరు. పాకిస్థాన్ క్షిపణిపేరు ఘోరిడ్. అది మహమ్మద్ ఘోరీ నుంచి తీసుకున్నది. పరస్పర వైరంగల ఈ రెండు దేశాలు తమ అణ్వస్త్రాలకు వేదకాలం, పదకొండవ శతాబ్ది నాటి చరిత్రకాలపు పేర్లను ఎందుకు పెట్టాలి? మత పరమైన అసహనానికి చరిత్రతోగల సంబంధం ఏమిటి?

భారతదేశానికి సంబంధించి భవిష్యత్తే కాదు, గతం గురించి కూడా జోస్యం చెప్పలేము. మీరు ఈ పుస్తకాన్ని ఇంతవరకు చదివి ఉన్నట్లయితే ఒక్క ముఖ్యమైన విషయం బాగా అర్థమై ఉంటుంది. వర్తమాన భారతదేశంలోని ఏ అంశానికి అనుకూలంగానైనా సరే చరిత్రను ఉపయోగించుకుని వాదించవచ్చు. హిందువులు మాంసాహారులనవచ్చు, శాకాహారులనవచ్చు. హిందువులు ముస్లిములు కలిసి మెలిసి జీవించారనగలం, కాదనగలం. సతీసహగమనాన్ని అనుకూలించారనవచ్చు, వ్యతిరేకించారనవచ్చు. భౌతిక ప్రపంచాన్ని ప్రేమించారని, సన్యసించారని కూడా వాదించగలం. స్త్రీలను, నిమ్నకులాల వారిని అణచివేసారన్నా, వారి సమానత్వం కోసం పోరాడారన్నా నిజమే అవుతుంది. చరిత్ర పొడవునా, వర్తమాన రాజకీయాల వరకు కూడా, వేర్వేరు హిందూ శాఖలకు, హిందువులకు మధ్యగల భిన్నత్వాలు, ఘర్షణాత్మక స్థితులు సంప్రదాయాన్ని పటిష్టం చేస్తూ గణించలేనంత కష్టనష్టాలను కలిగించాయి.

చరిత్రను దుర్వినియోగం పరచటమన్నది కేవలం దుర్వినియోగానికి సంబంధించిన ప్రశ్నకాదు. భవిష్యత్తు గురించి అందరూ ఇంతగా ఆలోచిస్తున్న యుగంలో వర్తమానాన్ని సమర్ధించుకునేందుకు ఇంకా గతంలోకి ఎందుకు వెళతారన్నది సమస్య. వాస్తవానికి ఇది అమెరికన్ల విషయంలోనూ కన్పిస్తుంది. వారు తరచు అమెరికన్ రాజ్యాంగం గురించి, తగినంత స్పష్టతలేని ఆ రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశాల గురించి మాట్లాడుతుంటారు. ఇంతకూ వారి చరిత్రకు కొద్ది వందల సంవత్సరాలే. హిందువులది వేల సంవత్సరాల చరిత్ర. చరిత్ర పట్ల వారి దృష్టి మరింత గాఢమైనది.

మనం (హిందువులం, హిందూయేతరులం కూడా) గతకాలపు పొరపాట్లనుంచి నేర్చుకోవచ్చు. కాని తరచూ జరిగేది గతం గుర్తుంటూనే తిరిగి అవే పొరపాట్లు చేయటం. బహుశా గతం గుర్తున్నందుకే ఆ పని చేస్తుంటామేమో. ఒకోసారి భవిష్యత్తును మనం గుర్తుంచుకున్నవాటి ఆధారంగా కాక, మరిచిపోయిన వాటిని బట్టి నిర్మించుకుంటాము. గతాన్నించి వాస్తవిక దృష్టితో నేర్చుకోగలమనే మనశక్తి పట్ల గల నమ్మకాన్ని మనం కోల్పోయాము. జ్ఞాపకాలన్నవి మన పక్షాన లేవు కూడా. పగతీర్చుకోవటమనే ఆలోచనకు

గల శక్తి కారణంగా మనలో మంచి జ్ఞాపకాలు నశించి చెడు జ్ఞాపకాలే ముందుకొస్తున్నాయి. ఒకోసారి మరపుల వల్లనే మంచి జరుగుతుంది. వ్యక్తులు, సమూహాలు లోగడ అప్పటి పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకున్నట్లే ఇపుడు కూడా జరగాలి. అందుకు చరిత్రను గాక మానవతను, ప్రజల ప్రస్తుత అవసరాలు ఏమిటనే దానిని ప్రాతిపదిక చేసుకోవాలి.

"తగిన ఆలోచనాశక్తి లేనివారిని కాపాడేందుకు ప్రతి యుగంలో ఒక యేసుక్రీస్తు హింసలననుభవించి మరణించాలా?" అని జార్జ్ బెర్నార్డ్‌షా నాటకం సెయింట్ జోన్ ముగింపులో జోన్ దుఃఖిస్తాడు. ఆలోచనలు చేసేందుకు చరిత్ర అన్నది తప్పకుండా ఒక ముఖ్యమైన ఆధారం. మనం ఆలోచిస్తున్నామని గుర్తించగలిగేది కూడా ఆ విధంగానే. ఎప్పటికప్పుడు కొత్త పరిస్థితులకు అన్వయించుకునే అవకాశం హిందూమతంలో ఎంతో గొప్పగా ఉంది. అటువంటి హిందూ సంప్రదాయం గురించిన మన పరిజ్ఞానాన్ని తగు విధంగా ఉపయోగించుకోకపోవటమంటే ఆ పరిజ్ఞానాన్ని వృథా చేయటమే. చరిత్రలో అనేకానేక పరిస్థితులను తట్టుకుని నిలబడటం, తగు విధంగా పరివర్తనలు చెందటం ఈ గొప్ప నాగరికత లక్షణం. అది ఎప్పటికప్పుడు కొత్త మార్గాలను కనుగొనగలిగింది. ఫలానాది ఆమోదయోగ్యం కాదని తీర్పు చెప్పేందుకు అక్కడ పోప్ వంటి వారెప్పుడూ లేరు. కాని దురదృష్టవశాత్తు ఇపుడు కొందరు అటువంటి క్రిస్టియన్ వ్యవస్థను హిందూ మతంలోకి తేజూస్తున్నారు. అది జరగకుండా నిరోధించేందుకు ఇప్పటికే పలువురు గొంతెత్తుతున్నారు. మనం ఆశపెట్టుకోగలిగింది వారిపైనే.

భారతదేశపు సుదీర్ఘమైన, సంక్లిష్టమైన, వైవిధ్యతల చరిత్రలోని విజయాలనుంచి మనం నేర్చుకోవలసింది చాలా ఉంది. కాల్పనిక గాథలలోని జనశ్రుతి రాజు, యుధిష్ఠిరుడు, చూదల వంటివారినుంచి, చారిత్రక వ్యక్తులైన అశోకుడు, హర్షుడు, అక్బర్, మహదేవ్యక్క, కబీర్, గాంధీల నుంచి నిజమైన సహనశీలత, వైవిధ్యతలు గల హిందూ శ్రేణుల నుంచి మనం గ్రహించగలది ఎంతైనా ఉంది. వ్యవస్థీకృత ఆధిపత్యాలను, హింసను నిరాకరించిన భక్తి ఉద్యమం వంటి వాటి నుంచి లభించగల ఆత్మ విశ్వాసం ఎంతైనా ఉంది. ఈ ఉద్యమాలలో మహిళలకు, దళితులకు కూడా భాగస్వామ్యం ఉంది. వాటిలో ప్రేమ భావం ఉంది.

# కృతజ్ఞతలు

ఈ గ్రంథ రచన నా విద్యార్థుల వల్లనే సాధ్యమైంది. కనుక ఇది వారికోసమే. ఈ రచన కోసం నాకు స్ఫూర్తి కలిగించిందివారు. అనేక ఆలోచనలను అందించిందివారు. పుస్తకానికి సంవత్సరాల పాటు ఒకటి తర్వాత ఒకటిగా ముసాయిదా ప్రతులు తయారుచేస్తూ వాటిని క్లాసులో బోధిస్తూ పోతుంటే, ఆ విషయాలపై గుచ్చి గుచ్చి నేను జవాబులు చెప్పలేని ప్రశ్నలు అడిగిందివారు. నా దృష్టికి రాని పుస్తకాలు, వ్యాసాలను తెచ్చి నన్ను వాటితో ముంచెత్తిందివారు. ఈ పుస్తకానికి సరైన శ్రోతలు కూడా వారే. వారిలో కొందరు నాకు నిర్దిష్టమైన రూపాలలో సహకరించారు కూడా. వారికి (అక్షర క్రమంలో) కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను: ఢిల్లీ సల్తనేట్, మొఘల్స్‌పై మన్నన్ అహమద్; సూఫీలపై ఆదిత్య బహల్; మహాభారతంపై బ్రియాన్ కాలిన్స్; బ్రిటిష్ పాలనపై విల్ ఎలిసన్; వర్తమాన భారతదేశం, అమెరికాలపై అమందా హఫర్; ఢిల్లీ సుల్తానేట్, ముఘల్స్‌పై రాజీవ్ కిన్రా; దక్షిణ భారతదేశంపై అజయ్ రావ్; రామాయణంపై ఆర్షియా సత్తార్. ఇతరులు ఇంకా విస్తృతమైన రీతిలో తోడ్పడ్డారు. వారు: అందుబాటులో లేని వివరాలు, గ్రంథాల కోసం జెరెమీ మోర్స్ శ్రమపడి వెతకటమే గాక కంప్యూటర్ మొరాయించినపుడల్లా దారికి తేవటంలో చాలా సహాయపడింది. లారా డెస్మండ్ మొత్తం పుస్తకపు తొలి ముసాయిదాలు చదివి ప్రతి అధ్యాయం గురించి నాతో చదివింది. ఆలోచనలను మౌలికంగానే మార్చగల వ్యాఖ్యలు చేసింది. శాస్త్రాల గురించిన అధ్యాయానికి నేపథ్యాన్ని తయారు చేసి పెట్టింది. చంద్రునిలో కుందేలు బొమ్మను చిత్రించింది బ్లేక్ మెంట్‌వర్త్. ఆమె ఎక్కడనో మారుమూలన గల కావ్యాలను చిత్రాలను వెతికిపట్టుకుంది. భక్తి గురించి అధ్యాయంపై అనేక ముసాయిదా పాఠాలు చదవటమే గాక దక్షిణ దేశం గురించి నాకు చాలా చెప్పింది. తొలి ముసాయిదాను చదివి వివరంగా స్పందించిన గురుచరణ్ దాస్‌కు, డోన్నా వుల్ఫ్‌కు, బ్రౌన్ యూనివర్సిటీలోని ఆమె విద్యార్థులకు కృతజ్ఞతలు. అదే విధంగా మహా జాగ్రత్తగా ప్రూఫ్‌లు దిద్దిన మైక్ ఓప్లాహిర్టేకి.

ఈ రచన తొలి దశలలో ఉండగా సలహాలిచ్చిన స్కాట్ మోయెర్స్‌కు, ప్రతి అధ్యాయాన్ని చదివి నాకు బహుశా వెయ్యేళ్లలో కూడా తట్టని అద్భుతమైన ఆలోచనలను చెప్పిన లోరేన్ డాస్టన్‌కు, ఈ వ్యవహారమంతా చక్కబెట్టుకోవటంలో బిగ్ సుర్ వద్ద నాకు వారం రోజుల పాటు సహకరించిన మైక్ మర్ఫీకి, ఎంతో ఓపికగా నాకు తోడ్పడిన నికోల్ హ్యూన్‌కు, ప్రచురణకు సంబంధించిన అన్ని విషయాలలో ఎంతో సమర్థురాలైన నా ఏజెంట్ ఎమ్మా స్వీనీకి, ఈ రచనలో నన్ను ప్రోత్సహించటమేగాక నాకు సహకంరించిన

విద్యార్థులకు పారితోషికం కోసం నిధులు సమకూర్చిన షికాగో యూనివర్సిటీలోని డివినిటీ స్కూల్ డీన్ రిఛర్డ్ రోజెన్‌గార్టెన్‌కు, ఇండాలజీ ఎడిటర్ కేథరిన్ ఐరీన్ ఉల్రిక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

కేథరిన్ ఉల్రిక్ నేను రాసిన సుదీర్ఘమైన ముసాయిదా పాఠాలు అనేకం చదివి ఎన్నో పొరపాట్లను, శైలిలోని లోపాలను, అస్పష్టతలను ఎత్తి చూపింది. చదవవలసిన పుస్తకాలు, వ్యాసాలేమిటో దృష్టికి తెచ్చింది. తగిన ఆధారాలు లేకుండా ఒక అభిప్రాయానికి వచ్చినప్పుడు దానిని ప్రశ్నించింది. నన్ను ప్రశంసిస్తూనే అరమరికలులేని వ్యాఖ్యలు చేసింది. వాటిలో హాస్య స్ఫోరకమైనవీ ఉన్నాయి. అంతేగాక నా ఇంగ్లీష్ పుస్తకం ముఖ చిత్రంగా ఉపయోగించిన చిత్రాన్ని భారతదేశంలో కనిపెట్టి, ఖరీదు చేసి తీసుకువచ్చింది కూడా తనే. ఈ గ్రంథాన్ని ఆమెకు, విలియం డాల్రింపుల్‌కు అంకితమిస్తున్నాను. లండన్ సమావేశంలో ఎవరో నాపై కోడిగుడ్డు విసిరినపుడు నా పక్కన ఉండిన డాల్రింపుల్, తర్వాత తను రాసిన ఒక వ్యాసంలో హిందూమత చరిత్రను కొత్త విధానంలో చెప్పవలసిన అవసరం ఉందంటూ సవాలు విసిరాడు. తను ఇచ్చిన ప్రోత్సాహానికే గాక, తన రచనలను ఉదాహరణప్రాయంగా నిలిపినందుకు కూడా నేనాయనకు కృతజ్ఞురాలిని. తను రాసే పద్ధతి భారతదేశపు చరిత్రను వేర్వేరు నేపథ్యాలుగల పాఠకులందరి ఎదుటకు సజీవంగా తీసుకుని వస్తుంది. అటువంటి రచనలకు జీవాన్ని, అర్థాన్ని ఇవ్వగల ముఖ్యమైన అంశాలను ముందుకు తెస్తుంది.

**వెండీ డోనిగర్**
ట్రూరో, ఆగస్టు 2008

# కాలక్రమణిక

**క్రీ.పూ.**

| | |
|---|---|
| సుమారు 50,000 | శిలాయుగ సంస్కృతి ఆవిర్భావం |
| సుమారు 30,000 | భీమ్ బెట్కా గుహా చిత్రాలు |
| సుమారు 6,500 | వ్యవసాయానికి ఆరంభం |
| సుమారు 4000–3000 | ఇండో –యూరోపియన్ భాషల విభజన |
| సుమారు 3000 | పశువులను మేపే సంచారజాతి సమాజాలు ఆవిర్భావం |
| సుమారు 2500 | సింధూ వెంట నగర సమాజాలు |
| సుమారు 2200–2000 | ఉచ్ఛస్థితిలో హరప్పా నాగరికత |
| సుమారు 2100–2000 | తేలికపాటి చక్రపుటాకులుగల రథాల తయారీ |
| సుమారు 2000–1500 | సింధూ నాగరికత క్షీణ దశ |
| సుమారు 1900 | వట్టిపోయిన సరస్వతీ నది |
| సుమారు 1700–1500 | వాయవ్య భారతానికి అశ్వాలరాక |
| సుమారు 1700–1500 | పంజాబ్‌లో రుగ్వేదరచన |
| సుమారు 1350 | హిట్టైట్ లిపిలో గల ఆధారాలలో అశ్వాలు, దేవతల ప్రస్తావన |
| సుమారు 1200–900 | యజుర్, సామ, అథర్వ వేదాలను రచించిన వైదిక జనులు |
| సుమారు 1100–1000 | వైదిక రచనలలో గంగా–యమునల మధ్యగల దొవాబ్ ప్రస్తావన |
| సుమారు 1000 | వత్స రాజ్యంలో కౌశాంబీ నగరస్థాపన |
| సుమారు 950 | మహాభారత యుద్ధ కాలమని భావన |
| సుమారు 900 | కాశీ (వారణాసి, బెనారస్) నగర స్థాపన |
| సుమారు 900 | గంగా నదీలోయ ప్రాంతంలోకి తరలివెళ్లిన వైదిక ప్రజలు |
| సుమారు 800–600 | బ్రాహ్మణాల రచన |
| సుమారు 600–500 | అరణ్యకాల రచన |
| సుమారు 500 | శ్రౌత సూత్రాల రచన |
| సుమారు 500 | పాటలీపుత్ర నగర స్థాపన. క్రమంగా దక్షిణంవైపు వైదిక జనుల ప్రయాణం |
| సుమారు 500–400 | తొలి ఉపనిషత్తుల రచన |
| సుమారు 483 లేదా 410 | బుద్ధుని మరణం |
| సుమారు 468 | జైన మత స్థాపకుడైన వర్ధమాన మహావీరుని మృతి |

| | |
|---|---|
| సుమారు 400–100 | అనంతర ఉపనిషత్తుల రచన |
| సుమారు 400–100 | గంగానదీలోయ ప్రాంతంలో లిపి ఉపయోగం |
| సుమారు 327–325 | వాయవ్య భారతంపై అలెగ్జాండర్ దండయాత్ర |
| సుమారు 324 | మౌర్య వంశాన్ని స్థాపించిన చంద్రగుప్తుడు |
| సుమారు 300 | గృహ్య సూత్రాల రచన |
| సుమారు 300–100 | ధర్మసూత్రాల రచన |
| సుమారు 300 | గ్రీకులు, అశోకుని ద్వారా పాండ్యులు, చోళులు, చేరుల ప్రస్తావన |
| సుమారు 265–232 | అశోకుని పాలన |
| సుమారు 250 | పాటలీపుత్రలో తృతీయ బౌద్ధ మహాసంఘ సమావేశాలు |
| సుమారు 185 | అంతమైన మౌర్య వంశం |
| సుమారు 185 | పుష్యమిత్రుని ద్వారా శుంగవంశస్థాపన. 73లో ఆ వంశానికి ముగింపు |
| సుమారు క్రీ.పూ.166– క్రీ. శ. 78 | భారతదేశానికి గ్రీకులు, సిథియన్లు, బ్యాక్ట్రియన్లు, పార్థియన్ల రాక |
| సుమారు క్రీ.పూ. 300 – క్రీ.శ. 300 | మహాభారత రచనా కాలం |
| సుమారు క్రీ.పూ. 200– క్రీ.శ. 200 | రామాయణ రచనా కాలం |

## క్రీ.శ.

| | |
|---|---|
| సుమారు 78–140 | కనిష్కుని పాలన. బౌద్ధానికి ప్రోత్సాహం |
| సుమారు 100 | చంకన్ (సంఘం) కవితా రచన |
| సుమారు 100 | మనుధర్మ శాస్త్ర రచన |
| సుమారు 150 | బార్హుత్, సాంచీ స్తూపాల నిర్మాణం |
| సుమారు 150 | మొట్టమొదట సంస్కృత శిలాశాసనాన్ని జునాగఢ్‌లో వేయించిన రుద్రదమనుడు. |
| సుమారు 200 | కౌటిల్యుని అర్థశాస్త్ర రచన |
| సుమారు 300 | వాత్స్యాయన మల్లనాగుని కామసూత్ర రచన |
| సుమారు 320–550 | పాటలీపుత్ర రాజధానిగా గుప్తుల పాలన |
| సుమారు 350–750 | తొలి పురాణాల రచన |
| సుమారు 375 | పల్లవ వంశస్థాపన |

| | |
|---|---|
| సుమారు 405-411 | ఫాహియాన్ భారత సందర్శన |
| సుమారు 400-477 | కాళిదాసు నాటకాలు, దీర్ఘకావ్యాల రచన |
| సుమారు 450 | హరివంశ రచన |
| సుమారు 455-467 | ఉత్తర భారతదేశంపై హూణుల దాడులు |
| సుమారు 460-477 | వాకాటకుల పాలనలో అజంతా గుహా చిత్రాలు |
| సుమారు 500-900 | నయన్మార్ శైవ తమిళ కవుల కాలం |
| సుమారు 550-575 | ఎలిఫెంటాలో శైవ గుహాలయాన్ని నిర్మించిన కాలచూరులు |
| సుమారు 550-880 | చాళుక్య వంశపాలన |
| సుమారు 600-930 | ఆళ్వార్ వైష్ణవ తమిళ కవులు జీవించిన కాలం |
| సుమారు 606-647 | కన్నౌజ్ రాజధానిగా హర్షుని పాలన |
| సుమారు 630-644 | హ్యూన్ త్సాంగ్ భారతదేశ సందర్శన |
| సుమారు 650-800 | తొలి తంత్రశాస్త్రాల రచన |
| సుమారు 650 | సింధూనది ప్రాంతానికి అరబ్బుల రాక |
| 711-715 | వాయవ్య భారతంపై అరబ్బుల దాడి |
| 750-1500 | మధ్యకాలపు పురాణాల రచన |
| 765-773 | ఎల్లోరాలో కైలాసనాథ దేవాలయాన్ని నిర్మించిన మొదటి రాజకృష్ణుడు |
| సుమారు 820 | కేరళలో అద్వైత సిద్ధాంత ప్రతిపాదకుడు శంకరుడు జీవించిన కాలం. |
| సుమారు 800 | మానిక్కవాచకర్ తిరువాచకం రచన |
| సుమారు 800-1200 | దక్షిణ దేశంలో చోళ సామ్రాజ్య ప్రాబల్యం |
| సుమారు 900-1150 | ఖజురహోలో దేవాలయాలను నిర్మించిన ఛందేలులు |
| సుమారు 975-1025 | కశ్మీర్‌లో నివసించిన శైవ తత్త్వవేత్త అభినవగుప్తుడు |
| 1001 | ఉత్తరభారతంపై ఘజనీ మహమూద్ (979-1030) దాడులు |
| 1021 | లాహోర్ వద్ద ఘజ్నవీడ్ (తురుష్క) ముస్లిం రాజధాని స్థాపన |
| సుమారు 1056-1137 | తమిళ దేశంలో నివసించిన విశిష్టాద్వైత సిద్ధాంతకర్త రామానుజుడు |
| 1192-1206 | ఢిల్లీలో ఘోరిడ్ వంశ రాజధానిని నెలకొల్పిన మహమ్మద్ ఘోరీ |
| సుమారు 1200 | బెంగాల్‌లో నివసించిన జయదేవుడు |
| 1210-1526 | ఢిల్లీ సల్తనేట్ పాలనాకాలం |
| 1325-1351 | మహమ్మద్ బిన్ తుగ్లక్ పాలన |

| | |
|---|---|
| సుమారు 1200 | ఉత్తరదేశంలో తొలి సూఫీ సంప్రదాయాలు |
| సుమారు 1200 | దక్షిణాదిన బసవ, ఇతర వీరశైవులు |
| 1238-1258 | కోణార్క దేవాలయాన్ని నిర్మించిన మొదటి నరసింహదేవుడు |
| సుమారు 1238-1317 | కర్ణాటకలో ద్వైత సిద్ధాంతకర్త మధ్వుడు |
| సుమారు 1300 | మార్జాల, మర్కట సంప్రదాయాలుగా చీలిన శ్రీవైష్ణవులు |
| సుమారు 1336-1565 | విజయనగర సామ్రాజ్య ప్రాభవం |
| సుమారు 1398 -1448 | కబీర్ జీవించిన కాలం |
| 1399 | మధ్య ఆసియా పాలకుడైన తైమూర్ ఢిల్లీపైదాడి, విధ్వంసం |
| 1469-1539 | సిక్కుమతాన్ని స్థాపించిన గురునానక్ |
| 1486-1533 | చైతన్యుని జీవనకాలం |
| 1498-1597 | మీరాబాయి జీవితం |
| 1526- | బాబర్ ద్వారా ముఘల్ రాజ్యస్థాపన |
| 1530 - 1556 | హుమాయూన్ పాలన |
| 1532-1623 | తులసీదాస్ జీవన కాలం |
| 1556-1605 | అక్బర్ పాలన |
| 1600 (డిసెంబర్ 31) | బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ ఛార్టర్‌కు మొదటి ఎలిజబెత్ రాణి అనుమతి |
| 1605-1627 | జహంగీర్ పాలన |
| 1608-1649 | తుకారామ్ జీవితం |
| 1622-1673 | క్షేత్రయ్య జీవితకాలం |
| 1627-1658 | షాజహాన్ పాలన |
| 1658-1707 | ఔరంగజేబ్ పాలన |
| 1713-1719 | ఫరూక్ సియార్ పాలన |
| 1750-1755 | బెంగాల్ కరువులో కోటిమంది మృతి |

1756 కలకత్తా బ్లాక్ హోల్ ఉదంతంలో డజన్లకొద్దీ మంది దుర్మరణం

1757 బెంగాల్‌లో ముస్లిం పాలకులను ఓడించిన ఈస్టిండియా కంపెనీ

1757 బ్రిటిష్ పాలన మొదటి దశ ఆరంభం

1765 బెంగాల్ ఛాన్సలర్‌గా రాబర్ట్ క్లైవ్ నియామకం

1775-1833 రాజా రామమోహన్ రాయ్ జీవితకాలం. 1828లో బ్రహ్మసమాజ స్థాపన

1813 బ్రిటిష్ పాలన రెండవ దశ ఆరంభం

1824-1858 సిపాయి తిరుగుబాటు

| | |
|---|---|
| 1857 | మూడవదశ బ్రిటిష్ పాలన ఆరంభం |
| 1858 | మొఘల్ పాలన, ఈస్టిండియా కంపెనీ పాలన స్థానంలో బ్రిటిష్ వైస్రాయ్ పాలన అధికారికంగా ఆరంభం |
| 1863 - 1902 | స్వామి వివేకానందం జీవిత కాలం |
| 1869–1948 | మహాత్మాగాంధీగా ప్రసిద్ధుడైన మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ జీవితకాలం |
| 1861–1941 | రవీంద్రనాథ్ టాగూర్ జీవిత కాలం |
| 1947 | దేశ స్వాతంత్ర్యం, విభజన |

# ప్రత్యేక పద వివరణ

| | | |
|---|---|---|
| అభినవగుప్త | : | కశ్మీర్ శైవతత్త్వవేత్త క్రీ.శ. 975–1025 |
| అదితి | : | వైదిక దేవత. సౌరదేవతలైన ఆదిత్యుల తల్లి |
| అద్వైతం | : | శంకరుడు ప్రతిపాదించిన అద్వైత సిద్ధాంతం. దైవం, భక్తుడు ఒకటేనని సూత్రీకరించింది. |
| ఆగస్త్యుడు | : | సంస్కృత భాషను దక్షిణదేశానికి వ్యాపింపజేసి, అక్కడ తమిళాన్ని సృష్టించినట్లు చెప్తారు. |
| ఆళ్వార్లు | : | తమిళ వైష్ణవ సన్యాసులు |
| అంబ | : | పురుషునిగా తిరిగి జన్మించిన మహా భారత స్త్రీ పాత్ర |
| అంబాలిక | : | మహా భారతంలో పాండురాజు తల్లి |
| అంబిక | : | మహా భారతంలో ధృతరాష్ట్రుని తల్లి |
| అప్పర్ | : | తమిళ నయన్మార్ సన్యాసులలో ఒకరు 6–8 శతాబ్దాల ప్రాంతం |
| ఆర్యులు | : | వేదకాలపు ప్రజలు తమకుతాము పెట్టుకున్నపేరు |
| అశ్వఘోషుడు | : | క్రీ.శ. మొదటి శతాబ్దపు కవి. బుద్ధుని జీవిత రచయిత |
| అవేస్త | : | ప్రాచీన ఇరానియన్ల పవిత్ర గ్రంథం |
| బాణుడు | : | హర్షుని ఆస్థానకవి, ఆ చక్రవర్తి జీవిత రచయిత |
| బసవ | : | వీరశైవ సంప్రదాయాన్ని ఆరంభించిన బ్రాహ్మణుడు. క్రీ.శ. 1106–1167 |
| కంపంతర్ | : | మొదటి ముగ్గురు తమిళ నయన్మార్లలో ఒకరు. క్రీ.శ. 6–8 శతాబ్దాల ప్రాంతం |
| చంకం (సంఘం) | : | తొలికాలపు తమిళ సాహిత్య సభ |
| చైతన్య | : | బెంగాలీ భక్తి బోధకుడు, క్రీ.శ. 1486–1533 |
| చండీదాన్ | : | క్రీ.శ. 14వ శతాబ్దపు బెంగాలీ కవి |
| చరకుడు | : | వైద్య గ్రంథం చరక సంహిత రచయిత |
| చార్వాకులు | : | భౌతిక వాదులు. వారినే లోకాయతులని కూడా అన్నారు. |
| కుంతరర్ | : | మొదటి ముగ్గురు నయన్మార్‌లలో ఒకరు క్రీ.శ. 6నుంచి 8 శతాబ్దాల కాలం |
| ధమ్మ | : | సంస్కృత పదం 'ధర్మ'కు పాళీ భాషా రూపం. బౌద్ధ ధర్మం, అశోకుని ధర్మం. |
| ద్వైతం | : | భగవంతుడు, భక్తునితో సహా తక్కిన విశ్వం వేర్వేరు అనేవాదం |

ఎల్లమ్మ : బ్రాహ్మణ స్త్రీ శరీరం, దళిత స్త్రీ శిరస్సుగల దక్షిణ భారత దేవత

ఘాసీదాస్ : సత్నామీ శాఖను ప్రారంభించిన చర్మకారుడు

గోండ్వానా : చాలాకాలం ముందు నీటమునిగినట్లు భావించే భూఖండం

గుగ్గ : నల్లని ఆడగుర్రంపై ఎగిరేవాడని చెప్పే జానపద దేవుడు

జాబాలి : నాస్తికత్వానికి అనుకూలంగా వాదించిన రామాయణపాత్ర

కాలముఖులు : శైవులలో ఒక శాఖ

కాపాలికులు : కపాలధారులు, బ్రహ్మదేవుని కపాలంతో సంచరించిన శివుడిని అనుకరించేవారు.

ఖాందోబా : శునకాలతో నిమిత్తం గల మరాఠా దేవుడు

క్షేత్రయ్య : కృష్ణుని పై మువ్వగోపాల పదాలు రాసిన తెలుగు కవి. క్రీ.శ. 1622–1973

లెమూరియా : భారతదేశాన్ని, ఆస్ట్రేలియాను ఒకపుడు కలిపి ఉంచినట్లు చెప్పే భూభాగం

లింగాయత : దక్షిణ భారతదేశపు శైవ సంప్రదాయం. వారినే వీరశైవులని, చరణులు అని కూడా అంటారు.

పంచముఖాలు : తాంత్రిక సంప్రదాయంలోని అయిదు అంశాలు : మాంస, మత్స్య, మద్య, ముద్ర, మైథునాలు.

మహాదేవ్యక్క : క్రీ.శ. 12వ శతాబ్దికి చెందిన వీరశైవసన్యాసిని, కవయిత్రి

మల్లన్న : తరచు శునక రూపం దాల్చే మహారాష్ట్ర దేవుడు

మాండవ్యుడు : అన్యాయంగా కొయ్య శూలాలపైకి ఎక్కించిన మహా భారత కాలపు ముని

మానిక్క వాచకర్ : క్రీ.శ. 9వ శతాబ్దపు శైవకవి. తిరువాచకం రచయిత

బడబాగ్ని : సముద్ర గర్భంలోని ఆడ గుర్రం నోటివెంట వెలువడే అగ్ని

మారియమ్మ : దళిత స్త్రీ శరీరం, బ్రాహ్మణ స్త్రీ శిరస్సుగల దక్షిణాది దేవత

మేరు : మొత్తం ప్రపంచానికి మధ్యలోగల పర్వతం

మీరాబాయి : కృష్ణ భక్తురాలైన హిందీ కవయిత్రి క్రీ. 1498–1597

మురుకన్ : స్కంధునితో పోల్చి చెప్పే దక్షిణాది దేవుడు

నమ్మాళ్వార్ : 9వ శతాబ్దికి చెందిన అళ్వార్లలో చివరివాడు

నంతనార్ : దేవాలయ ప్రవేశాన్ని నిరాకరించినందున తనను తాను శుద్ధి చేసుకునేందుకు అగ్ని ప్రవేశం చేసిన ఒక తమిళ పారియా.

| | | |
|---|---|---|
| నయన్మార్లు | : | తమిళ శైవ సన్యాసులు. ఏకవచనం నాయనార్ |
| అద్వైతం | : | భగవంతుడు, విశ్వం ఒకటేనని చెప్పే శంకరుని సిద్ధాంతం |
| ఓరియెంటలిజం | : | ఎడ్వర్డ్ సయీద్ రూపొందించిన పదం. ప్రాక్ ప్రపంచపు మనుషులు, విషయాల పట్ల యూరోపియన్ల వైఖరిని వర్ణించేందుకు ఉపయోగించిన మాట. |
| పహ్లావులు | : | పార్థియన్లకు సంస్కృతపేరు. వారు ప్రస్తుతపు ఇరాన్, ఇరాక్, ఆర్మీనియాలను ఆక్రమించుకుని పాలించారు. |
| పాణీలు | : | వైదిక ప్రజల శత్రువులు. పశుచోరులని పేరు. |
| పారియాలు | : | డప్పుకొట్టే ఒకానొక నిమ్న కులానికి తమిళ పేరు. దానిని తర్వాత దళితులందరికి వర్తింపజేశారు. |
| పెరియ పురాణం | : | తమిళ శైవ సన్యాసుల గురించి చక్కియార్ రాసిన కథల సంకలనం. క్రీ.శ. 1133–1150 కాలపు చోళరాజు రెండవ కులోత్తుంక కాలపు రచన. |
| ప్రతిలోమ | : | ఉన్నత కులం స్త్రీకి, నిమ్న కులం పురుషునికి జరిగే వివాహం |
| పుల్కస | : | ప్రాచీన కాలపు దళిత కులాలలో ఒకటి |
| విశిష్టాద్వైతం | : | భగవంతుడు, భక్తుడు ఒకటేనని కొంత సవరణతో రామానుజడు చెప్పిన అద్వైత సిద్ధాంతం |
| రైక్వా | : | ఉపనిషత్తులలో కన్పించే మొదటి నిరాశ్రయుడైన వ్యక్తి |
| రామానుజన్, అత్తిపట్ క్రిష్టస్వామి | : | తమిళ, తెలుగు, కన్నడ భాషలలో కవి, భాషావేత్త, విద్యావేత్త. క్రీ.శ. 1929–1993. |
| సాంఖ్యం | : | ఉపనిషత్కాలపు ద్వైత సిద్ధాంతం. ప్రపంచాన్ని స్త్రీ – పురుష భాగాలుగా విభజిస్తుంది. |
| సంస్కృతీకరణ | : | నిమ్నకులాలవారు బ్రాహ్మణుల ఆహార, విహారాలను అనుకరిస్తూ తమ స్థాయిని పెంచుకునే క్రమం. |
| సత్నామీలు | : | పంజాబ్‌లో 1657 లో ఆరంభమైన ఈ సంప్రదాయంలో దేవతలను గాక గురువులను పూజిస్తారు. |
| శకులు | : | సిథియన్లు |
| శత్తారీలు | : | సూఫీ సంప్రదాయం |
| స్వామి నారాయణ | : | సత్సంగీ సంప్రదాయ స్థాపకుడు. క్రీ.శ. 1780–1830 |
| తిరువాచకం | : | 'పవిత్ర పదం' . శివుడిని కీర్తిస్తూ మానిక్కవాచకర్ రాసిన కవిత. క్రీ.శ. 800 ప్రాంతం. |

| | | |
|---|---|---|
| తుకారాం | : | మహారాష్ట్రకు చెందిన అసమ్మతి తత్త్వకవి. క్రీ.శ. 1608–1649 |
| తులసీదాస్ | : | హిందీలో రామచరితమానస్ రచయిత క్రీ.శ. 1532–1623. |
| వామ | : | 'ఎడమచేయి' హిందూమతంలోని అసమ్మతి ధోరణులకు, ముఖ్యంగా తాంత్రిక వాదానికి వర్తించే మాట. |
| వీర శైవం | : | లింగాయత అనే పేరు కూడా ఉన్న శైవ సంప్రదాయం. వ్యవస్థాపకుడు బసవ. క్రీ.శ. 1106–1167 ప్రాంతం. |

**వెండీ డోనిగర్** సంస్కృత భాషలో, భారతదేశ అధ్యయనంలో హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాలనుంచి రెండు డాక్టరేట్లు చేసారు. అనేక సంస్కృత కావ్యాలను, హిందూ మతంపై పలు రచనలను ఇంగ్లీషులోకి అనువదించారు. లండన్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఓరియెంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్‌లో, బర్కిలీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో బోధించారు. ప్రస్తుతం షికాగో యూనివర్సిటీలో మిర్సియా ఎలియేడ్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ ప్రొఫెసర్‌గా మతాల చరిత్రను బోధిస్తున్నారు.

**టంకశాల అశోక్** హైదరాబాద్, ఢిల్లీలో చరిత్ర, రాజకీయ శాస్త్రం, అంతర్జాతీయ వ్యవహారాల్లో విద్యాభ్యాసం. జనధర్మ, నవ్యాంధ్ర, ఈనాడు, ఆంధ్రభూమి, ఉదయం, ఆంధ్రప్రభ, వార్త, హన్స్ ఇండియా పత్రికలలో ఉద్యోగం. ప్రస్తుతం ఫ్రీలాన్స్ జర్నలిస్ట్.

ఇటీవలి కాలంలో వెలువడిన సుప్రసిద్ధ గ్రంథాల్లో ఇదొకటి. కానీ దీనిపై భారతదేశంలో చాలా దుష్ప్రచారం జరిగింది. "ఒక మతం వారి మనోభావాలను దెబ్బతీస్తోందంటూ" 2014 ఫిబ్రవరిలో కొందరు కోర్టుకు వెళ్లటంతో ఈ రచనను ప్రచురణకర్తలే భారత మార్కెట్ నుంచి ఉపసంహరించుకున్నారు. దీంతో భారతదేశంలో వాక్స్వాతంత్రం పట్ల విస్తృత స్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. తర్వాత మరో ప్రచురణకర్త పూనుకుంటేనే గానీ మళ్లీ ఇది వెలుగులోకి రాలేదు.

అయితే అంతటా ప్రచారం జరిగినట్లుగా ఈ పుస్తకం వివాదాల పుట్ట కాదు. పుట్టుకతోనో, ఆచరణరీత్యానో హిందూమతాన్ని అనుసరిస్తున్న మనలో చాలామందికి – ఈ పుస్తకం హిందూ మతాన్ని మరో కోణం నుంచి, ప్రత్యామ్నాయ దృక్కోణం నుంచి పరిచయం చేస్తుంది. ఇందుకోసం జానపద, మౌఖిక, భక్తి సంప్రదాయాల నుంచి విరివిగా స్వీకరించే ఈ రచన స్త్రీలు, నిమ్నకులాలు, నిరక్షరాస్యుల వంటి వారెవ్వరినీ వదిలిపెట్టకుండా అసాధారణరీతిలో అందర్నీ కలుపుకుపోయే సమత్వ ధోరణిని బలంగా ముందుకు తెస్తుంది.

---

ఇది వెలువడటానికి ముందు, ఇటువంటి రచన అసలు అసాధ్యమనిపించేది... ఇది గొప్ప రచన.

**– బిబేక్ దేబ్‌రాయ్**

హిందూ గ్రంథాలు, సంప్రదాయాలు ఎంత సంపద్వంతమైనవో, వాటి లోతు, వైవిధ్యత ఎంతటివో అంతర్జాతీయ పాఠకులకు తెలియజెప్పాలంటే వెండీ డోనిగర్ వంటి అపారమైన విద్వత్తు, అధ్యయనం, అంతర్ దృష్టి, సొగసైన శైలి గలవారు మినహా మరెవరూ ఆ పని చేయలేరు. ఇదొక శ్రేష్ఠమైన రచన. దీని గురించి కొన్ని సంవత్సరాలపాటు చర్చ జరుగుతుంది.

**– సుధీర్ కక్కడ్**

ఇది మహాసక్తికరమైన చరిత్ర రచన... ప్రాచీన భారతదేశపు కథాకథన సంస్కృతి యావత్ ప్రపంచంలోనే ఎందువల్ల సాటిలేనిదో వివరిస్తుందీ పుస్తకం. **– గురుచరణ్ దాస్**

ప్రాచీన కాలపు శాసనాలు, తారీఖులు– దస్తావేజుల మీదుగా సాగిన సాదాసీదా యాత్రలాంటిది కాదీ పుస్తకం. అంతకు మించి ఇది గత మూడు వేల సంవత్సరాల కాల వ్యాప్తంగా విస్తరించి ఉన్న తన అభిమాన పాత్రమైన ప్రదేశాలు, మహత్తరమైన పరిణామాలు, తను ప్రేమించిన గ్రంథాల మీదుగా నడిచిన మానసిక తీర్థయాత్ర వంటిది. **– దేవిడ్ షుల్మన్**

ఈ రచనలో గొప్ప విద్వత్తు ఉంది. విభిన్నాంశాలను స్వీకరించి తనలో ఇముడ్చుకో గల హిందూ సంప్రదాయాన్ని అర్థం చేసుకునేందుకు ఈ గ్రంథం చాలా ఉపకరిస్తుంది.

**– అమర్త్యసేన్**